శ్రీ ర స్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్ర వచనరామాయణము

యుద్ధకాండము

సంస్కృతరామాయణమునకు సరియైన తెనుఁగు

శ్రీసరస్వతుల సుబ్బరామశాస్త్రిగారిచే

విరచితము

Vol VI

U.O.A.R.U.
V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11262

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము.

1962

All Rights Reserved.

294.5922
SRE

Dr B R.A.O.U. LIBRARY
Acc. No. N-11262
Date
Call No 294.5922 SRE

Printed by
V. VENKATESWARA SASTRULU TRUST
FOR V. RAMASWAMY SASTRULU & SONS
AT THEIR 'VAVILLA' PRESS
MADRAS—1962.

MEMORIAL LIBRARY
VR NARLA
DPRI
ACC NO

విషయసూచిక

సర్గము.		పుట.
1 శ్రీరాముఁడు హనుమంతుని సమ్మానించుట	...	1
2 సుగ్రీవుఁడు రామునికి ధైర్యము చెప్పుట	...	3
3 హనుమంతుఁడు రామునకు లంకాపురదుర్గాదులను దెల్పుట	...	5
4 రాముఁడు దండయాత్ర వెడలుట	...	8
5 రాముఁడు విరహవేదనం బడుట	...	18
6 రావణుఁడు మంత్రులతో నాలోచించుట	...	20
7 రాక్షసులు రావణున కాలోచనలు చెప్పుట	...	22
8 ప్రహస్తాదులవాక్యము	...	24
9 విభీషణుఁడు రావణునికి హితము బోధించుట	...	26
10 విభీషణుఁడు రావణునికి హితము బోధించుట	...	29
11 రావణుఁ డాలోచన సేయుటకై సభకుఁ బోవుట	...	31
12 రావణకుంభకర్ణుల సంవాదము	...	34
13 మహాపార్శ్వరావణుల సంభాషణము	...	38
14 విభీషణుని యుపదేశము	...	39
15 ఇంద్రజిత్తు విభీషణుల సంవాదము	...	42
16 రావణుఁడు విభీషణుని దూఱుట	...	43
17 విభీషణుఁడు శ్రీరాముని శరణుచొచ్చుట	...	46
18 రాముఁడు విభీషణుని నంగీకరించుట	...	54
19 విభీషణుఁడు శ్రీరామునకు రావణునిబలంబుఁ దెల్పుట	...	59
20 రావణుఁడు దూతఁ బంపుట	...	62
21 శ్రీరాముని ప్రాయోపవేశము	...	65
22 రాఘవుఁడు సముద్రునిమీఁదఁ గోపము చూపుట	...	68
22 నీలుఁడు వానరులసాహాయ్యమున సేతువుఁ గట్టుట	...	72
23 రాముఁడు యుద్ధసూచనలను లక్ష్మణునకుఁ దెల్పుట	...	75
24 రాముఁడు వానరులను వ్యూహములుగ నిలుపుట	...	76
25 రావణుఁడు శుకసారణులం బంపుట	...	80

సర్గము.		పుట
26 సారణుఁడు వానరసేనను దెల్పుట	...	83
27 సారణుఁడు రావణునికి వానరసైనికులం దెల్పుట	...	87
28 శుకుఁడు వానరవీరులప్రభావం బెఱిఁగించుట	...	91
29, 30 రావణుఁడు శుకసారణులను నిందించుట	...	94
31 రావణుఁడు మాయారామునిశిరంబు సీతకుఁ జూపుట	...	99
32 సీత మాయాకల్పితరామునిశిరమును జూచి దుఃఖించుట	...	102
33 సరమ సీత నూఱడించుట	...	106
34 సరమ రావణుని యభిప్రాయము సీతకుఁ దెల్పుట	...	109
35 మాల్యవంతుఁడు రావణునికి హిత ముపదేశించుట	...	112
36 రావణుఁడు మాల్యవంతునిమాట నుల్లంఘించుట	...	115
37 రాముఁడు సేనలను విభజించుట	...	117
38 రాముఁడు లంకను జూచుటకై సువేలపర్వత మెక్కుట	...	120
39 రామాదులు లంకాపురము జూచుట	...	121
40 సుగ్రీవరావణుల మల్లయుద్ధము	...	123
41 రాముఁడు సేనలను వ్యూహంబులుగ నిల్పుట	...	126
అంగద రాయబారము	...	131
42 వానరులు లంకను ముట్టడించుట	...	134
43 వానర రాక్షసుల ద్వంద్వయుద్ధము	...	138
44 రాక్షసవానరుల రాత్రియుద్ధము	...	141
45 ఇంద్రజిత్తు రామలక్ష్మణులను నాగపాశముచే బంధించుట	...	144
46 వానరులు రామలక్ష్మణులం జూచి వగచుట	...	146
47 రావణుఁడు వీరశయనమున నున్న రామలక్ష్మణులను సీతాదేవికిఁ జూప నానతిచ్చుట	...	150
48 సీతాదేవి రామలక్ష్మణులం జూచి విలపించుట	...	152
49 రాముఁడు మూర్ఛదొఱఁగి లేచుట	...	155
50 గరుత్మంతుఁడు రామలక్ష్మణులను నాగపాశమునుండి విడిపించుట	...	158
51 ధూమ్రాక్షుఁడు యుద్ధమునకు వచ్చుట	...	163
52 ధూమ్రాక్షుఁడు చచ్చుట	...	165
53 వజ్రదంష్ట్రుండు యుద్ధమునకు వచ్చుట	...	168
54 వజ్రదంష్ట్రుఁ డంగదునిచే నిహతుఁ డగుట	...	171

సర్గము.		పుట
55	అకంపనుఁడు రావణునిచేఁ బ్రేరితుఁడై యుద్ధమునకు వచ్చుట ...	174
56	అకంపనవధము ...	176
57	ప్రహస్తుఁడు యుద్ధమునకుఁ దఱలుట ...	179
58	ప్రహస్తుఁడు చచ్చుట ...	183
59	రావణునిమకుటంబు విఱచుట ...	187
60	కుంభకర్ణుని యుద్ధమునకై లేఁపుట ...	200
61	కుంభకర్ణునిస్వరూపమును విభీషణుఁ డెఱిఁగించుట ...	207
62	రావణుఁడు కుంభకర్ణుని యుద్ధమునకుఁ బురికొల్పుట ...	210
63	కుంభకర్ణుండు రావణునకు హితము గఱపుట ...	212
64	మహోదరుఁడు కుంభకర్ణుని దూఱుట ...	218
65	కుంభకర్ణుఁడు యుద్ధమునకు వెడలుట ...	222
66	కుంభకర్ణునియుద్ధారంభము ...	226
67	కుంభకర్ణవానరులయుద్ధము ...	229
	రామకుంభకర్ణులయుద్ధము ...	237
	కుంభకర్ణుఁడు చచ్చుట ...	240
68	రావణుఁడు కుంభకర్ణమరణమునకై చింతించుట ...	242
69	అతికాయుఁడు యుద్ధమునకుఁ దఱలుట ...	244
70	దేవాంతక త్రిశిర మహోదర మహాపార్శ్వులు మడియుట ...	251
71	అతికాయయుద్ధము ...	255
	లక్ష్మణాతికాయుల యుద్ధము ...	261
	అతికాయవధము ...	263
72	రావణుఁడు తనవారిమరణమునకై చింతించుట ...	264
73	ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే రామాదులను మోహింపఁజేయుట ...	266
74	రామలక్ష్మణులు వానరులు బ్రహ్మాస్త్రమునుండి విడిపింపఁబడుట ...	271
75	వానరులు లంకను గాల్చుట ...	277
76	కుంభవధము ...	282
77	నికుంభవధము ...	289
78	మకరాక్షుఁడు యుద్ధమునకు వెడలుట ...	291
79	శ్రీరాముఁడు మకరాక్షుని వధించుట ...	292
80	ఇంద్రజిత్తు యుద్ధమునకు వచ్చుట ...	295

సర్గము.		పుట.
81	ఇంద్రజిత్తు మాయానిర్మిత సీతను ఛేదించుట ...	298
82	ఇంద్రజిత్తు నికుంభిలాహోమంబు సేయఁబోవుట ...	301
83	వాస్తవసీతావధభ్రమచే విలపించురాముని లక్ష్మణుఁ డోదార్చుట	304
84	విభీషణుఁడు ఇంద్రజిద్వధోపాయంబు సెప్పుట ...	309
85	విభీషణుఁ డింద్రజిత్తుయొక్క పోవిడిఁ దెల్పుట ...	311
86	ఇంద్రజిత్తు నికుంభిలాహోమము కాకముందే యుద్ధమునకు వచ్చుట	313
87	ఇంద్రజిత్తు విభీషణు లొండొరులఁ దూఱుట ...	316
88	ఇంద్రజిల్లక్ష్మణుల యుద్ధము ...	319
89	ఇంద్రజిల్లక్ష్మణుల యుద్ధము ...	322
90	ఇంద్రజిత్తుయొక్క రథమును విఱచుట ...	325
91	ఇంద్రజిద్వధము ...	328
92	రామాదులు లక్ష్మణుని మెచ్చుకొనుట ...	335
93	ఇంద్రజిద్వధజాతకోపముచే రావణుఁడు సీతను వధింపఁబోవుట	337
94	మూలబలయుద్ధము ...	342
95	రాక్షసస్త్రీలు విలపించుట ...	345
96	రావణుఁడు యుద్ధమునకు వెడలుట ...	348
97	విరూపాక్షుఁ డనెడి మంత్రి వధింపఁబడుట ...	351
98	మహోదరుం డను మంత్రి వచ్చుట ...	354
99	మహాపార్శ్వుఁడు మడియుట ...	356
100	రామరావణుల యుద్ధారంభము ...	358
101	రావణశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుట ...	362
102	లక్ష్మణుఁడు మృతసంజీవినిచే బ్రతికింపఁబడుట ...	366
103	రామరావణయుద్ధము ...	369
104	రామరావణయుద్ధము ...	372
105	రాముఁడు రావణుని నిష్ఠురోక్తులాడుట ...	374
106	రావణుఁడు సూతుని రథముఁ దోలు మనుట ...	376
107	అగస్త్యమహాముని రామున కాదిత్యహృదయ ముపదేశించుట ...	378
	ఆదిత్యహృదయస్తోత్రము ...	379
108	రావణునికి దుర్నిమిత్తంబులు గలుగుట ...	382
109	రాముఁడు రావణుని ధ్వజంబు విఱుచుట ...	384

సర్గము.		పుట.
110	రామరావణయుద్ధము ...	386
111	రావణుఁడు రామునిచే వధింపఁబడుట ...	389
112	భ్రాతృవధముచే శోకించుచున్న విభీషణుని రాముఁ డోదార్చుట	391
113	రావణుని మరణమునకై యంతఃపురస్త్రీలు విలపించుట ...	394
114	మండోదరి భర్తృమరణమునకై విలపించుట ...	396
115	విభీషణపట్టాభిషేకము ...	405
116	హనుమంతుఁడు సీతాదేవికి రామునివిజయముఁ దెల్పుట ...	407
117	విభీషణుఁడు సీతను దోడితెచ్చుట ...	411
118	రాముఁడు సీతను వలదు పొమ్మనుట ...	414
119	సీత యగ్నిని బ్రవేశించుట ...	417
120	బ్రహ్మాదులు రామునికడకు వచ్చుట ...	420
121	అగ్నిహోత్రుఁడు రామునకు సీతాదేవి నొసంగుట ...	422
122	పరమేశ్వరుఁడు రామునితో సంభాషించుట ...	424
123	యుద్ధహతులైన వానరు లింద్రునివరమువలన బ్రతుకుట ...	427
124	విభీషణుఁడు విమానము దెచ్చుట ...	428
125	విభీషణుఁడు వానరుల గౌరవించుట ...	431
126	రాముఁడు సీతాదేవికి జరిగిన వింతలఁ జూపుట ...	433
127	రాముఁడు భరద్వాజాశ్రమమున విడియుట ...	436
128	రాముఁడు హనుమంతుని భరతునికడ కంపుట ...	438
129	హనుమంతుఁడు రామునియరణ్యవాసవృత్తాంతము నెఱిఁగించుట	441
130	రాముఁ డయోధ్యం బ్రవేశించుట ...	445
131	శ్రీరామపట్టాభిషేకము ...	450
	శ్రీరామపట్టాభిషేకఘట్టము ...	454

8

శ్రీ ర స్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్ర వచనరామాయణము

యుద్ధకాండము

1-వ సర్గము

శ్రీరాముఁడు హనుమంతుని సమ్మానించుట

శ్రీరాముఁడు హనుమంతునివలన వార్త నంతయు విని, ప్రేమ రసము లొలుక ని ట్లనియె. ఇఁక భూమిలోపల మఱెవ్వనిచేతను జేయ నలవికానిదియు, తుదకు మనసులోఁ దలఁచుటకునైన వీలుకానిదియు నైన గొప్పకార్యమును హనుమంతుఁ డొనర్చెను. గరుడుండొండె, వాయుదేవుఁడొండె హనుమంతుఁడొండె యీ గొప్ప కడలిని దాఁటఁ గలరు. వీరుదక్క వేఱెవ్వఁ డింతపనిఁ జేయఁగలఁడు. దేవదానవ గంధర్వ యక్ష పన్నగ రాక్షసులకుఁ జొఱ నలవికానిదియు, రావణునిచేఁ గాపాడఁ బడునదియు నైన లంకాపురమునఁ బ్రవేశించిన మానవుఁడు ప్రాణములు కోలుపోవక యూఁపిరితో నెవ్వఁడు వెలుపలికి మఱలి వచ్చును? అట్లు లోపలికిఁ బోయి మఱలివచ్చుసంగతి యట్లుండనీ. హను మంతుఁడు తక్క వేఱెవ్వఁడు సత్త్వ, మగతనము గలవాఁడై చొఱ నలవికాని యట్టి లంకాపురిలో నసలు ప్రవేశించుటకుఁ జాలును?

హనుమంతుఁడు తన ప్రభు వానతిచ్చిన పని యొనరించి, యాతఁడు చెప్పకపోయినను, తన బలపరాక్రమములను వెల్లడిపఱ చుచు, అశోకవనభంగ రాక్షసవధ లంకాదహనరూప కార్యములను జేసెను. ఈతఁ డుత్తమభృత్యుఁ డనఁదగును. యజమానుఁ డానతిచ్చిన

యెంతకఠినపుఁ బనియైన నిర్వహించి, యజమానునియందలిప్రేమచే నాతఁడు చెప్పనిపనినైనను ముందటికార్యమున కనుకూలముగాఁ జేయు నౌకరి యుత్తమ భృత్యుఁ డనఁదగును. తాను యోచనయు నేర్పును గలవాఁడై యుండియు, తనయజమానుఁడు చెప్పినపనిని తప్ప నతని కిష్టమై ప్రకృతకార్యమునకు హానికరముగాక యుండు వేఱుపనిని జేయనివాఁడు మధ్యమభృత్యుఁ డనఁదగును. తా నుత్సాహమును నేర్పును గలవాఁడై యుండియు యజమానుఁ డానతిచ్చిన పనినిగూడ జాగ్రతతోఁజేయని నౌకరి యధమభృత్యుఁ డనఁదగును. కావున నీ హను మంతుఁడు తనయేలిక యానతిచ్చిన పనిని, దాని కనుకూలముగాఁ గొన్ని యితరకార్యములను జేసినవాఁడై తాను జేతగానివాఁ డనిపించుకొనక, తనగొప్పతన మిట్టి దని తెలిపెను. దానికిఁ దోడుగాఁ దనయజమానునికి సంతోషమును గలిగించెను.

హనుమంతుఁడు వైదేహిని జూచి వచ్చినందున, నన్నును, లక్ష్మణుని, రఘుకులమును ధర్మమార్గమునుండి తొలఁగనీయక కాపాడెను. ఇంతటి యిష్టవృత్తాంతమును గైకొనివచ్చినదాని కీడుగా నొక సమ్మానమును ఈహనుమంతునికిఁ జేయఁజాలకున్నానే యని నామనస్సున మిక్కిలి పరితాపము గలుగుచున్నది. నాకుఁ బ్రియావృత్తాంతమును నావృత్తాంతము నాప్రియకును జెప్పి మాయిరువురిప్రాణములను నిలిపిన వానికి నేమి యిచ్చినఁ జాలును? సకలధనము నొసఁగినను జాలదు. కాఁబట్టి నేను గట్టిగా హనుమంతుని నాలింగనము జేసికొనుచున్నాను. ఇదియే నా యావదాస్తియనిచెప్పి, గగుర్పాటొందిన యన్ని యంగములతోఁ గూడినవాఁడై కార్యము సాధించుకొనివచ్చిన మహాబలుఁ డగు హనుమంతుని గట్టిగాఁ గౌఁగిలించుకొనెను.

అట్లు రాముఁడు హనుమంతునిఁ గౌఁగిలించుకొని వెండియుఁ గొంతతడ వాలోచించి, వానరాధిపుఁడగు సుగ్రీవుఁడు చేరువఁ గూర్చుండి వినుచుండ, మఱల నతనిం జూచి యిట్లనియె: "సీతాన్వేషణ రూపకార్యము బాగుగా నెఱవేఱినది. దీనింగూర్చి విచారము లేదు. అయినను సముద్రమును దలఁచుకొన్న మన మెట్లా కడలిని దాఁటి యావలిగట్టునకుఁ బోవఁగలము? ఎట్లీవానరసేన దాఁటగల" దని

నా మనస్సు చెదరిపోవుచున్నది. వైదేహిని వెదకివచ్చి యీ సంగతినిఁ జెప్పి, నాకుఁ దృప్తి గలిగించితివి. అయినను, ఈ వానరసేన యెల్ల సముద్రమును దాఁటువిధ మెద్దియైనఁ గలదా చెప్పుము" అని, శత్రుసంహారియు, దీర్ఘబాహుఁడునైన రాముఁడు దుఃఖముచేఁ దత్తర పడుచు హనుమంతుని నడిగి, తానును జింతింపఁ దొడఁగెను.

2-వ సర్గము

సుగ్రీవుఁడు రామునికి ధైర్యము చెప్పుట

అప్పుడు కాంతిగలవాఁడయిన సుగ్రీవుఁడ త్తెఱఁగున దుఃఖములోఁ జిక్కియున్న దశరథపుత్రుఁడైన రామునిఁగూర్చి, దుఃఖము తొలఁగించు నట్టి మాటలఁ జెప్పెను. "ఓ వీరుఁడా! ఏల యిట్లు సాధారణ మానవునివలెఁ దహతహపడుచున్నావు? నీ వి ట్లుండఁ దగదు. నెనరులేనివాఁ డొరులతోఁ జేసికొన్న చెలిమిని మఱచిపోవునట్లు, నీవును ఈ వ్యసనమును విడువుము. ఓ రాఘవా! సీతాదేవి యున్న చోటు తెలిసెను. శత్రు వుండు తావును దెలిసెను. ఇఁక నీవు చింతపడవలసిన కారణ మేమో తెలియకున్నది. ఓ రాఘవా! నీవు బుద్ధిమంతుఁడవు, శాస్త్రముల నెఱిఁగినవాఁడవు, యుక్తి గలవాఁడవు, పండితుఁడవు. కావున యోగి యగువాఁడు మోక్షమునకు బాధకమైన బుద్ధిని వదలునట్లు, నీవును ఉత్సాహమునకుఁ జెఱు పొనరించెడి యీబుద్ధిని మానుము. గొప్ప జలజంతువులతో నిండిన సముద్రము దాఁటి లంకాపట్టణము నెక్కి యెవ్విధమున నైనను నీశత్రువును సంహరించెదము. నీవు శోకము వీడుము. ఉత్సాహములేక, దుఃఖముచే మనసునందుఁ గలవరపాటొంది, ధైర్యము వీడినవానికిఁ గార్యము లన్నియుఁ జెడిపోవును. వ్యసనమును దప్పక వచ్చును.

ఈనాభృత్యులగు వానరశ్రేష్ఠు లందఱు ధైర్యవంతులు. ఎంతటి పనికైనను జాలినవారలు. నీయిష్టము నెఱవేఱునిమిత్తమై యగ్నిప్రవేశమునైనను జేయఁగలరు. వీరియుత్సాహము చూడఁగా, వీరెంతపని నైనను జేయఁగల రని నాకుఁ దోఁచుచున్నది. ఓ రాఘవా! పాపపుఁ బనులు చేయువాఁడగు శత్రువైన రావణునిఁ బరిమార్చి, నే నెట్టు లాదేవిని పరాక్రమముతోఁ దేఁగలనో యట్లు నీవు నాకుత్సాహమును

ధైర్యమును గలిగించుచుండుము. మన మీ కడలికి వారధి గట్టి యెట్లు దీనిం దాఁటఁగలమో యట్లు నీవు చేయుము. మన మా త్రికూట పర్వతశిఖరమున నుండునట్టి యా లంకాపురమును జూచినం జాలును. ఆ పురముఁ జూచితి మేని యా రావణుండు తప్పక మడిసె ననియే తలఁపుము. భయంకర మైన కడలికిఁ గట్ట కట్టక యింద్రుఁడు మున్నగు సకల దేవతల కైనను లంకాపురము ధ్వంసముచేయ సాధ్యముగాదు. ఎన్నటికి మనము లంకాపురమువరకు సముద్రమునకు వారధి గట్టుదుమో, అన్నటికి నీ వానరసేన యప్పురమునఁ జొచ్చినది యనియే యెంచుము. ఈ వానరవీరులు మొనగాండ్రు. సమరమున మగఁటిమిఁ జూపువారు. కామరూపులు. వీరు రాక్షసులతోఁ గూడి లంకాపురమును బెళ్లగించి తేఁగలరు.

కావున ఓరాజా! ఈ వ్యసనంపుఁదలంపును మానుము. ఇది కార్యముల నన్నింటిని జెఱచునది. లోకమున శోకము మానవుని ధైర్యమును క్రుంగఁజేయునది. కావున శోకము మానుట యిప్పుడు నీకుఁ దగును. ఓగొప్పవివేకీ! ధైర్యవంతుఁడగువాఁడె యెట్టిపనినైనను జేయఁగలఁడు గనుక, నీ విపు డట్టి ధైర్యమును, బరాక్రమమును బూనుము. ఓరామచంద్రా! నీయట్టిశూరులు ధైర్యవంతులు నయినవారు అగపడని వస్తువును గూర్చి కాని, నశించిపోయినవస్తువును గూర్చి కాని వ్యసనము నొందరాదు. అట్లు వారు వ్యసనము నొందిరేని, వారికార్యము లెల్లఁ జెడిపోవును. నీ వన్ననో బుద్ధిమంతులలో మేటివి; అన్నిశాస్త్రముల రహస్యముల నెఱిఁగినవాఁడవు. ఇట్టినీవు నాయట్టిమంత్రులను బాసటగాఁగొని, శత్రువును గెల్చుటయె ప్రకృతము చేయఁదగినపని. రఘువంశోద్భవా, నీవు వింటిని జేతఁబట్టి యనిమొనయందు నిల్చితివేని, నీతో డీకొనువాఁడు ముల్లోకములలో నొక్కఁడైనను లేఁ డని తలఁచెదను. వానరులు నీపని సాధింపనెంచి యున్నారుగావున, వారిపైనుండెడి యీకార్యమెన్నఁడును జెడిపోవదు. నీవును, అపారమైన సముద్రము నెవ్విధమునైన దాఁటి వేగిరమే సీతను జూడఁగలవు. కావున నృపాలా! యిప్పుడు వ్యసనము నవలంబింపకుము. పగతునిపై రోషముఁ బూనుము. క్షత్రియులు సోమరులై యుందురేని దరిద్రు లగుదురు. పగతురందఱు కోపిష్ఠుఁడైన రాజునకే

వెఱతురు. ఇప్పుడు మనము సముద్రమును దాఁటవలయు. అది యొక్కటి మొదటికార్యము. నీవు బుద్ధిసూక్ష్మత గలవాఁడవు గావున ఈఘోరమైన సముద్రమును మాతోఁగూడ దాఁటుటకుఁ దగిన యొక యుపాయము నాలోచింపుము. వానర సేన యెల్ల నీకడలిని దాఁటెనేని, జయించినట్లే యని తలంపుము. ఈవానరులా యుద్ధమున మొనగాండ్రు, కోరినరూప మెత్తఁ గలవారు. వీ రాపగతురపై ఆలవానను, మ్రాఁకుల వానను గురిపించి, వారిని నుగ్గుచేయఁగలరు. యుద్ధమునం దుత్సాహము గల యోరామా! మనము కట్ట కట్టియో, లేక యేదేనొక యుపాయముచేతనో సముద్రమును దాఁటితిమేని, మనచేత నాపగతుఁడు మడిసె ననియె తలంచెదను. ఊరక వేయిమాటలేల? నీకన్నివిధముల జయము సమకూరఁగలదు. దానికిఁ దగినట్లు నాకుఁ గొన్ని మంచి శకునములు గలుగుచున్నవి. నామనస్సునకు సంతోషమును గలుగుచున్నది. అని సుగ్రీవుఁడు, రాముఁడు శోకము విడిచి ధైర్యము నొందుటకుఁ దగిన మాటలను జెప్పెను.

3-వ సర్గము

హనుమంతుఁడు రామునకు లంకాపురదుర్గాదులను దెల్పుట

వాస్తవము నెఱుఁగఁగలవాఁడగు రాముఁడు కారణములను దెలిపిచెప్పిన సుగ్రీవునిమాటలను గైకొని, హనుమంతునిఁ జూచి, "ఓ హనుమంతుఁడా! తపస్సు చేసియో, కట్ట కట్టియో, సముద్రమునిం కింపఁజేసియో యేదో యొకతీరున నీకడలిని దాఁటఁజాలుదును. ఆలంకాపురము చొఱనలవికాని దని చెప్పితివికదా. అచ్చట నెన్నికోటలున్నవి? అచ్చటిసేన యెంతమాత్రము? గవనులం దెందఱు లోపలికిఁ బోనీయకుండునట్లు కావలియున్నారు? ఆపురము గాపాడఁబడువిధ మెట్లు? ఆపురమున నెన్ని రాక్షసుల యిండ్లున్నవి? ఇవియెల్లఁ గన్నులారఁ జూచి తెలిసికొనినట్లువలె నీవు నాకుఁ దెలియఁజెప్పుము. నీవు కష్టము లేకుండ నేర్పుతో నన్నివిషయములను లంకాపురమునఁ జూచి వచ్చినాఁడవుగదా. నీ వన్నివిధములుగా నేర్పరివి గనుక నచ్చట నున్నది యంతయు నున్నదియున్నట్లె యెఱిఁగింపుము." అని యడుగఁగా మాట

లాడువారిలో నేర్పరియగు మారుతనందనుఁడయిన హనుమానుఁడు రామునితో వెండియు ని ట్లనియె.

"ఓ రామా! ఆలంకాపురమునందలి కోటపనుల యేర్పాటుల చేతను, సేనలచేతను ఆపట్టణము కాపాడఁబడువిధమును, రావణుని ప్రతాపముచే రాక్షసు లంద ఱొండొరులు చెలిమిగలిగియుండువిధమును, ఆలంకాపురమునందలి యెక్కువసంపదను, ఆసముద్రముయొక్క భయంకరత్వమును, సేనావిభాగముల విధమును, రథములు మొదలగు వాహనములు నిలుపఁబడియుండు విధమును అన్నివిషయములను దెలిపెదను." అని పలికి హనుమంతుఁడు వివరించి చెప్పఁదొడఁగెను.

ఆలంకాపురము నిత్యసంతుష్టులైన జనులతోఁగూడినదియు, రాక్షససమూహములతోడను, రథములతోడను, మత్తగజేంద్రముల తోడను, అశ్వములతోడను నిండి పగతురచే బ్రవేశింప సాధ్యము గానిదియునై యుండును. అట్టిలంకాపురమునకు నలుపైపుల నాలుగు గొప్పయెత్తైన ద్వారములున్నవి. ఆద్వారములం దొక్కొక్కదానికి గొప్ప గడియమానులుగల గట్టితలుపులు పెట్టఁబడియున్నవి. ఆవాఁకిళ్లకడ గట్టివయిన బాణయంత్రములును శాలయంత్రములు నున్నవి. శత్రుసేన యచ్చటికి వచ్చెనేని, యాసేన బాణయంత్రములచేతను, శాలయంత్రములచేతను గొట్టఁబడును. ఆద్వారములందు మొనగాండ్రగు రాక్షసులు ఒక్కదెబ్బకు నూఱ్వురేసిమందిని బడఁద్రోయఁగలవి, భయమునుగలిగించునవి, చక్కఁగాఁ జేయఁబడినవియునైన యినుపగుదియ లుంచియున్నారు. ఆపురమునకు మణులు, పగడములు, వైడూర్యములు, ముత్యాలు చెక్కినవి, దాఁటుటకు వలనుపడనిదియునైన బంగారుమయమగు గొప్పప్రాకార మొక్కటియున్నది. ఆప్రాకారము చుట్టును గడు భీకరములై చల్లని నీటి ప్రవాహములతోఁగూడి, చేఁపలు మొసళ్లు మొదలగు నీటిజంతువుల కాశ్రయమై, లోఁతైయుండునగడ్డలు వెలయుచున్నవి.

ఆద్వారము లుండుచోటులం బాయగడ్డలకు మీఁదుగాఁ గడు విశాలములైన మ్రానివంతెన లున్నవి. వానిపై కావలికాఁచెడువారి నిమిత్తము గొప్పయిండ్లు వరుసలుదీర్చి కట్టఁబడియున్నవి. అవి శత్రువులు

ముట్టడించునపుడు వారినుండి పత్తనజనులను గాపాడుచున్నవి. ఆమ్రాని వంతెనలు యంత్రసహాయముచే నగడ్తలపైఁ బఱవఁబడియుండును. వానిలో నొకటి బలిమిగలిగినదియైనందునఁ గదలింపరానిదై, పెక్కుబంగారపు స్తంభములును, తిన్నెలును గలిగి ప్రకాశించుచున్నది. ఓ రామా! రావణుఁడు యుద్ధాపేక్షకలవాఁడు కావున నెల్లప్పుడు స్థిరబుద్ధితో జాగరూకుఁడై, యేమఱుపాటునొందక, తనదండును స్వయముగా విచారించుకొనుచుండును. మఱియు లంకాపురము పట్టు దొరక కుండునట్లు నునుపుగాఁ జెక్కఁబడిన త్రికూటపర్వతముపైఁ గట్టఁబడియున్నది. దేవతలకయినను ప్రవేశింప తెలియకయుండును. వేల్పులకుఁ గూడఁ బోనలవి కాక చూపఱకు భయంకరమైయుండును. అచ్చట నదులవలన నేర్పడిన దుర్గమును, పర్వతములవలన నేర్పడిన దుర్గమును, వనములవలన నేర్పడిన దుర్గమును, మనుష్యులచేఁ గట్టించిన దుర్గమును నున్నవి. ఆపురి విశాలమయిన సముద్రముయొక్క దక్షిణతీరమున నుండుటచే నప్పట్టణమునకు నావదారియు లేదు; అచ్చటి సంగతులు ఒరుల చెవులఁ బడుటయు లేదు. అమరావతిమాడ్కి నందమైన యాలంకాపురముపర్వతశిఖరమున నిర్మింపఁబడిన దౌటవలన నొరులకు లోపలికిఁ బోవ వీలుకాక, యేనుఁగులు గుఱ్ఱములతో నిండినదై, యొరులకు జయింపఁగలమన్న యాస బొత్తిగా లేకుండునట్లు చేయుచుండును. ఆపురము పర్వతాగ్రమునం దుండుటచేఁ బర్వతదుర్గవర్గములను గలిగియుండును. ఆ పాపాత్ముఁడయిన రావణుని పురమునందుఁ బెక్కు అగడ్తలును, ఫిరంగులును, పెక్కుయంత్రములును నున్నవి. ఇవియెల్ల నాదురాత్ముని పట్టణమునకు శోభను గలిగించుచున్నవి. ఆ ద్వారములలోఁ దూర్పుద్వారమున శూలములు, ఖడ్గములు ధరించిన యుద్ధవీరులైన అయుతసంఖ్యరాక్షసు లున్నారు. దక్షిణద్వారమునఁ జతురంగబలములతోఁ గూడిన లక్షమంది రాక్షసులు కావలియున్నారు. అచ్చటి బంటులును మిక్కిలి గట్టివారు. పదిలక్షలమంది రాక్షసులు పడమటిద్వారమున నున్నారు. వారందఱు తొళ్లకవచములను, ఖడ్గములను దాల్చినవారు. సకలాస్త్రములను బ్రయోగింపను, నుపసంహరింపను దెలిసినవారు. ఉత్తరద్వారమునందు నూఱుకోట్లమంది రాక్షసులున్నారు. అచ్చట నుండు రథికులును అశ్వికులును గొప్పవంశమునఁ

బుట్టినవారును రావణునకు నమ్మఁదగినవారును నై యాతని మన్ననలఁ బడయుచుందురు. వీరు కాక, శత్రువులకు లొంగనివారలగు కోట్లకొలఁది రాక్షసులు నడిపట్టణమున నున్నారు.

నే నా లంకాపురమును గాల్చితిని. మ్రానివంతెనలను విరుగఁ గొట్టితిని. అగడ్తలఁ బూడ్చివేసితిని. ప్రాకారముల నిడియఁగొట్టితిని. ధైర్యశాలురైన రావణుని సైనికులలో నొకభాగమును రూపుమాపితిని. ఏదో యొక యుపాయముచే సముద్రమును దాఁటితిమేని, లంకాపురమును వానరులు ధ్వంసము చేసి రనియే తలఁపుము. ఇచ్చట నంగదమైందద్వివిదజాంబవత్సనసనీలులును సేనాపతియగు నలుఁడును ఈ లంకాపురమును ధ్వంసము చేయఁగలరు. వీరే చాలినప్పుడు వేఱుసేన యెందుకు? వీరు సముద్రమును దాఁటియేపోయి రావణునియొక్క గొప్ప పట్టణమగులంకను, పర్వతవనములు, అగడ్తలు, ప్రాకారములు,గవనులు, ఇండ్లు, వాఁకిండ్లు మొదలగువానితోఁగూడఁ బెళ్లగించి యిక్కడికిఁ దేఁగలరు. కావున సేనలకు సకలసామగ్రులు చేర్చుకొనునట్లు ఆనతిమ్ము. సుముహూర్తమున యుద్ధమునకుఁ దఱలుదము" అని హనుమంతుఁడు రామునికిఁ జెప్పెను.

4-వ సర్గము

రాముఁడు దండయాత్ర వెడలుట

ఎక్కువ ప్రతాపము, తిరమగు మగటిమియుం గలవాఁడయిన రాముఁడు హనుమంతుఁడు సెప్పినమాట లన్నియుఁ గ్రమముగా విని, జూచి యిట్లనియె. "ఓవానరోత్తమా! నీ వావెఱపుగలిగించువాఁడగు రావణునిదైన యే లంకాపట్టణమును గూర్చిచెప్పితివో ఆ లంకాపురమును రూపుమాపెదను. ఇది నిక్కము. నీవు నమ్ముము. సుగ్రీవా! సూర్యుఁడు నడినెత్తి నున్నాఁడు. ఈ ముహూర్తమునందు దండయాత్ర వెడలువారికి జయము సిద్ధము గనుక మన మీ ముహూర్తమునఁ దఱలెదము. సూర్యుఁ డుచ్చంగతుఁడై యుండునప్పుడు, ప్రయాణమైతిమేని, సీత నపహరించిన నాశత్రు వెచ్చటికిఁ బోయినను, వానిని సాధించి మట్టుపెట్టెదను. విషము ద్రాగినవాఁడు మొదట మిక్కిలి బాధపడి, ప్రాణము పోవువేళయం దమృతమును ద్రావి జీవితమం దాశయుంచునట్లు,

సీతయు నాదండయాత్ర విని, నేను రావణుని సంహరించి, తన్నుఁగొం పోవఁగల నను నడియాసతోఁ బ్రాణములను విడువకయుండును. ఈ దినమున నుత్తరఫల్గునీనక్షత్రము. పునర్వసునక్షత్రమునఁ బుట్టినవా కిది సాధనతారగ నున్నది. రేపు హస్తనక్షత్రము. అది నాకు నైధనతార యగును గావున, సుగ్రీవా! మనము సకలసేనలతోఁ గూడ నీదినముననే ప్రయాణముచేయుదము. నాకును శుభసూచకములైన శకునములు గలుగుచున్నవి. కుడికంటితెప్ప యదురుటచే నాకు గెల్పును దెల్పు చున్నది. కావున నే నన్నితెఱఁగుల రావణుని వధించి, జానకిం దెచ్చె దను" అని శ్రీరాముఁడు చెప్పగా, సుగ్రీవుఁడును లక్ష్మణుఁడును ఆమాటల కొప్పుకొనిరి. అంతటఁ గార్యనిర్వాహసమర్థుఁడగు ధర్మాత్ముఁ డైన రాముఁడు వెండియు వారితో ని ట్లనెను.

మన సేనానాయకుఁడగు నీలుఁడు వేగము గలవారగు లక్షమంది వానరులను దోడ్కొని మనకు దారి గనిపెట్టుటకై ముందుగా నేఁగును గాక! అని వారితోఁ జెప్పి సేనాపతిం జూచి, "ఓనీలా! సేనాపతీ, పండ్లు, గడ్డలు, దుంపలుం గలిగి, చల్లనినీరును నీడయుఁగలయడవులును తేనెయు గలిగి, రమణీయమైయుండుదారిగుండా మన సేనను గొనిపొమ్ము. దుష్ట స్వభావులగురాక్షసులు దారులలో నుండు గుంటలలోనినీళ్లను బాడు చేసి, కందమూలఫలములను గోసివేయుదురు. నీవు నిరంతరము జాగ్రత్త గలిగి, యారాక్షసు లట్లుచేయకుండ వానినిఁ గాపాడుము" అని నీలునితోఁ జెప్పి, మఱల సుగ్రీవునితో ని ట్లనియె. "సుగ్రీవా! శత్రు సైనికులు కొండలలోపలఁ బల్లములయిన మఱుగుప్రదేశములందును నీటిలోను బొంచియుండి సమయము చూచి, మనసేనలకుఁ గీడుసేయఁ జూచుచుందురు. కావున వానరులందఱు ఆకాశమున కెగిరి దారిలో నట్టితావులు వచ్చినప్పుడు శత్రుసేన లేమైన డాగియున్నవేమో యని చూచుచుండవలయును. మనవానరులలోఁ గొంచెము బలహీనులై యుండువారి నిచ్చటనే నగరసంరక్షణమునకై నిలుపుము. ఈమనపని భయంకరమైనది గనుక దీనిని సాధించుటకు సమర్థులే యుండ వలయును. ఎక్కువబలిమి గల వానరశ్రేష్ఠులు లెక్కపెట్ట నలవి కానిదై, సముద్రపుటలలం బోలి, భయంకరమైనదై యుండు

మేటిసేనను గైకొని ముందు నడతురు గాక! ఆవులకు ముందటఁ గ్రొవ్వి నట్టియాఁబోతు లేఁగునట్లు, పర్వతమువంటివారును గొప్ప బలముగల వారును నగు గజగవయగవాక్షులు మనసేనలకు ముందుగా నేఁగుదురు గాక! వానరులలో మేటియు, వానరశ్రేష్ఠుఁడును నగు ఋషభుఁడు సేన యొక్క-కుడిదిక్కును గాచుచుఁ బోవలయును. మదపుటేనుఁగుమాడ్కి నెదిరింపనలవికానివాఁడును, బలవంతుఁడునునగు గంధమాదనుఁడు సేన యొక్క యెడమపార్శ్వమున నేఁగవలయును. దేవేంద్రుఁ డైరావతము నెక్కి నడచునట్లు, నేను హనుమంతునివీఁపుమీఁద నెక్కి సేనలమనస్సు లకు సంతోషము గలిగించుచు, సేనలనడుమ నేఁగెదను. యమునితో సాటియగు లక్ష్మణుఁడును, భూతముల కధిపతియగు కుబేరుఁడు సార్వ భౌమమనెడి దిగ్గజమునెక్కి పోవునట్లు అంగదునిమీఁదఁ గూర్చుండి పయనముచేయును. ఎలుఁగుబంట్లకు మేటియు, ఎక్కువ బలిమిగల వాఁడునైన జాంబవంతుఁడు సుషేణవేగదర్శులు ననెడి యీ ముగ్గురును సేనయొక్క వెనుకటిభాగమును రక్షింతురుగాక!" అని రాముఁడు సుగ్రీ వునితోఁ జెప్పెను.

ఆ రాముని పలుకులు విని వానరసేన కధిపతి యగు సుగ్రీవుఁడు మగటిమిగలవారగు వానరులనందఱిని నట్లుచేయ నానతిచ్చెను. అంత వానరు లందఱు యుద్ధమునందలి యపేక్షతో నపుడె కొండగవుల నుండియు, కొండకొనలనుండియు పై కెగిరిరి. అంతట వానరరాజయిన సుగ్రీవుఁడును లక్ష్మణుఁడును గూడ వచ్చుచుండఁగా, ధర్మాత్ముఁడగు రాముఁడు లెక్కపెట్టనలవికాని, ఏనుఁగులనుబోలిన సేనతోఁ గూడిన వాఁడై, దక్షిణదిశకుఁ బయనమాయెను. ఆ రాముఁడు పయనమైపోవు నపుడు గొప్ప వానరసేన యాతని వెంబడించి పోయెను. ఆ వానరులు సుగ్రీవునియాజ్ఞచొప్పునఁ బోవుచు, గర్వితులును, సంతుష్టులునునై యెగురుచు దుముకుచుఁ గిలకిలధ్వనులు చేయుచు, పెడ బొబ్బలు పెట్టుచు, పరుగెత్తుచు, మార్గములనడుమఁ గనఁబడిన నెత్తావిగల మధు వులను గ్రోలుచు, పండ్లు దినుచు; పూవులగుత్తులతో నిండినగొప్ప చెట్ల కొమ్మలను బట్టుకొని యూఁగులాడుచు, దక్షిణదిశకుఁ బయనమైపోయిరి. వానరులలోఁ గొందఱు గర్వము పట్టి యొండొరులను ఎత్తుకొను

చుండిరి. కొందఱు ఒరులను బడఁద్రోసిరి. అట్లు పడిన వారిలో మఱలఁ బడఁద్రోయలేనివారు తమ్ముఁ ద్రోసినవారిని దిట్టిరి. మఱల ద్రోయఁగల వారు తమ్ముఁ ద్రోసినవారిని గ్రిందఁ బడఁద్రోసిరి. వానరులందఱు రామునియెదుటఁజేరి "మన మారావణుని, ఆ లంకాపురమునందలి రాక్షసుల నందఱిని సంహరింపవలసిన" దని యఱచిరి. ఆవానరసేనకు ముందటఁ బోవుచు శూరులగు నీలకుముదఋషభులు పెక్కండ్రు వానరులతోఁ గూడినవారై దారిని జక్కఁబఱచుచుండిరి. సేనలకు నడుమ శత్రుసంహారులగు రామలక్ష్మణసుగ్రీవులు నడచిరి. వీరుఁడగు శతబలి యను వానరుఁడు పదికోట్ల వానరులసేనను దనకు సాయముగా నుంచుకొని, తానొక్కఁడే యా వానరసేన నెల్ల రక్షించెను. కేసరి, పనసుఁడు, గజుఁడు, బలవంతుడైన అర్కుఁడు ఒక్కరొక్కరు నూఱుకోట్లపరివారముతోఁ గూడినవారై యాసేనయొక్క పార్శ్వమును రక్షించుచుండిరి. సుషేణజాంబవంతులిద్దఱు పెక్కుభల్లూకములతోఁ గూడినవారై, సుగ్రీవుని ముందిడుకొని, సేనయొక్క పశ్చిమభాగమును రక్షింపుచుండిరి. సేనాధిపుఁడును, ఎగురునట్టి వానరులలోమేటియు నైన నీలుఁడు నలువైపులఁ దిరుగుచు నాసేనను రక్షించుచుండెను. దరీముఖప్రజంఘరంభరభసులను వానరులు నలువైపులఁ దిరుగుచు, వానరులను ద్వరపెట్టుచుఁ బోవుచుండిరి.

ఇవ్విధమున బలగర్వితులైన వానరపుంగవులు నడచుచుఁ జెట్లు తీఁగెలు గలదగు పర్వతశ్రేష్ఠమైన సహ్యపర్వతమునకుఁ జేరువ నుండు వికసితములైన కమలోత్పలములు గల తామరకొలఁకును, వనములను జూచిరి. సముద్రప్రవాహము మాడ్కిఁ దుదిలేనిదై భీకరమైయున్న యా గొప్ప వానరసేన కోపము వచ్చిన భీతిని గలిగించునట్టి యా రామునియాజ్ఞకు వెఱచి, పట్టణములకును బల్లెలకును సమీపమునఁ బోవక యడవులదారినే గొప్పయలలు గలదై శబ్దించు సముద్రము మాడ్కి భీకరధ్వనితోఁ బోవుచుండె. ఆ శూరులైన వానరశ్రేష్ఠులందఱు రాముని కుల్లాసము పుట్టించుటకై సారథిచేఁ దోలఁబడు చక్కని గుఱ్ఱములమాడ్కి వడిగా దుముకుచుఁ బోయిరి. వానరోత్తములైన హనుమదంగదులచే మోవఁబడుచుండు రాజోత్తము లిద్దఱు గ్రహములలోఁ

బెద్ద వగు గురుశుక్రులతోఁ గూడిన చంద్రసూర్యగ్రహములమాడ్కిఁ బ్రకాశించుచుండిరి. అంతట సుగ్రీవుఁడును లక్ష్మణుఁడును చేరువనుండి మన్ననచేయుచు రాఁగా, ధర్మశీలుఁడగు రాముఁడును సేనలతోఁ గూడి దక్షిణదిశను గూర్చి పోయెను.

ఆ సమయమున జ్ఞాపకశక్తియు, ఊహయు, ఎక్కువ పనినేర్పును గలవాఁడైన లక్ష్మణుఁ డంగదునిమీఁదఁ గూర్చున్నవాఁడై, తిన్నని మాటలతో రామునకు నిట్లనియె:—"ఓ రాఘవా! నీవు వేగమే లంకకుఁ బోయి చేరి, సీతాదేవి నపహరించిన రావణునిఁ జంపి, రావణునిచే నపహరింపఁబడినదైన సీతనుగైకొని చేయవలసిన కార్యము సాధించుటచే ధ్యానుఁడవై, సకలసంపదలతో నిండినదగు అయోధ్యాపురమునకు వచ్చి చేరఁగలవు. రాఘవా! ఆకాశమునను, భూమియందును గొప్ప శుభ శకునములు గలుగుచున్నవి. అవి యెల్ల నీకు మేలు గలుగు నని సూచించుచున్నవి. గాలి శైత్య సౌరభ్యమాంద్యము లను గుణత్రయముతోఁ గూడినదై, సేన పోవు దిక్కునకే వీచుచున్నది. మృగములును పక్షులును గంభీరశ్రావ్యనాదములతోఁ గూడినవై నీకు మేలును దెల్పుచున్నవి. దిక్కులు తేటలై యున్నవి. సూర్యుఁడును మబ్బులచేఁ గ్రమ్మఁబడక నిర్మలుఁడై వెలుఁగుచున్నాఁడు. వేదముల ప్రోవును, పవిశుద్ధుఁడునైన శుక్రుఁడును చక్కని వెలుతురుతోఁ గూడి నిన్ను వెంబడించుచున్నాఁడు. మఱియుఁ బుణ్యశీలు లైన మహర్షు లందఱును వెలుఁగుగల వారలై ధ్రువునకుఁ బ్రదక్షిణముగాఁ దిరుగుచున్నారు. మనపెద్ద లగు మహాత్ములైన యిక్ష్వాకు వంశపువారికిని మనకును ముత్తాతయైన త్రిశంకు వనెడి రాజర్షియు పురోహితుఁడగు విశ్వామిత్రునిచేసృజింపఁబడిన యన్య వసిష్ఠునితోఁగూడి ప్రకాశించుచున్నాఁడు. మహాత్ములగు మన యిక్ష్వాకులవంశమువారి నక్షత్రశ్రేష్ఠమైన విశాఖయు దుష్టగ్రహసంబంధము లేనిదై వెలుఁగుచున్నది. నిర్ఋతి దేవతగాఁగల రాక్షసులనక్షత్రమైన మూలనక్షత్రము ధూమకేతువుచేరువ నుండుటచే మిక్కిలి తపించుచున్నది. ఇది యంతయు రాక్షసులవినాశమునకు సూచకమై యున్నది. వినాశకాలము తటస్థమైయున్నప్పుడే మృత్యువువాతఁ జిక్కినవారి నక్షత్రము దుష్టగ్రహపీడిత మగును. జలములు తేటదనము గలిగి,

తియ్యనై యున్నవి. వనములు ఫలించియున్నవి. వృక్షములు ఋతు ధర్మము ననుసరించిన పుష్పములతోఁ గూడినవై, నెత్తావిని గుబాళించు చున్నవి. తారకాసురయుద్ధమునందుఁ దేవతలమూఁకలు వెలయునట్లు, గుంపులుగట్టి పోవుచున్న వానరసేనలును మిక్కిలి ప్రకాశించుచున్నవి. ఆర్యా! యీసంభవము లన్నియుఁ జూచిన, నీకు జయముగలుగఁగల దనియే తోఁచుచున్నది. కావున నీవు దిగులుపడక, రావణసంహార ప్రయత్నము చేయవలసినదని చెప్పి, సంతసముతో నన్ను నూఱడించెను.

అటుతర్వాత గోళ్లును కోఱలును నాయుధములుగా నుపయో గించు మేటి ఎలుఁగుబంటులును, వానరశ్రేష్ఠులును గల యా గొప్ప సేన పుడమి యెల్ల నావరించిపోవుచుండెను. ఆ వానరులకాలుసేతులకొనల తొక్కిడిచే బైకి లేచిన ధూళి భీకరమై సూర్యునికాంతిని మఱుగుపఱ చెను. ఆవానరసేన పర్వతకాననములతోఁ గూడినదయిన దక్షిణంపు దిక్కును గ్రమ్ముచుఁ బోవుట చూడఁ గ్రొక్కాఱుమబ్బు లాకాశమును గ్రమ్ముచుఁ బోవున ట్లుండెను. ఆ సేనలు పెక్కుయోజనములదవ్వు నదీ ప్రవాహములను విడువక దాఁటిపోవుచుండఁగా, అప్పుడానదీప్రవాహ ములు వెనుకకుఁ దిరిగి, బహుదూర మెదురుపాఱినవి.ఆవానరసేనలు తేట నీళ్లతో నిండిన కొలఁకులు వచ్చినపుడు వానిలో దిగి దాఁటిరి. చెట్లతో నిండిన పర్వతములు వచ్చినపుడు వానిని జుట్టివచ్చిరి. సమభూములు వచ్చినప్పుడు వానిలో నంతట వ్యాపించి నడచిరి. ఫలించియున్న వృక్ష ములు వచ్చినపుడు, ఆ చెట్లయందలి పండ్లను కోసికొని తినఁగోరినవారయి యాచెట్లక్రిందుగాఁ బోయిరి. ఇట్లు వాయువేగముఁబోలు వేగము గల వానరులు మనములం దుత్సాహము గలవారయినందున రామునికార్య సాధనమునకై పరాక్రమముఁ దెచ్చికొన్నవారై వేడ్క మీఱ నడచిరి.

అట్లు మార్గమున నడచుచు, నావానరు లొండొరులు తమ సంతోషాతిశయమును, బలాతిశయమును, పరాక్రమాతిశయమును జూపుచు, ప్రాయమువలనఁ గలిగిన మదపుఁజేష్టలను గొన్నిటిని జేసిరి. అవి యేవి యనిన, ఆవానరులలోఁ గొందఱు కడువడిగా నడచిరి. మఱి కొంద ఱెగిరిరి. కొందఱు కిలకిల యని చప్పుడు చేసిరి. కొందఱు తమ తోఁకలను బైకెత్తి క్రిందఁ గొట్టిరి. పాదములతో నేలమీఁదఁ దట్టిరి.

కొందఱు చేతులు చాచి కొండలశిఖరములను బగులఁగొట్టిరి ; చెట్ల కొమ్మలను విఱిచిరి. మఱికొందఱు పర్వతములకొట్టకొనల కెక్కిరి; పెద్దగాఁ గూఁతలు వెట్టిరి ; సింహనాదములు చేసిరి. వేఱుకొందఱు తమ తొడలతోఁ గొట్టి పెక్కుతీఁగెలను మఱికొంద ఱావులింతలు పెట్టి, యొడళ్లు విఱచుకొని, గొప్పయంజలు వేయుచుఁ జెట్లకొమ్మలను ఱాలను గైకొని యాటలాడిరి. ఏవైపు చూచినను వానరసేనలే కోట్లకొలది గుంపులు గుంపులుగా నలువైపులను గ్రమ్మినవి. వానరులతో సుగ్రీవుఁడు సమయోచితముగా మాటాడి, వారిమనములను వశపఱచుకొనుటచే, నాతనిరక్షణములో నున్న యావానరసేన యుప్పొంగుచు సీతాదేవిని శోకమునుండి తొలఁగింపవలె నని యాతురత గలదై యున్నందున ముహూర్తకాల మొక్కచోటనైనను నిలువక రాత్రులును పగళ్లును నడచుచు, చెట్లు దట్టముగ నుండునదియు, పెక్కు మృగములు పక్షులును గలదియు నైన సహ్యపర్వతమును దాఁటి, యటు పిమ్మటఁ దిన్నగా మలయపర్వతమునఁ జేరెను. రాముఁ డాపర్వతములందలి మనోహరము లయిన యడవులను, సెలయేళ్లను, ఏళ్లను జూచుచు దాఁటి పోయెను. అపుడు వానరు లెగిరి దుముకుచు, సంపెంగ, బొట్టుగు, మామిడి, అశోకము, తెల్లవావిలి, గన్నేరు, నెమ్మి, ఊడుగు, కానుఁగు, జువ్వి, మఱ్ఱి, తుమ్మికి మొదలగుమ్రాఁకులక్రింద మనోహరములైన బండలమీఁదఁ గూర్చుండఁగా నయ్యడవులందలి మ్రాఁకులు తిన్నగా గాలి వీచుటచేఁ గదలినవై యా బండలమీఁదఁ గూర్చుండియున్న వానరులమీఁదఁ బువ్వులను గ్రుమ్మరించినవి. వనములందు మధుగంధము పర్వఁగా, తుమ్మెదలు ఝుంకారముచేయుచు వెంబడింపఁగా, గాలి చందనముమాడ్కిఁ జల్లనిదై యింపుగా వీచుచుండెను. మఱియు, పర్వతశ్రేష్ఠమైన సహ్యపర్వతమందుఁ గావిఱాలు విశేషముగా నుండుటచే, నావానరులకాలు త్రొక్కుళ్లచేనలిగి పైకిలేచిన కావిఱాలధూళి యాకడు గొప్ప వానరసేనను బూర్తిగాఁ గప్పినదాయెను.

ఆ మనోహరమైన సహ్యపర్వతపుఁ గొండచరియలయం దంతట నావానరు లెగిరిదుముకుచు, నచ్చట నున్న చక్కఁగాఁ బూఁచినట్టి మొగలి, తెల్లవావిలి, తెల్లగురివింద, విఱిసిన మల్లె, కుసుమ, దుంప

రాస్న చెట్లు, కానుఁగు, ఇప్ప, పొగడ, వేగిస, తుమ్మికి, బొట్టుగు, నాగ కేసరములు, మామిడి, దిరిసెన, కాంచనము, ఖర్జూరము, ఏఱుమద్ది, ఇరుగుడు, బూరుగు, అడవిమల్లె, ఎఱ్ఱగోరింట, గిలకతాటి, నెమ్మి, ఉసిరిగ, కడప, నల్ల యిరుగుడు, ఉలిమిరి, ఊడుగు, మెట్టదామర మొదలైన యన్ని వృక్షములను తీఁగెలను నాశము చేసిరి.

మఱియు నాపర్వతమునందుఁ జక్కవలు, నీరుకోళ్లు, బెగ్గురు పక్షులు, క్రౌంచములు మొదలగు నీటిపక్షులు నివసించునవియు, వరాహములు, జింకలు, ఎలుఁగుబంట్లు, సివంగులు, సింహశార్దూలములు, భయంకరము లైన మరపుటేనుఁగులు మొదలగు భీకరమృగములు సంచారము గలవియు, వికసించిన తామరపువ్వులు, చెంగలువలు, నల్ల గలువలు, తెల్లగలువ మొదలగు నానావిధములగు కమలములతోఁగూడి మనోహరములై యున్న చెఱువులును, గుంటలును, నడబావులును నుండినవి. వానిగట్టులందుఁ బలుతెఱంగు లగు పులుఁగులు శ్రావ్యనాద ములతోఁ గూయుచుండినవి.

తేనెవన్నెవంటివన్నెగల వానరు లిట్టి తటాకాదులందు మునిఁగి యుదకములను ద్రావి, ఒండొరులమీఁదను నీటిని బోసికొనుచు జల క్రీడలు సల్పిరి. అట్లు మడుగులందుఁ గ్రీడలు సల్పినతర్వాత, పర్వ తము నెక్కి, యచ్చటి చెట్లయందలి పూవులను గోసి, యమృతము మాడ్కిఁ దియ్య నైయున్న పండ్లను, గడ్డలను, దుంపలను భుజించి చెట్లయందు వ్రేలుచుండు కుండెడేసి తేనియగల తెట్టెలనుండి వేడ్క మీఱఁ దేనియలఁ ద్రాగుచు, చెట్లను విఱుచుచు, తీఁగలను త్రెంచుచు, గొప్ప పర్వతములను తగులఁబెట్టుచుఁ బోయిరి. వారిలోఁ గొందఱు మధుపానముచే గర్వితులై, చెట్లు లేని బయళ్లయందు నడచిరి. కొందఱు చెట్లపై నెక్కిరి. కొందఱు చెట్లమీఁదనుండి క్రిందికి దుమికిరి. ఆ పర్వత ప్రాంతప్రదేశ మట్టి వానరసైనికులతో నిండినదై, బాగుగాఁ బండిన వరిపైరులచే నిండిన పుడమి మాడ్కి వెలయుచుండెను. అంత నిడుద చేతులును, తమ్మిరేకులంబోలు నేత్రములును గలవాఁడగు రాముఁడు మహేంద్రపర్వతము చేరి, పెక్కువృక్షములచే నొప్పియున్న యా మహేంద్రపర్వతశిఖరము నెక్కి, తాఁబేళ్లు చేఁపలు మొదలగు నీటి

Acc. No: 112 62
Class No: 294.5922 RE

జంతువులతో నిండిన సముద్రమును జూచెను. ఆ వానరులు ఒకటి వెంబడి నొక్కటిగా సహ్యామలయపర్వతములను దాఁటి, తిన్నగా నడచుచు భీకరధ్వని గల సముద్రసమీపమునకు వచ్చి చేరిరి. అంతట ఆనందప్రదులలో మేటి యగు రాముఁడు లక్ష్మణసుగ్రీవులతోఁ గూడ మహేంద్రపర్వతశిఖరమునుండి డిగ్గి, సముద్రమును జూచుటకై తీరమందలి వనములకుఁ బోయి, వేగముగాఁ బాఱునట్టినీటివెలువలచేఁ దెల్లగాఁ గడుగఁబడియున్న బాలప్రదేశములతోఁ గూడి, విశాలమైయున్న సముద్రతీరమును జూచినవాఁడై, లక్ష్మణసుగ్రీవులతో నిట్లనియె:

"సుగ్రీవా! మన మిదిగో సముద్రమును చేరితిమి. మన కప్పుడు గలిగిన చింతయే యిప్పుడును గలిగినది. ఇఁక దరిలేని సముద్రమే. ఇక్కడలి సుపాయము లేక దాఁటుటకు వీలుగాదు. కావున నీ వానరబలమెల్లఁ యావలిగట్టుచేరు నుపాయము నాలోచింపవలయును" అని చెప్పి సీతావియోగముచేఁ జిక్కియున్నవాఁడును, నిడుదచేతులు గలవాఁడును నైన రాముఁడు కడలిగట్టును బొంది, యచ్చటనే వానరులను నిలుపఁ దలఁచి, "సుగ్రీవా! యీకడలిగట్టున సేనల నన్నింటిని విడియింపుము. మన మిప్పుడు సముద్రము దాఁటుటకుఁ దగిన యుపాయమును జింతింపవలసినసమయము వచ్చినది. ఒక్కఁడును దనసేనను వదలి యెక్కడికిని బోఁగూడదు. ఇచ్చట నెచ్చటనేని డాగియున్న పరబలమును గనుఁగొనుటకయి శూరులగు వానరులను బంపుము."

"సుగ్రీవుఁడు రామునిమాటను విని, లక్ష్మణునిసహాయముతో సేనల నెల్ల చెట్లతో నిండిన సముద్రపుటొడ్డున విడియఁజేసెను. కడలి యోర నిలువఁబడిన యా గొప్పదగు వానరసేన గోధుమవన్నెగల నీటితోఁ గూడిన మఱియొక గంభీరమైన కడలిమాడ్కిఁ జూపట్టెను. అంతట వానరశ్రేష్ఠు లందఱు సముద్రతీరవనము చేరి, యమ్మహాసముద్రమును దాఁటి యావలిగట్టును బొంద గోరినవారై యుండిరి. సముద్రతీరమున విడియుచున్న యీవానరసైన్యముయొక్క కోలాహలధ్వని సముద్రఘోషనుమీఱి వినవచ్చుచుండెను. సుగ్రీవుఁడు తన యధీనమున నున్న సేనలోని ఎలుఁగుబంట్ల నొక్కవైపునను, కొండ

ముచ్చుల నొక్కవైపునను కోఁతుల నొక్కవైపునను విడియఁజేసెను; అట్లె తనయధిపతిచే మూఁడుతెగలుగా నిలుపఁబడిన యాగొప్ప సేనలు రామునికార్యము నెఱవేర్ప నుద్యుక్తమై యుండెను. ఆవానరసేనలు కడలిగట్టును జేరి, గాలివడికిఁ బైకి లేచినయలలు గల సముద్రమును జూచి యానందించుచు, నావలిగట్టు కానరానిదియు, విశాలమయినదియు, రాక్షసుల కునికిపట్టయినదియు, వరుణునికి మనికిపట్టును, క్రూరములైన మొసళ్లుండునదియు, సాయంసమయములందు భీతిని గలిగించునదియు, నురుఁగులమూలమున నవ్వుచునున్నట్లు, అలల మూలమున నాట్యము సల్పునట్లు నున్నదియు, చంద్రోదయమందుఁ బైకుప్పొంగునదియు, చంద్రునిప్రతిబింబములు పెక్కింటిచే నిండినదియు, వాయువువంటి వేగముగల మొసళ్లకుఁ, దిమింగిలము కునికిపట్టును, మండుచున్న పడగలు గలవియో యన్నట్లుండు పాములతోఁ గూడినదియు, గొప్పజల జంతువులకుఁ దావరమును, పెక్కుపర్వతములతో నిండినదై చొఱనలవి కాకయు, దారి తెలియ వీలు గాకయు నుండునదియు నగు లోఁతైన సముద్రమును జూచి, దీని నెట్లు దాఁటఁగల మని చింతించినవి. ఆసమయమున సముద్రమునందలియలలు, మొసళ్లును, పాములును లోనఁగలవయి గాలిచేఁ గలియఁబెట్టఁబడి మీఁదికెగురుచుఁ గ్రిందఁబడుచుండినవి. నిప్పుకణికలు చల్లఁబడినట్లున్న నీటిబిందువులు గలదియు, గొప్పసర్పములు గలదియు, రాక్షసుల కునికిప ట్టయినదియు, భయంకర మయినది, పాతాళమువలె గంభీరమయినదియునగు నాసముద్రమాకాశమును, ఆకాశము సముద్రమునుబోలి యారెండింటికిని ఇది సముద్ర మిది యాకాశము నను భేద మిసుమంతయేనిగాన రాకుండెను. (రాత్రులందు కడలినీరు చంద్రకిరణస్పర్శముచే నగ్నికణములమాడ్కి విరాజిల్లుచుండును. అట్లు ఆకాశమును నక్షత్రములచేఁ బ్రకాశించుచుండును. సముద్రమునను గొప్ప నాగము లున్నవి. ఆకాశమునను నాగము లున్నవి. పాతాళమున రక్కసు లుందురు. ఆకాశమునను రక్కసు లుందురు. సముద్రమును ఆకాశమువలె భయంకరమైనది. సముద్రాకాశములు రెండును పాతాళముమాడ్కిలోఁతై యుండును. కావున సముద్రమాకాశముమాడ్కియు నాకాశము సముద్రముమాడ్కియు నుండుచు నిది యాకాశము ఇది

సముద్రము అని తెలియుటకు వీలుగాక యేకాకారముగా నుండెను.) సముద్రమందలియుదక మాకాశమువలెను, ఆకాశము సముద్రజలము మాడ్కియు నుండుటచే నక్షత్రములతోఁ గూడిన యాకాశమును రతనములతోఁ గూడిన సముద్రమును నేకరూపమున భేదము లేనివై యుండెను. మేఘములచేఁ గ్రమ్మఁబడిన యాకాశమునకును అలలచేఁ గల్లోలమై యున్నకడలికిని నెంతమాత్రము భేదము గనఁబడదయ్యె. ఆ మహాసముద్రమందలి యల లొండొంటితో నొఱసికొని, యుద్ధరంగము నందలి గొప్పభేరీవాద్యములవలె భీకరధ్వనులతో ధ్వనించుచుండినవి. రత్నరాసులయొక్కయు, నీటియొక్కయు చప్పుడు గలిగి, గాలిచే లేవఁ గొట్టఁబడి, పైకెగురుచున్నదో యనునట్లును, కోపగించుచున్నదో యన్నట్లును కనఁబడుచు, నీటిజంతువులతో నిండినదై, గాలికిఁ బైకి లేచుచు, అలలమూలమున నాట్యముచేయుచున్నదో యన్నట్లుండునదియు, పెక్కువిధములైన యలలగుంపులు పైకి లేచుటచే గొప్పధ్వని గలిగి, కలవరపాటు నొందినట్లు కనఁబడుచుండునదియు నైన కడలిని వానరులు మిక్కిలి వేడ్కతోఁ జూచి యాశ్చర్యము నొందిరి.

5-వ సర్గము

రాముఁడు విరహవేదనం బడుట

వానరసేనానాయకుఁ డగు నీలుఁడు చక్కఁగా రక్షకుల నేర్ప అచి భయము లేకుండునట్లు కావించి, కడలియుత్తరపుగట్టున సేనను జక్కఁగా నిలిపెను. అచ్చట వానరశ్రేష్ఠులైన మైందద్వివిదు లిద్దఱు సేనలను కాపాడుటకై ఎల్లకడలఁ దిరుగుచుండిరి. అట్లు సముద్రతీరమున సేనలు నిలుపఁబడినతర్వాత, రాముఁడు ప్రక్కన నిలఁబడియుండు లక్ష్మణునిఁ జూచి "ఓలక్ష్మణా! కాలము గడచుకొలఁది దుఃఖ ముండక తగ్గిపోవుచుండును గదా! నా కన్ననో యట్లు కాదు. ప్రియాదర్శనము లేమిచే నాదుఃఖము నానాఁటికి హెచ్చుచున్నది. నాప్రియురాలు దూరమున నున్నదని కాని, రావణుఁడు సీతాదేవి నపహరించె నని కాని నాకు వ్యసనము లేదు. త్వరలోనే యా రావణునిఁ జంపి సీతాదేవిని బడయఁ గలను. ఇఁక దేనిం గూర్చి యనిన, నాప్రియురాలియొక్క

యౌవనము వ్యర్థముగా దాఁటిపోవుచున్న దనియే నేను వగచు చున్నాను" అని లక్ష్మణునితోఁ జెప్పెను.

శ్రీరాముఁడు లక్ష్మణునితోఁ జెప్పి, సీతావియోగవిరహము సైరింపఁజాలనివాఁడై, వాయువును దలఁచి "ఓవాయుదేవుఁడా! నా ప్రియురా లెచ్చట నున్నదో, అచ్చటనుండి వీవుము. అట్లయినచో నీవు నా ప్రియురాలిని దాఁకివచ్చి నన్నును దాఁకితివని తనివి గలిగి యుందును. చంద్రుఁడు నా ప్రియురాలివదనముఁ బోలువాఁడు గాన, నేను జంద్రునిఁ జూచి తనివి నొందుదును. సకలభోగములను వదలిపెట్టి నన్నే గతిగాఁ దలఁచి నావెంట వచ్చిన ప్రియురాలు తన్ను రావణుఁ డెత్తుకొని పోవు నప్పుడు తా నాదురాత్మునిఁ దనపాతివ్రత్య మనెడి వెలుఁగుచే బూది సేయఁగలదిగా నుండియు, "హా నాథా" యని నన్నుఁ బ్రేమతోఁ బిలి చినమాట నా మనస్సును దహించుచున్నది. మన్మథుఁ డనెడి యగ్ని హోత్రుఁడు ఆ నా ప్రియురాలివియోగ మే కట్టెలుగాను, ఆ నా కాంతం గూర్చిన చింతయే మంటలు గాను గాఁగా నన్ను రేయింబవళ్లు కని కరము లేక దహించుచున్నాఁడు. ఓ లక్ష్మణా! నేను ని న్నెడఁబాసి, కడలియందు మునిఁగి నిద్రించెదను. అట్లు చేయుదునేని, ఈ మన్మథుఁ డనెడి యగ్నిహోత్రుఁడు నీట మునిఁగియున్న న న్నేమియుఁ జేయఁ జాలఁడు. నేను ఇంతటి విరహబాధ ననుభవించుచున్నను, చక్కని యూరువులు గల నా ప్రియురాలును నేనును భూమియందే యున్నా మను కారణముచేతనే ప్రాణములను బిగఁబట్టుకొని యున్నాను. నీరు లేని చేను తేమ గలచేనియొక్క సంబంధముచే నెండిపోవక యుండు నట్లు, నేనును నా ప్రియురాలు జీవించియున్న దనుమాట వినుటఁ బట్టియే ప్రాణములతో నున్నాను. శత్రువులను సంహరించి, చక్కని పిఱుఁదులు గలదియు, తామరఱేకులం బోలు కన్నులు గలదియు నైన సీతను విస్తారమైన రాజ్యలక్ష్మిని బోలె నెప్పుడు చూతునో! కమలముం బోలు నా ప్రియురాలి మోమును కొంచెము పైకెత్తి, రోగి రసాయన మును దినుచందమున నా కాంతకెమ్మోవి నెపుడు పానము చేయుదునో! తాళఫలములం బోలునవియు, ఒండొంటితోఁ గదిసినవియు, బలిసి నవియు, అధరునవియు నైన స్తనములు గల నా ప్రియకాంత

నెప్పు డాలింగనముచేసికొని సౌఖ్య మనుభవింతునో! నల్లనికడ కన్నులు గలదియైన నాకాంత రాక్షసస్త్రీలచేతఁ జిక్కినదై, నన్ను నాథునిఁగాఁ గలిగియుండియు, నాథుఁడు లేనిదానికైవడి విచార పడుచున్నది. జనకమహారాజునకుఁ గూఁతురును, దశరథమహా రాజునకుఁ గోడలును, ఖరదూషణాదిరాక్షససంహారము గావించిన నాకుఁ బత్నియునై యుండియు నీ సీతయేల యిట్లు రాక్షసకాంతల వశమునఁ జిక్కి తపించుచున్నది! చంద్రరేఖ వర్షర్తువునందు నల్లని మబ్బులనడుమఁ జిక్కి, యావర్షర్తువు తొలఁగి శరదృతువు రాఁగా నా మేఘములను జెదరఁగొట్టి వెలుపలికి వచ్చుచందమున ధైర్యశాలు లైన యా రాక్షసులను జెదరఁగొట్టి యెప్పుడు నాకడఁ జేర నున్నదో! సీత స్వయముగానే చిక్కియుండునది. దేశకాలములు పొసఁగమింబట్టియు, చింతగలదగుటంబట్టియు, ఆహారము లేమింబట్టియు నిప్పుడు బొత్తిగాఁ జిక్కియుండు నని తలఁచెదను. నే నెప్పు డారాక్షసాధిపుని బొమ్మున బాణముల నేసి, యాతనిఁ గూల్చి, మనోదుఃఖమును బాసి యెప్పుడు సీతం దెచ్చెదనో! అప్సరసం బోలునదియు, చక్కనిదియు నైన సీత యాత్రముతో వచ్చి నన్నుఁ గౌఁగిలించికొని, సంతోషముచే నానంద బాష్పముల నెప్పుడు విడువఁగలదో! నేనును ముఱికిబట్టను వదలిపెట్టు నట్లు ఘోర మైన యీ జానకీవియోగవ్యసనము నెప్పుడు విడుతునో!"

అని యివ్విధమున శ్రీరాముఁడు కడలి యొడ్డునఁ గూర్చుండి చింతించుచుండఁగా, ప్రొద్దు గ్రుంకెను; సంధ్యాకాలము వచ్చెను. రాముఁడు పద్మపత్రములంబోలు కన్నులు గల సీతం దలఁచుచు వ్యసనముచేఁ గలవరపడినవాఁడయి యుండియు, లక్ష్మణుఁ డూఱడిలఁ జేయగాఁ గొంచెము కుదుటఁబడి సాయంకాలసంధ్యావందనమాచ రించెను.

6-వ సర్గము

రావణుఁడు మంత్రులతో నాలోచించుట

ఇచ్చట శ్రీరాముఁడు వానరసేనతో సముద్రతీరమున విడిసి యుండఁగా, అచ్చట రాక్షసరాజగు రావణుఁడును, దేవేంద్రునిమాడ్కి గొప్ప ధీరుఁడగు హనుమంతుఁడు లంకాపురమున నొనర్చిన భయంకర

ఘోరమైన కార్యమును జూచి, వానరమాత్రునివలనఁ దనపురమున కింత చేటు గలిగినందుకు అవమానపడి, దానిచేఁ గొంచెము తలవంచిన వాఁడై రాక్షసుల నందఱిని జూచి యిట్లనెను.

ఓ మంత్రులారా! శత్రువులకుఁ జొఱ నలవి కాని యీ మన లంకాపురమున నెవ్వఁడో వానరమాత్రుఁడు ప్రవేశించి యీ పురమును ధ్వంసముచేసి పోవుటయే కాక సీతను గూడఁ జూచిపోయినాఁడు; చైత్య ప్రాసాదమును బడఁద్రోసి, బలశాలురైన రాక్షసుల నందఱిని బరి మార్చి, లంకాపట్టణ మెల్ల నల్లకల్లోలమై యుండున ట్లొనరించినాఁడు. మన మింకమీఁదఁ జేయవలసినపని యేది? ఏ పనిచేసిన మనకు హితమును, కార్య మనుకూలించుటయు నగునో, అట్టి యుపాయము నాలోచించి చెప్పుఁడు. మీయాలోచనప్రకార మొనరించెదను. మీకు మేలయ్యెడు. గెల్పునకు ఆలోచనయే ముఖ్యకారణముగా నీతికోవిదులు చెప్పుదురు. కనుక ఓ బలిష్ఠులారా! రాముని జయించుటకై యే యుపాయము పన్నఁదగినదో, యట్టి యుపాయముంగూర్చి యాలోచన చేయఁగోరు చున్నాను.

లోకమున పురుషు లుత్తమమధ్యమాధమభేదముల మూఁడు విధములుగాఁ బరిగణింపఁబడుదురు. ఒండొంటితోఁ గలిసియున్న యీమూఁడు తెగలవారికిని గల గుణదోషములను నిరూపించి చెప్పెదను వినుఁడు. తన మే లరయునట్టివారును, ఆలోచనలు చేసి కార్యనిర్ణయము చేయుటయందు నేర్పరులును నైన మంత్రులతోఁ గాని, సమానసుఖదుఃఖములు గల మిత్రులతోఁ గాని, హితు లయిన చుట్టాలతోఁ గాని కూడినవాఁడై యాలోచించి, యా యాలోచనల ప్రకారము కార్యములు చేయుచు దైవముమీఁద భారము వేసి యుండువాఁ డుత్తమపురుషు డనఁబడును. ఒంటరిగా నుండి యాలోచనచేయుచు, దైవముమీఁద భారముచేసి తానొక్కఁడే పనులను జేయువాఁడు మధ్యముఁ డనఁబడును. ఆలోచనచేసి మంచి చెడ్డలను నిర్ణయించుకొనకయు, దైవమును నమ్మకయు, పనిచేసెద నని యారంభించి తుదముట్టఁగావింపక నడుమ ... సుపేక్షచేయువాఁడు నరాధముఁ డనఁబడును. ఎట్లు పురుషులలో నుత్తమమధ్యమాధము

లను భేదము గలదో యట్లే యాలోచనలలోను భేదమున్నది. మంత్రులంద ఱేకాభిప్రాయులై శాస్త్రసమ్మత మైన బుద్ధితో వ్యత్యాసము లేకుండఁ జేయునట్టి యాలోచన యుత్తమ మనఁబడును. మొదట మంత్రు లందఱు భిన్నాభి ప్రాయులై యుండియు, కడపట నొక్కటిగాఁ గూడి చేసిన యాలోచన మధ్యమ మనఁబడును. మంత్రులు కడవఱకు భిన్నాభిప్రాయులై యుండి తమతమ యభిప్రాయములను వదలక, యొక్కటె పట్టుపట్టి చేయునట్టి యాలోచన యధమ మనఁబడును. కావున బుద్ధిమంతులలో శ్రేష్ఠులారా! మీ రందఱు గూడి చక్కఁగా నాలోచించి చేయవలసిన పనిని జెప్పుఁడు. మీరు చెప్పినట్లొనరించెదను. రాముఁడు శూరులైన పెక్కండ్రు వానరులతోఁ గూడినవాఁడై మనల ముట్టడించుటకు లంకకు వచ్చుచున్నాఁడు. ఆరాఘవుఁ డెట్లో యొకవిధమునఁ దమ్ములు దానును వానరబలముతోఁ గూడఁ గడు వేగిరమే దాఁటిరాఁగలఁడు; లేక సముద్రము నింకింపఁ జేయఁగలఁడు. లేక దాఁటుటకుఁదగినవంతెన మొదలగువానింగట్టి దాఁటఁగలఁడు. అట్లు రాముఁడు వచ్చి నాపట్టణమును ముట్టడించినట్లయిన, వానరులకును మనకును విరోధము గలుగును. కావున మనకును మనసేనలకును హితమైన యొక యుపాయము నాలోచించి చెప్పుఁడు" అని రావణుఁడు తన మంత్రుల నడిగెను.

7-వ సర్గము

రాక్షసులు రావణున కాలోచనలు చెప్పుట

బలవంతు లగు నా రాక్షసు లందఱు రాక్షసాధిపునిచేఁ జెప్పఁబడిన పలుకులు విన్నవారై, తాము నీతి నెఱుఁగనివారును, బుద్ధిహీనులునైనందున నెదిరిబలము నెఱుఁగక, యా రాక్షసేశ్వరుం డగు రావణునకిట్లు చెప్పిరి:

రాక్షసేంద్రా! గదలు, ఈఁటెలు, అడ్డకత్తులు, శూలములు, ఖడ్గములు మొదలగు నాయుధములు దాల్చిన యపారమైన సేన మనకడ నున్నది. అట్లుండఁగా, నీ వేల విషాద మందెదవు! నీవు పాతాళమున నుండెడి భోగవతీపురమునకుఁబోయి యచ్చటి పన్నగుల నందఱిని జయించితివి. కైలాసశిఖరమునఁ బెక్కండ్రు యక్షులతోఁగూడ నున్న కుబేరు

నితో గొప్ప యుద్ధ మొనర్చి, వానిని లోఁబఱచుకొంటివి. ఓ ప్రభూ! పరమశివునికిఁ జెలికాఁడని ఖ్యాతివహించినవాఁడును, ఉత్తరదిక్కు నేలువాఁడును, బలవంతుఁడు నైన యాకుబేరుని, యుద్ధమునఁ బరాక్రమముచే గెలిచితివి. నీ వచ్చట నున్న యక్షులను గలఁతపెట్టి కయ్యము నొనర్చి, యా కైలాస శిఖరమునుండి యీ విమానము దెచ్చితివి. ఓ రాక్షసాధిపా! మయుఁ డను రాక్షసశ్రేష్ఠుఁడు నీకు వెఱచి, నీతోడి చెలిమిఁ గోరినవాఁడై, తనకూఁతును నీ కిచ్చి పెండ్లిచేసెను. శత్రుదుర్జయుఁ డగు కుంభీనసికిఁ బెనిమిటియైన మధు వను దానవేంద్రుఁడు బలిమి వలని గర్వము గలవాఁ డయి, నీతో నెదిరింపఁగా, నతనితో నీవు పోరి యాతని లోఁబఱచుకొంటివి. నిరుపమచేతులు గల యో ప్రభూ! నీవు పాతాళమునకుఁ జని, వాసుకి, తక్షకుఁడు, శంఖుఁడు, జటుఁ డనువారిని తక్కుంగల పన్నగులను జయించితివి. శత్రువుల నణఁగఁద్రొక్కునట్టి యో విభుఁడా! నుగ్గునూచము గావించినను మఱలఁ బుట్టువా రగుటచే నాశరహితులును, బలవంతులును, మొనగాండ్రును, బ్రహ్మదేవుని యనుగ్రహమునంజేసి లబ్ధవరులునునైన కాలకేయు లనెడి దానవు లొక్కయేడు తమశక్తి నంతయు నుపయోగించి కయ్యముచేసి కడపట లోఁబడిపోయిరి. రాక్షసేంద్రా! వారు నీకు లొంగి నీతోడఁ జెలిమి చేసికొనఁగా, వారివలనఁ బెక్కు మాయలను గ్రహించితివి. మఱియు శౌర్యబలము గలవారగు వరుణపుత్రులు చతురంగ బలసమేతులై నీతోయుద్ధమునకు రాఁగా, వారినందఱిని నీవు యుద్ధరంగమున నోడించితివి. ప్రభూ! మృత్యుదండ మనెడి మొసళ్లచేతను శాల్మలులనెడి వృక్షములచేతను నలంకరింపఁబడినదియై కాలపాశ మనెడి పెద్దయలతోఁ గాడి యమభటు లనెడి సర్పములు గలిగియున్న యమసేన యనెడి సముద్రమునఁ బ్రవేశించి, దానిం గలఁతపెట్టి మృత్యుదేవత నడ్డపెట్టి జయము నొందితివి. నీ వప్పు డొనరించిన యుద్ధమును జూచి లోకములన్నియు వణఁకినవి. పరాక్రమమున దేవేంద్రునిఁ బురుడించువార లగు మగతనముగల పెక్కుండ్రు క్షత్రియులు వృక్షములు నిండియున్నట్లు పుడమి యెల్ల నిండియుండిరి. బలపరాక్రమసుగుణసంపదయందు రాముఁడు వారితో సాటిగాఁడు. లోక

మున నెంతవారికైనను గెల్వ నలవి కానట్టి బలిమి గల యట్టి క్షత్రియుల నందఱ నుక్కడంచితివి.

మహారాజా! నీ కేల శ్రమ. నీవు హాయిగా నింట నుండుము. నిడుద చేతులవాఁ డయిన యీ యింద్రజిత్తొక్కఁడే వానరుల నంద ఱను పీచమడచఁగలఁడు. ఈతఁడు పశుపతినింగూర్చి యాగ మొనరించి, లోకమున నితరుల కెవ్వరికిని బొంద నలవికాని గొప్పవరము నొందెను. ఇంద్రజిత్తు శక్తితోమరములు మత్స్యములుగాను, నంతటఁ బడియుండు ప్రేఁగులే పాఁచితీగలుగాను, ఏనుఁగులు తాఁబేళ్లుగాను, గుఱ్ఱములు కప్పలుగాను, పదునొకండుగురు రుద్రులు పన్నిద్ద ఱాదిత్యులు గొప్ప మొసళ్లుగాను, ఏడ్వురు మరుత్తులు ఎనమండ్రుగురు వసువులు గొప్ప పాములుగాను, ఏనుఁగులు గుఱ్ఱములు అరదములు నీటివెల్లువలుగాను, కాలిబంటులే యిసుకదిన్నెలుగాను కాఁగా, సముద్రముమాడ్కి గంభీరమై చూపట్టుచున్న వేల్పులమూఁకలోఁ జొఱఁబడి యాసేన నెల్లఁ జీకాకుపఱచి, వేల్పుఱేనిని బట్టి కట్టి లంకాపురమునకుఁ దెచ్చి పడవేసిన వాఁడు గదా! అట్టి సమయమున బ్రహ్మదేవుఁ డానతియ్యఁగా, శంబర వృత్రాసురులను జయించితి నని విఱ్ఱవీగిన యా దేవేంద్రుని విడువఁగా, నతఁడు వేల్పులందఱు జోహారువు లొనర్ప స్వర్గమునకు జనియెనుగదా! ఓ రాక్షసరాజా! నీ వట్టి నీ కొమరుఁడయిన యింద్రజిత్తున కానతిమ్ము; ఆతఁ డొక్కఁడె యా వానరసేన నంతయును రామునితోఁ గూడ రూపుమాపి వచ్చును సుమీ! రాక్షసాధిపా! సామాన్యుఁడయిన మానవునివలన వచ్చిన యీ యాపదనుగూర్చి నీవు మనమున దిగు లొందుట యుక్తముకాదు. నీవు తప్పక రాముని వధింపఁగలవు" అని మంత్రులందఱొక్కమాటగాఁ బలికిరి.

8-వ సర్గము

ప్రహస్తుని వాక్యము

అంతట వార్షికమేఘముఁ బురుడించునట్టి ప్రహస్తుఁ డను పేరు గలశూరుఁ డైన సేనాధిపతి చేతులు జోడించికొని, యా రాక్షసాధిపుని వైపునఁ జూచి, "దేవదానవగంధర్వపిశాచపన్నగగరుడులలో నెవ్వరైనఁ గాని నిన్ను సమరమున డీకొనఁ జాలరు. అట్లుండఁగా నీ వాన

రులు నిన్నేమిచేయఁ జాలుదురు? లంకలో నందఱు నిర్భయులై మన కెదురు లేదని నమ్మి పరాకున నుండఁగా నందఱిని హనుమంతుఁడు వంచించి యార్భాటము చేసిపోయెనేకాని, నే నూఁపిరితోనుండఁగా నా వానరుఁ డీలంకలోపలికి వచ్చి మఱలఁ బ్రాణములతో మఱలిపోవఁడు. దేవర నా కానతి యొసఁగెనేని, నే నొక్కఁడనే పర్వతములు వనములు అడవులు గల్గి నాలుగు సముద్రముల వరకునుండు భూమండలము లోపల వానరుల పేరే లేకుండునట్లు చేసెదను. రేద్రిమ్మఱీఁడా! వానరుల వలన నీ కేమియుఁ గీడు లేకుండునట్లు చేసెదను. సీతను దెచ్చిన యాత్మ దోషమునకై నీ కెట్టి కీడును గలుగనేఱదు" అని రాక్షసేంద్రునితోఁ జెప్పెను.

అప్పుడు దుర్ముఖుఁ డను పేరు గల మఱియొక్క రాక్షసుఁడు రావణునిఁగూర్చి, "ఓరాక్షసేంద్రా! ఈ హనుమంతుఁడు మన కందఱికి నొనర్చిన యవమాన మోర్వఁదగినది కాదు. ఈ వానరుఁడు వచ్చి దేవరయంతఃపురస్త్రీల నవమానించుటయుఁ, దమ్ము నవమానించుటయుఁ గడు నోర్వఁదగనిదై యున్నది. ఈ వానరులు వెఱచి భీమమైన యాకాశమునకుఁ బఱతెంచినను, సముద్రములలోపల జొచ్చినను, పాతాళలోకమును బ్రవేశించినను, నే నొక్కఁడనే వారినందఱి నీ నిమిషముననే యుక్కడంచి వచ్చెదను" అని యట్టహాసముతోఁ బలికెను.

అంతట బలిమికాఁ డగు వజ్రదంష్ట్రుఁ డను రాక్షసుఁ డోర్వరాని కినుక పూని నంజుడు నెత్తురు పూసిన వెఱపు గలిగించెడి యినుప గుదియను జేతఁ బట్టికొని, శత్రువులచే లోఁబఱచుకొన వీలుగాని వాఁ డగు రాముఁడు లక్ష్మణసుగ్రీవులతోఁ గూడియుండఁగా, పిఱికియై రాత్రివేళఁ బట్టణమునఁ బ్రవేశించి; యంద ఱేమఱియుండునప్పుడు పట్టణము కలఁతపెట్టి పోయిన యా యల్పుఁ డైన హనుమంతుని కేల భయపడవలెను? నే నొక్కఁడనే యా వానరసేనను జీకాకుపఱచి, యీ గుదియతో నా రామలక్ష్మణసుగ్రీవులను ముగ్గురిని నిప్పుడే జముని ప్రోలి కనిచివచ్చెదను. ప్రభూ! నేను మఱొక్కమాట విన్నవించెదను. ఆలకింపుము. ఉపాయకుశలతగలవాఁడే మెలఁకువతో శత్రువులను జయింపఁ గలఁడు. కోరినరూపము దాల్చువారును, మేటి మగలును, భీకరులును,

భీకరదృష్టి గలవారును నైన పెక్కండ్రు రాక్షసులు తమ యానతికై వేచియున్నారు. వారి కందఱికిని నుత్తరు వొసఁగి, మానవరూపమెత్తి, యా రాముని కడకేగి, తత్తరపాటు లేకుండ నిలిచి, "యో రాఘవా! మేము నీ సాహాయ్యమునకై నీతమ్ముఁడు భరతుఁడు పంపఁగా వచ్చిన వారము. ఆతఁడును సేనను దోడ్కొని వేగిరమే రాఁగలఁడు" అని రామునితోఁ జెప్పవలెను. మేమును ఇంతలో నిచ్చటినుండి వేగిరముగాఁ దఱలి శూల శక్తి గదాయుధములను దాల్చినవారలమై, అమ్ముల పొదలు వీపులందు వేసికొని, విండ్లను, బాణములను జేతఁ బట్టి కడు వేగిరమే యచ్చటికిఁ బోయెదము. అట్లు పోయి యాకాశమున గుంపులు గుంపులుగా నిలిచి, తాలవానను, బాణవర్షమును జడి గొట్టినట్లు కురిపించి, యా వానరసేన నంతయు యమునివీటి కంపెదము. అట్లయినచో రామలక్ష్మణులు మోసమునఁ జిక్కుకొని తప్పక ప్రాణములను విడుతురు" అని రాక్షసాధిపునితోఁ జెప్పెను.

తర్వాత కుంభకర్ణునిపుత్రుఁ డయిన శూరుఁ డగు నికుంభుఁడను వాఁడు ఎక్కువ కినుక పూని, లోకముల నేడిపించువాఁ డయిన రావణుని మంత్రులఁ జూచి, "మీ రందఱు మహారాజుతోఁ గూడి యిచ్చటనే యుండుఁడు. నే నొక్కఁడనే రామలక్ష్మణసుగ్రీవులను, వానరుల నందఱను వధించి వచ్చెదను" అని తన పటాటోపము దెలిపెను.

పదంపడి కొండంత యెత్తయిన వజ్రహనుఁ డను రాక్షసుఁ డాగ్రహముపూని, నాలుకతో నోరంతయు నాకుచు "మీరలు వెఱపు మాని యథేష్ట కార్యములను జేయుచు నుండుఁడు. నే నొక్కఁడనే యా వానరవీరుల నందఱిని మ్రింగెదను. మీరలు మద్యము గ్రోలి, వంత మాని నెమ్మదితో విహరింపుఁడు. నే నొక్కఁడనే లక్ష్మణసుగ్రీవులను, అంగదహనుమంతులను, అనిమొనకాఁడగు రామునిని పరిమార్చెదను" అని తక్కిన రాక్షసవీరులతోఁ జెప్పెను.

9-వ సర్గము

విభీషణుఁడు రావణునికి హితము బోధించుట

అంతట నికుంభుఁడు, రభసుఁడు బలిమికాఁడగు సూర్యశత్రువు, సుప్తఘ్నుఁడు, యజ్ఞఘ్నుఁడు, మహాపార్శ్వుఁడు, మహోదరుఁడు, శత్రువుచే

లోఁబఱచుకొన వీలు గాని యట్టి యగ్నికేతువు, రశ్మికేతువు, ఎక్కువ వెలుఁగువాఁడు, బలవంతుఁడునయిన రావణుని పెద్దకొడుకు ఇంద్రజిత్తు, ప్రహస్తుఁడు, విరూపాక్షుఁడు, బలశాలియగు వజ్రదంష్ట్రుఁడు, ధూమ్రాక్షుఁడు, అతికాయుఁడు, దుర్ముఖుఁడు నను వీరందఱును ఇనుపగుదియలు, అడ్డకత్తులు, ఈఁటెలు, శక్తులు, శూలములు, గొడ్డండ్లు, ధనుర్బాణములు, వాఁడిమిగల వెడఁదవాతీ కత్తులు మొదలగు నాయుధములను బూని, తమ ప్రతాపముచే వెలుఁగుచుఁ గోపము హెచ్చుఁగా, వేడ్క మీఱ నిలిచి "రాక్షసేంద్రా! యారామలక్ష్మణులను, సుగ్రీవుని, లంకాపురము ధ్వంసముచేసిన నీచుఁ డయిన యా హనుమంతుని నిప్పుడే వధించెదము" అనుచుఁ బయన మైరి.

అట్లడిదములు పూని, దండయాత్రకు సన్నద్ధులైన యా రాక్షసుల నందఱను నిలిపి కూర్చుండఁబెట్టి విభీషణుఁడు చేతులు జోడించికొని వా రందఱు వినుచుండ రావణునితో నిట్లనియె :

నాయనా! లోకమున సామదానభేదదండము లనెడి నాలుగు ఉపాయములు గలవు గదా! వానిలో మొదటి మూఁడుపాయములచేఁ బొంద నలవి కాని కార్యముపట్లఁ బరాక్రమము చూపుట యుక్త మని పెద్దలు చెప్పుదురు. నాతండ్రీ, యేమఱియుండువారియెడలను, పగతురచే ముట్టడింపఁబడియుండువారియెడలను, గ్రహచారము చాలనివారి యెడలను, బరికించి నీతిశాస్త్రమునఁ జెప్పఁబడిన తెఱంగునఁ బ్రయోగించిన దండోపాయము సిద్ధింపఁగలదు కాని, జాగరూకుఁడై, గెల్పుఁగోరి, బలవంతుఁడై, కోపము నడఁచుకొని యుక్తాయుక్తముల బరికించి పని చేయుచు నొరులచే లోఁబఱచుకొన నలవికాకయుండు శత్రువు నెదిరింపఁ బూనుకొనిన నాకార్యము నెఱవేఱునా? భయంకరమైన యేటి మగఁ డగు సముద్రమును దాఁటివచ్చి యా హనుమంతుఁ డిచ్చటఁ జేసినచేఁతల నెవ్వఁ డైనను దలఁచుచున్నాఁడా? ఓరేద్రిమ్మఱులారా! పగతుర బలశౌర్యములు లెక్కపెట్ట నలవికానివై యున్నవి. మీరు పరులబలశౌర్యములను గమనింపక, వానివిషయమున నలక్ష్యము చూపఁ దగదు. అయిన మన కెగ్గు సేసిన పగతుని సంహరింపఁ బనిలేదా! రాముఁడు ఖరదూషణాదిరాక్షసులను జంపి రావణునికి మొదట నప

రాధము సేసెను. దానికిఁ బ్రతిగా రావణుఁడు రామునిభార్యయగు సీత నపహరించెను. కావున నాతని తప్పేమి యున్న దని మీ రంద అందు రేమో. ఖరుని రాముఁ డెందుకుఁ జంపె ననిన, ఖరుఁడే రాముని సంహరింప నాతనిపైకిఁ గవిసెను. అంత రాముఁడు తన ప్రాణరక్షణమునకై తన్ను వధింప వచ్చిన యా ఖరుం జంపెను. లోకమునఁ బ్రాణులు తమకుఁ బ్రాణాపాయము తటస్థించునప్పుడు తమశక్తికొలఁదిని దమ ప్రాణములను గాపాడుకొనుట యుక్తము గదా! ఆరాముఁడు మొదట ఖరునిఁ జంపి రాక్షసేంద్రునకుఁ గీడొనరించినాఁ డనుట యుక్తముగాదు. మఱియు పరస్త్రీసంగమం బపకీర్తి తెచ్చునదియు, ఆయుస్సును తగ్గించునదియు, ధనమును నశింపఁజేయునదియు, పాపమునకు మూలమును, అసహ్యము నైనది. కావున సీతవలన మనకు గొప్పచేటు గలుగును. ఆవైదేహి నప్పు డాగ్రహముచేఁ దెచ్చియున్నను, ఇప్పుడు మఱల నామెను గొనిపోయి రామునిసన్నిధానమున వదలిపెట్టుట యుక్తము. కలహ మూలమైన కార్యమేల యవలంబింపవలెను? వీర్యవంతుఁడును, నీతిదప్పనివాఁడును నైన యా రామునితోఁ బగ పెట్టుకొనుట యుక్తము గాదు. కావున సీతాదేవిని రాముని కప్పగింపుము. రాముఁడు గజాశ్వరథ సంకులమై మణిగణ సంపూర్ణమై యున్న మన లంకాపురమును బాణములతో భేదించుటకుఁబూర్వము,చూపరకు వెఱపు గలిగించునట్టిదై కడు ఘోరమయి, శత్రువులచే బెదిరింప నలవికాని వానరసేన మన లంకాపురమును ముట్టడించుటకుఁబూర్వము సీతను గొనిపోయి రామునికి నప్పగింపుము. రామునికి ప్రియపత్నియగు సీతను గొనిపోయి యాతని కొసఁగకపోయిన యెడల లంకయు శూరులయిన రాక్షసులును నశించెదరు. బాంధవ్యమువలన నీ మేలు గోరి, వాస్తవమైన మాటను జెప్పెదను. నా మాట విని సీతాదేవిని గొనిపోయి రాముని కప్పగింపుము. రాముఁడు లంకకు వచ్చి, నిన్ను వధించుటకై శరత్కాలసూర్యునికిరణములమాడ్కి వెలుఁగునట్టి యన్నులేని బాణములను బ్రయోగించుటకు ముందే రామునకు సీతాదేవి నొసఁగుము. కోపము సౌఖ్యమును ధర్మమును జెడఁగొట్టునది. ధర్మము సంతోషమును కీర్తిని వెల్లడిచేయునది. నీవు కరుణించి జానకిని రాముని కొసఁగుము. మనము పిల్లలు బందు

గులును గూడి సుఖ ముందము" అని విభీషణుఁడు రావణునితోఁ జెప్పఁగా, రాక్షసాధిపతి యగు రావణుఁడు ఆ మంత్రుల నందఱిని వదలి పెట్టి యింటిలోపలికిఁ బోయి చేరెను.

10-వ సర్గము

విభీషణుఁడు రావణునికి హితము బోధించుట.

మఱునాటియుదయమున వీరుఁడును, ఎక్కువ వెలుఁగుగలవాఁడును, శత్రుభయంకరములయిన పనులు చేయువాఁడును నైన విభీషణుఁడు ధర్మార్థములందే తన మనసును నిలిపినవాఁడై, పర్వత శిఖరముల గుమింబోలినదియు, పర్వత శిఖరముమాడ్కి నెత్తయినదియు, చక్కఁగాఁ దీర్చికట్టిన గొప్ప గృహవిభాగము గలదియు, విద్వజ్జనులతోఁ గూడినదియు, ఎక్కువ బుద్ధిమంతులై తనయెడఁ బ్రేమగలవార లగు ప్రధాన మంత్రులతో నొప్పునదియు, ఆప్తులును, కార్యదక్షులును నగు రాక్షసులచే నంతటను జక్కఁగా రక్షింపఁబడినదియు, మదపుటేనుఁగులనిట్టూర్పులచేఁ దిరుగడువడుచుండు గాలిగలిగినదియు, ఉదయకాలమున శంఖభేరీ మృదంగాదివాద్యముల మ్రోఁతలచే నిబిడీకృతమైనదియు, స్త్రీజనముల చేత నిండినదియు, సంభాషణధ్వనులతో నొప్పునదియు, పుటము వేసిన బంగారుతోఁ జేయఁబడిన ద్వారములుగలదియు, శ్రేష్ఠములయిన బంగారపుటలంకారములచే సింగారింపఁబడినదియు, గంధర్వులయు, మరుత్తులయు, నాగులయులోకములమాడ్కి రత్నరాసులతో నిండినదియు నగు తన నగరునందు తన వెలుఁగులను అన్నివైపులఁ బ్రసరింపఁజేయు సూర్యుఁడు గొప్ప మేఘమునందుఁబోలెఁ జొచ్చి, యచ్చట తన యన్నకు విజయ సూచకములుగా వేదవిదు లగు బ్రహ్మరక్షస్సులచేఁ జెప్పఁబడుచుండు పావనములైన పుణ్యాహమంత్రములధ్వనులను విని, పెరుఁగు, నేయి, పుష్పములు, అక్షతలు మొదలగువానిచేఁ బూజితులైన మంత్రబ్రాహ్మణవేత్త లగు ద్విజులను జూచి, పెక్కురాక్షసులచే మ్రొక్కఁబడుచు, తన వెలుఁగుచేఁ దేజరిల్లుచు, సింహాసనమునఁ గూర్చుండియున్న రావణాసురునికి నమస్కరించి, తాను రాజసంప్రదాయములను దెలిసినవాఁడు గనుక, నట్టిసమయములయందుఁ జేయవలసిన రీతిని జయజయవాక్యముల నుచ్చరించి, రావణుఁడు కనుసైగచేఁ

జూపిన పసిఁడిపీఠమునఁ గూర్చుండి, లోకమర్యాద నెఱిఁగినవాఁడును, దేశకాలములకుఁ దగినట్లుగా మాటలాడువాఁడును, లోకములోని మంచి చెడుగుల నెఱిఁగినవాఁడు నైనందునఁ దనయన్నను మంచి మాటలచే సమాధానపఱచికొని యేకతమున మంత్రులసమక్షమున మిగుల మేలొనర్చునదియు, యుక్తులచే నిరూపింపఁబడినదియు నైన మాటను తిన్నగాఁ జెప్పెను.

మహారాజా! వైదేహి నీపురమున కెప్పుడు వచ్చి చేరినదో, యదిమొదలు మనకుఁ బెక్కు దుశ్శకునములు గలుగుచున్నవి. అగ్నిహోత్రములు మంత్రములు చెప్పి వేల్వఁబడియు మిణుఁగురులతోఁ గూడి, పొగతోడి మంటలుగలవై మసఁకగ్రమ్మినట్లు జ్వలించుచున్నవే కాని, చక్కఁగా జ్వలించుట లేదు. అగ్నికుండములందును, అగ్నిహోత్ర శాలలందును, వేదాధ్యయనస్థలములందును, బాములును, చీమలును హోమార్థకమైన పదార్థములందు ప్రాకులాడుచున్నవి. ఆవులకుఁ బాలెండిపోవుచున్నవి. శూరుల యేనుఁగులకు మదం బుడుగుచున్నది. గుఱ్ఱములు దీనముగా సకిలించుచు యాహారమునం దపేక్ష మానియున్నవి. రాక్షసాధిపా! మనయొక్క ఖరములు, ఒంటెలు, వేసడములు రోమములు రాలఁ గన్నీరు గార్చుచు వైద్యులచేఁ దగు చికిత్సలు చేయఁబడినను, ఎప్పటియట్లు కాకయున్నవి. కాకులు విమానములపై గుంపులుగూడి శ్రవణకఠోరముగాఁ గూయుచున్నవి. ఉదయాస్తమయములందు గ్రద్దలు పట్టణమునకుఁ బైనఁ బిండులుగట్టి నిలుచుచున్నవి. నక్కలును గుంపులుగూడి యమంగళముగాఁ గూయుచున్నవి. పట్టణద్వారములందు వ్యాఘ్రాదులగు క్రూరమృగములు పిడుఁగులు మ్రోఁగునట్లు విస్తారముగా నఱచు నఱపులు వినవచ్చుచున్నవి. కావున నిప్పు డట్టి దుష్టారిష్టశాంతికై ప్రాయశ్చిత్తము చేయుట యుక్తముగా నున్నది. అట్టి ప్రాయశ్చిత్త మెద్ది యనిన, ఇప్పుడు రాఘవునికి సీత నొసఁగుటయే. రాక్షసాధిరాజా! యీమాట నేను తెలివిలేమివలననో, ప్రాణములమీఁది యాశవలననో చెప్పియున్నను, నీవు దీనియందుఁ దప్పిదము నెంచవలదు. ఈదుశ్శకునాది పీడలు గలుగుట రాక్షసులకును, రాక్షసకాంతలకును, పురమునకును,

అంతఃపురమున కంతటికిని దెలిసియున్నది. అయినను మంత్రులందఱు నీకీ యాలోచన చెప్పుటకు వెఱచి మఱలిపోయిరి. నేను నీమేలు గోరు బంధువును గనుక నే నేది కన్నులారఁ జూచితినో, ఏది వీనులార వింటినో, యది దాఁపక యవశ్యముగాఁ దెలుపవలయును. కావున నీవు నీతిఁదప్పక విషయము నాలోచించి కార్యమును నడపఁదగును." అని రాక్షసశ్రేష్ఠుఁడగు విభీషణుఁడు మంత్రులందఱు వినుచుండఁగాఁ దన యన్నతో న్యాయమార్గము దప్పనిమాటను జెప్పెను.

ఇట్లు విభీషణుఁడు హితముగను, అర్థగౌరవము గలుగునట్లును, తిన్నగాను, సకారణముగాను, భూతభవిష్యద్వర్తమానము లను మూఁడుకాలములకు హితముగాను జెప్పిన యా వాక్యమును విని, వేల్పుమూఁకలగొంగ, ఎక్కువ బలిమిగలవాఁడు, బవరమున నోర్వరాని శౌర్యము గలవాఁడు నైన రావణుఁ డాగ్రహము నొందినవాఁడై మిక్కిలి యాటోపము పూని, "ఓ విభీషణా! నా కెవ్వనివలనను భయము లేదు. రాఘవుఁ డింక సీతను మఱలఁ బొందు ననుమాట వట్టిది. రాముఁ డింద్రుఁడు మున్నగు వేల్పులతోఁ గూడివచ్చినను సమరమున నాముందట నిలువఁజాలఁడు." అని చెప్పి, తనకు మేలగు పలుకులు పలుకునట్టి యా విభీషణునిఁ బంపివైచెను.

11-వ సర్గము

రావణుఁ డాలోచన సేయుటకై సభకుఁ బోవుట

పాపుఁ డగు రావణుండు సీతాదేవియందలి మోహావేశము హెచ్చుఁగా, విభీషణుఁడు మొదలగుమిత్రులు తనకార్యము నామోదింపక సీతను గొనిపోయి రాముని కిమ్మని తొందరపెట్టుటయు, తక్కిన మంత్రులంద ఱా విభీషణుని యభిప్రాయము ననుసరించి యూరకుండుటయు దానికిఁ దోడ్పడఁగా, దాను చేసిన పరదారహరణరూప కార్యము మనస్సును బాధింపఁగా గడువంతచేఁ జిక్కినవాఁడై యా దినము గడపి, మఱునాఁడు యుద్ధ విషయమునుగూర్చి తన మంత్రులతోడ నాలోచింపఁ దలఁచినవాఁడయ్యెను. అట్లు తలఁచి మహారథుఁడగు పదితలలు గలవాఁడయిన యా రావణుండు రత్నములయు పగడములయు నలంకారములుగలదియు, పసిఁడి గవాక్షములు గలదియు, చక్కఁగా

శిక్షింపఁబడిన వారువములు పూన్చినదియు, గమనసమయమున గొప్ప మేఘముమాడ్కి గర్జించునదియు నైన యరదమున ప్రదక్షిణపూర్వకముగానె కొల్వుకూటమునకుఁ దరలెను. కొందఱు రాక్షసభటులు డాలులను ఖడ్గములను ధరించియు, కొందఱు సకలాయుధములను దాల్చియు రావణాసురునికి ముందు నడచిరి. కొందఱు పలుతెఱఁగులైన వికృతంపు వేషములను దాల్చి, యన్ని తెఱఁగులైన తొడవులను దొడుగుకొని యా రావణునిప్రక్కలను, వెనుకను పయనమైరి. అతిరథులు కొందఱు రథములమీఁదను, మఱికొందఱు మదించినమేటి యేనుఁగులమీఁదను, మఱికొందఱు పలువిధములైన గతులచే నడచు గుఱ్ఱములమీఁదను నెక్కియు, కొందఱు కత్తులు గుదియలుచేతఁబట్టుకొనియు, కొందఱు శక్తితోమరములను దాల్చియు, కొందఱు గండ్రగొడ్డళ్లను ధరించియు, కొందఱు మొనవాలులం దాల్చియు నా రావణునివెంబడి నడచిరి. అవ్విధమున నా రావణుండు రాక్షస సమేతుఁడై పోవునపుడు, వేలకొలఁదివాద్యముల మ్రోఁతలును, శంఖనాదములును నలుదెసలఁ గ్రమ్మినవి.

ఆరావణుఁ డెక్కిన గొప్పయరదము చక్రనేములధ్వని దెసలందు మాఱుమ్రోగుచుండఁగా, సకలసంపదలతో వెలుఁగొందు రాజమార్గమునఁ బ్రవేశించెను. మఱియు నారావణుని శిరమునఁ బట్టఁబడిన నిర్మలమగు శ్వేతచ్ఛత్రము నిండుపున్నమచంద్రునిమాడ్కి శోభిల్లెను. బంగారు తీఁగెపని గలవియు, నిర్మల స్ఫటికముమాడ్కిఁ దెల్లనైనట్టి వింజామర లారావణుని యిరుప్రక్కలను ప్రకాశించుచుండినవి. రథారూఢుఁడై రాజమార్గమునఁ బోవునట్టి రాక్షసేంద్రునికిఁ బుడమిని నిలఁబడియున్న రాక్షసు లందఱు సాష్టాంగముగాఁ బ్రణామములు సల్పిరి. అట్లు రాక్షసు లందఱు జయదీవనలు చేయుచుఁ గొనియాడుచుండ, రావణుఁడు తన శరీరశోభచే వెలుఁగుచు, పసిఁడి వెండిస్తంభములు గలదియు, నడిమిభాగమునఁ జలువఱాలు పఱచినదియు, బంగారంపు దుప్పటి పైనఁ బఱవఁ బడినదియు, ఆఱునూఱుల పిశాచములచేఁ గాపాడఁబడునదియు, విశ్వకర్మచే సుందరముగా నిర్మింపఁబడినదియు నైన కొలువుకూటమునఁ జొచ్చి, యందు వైడూర్యములు చెక్కినదియు,

ప్రియక మను జింకయొక్క తోలుచేఁ గప్పఁబడినదియు, దిండు గలదియు నైన యుత్తమసింహాసనమునఁ గూర్చుండెను.

తర్వాత రావణుఁడు వేగముగాఁ బోవఁగల దూతలను బిలిచి, "యిప్పుడు చేయవలసిన గొప్పపని యొక్కటి యున్నది. దాని నెట్లయి నను సాధింప వలయును. మీరు వేగముగాఁ బోయి మనపురమునం గల రాక్షసుల నందఱ వేగఁ దోడ్కొనిరండు" అని యానతి యొసఁగెను. ఆదూతలగు రాక్షసులు తమ ప్రభువునానతి విని, ప్రతి యింటికిఁ జొచ్చి విహరించుతావులందును, పాన్పులందును, పూవుల తోఁటలందును నున్నట్టి రాక్షసుల నందఱిని నిర్భయముగా "దేవర వారు మిమ్ముఁ బిలుచుచున్నారు" అని యందఱినిఁ బురికొల్పి వచ్చిరి. వెంటనే రాక్షసులలోఁ గొందఱు దివ్యరథముల నెక్కియు, మఱి కొందఱు గర్వించిన గుఱ్ఱముల నెక్కియు, వేఱుకొంద ఱేనుఁగుల నెక్కియు, తక్కిన కొందఱు కాలినడకతో నడచియుఁ బోవుచుండ నాపురము రథగజాశ్వములమీఁద వచ్చెడు నారక్కసులతోఁ గూడి, పక్షులగుంపుతోఁ గూడిన యాకసము మాడ్కి వెలుఁగుచుండెను. అట్లు రాక్షసు లాపట్టణమును వెలుఁగఁజేయుచు సభామంటపమునందకు వచ్చి, తమతమ వాహనములనుండి డిగ్గి, సింహములు గిరిగుహలలోపలఁ జొచ్చునట్లు సభయందుఁ బాదచారులై ప్రవేశించి, తమ ప్రభువుయొక్క పాదముల కెఱంగి, యాతనిచే మన్ననలఁ బడసినవారై, కొందఱు పీఠములందును, కొందఱు దర్భాసనములందును, కొందఱు నేల మీఁదను తమతమ మర్యాదలకుఁ దగిన తావులందు రావణునిచేరువఁ గూర్చుండిరి. వారు గాక, కార్యాలోచనలయందు నేర్పరులగు మంత్రులును, సుగుణరాసులు, సర్వజ్ఞులు, బుద్ధిచేఁ జూచువారు నైన అమాత్యులును వారివారిమర్యాదలకుఁ దగినచోట్లఁ గూర్చుండిరి. పెక్కండ్రు శూరులును కార్యమంతయును జక్కఁగా నాలోచించుటకై, బంగారుమయమై మనోహరమై యుండు రావణుని సభయందుఁ గుంపులు గుంపులుగాఁ గూడిరి.

తర్వాత మహాబుద్ధి గలవాఁ డగు కీర్తిమంతుఁడైన విభీషణుఁ డన్ని యంగములందు బంగారుతో నలంకరింపఁ బడినదియు, విశాల

రమ్యమైనదియు నైన యరద మెక్కి తన యన్న యొక్క కొల్వు కూటమునకు వచ్చి తన గోత్రప్రవరలు చెప్పి, తన యన్నపాదములకు మ్రొక్కెను. ఆతనివెంబడి శుకప్రహస్తులు వచ్చి రావణునికి బ్రణమిల్లిరి. వెంటనే రావణుఁ డా ముగ్గురకును వారిమర్యాదలకుఁ దగినట్లు ఆసనముల నొసఁగెను. అపుడు కనకమయనానావిధభూషణముల నలంకరించుకొని, మేటివలువలు గట్టి, సువాసనను గుబాళించు నగరుచందనముఁ బూసికొనిన యారాక్షసులు దాల్చిన పువ్వుల కమ్మని తావులును, గందపుఁ దావులు నంతటఁ బర్వెను. అప్పుడు సభలో నందఱు నిశ్శబ్దముగా నుండిరి. బొంకు లాడరైరి. బిగ్గరగా మాటాడకుండిరి. ఎక్కువ పరాక్రమము గలవారలైన వారందఱు దేవర యానతిచ్చినపని చేయ సిద్ధులై, యెప్పుడు తమయేలిక యేమి యానతిచ్చునో యని యాతని ముఖమునే చూచుచుండిరి. యుద్ధవీరుఁ డగు రావణుఁడు ఆసభనడుమ ధైర్యశాలురును, విలుకాండ్రును, బలవంతులు నైన రాక్షసులనడుమఁ గూర్చుండి, వసువుల నడుమఁ గూర్చున్న వజ్రహస్తుఁడైన దేవేంద్రునిమాడ్కిఁ బ్రకాశించుచుండెను.

12-వ సర్గము

రావణకుంభకర్ణుల సంవాదము

యుద్ధమునఁ బగతురను గెల్చువాఁ డయిన రావణుఁ డప్పుడు సేనంతయుఁ బరికించి సేనానాయకుఁ డగు ప్రహస్తునిఁ గాంచి, "సేనాధిపా! రథికులు, అధోరణులు, గుఱ్ఱపురౌతులు, కాలిబంటులు నను నాలుగు తెగలగు బంటులును పట్టణమును గాపాడుటయందుఁ గడు జాగ్రత్తతో నుండునట్లుత్తరువు చేయుము" అని యానతియ్యఁగా, వినయము గల యా ప్రహస్తుఁడు రాజునాజ్ఞ చేయఁ గోరినవాఁడై, రాచనగరునకు లోపటను వెలుపటను సేన నంతయు నిలిపి, నగరరక్షణమునకయి వేరుగా సేనను నిలిపి వచ్చి రాజసముఖమునఁ గూర్చుండి, "రాక్షసాధిపా! పట్టణము లోపలను వెలుపటను సేనను నిలిపితిని. ఇఁక నీ కేమి చేయవలె నని కోరిక యున్నదో, ఆకార్యమును మెలఁకువతోఁ జేయుము" అని రావణునితోఁ జెప్పెను.

రాజ్యమునకు మేలు సేయఁ గోరునట్టి రాక్షసుల కధిపుఁ డయిన యారావణుఁడు ప్రహస్తుని మాట విని, సుఖమును బొందఁ గోరిన వాఁడై, తన యాప్తులందఱు వినుచుండఁగా ని ట్లనియె: ధర్మార్థ కామములవిషయమైన చిక్కులు వచ్చినప్పుడు, అందలి యిష్టానిష్టములను, సుఖదుఃఖములను, లాభనష్టములను, మేలుకీళ్లను దెలుపఁదగినవారు మీరు. మీతో నింతకు ముందు ఆలోచనచేసి చేయఁబూనిన నాకార్యములన్నియు నెప్పుడును జెడిపోయినవి లేదు. చంద్రసూర్య నక్షత్రాదు లగు వేల్పులతోఁ గూడిన దేవేంద్రుఁడునుం బోలె నేనును మీతోడ్పాటునఁ గలిమిని బొందఁగలను. నే నింతకు ముందే మీ కంద ఱకు నాతలఁచిన యభిప్రాయమును దెలిపియున్నాను గాని, కుంభకర్ణుండు నిద్దురపోవుచున్నందున నితని కీ సంగతి వినిపింపనైతిని. ఇతఁ డాఱు నెలలు నిద్రపోయి యిప్పుడే మేలుకొని వచ్చినవాఁడు. ఇతఁడు విలు కాండ్రందఱిలోపల ముఖ్యుఁడు. అట్టి కుంభకర్ణుఁడు వినుచుండ నీ విషయము మఱలఁ జెప్పవలయును.

రాముని యనుఁగుఁబట్టపుదేవి యయిన యీ జానకిని రక్కసులు చరించుచున్న దండకారణ్యమునుండి తెచ్చితిని. ఈ మందగామిని నన్ను వలవకున్నది. ఈ సీతాదేవిం బోలునట్టి మగువ ముల్లోకములందును మఱియొక్కతె లేదు. సన్ననినడుమును, గొప్పపిఱుఁదులును, శరత్కాల చంద్రుని, బోలు మోమును గలదై, బంగరుబొమ్మ యనఁ బరఁగి, మయునిచే సృజింపఁబడిన మాయయో యని చెప్పఁదగినదై, ఎఱ్ఱనైన గోళ్లును, అఱగాళ్లును గలిగి చక్కఁగాఁ గుదిరియున్న మృదుపాద ములు, ఉన్నత నాసికతోను, విశాలనేత్రములతోఁ గూడి సుందరమై యున్న మోమును గలదై, హవిస్సులతోఁ గూడిన యగ్నిహోత్రుని జ్వాలకై వడియు, సూర్యునికాంతివలెను వెలుఁగునదియై యున్న యా సీతాదేవిని గాంచఁగా, క్రోధహర్షములం దొక్కటెతీరున నుండు వాఁడును, విన్నదనమును, వ్యసనతాపములను గలుగఁజేయువాఁడును నయిన మదనుండు నన్ను లోఁబఱచుకొని, కలవర పెట్టుచున్నాఁడు. దీర్ఘనయనయగు నాసీత తన పెనిమిటివచ్చి తన్నుఁ బిల్చుకొని పోవునేమో యని తనమగని రాక కెదురుచూచుచు నొక్క యేఁడు గడు వడిగెను.

సీత పిదప నైనను నన్నుఁ గోరక పోవునా యని యెంచి యాచారు నేత్రయగు సీత యడిగిన మాట కొప్పుకొంటిని. దారినడచినగుఱ్ఱము మాడ్కి నేను మరునిబాధయందుఁ జిక్కి యలసియున్నాను. కలఁత పెట్టరానిదై పెక్కు జలజంతువులతో నిండిన సముద్రమును ఆ వానరులుగాని, ఆ దశరథతనయులుగాని యెట్లు దాఁటఁగలరు? అయినను అట్లు తలఁచుట యుక్తముగాదు. ఒక్కవానరుఁడే లంకలో నింతపని చేసినప్పుడు వా రంద ఱెంతటిపని చేయుదురో! కార్యగతులు దెలియఁ దగినవికావు. కావున నిప్పుడు మీ కేమాట యుక్త మని తోఁచునో, యామాటను దెలుపుఁడు. నాకు మానవజాతివలన భయమను మాట లేదు. అయినను దైవమాయ నమ్మరాదు. తొల్లి మీసాయమును గొని దేవాసురులను గెలిచితిని. అప్పుడు మీరును తోడ్పడితిరి. ఆ రాజ పుత్రులు సీతయొక్క పోఁబడి నెఱిఁగినవారలయి సుగ్రీవుఁడు మున్నగు వానరులను మునుకొని సముద్రపు టావలియొడ్డునకు వచ్చియున్నారు. ఏయుపాయ మొనరించినచో, సీతను రాముని కియ్యకుండవచ్చునో, ఆరామలక్ష్మణు లెట్లు వధ్యులగుదురో యట్టి యుపాయ మొక్కటి మీరు చక్కఁగా నాలోచించి చెప్పవలయును. వానరు లొండె యితరు లొండె సముద్రమునుదాఁటి రాఁజాలరు కావున నాకుఁ దప్పక గెలుపు గలుగుట నిక్కము" అని రావణుఁడు తన మంత్రు లందఱు వినుచుండఁగా జెప్పెను.

మరునిబారిఁ దగిలిన రావణుఁడు పెట్టుకొన్న మొఱ నాలకించి, కుంభకర్ణుఁడు కట్టలుక పూని యిట్లనెను: "మహారాజా! యెప్పుడు రామ లక్ష్మణు లిద్ద ఱుండఁగా, వారిని గనుమూసి సీతను దెచ్చితివో, అప్పుడే మాతో నాలోచించి కార్యనిశ్చయము చేసికొని సీతను దెచ్చి యుండు వేని, యమునానది యామున పర్వతము నొందునట్లు నీమనస్సుగూడ నిశ్చలమై యుండెడిది. ఇప్పుడు గడచినదానికిఁ జింతించి యుపయోగ మేమి? మహారాజా! ఈపని దలపెట్టుట కారంభించునప్పుడే మాతోఁ గలిసి యాలోచించి యుండువేని, యీ నీపని యంతయుఁ జక్కఁగా నుండియుండును. పంక్తికంఠుఁడా! న్యాయమార్గము నవలంబించి,

కార్యముఁ జేయువాఁడు కార్యనిర్ణయము చేసికొన్నవాఁడు గనుక, వెనుకఁ బశ్చాత్తాపము నొందఁడు. మంచి పనులైనను నేర్పుచాలక చేయఁబడినయెడల నట్టి పనులు పనికిరాని వగుటయే కాక, యశుచి పాత్రములందుఁ బెట్టఁబడిన యన్నమువలె హానిని గలిగించుచున్నవి. ముందు చేయవలసిన పనులను వెనుకఁ జేయువాఁడును, వెనుకఁ జేయవలసిన పనులను ముందు చేయువాఁడును మంచిచెడ్డల నెఱుఁగనివారని చెప్పఁబడుదురు. కార్యములపట్లఁ జపలుని కెక్కువ బల మున్నను, పగతురు సందు గనిపెట్టియుండి, వాఁ డేమఱుపాటున నున్నప్పుడు, పక్షులు దాఁటరాని క్రౌంచపర్వతమును రంధ్రమున దూఱిదాటునట్లు వాని నోడింతురు. నీ వాలోచించక యీ గొప్పకార్యము దలపెట్టితివి. రాముఁడు ని న్నిదివఱకే రూపుమాపియుండును. అదృష్టవశమునం జేసి, రాముఁడు విషముగలిసిన మాంసమును విడుచునట్లు నిన్నుఁ జంపక విడిచిపెట్టి యున్నవాఁడు. కావున నీ వారంభించిన యీ కార్యము సవరింప నొరులకు సాధ్యము గాదు గనుక నేను నీ శత్రువుల నందఱను బరిమార్చి సవరించెదను. నీతోఁ బోరుటకు ఇంద్రసూర్యులు, అగ్ని వాయువులు, కుబేరవరుణులు వచ్చినను, వారి నందఱిని వధించెదను. పర్వతముమాడ్కి నెత్తయిన శరీరముగలవాఁడను, గొప్పయిరుపగుది యనుబట్టి యుద్ధము చేయువాఁడను, గొప్పకోఱలు గలవాఁడను నైన నేను యుద్ధరంగమున నొక్కయఱపు ఱఱచితినేని, పురందరుఁడును కలగుండు వడిపోవును. రాముఁ డొక్క యమ్మునేసి రెండవ యమ్మును వేయునంతలోపల నాతనిహృదయము ప్రచ్చి నల్ల ద్రావుదును. నిక్కము నామాట. నీవు దిగులు పాయుము. దాశరథివధ మొనర్చి నీకు సుఖావహమయిన జయమును గలిగింపఁ బ్రయత్నించెదను. రామలక్ష్మణులను వధించి, కోఁతుల గుంపులలో మేటుల నందఱిని భక్షించెదను. రావణా! నీవు చింతమాని, కమ్మనిమద్యము ద్రావి, యథేచ్ఛగా విహరింపుచు, స్వహిత కార్యములను జేయుచుండుము. నేను రాముని యమపురికిఁ బంపఁగా, వెంటనే సీత నీ కధీనురాలు గాఁగలదు" అని కుంభకర్ణుఁడు రావణుని ధైర్యపుఁ బలుకులచే శాంతపఱచెను.

13-వ సర్గము

మహాపార్శ్వరావణులసంభాషణము

రావణుఁడు కోపముతో నున్నాఁడని మహాపార్శ్వుఁ డెఱిఁగిన వాఁడై క్షణము యోచించి, చేతులు జోడించి యిట్లనియె: "తేనెద్రాగవలె ననుకోరికతో వనమున కేఁగి, యచ్చటఁ గ్రూరమృగములు, సర్పములు నుండుట చూచి భయపడి తేనెద్రాగక మరలిపోయినవాఁడు మూర్ఖుఁ డనఁబడును. శత్రువుల నణఁచువాఁడా! నీవు సకలలోకములకు నీశ్వరుఁడవు; నీ కీశ్వరుఁ డొక్కఁడు గలఁడే? నీవు శత్రువులతలపయిఁ గాళ్లుంచి వారి నదిమిత్రొక్కి వైదేహితో రమింపుము. మీఱిన బలిమి గలవాఁడా! సీత నిన్నుఁ గోరదేని, నీవే కుక్కుటముపగిది నాసీతను బట్టి బలాత్కారముగా సుఖముల ననుభవించి సంతసింపుము. నీకోరిక యీడేఱినవెనుక నీకెట్టిభయము వచ్చినను, లేక, రాఁబోవునదిగా నున్నను, నీవు వానినుండి తప్పించుకొనఁగలవు. మహాబలు లగు కుంభకర్ణేంద్రజిత్తు లిరువురు మాత్రమే మా తోడ్పాటుతో వజ్రాయుధము చేతఁ బట్టి వచ్చిన దేవేంద్రుని నైనను నడ్డగింపఁ జాలుదురు. యుద్ధమునందు నేర్పుచాలనివారు బ్రతిమాలుటయు, దానముచేయుటయు, విరోధము పుట్టించుటయు సాధనములుగా నెంతురు. నీవు వాని నన్నిటిని దొఱఁగి దండోపాయమునే కార్యములపట్ల జూపఁ గడంగుము. ఓ మహాబలా! ఇచ్చటికి వచ్చిన నీ శత్రువుల నందఱిని మా యాయుధముల బలముచేత నీకు లోఁబడఁజేసెదము. దీనికి సందియము లేదు." అని మహాపార్శ్వుఁడు చెప్పఁగా, రావణుఁ డాతని మాటను మిక్కిలి గారవించుచు నతనితో నిట్లనియె: "మహాపార్శ్వా! బహుకాలమునకు మునుపు జరిగిన నావిషయమైన రహస్యమొక్కటి గలదు. దానిని వినిపించెదను. తొల్లియొకప్పుడు అగ్నిజ్వాలమాడ్కి వెలుఁగునట్టి పుంజికస్థల యను నచ్చర బ్రహ్మ సభకుఁ బోవుచు, నన్నుఁజూచి, మఱుఁగు ప్రదేశములందు డాగిడాగి పోవుచుండఁగా, నేను దానిఁ జూచి యప్పుడు బలాత్కారముగాఁ బట్టి యీడ్చుకొనివచ్చి, దానితో రమించి కోకయూడఁదీసికొని పంపితిని. అంత నాయప్సరస గాలికిఁ గదలిన తామరతీఁగమాడ్కిఁ గడగడవణఁకుచు బ్రహ్మలోకమునకుఁ బోయెను.

మహాత్ముఁడయిన యా బ్రహ్మదేవుని కప్పుడా విషయము దెలియవచ్చె నని తలఁచెదను.

అంత బ్రహ్మదేవుఁ డాగ్రహము పూని, "ఓరావణా! నీ విఁక మీఁద నేనాతినైనను బలాత్కారముగాఁ బట్టి రమింతువేని నీశిరము నూఱువ్రయ్యలు గాఁగలదు. దీనికి సందియము లేదు" అని శపియించెను. ఓ మహాపార్శ్వా! బ్రహ్మదేవుని యీ శాపమునకు వెఱచియే నేను బలాత్కారముగా నాసీతను నా సుందరశయనము నెక్కించుకొన కున్నాను. ఆరామునికి సముద్రమునుంబోలిన నా వేగమును, వాయువును బోలి నాగమనమును దెలియదు. కావుననే యా రాముఁడు నాపైకి వచ్చుచున్నాఁడు. ఆరాముఁడు కొండ గవిలోన నిద్దురించుచున్న సింగమును బోలెను, కోపముతో మండుచున్న యమునిం బోలెను నున్న నన్ను లేపఁ గోరుచున్నాఁడు. సంగరమున నేను ప్రయోగించు సర్ప ములం బోలిన వాఁడిబాణముల చుఱుకుఁదనమును రాముఁ డెఱిఁగిన వాఁడు కాఁడు. కాఁబట్టియే, రాముఁడు నాపైకిఁ గవియుచున్నాఁడు. నేను వింటినుండి వజ్రాయుధమునుంబోలు కఱకుటమ్ములం బెక్కింటిని ప్రయోగించి, కొఱవికట్టెలతో నేనుఁగును జ్వలింపఁ జేయునట్లు రాముని దహించెదను. సూర్యుఁ డుదయించుచు నక్షత్రముల వెలుఁగును లాగు కొనునట్లు, నాయపారబలముచే నీరామునిబలిమిని లోగొనెదను.యుద్ధము నందు వేయికన్నులవాఁ డయిన దేవేంద్రుఁడు గాని, వరుణుఁడుగాని నా బలము నడ్డగింపఁ జాలరు. తొల్లి కుబేరుఁడు పాలించిన యీ లంకా పురమును నా బాహుబలముచేత జయించితిని." అని రావణుఁడు మహా పార్శ్వునితోఁ జెప్పెను.

14-వ సర్గము

విభీషణుని యుపదేశము

రాక్షసేంద్రునిమాటను, కుంభకర్ణునిఱొప్పుటలను విని రాక్షస రాజేంద్రునిఁ జూచి విభీషణుఁడు హితమును అర్థవంతము నైన పలుకు పలికెను.

రాక్షసేంద్రా! సీత యనునది మానవకాంత గాదు. అది యొక్క గొప్పత్రాఁచు. ఆ సీతామహాసర్పమునకు ఱొమ్మే పడఁగ. వ్యసనమే

విషము. చిఱునగవే వాఁడికోఱలు. అయిదువ్రేళ్లే అయిదుతలలు. ఇట్టి సితామహాసర్పము నెందుకై కోరితివి. కోఱలును గోళ్లును నాయుధములుగా నుపయోగించెడి పర్వతశిఖరములం బోలినవానరు లెంతవఱకు లంకాపురమునకు వచ్చులోపల రామునికి సీతను దీసికొనిపోయి యిమ్ము. వజ్రాయుధము బోలునవియు, వాయువేగము గలవియు నైన రాముఁడు ప్రయోగించినబాణములు రాక్షసవీరులప్రాణములను గొనుటకుముందే సీతాదేవిని రామున కర్పింపుము. ఓప్రహస్తా! ప్రాణములను దీయునవి, పిడుగువంటి వేగముగలవియునైన రాముఁడు ప్రయోగించిన బాణములు నీమేనిలోపలఁ జొచ్చునంతవఱకు నీవిట్లు వదరుచుందువు. కుంభకర్ణేంద్రజిత్తులును, రావణుఁడును, మహాపార్శ్వ మహోదరులును, నికుంభకుంభులును, అతికాయుఁడును ఆరామునిముందట నిలఁబడఁజాలరు. ఓప్రహస్తా! నీవు రాము నెదిరించి సూర్యుని శరణుచొచ్చినను, వేల్పులందఱిని శరణుచొచ్చినను, ఇంద్రునితోడ మీఁదఁ గూర్చున్నను, యముని శరణుచొచ్చినను, పాతాళమునుగాని ఆకాశమునుగాని ప్రవేశించినను, నీవు రామునిబాణములనుండి తప్పించుకొనఁ జాలవు.

అని విభీషణుఁడు చెప్పఁగా, ప్రహస్తుఁ డిట్లనెను. ఓ విభీషణా! మాకు దేవదానవులవలనఁ గాని, మఱియెవ్వరివలనఁగాని భయమనుమాట లేదు. యక్ష పన్నగ గంధర్వ గరుడులవలనను మాకు భయము లేదు. అట్లుండఁగా రాజపుత్రుఁడయిన మానవుఁడగు రామునివలన మాకెన్నటికేని సంగరమున భయమేల కలుగును? అని ప్రహస్తుఁడు చెప్పిన చేటుమాటలు విని, రాజు మేలుగోరెడి మహాధీరుఁడైన విభీషణుఁడు ధర్మ అర్థ కామములను మూఁటిని జక్కఁగాఁ బరికించినవాఁడై మఱలనిట్లనియె.

"ఓప్రహస్తా! మన ప్రభువును, మహోదరుఁడును, నీవును, కుంభకర్ణుఁడును ఆ రామునిఁగూర్చి యేమి చెప్పుచున్నారో, ఆసంగతి యంతయు ధర్మమునందుఁ దలంపు లేనివానికి స్వర్గమును గూర్చి పోవుట యెట్లు వీలు కాదో, అట్లు సాధ్యమయినది కాదు. తెప్పకొయ్యయైన లేనివానికి గొప్పకడలిని దాఁటుట యెంత దుస్తరమో, అట్లు కార్య

నిపుణుఁడైన రాముని వధించుట నీకుఁ గాని, నాకుఁ గాని, సకలరాక్షసులకుఁ గాని వీలగు సంగతి గాదు. ధర్మమునే ముఖ్యముగా నెంచినవాఁడును, మహారథుఁడును, ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవాఁడును, కార్యసమర్థుఁడును నైన యట్టి రాముని కార్యములను జూచి వేల్పులందఱు విస్మయముఁ జెందుదురు.

ఓ ప్రహస్తా! వాఁడిమి గలవియు, వంగినవియు, కంకపత్రములు గట్టినవియు, నైన రాముఁడు ప్రయోగించెడి యోర్వరాని బాణములు నీ హృదయమును జీల్చి లోపలఁ జొచ్చునంతవఱకు నీ విట్లు వదరుదువు. యుద్ధరంగమున దేవేంద్రునితోఁ దుల్యుఁ డగు రాముని నెదిరించుటకు రావణుఁడు సమర్థుఁడు గాఁడు. ఎక్కువబలిమిగల త్రిశీర్షుఁడును సమర్థుఁడు కాఁడు. కుంభకర్ణుఁడును సమర్థుఁడు గాఁడు. వానికొడుకును సమర్థుఁడు కాఁడు. ఇంద్రజిత్తును, నీవును కారు, మఱియు దేవాంతక, నరాంతక, అతికాయ, అతిరథులును, పర్వతముమాడ్కి నెక్కువ బలిమి గలవాఁడయిన యకంపనుఁడును ఆ రాఘవునిముందట నిలువఁజాలరు. బాగుగా యోచింపక పనిచేయువాఁడు, స్వభావక్రూరుండు, సప్తవ్యసనములలోఁ జిక్కినవాఁడును నైన యీ మనప్రభువు రాక్షసనాశమునకై శత్రువులం బోలిన మీయట్టి మంత్రులతో నాలోచించుచున్నాఁడు.

ఓ ప్రహస్తాదులారా! గొప్పమేను గలదై, భయంకర మైయున్న బలిమి గల రామద్వేష మను మహాసర్పముచే బలాత్కారముగాఁ జుట్టఁబడిన యీ రాక్షసరాజును మీరు విడిపింప వలయును. రాజు చెడ్డదారికిఁ బోవుచుండు నేని, సకలకోరికలు బడసిన యతని చెలికాండ్రు, భయంకర బలముగల భూతములు మనుష్యునివలె రాజుజుట్టు శత్రువులచేతికి దొరకించుకొనక పూర్వమే తొలఁగించి రక్షించుట యుక్తము. మంత్రులారా! ఈ రావణుఁడు విశేషబలముగలిగిన లక్ష్మణుఁడును సముద్రమున మునిఁగి, రాముఁ డనెడి పాతాళముఖమునఁ బడనున్నాఁడు. అతనిని మీరందఱు నేకమయి కాపాడవలయును. నా మనస్సునకు నొక్కయభిప్రాయము తోఁచినది. ఈ పట్టణమువారికిని రావణునికిని, తక్కిన రాక్షసమంత్రులకును హితమైనదియై మేలు గలిగించునట్టి యా నాయభిప్రాయమును జెప్పెదను. అదియెద్ది యనిన, సీత నామె భర్త యగు రాజపుత్రుఁ డయిన

రాముని కిచ్చుటయె. మంత్రి యగువాఁడు తన బలమును ఎదిరి బలమును, పగతురస్థానక్షయవృద్ధులను తన స్థానక్షయవృద్ధులను గనిపెట్టి బుద్ధిని జక్కఁగా వినియోగించి న్యాయ్యమును, స్వామికి హితమునునైన మాట చెప్పవలెను." అని విభీషణుఁడు రావణుఁడు వినుచుండఁ బ్రహస్తునితోఁ జెప్పెను.

15-వ సర్గము

ఇంద్రజిత్తు విభీషణుల సంవాదము

బుద్ధియందు దేవగురు వగు బృహస్పతిం బోలునట్టి యా విభీషణునిమాటను సావధానముగా మహాధైర్యశాలి యగు రాక్షస యోధులలో శ్రేష్ఠుఁ డయిన యింద్రజిత్తు విన్నవాఁడై, యా విభీషణునితో ని ట్లనియె. "ఓ చిన్నాయనా! నీ వాడినమాట నిరుపయోగముగాను, కడుఁ బిఱికితనముం దెల్పునదిగాను నున్నది. ఈ మన పులస్త్యవంశమునఁ బుట్టినవాఁడు గూడ నిట్టి పిఱికిమాట చెప్పను జెప్పఁడు. ఇట్టిపనిని జేయను జేయఁడు. తండ్రీ! ఈ మన పులస్త్యవంశమునఁ బుట్టిన వారిలో పినతండ్రి యగు నీవిభీషణుఁడొక్కఁడే సత్త్వము, వీర్యము, పరాక్రమము, శౌర్యము, ధైర్యము, కాంతి యనునవి లేనివాఁ డయి పుట్టినవాడు. పిఱికి చిన్నాయనా! మనలోఁ జాతితక్కువవాఁడేనియు నా రాజపుత్రుల నిద్దఱిని రణరంగమున నణఁచఁ గలఁడు. అట్లుండఁగా, నీ వేల మమ్ము నందఱిని బెదరించుచున్నావు. ఓ చిన్నాయనా! ముల్లోకములకు నేలికయు, వేల్పులఱేఁడునైన యింద్రుని భూలోకమునఁ బడఁద్రోసితిని. దేవత లందఱు వెఱచి, మూలమూలలకుఁ బఱుగిడిపోయిరి. నేను యింద్రుని వాహనమైన యైరావతమును ద్రోయఁగా నది వికారముగా నార్చుచు నేలగూలినది. అంత దాని దంతములను బలవంతముగాఁ బీకి దేవతల నందఱను మిక్కిలి వెఱపించితిని. నేను దేవతలకైనను పొగరడఁగఁజేసినవాఁడను. దైత్యశ్రేష్ఠులకైనను శోకము. ఇట్టి యెక్కువ పరాక్రమముగల నేను సామాన్యమనుష్యమాత్రు లైన యీ రామ లక్ష్మణులను ఎట్లు జయింపఁ జాలక పోవుదును ?

అని యెక్కువ పరాక్రమము గలవాఁడును విక్రమమున నింద్ర తుల్యుఁడును, శత్రువులకు లొంగనివాఁడును నైన యింద్రజిత్తు చెప్పిన

మాటను విలుకాండ్రలో మేటియగు విభీషణుఁ డాలకించి, యావల గొప్ప యర్థము గల మాటను బదు లిచ్చెను. ఓరీ నాయనా! నీ కాలో చనశక్తి లేదు. నీ విప్పటికిని బిన్నవాఁడవు. నీబుద్ధి యింకను వికసింపలేదు. కాఁబట్టియే నీవు తనచేటుకై పనికిమాలిన మాటలను విశేషముగా వదరితివి. ఓరీ! నీవు రావణునికిఁ గొమరుండ వనుటయేకాని యితనికి మిత్రశత్రువవు. అట్లు నీవు హితశత్రుఁడవు గావేని, యీ నీతండ్రికిఁ దప్పక రామునివలనఁ జేటు వచ్చు నని యెఱిఁగియుండియు దాని నియ్యకొందువా? కావునఁ దండ్రివధమునకు నియ్యకొనిన తెలివిలేని నిన్నే మొదట పొలియింపవలెను. మఱియు పసివాఁడవును, సాహసము చేయువాఁడవు నైన నిన్నెవ్వఁ డీ మంత్రులసమక్షమునకుఁ బిలుచుకొని వచ్చెనో వానిని గూడఁ జంపవలయును. ఓరీ ఇంద్రజిత్తూ! నీవు అవివేకివి; అహంకారివి; అడఁకువ లేనివాఁడవు; క్రూరస్వభావుఁడవు; బుద్ధిహీనుఁడవు; చెడుతలంపు గలవాఁడవు. మొఱకువాఁడవు. కాఁబట్టియే నీవు పసి తనంబునంజేసి యోచనలేక చెప్పుచున్నాఁడవు. యుద్ధరంగమున, బ్రహ్మ దండమును బోలినవియు, మంటలతోఁగూడ వెలువడునవియు, మృత్యు సమానములును, యమదండములు బోలినవియు నైన యారాముఁడు ప్రయోగించు బాణముల పాటున కెవ్వఁ డోర్చుకొనఁగలఁడు? కావున, మన మిప్పుడు ప్రభూ! ధనకనకభూషణములను, దివ్యవస్త్రములను, చిత్రము లైన రత్నములను గైకొని సీతాదేవిని దోడ్కొనిపోయి యారాఘవునికి సమర్పించి యతని క్షమాపణ వడసివచ్చి, దుఃఖరహితులమై యుందము." అని విభీషణుఁడు రావణునితోఁ జెప్పెను.

16-వ సర్గము

రావణుఁడు విభీషణుని దూఱుట

అవ్విధమున మనస్సునఁ జక్కఁగా నాఁటునట్లు విభీషణుఁడు చెప్పిన హితవాక్యమును విని, రావణుఁడు మృత్యువు పురికొల్పఁగా, విభీషణునితోఁ బరుసని మాటల నిట్లనెను: "ఓ విభీషణా! శత్రువు తోను, కోపము వచ్చిన సర్పముతోను గూడ నుండవచ్చును గాని, స్నేహితుఁ డని పైకి వేషము వేసికొని శత్రుసేవ సేయుచుండు వాని తోడ నుండరాదు. ఓ రాక్షసుఁడా! లోకమంతటిలో నుండు

దాయాదుల స్వభావ మిట్టిదని నాకు తెలియును. దాయాదు లెల్లప్పుడు తమ దాయాదులకుఁ గష్టము వచ్చినప్పుడు సంతోషమును బొందుదురు. ఓరీ రాక్షసా! దాయాదులు దమలోఁ గొంచెము పేరెత్తినవానిని, కార్యసాధకుని, పండితుని, న్యాయప్రవర్తన గలవానిని, శూరుఁడైన వాని నవమానింతురు. అంతటితో నిలువక వానిమాటలను సైతము తిరస్కరింతురు. దాయాదు లెల్లప్పు డొండొరులమీఁదఁ జెలిమి గల వారైనట్లు నటించుచు, వారు కష్టములలోఁ జిక్కుకొన్నప్పుడు ద్రోహము చేయఁ దలంచుచు, భయంకరులై మనస్సును వెలిపఱపక లోపలనే యాలోచించుచు మనసులో నొక్కటి యుంచుకొని పైకొకటి చెప్పుచుందురు. కావున వా రెప్పటికైనను ద్రోహము చేయుదురు గనుక, వారి నెప్పటికిని నమ్మరాదు. తొల్లి యొకప్పుడు పద్మవన మను నొక యరణ్యమున నేనుఁగులు తమ్ముఁ బట్టుటకై త్రాళ్లు చేతఁ బట్టి కొని వచ్చిన మానవులను జూచి, కొన్ని శ్లోకంబులు చెప్పినవి. వానిని వినిపించెద నాలకింపుము. "మన కగ్ని కాని, యిత రాయుధములుగాని, త్రాళ్లు గాని భీకరంబులు గావు. మఱి, భయంకరములై తమ కార్యములందుఁ బ్రోత్సాహపఱపఁబడిన మన జాతియేనుఁగులే మనకు భీతిని గలిగించుచున్నవి. ఈ మన జాతియేనుఁగులే వారికి మనలఁ బట్టు నుపాయమును బోధించుచున్నవి. ఇది నిక్కము. అన్ని భయములకంటె దాయాదునివలన భయము కడుఁ జెడ్డది యను వాక్యము గడుఁ బ్రసిద్ధి కెక్కినది. గోవులందుఁ గలిమి యున్నది. బ్రాహ్మణునియం దోర్పున్నది. స్త్రీలయందుఁ జాపల్య మున్నది. అట్లే దాయాదులవలన దీరనిభయం బున్నది." అందువలన "ఓరి నాయనా! నే నిట్లు సకలలోకజనముల మర్యాదకుఁ బాత్రుఁడనై కలిమిని బొంది, దాయాదులయందఱి నెత్తిన నున్నా ననుటచే నీకుఁ గడుపుమంట పుట్టుచున్నదా? తామరాకులమీఁదఁ బడిన నీటిబిందువులు ఆయాకుల కంటుకొననట్లు, దుష్టులతో నెంత సహవాసము చేసినను, వారు దానిని లక్ష్యపెట్టక కలియక యుందురు. ఎట్లు తుమ్మెద పూఁదేనె గ్రోలుటకై, యాసతో నొక్క పూవునందు వాలి తేనెను గ్రోలి, యావల నచ్చట నుండక లేచిపోవునో, యట్లు నీవును నావద్దనుండి సకల సుఖ

ముల ననుభవించి, యిప్పుడు నన్ను వదలిపోవఁ దలఁచితివి. కావున దుర్జనులయందు స్నేహమును బాటింపరాదు. ఏనుఁగు మొదట నీట దిగి స్నానము సేసి, పిదపఁ దన తొండముతో దుమ్ము నెత్తి నెత్తిన కొట్టు కొనునట్లు, దుర్జనులు మొదట ప్రాణస్నేహితులవలె నుండి, కడపట నట్టి స్నేహమునకు విఘాత మొనరింతురు. శరదృతువునందు మేఘము వర్షించుదానికై వడి నుఱుము లుఱిమినను నేల దడియనట్లు, దుష్టులతో నెంత చెలిమి చేసినను, వా రుపకారము చేయునట్లు నటించుటయే కాని, వా రుపకారము చేయరు. ఓరి నిశాచరా! మఱియొక్కఁ డిట్టి మాట చెప్పి యుండు నేని, వాఁ డింతసేపటికిఁ బ్రాణములతో నుండి యుండునా? ఛీ! ఛీ! కులమునకుఁ జెఱుపనచేట యైన నీవు నాయెదుట నుండకుము. ఆవలికిఁ బొమ్ము." అని రావణుఁడు తనకు హితముఁ జెప్పిన యా విభీషణుని నిందించెను.

రావణుం డిట్లు పరుసని మాటలం జెప్పఁగా, న్యాయము మాటాడువాఁ డగు విభీషణుఁడు గదను జేతఁ బట్టుకొని, తనమంత్రు లగు నలువురు రాక్షసులతోడఁ బై కెగిరెను. విభీషణుఁ డట్లెగిరి, కినుక పూనినవాఁడై, దుష్టసహవాసము వదలి సజ్జనసహవాసము గోరు వాఁ డగుటచే నంతరిక్షముననే వెలుఁగుచుఁ దన యన్నయైన రాక్ష సాధిపుఁ డగు రావణునిఁ జూచి, "ప్రభూ! నీవు నా కన్నవు. నీ కేమి దోఁచిన నదియంతయుఁ జెప్పుము. నీవు పెద్దవాఁడవు గనుక నీ వేమి చెప్పినను బదులాడను. తండ్రితో సమానుఁడవు. అయినను ధర్మ మార్గముఁ దప్పియున్నావు. నామీఁద లేని దోషము నారోపించి, యట్లు పరుసని మాటలచే దూఱినావు. నీ దూఱును నే నోర్వఁజాలను. ఓ దశాననా! నీమేలు గోరి, నేను నీకు హితవాక్యము పలికితిని. నీవు దానిని బెడచెవిం బెట్టితివి. లోకమున మృత్యుపాశమునకు కట్టువడి నట్టి జనులు తమ మేలుకొఱకుఁ జెప్పిన హితవచనములఁ గైకొనరు. రాక్షసాధిపా! లోకమున నెల్లప్పు డింపుగా మాటాడువారు పెక్కండ్రు దొఱకుదురు. అయినను నప్రియముగా నున్నను హితమైన మాట చెప్పువారు దొఱకుట యరుదు. అట్లు హితవాదులు దొఱకినను, వారి హితవచనములను వినువారు దొఱకుట మఱియు నరుదు. సకల

జంతువులను సంహరించెడి యమపాశముచేఁ గట్టువడి, యిల్లు మండు నట్లు నీవు నశించిపోవ నున్న నిన్నుఁ జూచుటకు నామనం బోర్వఁజాలక యున్నది. రాముఁడు ప్రయోగించునట్టి యగ్నిజ్వాలాసదృశము లయి, వాఁడిమి గలిగి, బంగారున నలంకరింపఁబడిన వైన బాణములకు నీ వెరగా నిన్నుఁ జూచుటకు నామనము గోరక యున్నది. శూరులును, బలవంతులును, అస్త్రవిద్య నేర్చినవారును నై యున్నను, మృత్యుపాశ బద్ధు లగువా రిసుక కట్టలవలెఁ గరఁగిపోవుదురు. నీ వన్నవు గనుక నీమేలు గోరి కొన్ని మాటలు చెప్పితిని. వానిని మన్నింపుము. నీవు సర్వవిధముల నీ ప్రాణములను, ఈలంకాపురమును, రాక్షసులను గాపాడుకొనుము. నీకు మేలగును. నీవు నన్నుఁ బాసి సుఖముండుము. ఇదిగో నేను నిన్ను విడిచి పోవుచున్నాను. ఓ నిశాచరా! నీమేలు గోరి, నీవు చెడ్డపని చేయ వద్దని చెప్పినను, నీకు నామాట రుచింప దయ్యె. మృతసదృశులై యాయుస్సు లేనివారు తమయాప్తులు చెప్పెడి హితవాక్యములను విన నొల్లరు." అని విభీషణుడు రావణునితోఁ జెప్పి యచ్చటనుండి పోవఁ దలఁచెను.

17-వ సర్గము

విభీషణుఁడు శ్రీరాముని శరణుచొచ్చుట

దుష్టుఁడైన రావణునికిఁ దమ్ముఁడగు విభీషణుఁడు తాను జిన్న వాఁడైనను, జ్ఞాని గనుకఁ జెప్పవలసిన హితవాక్యము చెప్పినను, రావణుఁడు దుష్టబుద్ధి గనుక నతనికిఁ దన హితవచనము రుచింపక కఠినముగాఁ దోఁపఁగా, అయినను "సీతాదేవి నొసఁగుము. లేనిచో నీవు సపరివారముగా నశించెద." వని కడపట నిష్ఠురముగాఁ బలికి, దుష్టసంసర్గము గలతావున నుండుట యుక్తము గాదు గాన నట్టివానికడ నుండుటకంటెఁ బరమభాగవతుఁ డయిన లక్ష్మణునితో సమేతుఁడగు శ్రీరాముఁ డున్నచోటికిఁ బోయి చేరుట మేలని తలఁచినవాఁడై, (నిప్పుమీఁద నుండినట్లు, ఆ రావణునిగృహమున నుండఁజాలక, దూడను విడువఁగానే యది చన్నుఁ గుడుచుటకై యెచ్చట నిలువక తన తల్లిదగ్గఱకుఁ జనునట్లు,) పరమపావన మగు లక్ష్మణసమేతుఁడయిన యా శ్రీరాముఁ డుండుతావున కతివేగముతో వచ్చిచేరెను. అట్లు

అనలజ్వాలనుండి చల్లని నీటిలోఁ బడుటకు నతిత్వరతో వచ్చువాఁడును, ఎక్కువ యెత్తును, లావును, రత్నఖచితములైన భూషణముల కాంతియుఁ గల్గియుండుటచే మేరుపర్వతశిఖరముమాడ్కి వెలుఁగువాఁడును, మేరు పర్వతమునకుం బోలె ధైర్యముగలవాఁడును, (ఎక్కువ ప్రకాశముతో నాకాశమునఁ దిరుగుటచేఁ దన్ను శ్రీరామభక్తులగు వానరులు దగ్గఱకు రానిత్తురో, రానియ్యరో, అట్లు వానరులు తన్నుఁ జేరనీయకున్న నావలఁ దనగతి యేమని తలఁచి వెఱపుచే గడగడ వణఁకుచు,) వెలుఁగు చున్న మెఱపుకైవడిఁ బ్రకాశించువాఁడును నైన యా విభీషణుని పుడమి నున్న వానరు లందఱు చూచిరి.

నలుగురు మంత్రులును దానును వచ్చిన యా విభీషణుని, శత్రు వులచే నెదిరింప నలవికానివాఁ డయిన వానరాధిపుఁ డగు సుగ్రీవుఁడు చూచి, తాను బుద్ధిమంతుఁడు గనుక, "తమ బలాబలముల నెఱుఁగుటకై వారు వచ్చుచున్నారో, లేక తమ్ము వధింప వచ్చుచున్నారో" యని వాన రులతోడ ముహూర్తకాలము యోచించినవాఁడై, యా హనుమదాదు లగు వానరులను జూచి, "యితఁ డెవ్వఁడో! రక్కసుఁడు. పెక్కు ఆయుధములు దాల్చి, మఱి నలువురు రాక్షసులను దోడ్కొని మనలను వధింపనే వచ్చుచున్నాఁడు. చూడుఁడు. ఇది నిస్సంశయము." అని చెప్పఁగా నవ్వానరవీరులందఱు చెట్లను, బర్వతములను జేతఁ బట్టుకొని, "ప్రభూ! యీ దురాత్ములను వధించెదము. నీ వానతిమ్ము. ఈ ప్రతాప హీను లగు రాక్షసులు మాచేఁ దన్నులుతిని నీల్గి క్రిందఁబడుదురుగాక!" అని తమయేలిక యగు సుగ్రీవునితోఁ బలికిరి. ఆ వానరు లొండొరు లివ్విధమున మాటాడుకొనుచుండఁగా, నా విభీషణుఁడు సముద్రము యొక్క యుత్తరపుగట్టు నొందినవాఁడై యాకాశముననే నిలఁబడెను. అంత గొప్ప పండితుఁడును, గొప్పవాఁడును నైన విభీషణుఁడు, ఆసుగ్రీ వుని, తక్కిన వానరశ్రేష్ఠుల నందఱిని జూచి, గొప్ప కంఠనాదముతో ని ట్లనెను: ఓ వానరులారా! రావణుఁ డను పేరుగల చెడునడవడిగల రాక్షసాధిపుఁ డయిన యొక రాక్షసుఁడు గలఁడు. నే నతనికిఁ దమ్ముఁడను. నాపేరు విభీషణుఁ డందురు. ఆ రావణుఁడు సీతాదేవిని జనస్థానమునుండి

తెచ్చుచు, దారిలో దన్నడ్డగించిన జటాయువును జంపి లంకకుఁ గొని పోయి, యచ్చటఁ దన యంతఃపురమునుంచి, దిగులుచేఁ జేయునది లేక పరవశురాలై యున్న యా సీతాదేవిని రాక్షసస్త్రీల కాపుదలలో నుంచి యున్నాఁడు. "రావణా! నీ విట్లు సీతాదేవి నుంచుకొనుట సరిగాదు. ఈమెను గొనిపోయి రామున కొసఁగుము. లేనిచో నీకు మాత్రమె కాక లంకాపురమునకే చేటు గలుగును." అని యనేక కారణములను నిరూపించుచు బహుభంగులఁ జెప్పితిని. చావఁబోవువాఁడు దనకు హితమైన మందును దిననట్లు, రావణుఁడు మృత్యుప్రేరితుఁడై నాచెప్పిన హిత వాక్యమును వినఁడయ్యెను. రావణుఁడు నామాట వినకపోవుటయె కాక, నన్నుఁ బరుషభాషణములచే దూఱి, భృత్యునివలె నవమానించెను. కావున నేను భార్యాపుత్రులను గూడ వదలి, శ్రీరాముని శరణుచొచ్చితిని. సకలలోకములకు రక్షణము చేయ సమర్థుఁడును, మహాశక్తిమంతుఁడును, రఘువంశమునఁ బుట్టినవాఁడును నైన శ్రీరామునితో, "విభీషణుండు మీ శరణుగోరి వచ్చియున్నాఁడు అని నన్నుఁగూర్చి వేగముగ విన్నవింపుఁడు" అని సుగ్రీవునితోఁ జెప్పెను.

శీఘ్రగమనుఁ డగు సుగ్రీవుఁడు విభీషణుని మాటను విన్నవాఁడై పోయి లక్ష్మణునియెదుట రామునిఁగూర్చి, కడుఁ బూనికతో ని ట్లనియె: "శ్రీరామా! రావణుని తమ్ముఁడఁట. విభీషణుఁ డను పేరుగలవాఁడఁట. నలువురు రాక్షసులను దోడ్కొని మీశరణము కోరివచ్చియున్నాఁడు. శత్రువులను తపింపఁజేయు యోరామా! వానరులకు క్షేమమును, రాక్షసులకుఁ గీడును గలుగునట్లు, చేయవలసిన పనినిగూర్చి యాలోచించుట, సేనలను నిల్పుట, ఉపాయములు పన్నుట, వేగుల నంపుట యను కార్యములందు జాగ్రత గలిగియుండవలయును. రాక్షసులు కోరినరూప మెత్తువారు. శూరులు. మోసమునందుఁ గడతేఱినవారు. కావున వారియెడ నెప్పటికిని విశ్వాసముంచఁజనదు. ఈతఁడు రాక్షసేంద్రుఁ డగు రావణునిచేఁ బంపఁబడిన వేగువాఁడుగ నుండవచ్చును. ఇతఁడు మనకడ కేఁగుదెంచి కలసి మెలసి యుండి, మనలో నొక్కరొక్కరికి భేదము పుట్టించును. సంశయము లేదు. అట్లు కాకపోయిన నితఁడు తానే తనతెలివి నుపయోగించి,

మనలోపము గనిపెట్టి, తమ్ము నమ్మునట్లు చేసికొని, తానే మనలను సంహరింపను వచ్చును. మిత్రబలమును, అడవిలోని జనులబలమును, మూలబలమును, కూలికి జీవించు బలమును దగ్గఱఁ జేర్పవచ్చును గాని, శత్రుబలము నెన్నటికిని దగ్గఱఁ జేర్పరాదు. ఓప్రభూ! వీఁడు నీకు సాక్షాత్తుగా వైరి యయిన రాక్షసాధిపుఁ డగు రావణునికిఁ దోఁబుట్టువు. శత్రుపక్షమునుండియే వచ్చినవాఁడు. ఇట్టి వీనియెడ నెట్లు నమ్మక ముంప నగును? ఓర్పు గలవారిలోపల మేటీ! ఈవిభీషణుఁడు రావణుఁ డంపఁగా వచ్చినవాఁ డని యెఱుఁగుము. ఇప్పు డితనిని దిరస్కరించు టయే యుక్త మని నాయభిప్రాయము. రాఘవుఁడా! రావణుఁడు మోసమునఁ బంపఁగా నీతఁడు మనలను నమ్మించుకొని, మాయచేఁ గంటికిఁ గనఁబడనివాఁడై మనలం బ్రహరించుటకై వచ్చినాఁ డని నాకుఁ దోఁచెడిని. బుద్ధిమంతుఁ డగు శత్రు వుపాయముచేఁ దన శత్రువుల బలమునఁ బ్రవేశించి, రంధ్రము నన్వేషించి, పెక్కుకాకులను ఒక గుడ్ల గూబ చంపునట్లు శత్రువుల నందఱను జంపును. ఈవిభీషణుఁడు క్రూరుఁ డగు రావణునికిఁ దమ్ముఁడు గనుక, నితనిని ఇతని మంత్రులను గూడఁ దీక్ష్ణముగా దండింపవలయును." అని మాటలందు నేర్పరి యగు వానర సేనానాయకుఁ డగు సుగ్రీవుఁడు మిక్కిలి యాటోపముతో వాక్యార్థ జ్ఞుఁడగు రామునితోఁ జెప్పి యూరకుండెను.

మహాకీర్తిశాలి యగు రాముఁ డాసుగ్రీవునిమాటలను విని దగ్గఱ నిలఁబడియున్న హనుమంతుఁడు మొదలగు వానరులం జూచి, "వానరు లారా! విభీషణునిఁ గూర్చి, వానరరా జయిన సుగ్రీవుఁడు సెప్పిన మాట లను వింటిరిగదా. ఆ మాటలు సకారణములుగాను, అర్థగౌరవము గలవిగాను నున్నవి. కార్యములపట్లఁ గష్టములు వచ్చినప్పుడు బుద్ధి మంతుఁ డగువాఁడు తా నెంత సమర్థుఁ డై యున్నను, తనకు స్థిరమైన కలిమి గావలె నని కోరువాఁడేని, మఱియొక చెలికానితో నాలోచించి, కార్యము నిశ్చయించుట మంచిది." అని యా వానరుల నడుగఁగా, వారు రామునికి మేలు చేయఁగోరిన వార లై, వినయముతోడఁ దమ తమ యభిప్రాయములను దెలిపిరి.

"రాఘవా! ముజ్జగములందును నీకుఁ దెలియని దొక్కటి లేదు. అట్లు తెలిసియుండియుఁ జెలిమివలన మాలో నొక్కనొక్కని నడుగుచున్నావు. నీ వన్ననో సత్య మనెడి వ్రతము దప్పనివాఁడవు, శూరుఁడవు, ధర్మపరుఁడవు, దిట్టమైన పరాక్రమము గలవాఁడవు, పరికించి పనిచేయువాఁడవు, జ్ఞప్తిగలవాఁడవు. ఆప్తులందు మనస్సు పెట్టినవాఁడవు. కావున బుద్ధిమంతులును, కార్యసమర్థులును నైనమంత్రులలో నొక్కరొక్కరు సకారణముగా తమయభిప్రాయమును తెలుపుదురు గాక! అని యందఱు వానరులు చెప్పిరి. బుద్ధిమంతుఁ డగు నంగదుఁడు రామునిఁగూర్చి, "మహాప్రభూ! విభీషణుండు శత్రువుకడనుండి వచ్చినవాఁడు గావున నన్నివిధముల సంశయింపవలసినదే కాని, పరీక్షింపక యతనిని వేగిరమె నమ్ముట యయుక్తము. కుటిలబుద్ధి గలవారు తమ యభిప్రాయమును గప్పిపెట్టికొని, సందు దొఱకినప్పుడు శత్రులను మోఁదుదురు. కావున నిది యొక గొప్ప యనర్థము గలిగించును. కార్యములయందలి గుణదోషములను నిశ్చయించి, కార్యములకై ప్రయత్నము చేయవలెను. గుణము లున్నఁ బరిగ్రహింపవలెను. దోషము లున్న విడువ వలెను. కావున నృపాలా! యీ విభీషణునియందు విశేష దోషములున్న, వీనిని నిస్సంశయముగా వదలిపెట్ట నగును. ఇతనియందుఁ బెక్కు సుగుణములే యున్నచో నితనిని దగ్గఱఁ జేర్పవలయును." అని చెప్పెను.

అంత శరభుఁ డనువాఁడు చక్కఁగా నాలోచించి, "నరశ్రేష్ఠా! యీ విభీషణునికడకు వేగముగ వేగు నొక్కనిఁ బంపుము. వేగుఁ బంపిన నాతఁడు తన బుద్ధి సూక్ష్మత నుపయోగించి వానిసంగతి జక్కఁగాఁ గనుగొన వచ్చును. ఆతఁడు వచ్చినవెనుక యెట్లు చేయుట యుక్తమో అట్లు చేయవచ్చును." అని రామునింగూర్చి యర్థవంతమైనమాట చెప్పెను.

తర్వాత నీతిశాస్త్రవిచక్షణుఁ డైన జాంబవంతుఁడు శాస్త్ర సమ్మతమయిన స్వబుద్ధితో నాలోచించి, "వైరము పూనినవాఁడును, పాపుఁడును నైన రాక్షసేంద్రుఁ డయిన రావణునివద్దనుండి యీ విభీషణుఁడు సరికాని దేశకాలములందు వచ్చినవాఁడు గనుక నితనిని గూర్చి

యన్నివిధములుగా సందేహమే తోఁచుచున్నది." యని దోషము లేక యుక్తమైన యర్థముగల మాటలను జెప్పెను.

తర్వాత మంచిచెడ్డల నెఱుఁగఁ గలవాఁడును, మాటలందు నేర్పరియునైన మైందుఁడును "రాజాధిరాజా! యీ విభీషణునికడ కొక్క చారునిఁ బంపి యారావణుఁ డేమి చెప్పెను అని మంచిమాట లతో నడుగమందము. ఆతని లోఁగుట్టు బాగుగాఁ దెలిసికొని, అతఁడు దుష్టుఁడో మంచివాఁడో కనుఁగొని యావల స్వబుద్ధికిఁ దగినట్లు చేయ వచ్చు." నని సకారణమైన మాటను చెప్పెను.

సకలశాస్త్రాభ్యాసమువలని యనుభవము గలవాఁ డయిన మంత్రి శ్రేష్ఠుఁ డగు హనుమంతుఁడు (సుగ్రీవమతము కేవలము రాజనీతిగనుకను మిక్కిలి యాలోచన చేయక చెప్పినమాట గనుకను, దానిని ద్రోసి వేయుచు, అంగదాదుల యభిప్రాయ మొక్కొక్క పక్షమునే యవలం బించినదిగా నున్నది గనుక దానిని పూర్వపక్షము చేయుచు, విభీషణుని యందు దోషము లే దని యప్పుడే రూపింప వీలగును గనుక వెంటనే యతనిని చేర్చుకొనవచ్చు నని చెప్పఁ దలఁచినవాఁడై) సంక్షిప్తమైన యర్థ మును దీర్పఁగలవియు, విన్నమాత్రముననే యింపు గలిగించునవియు, మిక్కిలి విస్తారము గానివియు, తిన్ననివియు నైన మాటలతో రాము నకుఁ దన యభిప్రాయమును జెప్పఁదొడఁగెను. "ఓ రాఘవా! మాటలలో నేర్పరి యగు బృహస్పతియైనను తన మాటలందలి నేర్పుచే బుద్ధిమంతు లలో నుత్తముఁడవు, వాచాలురలోపల మేటివియు నైన నిన్ను మీఱు టకు సమర్థుఁడు గాఁడు. ఓ రామా! వాదము చేయుటయందలి నేర్పు చేతఁగాని, తక్కిన మంత్రులందు విరోధమువలనఁగాని, నేను బుద్ధి మంతుఁడను మాటలాడువాఁడ ననెడి హెచ్చు గర్వమువలనఁగాని, ఇచ్చచొప్పున మాటాడవలె నని కాని నే నిప్పుడు మాటాడుట లేదు. అయిన నెందుకుఁ జెప్పఁబూనెద వనిన, తా మొనర్చిన గౌరమునుబట్టి నిక్కపుమాట చెప్పఁబూనితిని. ఓ రాఘవా! విభీషణుని గుణదోష ముల గనిపెట్టుటకై నీకు మంత్రులుచెప్పిన ఆ యుపాయముల కపా యములు పెక్కులున్నట్లు నాకుఁ దోఁచెడిని. ఆ ప్రకారము పనిచేయుట యుక్తముగా నాకుఁ దోఁపదు. ఏల యనిన, క్రొత్తనౌకరికి రాజకార్యము

లం దుద్యోగము నిప్పింపక, వానిగుణదోషముల నెఱుఁగుటకు వలను పడదు. అట్లే యొక్కని గుణదోషముల నెఱుఁగక యున్నట్టుండి రాజ్యమునం దుద్యోగ మిప్పించుటయు సరిగాదని నాకుఁ దోఁచెడి. కావున నివి రెండును పరస్పర మాశ్రయించియున్నవి గనుక నీ యంగదుఁడు సెప్పిన యీమతము యుక్తముగాదు. మఱియు వేగును బంపి విభీషణుని వృత్తాంత మెఱుఁగుట యుక్తమని చెప్పిన శరభునిమతమును యుక్తము గాదు. చారుఁడు దూరమునను, మనకంటికిఁ గనఁబడకయు నుండు విషయమునందుఁ బంపఁదగినవాఁడేకాని, యాకసమున మన సమీపముననే యున్న యీ విభీషణునివిషయమున నీ చారునిఁ బంపుట యుక్తముగాఁ దోఁపదు. యుక్తముకాని దేశకాలములం దితఁ డిచ్చటికి వచ్చినాఁ డని జాంబవంతుఁడు చెప్పినవిషయము యోచింపఁగా, వాస్తవముగా నిదియే తగినదేశ మనియు, తగినకాలమనియుఁ నాకుఁ దోఁచుచున్నది. విభీషణుఁ డధమపురుషునిసేవించుటకంటె నుత్తముం డగు నిన్ను సేవించుట యుక్తమని మనసునఁ దలఁచి, రావణునియందును నీ యందును గుణదోషములను బరికించి, అట్లె రావణునియందు సీతాప్రత్యర్పణభావము లేమి మొదలగు చెడుస్వభావమును, నీయందు కబంధఖరదూషణాదిరాక్షస వధము దుర్జయవాలినిగ్రహపూర్వక సుగ్రీవపట్టాభిషేకకరణము, తరింపరాని సముద్రమును దాఁటఁ దొడఁగుట మొదలగుపరాక్రమమునుజూచి యిప్పు డిచ్చటికి వచ్చుట యతనిబుద్ధికి యుక్తముగానే యుండు నని తోఁచుచున్నది. ఆవిభీషణుని వృత్తాంతము నపరిచిత స్వభావులైన పురుషులచే నడిగింపు మని మైందుఁ డొక యభిప్రాయము సెప్పెను. ఆ మతమును సరియైనది కాదు. ఏలయనిన, బుద్ధిమంతుఁడగువాఁడు తన్నెఱుఁగని యొకఁడువచ్చి యొకయంశ మడిగినయెడ సంశయపడినవాఁడై, తనయందపనమ్మికచేతనే తన్నట్లడుగుచున్నాఁ డని యెఱిఁగి, యేది చెప్పినను నేమి చెఱుపు గలుగునో యని బదులుమాట చెప్పు విషయమున సంశయపడును. అట్లడుగుటచేత, మనయందు విశ్వాసముంచియున్న మిత్రుఁడు సైతము కపటపుఁ బ్రశ్నచేఁ గలఁకపాఱిపోవును. అంతియకాక యీ యుపాయము వ్యర్థమైనది. తాను మాటలందు నేర్పరి నని తలఁచి

యడుగువాని యభిప్రాయము గనిపెట్టి యెదుటివాఁడును పైకి నర్థము విశదముగాఁ దెలియునట్లున్నను, తన యభిప్రాయము బాగుగా విశదపడ కుండునట్లు చమత్కారపు మాటలతో బదులుసెప్పును గనుక, పరుని యభిప్రాయమంత వేగిరముగా నెఱుఁగుటయు సాధ్యము గాదని తోఁచు చున్నది. అంతియకాక యీతఁడు మాటలాడుచుండఁగా నితనియందుఁ జెడుతలం పున్నట్లు తోఁచదు. ముఖమును సంతోషముతోఁ గూడి ప్రస న్నమైయున్నట్లు తోఁచెడి. కావున నీతని విషయమున నాకేమియు సంశ యము గానిపింపదు. రహస్యముగ నపకార మొనరింపఁదలఁచినవాఁడు సందేహబుద్ధిలేనివాఁడై, నెమ్మదితో దగ్గఱకురాఁడు. ఇతఁడు సందేహము విడిచి నెమ్మదిగా మనకడకు వచ్చుచున్నాఁడు. కనుక నితఁ డట్టి శఠుఁడు గాఁడు. ఇతనిమాటలును దోషయుక్తములు గావు. కావున నితనియందు దుష్టస్వభావుఁ డను సంశయము లేదు. దుష్టుఁడే తన యాకారము గప్పి పెట్టి యిట్లు నటింపఁగూడదా యనిన, నట్లుండుటకు వీలుగాదు. ఆకా రము నెంత కప్పి పెట్టినను, అది దాఁచ వీలగునది కాదు. ఆకార మను నది మానవుల మనసులలో నుండు నభిప్రాయమును బలాత్కారముగా వెలిపుచ్చును. కార్యవేత్తలలో మేటి, దేశకాలము లెఱిఁగి చేసినట్టి కార్యము చక్కఁగాఁ జేయఁబడినదై వేగిరమే స్వఫలము నొసఁగు చున్నది. అయిన నితఁడు గాఁడేని, ఆవేళలో నితఁ డేల వచ్చినాఁ డనిన, నితఁడు వచ్చినది యవేళ గాదు. ఇతఁడు దేశకాలముల నెఱిఁగియే వచ్చిన వాఁడు. సముద్రతరణాదిక మయిన నీప్రయత్నమును, రావణుని దుష్ప్రవర్తనను, వాలివధమును, సుగ్రీవునిపట్టాభిషేకమును జూచి, తానును రాజ్యము నొందఁగోరినవాఁడై, బుద్ధిపూర్వకముగా నిచ్చటికి వచ్చెను. ఇది యంతయుఁ బురస్కరించి చూడఁగా, నవ్విభీషణునిఁ జేర్చు కొనుట యుక్త మనియే తోఁచుచున్నది. రాఘవా! రాక్షసుని నిర్దో షిత్వముంగూర్చి, నావలన నైనది చెప్పితిని. బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడా! నేను చెప్పఁగా మిగిలినసంగతిని నీవే నిర్ణయించుకొనుదువు." అని హనుమంతుఁడు రామునితోఁ జెప్పెను.

18-వ సర్గము

రాముఁడు విభీషణుని నంగీకరించుట

తరువాత రాముఁడు మొదట సుగ్రీవాదివానరులవాక్యములచేఁ గలవరపెట్టఁబడినను, హనుమంతునిమాటలచే నిర్మలహృదయుఁడై తన సామాన్యవిశేషశాస్త్రముల నెఱిఁగినవాఁ డగుటవలనఁ బూర్వోక్త సుగ్రీవాదులపూర్వపక్షములకు వెఱవనివాఁడై తన మనసున నున్న యభిప్రాయమును వివరింపఁ దొడఁగెను: "ఓ వానరులారా! విభీషణునిఁ గూర్చి నాకును గొంత చెప్పవలసినది యున్నది. మీ రందఱును నా మేలు గోరువారు గనుక, నా మాటలను విని, వానియందలి గుణదోషములను బరికించి మీరు పనిచేయవలయు నని నాకుఁ గోరిక యున్నది. ఈ విభీషణునియందు దోషములేవియుఁ గానిపింపవు. అట్లొక్కవేళ దోషములే యున్నను నితఁడు మనల నేమి చేయఁగలఁడు? ఇతఁడు వాస్తవామిత్రభావముతో నుండి, ఇప్పుడు పైకి మిత్రభావముఁ గనఁబఱచుచు వచ్చినవాఁ డగుటచే, నా కెన్ని కష్టములు వచ్చినను వీనిని నేను విడువను. దుష్టులనైనను శరణుచొచ్చినవారిని రక్షించుటయె గొప్పధర్మ మని పెద్దలు చెప్పుదురు." అని సుగ్రీవాదివానరులతోఁ జెప్పెను.

అంతట వానరశ్రేష్ఠుఁ డయిన సుగ్రీవుఁడు రామునిమాటలను విని, వానిని దానును మఱలఁ జెప్పి, యా మాటలయందలి గుణదోషములను విచారించి, మిక్కిలి మేలు గావించుమాటను రామునితో ని ట్లనెను: "ఓ రామా! యీవిభీషణుండు కడుదుష్టుఁడుగా నుండనీ, లేక దుష్టుఁడు గాక యుండనీ, ఇతఁడు సముదాయముమీఁదఁ గృతఘ్నుఁడుగాఁ గనఁబడుచున్నాఁడు. కావున నితనితో మనకుఁ గావలసిన దేమియున్నది? ఎట్లితఁడు కృతఘ్నుఁ డనిన, లంకను పాడుచేసికొని, పుత్రులను బోఁగొట్టుకొని యంతవ్యసనములోఁ దగులుకొనియున్న తన తోడఁబుట్టు వైన రావణునినే వదలిపెట్టివచ్చిన యీతఁడు మఱెవ్వరిని వదలిపెట్టకయుండును?" అని చెప్పఁగా, విడువని పరాక్రమము గలవాడయిన రాముఁడు సుగ్రీవునిమాటను విని, నవ్వుచు, లక్ష్మణుఁడు మొఁలగువారి నందఱిని జూచి, "ఈ సుగ్రీవుఁ డీ ధర్మసూక్ష్మమును

నాశక్తిని, నా శరణాగతరక్షణవ్రతమును దెలియక యివ్విధముగాఁ బలుకుచున్నాఁ" డని చిఱునగవు నవ్వుచు, సుగ్రీవునికి రాజనీతిచేతనే ప్రత్యుత్తరమియ్యఁ దలఁచి, మొదట శుభలక్షణములు గలవాఁ డగు లక్ష్మణుం జూచి, యిట్లు చెప్పెను. "లక్ష్మణా! సుగ్రీవుఁ డిప్పుడు చెప్పినట్టి మాట శాస్త్రములను జదువకయు, పెద్దలను గొలువకయుఁ జెప్పుటకు వీలు గాదు. ఈవిభీషణుని యాగమనవిషయమునఁ బ్రత్యక్షమై లోకవ్యవహారసిద్ధమై రాజు లందఱియందుఁ గనఁబడు మిగుల సూక్ష్మమైన ధర్మ మొక్కటి యున్నది. ఆధర్మమే నాకును దోఁచెడి. దాయాదులును, తన దేశములకు వెంబడిదేశములలో నుండువారును వ్యసనప్రహర్తృత్వమునుబట్టి (ఆపదలు సంభవించునప్పుడు కొట్టువా రగుటం బట్టి) యమిత్రు లనియె చెప్పఁబడుదురు. ఈ వ్యసనప్రహర్తృత్వమును బట్టియే యీ విభీషణుఁడు వ్యసనములలోఁ జిక్కియున్న తన దాయాదునిఁ బ్రహరించుటకై యిచ్చటికి వచ్చెను. ధర్మిష్ఠు లగు రాజులు తమ దాయాదులను గాపాడుదురుగదా! అట్లే రావణుఁడు విభీషణునిఁ బరిపాలించు ననిన, లోకమున ధర్మిష్ఠులగు రాజులు తమ దాయాదులను బోషింతురు. అయినను, అట్టి దాయాదులలో నొక్కఁడు బుద్ధిబలశౌర్యాదులచేఁ బ్రసిద్ధుఁడైనవాఁ డుండెనేని, యట్టి ధర్మిష్ఠులైన రాజులు గూడఁ బ్రాయికముగా నట్టి దాయాదుని విషయమున నితఁ డెక్కడఁ దన రాజ్యమునకుఁ జేటు తెచ్చునో యని సంశయపడుచునే యుందురు. అట్లుండఁగాఁ గ్రూరుఁడై చెడుతలంపు గలవాఁడయిన రావణునికి సుగుణగణుఁడగు విభీషణునివిషయమున సంశయము గలుగు నను విషయమున కొక్క సందియ మున్నదా? కాఁబట్టియే విభీషణుఁడు తనయందు సంశయముతో నుండు రావణునితో విరోధించి యిక్కడికి వచ్చినాఁ డనుట నిజము. సుగ్రీవా! యితఁడు మన శత్రువునకు సంబంధించినవాఁడు గనుక నితనిం జేర్పరా దని యేదోషము చెప్పితివో ఆదోషము నైత మితనియందు లేదు. దానివిషయమున శాస్త్రపర్యాలోచనచేసి సమాధానము చెప్పెదను వినుము. మనము ఆతనికి దాయాదులము గాము గనుక రాక్షస రాజ్యమున కర్హులము గాము. మనకు రాక్షస రాజ్యమునం దపేక్ష లేదు గనుక నాకు రావణునికివలె,

నతనియందు శత్రుత్వభయము లేదు. మఱియు రాక్షసుఁ డయిన విభీషణుఁడు రాజ్యమునందలి యపేక్షతో నున్నాఁడు గనుక, మన మూలమున రావణుని సంహరింపింపఁ జూచుచున్నాఁడు కావున దన కార్యవిఘాత భయము వలనను మన కతఁ డపకారము చేయఁడు. మూర్ఖులగు రాక్షసు లింతదూర మాలోచన చేయుదురే యనిన, రాక్షసు లంద ఱిట్లే యుందు రని తలంపఁగూడదు. రాక్షసులు కొందఱు జ్ఞానవంతులుగాను నుందురు. అట్టి జ్ఞానవంతు లగు రాక్షసులు మనో వ్యాకులత్వము లేనివారై, సంతుష్టులై కలియరు. ఈ కారణమును బట్టియే సమయమున విరోధము నొందుదురు. మఱియు, ఈవిభీష ణుండు భీతుఁ డైనందుననే పెద్దపెట్టున నార్చుచున్నాఁడు. ఆ రావణుని వలన నితనికి కొప్ప భయము గలిగినది. ఆ భయముచేతనే తన ప్రాణ సంరక్షణమునకై యిచ్చటికి వచ్చి యున్నాఁడు కావున నితనిఁ బరిగ్రహింపవచ్చును. నాయనా సుగ్రీవా! తనకు వచ్చిన రాజ్యము వల దని చెప్పెడు భరతునివంటి సోదరు లందఱు నుండరు. పెద్దవాఁడ నగుటచే నాకే రాజ్యము రావలసినదిగా నున్నను, తండ్రిమాటయందలి గౌరవముచేతనే రాజ్యమును వదలిపెట్టి యడవులకు వచ్చిన నావంటి పుత్రులు తండ్రికిని, వర్షర్తువునం దొకరాత్రి నేనును లక్ష్మణుఁడును కుపితులమై మిక్కిలి పరుషముగా మాటలాడినను మాయందుఁ బ్రేమా తిశయమునే ప్రకటించిన నీబోఁటు లగు చెలికాండ్రును నుండరు."

అని రాముఁ డివ్విధమున సుగ్రీవలక్ష్మణులం గూర్చి చెప్పఁగా గొప్ప పండితుఁ డైన సుగ్రీవుఁడు వినయనమ్రుఁడై లేచి నిలఁబడి "ఓ శాంతిగలవారిలో నుత్తముఁడా! ఈ విభీషణుఁడు రావణుచేఁ బంపఁ బడిన వేగుగాని మఱొక్కఁడు గాఁడు. కావున నీతనిని తిరస్కరించుటయె యుక్తమని తలఁచెదను. ఓమహాత్మా! యీ విభీషణుఁడు కుటిలబుద్ధియైన రావణుని యుత్తరువు పొంది, యిచ్చటికి వచ్చినవాఁడు. ఇతఁడు గూఢుఁడై యుండి నమ్మియున్న నిన్నో, నన్నో, లక్ష్మణునో సంహరించు వాఁడు. కావున ఘాతుకుఁ డయిన రావణునితమ్ముఁ డగు నీ విభీషణుని

మంత్రులతోడ వధింపవలయును" అని వాక్చాతుర్యముగలవాఁ డగు రామునితోఁ జెప్పి, యా మీఁద నేమియుఁ బలుకక యూరకుండెను.

రాముఁడు సుగ్రీవుఁడు చెప్పిన యామాటను విని చక్కఁగా నాలోచించి యా వానరశ్రేష్ఠునిఁగూర్చి మిక్కిలి మేలగుమాట చెప్పెను. "ఓసుగ్రీవా! ఈరాక్షసుఁడు కడు దుష్టుఁడైన నేమి? లేక మంచివాఁడైన నేమి? ఈతఁడు సకలప్రయత్నము చేసియు నా కణు మాత్రమైనను చెఱుపు చేయఁజాలఁడు. వానరయూథనాథా! నేను కావలెనని కోరితినేని పుడమియందుఁ గల పిశాచదానవయక్షరాక్షసులను నా బొట్టనవ్రేలికొనతో నణఁగఁ ద్రొక్కఁగలను. తొల్లి శాస్త్రజ్ఞానములేని యొక కపోతము తన భార్య నపహరించిన శత్రువగు వ్యాధుఁడు తన్ను శరణు చెందఁగా, నాతనిని యథావిధిగాఁ బూజించి తన మాంసముచే భోజనము పెట్టెను. ఓ వానరశ్రేష్ఠా! యొక తిర్యగ్జంతువైన పావురమే శరణాగతరక్షణమొనర్చినప్పుడు, నాబోఁటి యగు జనుఁడు శరణాగతరక్షణము చేయవలెనను మాట చెప్పవలెనా! తొల్లి కణ్వమహర్షియొక్క కుమారుఁ డగు కండుమహామునిచేఁ బేర్కొనఁబడిన ధర్మిష్ఠమైన ప్రాచీనగాథను వినిపించెదను. శత్రుసంహారీ! దోసిలిగట్టుకొని, విన్నదనముతోఁ గూడి తన్నుఁ గాపాడు మని యాచించు శరణాగతుని ప్రత్యక్షశత్రువు నైనను తనకుఁ గ్రూరు డనుపేరు రాకుండుటకై వధింపరాదు. నొచ్చినవాఁ డయినను, లేక గర్వితుఁ డయినను శత్రువులను శరణుచొచ్చెనేని, యట్టివాని నాతని శత్రువులు తమ ప్రాణములను వదలిపెట్టి యైనను కాపాడవలెను. శరణుచొచ్చిన శత్రువును రక్షించినఁ బిమ్మట నతండు త్రిప్పుకొని యేమి కీడు చేయునో యనుభీతిచేఁ గాని, శాస్త్రార్థము తెలియమిచేఁ గాని, స్వేచ్ఛగాఁ బ్రవర్తించెడి స్వభావముచేఁ గాని, ద్రవ్యసాహాయ్యము మొదలగునవి చేసి, న్యాయప్రకారము రక్షణము చేయఁడేని, అట్టి శరణాగతరక్షణముచేయమి పాపప్రదమై లోకనింద్యమై యున్నది. ఒక్కఁ డొక్కనిని శరణుచొచ్చినప్పుడు, శరణుచొచ్చినవానిని రక్షింపని యాతఁడు చూచుచుండునపుడే రక్షితుఁడు గానివాఁడు రక్షింపని వాఁడు సంపాదించిన పుణ్యము నంతయు నపహరించుకొని పోవు

చున్నాఁడు" అని కండుమహర్షి చెప్పినరీతిగా శరణాగతరక్షణము చేయమియందు గొప్ప ప్రత్యవాయము సంభవించుచున్నది. కండు మహర్షి వచనము, శరణాగతరక్షణము సేయనివానికి స్వర్గము నొసఁగనిదియు, అపకీర్తి దెచ్చునదియు, బలశౌర్యములను జెఱచు నదియు నై యున్నది. శరణాగతరక్షణము చేసినవానికి యథార్థఫలద మును, ధర్మిష్ఠమును, స్వర్గము నొసఁగునదియు, ఫలసిద్ధి నిచ్చునదియు నై యున్నది గనుక ఆ కండుమహర్షి వచనప్రకారమే చేసెదను. ఒకమాఱె మనసునఁ బ్రపత్తి నొంది నేను నీవాఁడ నని నోటఁ జెప్పి శరణము గోరువానికైనను సకలభూతములనుండి యభయ మొసఁగెదను. ఇదియే నావ్రతము. ఓ వానరశ్రేష్ఠుఁడ వగు సుగ్రీవుఁడా! ఈవిభీష ణునికి నభయమొసఁగితిని. ఇతఁడు విభీషణుఁడేకానిమ్ము, రావణుఁడే కానిమ్ము. నీ వేఁగి యీతనిని దోడ్కొనిరమ్ము. ఓ సుగ్రీవా! విభీషణుఁడు నీతోనే చెప్పిపంపెను గనుక నీవే పోయి యతనిం దోడ్కొని రమ్ము" (అతఁడు వాస్తవముగా విభీషణుఁడో, లేక రావణుఁడే యీవిభీషణుని వలెఁ గామరూపము దాల్చి వచ్చినాఁడో యని సంశయింపవలదు. విభీషణుని మాత్రమే తోడ్కొనివచ్చిన, వానిని, వానిమంత్రులను నలువురిని మాత్రమే రక్షించినట్లగును. ఆవచ్చినవాఁడు రావణుఁడేయై శరణుచొచ్చియున్నయెడల, రావణుని, లంకాపురమునందలి రాక్షసుల నందఱిని రక్షించినట్లగును గావున, ఈవచ్చినవాఁడు విభీషణుఁడో, మాయావిభీషణరూపంబుఁ దాల్చివచ్చిన రావణుఁడో యని సంశయింపక విభీషణునినైనను, సాక్షాద్రావణుని నైనను దోడ్కొనిరమ్ము") అని రాముఁడు సుగ్రీవునితోఁ జెప్పెను.

వానర రాజగు సుగ్రీవుఁడు రాముని వాక్యమును విని, రాముని యందలి ప్రేమ తన్నుఁ బురికొల్పఁగా, వెండియు రామునిం జూచి యి ట్లనియె; "ధర్మముల నెఱిఁగినవాఁడా! లోకరక్షకా! లోకసుఖప్రదా! పట్టు దలగలవాఁడవు, సన్మార్గమున నుండువాఁడవు నైన నీవు శరణమొసఁగితి ననుట న్యాయమే, నీ విషయమున నిదియొకవింతగాదు. నీవు చెప్పుటయె కాక, నా మనస్సుగూడ నివ్విభీషణుఁడు నిష్కల్మషుఁ డనియె భావించు చున్నది. హనుమంతుఁడును నీవును చెప్పిన యుక్తులవలనను, మనోభా

వముఁ దెలుపు ముఖవికాసాదులవలనను లోపలను వెలుపలను జక్కఁగాఁ బరీక్షించితిని. ఇతఁడు సకలవిధముల రక్షణీయుఁ డని తెలిసెను. ఇఁక నితనిని నేను వేగిరమే తోడ్కొనివచ్చెదను. ఓరాఘవా! ఇఁకమీఁద నతఁడు మనతో సమానుఁ డై యుండును గాక! గొప్పవివేకి యగు విభీషణుఁడు మనతోడ చెలిమిగలిగియుండును గాక!" అని సుగ్రీవుఁడు రామునితోఁ జెప్పెను. అంత నరేంద్రుఁడు సుగ్రీవుఁడు చెప్పినమాటను విని దేవేంద్రుఁడు గరుడునితోఁ జేరినవిధమున వెంటనే విభీషణునితోఁ గలిసికొనినవాఁడయ్యెను.

19-వ సర్గము

విభీషణుఁడు శ్రీరామునకు రావణుని బలంబుఁ దెల్పుట

రాఘవుఁ డభయప్రదానము సేయఁగా ధర్మముల నమపువాఁడును, అడఁకువగలవాఁడును, గొప్పపండితుఁడును నైన విభీషణుఁడు రాముఁడు దన్నంగీకరించినందుకై మనమున నుప్పొంగుచుఁ దల వంచి భూమిని జూచుచుఁ దన భక్తులగు మంత్రులతోడ నాకాశమునుండి భూమికి డిగ్గి, శరణు గోరినవాఁ డై రామునిపాదముల ముందటఁ బడెను. అట్లు విభీషణుఁడు శ్రీరాముని పాదములమ్రోలఁ బడి, యాతనితో ధర్మయుక్తమైనదియు, ప్రకృతమునకుఁ దగినదియు, మనసునకు సంతోషమును గలిగించునదియు నైనమాట యివ్విధమునఁ జెప్పెను: "ఓ శ్రీరామా! నేను రావణునితమ్ముఁడను. ఆతఁడు నన్నవమానింపఁగా, నే నతనిని విడిచి సర్వజనశరణ్యుఁడ వైన నిన్ను శరణు చొచ్చితిని. నే నిప్పుడు లంకను, నామిత్రులను, నాయాస్తిని విడిచిపెట్టివచ్చితిని. నారాజ్యము, నాప్రాణములు, నాసౌఖ్యములును నీయధీనము లై యున్నవి." అని విభీషణుఁడు సర్వము రామార్పణము చేయఁగా, రాముఁ డా విభీషణుని మాటలను విని యతనిని మంచిమాటలతో నూఱడించి, నేత్రములతోఁ ద్రాగువానివలెఁ జక్కఁగాఁ జూచి, యాతనింగూర్చి, "ఓ విభీషణా! రాక్షసులబలాబలములను వాస్తవముగా నా కెఱిఁగింపుము" అని యడిగెను. మంచిపనులనుజేయగలవాఁ డగు శ్రీరాముఁ డివ్విధమునఁ బ్రశ్న చేయఁగా, నప్పుడు విభీషణుఁడు శ్రీరామునికి రావణునిబలము నంతయుఁ జెప్పఁబూనెను.

"ఓరాజపుత్రా! రావణునకు బ్రహ్మదేవుని వరమహిమవలన గంధర్వాసురరాక్షసులు మొదలగు సకలభూతములచేతను చావు లేదు. రావణుని వెన్నంటినవాఁడును నాకుఁ బెద్దయు, శూరుఁడును,ఎక్కువ పరాక్రమముగలవాఁడును,యుద్ధమున నింద్రునిఁ బోలువాఁడును నైన కుంభకర్ణుఁ డనువాఁ డొక్కరుఁడు గలఁడు. ఓరామా! ప్రహస్తుం డనుపేరు గల రావణునిమంత్రి యొకఁ డున్నాఁడు. వానిపేరు మీరు హనుమంతుని వలన వినియు నుండవచ్చును. ఇతఁడె కైలాసమునందు మాణిభద్రుఁడను కుబేరునిసేనాధిపతితో యుద్ధము సేసి యతని నోడించెను. ఇంద్రజిత్తు చేతివ్రేళ్ల కుడుముతోలుతోఁ జేసిన యంగుళిత్రాణమును తొడుగుకొని, శత్రువులచే భేదింప నలవికాని కవచమును దాల్చి వింటిని చేతఁబట్టి, యుద్ధసమయమున నిలుపఁబడిన వ్యూహమున నగ్నిహోత్రుని నారాధించి యతని యనుగ్రహముపలన నంతర్ధానమునొంది, శత్రువులను సంహరించువాఁడు. మఱియు నాతనిసేనయం దకంపన మహోదర మహాపార్శ్వ లనెడి సేనాధిపతు లున్నవారు. ఈ రాక్షసులు ముగ్గురు యుద్ధమునం దింద్రాదిలోకపాలురను బోలువారు. మఱియు, కోరిన రూపం బెత్తఁగలవారును, రక్తమాంసభోజనులు నైన పదికోటివేల సైనికులు లంకాపురమునం దున్నవారు. రావణుఁడు ఆసైన్యముం దోడ్కొనిపోయి లోకపాలురు మొదలగు వేల్పులతో యుద్ధముచేసి, వారి నందఱి నోడించెను."

దిటవగు మగఁటిమిగల రాముఁడు విభీషణునిమాటలను విని, మనసున నవి యెల్ల నాలోచించి, "విభీషణా! నీవు రావణుఁడు చేసిన దొడ్డపనులను యథార్థముగాఁ దెలిపితివి. వాని నన్నింటి నాలకించితిని. అవి నాకుఁ జక్కఁగా బోధపడినవి. నేను రావణుని వానిసేనాధిపతి యగు ప్రహస్తునితోడను, వానిబంధువులతోను గూడ సంహరించి, నిన్ను లంకాపురమునఁ బట్టాభిషిక్తునిఁ జేసెదను. ఇది నిక్కము నమ్ముము. ఆరావణుఁడు పాతాళమునకుఁ బోయినను, తనకు వరమొసఁగిన బ్రహ్మయుండు సత్యలోకమునకుఁ బోయినను, నేను వానిని బ్రాణములతో విడువను. నేను రావణునిఁ బుత్రమిత్రబంధుపరివారముతోడ మడియింపక యయోధ్యాపురముఁ బ్రవేశింప నని నాముగ్గురు తమ్ముల

సాక్షిగాఁ జెప్పుచున్నాను" అని చెప్పఁగా విని, ధర్మాత్ముఁ డగు విభీషణుఁడు సత్కర్మముల నాచరించు రామునికి శిరముతో మ్రొక్కి, రాఘవా! రాక్షసుల వధమునకును, లంకాధ్వంసమునకును నా శక్తి ననుసరించి తోడ్పాటు చేసెదను. నేను సేనతోఁగూడి యుద్ధము చేసెదను" అని చెప్పఁగా, శ్రీరాముఁ డివ్విధమునఁ బలికెడు విభీషణునిఁ గౌఁగిలించి, సంతుష్టుఁ డై, లక్ష్మణుం బిలిచి, "కోరిన బహుమానముల నొసఁగు లక్ష్మణా! నేను ప్రసన్నుఁడ నైతిని గనుక సముద్రమునుండి యుదకముఁ దెచ్చి, యీ సముద్రోదకముతో నీమహాప్రాజ్ఞుఁడగు విభీషణు నభిషేకింపుము" అని చెప్పఁగా, లక్ష్మణుఁడు సముద్రోదకముఁ దెచ్చి, వానరశ్రేష్ఠులమధ్యమున నవ్విభీషణునిఁ గూర్చుండఁబెట్టి లంకాపురాభిషిక్తునిం జేసెను. అప్పుడు వానరులందఱు విభీషణునియం దంత వేగిరముగాఁ గలిగిన రామునియనుగ్రహముఁ జూచి, మిక్కిలి సంతోషము నొందినవారయి 'మేలు మే' లని, యారాముని బహువిధములఁ గొనియాడిరి.

అంతట సుగ్రీవహనుమంతు లిద్దఱు విభీషణునిఁ గూర్చి, "విభీషణా! యెక్కువ మగటిమిగల యీ వానరసైన్యముతోఁ గూడిన వారమై యెట్లీ సముద్రమును దాఁట గలము? మే మెన్ని తెఱఁగుల నాలోచించియు నుపాయము గాన కున్నాము" అని యడుగఁగా, సకలధర్మముల నెఱిఁగిన విభీషణుఁడు వారి నిద్దఱిని జూచి, "రఘువంశోద్భవుఁ డైన శ్రీరాముఁడు సముద్రరాజును శరణు చెందవలయును. అట్లుచేసిన, సగరునిచేఁ ద్రవ్వింపఁబడినవాఁడును, అప్రమేయుఁడును, మహాబుద్ధిమంతుఁడును నైన యీ సముద్రుఁడు రాముని మహాకార్యమును జూచి సాహాయ్యమును జేయును" అని సముద్రతరణోపాయము దెలిపెను. రాక్షసుఁడును, వివేకమంతుఁడును నైన విభీషణుఁడు సెప్పినయుపాయము దెలిసికొన్నవాఁ డై సుగ్రీవుఁడు, లక్ష్మణుతోడ రాముఁ డున్న తావునకు వచ్చి యీ విభీషణుఁడు చెప్పిన సముద్రోపాసనారూపమైన మంచి యుపాయమును రామున కెఱిఁగించెను. స్వభావముగా నీతిమార్గమున బోవునట్టి యారామునికి విభీషణుని యుపాయము యుక్తముగాఁ దోఁచెను. అంతట మహాతేజుఁడును పనులందు నేర్పరియు నైన యా

రాముఁడు చిఱునవ్వు నవ్వుచు విభీషణుఁడు చెప్పిన యుపాయమును మన్నింప గోరినవాఁ డయి "లక్ష్మణా! విభీషణుఁడు చెప్పిన యుపాయము నాకు యుక్తముగాఁ దోఁచుచున్నది. సుగ్రీవుఁ డెల్లప్పు డెక్కువ తెలివి కలవాఁడు. నీవు ఆలోచనలందు నేర్పుకలవాడవు. మీ రిరువురుగూడి యాలోచించి నిశ్చయించికొని మీకుఁ దోఁచినది తెల్పుఁ"డని వారితోఁ జెప్పెను.

శూరులగు వారిద్దఱును, "ఓ పురుషోత్తమా! విభీషణునిచేఁ జెప్పఁబడిన యుపాయము మాకుమాత్ర మేల రుచింపదు? అదియే ప్రకృతమునకు సుఖకరముగాఁ దోఁచుచున్నది. వరుణుని కునికిపట్టయి, భయంకర మైన యా సముద్రమునందు సేతువు కట్టక యింద్రాదిదేవతల కైనను లంకాపురము చేరుటకు వీలుగాదు. శూరుఁ డైన విభీషణుఁడు సెప్పిన తీరుననే చేయవలెను. కాలవిలంబము చేయక సముద్రునికడ కేఁగి, మనము సేనలతోఁగూడ రావణపాలిత మైన లంకకుఁబోయి చేయఁదగిన యుపాయమున కయి యతనిఁ బ్రార్థింపవలయును" అని చెప్పఁగా, రాముఁడు సముద్రతీరమున దర్భాసనము పఱచి, వేదికయం దగ్ని హోత్రుఁడునుం బోలె నా దర్భాసనమునఁ బ్రాయోపవేశము చేసెను.

20-వ సర్గము

రావణుఁడు దూతను బంపుట

ఆసమయము జారునిం బంపునంతటి బుద్ధిహీనుఁ డైన రాక్షసేంద్రుఁ డగు రావణునియొక్క వేగును, మగఁటిమి గలవాఁడయిన శార్దూలుఁ డను రాక్షసుఁడు రావణునిచేఁ బంపఁబడినవాఁడై లంకాపురమునుండి వెడలి సముద్రము దాఁటివచ్చి, కడలియొడ్డున నిలువఁబడి నిదానించి సుగ్రీవుని యధికారమునం దున్న వానరసేనను కలయం జూచి, మఱల వేగముతో లంకాపురమునకు మఱలిపోయి, రావణాసురుం జూచి "మహారాజా! వానరఋక్షసేన యిదిగో లంకాపురముపైకి దండెత్తి వచ్చుచున్నది. అయ్యది యగాధము, నప్రమేయము నయి రెండవ సాగరము మాడ్కిఁ బ్రకాశించుచున్నది. దశరథునిపుత్రు లైన యీయన్న దమ్ములగు రామలక్ష్మణు లిద్దఱు మేటియాయుధములను గైకొన్నవారై, సీత యున్నతావును గూర్చి పయనమై యెక్కువకాంతితోఁ దేజరిల్లుచు

వచ్చి సముద్రతీరమున యుద్ధసన్నివేశముతో నున్నవారు. మహారాజా! నేను చెప్పినది వాస్తవ మని నమ్ముము. వేగిరముగా దూతలను బంపి, వాస్తవస్థితి నింకను జక్కఁగా నెఱిఁగి, సామదానభేదోపాయములలో నేది యుక్తమో దానిని బ్రయోగింపుము."అని సవినయముగా విన్నవించెను.

రాక్షసరాజగు రావణుఁడు శార్దూలునిమాటను విని, కలవరపాటు లేక తన కార్యముంగూర్చి యాలోచించి నిర్ణయించుకొన్నవాఁడై మాటలయర్థంబు లెఱుఁగువారిలో నుత్తముఁ డయిన శుకుఁడను రాక్షసునిఁ బిలిచి, "నీవు వానరరాజగు సుగ్రీవునికడ కేఁగి, "మహారాజా నీవు సూర్యపుత్రుఁడ వగుటచే గొప్పవంశమునఁ బుట్టినవాఁడవు. కావున నీవు నాతోఁ గారణము లేని పగ పెట్టుకొనుట తగదు. నీవు మహాబలుఁడవు గావున నీ కల్పబలుం డైన రామునితోఁ గావలసిన దేమి యున్నది? నీవు ఋక్షరజసుని పుత్రుఁడవు. బ్రహ్మ మునిమనుమఁడ వగుటచే నాకు బందుగుఁడవు. నీకు రాముని యాశ్రయించుటయం దొక ప్రయోజనమును లేదు. నీకు రాముని యాశ్రయింపమియందు హానియు లేదు. వానరేంద్రా! నీవు నాకుఁ దోడఁబుట్టినవానితో సమానుఁడవు. నీవు సీతాపహరణము చేయలేదా. అదే గొప్పచేటని యందువేమో? సుగ్రీవా! నేను రామునిభార్య నపహరించితి ననెడివిషయముగూర్చి నీకు వచ్చినచేటేమి? నీవు కిష్కింధకుఁ బోయిచేరుము. లంకాపురిని బ్రవేశింప వానరులకెట్లును సాధ్యముకాదు. వానరేంద్రా! లంకాపురప్రవేశము గంధర్వులతో గూడినదేవతలకే సాధ్యముకాకపోయినది. ఇఁక నరులును వానరులును ఈ లంకాపురమును గన్నెత్తి యైనను జూడఁగలరా?" అని నామాటలుగాఁ జెప్పుము" అని చెప్పఁగా, శుకుఁడును రాక్షసేంద్రుని యానతి వడసినవాఁడై, పక్షిరూపముతో సముద్రముమీఁదుగ చాలదూరముపోయి వేగముగా సముద్రమును దాఁటి, యావలిగట్టుసేరి, యాకాశముననే నిలిచి, సుగ్రీవునితో నాదురాత్ముఁ డగు రావణుఁడు సెప్పినమాటలన్నియుఁ జెప్పెను.

అట్లు సందేశముఁ దెచ్చిన యా శుకునిఁ జూచి, వానరులందఱు పై కెగిరి, యాశుకుని ఱెక్కలు నఱకుటకును, వానినిఁ జావమోదుటకును బూనికొని, వానిచుట్టు చుట్టుకొని, బలవంతముగా నతనిం బట్టి

కొట్టి పైనుండి క్రిందఁ ద్రోసిరి. వానరు లట్లు తన్ను బాధపెట్టుచుం డఁగా వారిబాధలను సైరింపఁజాలక, "ఓకాకుత్స్థా! వానరులు దూతను వధించుచున్నారు. దూతవధము నింద్య మయినది. అందును, తన ప్రభువు చెప్పిపంపిన సంగతిఁ గాకఁ తన యభిప్రాయమును గూడఁ జెప్ప నారంభించునట్టి దూతనే దండింపఁదగును గాని, ప్రభువు చెప్పిన చొప్పునఁ జెప్పునట్టి దూత నేమియుఁ జేయరాదు. నేను నాప్రభువు చెప్పిపంపిన విషయముఁ దప్ప స్వాభిప్రాయము నేమియుఁ దెలుపలేదు. వీరు నన్నుఁ జంపఁబూనుట యన్యాయము. వీరిని నివారింపు" మని చెప్పఁగా, రాముఁడు శుకునిమొఱ నాలకించి, యాశుకునిఁ గొట్టుచుండు వానరుల నందఱిని నివారించెను. వానరు లభయ మియ్యఁగా శుకుఁ డించుమించుగా రెక్కలు దెగినవాఁడై, పైకెగిరి, మఱల సుగ్రీవునిం గూర్చి "బలశౌర్యములు గలవాఁడా! లోకముల నెల్ల నేడ్పించువాఁ డయిన రావణునితో నే నేమి బదులుచెప్పవలయునో, ఆ సంగతి నాకుఁ జెప్పుము" అని యడిగెను. శుకుఁ డివ్విధమున నడుగఁగా, గంభీరస్వభా వము గలవాఁడును, వానరులలో నుత్తముఁడును, వానరాధిపుఁడు నైన సుగ్రీవుఁడు రావణునిచారుఁ డయిన శుకునితో నిట్లు చెప్పెను.

"ఓరావణా, నీకును నాకును జెలిమి లేదు. నేను నీపై దయ చూపవలసినది లేదు. నీవు నా కుపకర్తవును గావు; ప్రియుఁడవును గావు. కావున నీవు నాకుఁ దోడఁబుట్టినవానితో సమానుఁడవు గావు. ఓ వధా ర్హుఁడా! నీవు నా మిత్రుఁ డగు రామునికి శత్రుఁడవు గావున నాకును శత్రుఁడవే. కావున వాలి యెట్లు వధమున కర్హుఁడో యట్లె నీవును వధమునకు నర్హుఁడవు. రేద్రిమ్మరులఱేఁడా! నేను వేగమే యపారబల ముతో వచ్చి, నిన్నుఁ బుత్రమిత్రబంధుదాయాదపరివారములతోఁ గూడ వధించి, లంకాపురమును భస్మముచేసెదను. ఓరి మూఢుఁడ వయిన రావణా! ఇంద్రాదిదేవతలను శరణుచొచ్చినను, సూర్యమండల మును జొచ్చి యచ్చట డాఁగినను, లేక పాతాళమునఁ జొచ్చినను రాముని కఱకుటమ్ముల బారినుండి తప్పించుకొనఁజాలవు. ఆరాఘవునిచేతఁ జిక్కిన నిన్ను విడిపింప ముల్లోకములయందును నొక్కఁడును లేఁడు. వృద్ధుఁ డైనందున ని న్నెదిరింప శక్తిచాలని జటాయువును సంహరించితి

నని చెప్పెదవా ? నీతో సాటికాని వృద్ధునిఁ జంపుట యొక పౌరుషమా? నే నట్టివాఁడ ననుకొనకుము. నీవు రామలక్ష్మణుల సమక్షమున విఱివి కన్నుల దగు సీత నెత్తికొనిపోయి యుందువేని, యప్పుడు నీ సంగతి దెలిసియుండును. మహాబలుఁడును, ధీరుఁడును, దేవతలకుఁ గూడ గెల్వ నలవికానివాఁడును నైన రఘువంశశ్రేష్ఠుఁడు నీప్రాణములను దీయు నని నీ వప్పు డెఱుఁగవైతివి కాఁబోలును. ఆతఁడు నీప్రాణములను దప్పక తీయఁగలఁడు" అని సుగ్రీవుఁడు తన యభిప్రాయమును దెలిపెను.

తర్వాత వానరశ్రేష్ఠుఁ డైన యంగదుఁడు, "మహారాజా! యితఁడు దూత గాఁడు. వేఁగని నాకుఁ దోఁచుచున్నది. ఇతఁ డిచ్చటనే నిలఁబడి మన సేనల పరిమితిని కనుఁగొనినాఁడు. ఇతఁడు వేగు గనుక నితనిని వధించుటయందు దోషములేదు గనుక నితనిని లంకాపురము నకుఁ బోనీయక పట్టి బంధింపవలయును. ఇదే నాకు యుక్తముగాఁ దోఁచుచున్నది." అని సుగ్రీవునితో విన్నవింపఁగా, సుగ్రీవుఁ డాశుకునిఁ బట్టుటకై యానతి యొసఁగెను. వెంటనే వానరు లందఱు దిక్కులేని వానికైవడి మొఱపెట్టుకొనుచున్న యా శుకునిం బట్టుకొని కాలుసే తులు విఱిచికట్టిరి. అంతట నా శుకుఁడు భయంకరు లైన యా వానరు లచేఁ జక్కఁగాఁ దన్నఁబడుచు, "వానరులు తెక్కలు విఱుచుచున్నారు; కన్నులు పొడుచుచున్నారు. నిరపరాధి నైన నన్నుఁ జంపినచో నేను పుట్టినది మొదలు చచ్చునంతవఱకుఁ జేసినపాతకము నీవు కట్టుకొమ్ము." అని మహాత్ముఁ డగు దశరథనందనుఁ డయిన యారాముని వేఁడఁగా, రాముఁడా శుకునిపరిదేవనము నాలకించి, యాతనియందుఁ గరుణ దలఁచి, "ఈవచ్చిన దూతను విడిచిపెట్టుఁ" డని యా వానరుల కానతిచ్చెను.

21-వ సర్గము

శ్రీరాముని ప్రాయోపవేశము

అట్లానతిచ్చిన తర్వాత, దాక్షిణ్యవంతుఁడును, అందఱి కభయ మొసఁగువాఁడును, శత్రుసంహారియు, నిడుదచేతులవాఁడు నైన రఘు వంశజుఁడగు రాముఁడు, సముద్రతీరమున దర్భలు పఱచి, తూర్పుమొగ ముగాఁ దిరిగి, దోసిలి కట్టి సర్పశరీరమువలె మృదువయినదియు, తొల్లి రత్నములు చెక్కిన బంగారుభూషణములచే నలంకరింపఁబడినదియు,

మేలిమి బంగారుతోఁ జేసిన భుజకీర్తులు ముత్యాలహారములు మొదలగు తొడవులు దాల్చిన పలువు రుత్తమ పరిచారికలచే నొత్తఁబడినదియు, అరణ్యవాసమునకుఁ బూర్వము పూయఁబడిన చందనము, అగురు మొదలగు సుగంధద్రవ్యముల వాసన గలిగియుండునదియు, బాల సూర్యునిమాడ్కి వెలుఁగు నుత్తమ మైన యెఱ్ఱగందపుఁబూఁత పూయఁ బడినదియు, తొల్లి పాన్పునం దున్నప్పుడు సీతాదేవి తల యిడికొని పడుకొనుటచే శోభిల్లునదియు, గంగానదీజలముచేఁ దడుపఁబడిన తక్షకుఁ డను పాముయొక్క గొప్పకాయమువలె నుండునదియు, సమరమునఁ బట్టణద్వారపు గడియమ్రానివలె శత్రువులను నివారించునది యైనందున శత్రువులకు శోకము పెంచునదియు, స్నేహితుల కానందము నొసంగు నదియు, నిడివిగలదియు, భూమండలమున కాశ్రయమైనదియు, ఎడమ వైపునుండి తాను బాణములు విడుచుటవలన నల్లెత్రాటిదెబ్బ తగిలి పైతోలు వీడి కాయలు కాచినదియు, గొప్ప పరిఘాయుధమును బోలి నదియు, వేలకొలఁది గోవుల నొసఁగినదియు నైన తన చేతిని దిండుగాఁ బెట్టికొని, "నే నిప్పుడు మృతియైన నొందవలెను. లేదా సముద్రము నైనను దాఁటవలెను" అని తలఁచి, చేతులు కాళ్లు మొదలైనవి కదలిం పక, మాటలాడక, మనస్సున నితరచింత మాని, సముద్రునింగూర్చి ప్రాయోపవేశము చేసెను.

ఇట్లు నియమమునుండి తప్పక యా రాముఁడు దర్భశయనమునఁ బరుండి మూఁడు దివారాత్రములు గడపెను. ఈమూఁడు దినములును, నీతి నెఱిఁగినవాఁడును, ధర్మమునం దాసక్తిగలవాఁడును నైన రాముఁడు దర్భశయనమునఁ బరుండి యేటి మగఁ డగు సముద్రుని నుపాసించెను. ఇట్లు రాముఁడు చేతులు కాళ్లు మొదలగు నంగముల నాడింపక, మౌనముతో నుపాసించినను, అజ్ఞుఁ డయిన సముద్రుఁడు స్వస్వరూప మును జూపఁడాయెను. అంతట రాముఁడు సముద్రముమీఁది కోపముచేఁ గన్ను లెఱ్ఱనచేసి, చేరువ నిలఁబడియున్న శుభచిహ్నములు గల లక్ష్మణుం జూచి "లక్ష్మణా! యీ సముద్రుఁడు గర్వించి యున్నాఁడు. కాఁబట్టియే నే నింతదూరము ప్రార్థించినను నాకు స్వస్వ రూపము చూపకయున్నాఁడు. సత్పురుషులు దుర్జనులయెడఁ గోపము

చూపకుండుటయు, ఒరుల తప్పిదముల నోర్చుకొనుటయు, ఎదుటివారి మనస్సుప్రకారము నడచుకొనుటయు, ఇంపుమాటలు చెప్పుటయు నను నీ సుగుణములను జూపినయెడల, వారట్టివానియం దసామర్థ్యము నారోపింతురు. తన్నుఁ డాఁబొగడుకొనువానిని, మోసగానిని, కనికరము లేనివానిని, అన్యాయమునఁ బ్రవర్తించువానిని, సజ్జనదుర్జనులను గూడ దండించువానిని మానవులు గారవింతురు. లక్ష్మణా! మంచిమాటలచేఁ గీర్తి పొంద వీలు గాదు. మంచిమాటలచే యశస్సు పొంద వీలుగాదు. మంచిమాటలచే యుద్ధమున జయము పొందను వీలు కాదు. ఓసౌమిత్రీ! ఇప్పుడే చూడుము. నాబాణములచేత నీమకరాలయమగు సముద్రమున నున్న మకరముల నెల్లఁ ద్రుంచి, నీటిపైభాగమునఁ దేలుచు, నీటి వేగము నడ్డగించునట్లు చేసెదను. లక్ష్మణా! యీ సముద్రమున నుండు సర్పముల గొప్పదేహములను, ఏనుఁగుల యాకారమువంటి యాకారము గల మత్స్యముల తొండములను నిదిగో నాబాణములచేఁ ద్రుంచి పడఁ ద్రోసెదను చూడుము. శంఖములు ముత్యపుచిప్పలు మొదలగునవి గలదియు, చేఁపలు మొసళ్లునుం గలదియు నైన యీసముద్రునితో గొప్పయుద్ధ మొనర్చి యితని నింకింపఁజేసెదను. ఈసముద్రుఁ డోర్పుతో నున్న నన్నుఁ జూచి, యసమర్థునిఁగా నెంచుచున్నాఁడు. ఇట్టి నీచుల యెడ నోర్పు పనికి రాదు. నేను బ్రతిమాలుకొన్న నీసాగరుఁడు స్వస్వ రూపము జూపఁడు. సౌమిత్రీ! ధనుస్సును సర్పములంబోలు బాణములను దెమ్ము. ఇదిగో! సముద్రుని నింకించెదను. ఆవల వానరులు కాలినడక తోడనే యావలికిఁ బోవుదురుగాక! ఎప్పటికిని జెల్లెలికట్ట దాఁటఁ గూడ దను నియమ మేర్పఱపఁబడినదియు, తరఁగలచేఁ నల్లకల్లోలమైనదియు, గొప్పరాక్షసులచే భయంకరమైనదియు నైనందునఁ గలఁతపెట్ట నలవి కానిదై యున్నను, వరుణుని నివాసస్థలమయిన యీ మహాసముద్రమును కోపముతోఁ బ్రయోగించు సాయకములతోఁ గలఁతపెట్టి చెల్లెలికట్ట పొర్లివచ్చునట్లు చేసెదను" అనెను.

ఇట్లు చెప్పి రాముఁడు విల్లు చేతఁ బట్టి, కోపముచేఁ గన్నులు గిర గిర ద్రిప్పుచు ప్రలయకాలాగ్నిహోత్రునిమాడ్కిఁ బ్రజ్వరిల్లుచు, చెనక వీలుకానివాఁడై, విల్లువంచి, బాణములను వింటియందు జోడించి, నారి

మ్రోఁతచే జగత్తుం గడగడలాడించుచు, దేవేంద్రుఁడు వజ్రాయుధ మును బ్రయోగించుచాడ్పున నిశితసాయకముల నాసముద్రునిమీఁదఁ బ్రయోగించెను. ఆయుత్తమబాణములు దగదగమెఱయుచు, భయం కరము లైన సర్పములతోఁ గూడియున్న సముద్రజలమునడుమఁ గడు వేగముతోఁ బాఱఁజొచ్చెను. అప్పు డలలు నక్రమకరములతోఁ గూడినవై, గాలివీచుటచేఁ బుట్టినధ్వనితోఁగూడి మహాభయంకరముగా బర్వుచుండెను. అంత వేగమ యాసముద్రము గొప్పయలలవరుసలతోను, అంతటను నిండియున్న శంఖములతోను, ముత్తెపుచిప్పలతోను, పొగతోఁ గూడి సుళ్లుదిరుగుచున్న అలలతోను నెఱసినదయ్యెను. ఆసముద్రము లోపల నున్న పన్నగులును, పాతాళలోకవాసులగు వీర్యవంతు లైన దానవులును ప్రజ్వరిల్లు నేత్రములను వదనములను గలవారై దిగులుచే నొచ్చిరి. సముద్రమునందలి యలలు నక్రమకరములతోఁ గూడినవై, విశేషముగా వింధ్యమందరపర్వతము లంతయెత్తునకు లేచినవి. సముద్రమునందలి యలలవరుసలు చెదరినవి. పన్నగులు రాక్షసులును వెఱచిరి. గొప్పమొసళ్లును తత్తరపడి యలలలోఁ జొచ్చుచుండినవి. అట్లు కడువేగముతో నప్రమేయమైన ధనుస్సు నీడ్చుచు వేడి నిట్టూర్పులు విడుచుచు నున్న యా రామునిఁ జూచి, లక్ష్మణుఁడు వలదు వల దని చెప్పి యాతనిచేత నున్న వింటిని బట్టుకొనినవాఁడాయెను.

22-వ సర్గము

రాఘవుఁడు సముద్రునిమీఁదఁ గోపము చూపుట

అంతట రఘువంశప్రదీపుఁ డైన బల్మికాఁ డగు రాముఁడు సము ద్రునిఁజూచి, "ఓరీ! ఇదిగో; నిన్నుఁ బాతాళపర్యంత మెండింపఁజేసెదను జూడుము. నాబాణ ప్రయోగముచే నీయందలి నీ ళ్లెండి జంతువు లెల్ల మాడిపోయి, మిగుల దట్టముగ దుమ్ము రేఁగఁగలదు. నేను ధనుస్సు నుండి వర్షమువలె విడిచిన బాణములు సేతువుగా నేర్పడఁగా, వానర సైనికు లిప్పుడు కాలినడకతో నవతలిగట్టునకు దాఁటిపోవుదురు. దానవుల కునికిపట్టయిన యో సముద్రుఁడా! దానవులసంబంధముంబట్టి వారికివలె నీకును నాబలపరాక్రమములు విశేషముగా నాలోచించియుఁ దెలియ కున్నవి. నీకు నావలన నిఁకఁ గొంతతడవులోపలఁ గలుగఁబోవు సంతా

పము నెఱుఁగక యున్నావు. ఇదిగో తెలిపెదను జూడుము" అని చెప్పి, బ్రహ్మదండమువంటి బాణమును బ్రహ్మాస్త్రముతో నభిమంత్రించి, శ్రేష్ఠమైన ధనుస్సునందు సంధించి యాకర్ణాంత మీడ్చెను. అట్లు రాఘవుఁడు వేగిరముగా నావింటినారి నీడ్వఁగా, దానిధ్వనిచే భూమ్యాకాశముల మధ్యప్రదేశము బ్రద్దలయినట్లుండెను. పర్వతములు వణఁకెను; లోకమంతయుఁ జీఁకటి క్రమ్మెను; దిక్కులు వెలుఁగకుండెను. నదులును, కొలఁకులును కలఁకపాఱెను. సూర్యచంద్రులిద్దఱు నక్షత్రసమేతముగా వక్రగతినొందిరి. అప్పు డాకాశము సూర్యకిరణములచే జ్వలించుచు, చీఁకటిచేఁ గ్రమ్మఁబడి, యుల్కాశతములచేఁ బ్రకాశితమై యుండెను. ఆకాశమునుండి పిడుగులు గొప్పమ్రోఁతలతో వెడలి వచ్చుచుండెను. ఆకాశమున దివ్యమేఘములు సంచరించెను. ఆవహ, ఉద్వహ, ప్రవహాదులగు శ్రేష్ఠములైన వాతస్కంధములు దట్టములై యాకాశమున వీఁచెను. అప్పుడు పెనుగాలి చెట్లను, మేఘములను పైకిఁ గొనిపోవుచు, పర్వతములకొనలను, శిఖరములను గదలించెను. గొప్పమేఘములు మిన్ను ముట్టుచు మహారవములతో నొండొంటి నొరయుచు మెఱుపుసంబంధములైన యగ్నులను వెలువరించెను. అవి గొప్పపిడుగు లయి నేలఁబడినవి. కంటికిఁ గనఁబడు మనుష్యాదిభూతములును, కంటికిఁ గనఁబడని పిశాచాదిభూతములును భయముచేఁ దత్తరపడినవై, వణఁకుచుఁ బిడుగుతో సమముగా నఱచి, భయంకరములైన కూఁతలు పెట్టినవి; నిద్రించునవివోలెఁ గ్రిందఁబడినవి; మిక్కిలి వ్యసనము నొందినవి: దిగులువలనఁ గదలకుండినవి. మహాసముద్రుఁడు జంతువులతోను, అలలతోను, పన్నగరాక్షసులతోను గూడి హెచ్చిన ప్రవాహవేగముగలవాఁడయి, చెల్లెలి కట్ట దాఁటి నూఱుయోజనములదూరము వచ్చెను. శత్రుసంహారి యగు రామునిఁ డట్లుప్పొంగి మర్యాదమీఱి వచ్చినను, ఆసముద్రునిఁ గరుణచే నేమియుఁ జేయకుండెను.

అప్పుడు సముద్రమధ్యమునుండి సముద్రాభిమానిదేవత, మేరుపర్వతమునుండి సూర్యుఁ డుదయించునట్లు పైకి లేచెను. సముద్రుఁడు నున్నని వైడూర్యముల కాంతివంటిమేనికాంతి గలవాఁడై, బంగారుభూషణములను ధరించి, యెఱ్ఱనివలువఁ గట్టి, తామరరేకులం బోలు

కన్నులుగలవాఁడై, శ్రేష్ఠమైన యన్ని పువ్వులు గ్రుచ్చిన దండలను దాల్చి, బంగారుతొడవులు, అపరంజి సొమ్ములు తనలోని రత్నములు చెక్కిన భూషణములు, తనయందుఁ బుట్టిన ముత్తెములతోఁజేసిననగలు దేహమున నలంకరించికొని, నానావిధగైరికాదిధాతువులచే శోభిల్లఁ జేయఁబడిన హిమవత్పర్వతముమాడ్కి శోభిల్లుచు, పాటలవర్ణము గల దియై, కౌస్తుభమణిం బోలునట్టి ముత్యాలహారమునడుమ నుండు నాయకమణిని విశాలమైన తనయొమ్మునందుఁ దాల్చి, కదలుచుండు నలల వరుసలు గలవాఁ డయి, మేఘముల వరుసలచేతను, గాలిచేతను గలఁత పెట్టఁబడినవాఁడై, ఎగురుచుండు గొప్పమొసళ్లతోఁగూడి, తత్తరపా టొందిన పన్నగరాక్షసులును, చక్కనిరూపంబు గల దేవతాస్త్రీరూపం బులఁ దాల్చిన గంగ, సింధువు మొదలగు నదులును గూడ వచ్చుచుం డఁగాఁ బైకిలేచివచ్చి బాణహస్తుఁడై యెదుట నిల్చియున్న రాఘవునిం జూచి యంజలిబద్ధుఁడై యిట్లనియె: "ఓరఘునందనా, భూమి, వాయువు, ఆకాశము, అప్పు (ఉదకము), వెలుతురు అను నీయైదుపదార్థములును నియతక్రమము ననుసరించి తమతమ స్వభావములందే యుండునవి. నేను లోఁతు గలిగి, దాఁటనలవికాక యుండుట నాస్వభావము. లోఁతులేక యుండుట విపరీతము. ఇదియే నిజము. మీకుఁ జెప్పితిని. రాజనందనా! నేను కోరికచేతఁగాని, చేతఁజిక్కినవస్తువును విడువఁగూడ దనియెడి యోర్వలేనితనముచేతఁ గాని, శిక్షింతు వన్నభీతిచేఁ గాని మకరనక్రము లతోఁ గూడియున్న నీటిని స్తంభింపఁజేయఁజాలను. నీ సేనదాఁటు నంత దనుక మొసళ్లు బాధింపకుండుటకును, వానరసేన దాటుటకు చాలి నంతస్థలము నొసఁగుటకును నే నోర్చియుందును." అని శ్రీరామునితోఁ జెప్పెను.

అప్పుడు రాముఁడు సముద్రునిఁ జూచి "నదీపతీ, ఈమహాబాణ మును వింటియందు సంధించితిని. ఇది యమోఘమైనది; కనుక దీని నే ప్రదేశమునఁ బ్రయోగింతు" ననిన, సముద్రుఁడు రామునివాక్యమును విని, యాతనిచేత నున్న గొప్పయమ్మును జూచి, యిష్టార్థలాభముచే నెక్కువ కాంతి గలవాఁడయి, యా రామునిఁగూర్చి, "రాఘవా! నా కుత్తరపువైపున మిగుల సుందరమైన యొకప్రదేశ మున్నది. అచ్చటఁ

జెట్లకుఁ బాఱుటకుఁ గానైన కాలువలు విశేషముగా నున్నందున, నా ప్రదేశము లోకమున నీవు ప్రసిద్ధి కెక్కియున్నట్లే ద్రుమకుల్య మని ప్రసిద్ధికెక్కియున్నది. అచ్చట భయంకర దృష్టికార్యములు గలవార లగు కిరాతులు మొదలగు పాపాత్ము లయినవారున్నవారు. వారు నా జలములఁ ద్రాగుచుందురు. పాపంపుఁ బనులు చేయునట్టివారి తాఁకు డుల నే నోర్వఁజాలను. కావున నీబాణమును వారియందుఁ బ్రయో గించి సార్థకముచేయుము" అని చెప్పఁగా, వీరుఁ డగు రాముఁడు సాగ రుని యా మాటలను విని, సముద్రుఁడు చెప్పినప్రకారమే మండుచున్న బాణము నా ప్రదేశమునఁ బ్రయోగించెను. కాఁబట్టి యా ప్రదేశము మరుకాంతార మని ప్రసిద్ధి కెక్కినది. మండుచున్న పిడుగువలెఁ బ్రకా శించునట్టి యా బాణము పడిన ప్రదేశమున గొప్పరొద యొక్కటి పుట్టెను. పాతాళమునుండి రామునిబాణము దగిలిన రంధ్రముననుండి నీరు వెలువడెను. నీరు వెలువడిన యా రంధ్రము వ్రణకూప మని ప్రసిద్ధి కెక్కెను. ఆ వ్రణకూపమునఁ బుట్టిన జల మెల్లప్పుడు సముద్రపునీటి వలె నుప్పనయి యుండును. శరము పడినప్పుడు గలిగిన భేదనశబ్దము భయంకరముగా నుండెను. రాముఁ డా బాణప్రయోగముచేసి, పూర్వ మచ్చటి పాపులకు జీవనాధారముగా నుండిన యా పల్లములోని నీరం తయు నింకింపఁజేసెను. ఆ ప్రదేశమంతయు నదిమొదలు ముల్లోక ములందును మరుకాంతార మని ప్రసిద్ధి కెక్కెను. అట్లు దశరథపుత్రుఁ డగు రాముఁ డాప్రదేశము నెండింపఁజేసి, దానిని బశువులకు హితము గను, ఆరోగ్యప్రదముగను, ఎక్కువ పసులపాఁడి గలదిగను, చక్కని వాసన గలదిగను, నానావిధము లైన మూలికలు గలదిగను, పెక్కు సుగుణములు కలదిగను నుండున ట్లొనరించెను. రాముని యనుగ్రహ మునం జేసి యా ప్రదేశమంతయు సుఖప్రదమై యొప్పారెను.

ఆ కుక్షిప్రదేశము రామునిబాణముచే దగ్ధమైనతర్వాత, నదు లకు భర్త యగు సముద్రుఁడు సకల శాస్త్రముల నెఱిఁగిన రామునిఁ గూర్చి యిట్లనెను: "ఓసౌమ్యా! ఈ వానరసేనయందు విశ్వకర్మపుత్రుఁ డగు నలుఁడను వానరుఁ డొక్కఁ డున్నవాఁడు. విశ్వకర్మ "నాతో సమాన మగు సామర్థ్యము గల పుత్రుఁడు నీకు జన్మింపఁగలఁడు" అని

తన పత్నికి వరమొసఁగెను. అట్టి తల్లికిఁ బుట్టినవాఁడు గనుక, నలుఁడు విశ్వకర్మతో సమానుఁ డైనవాఁడు. మహోత్సాహముగల యీ నలునిచే నాయందుఁ గట్టను గట్టింపుము. ఇతఁడు తండ్రివంటివాఁడు. నేను ఈతనిచేఁ గట్టఁబడు కట్టను ధరించెద" అని చెప్పి సముద్రుఁ డంతర్ధానము నొందెను. అంతట వానరశ్రేష్ఠుఁ డయిన మహాబలుఁడగు నలుఁడపుడు లేచి రామునిఁ జూచి, "విశాలమైన సముద్రమునందు నేను సేతువు గట్టెదను. ఈ మహాసముద్రుఁడు నా తండ్రి బలిమి నెఱిఁగినవాఁడు గనుక, వాస్తవమైన మాటను జెప్పెను. లోకమున మానవునికి దండమే పురుషార్థసాధనములలో నుత్తమ మని నామతము. కృతఘ్నులయెడ నోర్పుగాని, సామదానములు గాని యుపయోగపడవు! ఈ భయంకరుఁడయిన సాగరుఁడు దండభయమువలనఁ దనయందు సేతుబంధనము గావింప నంగీకరించెను. మందరపర్వతమున విశ్వకర్మ నా తల్లికి వరమొసంగెను. విశ్వకర్మ కౌరసపుత్రుఁడను గనుక నే నతనితో సమానమగు శిల్పకర్మసామర్థ్యము గలవాఁడను. నన్నుఁ గూర్చి యొక్కరు చెప్పనియెడల, నేను నా గుణములను స్వయముగాఁ జెప్పికొనఁగలవాఁడను గాను. నేను వరుణాలయమయిన సముద్రమునందు సేతువు నిర్మింపఁ జాలుదును. ఈ మహాసముద్రుఁడు నిక్కము పలికి, నాశక్తిని నాకు జ్ఞప్తికిఁ దెచ్చినాఁడు. వానర శ్రేష్ఠులందఱు నిప్పుడే కట్ట కట్టుటకు బాలు మొదలగునవి తెత్తురుగాక!" అని చెప్పెను.

నీలుఁడు వానరులసాహాయ్యమున సేతువుఁ గట్టుట

తర్వాత పర్వతసమాను లైన వానరశ్రేష్ఠు లందఱు రాముని యానతి గొన్నవారలై, మహానందముతోఁ గూడి, గుంపులు గుంపులుగా గొప్ప యరణ్యములకుఁ బోయి, యచ్చట గొప్పవృక్షముల విఱిచి సముద్రమునకుఁ దెచ్చిరి. వానర యూథనాథులు మద్దిచెట్లు, ఇనుమద్దిచెట్లు, చంద్రచెట్లు, వెదుళ్లు, కొండమల్లెచెట్లు, తాటిచెట్లు, బొట్టుగుచెట్లు, తిమిశవృక్షములు, బిల్వవృక్షములు, ఏడాకులయరఁటి చెట్లు, పూఁచిన కొండగోఁగు చెట్లు, మామిడిచెట్లు, అశోకవృక్షములు, దానిమ్మచెట్లు, కొబ్బరిచెట్లు, తాండ్రచెట్లు, పొగడచెట్లు, తుమ్మచెట్లు, వేపచెట్లు మొదలగు చెట్లను కొన్నిటిని వ్రేళ్లతోఁగూడను, కొన్నిటిని వ్రేళ్లు

లేకయుఁ బెళ్లగించి, యింద్రధ్వజములం బోలెఁ బైకెత్తికొని వచ్చి సముద్రమునఁ బడవైచిరి. మఱియు, మహాకాయులును మహాబలులు నగు వానరు లేనుఁగులంత గొప్పఱాలను, పర్వతములను బెళ్లగించి యంత్రములతోఁ గొనివచ్చిరి. వానరు లట్లు పర్వతములను దెచ్చి సముద్రమునఁ బడవేయునప్పుడు వేగముగా నచ్చటినుండి నీరు పైకెగిరి, యాకాశమునం దచ్చటచ్చటను వ్యాపించెను. ఇవ్విధముగా వానరు లందఱు సముద్రము నంతయును క్షోభింపఁజేసిరి. మఱి కొందఱు వానరులు మట్టము చూచుటకై నూఱుయోజనముల నిడివి గల దారములను బట్టుకొనిరి. కొందఱు కఱ్ఱలను చేతఁబట్టుకొనియుండిరి. కొందఱు సేతువును జక్కఁ బెట్టుచుండిరి. అనేకులు వానరులు రామునియాజ్ఞను మునుకొన్న వారలై, మేఘములంబోలు పర్వతశిఖరములను, తృణకాష్ఠములు మొదలగునవియుఁ బూఁచినకొనలు గల చెట్లను తెచ్చి యా సేతువు మీఁద బడవేసి సేతువు కట్టుచుండిరి. వారణములం బోలు వానరులు కొండలం బోలు బండలను పర్వతశిఖరములను మోసికొని పరుగెత్తుకొనివచ్చినప్పుడు జను లంద ఆశ్చర్యముతోఁ జూచిరి. వానరులు తెచ్చివేయు బండలయుఁ బడవేయు పర్వతములయు గొప్పధ్వనులచే నా పర్వతమున భయంకరమైన ధ్వని గలిగెను.

మొదటిదినమున నేనుఁగులం బోలువారును, గొప్పదేహములు గలవారును నైన యా వానరులు ముదముతో వచ్చి, వేఱుక పూని, పదునాలుగువేల యోజనములదూరము కట్ట కట్టిరి. భయంకర మైన యాకారములును, మహాబలమునుం గలవా రగు నా వానరవీరులు ద్వితీయదినమున నిరువదియోజనములదూరము కట్టను గట్టిరి. మహాకాయు లైన వానరు లుత్సాహవంతులై మూడవదినమున నిరువదియొక యోజనముల దూరము కట్ట కట్టిరి. నాలవదినమున మహావేగముతోఁ గూడిన యా వానరు లిరువదిరెండువేలయోజనముల దూరమును, ఐదవదినమున నిరువదిమూఁడువేల యోజనముల దూరమును కట్టను సువేలపర్వతము సమీపమునకుఁ గట్టిరి. తండ్రివలె శిల్పమందు మహాసమర్థుఁడును, వానరశ్రేష్ఠుఁడును, కాంతిమంతుఁడును, విశ్వకర్మపుత్రుఁడును నైన నలుఁడు తండ్రివలెనే వానరులతోడ్పాటునంజేసి

సముద్రమధ్యమునఁ గట్ట కట్టెను. మకరముల కునికిపట్టగు సముద్రమున నలుఁడు కట్టిన కట్ట సుందరమును, కాంతిమంతమును నై యాకాశమున స్వాతీనక్షత్రవీథివలె బ్రకాశించెను.

ఆనలుఁడు సేతువు గట్టునప్పు డా యద్భుతసేతు నిర్మాణమును జూచువేడుకతో వచ్చిన దేవ గంధర్వ సిద్ధ మహర్షులు, సకలభూతములును, చింతింపరానిదియు, ఓర్వరానిదియు, ఆశ్చర్యకరంబును, గగ్గురుపాటొదవించునదియు నైన సేతువును జూచి మహాశ్చర్యము నొందిరి. ఆ మహాపరాక్రము లగు వానరవీరులు అట్టిటు నెగురుచుఁ బరమానందభరితులై సాగరమున సేతువుంగట్టుచు, సముద్రపుటావలిగట్టుచేరిరి. విశాలమును, చక్కఁగాఁ గట్టఁబడినదియు, కాంతిగలదియు నున్నని నేల గలదియు, మిట్టపల్లములు లేకుండునట్లు చక్కఁబఱపఁబడినదియు నైన యా సేతువు సముద్రమందు పాపటవలెఁ బ్రకాశించెను.

అటుతర్వాత విభీషణుఁడు గదాధారియై మంత్రులతోఁ గూడ మున్నుందుగా సముద్రపు టావలిగట్టు చేరి శత్రుసంహారము నిమిత్తము వేచియుండెను. అంతట సుగ్రీవుఁడు తిరమగు మగఁటిమి గల రామునిం జూచి, "రాఘవా! నీవు హనుమంతునిమీఁదఁ గూర్చుండుము. లక్ష్మణుఁ డంగదునిమీఁద నెక్కును. శూరుఁడా! ఈ మహాసముద్రము మిక్కిలి విశాలమయినది. కావున మీరు నడచివచ్చుటకు వీలు గాదు. ఈ హనుమదంగదులు మిమ్ము నిద్దఱ నాకాశమునఁ గొనిపోయి సముద్రమును దాఁటింపఁగలరు" అని చెప్పఁగా, విలుకాఁడును, ధర్మస్వభావుఁడును నైన రాముఁడు వానర సైన్యమునకు ముందుగా నిలిచి లక్ష్మణసుగ్రీవులతోఁ గూడి పయనమై పోయెను. కొందఱు వానరులు మార్గమధ్యమునఁ బోయిరి. కొందఱు ప్రక్కల నడచిరి. కొందఱు నడచుటకు దారి లేక నీళ్లలోఁ బడుచు లేచుచుఁ బోయిరి. కొందఱు దారి చాలక యచ్చటనే నిలఁబడి, వెనుకఁ జిక్కి పోయిరి. కొందఱు వానరులు గరుడుల మాడ్కి నాకాశ మార్గముననే సముద్రము దాఁటి పోయిరి. ఆ భయంకర మైన వానరసేన సముద్రము దాఁటునప్పుడు గలిగిన గొప్పధ్వని సముద్రమునఁ బుట్టెడి భయంకరమైన గొప్పధ్వని నణఁగఁద్రొక్కెను. నలుఁడు కట్టిన యా సేతువుమూలమున దాఁటిన యా వానరసేనను

సుగ్రీవుఁ డా కడలిదక్షిణపుటొడ్డునఁ బెక్కు కందమూలఫలోదకములు గల యొక ప్రదేశమున నిల్పెను. ఇవ్విధమున రాముఁ డొనర్చిన గొప్ప యాశ్చర్యకరమయిన పనిని జూచి, దేవగంధర్వసిద్ధచారణులు మహర్షులతోఁ గూడి వచ్చి, యొక్కరొక్కరు పుణ్య జలములచే రాము నభిషేకించి, "ఓ నరదేవా! శత్రువులను జయింపుము. పెక్కేండ్లు సాగర పర్యంతమైన పుణ్యభూమిని బాలింపుము" అని సకలజనపూజితుఁడైన రామునిఁ బెక్కు తెఱఁగులైన మంగళవాక్యములచే స్తుతించిరి.

23-వ సర్గము

రాముఁడు యుద్ధసూచనలను లక్ష్మణునకుఁ దెల్పుట

శుభశకునములను దుశ్శకునములను నెఱిఁగిన లక్ష్మణుని యన్నయగు రాముఁ డప్పుడు కలిగిన దుశ్శకునములను జూచి, తాను బహుకాలమునుండి కోరిన యుద్ధసమయము సంప్రాప్తమగుటవలని సంతోషాతిశయముచే లక్ష్మణుని గట్టిగాఁ గౌఁగిలించికొని యిట్లనియె.

"లక్ష్మణా! శీతజలమును, ఫలవంతములైన వృక్షములును గలిగిన ప్రదేశమును జూచి; యచ్చట నీదండును జీలఁదీసి, గరుడరూపమున నిలిపి విశ్రమించి యుందము. గొప్పవీరు లగు ఋక్షవానరులకును రాక్షసులకును భయంకరమగు ఆపద సమీపించిన దని తలంచెదను.

గాడ్పులు దుమ్ముతోఁ గూడినవై వీఁచుచున్నవి, భూమి యదరుచున్నది, పర్వతశిఖరములు కదలుచున్నవి; చెట్లు పడుచున్నవి. మేఘములు క్రూరమృగాదులరూపములతోఁ జూడ నలవికానివై వీనులు బ్రద్దలగునట్లు ధ్వనిచేయుచు భీకరములై క్రూరముగా రక్తబిందువులతోఁగూడ వర్షమును గురిపించుచున్నవి. సంధ్యాకాలమున మేఘము లెఱ్ఱనిచందనమువంటి వన్నెగలవై యెక్కువభీతిని గలిగించుచున్నవి. సూర్యుఁడు దీపించుచు నగ్నిని వర్షించు చున్నాఁడు. మృగపక్షులు దీనవదనములును కంఠస్వరమును గలవై యెక్కువ భయమును గలిగించుచు, సూర్యుని కెదురుదిరిగి యఱచుచున్నవి. రాత్రివేళ చంద్రుఁడు కాంతిలేనివాఁడై వేఁడిమిని గలిగించుచున్నాఁడు. చుట్టు నల్లగను దానికిఁ జుట్టు నెఱ్ఱగను నుండునదియు, నడుమ మిగుల నెఱ్ఱనిదియు, చిన్నదియు, క్రూరమైనదియు, ఇదివఱ కెన్నఁడును సంభవింపనిదియు నైన సూర్య

Acc. No: N-11262
Class No: 294.5922 SRE

పరివేషము ప్రలయకాలమునందుంబోలెఁ గన్పట్టుచున్నది. లక్ష్మణా, నిర్మలమైన సూర్యబింబమునందు నల్లని మచ్చ యొక్కటి తెలియుచున్నది. నక్షత్రములు సైత మెక్కువ దుమ్ముచేఁ గ్రమ్మఁబడినవై జనక్షయమును దెల్పుచున్నట్లున్నవి చూడుము. కాకులు, డేగలు, గ్రద్దలును తమకంటెఁ దక్కువ బలముగలవానిచేఁ జిక్కి యోడిపోవుచున్నవి. నక్కలును అశుభసూచకము లైన యమంగళకరములగు కూఁతలు కూయుచున్నవి. వానరులును రాక్షసులును నొండొరులమీఁదఁ బ్రయోగించెడి పర్వతములచేతను శూలములచేతను ఖడ్గములచేతను భూమి గప్పఁబడి మాంసరక్తము బురదలతో నిండఁగలదు. మనము సకలవానరసేనం దోడ్కొని, యెవరికిని జాఁట నలవికానిదైన రావణపాలిత మగు లంకాపురము నిప్పుడే, వేగిరముగాఁ బ్రవేశింతము."

అని చెప్పి ధర్మాత్ముఁడును, విలుకాఁడును యుద్ధముచే సంతసించువాఁడును నైన రామభూవిభుఁడు అందఱికంటె ముందుగాఁ దాను లంకాపురిని యెదుర్కొనిపోయెను. ఆతనివెంబడి విభీషణుఁడు, సుగ్రీవుఁడు ముందు పోవుచుండఁగా, వానరశ్రేష్ఠు లందఱు శత్రువధము చేయ నిశ్చయించుకొన్నవారై సింహనాదములు సేయుచు వారివెంబడి నడచిరి. ధైర్యశాలురును, శౌర్యవంతులు నైన యా వానరులు చేయు యుద్ధోత్సాహసూచకచేష్టలను జూచి రఘుపుంగవుఁ డెక్కువ సంతోషమును బొందిన వాఁడయ్యెను.

24-వ సర్గము

రాముఁడు వానరులను వ్యూహములుగ నిలుపుట

రాఘవునిచేఁ జక్కఁగా విడఁదీసి నిల్పఁబడిన వానరవీరసైన్యము ప్రకాశయుక్తమైన నక్షత్రగణముతోఁ గూడి చంద్రునిచే విరాజిల్లు శరత్కాలమునందలి పున్నమమాడ్కి వెలుఁగుచుఁ సముద్రముచందమున నపరిమేయమై, యాగమనవేగముచే భూమిని గదలించుచు నా లంకాపురముచేరువఁ జేరి విరాజిల్లుచుండెను. ఆసైన్యమందలి వానరవీరులందఱు లంకాపురమునుండి వెలువడునట్టి యుద్ధసూచకమైన రోమాంచముగలిగించు భేరీమృదంగాది వాద్యములధ్వనిని విన్నవారై, మనమున 'హర్షమునొంది, యాతూర్యఘోషమును సహింపనేరక, యంత

Acc No. 11262

కంటె హెచ్చినినాదము గలుగునట్లుగా సింహనాదము గావించిరి. ఆవానరవీరులు గర్వితులై, యొనరించిన మేఘగర్జనముఁ బోలు సింహనాదమును రాక్షసవీరు లందఱు విని మనసులందుఁ గలంగిరి.

అంతట వీరుఁ డగు దశరథనందనుఁ డైన యారాముఁడు చిత్రధ్వజపతాకములు గలదైన లంకాపురమును జూచి, సంతాపము నొంది సీతను మనస్సునఁ దలఁచి, "రోహిణి దుష్టుఁ డయిన యంగారకునిచే నాక్రమింపఁబడినయట్లు, లేడిపిల్లకువలె భయచంచలము లగు నేత్రములు గల సీతాదేవి రావణునివశమునఁ జిక్కియున్నది కదా" అని వేఁడి నిట్టూర్పులు నిగిడించి, లక్ష్మణునివైపు చూచి తన కాసమయమునకు హితమైన మాటను జెప్పెను.

"లక్ష్మణా! చూడు మీ లంకాపురమును. ఇది యాకాశము నొఱయుచు, విశ్వకర్మచేఁ ద్రికూటపర్వతశిఖరమున మనస్సుతో సృజింపఁబడెనో యనఁబరఁగియున్నది. మఱియు, భూలోకమున నీలంకాపురమేడంతస్తులు గల పెక్కుగృహములతోఁ గూడి, తెల్లనిమబ్బులచేఁ గ్రమ్మఁబడిన యాకాశముమాడ్కిఁ బ్రకాశించుచున్నది. మఱియు నీలంకాపురము పెక్కుపక్షుల ఘోషముతోఁ గూడి, పుష్పఫలభరితములై, రమణీయములై కుబేరునిచైత్రరథ మనెడి యుద్యానముం బోలియున్న వనములతో నొప్పారుచున్నది. మఱియుఁ బండ్లను దినుటచే మదించిన పక్షులును, పూఁదేనియలఁ గ్రోలుటచే మైమఱచి చెట్లలో నిద్రించుచున్న భ్రమరములును, పల్లవభక్షణమున నాసక్తి గల కోకిలములును వనములకు శోభాయమానములై యున్నవి. తిన్నని చల్లని కమ్మని మారుతము వీచుచున్నది" అని లక్ష్మణునితోఁ జెప్పి, రాఘవుఁడు రాజనీతియందుఁ జెప్పఁబడిన తెఱఁగున నా సేన నంతయు విడఁదీసి నా వానరవీరుల కిట్లని యానతిచ్చెను.

"ఓ కపిశ్రేష్ఠులారా! శత్రువులచే జయింప నలవికానివాఁడును, మగటిమిగలవాఁడునగు నంగదుఁడు నీలుని సహాయునిఁగాఁ బెట్టికొని, పరివారములతోఁ గూడి సేనయొక్క హృదయమునం దుండుచుఁ గాక! వానరశ్రేష్ఠుఁ డగు ఋషభుఁడు గొప్ప వానరబలముతోఁ గూడినవాఁడై సేనయొక్క కుడిప్రక్క నుండునుగాక. మదపుటేనుఁగు

V.R. NATARAJA MEMORIAL LIBRARY (V.R.N.A.R.L.) Acc. No.

చందంబున నొరులచే నెదిరింప నలవి కానివాఁడును, బలవంతుఁడు నైన గంధమాదనుఁడు యెడమప్రక్క నుండునుగాక. నేనును లక్ష్మణుఁడును సేనయొక్క శిరోభాగమున నుందుము. కొండమ్రుచ్చులలో మేటులగు ధైర్యశాలు రయిన జాంబవత్సుషేణవేగదర్శులును సేనయొక్క కుక్షిభాగమును రక్షింతురు గాక. ప్రతాపశాలి యగు వరుణుఁడు పశ్చిమదిక్కు నేలుచందమున ప్రతాపవంతుఁ డైన సుగ్రీవుఁడు సేనయొక్క పశ్చిమభాగమును రక్షించునుగాక!" యని చెప్పి సేనను విడఁదీసి, సేన కొక్కొక్కవైపునను రక్షకుల నేర్పఱచినవాఁడయ్యెను. రామునిచే గుంపులుగుంపులుగా విడఁదీయఁబడి, గొప్పవానరుల కాఁపుదలలో నుంచఁబడిన యా సేన మేఘసంచారముతోఁ గూడిన యాకాశముమాడ్కి వెలిఁగెను. ఆసేనయందలి వానరోత్తములు పర్వతశిఖరములను, గొప్ప భూరుహములను దాల్చి లంకను నాశముచేయఁగోరినవారై "ఎప్పుడు మన మాలంకాపురమును బర్వతశిఖరములతోను వృక్షముతోను గొట్టియు, పిడికిళ్లతోఁ బొడిచియుఁ జూర్ణము గావింతుమా" యని మనస్సున నాతురతతోఁ గూడినవారై యుండిరి. అప్పుడు మహాప్రతాపశాలి యగు రాముఁడు సుగ్రీవుం జూచి, "మనము సేనలను విడఁదీసి సన్నగా నిల్పితిమి. ఇఁక నీ శుకుని విడిపింపుము" అని యానతియ్యఁగా, బలవంతుఁడయిన వానరోత్తముఁ డగు సుగ్రీవుఁడు రామునియానతింబట్టి శుకుని విడిపింపఁగా, నతఁడు వానరులచేఁ దన్నులు తిని, రాముని యనుగ్రహమునఁ బ్రాణములతోఁ దప్పించికొని మహాభీతితోఁ బరతెంచి, రావణునికడకుఁ బోయిచేరెను.

రావణుఁడు తనకడకు వచ్చిన శుకునిఁ జూచి, "వానరులు నీఱెక్కలను కట్టిపెట్టిరా? నీవు ఱెక్కలు తెగినవానిమాడ్కిఁ గనఁబడుచున్నావు. చపలచిత్తులగు నావానరులవశమున నీవు చిక్కుకొనక వచ్చితివి గదా" యని పరిహసించుచునే యడుగఁగా, శుకుఁడు భయముచే వణఁకుచు, రాక్షసాధిపతి యగు రావణునకు ని ట్లనియె: "ఓరాక్షసేంద్రా! నేను సముద్రపుత్తరపు టొడ్డు చేరి, తిన్ననిమాటలతో ననునయించుచు నాసుగ్రీవునితో నీవు సెప్పినతెఱఁగున సంగతి యంతయు విడువక నిర్భయముగాఁ బలికితిని. వానరులు నన్నుఁ జూచినమాత్రముననే కినుక

పూని, నన్నుఁ బట్టుకొని పిడికిళ్లతో గ్రుద్ది ప్రాణములను దీయుట కారంభించిరి. రాక్షసాధిపా! అట్టి యావానరులతో మాటాడుటకే యవకాశము దొరకలేదు. మాటాడినను ప్రత్యుత్తరము నిచ్చు వా రచ్చట లేకయే పోయిరి. వానరులు స్వభావముననే కోపిష్ఠులును, క్రూరులు నై యున్నారు. విరాధ, కబంధ, ఖరులను సంహరించిన వాఁడయిన యారాముఁడే సముద్రమున సేతువు గట్టి, లవణసముద్ర మును దాఁటి రాక్షసుల నందఱ నదలించి సీతాదేవి యుండుతావును గనుఁగొని వచ్చియున్నాఁడు! మఱియు, పర్వతములను మేఘములను బోలిన కొండముచ్చులయు, వానరులయు సంఘములు వేనవేలుగా భూమి నాక్రమించుకొనుచు వచ్చుచున్నవి. దేవదానవులకు సంధి కానట్లు, రాక్షసవీరుల బలమునకు వానరవీరుల బలమునకును ఈ రెంటికి నెన్నటికిని సంధిగలుగనేరదు. నీవు నీవారిమేలు కోరినవాఁడ వైతి వేని, వారు వచ్చి ప్రాకారమును ముట్టడించునంతలోపల, వెంటనే రామునికి జానకి నొసంగుము; కాకున్న యుద్ధము సేయుము." అని శుకుఁడు రావణునితో వినయనమ్రుఁడై యచ్చట జరిగినసంగతిఁ దెలిపెను.

రావణుఁడు శుకునివాక్యమును విని కోపముచే నేత్రముల నుండి నిప్పులు రాల్చుచు, దహించువానిచందమునఁ జుఱచుఱఁ జూడ్కి నిగిడించి, "ఓశుకా! దేవదానవగంధర్వులు నాపై నెత్తి వచ్చినను, లోకు లందఱు నన్ను వెఱపించినను నే నెంతమాత్రము సీతను రామున కర్పించువాఁడను గాను. వసంతసమయమున మత్తభ్రమరములు మక రందపానమునకై పూఁచినపాదములపైకి వ్రాలునట్లు నాశరములు రామునిపై నెప్పుడు పడ నున్నవో! బహుకాలమునుండి సమరము లేమిచే నమ్ములపొదులందుఁ బరుండియున్న బాణములను వింటియందు సంధించి యారామునిపైఁ బ్రయోగించి, యేనుఁగును గొఱవులచే బాధించుచందంబున నెప్పు డారాముని బాధించెదనో! సూర్యుఁ డుద యించుచుఁ దక్కిన జోతులయొక్క వెలుఁగును లాగుకొనునట్లు నే నపారసైన్యముతో నా రామునిఁ గలిసి యతని బలము నంతయు ధ్వంసముచేసెదను. రాముఁడు సమరమున సాగరమువంటి నావేగ

మును, వాయువువంటి నాగమనమును, అమ్ములపొదులం దున్న సవిషము లైన పన్నగములం బోలిన నాశరములవాఁడిమిని గుర్తెఱుఁగని వాఁ డగుటచేతనే నాతో యుద్ధము సేయఁగోరుచున్నాఁడు. నేను శత్రుసేన యనెడి మహారంగముఁ బ్రవేశించి, అల్లెత్రాటిచప్పుడును, నాబాణములతాఁకుడులకు నొచ్చి భీతులైన శత్రువులు చేయు మొఱయు, నారసముల యత్తైములధ్వనియు మంద్రమధ్యమతారము లనెడి స్వరములుగాఁ బరిణమింపఁగా, ధనుస్సనెడి వీణెను గైకొని బాణము లనెడి కోలతో మీఁటుటను, రాముఁడు మున్నుగాఁగల శత్రువు లందఱు వినఁగలరు. వేయిగన్నులవాఁడగు దేవేంద్రుఁ డొండె, వరుణయమకుబేరు లొండె యగ్ని సమము లైన బాణములతో నన్నేమియుఁ జేయఁజాల" రని శుకునితోఁ జెప్పెను.

25-వ సర్గము

రావణుఁడు శుకసారణులం బంపుట

మానవుఁడగు దశరథనందనుఁ డయిన రాముఁడు సైన్యసమేతుఁ డయి, సముద్రమును దాఁటెనని విని, కాంతియుతుఁడగు రావణుఁడు శుక సారణులను బిలిచి, "అమాత్యులారా! వానరబలము విశాలమై దాఁట నలవికాకయున్న సముద్రమును దాఁటుటయు, రాముఁడు సముద్ర మున సేతువు నిర్మించినాఁ డనుటయు నీరెండును వింతగా నున్నవి. సాగరమున సేతువుగట్టుట నా కెంతమాత్రము నమ్మకముగాఁ దోఁపలేదు. నే నావానరబలము పరిమితి నవశ్యముగ తెలిసికొనవలయు నని కోరి యున్నాను. మీరిరువురు వారికిఁ గనఁబడక మాఱురూపములతో వానర సైన్యము సొచ్చి, ఆవానరసేనలో ముఖ్యులైనవారికొలఁదియు, మగ టిమియు, రామసుగ్రీవుల మంత్రుల యుత్సాహబలములను, ఎవరు యుద్ధమునకు ముందు నిలిచియున్నారో, ఎవరు శూరులో, యట్టివారి శక్త్యుత్సాహములను, లవణసముద్రమున సేతువుగట్టిన తెఱఁగును, మహాధీరులయిన యావానరుల యునికిపట్టులను, రామలక్ష్మణుల యుత్సా హవీర్యములను, వారి యాయుధములను, మహాతేజస్సుగల యావాన రులకు సేనాధిపతి యెవ్వఁడైనదియు మీ రవశ్యముగాఁ దెలిసికొని, యిక్కడికి వేగిరముగవచ్చి చేరవలయును" అని చెప్పి వారిని బంపెను.

శూరులగు శుకసారణు లిద్దఱు రావణుని యానతిని గొని, వానర రూపముదాల్చి యావానరసేనలోపలఁ బ్రవేశించిరి కాని, యావానర సేన పర్వతశిఖరములందును, కొండసందులందును, గుహాలయం దును, సముద్రతీరములందును, తోఁపులందును, తోఁటలయందును నున్న దియును, కొంతసేన సముద్రమును దాఁటుచున్నదియు దాఁటినదియు, దాఁటఁగోరుచున్నదియు, కొంతసేన యొక్కచోట విడిసియు, కొంతసేన విడిదలకై తిరుగుచును నున్నందున, యెక్కువ బలిమిగలదై భయంకర ముగా రొదపెట్టుచు కలఁతపెట్టరాని దగు సముద్రముమాడ్కి నున్న యావానరసైన్యమును జూచిరికాని, యాసేన యొక్క పరిమితిని లెక్కింపఁ జాలరైరి.

మిగులతేజోవంతుఁడగు విభీషణుఁడు వానరసైన్యమున గూఢ ముగాఁ దిరుగు శుకసారణులను జూచి, వారిం బట్టుకొని "శత్రుపుర ధ్వంసీ, వీ రిద్దఱు రావణునిమంత్రులు; శుకసారణు లనెడి పేర్లుగలవారు. వీరు మనసేనలోని విశేషములు దెలిసికొనుటకై వేగులుగా నిచ్చటికి వచ్చియున్నవారు" అని చెప్పెను. అంతట నాశుకసారణు లిద్దఱు వెఱపు జెంది, మనమున వ్యసనము పీడింపఁగా, దిగులుచేఁ బ్రాణములం దాశ వదలుకొనినవారై, చేతులు జోడించికొని, "ఓసౌమ్యుఁడవగు రఘునం దనా! మాప్రభువు మీసేన యొక్కపరిమితి నెఱుఁగుటకై మమ్ము నంపిన వాఁడు" అని రామునితో విన్నవింపఁగా, సకలభూతములకు హితము గోరు రాముఁడు వారితిన్ననిపలుకులను విని, చిఱునవ్వు నవ్వుచు ని ట్లనియె: "ఓ శుకసారణులారా! మీరు మాసేనను జక్కఁగాఁ జూచి యుండినను, మమ్ముఁ బరీక్షించి యుండినను, మీరాజు చెప్పినపని యావత్తు చేసియయి యుండినను మీరు సుఖముగాఁ బొండు. అట్లు మీ రెద్దియైనను జూడకయుండినచో దానిని మీరు బాగుగాఁ జూడుఁడు. మీకు విభీషణుఁడే వాని నన్నిటిని జూపఁగలఁడు. మాచేతఁ జిక్కియున్నామని మీరు భయపడవలదు. అస్త్రసన్న్యాసముచేసి పట్టువడిన శత్రువులను, దూతలను వధింపరా దని నీతివిదులు చెప్పుదురు. "విభీషణా! వీరు శత్రుపక్షమునకై మిక్కిలి కష్టపడి సంగతి కనుఁగొను వారయి యున్నను, అభయము వేఁడుచున్నారు గావున వీరిని వదలి

పెట్టుము" అని విభీషణునితోఁ జెప్పి మఱల శుకసారణులం జూచి, "ఓదూతలారా! లంకాపురము సొచ్చి, మీరలు ధనదానుజుఁ డగు రాక్షసేంద్రుఁడయిన రావణునితో నామాటలుగాఁ గొన్ని వచనములు నేఁ జెప్పినట్లే చెప్పవలయును. ఆపలుకు లేవి యన, "ఓరావణా! నీ వే బలిమి నాదరువు పెట్టుకొని, నాప్రియపత్ని యగు సీత నపహరించుకొని వచ్చితివో, యాబలిమి నిప్పుడు నీవు సబాంధవుఁడవై చూపుము. రేపు వేకువ లేచి నాబాణములచే నీలంకాపురమును ప్రాకారగోపురములతోఁ గూడ ధ్వంసముచేసి నిన్ను సపరివారముగా రూపుమాపెదను చూడుము. రావణా! వజ్రాయుధము చేతఁ బట్టిన దేవేంద్రుఁడు దానవులపై వజ్రాయుధమును వేయునట్లు, సేనాసమేతుఁడవైన నీపై నేనిన్ని దినములుగా నాఁపియుంచుకొని యుండిన మచ్చరమునకుఁ దగిన కార్యమును జూపెదను జూడుము." అని రావణునితోఁ జెప్పు మని యా శుకసారణులతోఁ జెప్పిపంపెను.

రాఘవుఁ డిట్లానతియ్యఁగా శుకసారణులు ధర్మమునందుఁ బ్రేమ గలవాఁ డయిన రాముని "జయమగుఁగాక!" యని యభినందించి, లంకాపురమునకు వచ్చి, రాక్షసేంద్రుఁ డగు రావణునిం జూచి, "రాక్షసేశ్వరా! మేము మాఱువేషముతో నచ్చటికిఁ బోయి యాసేనలం జూచుచుండఁగా, విభీషణుఁడు మమ్ముఁ బట్టుకొని వధింపవలయు నని చెప్పఁగా, మహాప్రతాపవంతుఁడును ధర్మవత్సలుఁడును నగు రాముఁడు మమ్ముఁ గనికరముతో వదలిపెట్టెను. లోకపాలురంబోలువారును, శూరులును, విలువిద్యయందు నేర్పరులును, విక్రమము వీడనివారునైన శ్రీమంతులగు రామలక్ష్మణులును, విభీషణుఁడును, ఇంద్రతుల్యపరాక్రముఁడు ధైర్యశాలియునైన సుగ్రీవుఁడును నేకమయి లంకాధ్వంసకార్యమునకుఁ బూనియున్నారు. తక్కిన వానరులయందఱిసంగతి యటుండనిమ్ము. వీరు నలువురు మాత్రమే లంకాపురమును గడ్డతోఁ బెళ్లగించి వేఱొక్కచోటఁ బెట్టఁగలరు. ఆరాముని రూపమును, బాణములను జూచినఁ దక్కినముగ్గురు నటుండ, నాతఁ డొక్కఁడె లంకాపురమును ధ్వంసముచేయఁగలఁ డని నేఁ దలఁచెదను. రామలక్ష్మణ సుగ్రీవులకాఁపుదలలో నున్నంతవఱకు వానరసేనను ఇంద్రాదిదేవతలును,

దైత్యులును గదలింపనైనను జాలను. నూఱుయోజనముల నిడివియు, పదియోజనము వెడలుపును గల సేతువు కట్టఁబడినది. వానరసేనయు సముద్రమును దాఁటి వచ్చినది; ఇది వాస్తవము. ఆరాముఁడును సముద్రముయొక్క దక్షిణతీరముననే విడిసియున్నాఁడు. ఇదివఱకు దాఁటిన వానరసేనకును, దాఁటుచుండు వానరసేనకును ముగింపు గానఁబడలేదు. వెంటనే మనతోఁ బోరుసేయఁగోరు దృఢచిత్తులైన వానరసైనికులుత్సాహసూచకములైన యాకారములతోఁ గూడియున్నారు. కాఁబట్టి వారితోఁ బోరుసేయుట తగదు. కోప ముడిగి దశరథనందనునికి సీతను గొనిపోయి యిమ్ము." అని శుకసారణులు రావణునితో విన్నవించిరి.

26-వ సర్గము

సారణుఁడు వానరసేనను దెల్పుట

సారణుఁడు హితముగోరియు, భీతిలేకయుఁ జెప్పిన పలుకులను రావణుఁ డాలకించి, యామాటలు యుక్తములయినను తనకు ప్రియములుగాఁ దోఁచకుండుటచే, "సారణా! దేవగంధర్వదానవులు నాపై నెత్తి వచ్చినను, నేను సీత నియ్యనే యియ్యను. లోకులందఱు నన్ను బెదరించినను నేను వెఱవను. నీవు పిఱికివాఁడవు గనుక వారిని జూచి భయపడి వారి కోడిపోతివి కావున నిప్పుడే సీతాదేవిని రామునికి సమర్పించుట యుక్తమని చెప్పుచున్నావు. నాయెదుట నిలిచి నాతో యుద్ధముచేసి నన్ను జయింపఁగల శత్రు వెవ్వఁ డున్నాఁడు?" అని సారణునిమాటలను నిష్ఠురోక్తులచే నిందించి, కోపముచే నొడలు తెలియనివాఁడై తానే ప్రత్యక్షముగ నాసేనం జూడఁగోరి యావేగులతోఁ గూడఁ బెక్కుత్రాటిమ్రాఁకులయెత్తు గలదై, మంచువలెఁ దెల్లనై యున్న మేడనెక్కి, సముద్రమును, తత్ప్రాంతకాంతారపర్వతములను జూచి, యపారమై, లెక్క పెట్టనలవికాని దయి యున్న వానరబలముతోఁ గూడిన భూప్రదేశమును, అచ్చట వ్యాపించియున్న యావానరమహాబలమును జూచి, "సారణా! వానరవీరులలో నెవరు మొనగాండ్రు? ఎవరు బలవంతులు? ఎవరు మిక్కిలి ధైర్యవంతులై ముందుకు వచ్చుచున్నారు? సుగ్రీవుఁ డెవ్వరిమాట ముఖ్యముగా వినును? ఎవరు గుంపుకాఁపరులకుఁ గాఁపరులు? ఎవరు సేనాధిపతులు? ఇవి యెల్ల సవిస్తరముగాఁ జెప్పు."మని

యడిగెను. వానరముఖ్యుల నందఱి నెఱిఁగిన సారణుఁడు రాక్షసుల కధిపుం డయిన రావణుఁడు తన్నడిగినమాటను విని యతనికి వానరులలో ముఖ్యులయినవారింగూర్చి యిట్లు చెప్పెను.

"ఓ రాక్షసాధిపా! పెక్కండ్రు మేటివానరవీరులతోఁ గూడిన వాఁడై, లంకాపురమున కెదురుదిరిగి గర్జించుచుఁ దన కిలకిలరవముచే, లంకాపురమును ప్రాకారగోపురద్వారములతోడను, పర్వతోపవనముల తోడను గడగడలాడించునట్టి మహాత్ముఁడయిన సర్వవానరుల కధిపతి యగు సుగ్రీవునిసేనకు ముందున్న యాతఁడు శూరుఁ డయిన నీలుఁడను యూథనాథుఁడు.

ఏశూరుఁడు బుజములు పైకెత్తి, పాదముతో భూమిని దట్టుచు లంకాపురి నెదుర్కొని, కోపముతో మాటిమాటికి దుముకఁజూచు చున్నాఁడో;పర్వతశిఖరమునుబోలినవాఁడును,తామరపువ్వుల కింజల్కము వలె పసుపువన్నెగలవాఁడును నైన యేవాఁడు కినుక పూని తోఁకను మాటిమాటికిఁ దట్టుచున్నాఁడో; ఎవని యాతోఁక చప్పుడునకు పది దిక్కులును మాఱుమ్రోఁగుచున్నవో, ఎవఁడు వానరరాజయిన సుగ్రీ వునిచే యువరాజపదవియం దభిషిక్తుఁ డైనవాఁడో, దేవేంద్రుని సాహ్యమునకై వరుణుఁడు పూనినచందంబున నెవ్వఁడు రాఘవునికార్య సాధనమునకై పూనుకొన్నవాఁడో, రాఘవునికి హితము గోరునట్టి బల వంతుఁ డైన హనుమంతుఁ డెవ్వని యాలోచనవలన సీతాదేవిని జూచి వచ్చినాఁడో, యట్టి వీర్యవంతుఁడును, జయింప నలవికానివాఁడునైన వానర వీరుండయిన యంగదుఁడు ఈతఁడు. పెక్కువానరవీరసేనలను దోడ్కొని, యితఁడు యుద్ధమున ని న్నెదుర్కొనఁ బిల్చుచువచ్చు చున్నాఁడు.

ఆయంగదునివెంబడి గొప్పసేనతోఁ గూడ వచ్చునట్టి యాతఁడు యుద్ధవీరుఁ డయిన నలుఁ డనువాఁడు. ఆతఁడే యీసముద్రసేతువు కట్టు టకుఁ గారణభూతుఁడు. ఆ నలునివెంబడి ఏవానరవీరులు దేహములను నిక్కించి, సింహనాదములఁ జేయుచున్నారో, గర్జించుచున్నారో, కోప ముచేఁ దమ యాసనములనుండి లేచి, ముందు కుఱుక నుంకించు చున్నారో, ఆ యీ వీరులందఱు శత్రువులచే నోర్వరాని యంత తీక్ష్ణ

మైన పరాక్రమము గలవారై శత్రువులకు భయంకరులైనవారు. ఇట్టి వానరవీరు లీనలునివెంబడి వేయికోట్లయెనుబదిలక్షలమంది యున్నారు. ఈ నలుఁ డొక్కఁడే యీ తనసేనతో వచ్చి లంకాపురమును ధ్వంసము సేయఁగోరుచున్నాఁడు.

రజతపర్వతముమాడ్కిఁ దెల్లని వన్నె గలవాఁడును, యుద్ధ చాపల్యము గలవాఁడును, శత్రువులను దనపరాక్రమముచే భయ పఱచువాఁడును, బుద్ధిమంతుఁడును, మూఁడులోకములలోపల వీరుఁ డని ఖ్యాతి వహించినవాఁడును నైన శ్వేతుఁ డనువాఁ డొక్కఁ డున్నాఁడు. అతఁడు యుద్ధచాపల్యమునుబట్టి సేనలను జీలఁదీయుచు, నే నొక్కఁడనే లంకాపురమును ధ్వంసము చేసెద నని సుగ్రీవునితోఁ జెప్పవచ్చి, యాతఁడు నిదానింపుమని చెప్పుటచే మఱల తనసేనలోనికిఁ బోయి చేరు చుండును. గోమతీనదీతీరమున పలుతెగలవృక్షములతోఁగూడి సంకోచన మని ప్రసిద్ధివహించిన పర్వత మొక్కటి గలదు. ఆపర్వతముచుట్టు నెవ్వఁడు సంచరించుచు నచ్చట రాజ్యము నేలుచుండెనో, అతఁడే యీతఁడు కుముదుఁ డను వానరయూథనాథుఁడు. ఈతనితోడ కోటి వానరసైన్యము వచ్చుచున్నది. ఇతనికి వెంబడి చండుఁ డనువాఁ డొక్కఁ డున్నాఁడు. భయంకరకార్యములఁ జేయునట్టి అతని తోఁకవెంట్రుకలు పెక్కుమూరలపొడవుగలవై, యెఱుపు తెలుపు నలుపు వన్నెగలవై, చిక్కువడియున్నవి. అతఁడు ధీరుఁ డయి, కోపము గలిగి, యుద్ధమున కెదురుచూచుచున్నాఁడు. ఇతఁడును నలాదులమాడ్కి, తా నొక్కఁడే సేనాసమేతుఁడై వచ్చి లంకాపురమును ధ్వంసముచేయఁ గోరుచున్నాఁడు. సింహాముమాడ్కి గంభీరమైన చూపుగలవాఁడును, బూడిదవన్నెగల వాఁడును, నిడివికన్నులుగలవాఁడును నైన యే యీవానరుఁడు కదలక దృష్టిచే దహించువానిచందమున నుఱిమి చూచుచున్నాఁడో యాతండు రంభుఁ డను పేరుగల సైన్యాధిపుఁడు. ఈతఁ డెల్లప్పుడు వింధ్యపర్వత మునను, కృష్ణగిరియందును, రమ్యమైన సహ్యపర్వతమునను దిరుగు చుండును. తీక్ష్ణపరాక్రములయి, కోపస్వభావులయిన శూరులగు వానర వీరు లితనిఁ జుట్టుకొని, పరాక్రమముచే లంకాపురమును ధ్వంసము చేయవచ్చుచున్నారు.

ఎవఁడు చెవులు ఱిక్కించుకొని వచ్చుచున్నాఁడో; మాటికి మాటికి చెలరేఁగుచున్నాఁడో; చావునకు వెఱవఁడో; యుద్ధమునసుండి పాఱిపోవఁడో; ఆగ్రహముచే వణఁకుచున్నాఁడో; అడ్డముగా నిటు నటు చూచుచున్నాఁడో; అట్లు చూచుచుఁ దనకడిందిబలిమి మెఱయఁ దోఁకను పైకెత్తికొట్టుచున్నాఁడో; ఆ యితఁడు శరభుఁడు. ఇతఁడు భయము మాని, కడు బలవంతుఁడై యెల్లప్పుడు సాల్వేయపర్వతమునం దుండు వాఁడు. ఇతనికి నలువదిలక్షలమంది విహారు లనెడి బలవంతు లయిన సైనికు లున్నవారు.

రాక్షసాధిపా! ఎవ్వఁడు గొప్పమేఘము లాకాశమండలమును గ్రమ్ముకొనినట్లు సేన నంతయుఁ గ్రమ్ముకొని, దేవేంద్రుఁడు వేల్పుల నడుమ వెలుఁగునట్లు సేననడుమ విరాజిల్లుచున్నాఁడో, యుద్ధాపేక్షగల యెవని సైనికులగు వానరవీరులలో నెవని కంఠధ్వని భేరీవాద్యధ్వనివలె వినవచ్చుచున్నదో, ఆ యితఁడు పనసుఁ డను యూథనాథుఁడు. ఇతఁడు శత్రువులకు లొంగనివాఁడు. ఎల్లప్పు డితఁ డుత్తమ మైన పారియాత్ర పర్వతమున నుండువాఁడు. ఏబదిలక్షలమంది వానరశ్రేష్ఠులు గుంపులుగఁ జేరి యితనిఁ గొలిచియున్నారు.

సముద్రతీరమున భయంకరముగాఁ దిరుగుచున్న సేనను బ్రకాశింపఁజేయుచు, రెండవసాగరముమాడ్కిఁ బ్రకాశించుచున్నట్టి దర్దర పర్వతసముఁ డయినవాఁడు వినతుఁ డనెడి యూథపుఁడు. ఇతఁ డఱువదిలక్షలసేనలతోఁగూడి, నదులలో నుత్తమ మయిన పర్ణాసానదియందలి జలమును ద్రావుచు సంచరించుచున్నాఁడు. రాజేంద్రా! క్రోధనుఁ డనెడి యూథపుఁడు నిన్ను యుద్ధమునకుఁ బిలుచుచున్నాఁడు. ఇతనికడ మగఁటిమియు, బలిమియుం గలవగు సేనలు గుంపులుగుంపులుగా విడఁదీయఁబడి నిలిచియున్నవి. ఏయితఁడు గైరికవర్ణముగల తన శరీరమును యుద్ధోత్సాహముతోఁ బెంచుచున్నాఁడో, అతఁడు ప్రతాపశాలి యగు గవయుఁ డనెడి వానరశ్రేష్ఠుఁడు. ఇతఁడు బలిమిచే మదించియున్న తక్కిన వానరవీరుల నందఱిని వెనుపఱచి, కోపముతోఁ గూడి యుద్ధమునకై ని న్నెదుర్కొనఁ జూచుచున్నాఁడు. ఇతనిని డెబ్బదివేలమంది సేనలు గొల్చుచున్నవి కావున నితఁ డొక్కఁడే తన సేనతో వచ్చి లంకాపుర

మును ధ్వంసముచేయఁ జూచుచున్నాఁడు. ఈయంగదాదు లగు గుంపు కాఁపరు లందఱు శత్రువులచే నోర్వరాని బలిమిగలవారు; బలవంతులు; భయంకరులు; కోరినరూప మెత్తువారు. వీరియొక్క సేనలును గుంపు గుంపులుగా నిల్చియున్నవి. రాక్షసాధిపా! చూడు మని సారణుఁడు రావణునితోఁ జెప్పెను.

27-వ సర్గము

సారణుఁడు రావణునికి వానరసైనికులం దెల్పుట

సారణుఁడు రావణుం జూచి, వెండియు ని ట్లనియె. "ఓరాక్షసేంద్రా! వానరశ్రేష్ఠులలో నింకఁ గొందఱిని జెప్పెద నాలకింపుము. వారు రామునికార్యము సాధించుటకై తమపరాక్రమము చూపి, ప్రాణములనైనను విడుచుటకు సిద్ధముగ నున్నారు. ఈవానరవీరులలో నొక్కఁ డున్నవాఁడు: భీకరములైన పనులొనరించెడివాని తోఁకలోని రోమములు పెక్కు మూరలపొడవు గలవై, యెఱుపు, నలుపు, తెలుపు వన్నె గలిగి చిక్కుపడియున్నవి. ఆతఁడు తోఁకను బైకెత్తినప్పు డీరోమములు సూర్యకిరణములమాడ్కి వెలుఁగుచు నొక్కొక్క సమయమున భూమియందు వ్యాపించుచున్నవి. ఈతఁడు హరుఁ డనెడి యూథపాలుఁడు. ఇతని వెంబడిఁ బెక్కువేలమంది వానరవీరులు వేడ్కతోఁ జెట్లను బెళ్లగించుకొని లంకాపుర మెక్కు నుత్సాహముతో వెంబడించుచున్నారు. ఇతఁడు మహాతేజులగు వేయికోట్ల వానరసైన్యముతోఁ గూడినవాఁడై నిన్ను సమరమున జయింపఁగోరుచున్నాఁడు. ఇతని వశమున సుగ్రీవునియూథపు లగు భటులు పెక్కం ద్రున్నవారు. గొప్ప మేఘముచందమునన్లనివారు గొందఱు కనఁబడుచున్నారు గదా. వారు నల్లనికాటుకకొండంబోలువారును, యుద్ధరంగమున దృఢపరాక్రములును, లెక్కపెట్ట నలవికానివారును, సముద్రపు టీవలిగట్టో యనఁదగినవారునై యున్నారు. వీరు మిట్టపల్లములై యెక్కుటకు వీలుపడనివై యున్న పర్వతములందును, నదులందును నుండువారు. ఈకడుభయంకరులైన ఋక్షసైనికులు ని న్నెదుర్కొని వచ్చుచున్నారు. ఓరాక్షసేంద్రా! వీరిమధ్యమున మిడిగ్రుడ్లును, వెఱ్ఱిచూపును గలిగి, పెక్కుజీమూతములచే నంతటఁ జుట్టఁబడిన పర్జన్యునిచందంబున నొప్పుచు

ఋక్షవంత మనెడి పర్వతశ్రేష్ఠమున నర్మదానదియొడ్డున నుండునట్టి కొండముచ్చులకెల్లఁ బెద్దయైన ధూమ్రుఁ డనెడి యూథనాథుఁ డున్నాఁడు.

ఈధూమ్రునితమ్ముఁ డిదిగో పర్వతాకారముతోఁ గనఁబడుచున్నాఁడు. వీఁడు రూపమునఁ దనయన్నను బోలినవాఁడుగా నున్నను శౌర్యమునం దన్నను మించినవాఁడు. అదిగో మఱియొక్కఁడు కనఁబడుచున్నాఁడు చూడుము. ఆతఁడు జాంబవంతుఁ డనువాఁడు; పెద్దగుంపుకాఁపరులలో నెల్లఁ బెద్ద; పరాక్రమవంతుఁడు, పెద్దల యాజ్ఞప్రకారము పోవువాఁడు; యుద్ధములం దెదురు లేనివాఁడు; దేవతలకును అసురులకును యుద్ధము సంభవించినప్పుడు దేవేంద్రునకుఁ గడు గొప్ప సాహాయ్య మొనరించి, పెక్కు వరములను బడసినవాఁడు. రాక్షసులకును, పిశాచములకును సమానులును, ఒంటినిండుగ బొచ్చు గలవారును, గొప్ప యాకారముగలవారును నై యగ్నిహోత్రుని మాడ్కి వెలుఁగునట్టి యితని యపారసైనికులు పర్వతశిఖరముల నెక్కి, గొప్ప మేఘములం బోలు వెడల్పు బండలను దొర్లించుచు మృత్యువునకు వెఱవక యున్నారు. మఱియొక్కఁడు మిగుల నాటోపముతోఁ గూడి, యెగురునట్లు చూపట్టుచున్నాఁడు. అతని చుట్టు ననేకులు వానరులు నిలఁబడి యాతని మోమునే చూచుచున్నారు. నృపాలా! యీతఁడు దంభుఁడని పేరు గలవాఁడు; బలపరాక్రమశాలి. ఇతఁడు దేవాసురయుద్ధములం దింద్రునికిఁ దోడుగాఁ బోవువాఁడు.

రావణా! మఱియొక్క వానరుఁడు సన్నాదనుఁ డనువాఁడు కనఁబడుచున్నాఁడు చూడుము. ఇతఁ డొక్కయడుగు పెట్టునంతలోపల యోజనదూరమున నున్న పర్వతముఁ జేరఁగలఁడు. ఇతఁడు నిలఁబడి నచో నితనితల యాకాశమునకుఁ దగులును. నాలుగుపాదములజంతువులలో నితనికంటె గొప్పయాకారము గలవాఁడు వేఱొక్కఁడు లేఁడు. వానరుల కందఱికి నితఁడు తాత. తొల్లి యొకప్పు డితఁడు దేవేంద్రునితో యుద్ధము చేసి, యాయుద్ధమునఁ బరాజయము నొందనివాఁడు. ఇతఁడు దేవేంద్రుని యంతటి పరాక్రమముగలవాఁడు. దేవాసుర యుద్ధములందు వేల్పులు తమ సాహ్యమునకై ప్రేరణచేయఁగా, అగ్ని

హోత్రుం డొక గంధర్వవనితయందు వీనిని బుట్టించినవాఁడు. రాక్షసాధిపా! ఏపర్వతమునకుఁ గుబేరుఁడు రాజో; ఏపర్వతమున నేరేటి చెట్టున్నదో; ఏపర్వతము పెక్కు కిన్నరగంధర్వుల కునికిపట్టో? ఏపర్వతము నీయన్నకుఁ దీఱని యాటభూమియో; అట్టి హిమవత్పర్వతమున నుండువాఁడును, బలవంతుఁడును, వానరశ్రేష్ఠుఁడును, యుద్ధములందు వీరాలాపము లాడనివాఁడును నైన క్రథనుఁ డనెడి యీ యూథనాథుఁడు వేయికోట్లసేనతోఁ గూడి తా నొక్కఁడే వచ్చి లంకాపురమును ధ్వంసముచేయఁగల ననుచున్నాఁడు.

ఇదిగో, యచ్చట మఱొక వానరశ్రేష్ఠుఁడు కనఁబడుచున్నాఁడు చూడుము. ఇతఁడు తొల్లి కోఁతులకును, ఏనుఁగులకును గలిగిన విరోధమును దలఁచుచు, పర్వతగుహాలలో నిద్రించు తన తోడిగుంపులకెల్ల నాయకుఁడై, వనగజముల రాకనెఱిఁగి వానితోఁ బోరి వానిని పర్వతశిఖరములతోను వృక్షములతోను గొట్టుచు గంగానదీతీరమునఁ దిరుగువాఁడు. ఈసేనాధిపుఁడు గంగానదియొడ్డున మందరమునుబోలు నుశీరబీజమనెడి పర్వతమున, స్వర్గమునందు దేవేంద్రుఁడునుంబోలె వెలయుచున్నాఁడు. ఇతనిని వేయికోట్లమంది వానరులు వెంబడించివచ్చుచున్నారు. బలపరాక్రమములచే గర్వితులును, పట్టుదలగలవారును, సింహనాదము లొనరించువారును, బలవంతులును, వేగశీలురును నైన యీ వేయికోట్లవానరుల కితఁడే నాయకుఁడై యున్నాఁడు. రాక్షసేంద్రా! ఎచ్చట గాలి పైకిలేచి కొట్టుటచే నెక్కువదుమ్ము ఎఱ్ఱనికాంతి కలదై యంతటఁ బర్వియున్నదో, అచ్చట యుద్ధోత్సాహముతో నిలఁబడియున్న సేనను జూడుము. దానిప్రక్కన గాలి కెగిరిన మేఘము చాపున గొప్ప యాకారముతో నొక్కఁడు నిలఁబడి యున్నాఁడు గదా! అతఁడు శత్రువులకు లొంగనివాఁడగు ప్రమాథి యను వానరోత్తముఁడు. ఇదిగో, తెల్లనిమోము గలవియు, ఎక్కువ బలిమి గలవియు, భీతిని గలిగించునవియు నైన నూఱుకోట్లకొండముచ్చులు సేతువుకట్టినతోడనే మహోత్సాహముతోఁ గూడినవై బలవంతుఁ డయిన గవాక్షుఁ డనెడి యూథనాథునిఁ జుట్టుకొని, తమ శౌర్యము మెఱయ లంకాపురము ధ్వంసముచేయ వచ్చుచున్నవి.

ఏపర్వతశ్రేష్ఠమునం దన్ని కోర్కుల నొసఁగునట్టి మహావృక్షములు తుష్టైదలతో నిండినవై యున్నవో; సూర్యుఁడు తనతో సమానముగాఁ బ్రకాశించునట్టి యేపర్వతముచుట్టును దిరుగుచున్నాఁడో, ఏపర్వతముయొక్క కాంతిచే నచ్చట నుండు మృగపక్షు లదే కాంతిగలవిగాఁ దోఁచుచున్నవో, ఏపర్వతముయొక్క చఱులయందు విడువక మహర్షులు వాసముచేయుచుందురో, ఏపర్వతమున సకలఫలములతో నిండిన వృక్షము లున్నవో, ఏపర్వతోత్తమమున మంచితేనె లభించుచున్నదో, అట్టి మేరుపర్వతమున వాసముచేయువాఁడయిన వానరశ్రేష్ఠుఁడగు కేసరి యను పేరుగల వానరోత్తముఁ డిదిగో కనఁబడుచున్నాఁడు. ఓయనఘా! బంగారుకొండ లఱువదివేలున్నవి. వానిలో మేరుపర్వతము రాక్షసులలో నీవు వోలెఁ గడుశ్రేష్ఠమైనది. అచ్చటఁ గపిలవర్ణులును (తెలుపు నలుపు గలిసినవారును), తెల్లనివారును, ఎఱ్ఱమూతులవారును, తేనెవలె గోరోజనవర్ణముగలవారును, వాఁడికోఱలు గలవారును, గోళ్లనాయుధములుగా నుపయోగించువారును, సింగములమాడ్కి నాల్గుకోఱలుగలవారును, బెబ్బులులమాడ్కిఁ బగతురకు లొంగనివారును, అగ్నిహోత్రునిచందమున జ్వలించువారును, మంటలు గ్రక్కెడు పన్నగములం బోలువారును, కడునిడుపువైన చక్కని తోఁకలు గలవారును, మదపుటేనుఁగులమాడ్కి మదించినవారును, గొప్పమేఘములవంటి యాకారముగలవారును, గొప్ప యుఱుమువలె గర్జించువారును, గుండ్రనై పింగళవర్ణముగల కన్నులు గలవారును, ఎక్కువగ వెఱపించు నడకయు, కంఠధ్వనియుఁ గలవారు నైన వానరసైనికు లందఱీ పర్వతోత్తమమునందు వసించుచున్నారు. వా రందఱు నీలంకాపురమును జూచి యిప్పుడే దీనిని ధ్వంసముచేయనున్నారు. వీరి నడుమ నిదిగో వీర్యవంతుఁడును, బుద్ధిమంతుఁడును శతవలి యని ప్రసిద్ధిగాంచినవాఁడు నైన వానరవీరుఁడు నీతోడియుద్ధము చేసి జయము నొందఁగోరినవాఁడై, సూర్యుని కెదుట నిలఁబడి యుపస్థానముఁ జేయుచున్నాఁడు. మగఁటిమి, బలిమి, సత్తువయుఁ గలవాఁడును, పనులందుఁ బట్టుదలను జూపువాఁడు నైన యీ శతవలి యొక్కఁడె తన సేనతో వచ్చి లంకాపురమును ధ్వంసముచేయఁ గోరుచున్నాఁడు. ఈశతవలి

రాముని యిష్టము నెఱవేర్పఁగోరి, తన ప్రాణములను సైతము సరకు సేయ కున్నాఁడు. మఱియు, గజ, గవాక్ష, గవయ, నీల, నలు లొక్క రొక్కరే పదికోట్ల సేనలతోఁ గూడినవారై వచ్చియున్నవారు. వీరు మాత్రమే కాక, యింకను వింధ్యపర్వతవాసు లగు వానరవీరులు నీతోడి యుద్ధమునకు సన్నద్ధులై వచ్చియున్నారు. వారు బాహుళ్యము వలన నింద అని లెక్కింప నలవి కాక యున్నారు. ఓమహారాజా! వా రెక్కువ బల్మియు, పర్వతసదృశ మగు కాయమును గలవారు. మఱియు వారంద ఱొక్కక్షణములోపల నీపురమియం దుండు పర్వత ములఁ జూర్ణము సేసి తూర్పునఁ బెట్టఁగలరు" అని సారణుఁడు రావ ణునితో వానరసేనల ప్రభావ మెఱిఁగించినవాఁ డాయెను.

28-వ సర్గము

శుకుఁడు వానరవీరుల ప్రభావం బెఱిఁగించుట

శుకుఁడు సారణునిచేఁ జెప్పఁబడినది విని, యతఁడు పూర్తిగాఁ జెప్పనందునఁ దాను సేన నంతటిఁ జూపి, దాని ప్రభావము పూర్తిగా విన్నవింపఁగోరినవాఁడై, రావణుం జూచి యిట్లనెను: "ఓరాక్షసాధిపా! మదపుటేనుఁగులచందమునను గంగానదీతీరమునఁ బుట్టిన మఱిచెట్లపగి దియు, హిమవంతమునందలి మద్దిచెట్లతీరునను గనఁబడుచున్న యీసైనికు లందఱు శత్రువులకు సహింప నలవికాని వారు; బలిమికలవారు; కామ రూపులు; యుద్ధరంగమున దైత్యదానవులం బోలువారు; దేవతల మాడ్కిఁ బరాక్రమవంతులు. ఈవానరు నిరువదిరెండువేలకోట్లు, పెక్కువేలశంఖములు పెక్కునూఱులబృందములు నివ్విధమున లెక్క లేనివా రున్నారు. వీరందఱు సుగ్రీవునిబంటులు. కిష్కింధాపురమున నెల్లప్పు డుండువారు. వీరు కోరినరూప మెత్తఁగలవారు. దేవగంధర్వుల వలనఁ బుట్టినవారు.

ఓప్రభూ! అచ్చట నిలఁబడియున్న చక్కనిరూపముగల ప్రాయంపు వారిరువురు మైందద్వివిదు లనువారు. యుద్ధరంగమున వారితో సమానులు లేరు. వారు బ్రహ్మవలన వరముఁ బడసి, యమృతము ద్రాగిన వారు. వీరిద్దఱే తమ బలముచే లంకాపురమును ధ్వంసముచేయఁ గోరు చున్నారు. వారిప్రక్కన నిద్దఱు పర్వతములం బోలినవారు నిలఁబడి

యున్నారు గదా. వారిద్దఱు యమునిపుత్రులు; తండ్రితో సమానులు; వీరిద్దఱే పదికోట్లసేనతోఁ గూడినవారై వచ్చి, తామే లంకాపురి వైపునకుఁ జూచుచున్నారు. మదపు టేనుఁగుమాడ్కి నిలఁబడిన మా యొక్కఁడు కోపగించిన యెడల సముద్రమును గలఁతపఱచఁగలఁడు. ప్రభూ! యితఁడే నీలంకాపురమునకు వచ్చి సీతాదేవిని వెదకి చూచిన వాఁడు. ముందు నిన్ను చూచినవీఁడె మఱలవచ్చినవాఁడు చూడుము. ఇతఁడు కేసరికి జ్యేష్ఠపుత్రుఁడు; వాయునందనుఁ డనియు, హనుమంతుఁ డనియుఁ బ్రసిద్ధి గన్నవాఁడు; సముద్రమును దాఁటినవాఁడు; కోరిన రూపమెత్తువాఁడు; బలరూపములతోఁగూడినవాఁడు. ఎప్పుడు తిరిగెడు వాయుదేవునిగమనముంబోలె నితని గమనమును నడ్డగింప వీలు గాదు. ఇతఁడు పసివాఁడుగ నున్నప్పు డాఁకలిగొనినవాఁడై, యుదయించు చున్న సూర్యునిఁ జూచి "మూఁడువేలయోజనములదూరము పైకి బోయి యయినను సూర్యబింబమును దెచ్చిమ్రింగి నాయాఁకలిం బోగొట్టు కొనియెద" అని తలఁచి, దేవర్షిదానవులకుఁ గూడఁ బొంద నలవి కాని సూర్యునిం గూర్చి మీఁదికిఁబోయి, యాదేవునిం జేరకయె, యాతని వేడిమి సైరింపఁజాలక యుదయపర్వతమునందే యొకబండమీఁదఁబడెను. ఆ పడినప్పు డితని చెంప యొక్కటి బాతికిఁదగిలి కొంచెము పగిలినందున, నితనికి హనుమంతుఁ డనుపేరు ప్రసిద్ధమాయెను. నే నీ హనుమం తుని వృత్తాంతము నాచెలికాండ్రు చెప్పఁగా నెఱిఁగిన వాఁడను. ఇతని రూపబలప్రభావములం గూర్చి చెప్పుట కేమియు వీలుగాదు. ఇతఁ డొక్కఁడె లంకాపురిని ధ్వంసముచేయఁ గోరుచున్నాఁడు.

ఈహనుమంతునివెంబడి నిల్చినవాఁ డెవ్వఁ డనిన, ఎవఁడు శూరుఁ డును, నీలవర్ణుఁడును, కమలములం బోలు నేత్రములు గలవాఁడును, ఇక్ష్వాకువంశస్థులలో నతిరథుఁడును, లోకమునఁ బ్రసిద్ధి కెక్కినపరా క్రమము గలవాఁడును నైనవాఁడో; ఎవనియందు ధర్మము చలింపదో; ఎవఁడు ధర్మము నతిక్రమింపఁడో; వేదవిదుండగు నెవ్వఁడు బ్రహ్మాస్త్రము మొదలగు నస్త్రముల నెఱిఁగినవాఁడో; ఎవ్వఁడు బాణముల నేసి యాకాశము బ్రద్దలుచేయునో, పర్వతముల నైనను దుత్తునియలు చేయునో; ఎవ్వనికి యమునికిఁ బోలెఁ గ్రోధమును, నింద్రునకుం బోలె

శౌర్యమునుగలదో, ఎవ్వనిభార్యను నీవు జనస్థానముచుండి తెచ్చితివో; అతఁడే రాముఁ డను నీతఁడు;నీతోఁ గయ్య మొనరింప నీపురిపైకిఁ గవియు చున్నాఁడు. ఈరాముని కుడిప్రక్క నిలుచున్న అచ్చనిబంగారు రంగుగల వాఁడును, వెడఁదఱొమ్ముగలవాఁడును, ఎఱ్ఱని కన్నులుగలవాఁడును, నల్లనివంకరలైన వెంట్రుకలుగలవాఁడును నగు నతఁడు లక్ష్మణుఁ డనుపేరు గల యారాముని తమ్ముఁడు. రామునికిఁ బ్రాణసముఁ డైన ప్రియుఁడును, నీతిశాస్త్రము నెఱిఁగినవాఁడును, కోపముగలవాఁడును, పరులచే గెల్వ నలవికానివాఁడును, శత్రువులను గెల్చువాఁడును, బుద్ధిబలపరాక్రమ ములుగలవాఁడును, రామునికిఁ గుడిచేయి యనఁదగినవాఁడును, వెలు పటఁ దిరుగు రాముని ప్రాణమో యనఁదగినవాఁడును; రాముని నిమిత్తమై ప్రాణములనైనను విడుచువాఁడును, ఇతఁ డొకఁడే యుద్ధమున రాక్షసుల నందఱిని వధింపఁగోరుచున్నాఁడు.

ఆరాముని యెడమప్రక్క నిలువఁబడియున్న యాతఁడు నలువురు మంత్రులతోఁ గూడిన విభీషణుఁడు గదా. రాజాధిరాజగు శ్రీరాముఁ డీ విభీషణుని లంకారాజ్యమునకుఁ బట్టాభిషిక్తుం జేసినవాఁడు. ఇతఁడు రాముని మన్ననవడసి, నీపైకి యుద్ధమునకు వచ్చుచున్నాఁడు. నడుమఁ బర్వతముమీఁద నిలఁబడియున్న యాతఁడు శత్రువుల కోడనివాఁడును, వానరవీరులలో నెల్ల మేటియునైన సుగ్రీవుఁడు. హిమవంతుఁడు పర్వత ముల నెల్ల మించినట్లు, తేజస్సు, బుద్ధి, బలము, కీర్తి, వంశము వీనిచే నీతఁడు తక్కినవానరుల నందఱిని మించినవాఁడు. పర్వతవనకాననము లతోఁ గూడినదైనందున శత్రువులచేఁ జొఱ వీలుగానిదై, పర్వతదుర్గ మున నుండు కిష్కింధ యను గుహ వీని యునికి. లక్ష్మికి నునికిపట్టయి నదియు, దేవతలకు మానవులకును నిష్టమైనదియు నైన నూఱుపద్మ ములుగల పసిఁడిమాలిక యితని కంఠమున శోభిల్లుచున్నది. రాముఁడు వాలిని సంహరించి, జయప్రదమైన కాంచనమాలను, తారను, శాశ్వత మైన వానరరాజ్యమును సుగ్రీవుని కిప్పించెను. నూఱులక్ష లొక్కకోటి యని పెద్దలచే ననఁబడును. నూఱువేలకోట్లు శంఖ మనఁబడును. నూఱు వేలశంఖము లొక్క మహాశంఖ మనఁబడును. నూఱువేలమహాశంఖము లొక్క బృంద మనఁబడును. నూఱువేలబృందము లొక్క మహాబృంద

మనఁబడును. నూఱువేలమహాబృందము లొక్క పద్మమని చెప్పఁబడును. నూఱువేలపద్మము లొక్క మహాపద్మమని పేర్కొనఁబడును. నూఱువేల మహాపద్మము లొక్క ఖర్వ మనఁబడును. నూఱువేలఖర్వము లొక్క మహాఖర్వమనియు, నూఱువేలమహాఖర్వము లొక్క సముద్ర మనియు, నూఱువేలసముద్రము లొక్క యోఘ మనియు, నూఱువేల యోఘము లొక్క మహౌఘ మనియు ననఁబడును. ఇట్లు వేయికోట్లును, నూఱు శంఖములును, వేయిమహాశంఖములును, నూఱుబృందములును, వేయి మహాబృందములును, నూఱుపద్మములును, వేయిమహాపద్మములును, నూఱుఖర్వములును, నూఱుసముద్రములును, నూఱుమహౌఘములును, సముద్రమును బోలెడి కోటిమహౌఘములును అను సంఖ్యలచే లెక్కిం పఁదగినదై యుండు మహాసైన్యము వెంబడింపఁగా, మంత్రు లగు రాక్ష సులచేఁ బరివృతుం డైన విభీషణుఁడు గూడ వచ్చుచుండఁగా, పాయని యెక్కువ బలిమియు మగఁటిమియుం గలిగిన వానరేంద్రుఁ డగు సుగ్రీ వుఁడు నీతోడి కయ్యమునకై యెదుర్కొనుచున్నాఁడు చూడుము. ఓమహారాజా! మండుచున్న గ్రహముంబోలినదై యీవచ్చునట్టి సేనను జూచి, యెట్లు మనకు జయము గలుగునో, ఎట్లు శత్రువులవలన నోటమి లేకుండునో, అట్లు గొప్పప్రయత్నము చేయవలయును." అని శుకుఁడు రావణునకుఁ దక్కిన వానరవీరులప్రభావ మెఱుఁగఁజెప్పెను.

29-వ సర్గము

రావణుఁడు శుకసారణులను నిందించుట

రావణుఁడు శుకునిచేఁ జెప్పఁబడిన యా వానరయూథనాథులను, రాముని సమీపమున నున్న తన తోడఁబుట్టు వగు విభీషణుని, రాముని కుడిభుజ మనఁదగిన వాఁడైన మహాపరాక్రముండగు లక్ష్మణుని, వానరేం ద్రుల కెల్ల మేటి యగు భీకరమైన పరాక్రమము గల సుగ్రీవుని మనసునఁ గొంచెము సంశయపడినవాఁ డయి కినుకపూని, సంభాషణానంత రమున నా శుకసారణులను బెదరించెను. అట్లు బెదరించుటచేఁ దలవంచి యున్న యా శుకసారణులంజూచి, కోపముచే మాటలు తడఁబడ రావణుం డాగ్రహముతో ని ట్లనియె.

"ప్రభువువద్ద జీవనముచేయుమంత్రులు ముంపను దేల్పను జాలినట్టి యాప్రభువున కనిష్టమును బొత్తిగాఁ జెప్పుట యెంతయుఁ దగదు. అది యట్లుండ, విరోధు లగువారు యుద్ధమునకై వచ్చుచుండఁగా, పొగడ్త కనర్హమైన సమయమున నివ్విధముగా మీరు పరులను బొగడుట యుక్తమా? మీ రెందఱో పెద్దలను, జ్ఞానవయశ్శీలములతోఁ గూడిన వారిని, నీతిశాస్త్రోపదేష్టలను గొల్చితిరి గాని, నీతిశాస్త్రములలో సారభూత మైన భృత్యనిధర్మము మీ కింకను దెలియ లేదు. మీ రనేక నీతిశాస్త్రముల నభ్యసించినను, దానిసారమును గ్రహింపమిచే నాశాస్త్రములను బరువునకుఁ జేటుగా మోయుచున్నారు. విధిలేక మీయట్టి నౌకరులం బెట్టుకొని నేనును రాజ్యము పాలించుచున్నాను. మేలు కీళ్ళ నొసఁగఁజాలునట్టి వాక్కుగలవాఁడ నైన న న్నీవిధముగాఁ జెప్పునట్టి మీకు మృత్యుభయము లేదా? నే ననుగ్రహించినచో మీకు మేలు గల్గును. నే నాగ్రహించుకొన్నచో మీకుఁ జేటును గలుగును. అట్లుండియు, నాశక్తి తెలియక యిట్లు చెప్పితిరి గదా మీరు! అరణ్యమునఁ జెట్లకుఁ జిచ్చంటుకొన్నను నాచెట్లు కాలిపోవక యుండవచ్చును గాని, రాజునకుఁ గీడొనర్చిన యపరాధు లెన్నటికిని బ్రాణములతో నుండఁ జాలరు. మీమీఁదఁ గలిగిన కోపము మీరు మున్నొనరించిన యుపకారములచే మెత్తనపడ కుండు నేని, శత్రుపక్షమువారిని గొనియాడు పాపాత్ముల రగు మిమ్ము నింతకుముందే నశింపఁ జేసియుందును. మీరు నాయెదుట నిలువక పొండు. మీముందటి యుపకారములను దలఁచి మిమ్మేమియుఁ జేయను. కృతఘ్ను లైనట్టియు, నాయందు విశ్వాసములేని యట్టియు మీరు జీవించియున్నను, నాపాలికిఁ జచ్చినయట్లె." అని యాశుకసారణులను నిందింపఁగా, వారిద్దఱు సిగ్గిలి రావణునికి జయాశీర్వాదము చేసి వెళ్లిపోయిరి.

అంత దశగ్రీవుఁడు చేరువ నిలబడియున్న మహోదరుం జూచి, నీతి శాస్త్రమును జక్కఁగానెఱిఁగిన వేగులను శీఘ్రముగాఁ దోడ్కొని రమ్మని యానతిచ్చెను. అంత మహోదరుఁడు వెళ్లి వేగులను త్వరగ రమ్మని చెప్పి వచ్చెను. అంత, చారులు మిక్కిలి తత్తరపడుచు రాజునానతి చొప్పున శీఘ్రమే వచ్చి, రాక్షసేంద్రునకు జయదీవన లొనరించి, చేతులు

కట్టుకొని నిల్చి యుండిరి. తర్వాత రావణాసురుఁడు నిర్భయులును, తనకుఁ బ్రేమ గూర్చువారును, శూరులును, నమ్మఁదగినవారును నైన చారులం జూచి, "ఓచారులారా! మీ రిచ్చటనుండి వెళ్ళి రాముని ప్రయత్నమును బరీక్షింపుఁడు. ఈరామునికి మంత్రులలో ముఖ్యులెవ్వరు? ఎవ రితనియందుఁ బ్రేమతోఁ గలిసియుండువారు? ఈరాముఁ డెట్లు నిద్రించుచున్నాఁడు. ఒంటిగానా? లేక పెక్కుమందితోనా? లేక మేల్కొనియున్నాఁడా? ఏమి యేమి పని యొనరించుచున్నాఁడు? ఈ విషయమంతయు మీరు గూఢముగాఁ దెలిసికొని రావలసినది. బుద్ధిమంతులగు రాజులు చారునిమూలమునఁ బగుతురసంగతి యంతయుఁ దెలిసికొని యుద్ధమునందు స్వల్పప్రయత్నముచేతనే యాపగతురను గెల్చి త్రోసిపుత్తురు"అని చెప్పిపుచ్చఁగా,ఆచారులు "మహాప్రసాద"మని చెప్పి, తమలోఁ బెద్ద యగు శార్దూలుని మున్నిడుకొని రావణునికిఁ బ్రదక్షిణము గావించి, ప్రయాణమై సువేలపర్వతమున సుగ్రీవవిభీషణలక్ష్మణులతోఁ గూర్చుండియున్న రామునిఁ జూచిరి. ఆచారు లావానరసేనను జూచి భయముచేఁ దత్తరపాటు నొందిరి. అప్పుడు ధర్మాత్ముఁ డగు విభీషణుఁడు వీరిం గనిపెట్టి, వానరులతో నీవచ్చినవారు చారులని తెలుపఁగా, వానరులు శార్దూలుఁడు మున్నగువారిం బట్టుకొని చావమోదుచుండఁగా, రాముఁడు దయకలిమిచే నారాక్షసుల నందఱను విడిపించెను. వారు పరాక్రమశాలు లైన వానరులచేఁ దన్నులు దిని, నిట్టూర్పులూర్చుచు, స్మృతిదప్పి, కొనయూఁపిరులతో లంకాపురిం జేరిరి. పరరాష్ట్రసంచారశీలు రగు నా మహాబలులగు చారు లారాముని సేనతోఁ గూడ సువేలాచలమున నున్న వానిఁగా నెఱిఁగించిరి.

30-వ సర్గము

అట్లు శార్దూలుఁడు మొదలగుచారులు రాఘవుఁడు క్షోభింపఁజేయ నలవిగాని సేనతోఁ గూడినవాఁడై సువేలాచలమున విడిసియున్నాఁడని విన్నవింపఁగా, రావణుఁడు చారుల మాటలను విని, కొంచెము దిగులుపడినవాఁ డై శార్దూలుం జూచి, "ఓరాత్రించరుఁడా! నీమోము కళ యెప్పటియట్లుగాక దీనముగాఁ గనఁబడుచున్నావు. శత్రువు లాగ్ర

హముతో నిన్నుఁ బట్టుకొనలేదు గదా" అని యడుగఁగా, శార్దూలుఁడు భయముచే నిలువఁజాలనివాఁడై, రాక్షసాధిపుంగూర్చి తిన్నగా నిట్లనియె.

ఓప్రభూ! వానరసైన్యములోనికి వేగులు పోయి, యాసైనికుల బలవీర్యాదుల నెఱుంగ నెంతమాత్రము వలనుగాదు. వానరవీరులు తామే మగఁటిమియు, బలిమియుఁ గలవారు; శూరుఁడయిన రాముని రక్షణమునందున్నవారు. అట్టివారితో మాటాడుటకే వీలుకాదు. అట్టి వారి నెట్లు పరికింపవీలగును? పర్వతసమానులగు వానరులు వానర సైన్యముచుట్టును గావలియున్నారు. వారికిఁ దెలియక లోపలికిఁ జొచ్చుటకే వీలుకాదు. నే నెట్టులో లోపలికిఁ జొచ్చినంతనే విభీషణుఁడు మొదలగురాక్షసులు నన్నుఁ గనుఁగొని, బలవంతముగాఁ బట్టి, పెక్కు తెఱఁగుల నన్ను నేలమీఁదఁ బొఱలించి పొఱలించి తన్నిరి. అంత బలవంతులైన వానరులు మోఁకాళ్లతోఁ బొడుచుచుఁ, బిడికిళ్లతో గ్రుద్దుచుఁ గోఱలతోఁ గొఱకుచు నఱచేతులతో నప్పళించుచు సేన లోపల నంతట నీడ్చికొనిపోయి, యారామునికొలువునకుఁ గొనిపోయి విడిచిపెట్టిరి. నేను వానరులచేఁ దన్నులు తిని సర్వాంగములు నెత్తుటఁ దడియ సోలిసొక్కుచు నారాముని శరణువేడఁగా నతఁడు గరుణ దలఁచి, నన్ను విడచిపెట్టెను. కావునఁ దిన్నగాఁ దప్పించుకొని ప్రాణములతో నిచ్చటికి వచ్చిచేరితిని. ఇదిగో, రాముఁడు కొండలతోఁ బండలతో సముద్రమున సేతువుఁ గట్టి వానరసేనతో సముద్రము దాఁటివచ్చి సువేలపర్వతమున సకలాయుధముల నుంచికొని లంకాద్వారమున సిద్ధముగా నున్నాఁడు. గరుడవ్యూహము పన్ని, తన మీఁదిన ప్రతాపము మెఱయ, పెక్కండ్రు వానరవీరులు తోడ వచ్చుచుండ, నన్ను విడిపించి, లంకాపురము నెదుర్కొని వచ్చుచున్నాఁడు. రాక్షసాధిపా! రాముఁడు ప్రాకారముకడకు వచ్చి చేరకముందే, సీతను రాముని కర్పించుటయో, లేక, ఘోరయుద్ధము చేయ సమకట్టుటయో వీనిలో నేదియో యొక్కటి యొనరింపుము." అని శార్దూలుఁడు విన్నవింపఁగా, రావణుఁడు శార్దూలుని మాటల నన్నిటిని విని, రాముని ప్రభావమునుగూర్చి మనసునఁ దలఁచి, యాశార్దూలునిఁ జూచి, "ఓమంత్రిసత్తమా! దేవ దానవగంధర్వులు నాతోఁ బోరినను, సకలలోకనివాసులు నన్నుఁ గొట్ట

వచ్చినను, నేను సీతాదేవిని రామున కర్పించువాఁడను గాను. ఓ శార్దూలా! ఈసంగతి యుండనిమ్ము. వానరశూర సైన్యమును జూచితివి గదా! అచ్చట శత్రువులకు లొంగనివా రనఁబడెడి వానరు లెవరు? వా రెట్టికాంతిగలవారు? వా రెవని పుత్రులు? ఎవని పౌత్రులు? నిక్కము నెఱిఁగింపుము. యుద్ధకాముఁడు శత్రువులబలాబలములను బరికింపవల యునుగాన, నావానరులబలాబలముల నెఱిఁగి, యావల నీవానరులవిష యమై చేయవలసిన కార్యము నాలోచించెదను" అని శార్దూలు నడిగెను.

రావణుఁ డివ్విధమున నడుగఁగా, వేఁగులలో నుత్తముఁడగు శార్దూలుఁడు రావణునిసమక్షమున నివ్విధమున విన్నవింపఁ దొడఁగెను. "ఓరాక్షసాధిపా! యుద్ధరంగమున గెల్వ నలవికానివాఁడయిన ఋక్ష రజసునిపుత్రుఁడగు సుగ్రీవుఁడును, గద్దదునిపుత్రుఁడయిన జాంబవంతుఁ డును, గద్దదునియొక్క మఱొక్క పుత్రుఁడగు ధూమ్రుఁడును, రాక్షసు లందఱితోఁ దానొక్కఁడే పోరిన బృహస్పతిపుత్రుఁడగు కేసరియు, యముని పుత్రుఁడును, వీర్యవంతుఁడును, ధర్మాత్ముఁడునైన సుషేణుఁడును, బ్రహ్మ దేవునిచే వానరరూపముతో సృజింపఁబడిన మృత్యుదేవతలో యనఁబర గిన సుముఖదుర్ముఖవేగదర్శులును, చంద్రునిపుత్రుఁడగు తిన్ననివాఁడయిన దధిముఖుఁడును, అగ్నిహోత్రుని సుతుఁడగు నీలుఁడను సేనాధిపతియు, హనుమంతుఁ డని ప్రసిద్ధి కెక్కిన వాయుదేవునిపుత్రుఁడును, శత్రువు లచే నణఁపవీలుగాని బలిమిగలవాఁడును, ఇంద్రునిమనుమఁడు నగు నంగ దుఁడును, అశ్వినీదేవతలకుఁ బుత్రులగు బలవంతులైన మైందద్వివిదు లును, యమునిపుత్రులగు కాలాంతకునితో సమానులైన గజ, గవాక్ష, గవయ, శరభ, గంధమాదనులును, వీర్యలక్ష్మిగలవారును, శూరులును, యుద్ధములం దపేక్షగలవారునునైన దేవపుత్రులగు పదికోట్లవానరులు నున్నారు. వారియూళ్లు పేళ్లు మొదలగునవి చెప్పుటకు నాకు శక్తి చాలదు.

తొల్లి ఖరదూషణత్రిశిరులను సంహరించినవాఁడును, విరాధుని, యమునివంటివాఁడగు కబంధునిఁ జంపినవాఁడును, జనస్థానమునందు రాక్షసుల నందఱిని సంహరించినవాఁడును నెవ్వఁడో, చక్కని యంగ

ములు గలవాఁడును, సాటిలేని పరాక్రమము గలవాఁడునైన యట్టి దశ రథనందనుఁ డైన రామునియొక్క సుగుణములను వర్ణింప నెవ్వరికిని సాధ్యము గాదు! గజములలో శ్రేష్ఠగజమువలె నుండువాఁడును, దన్నెది రించిన దేవేంద్రుని నైన నోడఁగొట్టువాఁడును, ధర్మాత్ముఁడు నైన లక్ష్మణుఁ డును, సూర్యునిపుత్రు లగు శ్వేతజ్యోతిర్ముఖులును, నరుణుని మఱొక పుత్రుఁడగు హేమకూటుఁడును, వానరశ్రేష్ఠుఁ డగు విశ్వకర్మపుత్రుఁ డైన శూరుఁడగు నలుఁడును, బలవిక్రమములుగల వసుపుత్రుఁడైన దుర్ధరుఁడును, రామునికిఁ బ్రియము చేయఁగోరిన రాక్షసులలో నుత్తముఁ డయిన నీతిమ్ముఁ డగు విభీషణుఁడును రామునికి మేలొనరించు వారై లంకాపురమును ముట్టడింపఁ జూచుచున్నారు. ఓరాక్షసేంద్రా! వానరబలము నంతయుఁ దెల్పితిని. ఈ సేనయంతయు సువేలపర్వతమున విడిసియున్నది. మహారాజా! తర్వాతఁ దమ యిష్టము" అని శార్దూలుఁడు రావణునితోఁ జెప్పె.

31-వ సర్గము

రావణుఁడు మాయారామునిశిరంబు సీతకుఁ జూపుట

కలఁతపెట్టరాని బలముగలవాఁ డగు రాముఁడు సువేలాచలమున దండుతోడ విడిసియున్నాఁ డని చారులు రావణునకు నెఱిఁగించిరి. రావ ణుఁడును మహాబలుఁ డయిన రాముఁడు సువేలాచలమున విడిసియున్నాఁ డని చారులవలన నెఱిఁగినవాఁడై, కొంచెము భయపడి, సచివులం జూచి, "మంత్రులందఱు జాగరూకులయి రండు. మన మాలోచన చేయవలసిన తరుణ మిదిగో సంప్రాప్తమై యున్నది" అని యానతియ్యఁగా, నామంత్రు లందఱు వెంటనేవచ్చి చేరిరి. తర్వాత నారావణుఁడు తదనంతరము చేయ వలసినపనింగూర్చి మంత్రులతోడ నాలోచనచేసి యావల మంత్రుల నందఱిని వారియిండ్లకుఁ బంపి, తన నగరు ప్రవేశించె. అట్లు ప్రవేశించి పెక్కుమాయలవాఁడగు రావణుఁడు విద్యుజ్జిహ్వుఁ డనెడి మాయల నెఱిఁగినట్టి యొక రాక్షసునిఁ బిలిపించి, వానితోడ సీతాదేవి యున్న యశోకవనమునకుఁ బోయెను. అచ్చటి కేఁగినపిదప మాయలనెఱిగినవాఁ డగు నావిద్యుజ్జిహ్వునింగూర్చి, "విద్యుజ్జిహ్వా! మనము మాయచే సీతను మోసపుత్తము, నిశాచరా! మాయామయమైన రామునితల

యొక్కటి చేసి తీసికొని, బాణసహితమైన వింటిని గొని రమ్ము" అని యానతియ్యఁగా, విద్యుజ్జిహ్వుఁ డట్లు చేయ నొప్పుకొనెను. రావణుఁ డతనికి భూషణముల నొసఁగెను. రాక్షసాధిపుఁ డగు మహాబలుఁ డయిన రావణుఁడు తదనంతరము దైన్యము నొందఁదగనిదియుఁ, దీనురాలును అశోకవనమున నేలపయిఁ గూరుచుండి తలవంచికొని వ్యసనపడుచున్న దియు మగనినే తలఁచుచున్నదియు నలుకెలఁకుల భయంకరు లగు రాక్షస స్త్రీలచేఁ జుట్టఁబడినదియు నగు సీతను జూచి సంతోషవార్తను దెల్పు వానిమాడ్కి నామెను సమీపించి, దిట్టతనంపుమాటల ని ట్లనియె.

"ఓసుందరీ! నేను నిన్నుఁ బలుతెఱఁగుల బ్రతిమాలినను, నే రాముని నాదరువు చేసికొని నన్నుఁ గూర్చి నిష్ఠూరపుమాట లాడితివో, యట్టిఖరశత్రువైన రాఘవుఁడు సమరమునఁ గూలెను. ఓసీతా! నీ యాధారమును నఱికి వేసితిని. నీగర్వమణఁచితిని. నీ విఁక నీయంతనవచ్చి నన్ను 'భార్యనుగాఁ గైకొమ్మ'ని యడుగఁగలవు. మూఢురాలా! యీ బుద్ధి వదలుము. మృతుఁ డయిన రామునితో నీకుఁ గావలసిన దేమి యున్నది? ఓ మంగళకరీ! నీవు నాభార్యలలోఁ బెద్దదానవగుము. పుణ్య హీనురాలా! పని చెఱపుకొన్నదానా! అన్నియు నెఱిఁగినట్లు నటించు దానా! తెలివిలేనిదానా! ఓసీతా, వృత్రాసురవధము చందమున భయం కరమైన నీభర్తవధప్రకారమును దెలిపెదను. ఆలకింపుము. రాఘవుఁడు వానరరాజగు సుగ్రీవుఁడు తోడితెచ్చిన గొప్ప సేనతోఁ గూడినవాఁడై, నన్నుం జంపుటకై సముద్రము దాఁటి, ప్రొద్దు గ్రుంకువేళకు లంకా పురమునకుఁ బ్రవేశించి, సువేలపర్వతమున విడిసెను. ఆరాఘవునితో వచ్చిన వానరసైన్యమెల్ల దారిబడలికచేత మైమఱచి నిద్ర చెందెను. అట్టి సమయమున నేను వేఁగులను బంపి వానరులబలము నంతయు నెఱిఁగితిని. తర్వాతఁ బ్రహస్తుని భయంకరరాక్షససేనతోఁ గూడఁ బంపితిని. ప్రహ స్తుఁడు మొదలగు రాక్షసు లందఱు రామలక్ష్మణులు నిద్రించుచున్న తావునకుఁ జుట్టు నున్న వానరసైన్యమును పరిఘములు, పట్టసములు, చక్రములు, దుడ్డుకఱ్ఱలు, కత్తులు, గొప్పబాకులు, పెక్కు బాణములు, శూలములు, తళతళ మెఱయునట్టి కూటముద్గరాదులగు నాయుధము లతోఁ బైకెత్తి మోది సంహరించిరి. అంతటఁ జక్కఁగా బాణప్రయో

గము చేయఁగల శూరుఁడగు ప్రహస్తుఁడు నిద్రించుచున్న రాముని శిరమును గొప్పఖడ్గముతోఁ దటాలున నఱికెను. విభీషణుఁ డాకాశమున కుద్గమించిపో నుద్యమింప వానిని సైనికు లున్నట్టుండి యెగిరి పట్టుకొనిరి. లక్ష్మణునిఁ బెక్కండ్రు వానరులతోఁగూడ మూల మూలలఁ దఱిమిరి. ఓసీతా! సుగ్రీవుఁడు తెగిన తలతోను, హనుమంతుఁడు చెదరిన చెంపతోను రాక్షస నిహతులై పడియున్నారు. రాక్షసులు పెక్కుచిల్ల కోలలతో జాంబవంతుని మోఁకాళ్లను దెగఁగొట్టఁగా మొదటివఱకు నఱుకఁబడిన చెట్టువలెఁ బడియున్నాఁడు. ప్రతాపవంతుఁడయిన కుముదుఁడు రాక్షసులచే బాగుగా మర్దితుఁడై మాటలేకుండునట్లు చేయఁబడెను. ఒడ్డుపొడవుగలవారును, శత్రుసంహారులును, వానరశ్రేష్ఠులునునైన మైందద్వివిదు లిద్దఱు రాక్షసులచేఁ గదలతోఁ బొడువఁబడి, నిట్టూర్పులు విడుచుచు, రోదనముసేయుచు, నెత్తుటఁ బడి పొఱలుచున్నారు. పనసుఁడు పనసకాయవలెఁ దెగనఱుకఁబడి, నేలఁ గూలియున్నాఁడు. దరీముఖుఁ డను వానరుండు పెక్కుగదలచే మోదఁబడి యొకమూలఁ బడియున్నాఁడు. అంగదుఁడు రాక్షసులచేఁ బెక్కుబాణములతోఁ గొట్టఁబడి, భుజకీర్తులు నేలఁబడిపోవఁ బుడమినింబడి నెత్తురుగ్రక్కుచున్నాఁడు. రాక్షసులు వానరులను గజములచేఁ గొంద అను నశ్వములచేఁ గొందఱను రథములచేఁ గొందఱను ద్రొక్కించి మేఘములను బెనుగాలి చెదరఁగొట్టునట్లు పెక్కండ్రు వానరులను నలిపి నేలమీఁదఁ బరుండఁబెట్టిరి. వానరవీరులు సింహములచే వెంబడింపఁబడిన గొప్ప యేనుఁగులమాడ్కి రాక్షసులచేఁ దఱుమఁబడుచుఁ, వెనుకవైపునఁగొట్టఁబడుచుఁ గొందఱు సముద్రమునఁ బడిరి. కొందఱు పైకిఁ బోయిరి. కొండమ్రుచ్చులు రాక్షసులచేఁ దన్నులు తినఁజాలక వానరస్వభావము నవలంబించి, సముద్రతీరములందును, బర్వతములందును, వనములందును బెక్కువృక్షముల నెక్కిరి. ఆకొండమ్రుచ్చులలోఁ బెక్కండ్రను మఱికొందఱు విరూపాక్షులగు వానరులు చంపిరి. ఓసీతా! యిట్లు నీమగఁడు సేనలతోఁగూడ భయంకరులైన రాక్షసులచే మర్దింపఁబడెను. నెత్తుటఁ దడిసినదై, దుమ్ముచే నిండియున్న నీమగని శిరము ఛేదించి తెచ్చితి మదిగో చూడుము. అని సీతతోఁ జెప్పి, యా సీతాదేవి వినునట్లుగా, నొక రాక్షస స్త్రీని బిలిచి, "ఓసీ! యుద్ధభూమినుండి

రామునిశిరముఁ దెచ్చిన క్రూరకృత్యము లొనరించు వాఁడగు విద్యుజ్జిహ్వు నిచ్చటికిఁ బిలుచుకొనిరమ్ము" అని యానతిచ్చెను.

అంతట విద్యుజ్జిహ్వుఁడు ధనుస్సులతోఁ గూడిన యా రాఘవుని శిరమును గైకొనివచ్చి, రావణునికి శిరముతో మ్రొక్కి యాతని మ్రోల నిలఁబడెను. వాఁడట్లు నిలువఁగా రావణుఁడు తనచేరువ నిలఁబడి యున్న నిడుపునాలుక గలవాఁ డగు నా విద్యుజ్జిహ్వుం జూచి, "ఓరీ! దాశరథిశిరమును దెచ్చి సీతాదేవి ముందటఁబెట్టుము. దీనురా లగు సీత తన మగని కడపటిదశను బాగుగాఁ జూచును" అని చెప్పఁగా, విద్యుజ్జిహ్వుఁడును చూడఁదగియున్న యా రాఘవునిశిరమును సీతాదేవి మ్రోల నుంచి యంతర్ధానము నొందెను. తర్వాత రావణుఁడు ముల్లోకములందుఁ బ్రసిద్ధి కెక్కినదియు, గొప్పదియు నై వెలుంగుచుండెడి యావింటిని క్రిందవైచి, సీతం జూచి, "ఓసీతా! యిది నారికట్టఁబడిన యారామునివిల్లు. కడచినరేయి ప్రహస్తుఁడు విద్యుజ్జిహ్వునిఁ దోడుగా నుంచుకొని యా రాముని సంహరించి యీశిరమును దెచ్చెను." అని చెప్పి, యాశిరస్సును నేలఁ బొరలించి, పతివ్రత యగు వైదేహిని జూచి, యామెను దనకు స్వాధీనురాలినిగాఁ జేసికొనఁ గోరినవాఁడయ్యెను.

32-వ సర్గము

సీత మాయాకల్పిత రాముని శిరమును జూచి దుఃఖించుట

సీతాదేవి యాశిరస్సును నాధనుస్సును జూచి, హనుమంతుఁడు చెప్పియుండిన సుగ్రీవునితోడిచెలిమిని రావణునిమూలమున నాలకించి, తన భర్తయొక్క ముఖమునుబోలు ముఖమును, కన్నులను, ముఖవర్ణమును, శిరోజములను, ఆదివ్యమైన శిరోమణిని జూచి, యీ యన్ని గుఱుతులచే నది రామునిశిరస్సే యని భ్రమసినదై, యూరుఁబిచ్చుకైవడి దుఃఖించుచునారఘురామునివిషయమై కైకందలఁచి "ఓకైకేయీ! రఘుకులనందనుఁడు హతుఁ డయ్యె. ఇఁక సంపూర్ణమనోరథవుగమ్ము. జగడాలమారి వైన నీవలన రఘుకులమెల్ల నంతరించెను. ఓకైకేయీ, నాకును నాప్రియునికిని నారబట్ట లొసఁగి మమ్ము నడవికిఁ బంపితివే. ఏయుద్దేశముతోఁ బంపితివి? పూజ్యుఁ డయిన రాముఁడు నీ కేమి యంత యపకార మొనరించెను?" అని నిందించి దైన్యము మీఱ భయముచే

వణఁకుచు, స్మృతిదప్పి, మొదటికి నఱుకఁబడిన యరఁటిచెట్టుమాడ్కిఁ గ్రిందఁబడి,యొక ముహూర్తకాలములోపల మఱల స్మృతిఁ దెలిసికొని, లేచికూర్చుండి, యాశిరస్సును మూర్కొని, విలపింపఁ దొడఁగెను.

"ఓ వీరవ్రతము నవలంబించినవాఁడా! దీర్ఘబాహుఁడా! యక్కటా! నేను జెడితిని. ఇఁక నా కీబ్రదు కెందుకు? నేను నీకడపటి యవస్థను జూచితిని. నే ననాథ నైతిని. మగువకు మున్ను మగఁడు మరణ మొందుట గొప్పయనర్థ మనఁబడుచున్నది. ఓచక్కని నడతగల వాఁడా! నేను బాగుగ జీవించియుండఁగా నీ విట్టి గతి నొందుట నాదురదృష్టమువలననే కాని వేఱొక్కటి కాదు. నేను దుఃఖముమీఁద దుఃఖము నొందుచు వ్యసనసముద్రమున మునిఁగియుండఁగా, దుఃఖసాగరమునునుండి నన్నుఁ దరి చేర్పఁబూనిన నీవు నిట్టి యవస్థను బొందితివి. దూడయందుఁ బ్రేమ గల యావు దూడను బోఁగొట్టుకొన్నదై విలపించునట్లు నాయత్తగారగు కౌసల్య పుత్రుఁడైన నిన్నుఁ బోఁగొట్టుకొని వ్యసనమున మునిఁగెను. ఓ యెంచరాని పరాక్రమముగల నాథా! నీవు దీర్ఘాయుష్మంతుఁడవుగా నుందు వని యే మునులు చెప్పుచుండిరో, వారిపలుకు లనృతమగునట్లు రాఘవా! నీ వి ట్లల్పాయుష్కుండవైతివి. పెద్ద లనృతవాదులుగారు. నాదురదృష్టంబుననే యాపెద్దలబుద్ధి ముసించెనని తోఁచెడి. సకలభూతముల సృష్టికికారణభూతుఁ డయిన భగవంతుఁడు ని న్నిట్లు సంహరించుటచే నీవిషయమై సకలవిషయముల నెఱిఁగిన యాప్రాజ్ఞునకుఁ గూడ బుద్ధి ముసించె నేమో? ఓనాథా! నీ వుపాయశాలివై యుండియు, వ్యసనములఁ బోకార్చునుపాయముల నెఱిఁగినవాఁడవై యుండియు, నీతిశాస్త్రము నెఱిఁగినవాఁడవై యుండియు నెట్లు లీయూహింపరానిమరణము నొందితివి? లేకున్న నీవు సముద్రతీరమునఁ బరుండినప్పుడు, భయంకరురాలు, కడుఁ గ్రూరురాలు నగు కాలరాత్రి నిన్నుఁ గట్టిగాఁ గౌఁగిలించుకొని, నాకడనుండి నిన్నుఁ గొనిపోయెనేమో! దీర్ఘబాహుఁడ వగు పురుషోత్తమా! దీనురాలైన నన్నెడఁబాసి, పుడమిని బ్రియురాలినింబోలె బిగికౌఁగిటఁ చేర్చి నిద్రించుచున్నాఁడవే? ఓవీరుఁడా! నిరంతరము మున్ను నేను గంధ పుష్పాదులతోఁ బూజించిన బంగారుకట్ల ధనుస్సు ఇదియేనా? నీతండ్రియు నామా

మయు నైన దశరథమహారాజు మున్నగు పితరులతోఁగూడి స్వర్గలోక మున నున్నవాఁడవు. నిక్కము. ఓనాథా! నీవు నక్షత్రభూతుఁడవై, గొప్పకార్యము లొనరించినవారికిఁ బ్రియమును, పావనమును నైన నీ రాజర్షివంశమును విమానమున నుండి నిక్కముగాఁ జూడఁగలవు. ఓనాథా! నీవు పిన్నతనముననే నిన్నుఁ బెండ్లాడినదానిని, బాల యగు దానిని, పతివ్రతయగుదానిని న న్నేల చూడవు?నాతో నేల మాటాడవు? ఓకాకుత్స్థా, వివాహసమయమున నాచేయి నీవు పట్టుకొని, "నిన్ను నే నెడఁబాయను." అని చెప్పిన మాట జ్ఞప్తికిఁ దెచ్చుకొని వ్యసనము లలోఁ దగిలియున్న నన్నుఁ గూడ నచ్చటికిఁ గొనిపొమ్ము. గతిప్రదు లలో నుత్తముఁడవైన యోరామా! వ్యసనములలోఁ జిక్కియున్న నన్నుఁ బాసి యీలోకము విడిచి, యేల పరలోకమునకుఁ బోయితివి? మున్ను నేను మాత్రమే సకల శుభలక్షణములతోఁగూడిన యే నీశరీర మును గౌగిలించుకొంటినో, ఆనీశరీరమును క్రూరమృగము లీడ్చికొని పోయి తినియుండును. ఓనాథా! విస్తారదక్షిణ లొసఁగి యగ్నిష్టోమ ములు మొదలగు యాగము లొనరించి, యాధాన్యాగ్నిహోత్రునిచే నేల సంస్కారము నొందవైతివి! వనవాసమునకు వచ్చిన మనముగ్గుర లోపల లక్ష్మణుఁడొక్కఁడు మఱలి యయోధ్యకు వెళ్లఁగా, మాయత్త యగు కౌసల్య వ్యసనపరంపరలో మునిఁగి లక్ష్మణుని గూర్చి, రాముఁ డెక్కడనని యడుగునేని లక్ష్మణుఁడును, నీవు రావణునిపురమున నిద్రించు చుండఁగా, రాక్షసులు నిన్ను నీమిత్రబలమును జంపి రని కర్ణకఠో రముగాఁజెప్పును. అప్పు డాకౌసల్య, లక్ష్మణుఁడు నిన్నుఁ గూర్చి చెప్పిన వృత్తాంతమును, నేను లంకలో రావణునివశమున నున్న సంగతిని విని, ఱొమ్ము పగిలి ప్రాణములఁ దొఱంగును. అనార్యనగు నానిమిత్త మిట్టి చావునకుఁ దగిన బలవంతుఁ డగు రాముఁడు సముద్రమునుదాటి గోష్ప దమున హతుఁడయ్యెను. అక్కటా! దశరథనందనుఁడు తన కులమునకుఁ జెఱపనచేఁటయయిన నన్నుఁ దెలియక పెండ్లాడెను. ఆయార్యపుత్రుఁడైన రామునిపాలిటికి భార్య మృత్యుదేవత యైనది. నేను పూర్వజన్మమున నుత్తమ దానమగు కన్యాదానమును జేయ నీయ నైతిని కాఁబోలు! కావు నసే యీ జన్మమున సర్వరక్షకుఁ డగు రామునికిఁ బ్రియురాల నయి

యుండియు, నే నిక్కడ నివ్విధమున దుఃఖపడవలసినదాన నైతిని. రావణా! వేగమే నన్నును ఆరామునిమీఁదఁ బడఁద్రోయుము. ఆలిని మగనితోఁ జేర్చి, యుత్తమ పుణ్యమును గట్టుకొనుము. ఓరావణా! యీతని శిరస్సుతో నాశిరస్సును, ఈతని దేహముతో నాదేహమును జేర్చికట్టుము. నేనును మహాత్ముఁ డయిన భర్తను వెంబడించి పోయెదను. నే నిట్టి పాపముతోఁ బ్రాణములు పెట్టుకొని యుండఁజాలను"("నాతండ్రి యింట నున్నప్పుడు పెక్కునీతులను వేదవిదు లగు బ్రాహ్మణోత్తముల వలన వినియున్నాను, వారు ఏస్త్రీకి భర్త యిష్టుఁడై యున్నాఁడో, ఆ స్త్రీకే పుణ్యాలోకములు గల" వని చెప్పిరి. ఓర్పు, ఇంద్రియనిగ్రహము, సత్యము, ధర్మము, నెనరు, భూతదయ యను సుగుణగణములతో నిండిన నాభర్తను బాసినపిదప నాకిఁక గతి యేమి యున్నది") అని యివ్విధమున నిడివికన్నులు గల యాసీతాదేవి తన భర్త శిరోధనుస్సులంబోలు నాశిరోధనుస్సులను మాటిమాటికిఁ జూచి యేడ్చెను.

సీత యివ్విధమునఁ బలవించుచుండఁగా, ద్వారపాలుఁడు వచ్చి, చేతులు జోడించికొన్నవాఁడై, "రాక్షసాధిపా! జయము నొందుము" అని దీవించి, నమ్రమొనరించి, "ఓప్రభూ! సేనాధిపతి యగు ప్రహస్తుఁడు మంత్రులందఱితోఁ గూడినవాఁడై వచ్చియున్నాఁడు. ఆతఁడు తమ దర్శనము సేయఁగోరి, నన్నుఁ బంపినవాఁడు. మహారాజా! నీవు రాజవు గనుక నీయనుమతముఁ బడసి చేయవలసిన పని యత్యవసరమయిన దొక్కటి యున్నట్లున్నది. కావున మహాప్రభువు వారికిఁ ద్వరగా దర్శన మిప్పింపవలయును" అని మనవి చేసెను.

అంత రావణుఁడు ద్వారపాలుని వాక్యమును విని యశోక వనము విడిచి, మంత్రులకు దర్శన మియ్యఁబోయెను. అట్లు పోయి రామునిపరాక్రమముఁ దెలిసికొని, కొలువుకూటము సొచ్చి మంత్రులతోఁ దన యావత్తు కార్యముంగూర్చి యాలోచించి, ప్రకృతకార్యమును చేయఁదలఁచెను. రావణుఁ డశోకవనము విడిచిపోయినవెంటనే యా రామునిశిరమును ధనుస్సును నంతర్ధానము నొందెను. యమసదృశుఁ డయిన రాక్షసేంద్రుఁ డగు రావణుఁ డట్లు భీకరవిక్రములగు మంత్రులతో నాలోచించి, రామునివిషయమై తన చేయవలసిన కార్యనిశ్చయము

చేసికొని, తనచేరువ నిలిచియున్నవా రగు తనమేలు గోరెడి సేనాధిపతుల నందఱను జూచి, "సేనాధిపులారా! గొప్పకోలలతో భేరీవాద్యమును వాయించి సేనల నన్నింటిని రప్పింపుఁడు. కారణ మేమాత్రము చెప్పకుఁడు" అని యానతియ్యఁగా, వారు, "మహాప్రభూ! చిత్త"మని సెలవు గైకొన్నవారై, సైన్యములను రప్పించి, యుద్ధాకాంక్షతో నున్న రావణున కాసంగతి విన్నవించిరి.

33-వ సర్గము

సరమ సీత నూఱడించుట

ఇచ్చట రావణుఁ డివ్విధమున యాత్రాసన్నాహము చేయుచుండఁగా, నచ్చట నశోకవనమున స్థిరవ్రతయు, దయాళువు నైన విభీషణుని భార్యయగు సరమ తాను రావణునిచేఁ దత్పూర్వము కావలికాచుటకు నియమింపఁబడినది గనుక, యాసీతాదేవికిఁ గావలియుండి యాపెగుణగణములకు సంతోషము నొంది, యామెయెడఁ బ్రేమగలదిగా నుండెను గావున, రావణునిమాటలకు బేలుపోయి, వాస్తవముగా రాముని జీవిత విషయమున విపరీతజ్ఞానము గలదియుఁ బ్రేమ గలదియుఁ దన నెచ్చెలి కత్తెయు నైన సీత వ్యసనపడుచుండుట చూచి, రాక్షసేంద్రుని మాటల కధైర్యపడి కడు వంతం గుందుచు, దుమ్మునందుఁ బొఱలి, యొడలంతయు నాదుమ్ముతో నిండినదైయున్న యాఁడుగుఱ్ఱమువలెఁ దోఁతెంచుచున్న యాసీతాదేవికడఁ జేరి, యామెయందలి యనురాగముచే నివ్విధమున నామె నూఱడింపఁ దొడఁగెను.

"ఓవైదేహీ! యూఱడిలుము. నీవు మనమున వగవఁ బనిలేదు. ఓసీ పిఱికిదానా! రావణుఁ డింతకు మున్ను నీకడ కేతెంచి, నీతో నేమి చెప్పినదియు, దానికి నీవేమి బదు లిచ్చినదియు, నేనదియంతయు నెవ్వరు నెఱుగని యొక మఱుఁగుప్రదేశముననుండి యారావణునివలని భీతియు మాని వినుచుంటిని. నీనిమిత్తమై నాప్రాణములైనఁ బాసెదను. నీకంటె నాకుఁ బ్రాణము లిష్టములు గావు. ఓ మిథిలరాజుకూఁతురా! యిచ్చటినుండి వెలుపలికిఁ బోయి, రావణుఁ డిచ్చటనుండి తత్తరపాటుతో నెందులకు బయలుదేఱి పోయినదియుఁ దెలిసికొంటిని. ధైర్యవంతుఁ డగు రాముని నిద్రాసమయమునం గూడ వధించుట యను

నది శక్యముగాదు. అట్లుండఁగా, పురుషోత్తముఁడగు నారాముని వధము జాగ్రదవస్థయందు వలనుపడుమాటయే కాదు. పోనిమ్ము. వానరుల సంగతియో యనిన, దేవతలు దేవేంద్రునిచే రక్షింపఁబడు నట్లు, వానరులు రామరక్షితులు గావున వృక్షములతో యుద్ధము సేయువారలగు నావానరులను వధించుట యనునది కలలోనిమాట. ఓ వైదేహీ! ఆరాముఁడు పరాక్రమముచే మాత్రమే వధ్యుఁడు కాఁడనుట కాదు. అతని శుభలక్షణములును నతఁ డట్టివాఁ డని తెలుపు చున్నవి. ఆరాముఁడు నిడుదలై గుండ్రనగు బాహువులు గలవాఁడు; వెడఁదఱొమ్ము గలవాఁడు; ప్రతాపవంతుఁడు, విలుకాఁడు; చక్కని యవయవమును గలవాఁడు; ధర్మస్వభావుఁడని లోకవిఖ్యాతిఁ గనిన వాఁడు; మగఁటిమి గలవాఁడు; తన్ను, నొరునిం గాపాడువాఁడు; పగతుర సేనలను బరిమార్చువాఁడు, ఎన్నరాని బలిమియుఁ, బౌరుష మును గలవాఁడు. శత్రువుల యుక్కడంచువాఁడు. రాజ్యలక్ష్మి వంతుఁడు. అతనిని సంహరింప నేరికిని దరముగాదు. ఓ వైదేహీ! యాతఁడు తమ్ముఁడగు లక్ష్మణునితోఁ గూడ సేమముతో నున్నవాఁడు. ఓ సీతా! రాముఁడు క్షేమముతో నున్నచో, రావణుఁ డారాముని శిరోధనుస్సుల నెట్లు దెచ్చినాఁ డందువేమొ? చెడుపనులు చేయు వాఁడునుఁ చెడ్డబుద్ధి గలవాఁడును, సకలభూత విరోధియు, మాయల మారియునైన భయంకరుఁడగు రావణునిచే నీయెడఁ జూపఁబడినది యంతయు మాయ. ఓ జానకీ! నీశోకము వీడెను. నీకు శుభసమయము సంప్రాప్తమైయున్నది. తప్పక నిన్ను రాజ్యలక్ష్మి పొందఁగలదు. ప్రీతి గల్గించు నాయింపు మాటను వినుము. రాముఁడు వానరసేనతోడ సముద్రము దాఁటి సముద్రపు దక్షిణంపు టొడ్డున విడిసియున్నాఁడు. రాముఁడు సకలవానరసైన్యముతోఁ గూడఁ గడలిం దాటుటచేఁ గృతార్థుఁడై కడలియొడ్డున వానరసేనలు చుట్టు నిలిచియుండఁగా నడుమఁ గూర్చుండి యుండుటను నేను జూచి వచ్చితిని. ఈ రావణుండు సంగతి గనుఁగొనుటకై పంపిన వేగవంతులగు రాక్షసులును "రాముఁడు కడలిని దాఁటె" నను వృత్తాంతమే తెచ్చిరి. ఓ విజేవికన్నులదానా! రావణుఁడును, నా రాక్షసులు తెచ్చినసంగతిని విని, మంత్రులందఱితోఁ

గూడి యిదిగో యిపుడు మంతనము చేయుచున్నాఁడు." అని సీతతోఁ జెప్పుచు, నప్పుడే సైనికు లెక్కువ పూనికతోఁ జేసిన కోలాహలమును డానును సీతయు వినెను. ఇంపుగులుకు పలుకులు పలికెడి యాసరమ కోల దెబ్బచే మ్రోగుచున్న భేరీవాద్యంపు మ్రోఁత విని యింపుగులుకు మాటల నిట్లనెను.

ఓ పిఱికిదానా! యీ భయంకరమైన భేరి యుద్ధసన్నాహముఁ గలిగించునది గదా? వార్షికమేఘగర్జనముంబోలు నీ గంభీరమగు భేరీ వాద్యంపుమ్రోఁత నాలకింపుము. మదపుటేనుఁగు లలంకరింపఁ బడు చున్నవి. గుఱ్ఱములు రథములకుఁ గట్టఁబడుచున్నవి. పెక్కండ్రు గుఱ్ఱపు రౌతులు బల్లెములు చేతులఁ బట్టినవారై కోలాహలము లొనర్చు చున్నారు. కాలిబంటులు, యుద్ధమునకుఁ గట్టాయితముగ నచ్చటచ్చట గుమిగూడుచున్నారు. సాగరము వడితోఁగూడి మ్రోగుచువచ్చెడి నీటి వెల్లువలచే నిండినచందమున వింతతోఁ జూడఁదగిన సేనలతో రాజ వీథులు నిండి నిబిడీకృతములై యున్నవి. నిర్మలశస్త్రములయు, డాలు వాఱులయు, కవచములయు, రథగజాశ్వములయు, తొడవులం దాల్చిన రాక్షసులయుఁ బెక్కువన్నెలడాలు వెల్లివిరియుచున్నది. ఆకాంతి వేసవియం దడవిని దహించు కాఱుచిచ్చు వెలుంగునుం బోలియున్నది. ఓ మైథిలీ! యేనుఁగులకుఁ గట్టిన గంటలు మ్రోఁగుచున్నవి; రథములు తఱలుచున్నవి; గుఱ్ఱములు సకిలించుచున్నవి; వాద్యములు మ్రోఁగు చున్నవి. వానిమ్రోఁతల నాలకింపుము. ఆయుధములను బైకెత్తి పట్టు కొన్నవారై, రాక్షసేంద్రుఁడగు రావణుని వెంబడించిపోవు రాక్షసుల గట్టి పూనికి చూపఱకు గగుర్పాటొదవించుచున్నది చూడుము. నీకు వగదీఱి జయముగలుగును. రాక్షసులు భయపడవలసినకాలము వచ్చినది. దేవతలలో వాసవుఁడుఁ బోలె నెన్నరాని పరాక్రమము గలవాఁడును, క్రోధమడఁచుకొన్నవాఁడును, తమ్మిరేకులం బోలు కన్నుల వాఁడును నైన నీమగం డగు రాముఁడు రణమున రావణుని గెల్చి నిన్నుఁ బొందఁగలఁడు. పగతురగొంగ యగు వాసవుఁడు విష్ణునిఁ దోడుసేసికొని యసురలపైకిం గవియునట్లు, నీమగండును లక్ష్మణునిఁ దోడుగాఁ దీసుకొని, రాక్షసులపైకిఁ గవియఁగలఁడు. రాముఁడు

శత్రువును సంహరించి, నీకడకు రాఁగా, శత్రుసంహారముచేఁ బూర్ణ మనోరథ యైన నీ వా రామునితోడమీఁదఁ గూర్చుండి యుండఁగా, నేను వేగమే చూడఁగలను సుమీ. ఓ సుందరీ! నీ వారఘురామునిఁ గూడి, విఱివిఱొమ్ముగలవాఁ డయిన యారాముని ఱొమ్మున సంతసంపుఁ గన్నీటిని విడువఁగలవు. ఓ సీతాదేవీ! ఎక్కువ బలిమికాఁడగు రాముఁడు రావణుని సంహరించివచ్చి, పెక్కునెలలుగా నీ వెనుక వ్రేలాడుచుండెడి యీజడను వేగిరమే విప్పఁగలఁడు. నీవును పున్నమ నాఁటి చంద్రునిఁబోలె వెలుఁగు నారాముని ముఖముఁ జూచి, భుజంగి కుబుసమును వదలినట్లు, వ్యసనబాష్పములను విడువఁగలవు. ఓ మైథిలీ! సుఖములకుఁ దగినవాఁడగు రాముఁడు సమరమున రావణుం జంపి, కోరికనిండినవాఁడై, ప్రియురాలవగు నీతోఁగూడి, సుఖము ననుభవింపఁగలఁడు. నీవు మహాధీరుఁడగు రామునితోఁ గూడినదానవై, చక్కనివర్షముచే నవనవలాడుచుండు వరిపైరుతోఁ గూడిన భూమి మాడ్కి విరాజిల్లుదువు. ఎవ్వఁడు పర్వత శ్రేష్ఠమైన మేరుపర్వతము చుట్టు గుఱ్ఱమువలెఁ బ్రదక్షిణముఁ జేయుచున్నాఁడో, యా సూర్య నారాయణమూర్తిని శరణుచొరుము. ఆతఁడు ప్రజలకుఁ గావలసినవి యొసఁగువాఁడు గనుక నీకును గొప్ప కలిమి నీయఁగలఁడు. నీ వూఱడుము." అని సరమ సీతాదేవితోఁ జెప్పెను.

34-వ సర్గము

సరమ రావణుని యభిప్రాయము సీతకుఁ దెల్పుట

చిఱునవ్వు మోముతో మాటలాడునట్టి యా సరమ యా రావణుని మాటలచే రామునివిషయమైన విపరీతజ్ఞానముగలదై వ్యసనపడుచున్న యా సీతాదేవిని దివి భువిని వానచేఁ దనుపునట్లు ముందుచెప్పిన మాటలతోఁ దనిపి, యా చెలియగు సీత కింకను మేలు సేయఁగోరినదై, సమయజ్ఞురాలగుటచే సమయానుకూలముగా నాసీతతో మాటాడఁ గడగెను. "ఓ మైథిలీ! నేను తిరస్కరిణీవిద్యచే నెవ్వరికిఁ గాన రాకుండ నాకసము తెరువునఁ బోయి, రామునికి నీ కుశలవృత్తాంత మెఱిఁగించి వచ్చెదను. పట్టులేని యాకారమున నేఁ బాఱునప్పుడు వాయుదేవుఁడొంటె, గరుత్మంతుఁడొంటె నన్నడ్డగింపఁ జాలరు."

అని సరమ చెప్పఁగా, సీతాదేవియు, "ఓచెలీ! నీ వుప్పరమున నెగసియైనను, పాతాళమునఁ జొఱఁబాఱియైనను బోవఁగలవు. నీవు చేయవీలుగాని పనియైనను నావిషయమునఁ జేయఁగల వని తలఁచెద. ఓ చెలీ! నాకు మేలు సేయవలెనని నీకు గట్టితలం పుండినచో, నీ విచ్చటి నుండి వెడలిపోయి, యా రావణుఁడేమి చేయుచున్నాఁడో తెలిసికొని వచ్చి చెప్పుము. ఆ రావణుఁడు మాయయె బలముగా నెంచినవాఁడు; జాలిలేనివాఁడు. పగతుర నేడ్పించువాఁడు. మద్యము త్రాగిన మాత్రముననె మోహము గలిగించునట్లు చెడునడతగల యా రావణుఁడు నాకు మోహము గలిగించుచున్నాఁడు. ఆ క్రూరరావణుఁడు విడువక నాకుఁ గావలియుండునట్టి కడువెగడు పుట్టించు క్రూరరాక్షస కాంతలమూలమున నన్ను నెల్లప్పుడు నదలించుచు, బెదరించుచు నున్నాఁడు. నన్ను భయమును, సంశయమును పీడించుచున్నవి. నా మనస్సు నిలుకడదప్పియున్నది. నే నశోకవనమున నున్న దానినై యా రావణునివలన భయమున నడలిపోవుచున్నాను. ఆ రావణునివలన నేను సంశయించుచున్నదానను; నాయెడల నీ కెక్కువదయగలదేని నిప్పుడా రావణుఁడేమి చేయుచున్నాఁడో, ఆతని తలఁ పెట్లున్నదో కనుగొని వచ్చి నాకుఁ జెప్పుము" అని సరమను నడుగుటకుముందు చింతతోడఁ గూడినవియు, నడిగినపిదపఁ దిన్న నైనవియునైన మాటలచే నింపు మీఱ నడిగెను.

మధురాలాపములు మాటాడెడి యా సరమ యవ్విధముగాఁ దన్నడిగిన యా సీతాదేవియొక్క మోమునందుఁ బర్వియున్న కన్నీటిని దుడుచుచు, "జానకీ! నీ కట్టి యభిప్రాయముండెనేని, ఇదిగో నేను పోయి యా రావణుని యభిప్రాయముఁ గనుంగొనివచ్చెదను జూడుము" అని సీతతోఁజెప్పి, యా రావణాసురునిసమీపమునకుఁ బోయి యా రావణుండు తన మంత్రులతోడ మంతనము సేయుట, వా రందులకు బదులొసంగుట మొదలగు సంగతులు విన్నదై, యా దురాత్ముఁడగు రావణుని యభిప్రాయమును, కార్యనిశ్చయమును నెఱింగినదై, మఱల వేగిరమే యశోకవనమున కేతెంచి, పద్మాసనమును గోలుపోయిన లక్ష్మీదేవిచందమునఁ దన రాకకై వేచియుండు జానకిని జూచెను. అంతట

సీతాదేవి తాను జెప్పిపంపిన విషయముఁ దెలిసికొనివచ్చిన యింపుఁ బలుకులు పలుకునదియగు నాసరమను మిగులఁ బ్రీతితోఁ గౌఁగిలించికొని తానే యామె కాసనమునొసఁగి "ఇచ్చట సుఖముగఁ గూర్చున్నదానవై చెడుతలఁపుగలవాఁడును, క్రూరుఁడును నైన యా రావణునికార్య నిశ్చయమున్నది యున్నట్లు తెలుపు" మని యడిగెను.

అంతట సీత యవ్విధమున గడగడవణఁకుచు సరమ నమగఁగా, నా సరమ యా రావణుఁ డాతని మంత్రులతోడ నాలోచించిన తెఱఁగు చెప్పఁబూనెను. "ఓ వైదేహీ! రావణునితల్లియు, రావణుని మంత్రులలో ముదుసలియైన యవిద్ధుఁడును "నాయనా! రావణా! మైథిలిని రామునకు సమర్పించి క్షమాపణము గోరుకొనుము. జనస్థానమున రాముడొక్కఁడే పదునాలుగువేవురను వధించిన ప్రకారమును, హనుమంతుఁడు సముద్రమునుదాఁటి సీతాదేవిని జూచుటయు నీకు గొప్ప దృష్టాంతములుగావా? ఆతని మార్కొని యెదిరింపఁగలవా? ఆ రాముఁడు తప్ప నే మానవుఁడు రాక్షసులను సంహరింపఁగలఁడు? అట్టి వానితో నీకుఁ బగ పెట్టుకొనుట యుక్తము గాదు" అని యెన్ని విధముల నీతిఁ జెప్పియు, లోభి ద్రవ్యమును విడువఁజాలనట్లు రావణుఁడు నిన్ను రామున కర్పింప నియ్యకొనకున్నాఁడు. ప్రాణములుండునంత దనుక ని న్నా రాముని కర్పింపరాదను క్రూరపుఁ దలంపు మంత్రి సమేతుఁ డయిన యా రావణుని కున్నట్లు తోఁచెడి. ఓ దేవీ! యా రావణుని కిట్టి నిశ్చయమేల కలిగినదియనిన నది యాతనికి మరణకాంక్ష చేతనే. రావణుఁడు సమరమునఁ దానును రాక్షసు లందఱును జావక, యూరక భయముచే నిన్ను రామున కొసఁగువాఁడుకాఁడు. ఓ నల్లని కన్నులు గలదానా! యిఁక నెట్లు? రాఘవుం డన్నివిధముల నా రావణుని వాఁడియమ్ములచేఁ గూల్చి, ని న్నయోధ్యకుఁ దోడ్కొని పోవఁగలఁడు."

అని సరమ సీతాదేవి నూఱడించుచుండగా, నింతలోపల భూమిని గడగడలాడించు వానరసేనల భేరీ శంఖ కాహళాది వాద్యముల గొప్ప మ్రోఁత వినఁబడెను. ఆ వానరవీరుల సింహనాదములు విని లంకాపురమునందుండు రాక్షసేంద్రుని భృత్యులందఱు కాంతి తొఱఁగి,

యుత్సాహము తగ్గుటచేఁ గార్యములందుఁ బూనికిలేనివారై, తమ యేలికయొక్క తప్పిదము కారణమగుటచేఁ దాము ప్రాణములతోనుండి మేలులఁ బొందఁజాల మని తలఁచినవారైరి.

35-వ సర్గము

మాల్యవంతుఁడు రావణునికి హిత ముపదేశించుట

శంఖభేరీనినాదముతోడ శత్రుపురంజయుం డైన నిడుదచేతుల వాఁడగు రాముఁడును యుద్ధమునకు వెడలెను. అంతట నెక్కువబలిమి కాఁడును, లోకబాధాజనకుఁడును, కఠినహృదయుఁడు నైన రాక్షసాధిపుఁడగు రావణుఁడు నానాదము నాలకించి, కొంతతడవు చింతించి, యనంతరము మంత్రుల నందఱిని బిలిచి, "సచివులారా! రాముఁడు సముద్రముదాఁటుట, యతని మగఁటిమి, యతని బలఁగము చక్కఁగా నుగ్గడించి చెప్పితిరి. అది యంతయు వింటిని. మీరు యుద్ధములందు నిక్కమయిన మగతనము గలవారై యుండియు, రాముని పరాక్రమము విని, దానికి వెఱచి యొండొరులమోములు చూచుకొనుచు నూఱక నిలఁబడియున్న మిమ్మును నే నెఱుఁగుదును" అని యాకొలువు కూటమెల్ల మాఱుమ్రోఁగునట్లు మంత్రులను బొడుపుమాటల నెత్తిపొడిచెను.

అంత రావణునితల్లికిఁ బినతండ్రియు, గొప్పపండితుఁడు నైన మాల్యవంతుఁ డగు రాక్షసుఁడు రావణుని పలుకు లాలకించి యాతనికి రాజనీతిని బోధింపఁదొడఁగెను. "రాక్షసాధిపా! ఆన్వీక్షకీ, దండనీతి, త్రయీవిద్య లనెడి నీతులను జదివి, నీతిశాస్త్రము నభ్యసించి దాని ప్రకారము నడచుకొను నృపాలుఁడు బహుకాలము ప్రభుత్వము చేయుటేకాక, పగతురను లోఁబఱచుకొనుచున్నాఁడు. అట్టినీతి మార్గమునఁ బోయెడి రాజు తాను హీనుఁడై తన యెదుటివారు ప్రబలులై యున్నపుడు వారితో సంధిచేసికొనుచు, తాను బలవంతుఁడై తన శత్రువులు బలహీనులై యున్నప్పుడు వారితో యుద్ధముచేయుచుఁ దనసైన్యము వృద్ధిచేయుచు నెల్లప్పుడుఁ బ్రభుత్వ మొనరించుచునె యుండును. బలిమి తగ్గుచుండెడి నృపాలుఁడు దనకంటె హెచ్చుబలిమి గల నృపాలునితోడను, తనతో సమానబలుఁ డగు నృపాలునితోడను సంధి యొనరించుకొన వలయును. తన శత్రునికంటెఁ దాను బల్మికాఁడై

యుండెనేని నప్పు డాన్నృపతి తన శత్రువుతో విరోధించి, యతనితోఁ బోరుచేయవలయును. ఓరావణా! యిపుడు రామునితో సంధి యొనరించుట యుక్తముగాఁ దోఁచెడి. మన మేసీత నిమిత్తము రామునితోఁ బగ పెట్టుకొంటిమో యాసీత నెత్తికొనిపోయి రామున కర్పింపుము.

దేవర్షిగంధర్వులంద ఱా రామునికి జయముగోరుచున్నారు. అట్టి యా రామునితో విరోధము పెట్టుకొంట తగదు. అతనితో సంధియే చేసికొనుము. భగవంతుఁడు బ్రహ్మదేవుఁడు సురలకు ధర్మమును, అసురుల కధర్మమును నియమించెను. మహాత్ములగు దేవతలకు ధర్మమును, రాక్షసులకు నసురులకు నధర్మమును ముఖ్యములని వినఁబడుచున్నది. ఎప్పుడు ధర్మమువలన నధర్మమునకుఁ బరాజయముగలిగెనో, యది కృతయుగ మనఁబడును. ఎప్పు డధర్మము బలిష్ఠమై ధర్మమును జయించునో యది కలియుగ మనంబడును. కావున నీవు మున్ను లోక సంచారము చేయుచున్న కాలమున గొప్పదైన ధర్మము పాడుచేసితివి. అన్యాయము నవలంబించితివి. కావుననే మన శత్రువులు మనకంటెఁ బ్రబలులై యున్నవారు. నీవు తెలియక యధర్మమును బెంచితివి. ఇప్పుడు ధర్మము మనలను మ్రింగివేయుచున్నది. దేవతల కనుకూలమైనదిగాన ధర్మము దేవతలకు వృద్ధిని గలిగించుచున్నది. నీ వెద్దియో యొక కారణముచేత నింద్రియాశలందుఁ జొచ్చినవాఁడవై, యగ్నిహోత్రునింబోలు మహర్షుల కెక్కువభయము గలిగించితివి. అది వారికి బలిష్ఠమయ్యెను. చక్కఁగా మండుచున్న యగ్నిహోత్రునికైవడి నా మునుల ప్రభావ మోర్వరానిది. ఆద్విజన్ములు తపోబలముచే నాత్మధ్యానము చేయువారును, ధర్మాభివృద్ధి గలిగించుటయం దాసక్తి గలవారునునై యనయ ముత్తమము లైన యజ్ఞములను జేయుచుందురు. వీరు యథాశాస్త్రముగా నగ్నులయందు వ్రేల్మిడు లొనరింతురు. రాక్షసులందఱు చేతులుగట్టి పాఱిపోవునట్లు గట్టిగా వేదాధ్యయనము చేయుచుందురు. గ్రీష్మర్తువునందలి మేఘంబులంబోలె నందఱు రాక్షసులు దిక్కులకుఁ బరుగులెత్తుచున్నారు. బ్రహ్మవర్చస్సుచే నగ్నిదేవునింబోలె దగదగమెరయునట్టి మునుల యగ్నిహోత్రములనుండి లేచిన ధూమము పదిదిశలయందుఁ బర్వి రాక్షసుల తేజస్సు నాకర్షించుచున్నయది.

అయ్యయిపుణ్యస్థలములందు గట్టి నియమములతోఁ దపము లొనరించెడి మునులతపస్సు రాక్షసులను మలమలమాడ్చుచున్నది. నీవు దేవదానవ యక్షులవలన మాత్రమె మరణము లేకుండునట్లు వరము బ్రహ్మవలనఁ గైకొంటివి. గట్టి మగఁటిమిగలవారును బలిమికాండ్రునునైన నరులు, వానరులు, ఎలుఁగుబంట్లు, కొండమ్రుచ్చులు నిచ్చటికి వచ్చి ఱొప్పుచున్నారు. వీరివలన నీవు మరణము పొందకుంటకు వరము గొనవైతివి.

రాక్షసాధిపా! మనకుఁ బెక్కు లపశకునములు జరుగుచున్నవి. అవి చూచినమాత్రమున భయంకరమైన నాశకాలము దోఁచుచున్నది. రాక్షసుల కందఱికిఁ జేటు వాటిల్లునని తలఁచెదను. మేఘములు చెవులకుఁ గఠినముగానుండు నట్టుఱుముచు, భయంకరములై లంకాపురము నందంతటను వేడి నెత్తుటిని గురిపించుచున్నవి. గజాశ్వములు గన్నీరు విడుచుచున్నవి. టెక్కెములు దుమ్ముతోనిండినవై కాంతితగ్గి, తొంటి వలెఁ బ్రకాశింపకున్నవి. క్రూరములైన నక్కలు మొదలగు ఘాతుక మృగములు లంకాపురములోపలఁ జొచ్చి, గుంపులుగూడి నిరంతరము కర్ణకఠోరముగాఁ గూయుచున్నవి. నల్లని వన్నెగలపడుచులు మ్రోల నిలచి యెదిరించి మాటాడుచు, నిండ్లనున్న పదార్థములను దొంగిలించుచుఁ దమ తెల్లని పండ్లిగిలించి నవ్వుచున్నట్లు నే నొక్క కలగంటిని. గృహములందుఁ బూజనిమిత్త ముంచఁబడిన బలులను శ్వానములు దినుచున్నవి. ఆవులందు ఖరములు జనించుచున్నవి. పందికొక్కులు ముంగిసలతోఁ గూడఁ దిరుగుచున్నవి. పిల్లులు పులులతోను, వరాహములు శునకములతోను, కిన్నరులు రాక్షసమనుష్యులతోను జేరుచున్నారు. తెల్లని వన్నెగలవై, యెఱ్ఱని పాదములతోఁ గూడినవగు పావురములు రాక్షసులచేటుకాలము దెలుపుటకై సంచరించుచున్నవి. ఇండ్లయందు నేడుకపలుకులు పలుకునిమిత్తమై పెంపఁబడిన గోరువంకపిట్ట లింపుఁబలుకులు విడిచి వీచికూచి యని కర్ణకఠోరముగాఁ గూయుచున్నవి. మృగపక్షులన్నియు నోడియు మఱలఁ గలహముగోరి పరుగులిడుచు సూర్యుని యెదుట నిలిచి రోదనము గావించుచున్నవి. చూపఱకు వెఱపు గలిగించువాఁడును, కుంటివాఁడును, జుట్టులేనివాఁడును, నలుపు పసుపు మైడాలు గలవాఁడును నైన యొక పురుషుఁడు రేపుమాపులందుఁ బ్రతి

యింటఁ జొచ్చిచూచుచున్నాఁడు. ఈమొదలగు పెక్కులవశకునములు గలుగుచున్నవి. (విష్ణువే మానుషరూపమెత్తివచ్చినాఁడని తలంచెదను. అంతియకాని, దృఢవిక్రముండగు రాముఁడు కేవలమనుష్యమాత్రుఁడగువాఁడు. మనుష్యమాత్రుల కీసముద్రమున నీయద్భుతసేతునిర్మాణము సాధ్యమా ?) కావున, రావణా ! కార్యములఁ జక్కఁగా నాలోచించి తెలిసికొని యుత్తరకాలమునకు యుక్తమైన కార్యమును జేయుము" అని యుత్తమోత్తముఁడగు బల్మికాఁడయిన మాల్యవంతుఁడు రావణునితోఁ జెప్పి, రాక్షసాధిపునిమనము గనిపెట్టి, తనయభిప్రాయమాతని కనిష్టముగా నున్న దని యెఱిఁగినవాఁడై యంతటఁ దన మాట చాలించెను.

36-వ సర్గము

రావణుఁడు మాల్యవంతునిమాట నుల్లంఘించుట

అంతటఁ బదితలలు గలవాఁ డయిన రావణుఁడు బుద్ధిహీనుఁడగుటంజేసియు, మృత్యువశమునఁ జిక్కినవాఁ డగుటంజేసియు, నా మాల్యవంతుఁ డాడిన హితవచన మోర్వనివాఁడై, కనుబొమ్మలు ముడిపెట్టి, కోపమునకు వశుఁడై, యొరులపొగడ్త కోర్వలేమిచేఁ గన్నులు గిరగిరఁ ద్రిప్పుచు నామాల్యవంతుని సంబోధించి, "ఓరీ! శత్రుపక్షము నాశ్రయించి, నాకు హితము జెప్పువానియట్లహితము చెప్పుచున్నాఁడవు గాన నీమాటలు నావీనులఁ జొఱవు. మనుష్యమాత్రుఁడు, హీనుఁడు, ఒంటరిగాఁడు, అల్పమృగము లైన కోఁతులు సహాయులుగాఁ గలవాఁడు, తండ్రిచేఁ దఱుమఁబడి యడవులలో నల్లలాఁడుచుండువాఁడు. అట్టిరాముని సమర్థునిఁగాఁ దలఁచెదవు. సర్వరాక్షసులకు రాజను, దేవతులకు భయంకరుఁడను, సకలవిధము లైన సామర్థ్యములు గలవాఁడను నైన నన్ను బలహీనునిఁగా నెంచియున్నావే ? అదేల? నీ విత్తెఱఁగునఁ గఠినపుమాటలు చెప్పుట యెంచిచూడఁగా, నీవు వీరుఁడనయిన నాయందలి విరోధముచేతనో, శత్రుపక్షపాతముచేతనో, వారి ప్రేరణచేతనో, యివ్విధమున నన్నలక్ష్యపఱచి మాటాడితివని తోఁచెడి.

రాజనీతివిచక్షణుఁ డయిన పండితుఁడు నిగ్రహానుగ్రహములకుఁ జాలినవాఁడును, అధికారమునం దుండువాఁడును నైన ప్రభువుంగూర్చి

శత్రుప్రోత్సాహము లేక యివ్విధముగా మాటాడునే? పద్మాసనము నుండి క్రిందఁబడిన లక్ష్మీదేవియో యనఁబరఁగిన సీతను నేను వనమునుండి తెచ్చియుండ, రామునికి వెఱచి యాతని కేల యిచ్చెదను? మాల్యవంతుఁడా! లక్ష్మణసుగ్రీవులతోను, కోట్లకొలఁది వానరసైన్యములతోను వచ్చిన యారాముఁడు కొన్ని దినములలోపలనే నాచేత మడియఁగలఁడు; చూచుచుండుము. బాహుయుద్ధమునందును, యుద్ధమునందును నేరావణునితోఁ బోరలేక వేల్పులుగూడ యుద్ధరంగము విడిచి పరుగులిడుదురో, అట్టిరావణునికి బవరమున భయమెక్కడిది? ఆతనిని భయపఱచువా రెవ్వరును లేరు. నీకుఁ బూజ్యుఁడైన పితామహునిమాట వినక యుండవచ్చునా యని యడిగెదవేమో? మాల్యవంతా! రాముఁ డేఁగుదెంచి నీకు వెఱపు గలిగింపఁగలఁ డని చెప్పితివి. రాముఁడే కాదు. అతని కంటె మించినవాఁడయినను, నన్ను భయపఱచుటమాత్రమేకాక, నా శిరము రెండు వ్రయ్యలగునట్లు చేసినను, నే నా రామునికేకాక యెవ్వరికైనను సరే లొంగువాఁడనుగాను. ఇది నాదేహముతోఁగూడఁ బుట్టిన దోషము. స్వభావగుణము తొలఁగించుకొనరానిదికదా! రాముఁడు సముద్రమున సేతువు గట్టి వానరసైన్యముతోఁగూడ సముద్రము దాఁటి వచ్చినాఁ డని యంటివి. అది యేమివింత? అంత మాత్రమున నే నేల వెఱవవలెను? దానికి నీవు భయపడ నక్కఱలేదు. ఆతఁ డట్లు వానరసేనతోఁ గడలిండాఁటి వచ్చియుండునేని, నేను నిక్కముగాఁ జెప్పెదను. ఆతఁడు ప్రాణములతోడ లంకను విడిచి పోఁబోవుట లేదు." అని యివ్విధమున రావణుఁడు కోపాటోపములతో మాటాడుట చూచి, మాల్యవంతుఁడు సిగ్గుపడి బదులు సెప్పనివాఁడై, రాక్షసాధిపునికి జయదీవనలు దగినట్లుగాఁ జరిపి, యాతని వీడ్కొని నిజనివాసమునకుఁ జనియెను.

రావణుఁడు తర్వాత మంత్రులతో నాలోచించి, తానును జక్కఁగాఁ బరికించి నిశ్చయించికొని, లంకాపట్టణంపు నలువైపుల సాటిలేనిసైన్యముం గావలిపెట్టెను. రావణుఁడు తూర్పుగవనికడఁ బ్రహస్తుని, దక్షిణద్వారముకడఁ గడు బలశాలురైన మహోదర మహాపార్శ్వులను, పడమటిగవనికడ రాక్షసులు పెక్కండ్రతోఁ గూడిన పెక్కుమాయ

లెఱింగిన యింద్రజిత్తును, ఉత్తరద్వారమున శుకసారణులను నుంచి, తాను నచ్చట నుండునట్లు మంత్రులతోఁ జెప్పెను. ఎక్కువ బలపరాక్రమములు గలవాఁడగు విరూపాక్షుఁ డను రాక్షసునిఁ బట్టణమధ్యమందలి చైత్యప్రదేశమునఁ బెక్కండ్రు రాక్షసులతోఁగూడఁ గావలి యుంచెను. రావణుఁ డివ్విధముగా సైన్యమును నలువైపులనుంచి, మృత్యువశుఁ డగుటచేఁ "దన కిఁక నెట్టిభయము లేదు. తన కార్యము నెఱవేఱె"ననియె తలఁచినవాఁడయ్యెను. అంతట రావణుఁడు మంత్రులకుఁ బట్టణంబునఁ జేయవలసిన సేనానివేశరూపకార్యము నంతటిని నానతిచ్చి, వారిచే జయదీవనలను గొన్నవాఁడై, యెక్కువ కలిమిచే నొప్పిన గొప్పదైన తన యంతిపురము ప్రవేశించినవాఁడయ్యెను.

37-వ సర్గము

రాముఁడు సేనలను విభజించుట

నరేంద్రవానరేంద్రులగు రామసుగ్రీవులును, ప్రసిద్ధుఁ డైన వాయునందనుఁడగు హనుమంతుఁడును, ఎలుఁగుబంటులదొర యగు జాంబవంతుఁడును, విభీషణుఁడును, వాలిపుత్రుఁ డయిన యంగదుఁడును, లక్ష్మణుఁడును, శరభ సుషేణ మైంద ద్వివిద సుషేణ గజ గవాక్ష కుముద నల పనసులును నొక్కటిగాఁ గూడి లంకాపురసమీపము చేరిన వారై "ఈలంకాపురము రావణునిచేఁ బాలింపఁబడుచున్నది కావున దేవాసుర గంధర్వ పన్నగ కిన్నర కింపురుషాదుల కైనను జయింప నలవి కాదు. మన పనియగునా కాదా యని మనము ముందుగా నాలోచన చేసి నిర్ణయించుకొని యావల నీపురియందుఁ బ్రవేశింపవలెను. దీనియందెల్లప్పుడు రావణుఁడు సన్నిహితుఁడై యుండును" అని తమలోఁ దా మనుకొనుచుండఁగా, విభీషణుఁడు సంస్కృతపదములు గలవై యర్థగౌరవముగల మాటలతో నిట్లనెను.

"అనల శరభ సంపాతి ప్రఘసులును, నామంత్రులు పక్షిరూపము దాల్చినవారలై లంకాపురిని బ్రవేశించి, శత్రుబలమును బరికించి రావణుఁడు సేనలను నిల్పియుండు తెఱఁగును జూచివచ్చిరి. వారు చెప్పిన తెఱఁగున దురాత్ముఁ డైన రావణునిసేనలయేర్పాటును వాస్తవముగాఁ దెలిపెదను వినుఁడు. ప్రహస్తుఁడు సేనాసమేతుఁ డై, తూర్పుగవనియం

దున్నాఁడు. ఎక్కువ వీర్యముగలవా రగు మహోదర మహాపార్శ్వులు దక్షిణద్వారమున నున్నారు. రావణునిపుత్రుఁ డయిన యింద్రజిత్తు పట్టస గదాశూల ముద్గరాది నానావిధాయుధములను దాల్చినవారైన పెక్కండ్రు రాక్షసవీరులతోఁ గూడినవాఁడై పడమటిగవనియం దున్నవాఁడు. శస్త్రధారు లైన పెక్కండ్రు రాక్షసులతో సమేతుఁడై రావణుఁడు మనమున నించుకేనియు దిగులులేనివాఁడై యుత్తరద్వారమునఁ దానే యున్నవాఁడు. విరూపాక్షుఁడు శూలఖడ్గధనుర్ధారులైన రాక్షస సేనలతోఁ గూడినవాఁడై పురమధ్యభాగమున నున్నవాఁడు. వారును నామంత్రు లందఱును నివ్విధమున నిచ్చియుండు సేనలను జూచి, వెంబడి వేగముతో వచ్చినవారు. పురమున వేయి యేనుఁగులును, పదివేల రథములును, రెండువేల గుఱ్ఱములును, బలవిక్రమములు గలవారును,యుద్ధములందుఁ బగతురకు వెఱపు పుట్టించువారునునైన కోటికాలిబంటులు నున్నారు. సేనాధిపులగు రేద్రిమ్మరు లందఱు రాక్షసేశుం డగు రావణుని కనుఁగుఁ జెలికాండ్రు. నరేంద్రా! యాసేనాధిపులగు రాక్షసులలో నొక్కొక్కరి యధికారము క్రిందఁ బదిలక్షలసంఖ్యగల పనివాండ్రున్నవారు. వారు యుద్ధసన్నద్ధులై యున్నారు." అని నిడుదచేతులవాఁడగు విభీషణుఁడు మంత్రులచేఁ జెప్పఁబడిన వృత్తాంతమును రామునికి వినిపించి, యారాక్షసుల నందఱ నారామునికి మంత్రులచేఁ జూపించెను.

న్యాయమార్గ ప్రవృత్తిచేఁ గాంతిమంతుఁ డైన రావణుని తమ్ముఁడగు విభీషణుఁడు తమ్మిరేకులం బోలుకన్నులు గల రామునింగూర్చి యాతనికిఁ బ్రియంబు సేయఁగోరి మఱలఁ ని ట్లనియె: "ఓరాఘవా! రావణుఁడు తొల్లి దిగ్విజయయాత్రాసమయమునఁ గుబేరునిమీఁదికిఁ బోయినపు డఱువదిలక్షల సేనలే యుండెను. ఇప్పు డన్ననో సేన ముందటికంటె నెచ్చైయున్నది. ఆసేనలోనివారందఱు శత్రువులను దిరస్కరించుటయందును, యుద్ధములందుఁ దామ చలింపక యుండుటయందును, ప్రతాపమునందును, ధైర్యాతిశయమునందును, గరువమునందును దుష్టచిత్తుఁడయిన యారావణునితో సమానులైనవారు. ఓరాఘవా! నీకు రోషము పుట్టించుటకేకాని, వెఱపుపుట్టింప నీశత్రుబలము వర్ణించినవాఁడను గాను.

రాఘవా! నాపై నాగ్రహపడకుము. నీవు ప్రతాపముచే దేవతలనైన నిగ్రహింపఁ జాలినవాఁడవు. కావునఁ జతురంగబలముతోఁ గూడిన వాఁడవై, యీ వానరసైన్యమును వ్యూహములుగ నిల్పి, యారావణుని వధింపుము" అని విభీషణుఁడు రామునితోఁ జెప్పెను.

విభీషణుఁ డివ్విధమునఁ బలుకఁగా, శ్రీరాముఁడు శత్రువధమునుద్దేశించి యిట్లనెను: "విభీషణా! నీలుఁడను వానరశ్రేష్ఠుఁడు పలువురు వానరులతోఁ గూడినవాఁడై తూర్పుగవనియం దుండు ప్రహస్తుని నెదిరించును గాక. అంగదుఁడు మహాసేనతోఁ గూడినవాఁడై, దక్షిణంపుగవనియం దుండు మహోదర మహాపార్శ్వుల నెదిరించును గాక. సాటిలేని బలిమిగల హనుమంతుఁడు పెక్కండ్రు వానరులతోఁ గూడినవాఁడై పడమటిగవనియం దున్న యింద్రజిత్తును బాఱఁదోలి లోపలఁ బ్రవేశించునుగాక. నీచుఁ డగుటచే బ్రహ్మవలని వరప్రభావముచే గర్వించినవాఁడయినందున దేవదానవ దైత్యసంఘములకును, మహాత్ములగు ఋషులకును నపకారమొనర్చుటయందుఁ బ్రేమగలవాఁడును, ముల్లోకములందును జనులకు బాధగలిగించుచు నంతటఁ దిరుగువాఁడునయిన రావణునివధమునకై నేనే పూని, లక్ష్మణసమేతుఁడనై సేనాసమేతుఁ డైన యారావణుఁడున్న యుత్తరద్వారముఁ జొచ్చి యారావణునిఁ జక్కాడి లోపలఁ బ్రవేశించెదను. బలవంతుఁడగు వానరరాజయిన సుగ్రీవుఁడును, దిట్టరియగు నెలుగుబంట్లదొర యయిన జాంబవంతుఁడును, రాక్షసేంద్రుని తమ్ముఁడ వగు నీవును నడిమిసేన నెదిరింతురుగాక. వానరులు కామరూపు లయినను, యుద్ధసమయమున మానుషరూపము ధరింపవలదు. వానరులసైన్యమున కిదియె యొకచిన్నముగా నుండును. రాక్షసులును వానరులును మానుషరూపం బెత్తి యుద్ధముచేయఁ బూనినచో, వీరు వానరసైనికు లనియు, వీరు రాక్షససైనికు లనియు భేదము దెలియదు గావున మన వానరసేనకు గుఱుతుగా మన వానరసేన వానరరూపముతోడనే యుద్ధముసేయునుగాక. నేనును, నాతమ్ముఁడగు లక్ష్మణుఁడును, విభీషణుఁడును, వానిమంత్రులు నల్వురును మే మేష్వరము మాత్రము మానుషరూపముతో యుద్ధము సేయఁగలము" అని కార్యసిద్ధి నిమిత్తమై విభీషణునితో నిట్లు చెప్పి, లంకాపురైక దేశమగు

మిక్కిలి చక్కనైన సువేలపర్వతము శిఖరమును జూచి దాని నెక్కఁ గోరినవాఁడై, భూమియెల్ల వానరసైన్యముతో నింపి, శత్రువధమును మనమునఁ దలఁచినవాఁడై యెక్కువ మక్కువతో లంకాపురముఁ జేరఁ బోయెను.

33-వ సర్గము

రాముఁడు లంకను జూచుటకై సువేలపర్వత మెక్కుట

రాముఁడు సువేలాచలము నెక్కుటకై మనమున నిశ్చయించి కొని, లక్ష్మణుఁడు కూడ వచ్చుచుండఁగా, ధర్మజ్ఞులును, తమయెడఁ జెలిమిగలవారును, నాలోచనల నెఱిఁగినవారును, శాస్త్రవిధులఁ దెలిసిన వారునైన విభీషణసుగ్రీవులం జూచి, "మన మందఱము పెక్కుకావిఱా లతోనిండిన యీసువేలపర్వతమెక్కి యీరాత్రి కిచ్చటనేయుండి, లంకా పురమును, ఆరక్కసునినగరును జూచెదము. ఏ దురాత్ముఁడు మరణముఁ గోరి నాభార్య నపహరించెనో, ఎవ్వఁడు నీచమైన రాక్షసబుద్ధిచేత ధర్మము నెఱుఁగలేదో, ఎవ్వఁడు తన నడవడిని, దన కులమును గనిపెట్ట లేదో, ఏవాఁడు తన కులమునకు నింద దెచ్చుకొనెనో, ఆరాక్షసాధ మునియందు నాకుఁ బట్టరాని యాగ్రహమున్నయది. ఆదురాత్ముని నిమిత్తమై పెక్కురు రాక్షసులు మడియఁగలరు. కాలపాశమునకుఁ గట్టు వడిన యతఁడొక్కఁడు పాపకృత్యము నొనరించెను. వానియొక్క దోషముచేఁ గులమెల్ల నశించును." అని యివ్విధమున నారావణునిఁ గూర్చి యాలోచించుచుఁ గోపముచేఁ గన్నులెఱ్ఱనచేయుచుఁ జిత్రసాను వులుగల సువేలపర్వతము నెక్కెను. లక్ష్మణుఁడును జాగరూకుఁడై, బాణసహితమైన వింటిని జేతఁబట్టికొని, రావణునిమీఁద నెక్కువ పరా క్రమముఁ జూపువాఁడై యారాముని వెంబడించిపోయెను. ఆలక్ష్మణుని వెంబడి సుగ్రీవ విభీషణులు సపరివారముగా నెక్కిరి. వారితర్వాత హనుమదంగదనీలమైందద్వివిదులును, గజగవయగవాక్షశరభగంధమా దనులును, పనసకుముదసంభహారులును, జాంబవత్సుషేణులును, బుద్ధి మంతుఁడగు ఋక్షభుఁడును, ఎక్కువప్రతాపము గల దుర్ముఖశతవలు లును, వీరుగాక వడిగా నడిచెడి పెక్కండ్రు వానరులును వాయువేగ ముతో నడచువారగుటంజేసి వడిగాఁ బోవుచు, రాఘవునిపిదపఁ బర్వ

తము నెక్కిరి. వారవ్విధముగా శీఘ్రకాలములోపలఁ బర్వతమునెక్కి యాకాశమున నంటినదివోలె నాసువేలపర్వతముయొక్క శిఖరమున వెలయునదియు, గొప్పద్వారములు గలదియు, గొప్పప్రాకారములతోఁ గూడినదియు, పెక్కురు రాక్షసులతో నిండినదియు, ప్రాకారముచుట్టును నల్లనైన రాక్షసభటులు వరుసలుగా నిలఁబడి యుండుటచే మఱియొక ప్రాకారముచేఁ జుట్టఁబడినదియో యన్నట్లు లుండునదియు నైన లంకాపురిని జూచిరి. తర్వాత నావానరవీరు లాపురమున యుద్ధాభిలాషతోఁ గూడినవారైయున్న రాక్షసులను జూచి రామునిసమక్షముననే పెక్కుతెఱఁగులైన సింహనాదములు గావించిరి. సంధ్యారాగము మీఱఁగాఁ బ్రొద్దు గ్రుంకెను. నిండుచందురునికాంతిచే వెలుఁగుచు రాత్రివేళ యాసన్నమయ్యెను. అంతట రాముఁడు లక్ష్మణ విభీషణ సుగ్రీవులు మున్నగు యూథనాథులతోఁ గూడినవాఁడై యారేయి సువేలాచలమున సుఖముగా నుండెను.

39-వ సర్గము

రామాదులు లంకాపురముఁ జూచుట

వీరులైన వానరవీరు లారేయి యాసువేలపర్వతమున నుండి మఱునాఁటియుదయమున నాలంకాపురిలోని వనములను నుపవనములను జూచిరి. ఆవానరవీరులు చచ్చౌకములై మృగాదులయుపద్రవములు లేమిచేఁ దిన్ననివై వెడల్పుగలిగి చక్కనై చూడనింపులై యుండెడి వనములను జూచి, విస్మయము నొందినవారైరి. లంకాపురము చంపకాశోకపున్నాగసాలతాలతమాలవృక్షములతోను, పూచినమద్ది, ప్రబ్బలి, కడప, ఏడాకులపొన్న, బొట్లుగు, దిరిసెన మొదలగు వృక్షములతోఁ, గూడినవియు, పలురంగుల పూలును, ఎఱ్ఱని మెత్తని తలిరులును గలవియునైన చెట్లతోను, నీలంపుఁబచ్చిక బయళ్లతోను, విచిత్ర వనపంక్తులతోను గూడి, బహువిధములైన దివ్యవృక్షషండ మండితమైన స్వర్గలోకముమాడ్కి విరాజిల్లుచుండెను. ఆ లంకాపురము నందలి వృక్షములు నెత్తావిం గుబాళించు మనోహరము లగు పుష్పములును పండ్లును గలిగి భూషణాలంకృతులైన మానవులమాడ్కి శోభిల్లినవి. ఆపురమునందలి యుపవనములు చైత్రరథనందనో

ద్యానములఁ బోలినవియు, సర్వర్తుకుసుమఫలభరితవృక్షషండమండిత ములును, భ్రమరఝుంకారయుక్తములునై శోభిల్లుచుండెను. ఆవనము లందుఁ బ్రవహించుచున్న సెలయేళ్లయందు నీరుకాకులును, నీటికోళ్లును, నృత్యము సేయుచుండు నెమళ్లును, కోకిలలును గూయు కూఁతలు వానరులకు వినఁబడెను. అంతటఁ గామరూపులగు వానరవీరులు గగ్గురుపాటునొంది, మనమున వేడ్క పూని, యెడతెగక మదించిన పక్షులతోఁ గూడినవియు, కోయిలలకూఁతలును, తుమ్మెదల ఝుంకార ములును, తక్కిన పక్షులనినదములును, బెగ్గురుపక్షులనాదములును గలిగినవియు, కాటుక పిట్టలరవములతో నిండినవియునై యుండునట్టి యాయుపవనములను వనములను బ్రవేశించిరి.

ఆ ప్రతాపశాలురగు వానరవీరు లట్లు ప్రవేశించునప్పుడు వారికిఁ బుష్పసంసర్గమువలన సుగంధభరితమైన వాయువు వీచెను. తక్కినవానర వీరులు సేనలమధ్యమునుండి వెలుపటి కేతెంచి తమ ఱేనియానతిం బడసినవారలై, యా లంకాపురములోని మృగపక్షులను, వన గజములను బెదరించుచుఁ దమ కిలకిలధ్వనులచే లంకాపురమును గడగడ లాడించుచు, నేలను గాళ్లతో నలియఁద్రొక్కి నొప్పించుచు నాలంకా పురములోపలఁ బ్రవేశించిరి. వారికాళ్లత్రొక్కుళ్లకు లేచిన దుమ్ముపరము నిండెను. ఆలంకాపురవనములం దున్న సింహవ్యాఘ్ర వరాహమహిషగజములు మొదలగు మృగములు వానరవీరుల కిలకిల ధ్వనులు విని బిగులుపడి పదిదిక్కులకుఁ బాఱిపోయెను. ఆత్రికూట పర్వతశిఖరములలో మిక్కిలి యున్నతమయి, నింగిముట్టుచు నంతటఁ బువ్వులచేఁ గప్పఁబడినదియుఁ బసిండివన్నెగలిగి నిర్మలమైనందునఁ జూడ రమణీయమైయున్నదియు, కాంతియు, ఔన్నత్యమును గలిగి, పక్షుల కైనఁ జొఱనలవిగానిదై, దానినెక్కుట జనులకు మనమున నూహింప నైన సాధ్యము కానిదై యుండఁ గాళ్లతో నెక్కఁజాలకుండుట చెప్ప వలయునా? ఆశిఖరమున రావణునిచేఁ బాలింపఁబడు లంకాపురమున్న యది. అయ్యది నూఱుయోజనములవెడల్పును ముప్పదియోజనముల నిడివియుఁ గలది. ఆపురమునఁ దెల్లనిమబ్బులంబోలు నున్నతగోపుర ములును, వెండిబంగారపుఁ బ్రాకారములును వెలయుచున్నవి.

ఏడంతస్తుల మేడలును, బవంతులును గలదగుటచే నాపురము వర్షర్తా రంభ వేళయందలి మేఘములచేఁ గ్రమ్మఁబడిన యాకాశముమాడ్కి వెలుఁగుచుండెను. ఆలంకాపురమునడుమ వేయిస్తంభములతోఁ గూడి చక్కఁగా నలంకరింపఁ బడినదై కైలాసశిఖరముఁబోలి యాకాశము నొఱయునంత యెత్తుగల యొకప్రాసాదము గానఁబడెను. ఆరాక్షసేంద్రుని చైత్యప్రాసాదము లంకాపురమున కలంకారమై తోఁతెంచెను. ఆప్రాసాదముచుట్టును పెక్కండ్రు రాక్షసభటులు నిరంతరమును కావలి యుండిరి. అట్టి రమ్యప్రాసాదముతోఁ గూడినదియు, వనోపవనములును, పెక్కుకావిఱాలకాంతులు పర్విన క్రీడాపర్వతములుం గలదియు, పెక్కుపక్షులకలనాదములతో నిండినదియు, పలుమెకములసంచారములతోఁ గూడినదియు, బహ్వారణ్యసముహములు గలదియు, పెక్కురక్కసుల కునికిపట్టును, సకల సంపదలతో నిండినదియు, గొప్ప మేడలచేఁ గ్రిక్కిఱిసినదియు, మేలైనవస్తువులతోనిండినదియు, ఎక్కువకాపుదల గలదియు, గొప్పగొప్పతలుపులును యంత్రములును గలవియైన గొప్ప మేడల వరుసలతో శోభిల్లునదియునైన యాలంకాపురమును శ్రీమంతుఁడైన రాముఁడు సైన్యయుతుఁడై చూచి యెక్కువ యచ్చెరు వొందినవాఁడయ్యెను.

40-వ సర్గము

సుగ్రీవరావణుల మల్లయుద్ధము

అట్లు రాఘవుఁడు సుగ్రీవాదులతోడ రెండుయోజనముల చుట్టుకొలఁతగల సువేలపర్వతశిఖరమునెక్కిన పదంపడి, సుగ్రీవుఁడును ముహూర్తకాల మచ్చటనే యుండి పదిదెసలు చూచుచు, మనోహరమైన త్రికూటపర్వత శిఖరమున విశ్వకర్మ నిర్మితమై, చక్కఁగా నమర్పఁబడి పెక్కురమణీయవనములచే శోభిల్లుచున్న లంకాపురమును జూచి, యద్దాని గోపురశిఖరమునఁ గూర్చున్నవాఁడును, చేరువకుఁజేరరాని వాఁడును, తెల్లనిచామరములచే వీవఁబడువాఁడును, జయసూచకమైన ఛత్రముచే శోభిల్లువాఁడును, రక్తచందనముఁ బూసికొన్నవాఁడును, మణిఖచిత భూషణములను దాల్చినవాఁడును, నల్లనిమబ్బువంటి మేని డాలుగలవాఁడును, బంగారుపై బట్టును దాల్చినవాఁడును, ఐరావతము

యొక్క కొమ్ములకొనలచేఁ గలిగిన గొప్పకాయలుకాచిన ఱొమ్ముతోఁ గూడినవాఁడును, కుందేటిరక్తంపువన్నెగల యెఱ్ఱని యుత్తరీయముఁ దాల్చినవాఁడైనందున సంధ్యాకాలంపు టెఱుపుచేఁ గ్రమ్మఁబడిన యాకాశమందలిమబ్బులగుంపుమాడ్కి వెలయువాఁడును నైన రాక్షసేంద్రుఁడగు రావణునిఁ జూచెను. వానరవీరు లందఱు చూచుచుండఁగా, రాఘవుఁడును వీక్షించుచుండఁగా, సుగ్రీవుఁడు రాక్షసేంద్రునిఁ గాంచుటచేఁ దటాలున లేచినవాఁడై కోపాతిశయమును, జవసత్త్వములును గలిగి యాపర్వతశిఖరముమీఁదినుండి యాగోపురప్రదేశము మీఁది కెగిరి దుమికెను. అట్లు సుగ్రీవుఁ డా గోపురముమీఁది కెగిరి దుమికి మనమున భయముఁ బాసినవాఁడై, యారాక్షసేంద్రుని లక్ష్యపెట్టక "ఓరీ రాక్షసా! నేను లోకనాథుఁడగు రామునికిఁ జెలికాఁడను, దాసుఁడను నై యున్నాను. నరేంద్రుని ప్రభావమువలన నేను నిన్నుఁ బ్రాణములతో విడువను" అని చెప్పి, హఠాత్తుగా నెగిరి యారావణుని శిరమున నున్న కిరీటమును దన్ని నేలఁ ద్రోసెను. అట్లు త్రోయుచుఁ దనపైకి వచ్చుచున్న సుగ్రీవుని రావణుఁడు చూచి, "ఓరి కోఁతుల తేఁడా! నీవు నామఱుఁగున సుగ్రీవుఁడవై (చక్కనిగ్రీవము గలవాఁడవై) యుంటివి. ఇఁక నాసమక్షమునఁ గ్రీవహీనుఁడ వగుదువు" అనిచెప్పి లేచి యాతని వేగముతోఁ బట్టి యాగోపురప్రదేశమునఁ ద్రోసెను. అంతట సుగ్రీవుఁడు లేచి రావణునిఁ బట్టుకొని చెండునుంబోలె నేలమీఁదఁ బడవేసెను. తర్వాత సుగ్రీవరావణు లారంభమున గట్టిగాఁ గౌఁగిలించుకొనుటంజేసి, చెమ్మటచే నొడలు తడిసినవారును, ఒండొరులు గోళ్లతో రక్కుటచే నెత్తుటఁ దడిసినమేనులు గలవారును, ఒండొరులు గట్టిగాఁ బట్టుకొనుటచేఁ జెయువులు దక్కినవారును, ఒండొరులను విడిచినప్పుడు పూచిన యిరుగుడు మోదుగు చెట్లవలె విరాజిల్లువారును నై, పిడికిళ్లతో గ్రుద్దుకొనియు, పిడికిళ్లకు నొప్పియెత్తినప్పు డఱచేతులతో బాఁదియు, అఱచేతులు నొచ్చినప్పుడు చిటికినవ్రేలు లేని పిడికిళ్లతోఁ గూడిన ముంజేతులతోఁ బొడిచియు, అవి నొచ్చినప్పుడు చేతులకొనలతోఁ బొడిచియుఁ జూడనలవికాని ఘోరబాహుయుద్ధ మొనరించిరి. ఎక్కువపడిగల యాసుగ్రీవరావణు లిద్దఱు పెద్దయుందడపు గోపురంపుఁ

దిన్నెనడుమ గొప్పఁగా మల్లయుద్ధ మొనరించి, యొండొరులను బై కెగురవైచి, మఱలఁ గ్రిందికి లాగి, యొండొరులవీఁపులు వంచి, యొక యడుగెత్తి యొకయడుగు వెనుకకే పెట్టుటచే గోపురంపుఁ దిన్నె కాను కొని కదలక నిలచినవారై యొండొరులను బాహువులతోఁ బెనఁచుకొని యొండొరులు గదిసిన యొడళ్లుగలవారై ప్రాకారపుటగడ్డలనడుమఁ బడిరి. వార లిరువుర ట్లగడ్డయందుఁ బడి నేలఁదగులకయే పైకిలేచి, బడలికచే ముహూర్తకాలము నిట్టూర్పువిడుచుచు నుండి, మఱలఁ దామే తమశరీరములఁ బట్టుకొని పైకెగిరి, యొండొరుల దేహములను బాహుపాశములతో గట్టిగాఁ గట్టికొనిరి. వారు పట్టుదలయు, నేర్పును, శక్తియుఁ గలవారలై నేర్పుతో నొండొరులను బట్టెడి తీరులచే రెండు బెబ్బులులమాడ్కి రెండుసింహములమాడ్కి గరువము గలవారయి, ఏనుఁగుగున్నలమాడ్కిఁ బోరాడుచు యుద్ధరంగమునఁ దిరుగుచుండిరి. ఇట్లు వారిరువు రొండొరులను గదిసి ఱొమ్ములతో నొఱచుకొని యొక్కు మ్మడిగా నేలఁ గూలిరి. వెంటనే మఱల లేచి, యొండొరులను ద్రోసి కొనుచుఁ బెక్కువిధములుగ యుద్ధము చేయుచుండిరి. మేటియేనుఁగులం బోలువారును, యుద్ధసంచారమున నేర్పును బలముం గలవారును నైన శూరులగు సుగ్రీవరావణు లేనుఁగులకట్టుగొలుసులంబోలు తమ మేటి బాహువులతో నొండొరులను వడిగా నడ్డువెట్టుచుఁ గొంచెమేనియు నలసట నొందరైరి. తర్వాత వార లిద్దఱు బహుదూరము వడిగా మండల మను గమనభేదమునఁ బోరాడిరి. వారిట్లొండొరులను జక్కాడ నెంచిన వారై భక్ష్యవస్తువునిమిత్తమై పొంచియున్న రెండుపిల్లులమాడ్కి మాటి మాటికి మెదలక నిలఁబడుచుండిరి.

యుద్ధపద్ధతులను జక్కఁగా నెఱిఁగినవారగు సుగ్రీవరావణులు వింతవింతలైన చుట్లు చుట్టుటలను, వైష్ణవ వైశాఖ మండల ప్రత్యా లీఢాలీఢము లనెడి పెక్కుతెఱఁగుల నిలుచుటలను, గోమూత్రము మాడ్కిఁ జిత్రములైన గమనములను, ముందుకు వెనుకకు రాకపోకలను, అడ్డుతిరుగుళ్లను, వంకరతిరుగుళ్లను, ఎదిరి దెబ్బలను దప్పించుకొనుట, తనదెబ్బలు దప్పించుకొన నెదిరికిఁ దెలిసినప్పుడు దెబ్బకొట్టకుండుట, శత్రువు నిలిచియున్నప్పుడు వానిచుట్టు దిరుగుట, ఎదురుకొని

పోవుట, నిలిచినిలిచిపోవుట, జగడము చేయుచు నెదుటఁ నిలఁబడుట, వెనుకకు మఱలిపోవుట, నిలఁబడియే ప్రక్కకుఁ బ్రాఁకుట, పట్టుకొనఁ గోరి తటాలున ముందుకు వంగిపోవుట, శత్రువుఁ గాలియందుఁ గొట్టుటకై తలక్రిందుగా నెగురుట, ఎదిరిచేయిపట్టుటకై తనచేతులు చాచుట, ఎదిరి తనచేయి పట్టుకొన వచ్చినప్పుడు తనచేతిని ముడుచుకొనుట యీ మొదలగు పద్ధతులను గనఁబఱచుచు యుద్ధము చేసిరి. అంతలోపల రావణుఁ డలసి తన మాయాబలమును జూప నారంభించెను. జయశాలియు, శ్రమములేనివాఁడు నైన వానరాధిపుఁడగు సుగ్రీవుఁ డాతని యభిప్రాయ మెఱిఁగి హఠాత్తుగా నాకసమున కెగసెను. రావణుఁడు క్రిందనుండినవాఁడై మఱల సుగ్రీవుఁడు తనకడకు వచ్చునని తలఁచెనుగాని, యాతఁడు మఱల దిగక యుద్ధమునఁ గీర్తిని బొంది రావణునికిఁ గడుబడలిక గలిగించి యతి విశాలమైన యాకాశమున కెగిరి, మఱల వానరులనడుమనున్న రాముని ప్రక్కకు వచ్చిచేరెను. సూర్యపుత్రుఁ డగు సుగ్రీవుఁ డివ్విధమున నారావణునితో యుద్ధము చేసి, తాను కడు నుప్పొంగి రాఘవునికి యుద్ధోత్సాహము గలిగించుచు, వానరవీరులందఱుఁ గొనియాడుచుండ వాయువేగమున వానరసేనయందుఁ బ్రవేశించినవాఁడయ్యెను.

41-వ సర్గము

రాముఁడు సేనలను వ్యూహంబులుగ నిల్పుట

అట్లు సుగ్రీవుఁడు వచ్చిన పదంపడి లక్ష్మణునియన్నయగు రాముఁ డతనియందు యుద్ధచిహ్నము లుండుటఁ గాంచి, యప్పు డతనిని గౌఁగిలించికొని యిట్లనియె: "వానరేంద్రా! నాతో నాలోచింపక యింత తెగువ చేసితివి. నృపాలు రిట్లు సాహసంపుఁబనులను జేయఁజాలరు. సాహసమం దిష్టముగల యో మొనకాఁడా! నాకును, విభీషణునకును, వానరసైన్యమునకంతకును సంశయంబు గలుగునట్లు లపాయకరమైన కార్యము చేసితివి. వీరుఁడా! ఇఁక నట్టి యాలోచింపని పని చేయకుము. నిడుదచేతులవాఁడా! నీ కెద్దియైన నించుకంత యాపద సంభవించునేని, ఆవల నా కీసీతతోఁ గాని, భరతునితోఁ గాని, చిన్నవాఁడగు లక్ష్మణునితోఁ గాని, శత్రుఘ్నునితోఁ గాని, తుదకు నాప్రాణములతోఁ గాని

నా కేమి కార్యము? ఇంద్రవరుణులను బోలుపరాక్రమశాలీ! నీపరాక్రమము నెఱింగినవాఁడనయ్యు, నీవు రాకపోఁగా నే నిట్లు తలఁచితిని, మహాబలుఁడా! బవరమున రావణుని సపుత్రసైన్యవాహనముగా సంహరించి విభీషణునికి లంకాపురమునఁ బట్టాభిషేకమొనరించి భరతునికి నయోధ్యాపురమునఁ బట్టాభిషేకమొనర్చి యేను శరీరముఁ దొఱఁగెదను" అని సుగ్రీవునితో రాముఁడు చెప్పఁగా, సుగ్రీవుఁడును "శూరుఁడవగు రాఘవా! నేను స్వబలము నెఱింగియుండియు నీభార్య నపహరించినవానిని జూచుచు నెట్లోర్చియుందును?" అనిచెప్పఁగా, రాముఁ డతనిని గొనియాడి శౌర్యలక్ష్మివిరాజమానుండగు లక్ష్మణుంజూచి యిట్లనెను: "లక్ష్మణా! చల్లనినీరును, ఫలవంతములగు వనములును గల ప్రదేశము చేరి, యచ్చట సేనలను గుంపులు గుంపులుగాఁ జీలఁదీసి నిలఁబెట్టి యుంచెదము. మహాశూరులయిన ఋక్షులకును వానరులకును రాక్షసులకును లోకమునకును నాశహేతువై భయంకరమైన చేటు సంభవించెను. గాడ్పులు వేండ్రముగా వీచుచున్నవి. భూమి యదరుచున్నవి. పర్వతములకొనలు వణఁకుచున్నవి. మ్రాఁకులు కూలుచున్నవి. మేఘములు మాంసాదపక్షులవన్నెగలవై, భయముగలుగునట్లు గర్జిల్లుచుఁ గ్రూరములై, రక్తబిందువులతోఁగూడినవానను గురిపించుచున్నవి. సంధ్య యెఱ్ఱని గంధముమాడ్కి వెలుఁగుచు గడువెఱపించునదిగా నున్నది. ఇదిగో, సూర్యమండలమునుండి మండుచున్న యగ్నిఖండములు పడుచున్నవి. అమంగళకరములైన మృగపక్షులు దేవురించుచుఁ దీనమయిన కంఠధ్వనిగలవై, యెక్కువ భయము గలిగించుచు సూర్యునియెదుట నిలిచి, యఱచుచున్నవి. రాత్రులందుఁ జంద్రుఁడు వెలుఁగులేనివాఁడై యెఱుపునలుపు గలిసిన కిరణములకొనలుగలవాఁడై ప్రలయకాలమునందుఁ బోలె సంతాపము గలిగించుచున్నాఁడు. మఱియుఁ జంద్రపరివేషము గుఱుచగాను, వెఱపుగలిగించునదిగాను నై యమంగళమును దెల్పునదిగా నున్నది. లక్ష్మణా! సూర్యమండలమునందు నల్లనిమచ్చయొక్కటి కన్పట్టుచున్నది. నక్షత్రము లెప్పటియట్లు వెలుఁగక యున్నవి. ఈ యవశకునము లెల్ల లోకమునకుఁ జేటు వాటిల్లె నని తెలుపుచున్నవి. కాకులు, గ్రద్దలు, డేఁగలు దక్కువజాతి

పక్షులతోఁ గలియుచున్నవి. వఱళులు గొప్పసందడి యగునట్లు మంగళే తరములైన పలుకులు పలుకుచున్నవి. మన మిప్పుడే తడవుసేయక, రావణునిచేఁ బాలింపఁబడిన దగుటంజేసి యొరులకుఁ జొఱనలవికానిదై యున్న యీలంకాపురమును వానర సైన్యమంతటితోఁ గూడిన వారమై వడిగా నెదుర్కొందము." అని వీరుఁ డగు లక్ష్మణునియన్న యివ్విధమున మాటలాడుచు నాపర్వతశిఖరమునుండి వడిగాఁ గ్రిందికి దిగెను.

ధర్మాత్ముఁడగు నారాముఁ డట్లు సువేలపర్వతమునుండి దిగి, పరులకుఁజెనఁక నలవిగానిదగు తనసైన్యమును జూచెను. ఎయ్యైకార్యము నెయ్యైవేళయందుఁ జేయవలయునో యయ్యది యెఱిఁగిన రాఘవుఁడు సుగ్రీవుని సహాయునిఁగా నుంచికొని గొప్పవానరసైన్యమును బ్రోత్సాహపఱచి, యుక్తసమయమున యుద్ధమునకుఁ దఱలఁ బ్రేరణ చేసెను. అట్లు సేనల కానతిచ్చి, దీర్ఘబాహువైన రాముఁడు వేఁకువ లేచి వింటిని దాల్చిన లెక్కలేని సైన్యము కూడ వచ్చుచుండ, లంకాపురముమీఁదికిఁ బోయెను. తర్వాత విభీషణ సుగ్రీవ హనుమజ్జాంబవత్సుషేణ నలనీల లక్ష్మణు లారాముని వెంబడించి పోయిరి. తర్వాత గొప్పదైన ఋక్షవానర సైన్యము ఎక్కువనేల నాక్రమించుకొని యారాఘవుని వెంబడించెను. ఏనుగులంబోలు దేహములు గలవారును, శత్రువుల నడ్డగింపఁజాలినవారు నయిన యావానరవీరులు పెక్కుపర్వతశిఖరములను గడుఁబెరిఁగిన వ్రాఁకులకు నాయుధములుగాఁ గైకొనిరి. శత్రుసంహారులైన యన్నదమ్ములగు రామలక్ష్మణు లిట్లు సేనాసమేతులై నడచుచుఁ జాలసేపటికి లంకాపురమునుజేరిరి. వానరసైనికులును రామునియాజ్ఞ గైకొని టెక్కెములచే శోభిల్లునదియు, నుత్తమములగు నుద్యానవనములచేఁ బ్రకాశించునదియుఁ, జిత్రవర్ణపుఁబ్రాకారము గలదియుఁ, బగతురచే సులభముగాఁ బ్రవేశింప వీలుగానిదియు నెత్తయిన ప్రాకారంపు వెలుపలి ద్వారముతోఁ గూడినదియు, దేవతలకుఁగూడఁ జొఱనలవికానిదియు నైన యాలంకాపురమును దమ తమ తావుల ముట్టడించి నిలిచియుండిరి.

రాముఁడు లక్ష్మణసమేతుఁడై పర్వతశిఖరముమాడ్కి నెత్తియి యున్న లంకాపురము నుత్తరద్వారమును ముట్టడించి సైన్యమును కాపాడుచుండెను. వరుణుఁడు సముద్రము నధిష్ఠించియున్న చందమున రావణు డధిష్ఠించియుండునదియు, బలహీనులకు భీతిజనకమును, నాయుధధారులగు రాక్షసులచే నలువైపులఁ గాపాడఁబడునదియునై దానవులచే రక్షితమగు పాతాళమును బోలునది యయిన యాయుత్తరద్వారమును రాముఁడు దప్ప మఱెవ్వఁడును ముట్టడింపలేఁడు గనుక రాముఁడు తానే లక్ష్మణసమేతుఁడై యా యుత్తరద్వారమును ముట్టడించెను. ఆ యుత్తరద్వారమున నుంచఁబడియున్న రాక్షసయోధుల వివిధాయుధములను గవచములను జూచెను. వానరసేనా నాయకుఁ డగు శూరుఁ డైన నీలుఁడు మైందద్వివిదులతోడఁ దూర్పుగవని నడ్డగించెను. అంగదుఁడు ఋషభగజ గవయ గవాక్షులను సహాయులనుగాఁ గొని దక్షిణపుగవని ముట్టడించెను. బలవంతుఁడగు హనుమంతుఁడు ప్రమాథి ప్రఘసు లనెడి వీరులతోను, తక్కిన యనేకులతోనుగూడి పడమటిగవనిని నిరోధించెను. సుగ్రీవుఁడు వేగమున గరుడవాయువులం బోలినవారలైన శూరులగు ననేకవానరులతోఁ గూడి రావణేంద్రజిత్తులతోఁ బోరునట్టి రామహనుమంతుల సాహ్యమునిమిత్తము పశ్చిమోత్తర ద్వారముల నడిమిభాగమున నుండెను. ఎక్కువకీర్తిఁ బడసిన యూథనాథుల క్రింద నున్న ముప్పదియాఱుకోట్లవానరులు లంకాపురమును ముట్టడించి సుగ్రీవుఁడున్న తావున నుండిరి. రామునియాజ్ఞవలన లక్ష్మణవిభీషణులు ప్రతి ద్వారమునను గోటికోటి వానరులను గావలియుంచిరి.

రామునకుఁ బడమటివైపు చేరువనే సుగ్రీవజాంబవంతులు పెక్కు సేనలతోఁ గూడినవారై మధ్యగుల్మమున నుండిరి. ఆవానరశ్రేష్ఠులందఱు కోఱలు గల పెద్దపులులమాడ్కిఁ గన్పట్టుచుఁ బర్వతాగ్రములను వృక్షములను నడిదములుగాఁ గొని యుప్పొంగుచు బవరమునకుఁ దఱలిరి. వానరు లందఱు భయంకరము లైన తోఁకలు గలవారు, కోఱలును గోళ్లును నాయుధములుగా నుపయోగించువారు, కోపవికారము వలనఁ బలుతెఱఁగు లైన యాకారములు గలవారు, వెఱ్ఱిమోములు గలవారును నైయుండిరి. అట్టివానరులలోఁ గొందఱు పదియేనుఁగుల

బలము గలవారును, కొందఱు నూఱేనుఁగులబలిమి గలవారును, కొందఱు వేయియేనుఁగులబలిమి గలవారును, కొంద ఱోఘసంఖ్యగల యేనుఁగులబలము గలవారును, కొందఱు కొలఁతపెట్టరాని బలము గల వారునునై యుండిరి. ఆలంకాపురప్రాంతమున నా వానరులకూడిక మిడుతలకూడికవలె నద్భుతాశ్చర్యకరముగా నుండెను. లంకాపురము చుట్టు విడిసినవారును వచ్చువారును నైన వానరులచే నాకాశము నింపఁ బడినట్లును, భూమి గ్రమ్మఁబడినట్లును విరాజిల్లుచుండెను. మునుపున్న సైన్యమేకాక కోటియెలుఁగు బంట్లసైన్యమును, కోటివానరుల సైన్యమును లంకాపురము యొక్క ప్రతి ద్వారమునందును జేరెను. మఱి యనేకు లచ్చటివారిసాహ్యమునకై యంతట నిల్చి యుండిరి. ఆత్రికూట పర్వత మావానరసైన్యముచేఁ గప్పఁబడి యుండెను. మఱియుఁ గోటివానరు లా లంకాపురము చుట్టును నిలిచి యుండిరి. బలిమిగల వానరులు చేత మ్రాఁకులం బట్టికొని యంతట నిల్చుట చేత, గాలిగూడ నాలంకాపురములోపల దూరుటకు వీలుగాక యుండెను. శౌర్యమున దేవేంద్రుని బోలినవారును మేఘములవలె నున్నతులును, నగు వానరులు హఠాత్తుగాఁ దమ్ము ముట్టడించుటంజేసి రాక్షసు లాశ్చర్యము నొందిరి. ఆ లంకాపురమున నావానరసేన దండెత్తివచ్చునప్పుడు సముద్రము మేర మీఱి వచ్చునపుడుం బోలె గొప్పసందడి గలిగెను. ఆ గొప్పసందడి కా లంకాపురము పర్వత వన కానన తోరణ ప్రాకారములతోడ గడ గడ వడఁకెను. వానరసేన రామ లక్ష్మణ సుగ్రీవులచేతఁ గాపాడఁ బడు చుండుటం జేసి సురాసురు లంద ఱెత్తివచ్చినను జయించుట కష్టతర ముగా నుండెను.

రాఘవుఁ డివ్విధమున రాక్షసవధమునిమిత్తమై సైన్యమును నిలిపి నంతటనే, మంత్రులతోడ నాలోచించి, మాటిమాటికిఁ గార్యనిశ్చ యము చేసికొని వెంటనే చేయవలసిన కార్యముఁగూర్చి నిర్ణయము చేసికొన్నవాఁడై, యే యే కాలములం దేయేకార్యము లొనరింపవలసి నదియు నెఱిఁగినవాఁ డగుటంజేసి, రాజనీతిఁ దలఁచి, విభీషణుం బిలిచి, యతనియనుమతిని గైకొని, వాలిపుత్రుఁ డగు నంగదునిం బిలిచి యి ట్లనియె,

అంగద రాయబారము

"అంగదా! నీవు దిగులు విడిచి, రావణుఁ డేమి చేయునో యన్న చింత మాని లంకాపురప్రాకార మెగిరి దాఁటి లోపలికిఁ జని, రావణుని సమక్షమునకుఁ బోయి నామాటలుగా నారావణునితో నిట్లు సెప్పుము. "ఓరి కళాహీనుఁడా! కలిమిపోయినవాఁడా! చావు సమీపించిన వాఁడా! తెలివి తక్కువవాఁడా! రేద్రిమ్మఱీఁడా! బ్రహ్మవరమువలన గర్వితుఁడవై దేవ, ఋషి, గంధర్వాప్సరః, పన్నగ, యక్ష, నృపాలు రకు నే యే కీడొనరించితివో, ఆ యా కీడులకుఁ గారణమైన బ్రహ్మ వరమువలని గర్వ మిప్పు డడఁగినది. వాస్తవము నమ్ముము. నీకు శిక్ష యొనరించునట్టి నేను భార్యాపహరణమువలనఁ గృశించినవాఁడనై నిన్ను దండింప ధనుర్బాణములను గొని లంకాపుర ద్వారమునఁ గనిపెట్టియున్నాను. రాక్షసా! నీవు నాచేఁ గూల్పఁబడి దేవతలు, మహర్షులు, రాజర్షు లుండెడి లోకము నొందఁగలవు. ఓ రాక్షసాధమా! యేబలిమిఁ బెట్టికొని, మాయచే నన్ను మోసగించి సీత నపహరించి తెచ్చితివో, యా బలము నిప్పుడు చూపుము. ఓరీ! నీ విప్పుడు సీతను గొనివచ్చి నాకర్పించి నన్ను శరణొందవేని, నా వాఁడియమ్ములచే నీ భూలోకమున రాక్షసులపేరే లేకుండఁ జేసెదను జూడుము. న్యాయ ప్రవర్తన గలవాఁడును, రాక్షసోత్తముఁడును నైన యీ విభీషణుఁడు నన్ను శరణుచొచ్చినవాఁడు. ఈ కాంతిమంతుఁ డగు విభీషణుఁడు నిష్కంటకమైన లంకాపురాధిపత్య మొందినవాఁడే యనుకొనుము. ఇది నిక్కము. ఓ రావణా! నీవు క్రూరుఁడవు; స్వయముగా జ్ఞానము లేనివాఁడవు. దానికిఁ దోడు నీచుట్టు నుండువారును మూర్ఖులై యున్నారు. కావుననే నీ వన్యాయము నవలంబించి రాజ్యము ననుభ వింపఁ గోరుచున్నాఁడవు. అది యెంతమాత్రము సాధ్యపడుసంగతి గాదు. ధైర్యము పూని శౌర్యముఁ జూపి యుద్ధముఁ జేయుము మదీయబాణములచే సమరమున నిహతుండవై, పాపములఁ బోఁగొట్టు కొని పరిశుద్ధుఁడవు గాఁగలవు. లేదా, పక్షిరూపముఁ దాల్చినవాఁడవై మనోవేగముతో ముల్లోకములలో దాఁగుము. నీవు నాకంటఁ బడితి వేని, ప్రాణములతోఁ దప్పించుకొని పోఁజాలవు. ఓ రాక్షసా! నీకు

హితము సెప్పెద నాలకింపుము. నీవు సపరివారముగా నశింతువుగనుక, నీ కుత్తరక్రియలు సల్పువా రుండరు గాన నీ విప్పుడే నీ కపర క్రియలు సేసికొనుము. నాతోడి యుద్ధమునకు వచ్చిన పదంపడి నీవు జీవముతో మఱలిపోవు గావున లంకాపురము నంతయు నిప్పుడు బాగుగాఁ జూచి రమ్ము. నీ ప్రాణములు నాచేత నున్నవి."

అని చెప్పు మని ధీరుఁడగు రాముఁ డానతియ్యగాఁ దారాపుత్త్రుఁ డైన యంగదుఁడు పనివినినవాఁడై, రూపమెత్తిన యగ్నిహోత్రుని పూడ్కి వెలుఁగుచు, నాకాశమార్గముఁ బ్రవేశించి, స్వకీయకాంతిచేఁ దేజరిల్లుచు, క్షణములోపల లంకాపురప్రాకారము దాఁటిపోయి, రావణాసురునిమందిరము సొచ్చి, యచ్చట మంత్రులతోఁగూడ నాలో చించుచు జాగ్రత్తతోఁ గూర్చుండియున్న యా రావణునిం జూచి, యాతనికిఁ జేరువను డిగ్గి, తన బంగరుభుజకీర్తులు వెలుఁగఁ బ్రజ్వరిల్లు నగ్నిహోత్రునికైవడిఁ దేజరిల్లుచు నిలఁబడెను. అట్లంగదుఁడు నిలఁబడి ధైర్యముతోఁ దా నెవఁడైనదియుఁ దెల్పుకొని, మంత్రులందఱు వినుచుండఁగా రాముఁడు సెప్పిపంపిన హితవచనముల నొక్కటియైనను విడువక, హెచ్చుగాను జేర్పక చెప్పినది చెప్పినట్లే రావణుని కిట్లని యెఱింగించెను.

"క్లేశము లేకయే యెంతపని నైనను సాధింపఁగలవాఁడగు కోసలా ధీశుఁడయిన రామునియొక్క దూతను నేను. వాలికిఁ గొడుకను. నన్నంగదుఁ డందురు. నాపేరు నీవు వినియు నుండవచ్చును. కౌసల్యా గారామిపట్టియైన రాఘవుఁడు నీతోఁ దనమాటలుగాఁ గొన్ని మాటలు చెప్పిపంపెను. అవియేవి యనినఁ జెప్పెద వినుము: ఓ క్రూరుఁడా! నగరు వెడలివచ్చి నాతో యుద్ధముచేసి, నీపౌరుషము చూపుము. నిన్నుఁ బుత్త్ర మిత్త్ర బంధు మంత్రి పరివారములతోఁగూడ వధింపఁగలవాఁడను జూడుము. నీవు చావఁగా ముల్లోకములవారును దిగులు దీఱి సుఖముతో నుందురు. దేవ దానవ గంధర్వ యక్ష రాక్షసులకుఁ బగతుఁ డవును, ఋషులకుఁ గంటకుండవు నైన నిన్నిప్పుడే రూపుమాపఁగలను. నీవు సీతను గొనివచ్చి యర్పించి నన్ను శరణు పొందవేని, నిన్ను

వధించి లంకాపురాధిపత్యము విభీషణుని కొసఁగెదను" అని నీతోఁ జెప్పుమనె నని యంగదుఁడు రావణునితోఁ జెప్పెను.

హరిశ్రేష్ఠుడగు నంగదుఁ డిట్లు పరుషవాక్యములు చెప్పునప్పుడె, రాక్షసగణాధిపుఁడగు రావణుఁ డాగ్రహము నొంది, కన్నులందుఁ గెంపు గదుర మంత్రులతో "నీదుష్టాత్మునిఁ బట్టి చంపుఁ"డని పలుమారు నానతిచ్చెను. మండుచున్న యగ్నివలె వెలుఁగునట్టి యారావణాసురునిపలుకు లాలకించి, భయంకరులైన యారావణాసురుని మంత్రులు నలువు రా యంగదునిఁ బట్టుకొనిరి. అంగదుఁడు వారిచేతులలోఁ జిక్కక తప్పించుకోఁగలవాఁ డయి యుండియు గుండెదిటవు గలవాఁ డగుటంజేసి, తనపరాక్రమము వారికిఁ జూపఁగోరినవాఁడై వారికిఁ బట్టువడెను. తన్నట్లు పట్టుకొనిన యా రాక్షసులను నలువురను రెండు బాహువులసందులం దిరికించికొని పర్వతముమాడ్కి నెత్తయిన యా రావణుని మేడపై కెగిరి, యచ్చట రెండుభుజములు సడలింపఁగా, రావణాసురునియెదుటనే యా మంత్రు లాకాశముండి క్రిందికిఁ గూలిరి.

అట్లు ప్రతాపశాలియయిన యంగదుఁడు పర్వతపుఁగొనవలె నెత్తయిన యారావణునినగరుయొక్క శిఖరమును జూచి, యచ్చటి కెగిరి, తొల్లి వేల్పులఱేఁడు హిమవత్పర్వత శిఖరమును ద్రుంచినట్లు, రావణుఁడు చూచునప్పుడే యానగరుయొక్క శిఖరమును గాలితోఁ దన్ని క్రిందికిఁ ద్రోసి, తనపేరు వెల్లడిపఱచి, గొప్ప కిలకిలరవం బొనర్చి యాకాశమున కెగిరి, రాక్షసుల నందఱిని దుఃఖింపఁజేయుచు, వానరుల నందఱిని సంతసింపఁజేయుచు నా వానరులనడుమ రాముని ప్రక్క వచ్చి దిగెను.

రావణుఁ డన్ననో యంగదుఁడు ప్రాసాదశిఖరము విఱుచుటవలన మొదట నెక్కువకోపము నొందెనుగాని, తనచేటును దలఁచికొన్నప్పు డెక్కువ నిట్టూర్పు వదలినవాఁ డయ్యెను. రాముఁ డన్ననో కిలకిలరవములుచేయు సంతుష్టులైన పెక్కుంద్రువానరులతోఁ గూడినవాఁడై, శత్రువుఁ జంపఁగోరి, యుద్ధమునిమిత్తమే తఱలెను. తర్వాత నెక్కువ పరాక్రమశాలియు, పర్వతశిఖరముమాడ్కి నెత్తయినవాఁడును, శత్రు

వులచే నెదిరింప నలవికానివాఁడును నైన సుషేణుఁడు సుగ్రీవునానతిం బట్టి కామరూపులయిన పెక్కుఱు వానరులతోఁ గూడినవాఁడై, చంద్రుఁడు నక్షత్రములను జుట్టివచ్చునట్లు లంకాపురంపునలుగవనులందును దిరుగుచుండెను. అవ్విధముగా సముద్రము దాఁటి లంకాపురము ముట్టడించియున్న యా నూఱక్షౌహిణులవానరసైన్యములను జూచి, కొందఱు రాక్షసు లాశ్చర్యమును, మఱికొందఱు దిగులును బొందిరి. మఱికొందఱు యుద్ధమునందలి పూనికచే మక్కువనే పొందిరి. రాక్షసు లందఱును వానరు లందఱు ప్రాకారములమీఁదను, అగడ్తలందును నిండి యుండఁబట్టి వానరమయముగాఁ జేయఁబడిన యా ప్రాకారముఁ జూచి దీనత్వము నొందిరి. కొందఱు భయముచే వివేకము మాని, హా! హా! యని యఱవఁజొచ్చిరి. అవ్విధమున నారాక్షసరా జగురావణుని రాజధాని యగు లంకాపురమునఁ గడుదిగులు పుట్టించు నా గొప్పకోలాహలము నడువఁగా, రాక్షసు లందఱు గొప్పయడిదములు పూని, ప్రలయకాలవాయువులమాడ్కిఁ దిరుగు చుండిరి.

42-వ సర్గము

వానరులు లంకను ముట్టడించుట

అంతట నా రాక్షసులందఱు రావణుని కడకేగి, రాముఁడు వానర సమేతుఁడై లంకాపట్టణమును ముట్టడించియున్నాఁ డని విన్నవించిరి. రాక్షసేంద్రు డా మాట యాలకించి, రోషము పూని, యేర్పాటును ముందఱకంటె రెండింతలుగాఁజేసి, మేడపై కెక్కి, యుద్ధాభిలాషతో లంకాపురమునఁ బర్వతారణ్యవనములందు నిండియున్న లెక్కలేని వానరులం జూచిఁ లంకాపురప్రదేశ మెల్ల వానరసేనచే మ్రింగఁబడినట్లు క్రమ్మఁబడియుండుటను గాంచి, యెట్లు వీరిని వధింపఁగల వని పెద్దయుంబ్రొద్దు చింతించి, తుట్టతుద కొకవిధమున నిశ్చయించికొని, దిటవు పూని, రామునిని, వానర సైన్యమును దన వెడఁదకన్నులతోఁ జూచెను. రాముఁడును సైన్యసమేతుఁడై, యన్ని వైపులందును రాక్షసులచేఁ గావలికాచఁబడునదియు, వింతలైన పెక్కుములుగలదియునైన లంకాపురిం జూచి, మనమున సీతాదేవిం దలఁచి కడువెతలంబడినవాఁడయి "యీ లంకాపురమున లేడిపిల్లకన్నులంబోలు కన్నులు గలదగు

జానకి నానిమిత్తమైన వ్యసనముచేఁ గుందుచు నుపవాసములచేఁ జిక్కి నదై యుత్తనేలమీఁదఁ బరుండుచుఁ గష్టపడుచున్నది. ఈ రాక్షసులను వధించి, యా జానకిశోకముఁ బోకార్చెదను" అని యా సీతాదేవిం గూర్చి తలపోసి, వానరులను శత్రువధమునకై వేఁగిరమే యాన తిచ్చెను.

శ్రమము లేకయే కార్యములం జేయువాఁడగు రాముఁ డివ్విధ మున నానతీయఁగా, వానరవీరు లంద ఱొండొరుల ద్రోసికొనుచు సింహనాదములు గావించి, యా లంకాపురమును బర్వతశిఖరములతో నింపికొని, పిడికిళ్లతోఁ బొడిచి కాని నుగ్గుచేయ మనములందు నిశ్చ యించుకొని, పర్వతములశిఖరములను, గొప్పవగు బండలను గొనియు, పెక్కుమ్రాఁకులను బెళ్లగించి పట్టుకొనియు యుద్ధసన్నద్ధులై నిలఁబడి, రాక్షసేశుండగు రావణుఁడు చూచుచుండునప్పుడే యతనిని లక్ష్యపెట్టక, రాముని యిష్టంబు నెఱవేర్చుటకై గుంపులుగట్టి లంకాపురప్రాకారము మీఁదికి గుప్పించిరి. ఎఱ్ఱమూఁతులగు పసిఁడివన్నెగల వానరులందఱు రామునినిమిత్తమై తమ ప్రాణములనయిన విడువ సమకట్టియుండువారగు టంజేసి, మద్దిచెట్లు, త్రాటిచెట్లు, బండలు నాయుధములుగాఁ గైకొన్న వారలై యా లంకాపురిపై కెగిరి పోయిరి. వా రట్లు ప్రాకారము లెక్కి మ్రాఁకులచేతను, పర్వతశిఖరములచేతను, పిడికిళ్లచేతను బ్రాకారముల కొనలను, ఉద్యానములను, పురద్వారములను పొడిపొడి చేసిరి. తేఁట నీటితో నిండిన యగడ్తలను మట్టిపోసియు, పర్వతశిఖరములు, తృణ కాష్ఠములు పడవైచియు నగడ్తలను బూడ్చిరి. తర్వాత వానరులలోఁ గొందఱు వేలకొలఁదిసేనయుఁ గొందఱొక కోటిసేనయుఁ గొందఱు నూఱుకోట్లసేనయుఁ వెంటఁగైకొని లంకాపుర ప్రాకారమెక్కి బంగారు మయము లైన వెలుపలి పురద్వారముల నిడియఁగొట్టుచుఁ గైలాస పర్వతాగ్రములంబోలు గోపురములఁ బడఁద్రోసియు, నెగురుచు, దుము కుచు ఇకిలింతలుపెట్టుచు, గొప్పయేనుఁగులచందమున నాలంకాపురము పైకిఁగవిసి, "అతిబలుఁడగు రాముఁడును, మహాబలుఁడగు లక్ష్మణుఁడును జయింతురుగాక! రాఘవునిచే రక్షితుఁ డైన సుగ్రీవుఁడును జయించు చున్నాఁడు" అని చాటించుచు, సింహనాదములు చేయుచు లంకాపుర

ప్రాకారముమీఁద నెగిరిదుమికిరి. వారిలో వీరబాహు, సుబాహు, నలు లను వానరోత్తములు లంకాపురమును ధ్వంసముచేయుచు ముట్టడిసాగించిరి. అంతలోపల వానరు లందఱు దండును దగినస్థలము లందు విడియఁజేసిరి.

బలముగలవాఁ డగు కుముదుఁ డను వానరుఁడు జయశాలు లైన పదికోట్లవానరసైనికులతోఁ గూడినవాఁడై తూర్పుగవనిని ముట్టడించి నిలిచియుండెను. ఆకుముదునిసాహాయ్యమునిమిత్తము దీర్ఘభుజు లగు ప్రఘస పనసు లనెడి వానరు లిద్దఱును బెక్కండ్రు వానర వీరులతోఁ గూడి యాతూర్పుగవనియందే నిల్చియుండిరి. శూరుఁ డగు శతవలి యను వానరుఁ డిరువదికోట్ల వానరసేనతోడ దక్షిణంపుగవనిని ముట్టడించి నిలిచియుండెను. బలమిగలవాఁ డయిన తారతండ్రి యగు సుషేణుఁ డఱువదికోట్లవానరసేనతోఁ గూడి స్కంధావారపశ్చిమ ద్వారము నాక్రమించి నిలిచెను. రాముఁడు లక్ష్మణ సుగ్రీవులను సహాయులనుగా నుంచికొని యుత్తరద్వారమున నుండెను. ఎక్కువమగఁటిమి గలవాఁడును, గొప్పదేహముగలవాఁడును, భయంకరాకారముగల వాఁడును నైన గవాక్షుఁ డను గోపుచ్ఛుఁడు కోటిసేనతోఁ గూడి రామునిప్రక్కనే నిలఁబడెను. శత్రుసంహారి యైన గొప్పమగఁటిమి గలవాఁ డగు ధూమ్రుఁడు భయంకర వేగముగల కోటిభల్లూకములఁ గూఁడి, యారామునిప్రక్కనే నిలఁబడెను. ఎక్కువ మగఁటిమిగలవాఁ డగు విభీషణుఁడును యుద్ధమునఁ బట్టుదల గలవాఁడై, చేత గదఁ బట్టి, యుద్ధసన్నద్ధు లైన తనమంత్రులతోడ రాముఁ డున్న యుత్తరద్వార మునే నిలఁబడి యుండెను. గజ గవాక్ష గవయ శరభ గంధమాదను లంతటఁ దిరుగుచు వానరసేనను గాపాడుచుండిరి.

అంతట రాక్షసేంద్రుఁ డగు రావణుండు మనమున నెక్కువ యాగ్రహము గలవాఁడై, తన సకలసైన్యములను యుద్ధమునకు వెడల నాజ్ఞాపించెను. రావణాసురునినోటినుండి వచ్చిన యా మాటను విని, రాక్షసు లందఱు పట్టణమెల్ల నడలునట్లు సింహనాదములు గావించిరి. తర్వాత నారాక్షసవీరులు చంద్రునిమాడ్కిఁ దెల్లనైన మూఁతులు గల భేరీవాద్యములను బంగారుకోలలచే వాయించిరి. మఱికొందఱు భయం

కరులయిన రాక్షసులు గొప్ప ధ్వని గలవగు శంఖముల నూఁదిరి. తెల్లని శంఖములు చేతులందుఁ బట్టుకొన్నవారును, సర్వాభరణాలంకృతులును, నల్లని మైడాలు గలవారును నైన రాక్షసులు మెఱుపుగుంపులతోఁ గూఁడి, కొంగలసంచారము గలిగియుండు క్రొక్కాఱుమబ్బులం బోలెఁ బ్రకాశించిరి. రావణునిచే నడుపఁబడు నాతనిసైనికులు మనములం దుప్పొంగుచుఁ బ్రలయకాలమునందలి మహాసముద్రములం బోలి బయలుదేఱిరి. ఇట్లు రాక్షసులు యుద్ధమునకై తఱలినచ్చుట చూచి, వానరులు మలయపర్వతంపుఁజఱులం దెల్ల నిండునట్లు కిలకిలధ్వనులఁ గావించిరి. వానరులును రాక్షసులును గావించిన సింహనాదములును, శంఖభేర్యాది వాద్యములధ్వనులును భూమ్యంతరిక్ష సాగరము లెల్ల నిండి, యచ్చటి గుఱ్ఱముల సకిలింతలతోను, గజబృంహితములతోను, రథధ్వానములతోను గూడి చెలరేఁగుచుండెను. ఇంతలోపల వానర రాక్షసులకుఁ బూర్వము దేవాసురులకుం బోలె మహాఘోరయుద్ధము తొడరెను. భయంకరరాక్షసులు దమ పరాక్రమములఁ జెప్పుకొనుచు, ధగధగాయమానములైన గదా శక్తి శూలములతోను గండ్రగొడ్డళ్ల తోను వానరుల నందఱిని గొట్టిరి. ఆవానరులు "వానరరాజగు సుగ్రీవునకు జయము జయము" అని యార్చిరి. గొప్పదేహములుగల వానరులు సుగ్రీవుంగూర్చి, "ప్రభూ! జయింపుము, జయింపుము" అని చెప్పి, తమ తమ పేరులను బేర్కొనుచు, వృక్షములతోను, బర్వత శిఖరములతోను నారాక్షసులం గొట్టిరి. గోళ్లతోఁ గ్రుచ్చిరి. కోఱలతోఁ బెఱికిరి. భయంకర రాక్షసులు ప్రాకారములం దున్నవారై భిండివాల శూల ఖడ్గములతోఁ బుడమిమీఁద నిల్చియున్న వానరుల నందఱిని గొట్టిరి. నేలమీఁద నిల్చియున్న యావానరులును రాక్షసుల బాణ ప్రహారముల కలిగినవారై పైకెగిరి, ప్రాకారములమీఁద నిల్చియున్న రాక్షసుల నందఱిని గ్రింద ద్రోసిరి. ఇవ్విధముగా వానరరాక్షసులకు జరిగిన పోరు రక్తమాంసములు కర్దమమయమై యుండఁగా నెంతయు నాశ్చర్యకరమయి యుండెను.

43-వ సర్గము

వానర రాక్షసుల ద్వంద్వయుద్ధము

మహాబలులగు నావానరు లివ్విధమునఁ బోరాడుచుండఁగా, రాక్షసుల సైన్యమున కెక్కువరోషము గలిగెను. అంతట భీకర కృత్యము లొనరించునట్టి యారాక్షసవీరులు రావణునికి జయముఁగోరి చక్కని కవచములం దొడిగినవారై, బంగారుభూషణములతో సింగారించిన గుఱ్ఱములు గట్టినవియు నగ్నిశిఖరములమాడ్కిఁ బ్రజ్వరిల్లు ధ్వజములతోఁగూడి సూర్యునింబోలె దీపించునవియు నైన రథముల మీఁద నెక్కి పదిదెసలు పిక్కటిల్లునట్లు సింహనాదము లొనరించుచుఁ బగతురమీఁదికిఁ గవిసిరి. రామునికి జయముగోరు వానరుల గొప్ప సేనయుఁ గామరూపు లగు నారాక్షసుల సేన నెదుర్కొనెను. ఇంత లోపల నట్లొండొరుల నెదుర్కొన్న యారాక్షసవానరులకు ద్వంద్వ యుద్ధము నడపఁజొచ్చెను.

ఎక్కువప్రతాపము గలవాఁడగు నింద్రజిత్తు వాలిపుత్రునితో, ముక్కంటియగు నీశ్వరునితో యముఁడునుబోలెఁ బోరఁదొడఁగెను. యుద్ధరంగమున నెప్పుడేనియు శత్రులచేఁ జిక్కనివాఁడగు విభీషణుని మంత్రియగు సంపాతి ప్రజంఘునితోను; హనుమంతుఁడు జంబుమాలి తోను యుద్ధమునకుఁ దొడఁగిరి. యుద్ధసమయమున నత్యాగ్రహముఁ బూనునట్టి రావణునితమ్ముఁ డగు విభీషణుఁడు కడుబల్మికాఁ డగు మిత్రఘ్నునితోడఁ బోరెను. ఎక్కువబలిమికలవాఁ డగు గజుఁడు తపనుఁ డను రాక్షసునితోను, ఎక్కువవెలుఁగు గల నీలుఁడు నికుంభునితోను సమరము సేసిరి. వానరరాజగు సుగ్రీవుఁడు ప్రఘసునితోను, సంగరమున శౌర్యలక్ష్మిచే వెలుఁగు లక్ష్మణుఁడు విరూపాక్షునితోను గదిసిరి. శత్రువులచే నెదిరింప నలవికానివారగు నగ్నికేతు, రశ్మికేతు, సుప్తఘ్న, యజ్ఞకోపు లనెడి రాక్షసులు రామునితో డీకొనిరి. వజ్రముష్టి యశనిప్రభుఁ డనుభయంకరరాక్షసు లిరువురు కపివీరులగు మైందద్వివిదులతో వరుసగాఁ గయ్యమొనరించిరి. శూరుఁడు, శత్రువులకు భీతిగల్గించువాఁడు, సమరమున నొరులచే నోర్వనలవికానివాఁడునైన ప్రతపనుఁడు యుద్ధమునఁ గడుబల్మికాఁ డయిన నలునితో యుద్ధమొనర్చెను. బల

వంతుఁ డని ఖ్యాతివహించినవాఁడగు యమునిపుత్రుఁడయిన సుషేణుఁ డను వానరవీరుఁడు విద్యున్మాలి యను రాక్షసునితో యుద్ధము గావించెను. ఇవ్విధమునఁ దక్కినవానరులు పెక్కండ్రు తక్కినపెక్కండ్రు రాక్షసులతో ద్వంద్వయుద్ధ మొనరించిరి. ఒండొరుల జయముగోరునట్టి శూరులగు వానరరాక్షసులకు గగుర్పా టొదవించెడి దోమ్మియుద్ధము జరిగెను.

ఆ సమరసమయమున వానరరాక్షసదేహములనుండి శిరోజములను పచ్చికపట్టులును, దేహసముదాయము లనెడి కట్టెలమోఁపులును గలవైన రక్తతరంగిణులు ప్రవహించెను. అట్టి సమయమున నింద్రజిత్తలిగినవాఁడై దేవేంద్రుఁడు వజ్రాయుధముచే నసురులంగొట్టినట్టులు శత్రుసైన్యములఁ జీల్చునట్టి శూరుఁడైన యంగదుని గదతో వ్రేసెను. అంతట ననిమొనయందు శౌర్యలక్ష్మిచే విరాజమానుండగు నంగదుఁడు గడువడిగలవాఁడై బంగారుభూషణములతోనలంకరించిన యా యింద్రజిత్తుయొక్క రథమును వాజిసారథిసమేతముగాఁ దుత్తునియలు సేసెను. ప్రజంఘుఁడు మూఁడుబాణములతో సంపాతిం గొట్టఁగా, సంపాతి యా ప్రజంఘుని నశ్వకర్ణవృక్షముచే వధించెను. ఎక్కువ బలముగలవాఁడగు జంబుమాలి బవరమున రోషముపూని రథమున నున్నశక్తిచేత హనుమంతునిఱొమ్ము భేదించెను. అట్లు జంబుమాలిహృదయము భేదింపఁగా, హనుమంతుఁ డాతనియరద మెక్కి, యాజంబుమాలి రథము నాజంబుమాలితోఁ గూడ నుగ్గుచేసెను. ప్రతపనుండును ఱొప్పుచు నానళుని వెంబడించెను. చేతివడిగల యారాక్షసుఁడు వాఁడి యమ్ములనేసి, నళునిదేహము చిల్లులు వడఁజేయఁగా, నళుఁడును ప్రతపనునిగ్రుడ్ల నూడఁబెఱికెను. సుగ్రీవుఁడు సేనను మ్రింగువానికైవడి నోఱుదెఱచికొని వచ్చునట్టిప్రఘసుని నేడాకుల పొన్నచెట్టుతో మోది పీచమడచెను. శత్రువులచే నెదిరింప నలవికాని యగ్నికేతు, రశ్మికేతు, సుప్తఘ్ను, యజ్ఞకోపులు బాణములతో రామునింగొట్టిరి. అంత రాముఁ డలిగినవాఁడై యగ్నిజ్వాలలం బోలు నాలుగుభీకరతీక్ష్ణబాణములచే నారాక్షసులశిరములను ద్రుంచెను. మైందుఁడు వజ్రముష్టియను రాక్షసునిఁ బిడికిటఁ బొడువఁగా, వజ్రముష్టి రథాశ్వములతోఁగూడఁ గోట

బురుజుమాడ్కిఁ గ్రిందఁబడెను. సూర్యుఁడు వాఁడియమ్ములచే మేఘ మునుంబోలె నికుంభుఁడు రణమున నల్లనికాటుకరాశిమాడ్కి వెలిఁగెడి నీలుని నొంచెను. తర్వాతఁ గడునేర్పుతో బాణప్రయోగము చేయఁ గల యానికుంభుఁడు మఱల నూఱుబాణంబు లేసి యానీలుని నొంచి, పకపక నవ్వెను. సమరంబున విష్ణువు చక్రాయుధముతోఁ బగతురం బరి మార్చునట్లు, నీలుఁ డా నికుంభుని రథచక్రంబుఁ దీసికొని గిరగిర త్రిప్పి యానికుంభుని,నతనిసారథిని బరిమార్చెను. పిడుగువలెను, వజ్రమువలెను కఠినమైనశరీరముగల ద్వివిదుఁడును రాక్షసులందఱు చూచుచుండు నప్పుడే యశనిప్రభునిఁ బర్వతశిఖరముతోఁ గొట్టెను. అశనిప్రభుఁడును వృక్షములతో యుద్ధమొనరించు వానర వీరుఁడగు ద్వివిదునిఁ బిడుగును బోలెడి బాణములతోఁ గొట్టెను:ఆయశనిప్రభుఁ డట్లు పెక్కుటడిదములు ప్రయోగించి యాద్వివిదుని నొప్పింపఁగా, ద్వివిదుం డెక్కువరోషము పూని యా యశనిప్రభునిరథమును తదీయాశ్వములతోడ నుగ్గుసేసెను. విద్యున్మాలియు రథమున నుండియె బంగారుసొమ్ములతోఁ గైసేసిన యమ్ము లతో సుషేణుని నొప్పించి పలుమాఱు సింహనాదము గావించెను. అంత సుషేణుఁ డావిద్యున్మాలి రథమునఁ గూర్చుండియుండఁగాఁ జూచి, గొప్పపర్వతశిఖరము నేసి, యారథమును వడిగాఁ గ్రిందఁ ద్రోసెను. రేద్రిమ్మరి యగు విద్యున్మాలి చులకదనముతో నారథమునుండి క్రింది కుఱికి గదను జేతఁ బట్టి పుడమిపయి నిలఁబడెను. అంతట వానరులలో మేటి యగు సుషేణుఁ డెక్కువ యలుక పూని, యొక గొప్ప బండ నెత్తి కొని యారాక్షసునిమీఁదికిఁ బోయెను. అవ్విధమునఁ దనమీఁదికి వచ్చు చుండు నా సుషేణుని విద్యున్మాలి వడితో ఱొమ్మునఁ గొట్టెను. వానరు లలో మేటియగు సుషేణుఁ డా భయంకరగదాప్రయోగమును సరకు సేయక యా బండ నాతనిఱొమ్మునఁ బడనేసెను. విద్యున్మాలి యా సుషే ణునిచే శైలాగ్రముతోఁ గొట్టఁబడినవాఁడై, ఱొమ్ము నుగ్గుగాఁగాఁ బ్రాణము లెడల నేలఁగూలెను. ఇవ్విధమున శూరులగు వానరులు శూరులగు నారాక్షసులనందఱిని వేల్పులు రాక్షసులంబోలె ద్వంద్వ యుద్ధమున వధించిరి. ఆయుద్ధభూమి భగ్నము లగు గదాఖడ్గ శక్తితో మరములతోను, భిన్నరథములతోను, సమరనిహతములైన గజాశ్వ

ములతోను మృతులయిన రాక్షసవీరులతోను, తునిగిపడిన బండికన్నుల తోను, నొగలతోను గూడి భయంకరమై భక్షణార్థము వచ్చిన వఱళులతో నిండియుండెను. దేవాసురులయుద్ధముబోలు భీకరమైన యావానర రాక్షసయుద్ధరంగమున వానరరాక్షసులకళేబరములు నలుదిక్కులం బడెను. అంతట నప్పుడు రాక్షసులు వానరవీరులచేఁ జీల్చఁబడినవారలై, మేనులు నెత్తుటఁదడియఁ దమకు బలము గావించు సూర్యాస్తమయంబుఁగోరుచుఁ జక్కఁగా యుద్ధము సేయుచుండిరి.

44-వ సర్గము

రాక్షసవానరుల రాత్రియుద్ధము

ఆవిధముగా నా వానరరాక్షసులు యుద్ధము చేయుసమయము ననే సూర్యుఁ డస్తమించెను. వానరులకుఁ బ్రాణహానికరమైన రాత్రివేళ సమాసన్నమాయెను. ఒండొరులఁ గెలువఁబోరినవారలు మచ్చరము పూని యా భీకరవానరరాక్షసులు రాత్రియుద్ధము చేయఁబూనిరి. ఆ భయంకరమైన కాఱుచీఁకటి యందు 'నీవు రాక్షసుఁడ'వని వానరులును, 'నీవు వానరుఁడ'వని రాక్షసులును పరస్పరము చంపుకొని 'చంపుము, చీల్చుము, రమ్ము, పాఱిపోవుచుంటివేల' యను నార్పు లా చీఁకటియందు మాఱు మ్రోగెను. ఆ కటికిచీఁకటియందు నల్లనిమేని డాలుగల వారును, బంగారుభూషణముల ధరించినవారును నైన యారాక్షసులు జ్వలించెడి మూలికలు గల వనములతోఁ గూడిన పర్వతోత్తమముల చందముఁ జూపట్టుచు నాగ్రహభరితులై కడువేగముతో వానరులను డీకొని వారిని మ్రింగుచు నాయుద్ధరంగమునఁ దిరిగిరి.

తర్వాతఁ బట్టరాని కోపము గలవారలగు నా వానరు లాకాశమునకు గుప్పించి, తమవాఁడిగోళ్లతో బంగారు అలంకారములు గల గుఱ్ఱములను అగ్నిజ్వాలలచందమున వెలుఁగు ధ్వజపటములను జించి చెండాడుచు;రాక్షససైనికు లెక్కిన యేనుఁగులను, ఆ యేనుగులమీఁద నుండు యోధులను, ధ్వజపతాకలు గట్టిన యరదములను, చేతులతో నీడ్చుచుఁ బండ్లతోఁ గొఱుకుచు నా రాక్షసవీరుల నెక్కువగా బాధించిరి. రామలక్ష్మణులును గోఱలందు విషముగల సర్పములవంటి బాణములచే రాత్రులందుఁ గంటికిఁ గనఁబడకయు గనఁబడుచును నుండు రాక్ష

సులను వధించిరి. యుద్ధసమయమున గుఱ్ఱముల గిట్టల త్రొక్కిళ్లచేతను, రథచక్రముల నలుగుడు చేతను బైకి రేఁగిన దుమ్ముతయు నాయుద్ధవీరుల కన్నులందును, చెవులందును నిండి దృష్టి కనఁబడకుండునట్లును, చెవులు వినఁబడకుండునట్లును చేసెను. చూపరకు గగుర్పాటొదవించునట్టి కడు వెఱపు గలిగించు యుద్ధము జరుగుచుండఁగా మిగుల గొప్పవైన రక్త నదులు ప్రవహింపఁ దొడఁగెను. మఱియు యుద్ధభూమియందు భేరి మృదంగములయొక్క ధ్వనులు శంఖవేణునినాదములతోఁ గలిసినవై యాశ్చర్యకరములుగా వినవచ్చెను. ఒండొరులను జక్కఁగాఁ గొట్టుచు నావానరరాక్షసులు చేయునట్టి గర్జన మతిభీకరమై యుండెను. దెబ్బలు తినిన రాక్షసులయు వానరులయు ఆర్పులు మిగులభయంకరముగ విన వచ్చుచుండెను. ఆ యుద్ధభూమియందు వానరవీరులు శక్తిశూలపరశ్వధ ములతోను, గామరూపులగు రాక్షసులు పర్వతశిఖరములతోను బడఁ గొట్టఁబడియున్నందున నాయుద్ధభూమి శస్త్రములును, పర్వతాగ్రముల నుండిరాలిన పూవులును బూజాద్రవ్యముగాఁ గలవై, రక్తప్రవా హముచేత బురదయై గుర్తింప నలవికానిదియు, బ్రవేశింప నలవికాని దియునై యుండెను. రాక్షసవానరసంహారసమయమున నాభయంకరమైన రాత్రి ప్రళయకాలరాత్రిమాడ్కి సకలజనులకును నెప్పుడు దెల్లవాఱు నను భీతి గలిగించుచుండెను.

తర్వాత నా రాక్షసులందఱు కోపాక్రాంతమనస్కులై ప్రళయ సమయమున సప్తసముద్రములు ఘోషించునట్లు బొబ్బరింతలు వెట్టుచు, శరవర్షముఁ గురిపించుచు రామునిమీఁదికే వచ్చిరి. రాముఁడట్లు వేగిరముగా వచ్చు రాక్షసులను జూచి యగ్నిజ్వాలలమాడ్కి మండు నట్టి వాఁడిబాణము లాఱుప్రయోగించి యాఱుగురు రాక్షసు లను నొప్పించెను. రాముఁడట్లు రాక్షసుల యాయపట్టులందుఁ దగులు నట్లు బాణప్రయోగంబు చేయఁగా, నారాక్షసులలో యమశత్రుదుర్ధరు లును, మహాపార్శ్వమహోదర వజ్రదంష్ట్ర,మహాకాయశుకసారణులును యుద్ధభూమిని వదలి పాఱిపోయి ప్రాణములతోఁ దప్పించుకొనిరి.

తర్వాత మహాబలుఁడగు రాముఁ డగ్నిజ్వాలలకైవడి బెలుఁగు నట్టి బంగారపు టలంకారములుగల శరములఁ బ్రయోగించి యెల్ల

దిక్కులందును వ్యాపించియున్న చీఁకటిఁ బోఁగొట్టి వెలుతురుఁ గలుగఁ జేసెను. అట్లు రాము నామాంతములగు బాణములతో నారణభూమి యంతయు నిండిపోయెను. నా రాముని యెదుట నుండిన తక్కిన రక్కసు లంద అగ్నిలోఁబడ్డమిడుతలచందమున నశించిరి. అట్లు రక్కసులు నశించు నట్లు రాముఁ డేయునట్టి పసిఁడిములుకులు గల వేలకొలఁది బాణము లతోఁ గూడిన యారేయి మిణుఁగురు బూఁచులతోఁ గ్రమ్మబడిన శర త్కాలరాత్రికైవడిఁ బ్రకాశించెను. అట్టిరేయి యారాక్షసవానరుల సింహనాదములు గల్గి భయంకరములై యాత్రికూటపర్వత గుహలందు నిండుటంజేసి, యాత్రికూటపర్వతము మాటలాడుచున్నదో యనునట్లు తోఁచెను. గొప్పదేహములు గలవారును, చీకటివలె నల్లనైన మేని సొరతోఁ గూడినవారునైన యాకొండమ్రుచ్చులు తమ్ము దెలియక దగ్గరకు వచ్చిన రజనీచరుల ననేకులను జేతులతోఁ గౌఁగిలించుకొని భక్షించిరి.

అంగదుఁడును సమరమున శత్రువగు నింద్రజిత్తును వధింపఁబూనిన వాఁడై వడిగా నతని సారథిని గుఱ్ఱములనుం జంపి మహాభయంకరమైన యుద్ధము చేయుచుండఁగా, గొప్పమేనివాఁడగు నింద్రజిత్తు తనసారథియు రథాశ్వములు మృతినొందుటంజేసి, రథము విడిచి యచ్చటనే యంతర్ధా నము నొందెను. గౌరవింపఁదగిన యంగదుఁ డొనర్చిన యద్భుత కృత్యము చూచి, దేవర్షులును రామలక్ష్మణు లిద్దఱును నాయంగదునిఁ గొనియాడిరి. ఆయింద్రజిత్తుయొక్క ప్రభావము నెఱిఁగినవా రగుటం జేసి, యట్టిబలశాలియగు నింద్రజిత్తు నంగదుఁడు జయించుటచే నాతనినిఁ జూచి దేవర్షులు రామలక్ష్మణులును నందఱుఁ బరమాశ్చర్యము నొందిరి. సుగ్రీవ విభీషణాదులును శత్రువోటమిం బొందుటచూచి బాగుబాగని శ్లాఘించిరి. ఇంద్రజిత్తీవిధమున సంగరమునందు భీకరకృత్యము లొనర్చు నంగదునిచే నవమానింపఁబడి, వెఱపుపుట్టించునట్టి కోపము పూనెను.

ఇంతలోపల రాముఁడు వానరులం జూచి, "యోవానరులారా! మీరందఱు సుగ్రీవుతోఁగూడి మెలఁకువతో నుండుఁడు. ఆ ఇంద్రజిత్తు బ్రహ్మవలన వరములఁ బడసి, ముల్లోకములను గడు బాధించువాఁడు. వాఁడు మృత్యుదేవతా ప్రేరణచేత నతని సంహారరూపమైన మీ

కార్యము నెరవేఱునిమిత్తమై యిచ్చటికి వచ్చియున్నాఁడు. విధాత యందలి గారవమునంజేసి నేనిప్పు డోర్చియుండెద. మీరందఱు దిగులు విడిచి నిలఁబడుఁడు" అని చెప్పెను.

ఇట్లు రాముఁడు వానరులతో ననుచుండఁగా, నంతర్ధాన మొంది నట్టివాఁడును, యుద్ధశూరుఁడును, చెడుతలంపుగలవాఁడు నైన యా యింద్రజిత్తు గంటికిఁ గానరాక వానరులమీఁదఁ బిడుగువలె జ్వలించునట్టి బాణములను బ్రయోగించుచు రామలక్ష్మణులమీఁదఁ దనయాగ్రహము మీఱ నాగమయాస్త్రములను బ్రయోగించెను. అట్లు ఘోరయుద్ధము జరుగునప్పు డింద్రజిత్తు మాయ నవలంబించి, యన్నిభూతములకుఁ గనఁబడక, యందఱిని గనుగప్పుచు నా రామలక్ష్మణుల నిరువురిని బాణములచేఁ గట్టెను. వానరులు కట్టఁబడియున్న యాపురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణులను బలుమాఱు చూచిరి. ఆ రాక్షసరాజపుత్త్రుఁడయిన యింద్రజిత్తు స్వస్వరూపముతో వారియెదుట నిలఁబడి యెప్పుడు యుద్ధము చేయఁజాలని వాఁ డయ్యెనో యా వెంటనే మాయచే వారితో సమరమునకుఁ బూని యా రామలక్ష్మణులను నాగమయ బాణములచేఁ గట్టివేసెను. రాముఁడు ఇంద్రజిత్తు నొక్కయేటునకుఁ బడఁగొట్ట జాలియుండియు, నాయింద్రజిత్తునకు వరమొసఁగిన బ్రహ్మయొక్క వరదానమును బ్రహ్మను గౌరవించుటకై నాగబంధమునకుఁ గట్టువడినవాఁడు వలె నుండెను.

45-వ సర్గము

ఇంద్రజిత్తు రామలక్ష్మణులను నాగపాశముచే బంధించుట

ప్రతాపశాలియు, శత్రుసంహారియు, నతిబలుఁడు నైన రాజపుత్త్రుడయిన రాముఁ డాయింద్రజిత్తుయొక్క యునికిపట్టు నెఱుఁగఁ గోరినవాఁడై, సుషేణుని యిద్దఱు కొడుకులు, వానరశ్రేష్ఠుం డగు నీలుఁడు, వాలిపుత్త్రుఁ డగు నంగదుఁడు, వడిగాఁ బోవునట్టి శరభుఁడు, వినతుఁడు, జాంబవంతుఁడు, సానుప్రస్థుఁడు, ఋషభుఁడు, ఋషభస్కంధుఁడు నను పదుగురు వానరుల నానతియ్యఁగా, నావానరు లంద ఱత్యంత సంతుష్టులయి గొప్ప మ్రాఁకుల నెత్తికొని పదిదిక్కులందును నా యింద్రజిత్తును వెదకుచు నాకాశ

మార్గమునఁ బోయిరి. అస్త్రముల నెఱిఁగిన యయ్యింద్రజిత్తు త్తమాస్త్ర రూపము లైన యెక్కువ వడిగల బాణములచే వడిగలయావానరుల వేగము నడ్డగించెను. ఆయింద్రజిత్తువ్విధమున బాణముల నేయఁగా వానరులు తాము బలవంతులయ్యును దేహములందు బాణములగాయములు తగులుటచే నిరుత్సాహులై మేఘములచేఁ గ్రమ్మఁబడిన సూర్యునింబోలెఁ జీఁకటియం దాయింద్రజిత్తును గనిపెట్టఁజాలకుండిరి. యుద్ధమున జయశాలి యగు నింద్రజిత్తు సర్వాంగముల భేదించునట్టి యమ్ముల నారామలక్ష్మణుల దేహములందే యెక్కువగాఁ బ్రయోగించెను. ఆ యింద్రజిత్తు రోషము పూని యట్లు నాగమయబాణములఁ బ్రయోగించి యారామలక్ష్మణుల దేహములం దావంతయైనను సందు లేకుండునట్లు నిండించెను. ఆరామలక్ష్మణుల యొడలిగాయములనుండి యెక్కువ రక్తము గాఱుటంజేసి యాయిర్వురును బూఁచిన మోదుగు చెట్లమాడ్కి వెలిఁగిరి.

కాటుకరాశిమాడ్కి నల్ల నైన యాకృతిగల యింద్రజిత్తంత ర్హితుఁడై యుండి, కోపమునఁ గ్రీఁగన్నులం దెఱ్ఱన దోఁప నారామలక్ష్మణులం జూచి, "కంటికిఁ గనఁబడకుండ యుద్ధము చేయునట్టి నన్నుఁ గనుఁగొనుట కింద్రుఁడైనను జాలఁ డనఁగాఁ మీ రెంతమాత్రము? గ్రద్దఱెక్కలు గట్టిన వాఁడిబాణపరంపరలచేఁ గ్రమ్మఁబడిన మిమ్ము నిద్దఱిని నే నిదిగో యాగ్రహము పూని యమునివీటి కనిచెదను" అని రామలక్ష్మణులతోఁ జెప్పి తాను యుద్ధసన్నాహము చేయుచు, వాఁడి యమ్ములచే ధర్మజ్ఞులగు నాయన్నదమ్ము లైన రామలక్ష్మణులను భేదించి మనమున నుప్పొంగి సింహనాద మొనరించెను. మెత్తగా నూరిన కాటుక రాశివలె నల్లనైన యాయింద్రజిత్తు మర్మస్థలము నెఱిఁగినవాఁడు కావున గొప్పధనుస్సును సారించి మాటిమాటికి వాఁడిమి గల బాణముల నారామలక్ష్మణుల యాయపట్టులందుఁ బ్రయోగింపఁగా, నారామలక్ష్మణులిద్దఱు సమరభూమియందు బాణరూపబంధమునకుఁ గట్టువడినవారలై యొకక్షణము తల యెత్తి చూడనైనఁ జాలరైరి. అంత గొప్పవిలుకాండ్రును, మొనగాండ్రునైన యా నృపాలపుత్త్రు లట్లు సర్వాంగముల యందు గాయములు తిన్నవారయి, యాయపట్టులందు బాణపు దెబ్బలు

తగులుటంజేసి మిక్కిలి యులికిపడి త్రాడుతెగిన మహేంద్రుని ధ్వజ ములచందమున కంపించుచు నేలం గూలిరి.

పరాక్రమవంతు లగు నా రామలక్ష్మణులు సర్వావయవముల యందు బాణములచే బద్ధులై రక్తమునందు దడియుచు, నెక్కువ పీడితు లైనందున నొచ్చినవారలై యుద్ధరంగమునడుమ వీరశయనమున శయ నించిరి. వారిశరీరమున నంగుళము మేరయైనను దెబ్బతగులనిది కాకుం డెను. వ్రేళ్లకొనలవఱకు నాగపాశములు చుట్టుకొనుటచే మొద్దుపాఱని చోటును, గాయపడనిచోటును లేకుండెను. వారు క్రూరుఁ డయిన యా కామరూపి యగు నింద్రజిత్తుచేఁ గొట్టఁబడినవా రగుటంజేసి, వారి యొడళ్లనుండి రక్తము సెలయేళ్లనుండి యుదకము వెలువడునట్లు మిక్కిలి స్రవించెను. తొల్లి దేవేంద్రుని గెల్చిన యింద్రజిత్తు కోప ముతోఁగూడ నేసిన బాణములు రాముని కాయపట్టులందు బాగుగఁ దగులుటవలన నాతండు మొదటఁ గ్రిందఁబడెను. ఆయింద్ర జిత్తంత టితోఁ జాలింపక, పసిఁడిములుకులుగలవియు, వాడిమొనలుగలవియు, క్రిందుమొగముగఁ బోవునవియు నైన బాణములతోను, నారసముల తోను, అర్ధనారాచములతోను, ఈఁటెలతోను, అంజలిక, వత్సదంత, సింహదంష్ట్ర, క్షుర, అర్ధచంద్రాకారబాణములతోను నారాముని నొప్పించెను. ఆరాముఁడు పట్టువదలినదియు; నడుమను గొనలను రెంటి యందును వంగినదియు, బంగారుతో నలంకరింపఁ బడినదియు నైన బాణ మును బట్టుకొని యుద్ధరంగమున వీరశయనమునఁ బరుండెను. అవ్విధ మున బాణములనడుమఁ బరుండియున్న కమలపత్రనేత్రుఁ డగు పురు షోత్తముఁ డయిన రాముని జూచి, లక్ష్మణుఁడు ప్రాణములమీఁది యాస వదలినవాఁడై కడు శోకించెను. హనుమంతుఁడు మున్నుగాఁగల వానర వీరు లందఱు నొక్కటిగాఁ గూడి వీరశయనమునఁ బరుండియున్న యా రామలక్ష్మణులచుట్టు నిలిచి మనమున నొచ్చుకొని యెక్కువ వ్యసనము నొందిరి.

46-వ సర్గము

వానరులు రామలక్ష్మణులం జూచి వగచుట

తర్వాత వానరులు క్రిందఁ బైనఁ జూచుచు వచ్చి, బాణములచేఁ జక్కఁగా బంధింపఁబడియున్న రామలక్ష్మణులఁ జూచిరి. మేఘము వర్షించి

యుపరమించునట్లు లింద్రజిత్తు బాణవర్షముఁ గురిపించి నిలువఁగా, విభీషణుఁడు సుగ్రీవసమేతుఁడై యా రామలక్ష్మణులు శయనించియున్న ప్రదేశమున కేతెంచెను. అంత, నీల మైంద ద్వివిధ సుషేణ కుముదాంగదులు హనుమంతునితోఁ గూడి యా రామలక్ష్మణులం గూర్చి చింతించిరి. చెయువులు లేనివారును, మెల్లని నిట్టూర్పు విడుచువారును, రక్తప్రవాహమునఁ దప్పఁ దోఁగినవారును, బాణపరంపరలచే నింపఁబడినవారును, చేష్ట లుడిగి శరతల్పమునం బరుండి కదల మెదల లేక, మగఁటిమిని దిగనాడి సర్పముల మాడ్కి వేఁడినిట్టూర్పులు విడుచుచు, దేహమంతయు రక్తప్రవాహమునఁ దడిసినవారలై బంగారుతోఁ జేయఁబడిన ధ్వజములమాడ్కిఁ దేజరిల్లుచుఁ దమయాపదం జూచి కన్నీటిచే నిండిన కన్నులుగల యా యూథనాథులచేఁ జుట్టఁబడినవారై శరతల్పగతులై యున్న యారామలక్ష్మణులం జూచి, వానరులును విభీషణుఁడును విచారము నొందిరి. అందఱు వానరు లాకాశమునం దంతటఁ జూచియు రణమున మాయచేఁ గప్పబడి, యుద్ధము సేయుచున్న యా యింద్రజిత్తు నెఱుఁగఁజాలరైరి. విభీషణుఁడు దాను మాయావి గనుక, బ్రహ్మవరము వలన మాయాతిరోహితుఁడై, సాటిలేని యుద్ధము సేయుచు, నెదిరి లేక, ప్రతాప యశోవిక్రమములతోఁ గూడియున్న శూరుఁ డయిన యింద్రజిత్తును జూచెను.

ఇంద్రజిత్తన్ననో తన యద్భుతమైన యుద్ధచాతుర్యమును, నవ్విధమునఁ బరుండియున్న యా రామలక్ష్మణులను జూచి, యెక్కువ మోదమంది రాక్షసుల నందఱను సంతోషపఱచుచు "ఖరదూషణులను వధించినవారును, మహాబలవంతులును నైన తోఁబుట్టువులు రామలక్ష్మణు లిదఱు నాబాణములచే నిహతులైరి. సురాసురు లందఱును మహర్షు లందఱితోఁ గూడి వచ్చినను వీరి నిరువురి నీబాణములకట్టు నుండి విడిపింపఁజాలరు. ఏరామునినిమిత్తమై దుఃఖించుచు, శోకపీడితుఁడైన నాతండ్రి రేయి మూఁడుజాములలోఁ గొంతసేపైనను బాన్పునఁ బరుండక కడపునో, ఎవనినిమిత్తమై వానకాలమునందు నదిపోలె లంకాపురి కలఁతఁజెందియుండెనో, అట్టి మనల నందఱను వేఱుతో నాశము చేయువాఁడయిన యా రాముని నేను వధించితిని. శరక్రాలములందలి

మేఘములమాడ్కి రామలక్ష్మణులయు, వానరులయందఱియు బీరములు వమ్ములయ్యెను" అని రాక్షసులతోఁ జెప్పెను.

ఇత్తెఱఁగున బ్రక్కననున్న యా రాక్షసు లందఱితోఁ దన ప్రతాపము దెలియఁబలికి, శత్రుసంహారియగు నింద్రజిత్తు వానరయూథ నాథుల నందఱునుగూడ నొప్పింపఁ దొడఁగి, నీలునిఁ దొమ్మిది బాణముల తోను, మైందద్వివిదులను మూఁడేసి బాణములతోను నొప్పించెను. విలుకాఁడగు నయ్యింద్రజిత్తు జాంబవంతుని ఱొమ్మున నొక్క బాణమును, హనుమంతునిమీఁదఁ బదియమ్ములను నేసెను. ఎక్కువవడిగా బాణముల నేయు నేర్పుగల యింద్రజిత్తు మితిమీఱిన విక్రమముగల గవాక్ష శర భుల నిద్దఱిని రెండేసి బాణములతో నేసెను. మఱియు నతఁడు త్వర పడుచు గోపుచ్ఛరాజగు గవాక్షుని, వాలిపుత్రుఁడైన యంగదునిని బెక్కు బాణములచే గాఁడనేసెను. ఎక్కువబలిమియు సత్త్వయుఁగల వాఁడగు నింద్రజిత్తివ్విధమున నగ్నిజ్వాలలనూడ్కి వెలుఁగు బాణముల నా వానర యూథములపైఁ బ్రయోగించి, సింహనాదమొనర్చి, యట్ట హాసము సేసి యా వానరుల నందఱిని వెఱపించి రాక్షసులను గూర్చి యిట్లనియె :

"రక్కసులారా ! వానరసేనయంత యిట్లు చూచుచుండునప్పుడే నేను భయంకరనాగపాశముచే నా రామలక్ష్మణుల నొక్కటేతడవఁ దోడుగా నాగపాశబంధముచేఁ గట్టివేసితిని చూడుఁడు" అని చెప్పఁగా, మొనగాండ్రగు మేఘవర్ణులైన రాక్షసులంద ఱాయింద్రజిత్తుయొక్క యద్భుతకార్యముంగూర్చి యెక్కువ విస్మయము నొంది, రాముఁడు నిహతుఁడయ్యెనని యెఱిఁగి సింహనాదములఁ జేయుచు నింద్రజిత్తును గొనియాడిరి. మఱియు నింద్రజిత్తు రామలక్ష్మణు లట్లూపిరి గొనకుండుట చూచి వారు నిహతులైరని తలఁచినవాఁడై, యుద్ధమున నందఱిం గెల్చి, యెక్కువ వేడ్కతోఁ గూడి, రాక్షసుల నందఱిని సంతసింపఁజేయుచుఁ బురములోపలఁ బ్రవేశించెను.

సుగ్రీవుఁడు రామలక్ష్మణులశరీరము లాపాదమస్తకముగా నవ్వి ధమున బాణములతో నిండింపఁబడియుండుట చూచి మిగుల భయం పడెను. విభీషణుఁ డవ్విధమున వెఱచి, కన్నీరు విడుచుచు, వ్యసనముచేఁ

గలవరపడుచున్న దీనుఁ డయిన సుగ్రీవునితో ని ట్లనియె: "సుగ్రీవా! నీవు వెఱవకుము. కన్నీరు దుడిచికొనుము. యుద్ధము లన నిట్టివేకదా. జయము స్థిరముగా నుండునట్టిది కాదు. మన యదృష్టశేష మున్నచో, మహాధీరులును, మహాబలవంతులు నగు వీ రిరువురు మూర్ఛనుండి తెప్పి ఱిల్లుదురు. సుగ్రీవుఁడా! నీవు దిటవు పూని నాకును ధైర్యము సెప్పుము. సత్యధర్మములఁ దప్పనివారి కెన్నటికిని భయము లేదు" అని చెప్పి విభీషణుఁడు నీట ముంచిన చేతులతో సుగ్రీవుని శుభనేత్రములను దుడిచి, యావలనిర్మలోదకము గొని యభిమంత్రించి యా సుగ్రీవుని కండ్లను దుడిచెను. అట్లు బుద్ధిమంతుఁ దగు విభీషణుఁడు కపీంద్రుఁ డైన యా సుగ్రీవుని మోమును దుడిచి సమయోచిత వాక్యములఁ దత్తర పాటు లేక యి ట్లని చెప్పెను. "ఓ వానర రాజేంద్రా, అధైర్య మొందుట కిది తరుణముగాదు. ఇట్టి సమయములం దతిస్నేహము గొప్పచేటు దెచ్చును. కావున సకల కార్యములను జెడఁగొట్టునట్టి యధైర్యము మాని, రాముని వెంబడివచ్చిన సేనలకు ధైర్యము గలుగునట్లు లాలో చింపుము. లేదా, రాముఁడు మూర్ఛనుండి తెప్పిఱిల్లువఱకు నాతని దేహము గాపాడుము. వారికిఁ దెలివి వచ్చినవెంటనే, వారు మన భయముఁ బోకార్పఁగలరు. రామునికి దీనివలన నేమి యపాయము లేదు. రాముఁ డెప్పటికిని నాశ మొందఁడు. ఆయుస్సు లేనివారిచేఁ బొంద నలవి కాని లక్ష్మి యాతనిఁ బాయకయున్నది. కావున నీ వూఱట నొంది, స్వసైన్యమునకు ధైర్యము చెప్పుము. అంతలో నే నన్ని కార్యములను జక్కఁబఱచెదను. వానరోత్తమా! ఈ వానరులు భీతితోఁ గన్నులు విచ్చి కొని, భయవికారముల నొందినవారై, యొండొరులు చెవులలోఁ బాఱి పోవుద మని చెప్పుకొనుచున్నారు. సేనలను సంతోషపఱచు నిమిత్తము వేగముగాఁ బరుగెత్తు నన్నుఁ జూచి సంతోష మొందుటకై వాడుకొనిన పూలదండను విడుచునట్లు వానరు లందఱును భీతిని విడుతురుగాక" అని విభీషణుఁడు వానరులందఱితోఁ జెప్పి, సుగ్రీవు నూరార్చి, తర్వాత భయముచేఁ బలాయితులగుచున్న వానర సైనికుల నూఱడించెను.

మాయావి యగు నింద్రజిత్తన్నతో సకలసైన్యముతోఁ గూడిన వాఁడై లంకాపురము లోపలఁ బ్రవేశించి, తండ్రికడ కేఁగి, యచ్చట

నగరులోపలఁ గూర్చుండియున్న రావణునికిఁ గృతాంజలి యై మ్రొక్కి, యాతనితో రామలక్ష్మణులు నిహతు లై రని విన్నవింపఁగా, రావణుండు రామలక్ష్మణులు నిహతు లై రన్నమాట విని యాసనమునుండి పైకెగిరి, యెక్కువ సంతసముతో రాక్షసుల నడుమ నా యింద్రజిత్తును గౌఁగిలించుకొని, మూర్ధము నాఘ్రాణించి, రామలక్ష్మణుల వధప్రకారము నడుగఁగా, నింద్రజిత్తు "రామలక్ష్మణులను నాగపాశములచేఁ గట్టి చెయువులు లేనివారినిగాను, గాంతిహీనులనుగాను జేసితి" నని యావద్వృత్తాంతము నెఱింగించెను. అంత రావణుఁడు సంతోషాతిశయముతోఁ గూడిన మనసు గలవాఁడై, య మ్మహారథుఁ డైన యా యింద్రజిత్తు మాటను విని, రామునివలనఁ గలిగిన దిగులు విడిచి, మనమున నుప్పొంగి, తన పుత్రునిఁ బలుతెఱఁగుల మెచ్చుకొన్నవాఁ డయ్యెను.

47-వ సర్గము

రావణుఁడు వీరశయనమున నున్న రామలక్ష్మణులను
సీతాదేవికిఁ జూప నానతిచ్చుట

ఇంద్రజిత్తు కృతకార్యుఁడై లంకలోపలఁ బ్రవేశింపఁగా, హనుమదంగద నీల సుషేణ కుముద నళ గజ గవాక్ష గవయ శరభ గంధమాదన జాంబవత్ ఋషభస్కంధ రంభ శతవలి పృథువులను వానరులు సైన్యములను జుట్టు నిల్పి పూనికిగలవారై వృక్షములను గైకొని యన్ని దెసలలోను గ్రిందను, మీఁదను జూచుచు గడ్డిపోఁచలు గదలినను రాక్షసు లనియే భావించుచు, నా రామలక్ష్మణులను జుట్టు నిలుచుండి కాపాడుచుండిరి.

రావణుఁడు గడు ముదము నొంది, యింద్రజిత్తును వీడుకొలిపి, సీతాదేవికిఁ గావలియుండు రక్కసుల నందఱను బిలువఁబంచెను. రాక్షసకాంతలును త్రిజటయు రావణుని సన్నిధికి వచ్చిరి. రాక్షసాధిపుఁ డగు రావణుఁడు ముద మందుచు నా రాక్షస కాంతలనందఱను గూర్చి, "యో కాంతలారా! మీరు సీతకడ కేఁగి, యింద్రజిత్తు రామలక్ష్మణులను వధించె"నని చెప్పుఁడు. మఱియు నా పెను బుష్పకముమీఁద నెక్కించి, సంగరభూమికిఁ దోడ్కొని చని, యింద్రజిన్నిహతులై రణభూమి యందుఁ బడియున్న యా రామలక్ష్మణులను జూపుఁడు. ఈసీత యెవని

యాశ్రయబలమున గర్వితురాలై నన్నుఁ బొందకయుండినదో, యా యీ సీతాదేవియొక్క భర్త తమ్మునితోడ సమరమున నింద్రజిత్తుచే నిహతుండయ్యెను. ఇఁక సీతాదేవి విచారములేనిదై శోక ముడిగి, రాముఁడు వచ్చు నన్న యాస మాని, సకలభూషణముల నలంకరించుకొని నన్నుఁ బొందఁగలదు. విఱివి కన్నులు గల దగు మైథిలి యిప్పుడు మృతులయిఁ యున్న యా రామలక్ష్మణులం జూచి, రామునిమీఁది యాస మానినదై, వేఱుగతి గాననిదై, రామునిమీఁది కోరిక మాని నన్నుఁ బొందఁగలదు" అని యా రాక్షసకాంతల కానతిచ్చెను.

ఆ దుష్టబుద్ధి యగు రావణుని యానతిని గైకొని, యా రాక్షస కాంతలు నట్లె యని, పుష్పకవిమాన మున్నచోటి కేఁగి, యా విమానమును గైకొని యశోకవనమున నున్న సీతాదేవికడ కేఁగుదెంచి, యామెకు భర్తృవధము మున్నగు వృత్తాంతము లెల్లఁ జెప్పి యామెను త్రిజటాసమేతముగా నా పుష్పకము నెక్కించి రణనిహతు లయిన రామలక్ష్మణులను జూపించుటకై యుద్ధరంగమునకుఁ దోడ్కొనిపోయిరి. ఇచ్చట రావణుఁడును లంకాపురమంతయు ధ్వజపతాకాదులచే నలంకరింపించి "రామలక్ష్మణు లిరువురు సమరమున నింద్రజిత్తుచే మడిసి" రని యా లంకాపురమునఁ జాటఁ బంచెను.

సీతాదేవియుఁ త్రిజటతోఁ గూడినదై సంగరరంగమునకుఁ జని వానరసైన్యము తూలియుండుట చూచి, రాక్షసు లందఱు సంతోష రోమాంచభరితగాత్రులై యుండుటయు, వానరు లందఱు రామలక్ష్మణుల చేరువ వగ గూఱి కుందుటయు నెఱింగి, దగ్గఱ కేతెంచి, శరతల్పమునఁ బరుండినవారును, సంజ్ఞ దప్పినవారును, బాణములచే నొంపఁబడినవారును, చిల్లులువడిన కవచములు గలవారును, చేతులనుండి విండ్లను జాఱవిడిచినవారును, నన్నియంగములయందును బాణములచే నైన గాయములు గలవారును, బాణముల కట్టవలెనున్నవారును నైన యా రామలక్ష్మణులను జూచెను. అవ్విధమున బాణపుసెజ్జయందుఁ బరుండియున్న పురుషోత్తములును, తమ్మిఱేకులం బోలు కన్నులవారును, అగ్నిహోత్రునిపుత్రు లగు స్కందవిశాఖులను బోలినవారును, శూరులు నైన యారామలక్ష్మణులం జూచి, కడువగచే నొచ్చినదై పెద్దయుఁ దడవు

దుఃఖించెను. చక్కని యంగములు గలదియు, నల్లని క్రీఁగంటి చూడ్కి గలదియు నైన యాజానకి దుమ్ములోఁ బొఱలుచున్న రామలక్ష్మణుల నిద్దఱిని జూచి విలపించెను. ఆసీతాదేవియుఁ గన్నీరు విడుచుచు శోకముచేఁ గొట్టువడినదై దివ్యమహిమగల యా తోఁబుట్టువుల నిరువురం జూచి, వారి మరణమునుగూర్చి తర్కించుకొనుచు దుఃఖముతో నిట్లు పలుఁక దొడఁగెను.

48-వ సర్గము

సీతాదేవి రామలక్ష్మణులం జూచి విలపించుట

సీతాదేవి నిహతులైన బలవంతు లగు తన పెనిమిటిని లక్ష్మణుని జూచి, వ్యసనమునఁ జిక్కినదై జాలి పుట్టునట్లుగా నివ్విధమున విలపింపఁ దొడఁగెను. ఏసాముద్రికశాస్త్రజ్ఞులు మున్ను నన్ను విధవాలక్షణ రహితనుగను, పుత్రవతినిగను వచించిరో, ఇప్పుడు రాముని నిధనమునం జేసి వారిపలుకు లెల్లఁ గల్ల లయ్యె. ఎవరు నన్ను సోమిదమ్మనుగను, బహుసంవత్సరములు పెక్కండ్రచేఁ జేయఁబడు సత్ర మను గొప్ప యాగమొనరించినవానికిఁ బత్నిని గను జెప్పిరో, ఇప్పుడు రాముఁడు హతుఁడు గాఁగా వారి పలుకులు వమ్ము లయ్యెను. ఏ జ్యోతిశ్శాస్త్ర వేత్తలు నేను వినుచుండఁగా, నన్ను నిత్యసుమంగలినిగా వచించిరో వా రిప్పుడు రాముని మృతివలన నసృతవాదు లైరి. ఎవరు నన్ను వీర నృపాలుని పత్నినిగాను, పుణ్యాత్తురాలినిగాను జెప్పిరో, యట్టి జ్ఞాన వంతు లిప్పుడు రాముని యంతముంబట్టి కల్లలాడువా రైరి. నృపాలు రగు మగలతోడఁ గులస్త్రీలకుఁ రాజ్యపట్టము గట్టింపఁజాలిన వని ప్రసిద్ధి కెక్కిన యీ పద్మ రేఖలు నాపాదములయం దివిగో స్పష్టముగాఁ గనఁ బడుచున్నవే ? ఏల యివి నిష్ఫలము లయ్యె ? దురదృష్టవంతురాం డ్రగు కాంత లే లక్షణములచే వైధవ్యము నొందుదురో, యట్టి లక్షణములు నాకడఁ గాన్పింపవు. నేను సులక్షణములే గలిగియున్నను నిష్ఫలము లైన లక్షణములు గలదాన నైతిని. తక్కిన ధ్వజాది లక్షణములమాడ్కి స్త్రీలపాదములం దున్న యేపద్మ రేఖలు సంపదల నొసఁగునవి యను సార్థక నామముగలవిగాఁ జెప్పఁబడినవో, యట్టి సార్థకనామకము లగు పద్మ రేఖలు రాముని యంతముచే నిష్ఫలము లాయెను. అంతియకాక,

నేను సాముద్రికోక్త శుభలక్షణములను గలదానినుగ నున్నాను. నా శిరోజములు సన్ననివి, చక్కనివి, నల్లనివి. నా కనుబొమ్మలొండొంటితోఁ గలియనివి. నా పిక్కలు గుండ్రనివి, రోమములు లేనివి. నాపల్వరుసలు సందులులేనివి. నా శంఖరేఖలు, నయనములు, కాలుసేతులు, మడమలు, తొడలు పుష్టిగలవి. నావ్రేళ్లు గుండ్రని గోళ్లతోఁగూడి, నునుపులై సమములుగా నున్నవి. ఈ నాస్తనములు క్రిక్కిఱిసినవియు, నుబ్బుగలవియు మొనలు స్పష్టముగాఁ గాన్పింపనివియు నైనవి. నానాభి నడుమ లోఁతై చుట్టును నెత్తియున్నది. నాప్రక్కలును ఱొమ్మును బుష్టిగలవి. నా మేనిడాలు పద్మరాగముల బోలునది. నామేనిరోమములు మృదువులు. నన్నుఁ జక్కఁగా మానిన పది పాదాంగుళులును రెండఱగాళ్లును నను పండ్రెండంగములు గలదానివిగా లక్షణజ్ఞులు వాక్రుచ్చిరి. నాహస్తపాదములు యవరేఖలతో నిండినవియు, సందులు లేని వ్రేళ్లతోఁగూడినవియు, మెఱుంగు గలవియునై యున్నవి. కన్యాలక్షణజ్ఞు లగు ద్విజులు నన్నుఁ జిఱునవ్వు మోము గలదానినిగా వచించిరి. జ్యోతిశ్శాస్త్రప్రవీణు లగు ద్విజులు నేను మగనితోడఁ బట్టాభిషిక్తురాల నగుదు నని వచించిరి. ఇప్పుడు వారి యా పలుకులెల్ల నిష్ఫలంబు లయ్యె. రామలక్ష్మణులు జనస్థానము నిర్జనస్థానము గావించి, నా పోవిడిఁ దెలిసికొని, అసాధ్య మగు సముద్రముదాఁటి లంకకుఁజేరి గోపాదమంత యైన యింద్రజిన్మాయయందు హతులైరి. వారు ఇంద్ర, వారుణ, ఆగ్నేయ, వాయవ్య, బ్రహ్మశిరములను నస్త్రములు నేర్చిన వారునుగదా! ఇంద్రజిత్తు సంగరమున మాయచేఁ గంటికిఁ గానఁబడక నా నాథుని, నా మఱఁదిని వధించి నన్ననాథంజేసినాఁడు. ఈ యింద్రజిత్తు వారికంటఁ బడియుండునేని, బ్రాణములతోఁ దప్పించుకొని యుండఁడు. సమరమున రామునికంటఁ బడిన పగతుఁడు మనోజవము గలవాఁ డయినను, నూఁపిరితో మఱలి పోవఁజాలఁడు. అతిబలపరాక్రమశాలి యగు రాముఁ డిట్లు తమ్మునితోడ సమరమునఁ ద్రోయఁబడి నేలం బరుండి యున్నాఁ డనుట చూడఁగా, మేలుకీళ్ల నొసఁగుడి కాలమున కసాధ్యమగు విషయ మేదియు లేదనియు, దైవమును మీఱుట కెవ్వఁడును జాలఁడనియు నేఁ దలఁచెదను. ఇప్పుడు బలవంతు లగు రామలక్ష్మ

ణులంగూర్చియేని నన్నుఁ గూర్చియేని, నాతల్లిని గూర్చియేని నే నంతగ వగవను. దీనురా లగు నా యత్తగా రగు కౌసల్యాదేవింగూర్చి నేఁ గడుఁ జింతిల్లుచున్నాను. ఆమె, రాఘవుఁడు తండ్రి యాజ్ఞయొనర్చి, పిదప లక్ష్మణుని నన్నును దోడ్కొని యెప్పుడు వచ్చునా యని కాఁచుకొని యుండును" అని పలవించుచుండు సీతాదేవింగూర్చి త్రిజట యి ట్లనెను.

"ఓ సీతాదేవీ! నీవు వ్యసనము నొందకుము. ఇదిగో నీభర్త జీవించి యున్నాఁడు ఈ యన్నదమ్ము లగు రామలక్ష్మణులు సజీవులై యున్నా రనుటకుఁ దగిన గొప్పకారణము లున్నయవి. ప్రభువు మృతుఁ డయ్యెనేని యుద్ధభూమియందలి యోధుల మోము లిట్లు కోప సంతోషములతో నుండవు. ఓ వైదేహీ! వీ రిరువురు మృతినొందియున్నచో నీ పుష్పక విమానము నిన్నిట్లు వహింపఁజాలదు. మేటివీరుఁడు హతుఁ డయి, యుత్సాహ ప్రయత్నములు లేనిదైన సేన కర్ణధారుఁడులేని యోడ కైవడి దిక్కులేక తిరుగుచుండును, ఈవానరు లన్ననో, తత్తరపాటు విడిచి, దిగులులేక బలవంతు లయి జీవించియున్నారని నేను బ్రేమతోఁ జెప్పిన యారామలక్ష్మణులను కాపాడుచున్నారు. నీవు శుభసూచకము లైన యీయనుమానములచే రామలక్ష్మణులపాయము నొందకయున్నా రని తలంపుము. నేను నీయందలి ప్రేమచేత నింతదూరము చెప్పితిని. నే నింతకుమున్ను బొంకులాడినది లేదు. ఇఁకమీఁదను బొంకులాడను. నీ సుగుణసంపదంబట్టి, నాకు నీయం దెక్కువ మక్కువ గలిగెను. యుద్ధ రంగమున నీ రామలక్ష్మణులను గెల్వ నింద్రునితోఁగూడిన సురాసురుల కయిన నలవి కాదు. ఇట్టి సైన్యముల ముఖవికాసాదులం జూచి యీ సంగతిఁ దెలిపితిని. ఓ మైథిలి, మిగుల ముఖ్యమయిన యీగొప్పచిహ్న మును పరికించి చూడుము. వీరు స్మృతిఁ దప్పిపడియున్నను, వీరి కాంతి తఱుగకున్నది. తఱచుగా నిర్జీవు లైనవారికి ముఖములం దొక్క తెఱఁగు వికారము తోఁచుచుండును. ఓజానకీ! రామలక్ష్మణుల నిమిత్తమైన ముఖ వికారమును, వారివిషయమైన వేఱుతలఁపును, మనోవ్యథను బాయుము. వారు ప్రాణము లెడలినా రని చెప్పుటకు సాధ్యముకాదు" అని త్రిజట చెప్పఁగా దేవకన్యను బోలు సీతయు నాత్రిజట పలుకు లాలకించి, చేతులు జోడించి "యట్లై రామలక్ష్మణులు ప్రాణములతో నుందురుగాక" యని

చెప్పెను. అంతట రాక్షసకాంత లా త్రిజటతోడ సీత నశోకవనమునఁ బ్రవేశింపఁజేసిరి. సీతయుఁ బెక్కువృక్షములచే నలంకరింపఁబడిన రాక్షసేంద్రుని యుద్యాన భూమిం జొచ్చి రామలక్ష్మణులం దలఁచికొని యెక్కువ వ్యసనము నొందిన దాయెను.

49-వ సర్గము

రాముఁడు మూర్ఛదొఱఁగి లేచుట

కఠినమైన శరబంధముచేఁ గట్టఁబడి, శరతల్పమునఁ బరుండి సర్పముల మాడ్కి నిట్టూర్చుచున్న యా రామలక్ష్మణులను జుట్టుకొని బలవంతు లైన సుగ్రీవుఁడు మొదలగు వానరవీరు లందఱు దుఃఖసాగరమున మునిఁగినవారయి నిలువఁబడియుండిరి. అంతలోపల శూరుఁడగు రాముఁడు బాణములచేఁ గట్టఁబడినవాఁ డయ్యు ధైర్యశక్తులవలన మేల్కొనెను. తర్వాత రాముఁడు నెత్తుటఁ దడిసి, బాణములచేఁ జక్కఁగా నేయఁబడినందున నొచ్చినవాఁడై నెత్తుటఁ దడియుచున్న మోమునఁ గళలేనివాఁడగు లక్ష్మణుం జూచి మనమున విచారపడుచు ని ట్లనియె: ఈవిధముగా నా యనుంగుఁ దమ్ముఁడు యుద్ధమున నోటమిం బొంది, శరతల్పమునఁ బడియున్నాఁడుగదా! ఈ లక్ష్మణుం బోఁగొట్టుకొన్న పిదప నాకు సీతతో నేమి యుపయోగము? తుదకుఁ బ్రాణములతో నేమి యుపయోగము! మానవలోక మెల్ల వెదకియైనను సీతతో సమానురా లగు నాఁతిని బడయవచ్చును గాని, యుద్ధవీరుఁడును, నాకుఁ దోడ్పడువాఁడును నైన లక్ష్మణుంబోలు తమ్ముఁడు లభించునా? లక్ష్మణుఁడు ప్రాణములు విడిచియుండు నేని, ఈ వానరు లందఱు చూచుచుండ, నేనును బ్రాణములను దొఱఁగెదను. లక్ష్మణుంబాసి నేను మఱలి యయోధ్యాపురమునకుఁ బోయినప్పుడు నా తల్లియు, కైకయు, సుమిత్రయు నడిగిరేని, వారి కేమని బదు లిత్తును. బిడ్డను గానక, కంపమొందు నాఁడుఁ బిచ్చుకకైవడి మొఱలిడు సుమిత్రను నే నెట్లు సమాధానపఱతును? నాతోడ నడవికి వచ్చిన లక్ష్మణుం బోఁగొట్టికొని నే నొంటరిగాఁబోయి భరతశత్రుఘ్నుల కేమి సమాధానము చెప్పుదును? సుమిత్ర లక్ష్మణుని విడిచి యొంటిగాఁ బోయిన నన్నుఁ జూచి, "సీతోడ వచ్చిన నాపుత్రుని విడిచి వచ్చితివి గదా" యని నన్నుఁ దూరిన నెట్లోర్తును? కావున

నే నిచ్చటనే దేహముఁ దొఱఁగెదను. నే నిఁకఁ బ్రాణములతో నుండఁజాలను. నా నిమిత్తమై యీ లక్ష్మణుఁ డిట్లు పంచత్వ మొందిన వానికై వడి శరతల్పమందుఁ బరుండియున్నాఁడు. ఛీ, నే నెంత. ఎంత క్రూరుఁడను? పాపాత్ముఁడను? నేను బ్రాణములతో నుండుటకంటెఁ బ్రాణములఁ బాయుట మేలు. "ఓలక్ష్మణా! నీ వప్పుడప్పుడు దిగులొందినట్టి న న్నోదార్చుచుందువే? ఇప్పు డూఁపిరిలేని వాఁడ వగుటచే నిట్లు సంకటపడుచుందు న న్నోదార్పఁ జాలవైతివిగదా! తొల్లి యుద్ధరంగమునఁ బెక్కండ్రు రాక్షసులను బరిమార్చిన వీరుఁ డిప్పు డయ్యుద్ధభూమియందే శత్రు నిహతుఁడై పడియున్నవాఁడు. తన యొంటి రక్తమునఁ దోఁగి శరతల్పమునఁ బరుండి, బాణములు గ్రుచ్చుకొన్నందున స్మృతి దప్పినవాఁడై యుండుటఁజేసి యీ లక్ష్మణుం డిప్పుడు గ్రుంకుచుండు సూర్యునిమాడ్కిఁ గానవచ్చుచున్నాఁడు. ఈతని కాయపట్టులందు బాణములు తగిలియుండుటవలన నితఁడు మాటాడఁ జాలకున్నాఁడు. ఇతఁడు చెప్పకపోయినను, ఇతనిబాధ నీతని చూపే తెలుపుచున్నది. నేను వనమునకు వచ్చునప్పు డీలక్ష్మణుఁడు న న్నెట్లు వెంబడించి వచ్చెనో, యట్లె నేనును యమునివీటికిఁ జనుచుండు వీనిని వెంబడించి చనియెదను. ఎల్లప్పుడు బంధుజనములందుఁ బ్రేమగలవాఁడును నెల్లప్పుడు నన్ననుసరించియుండువాఁడును నైన లక్ష్మణుఁడు నీచుఁడ నైన నా యక్రమములచే నిప్పు డీ యవస్థపొందినవాఁడు. శూరుఁడయిన యీలక్ష్మణునికెంత పట్టరాని యాగ్రహము వచ్చినను, ఒకప్పుడైన నొక పరుసనిమాటకాని, వ్యత్యస్త మయిన పలుకుగాని యితని నోటి నుండి వెడలినదికాదు. తొల్లి కార్తవీర్యార్జునుఁడు వేయి చేతులుగలవాఁడగుటచే నొక్కమాఱుగ నే నూఱుబాణములను ప్రయోగించెను. ఈ లక్ష్మణుఁడు రెండు చేతులు గలవాఁ డయ్యు నంతకాలములోపల నాతనికంటె నెక్కుడు బాణములఁ బ్రయోగించువాఁడు గనుక నతనిని మించినవాఁడు; తన యస్త్రములచే నింద్రుని యస్త్రములను సైతముఁ బడఁగొట్టఁగల యీ లక్ష్మణుఁడు మేలి పాన్పునఁ బరుండఁ దగినవాఁ డయ్యు నిప్పుడు హతుఁడై నేలం బరుండియున్నవాఁడు. నేను విభీషణుని రాక్షసరాజ్యమున నుంచెద నని చెప్పియుండునట్టి నా పలుకు కల్ల

యయ్యెను. అట్టి సత్యము తప్పుట నా మనస్సును దహించుచున్నది. ఓ వానరేంద్రా! సుగ్రీవా! నీ విప్పుడ పయనమై కిష్కింధకుఁబోయి సుఖముగా నుండుము. నేను నా యనుఁగు దమ్మునిఁ బాసి ప్రాణములతో నుండనుగాన, నొంటరిగానుండు నిన్ను బలవంతుఁడైన రావణుఁ డెదుర్కొని సమరమున బరిమార్చును. నా నిమిత్తమై నీవును నేల ప్రాణములఁ దొఱఁగెదవు. సుగ్రీవా! యంగదుని ము న్నిడుకొని, నీల నలులు మొదలగు మిత్రులతోఁ గూడినవాఁడవై ససైన్యముగా సముద్రమును ధాఁటిపొమ్ము. హనుమంతుఁడును ఋక్షాధిపుఁ డగు జాంబవంతుఁడును, గోలాంగూలాధిపుఁ డగు గవాక్షుఁడును సమరమున నొనర్చిన యనన్యసాధ్యమైన కృత్యములఁ గూర్చి కడు ముద మందితిని. వీరేకాక యంగదుఁడును, మైందద్వివిదులును, కేసరియు, సంపాతియు బవరంబునఁ జూపఱకు గగుర్పా టొదవించు కృత్యము లొనరించిరి. మఱియు గజ గవయ శరభులును దక్కుంగల వానర వీరులును నా నిమిత్తమయి ప్రాణములమీఁది యాసయు మాని యుద్ధమున బహు సామర్థ్యముఁ జూపిరి. సుగ్రీవా! మనుష్యులు దైవమును మీఱఁ జాలుదురా? మన చేతనైనది మనము చేసితిమి. విధి విపరీతమైయుండఁగా మనకార్యము లనుకూలించునా? శత్రుభయంకరుఁడ వైనయో సుగ్రీవా! అధర్మమునకు వెఱచు నట్టి చెలికాఁడ వయిన నీ వొనరింపవలసిన పని యొనరించితివి. వానరశ్రేష్ఠులారా! మీరును శక్తిలోపము సేయక సాహాయ్యమొనర్చితిరి. ఇంక మీ రేమి చేయఁగలరు? మీ కనుజ్ఞ యొసంగితిని. యథేష్టముగాఁబోయి సుఖముండుఁడు" అని రాముఁ డతిదీనునివలె నా వానరులతో లక్ష్మణవియోగమువలని వ్యసనముఁ దెలిపెను.

వానరు లందఱు నా రాముని విలాపము నాలకించి, వ్యసనముచే నెఱ్ఱవాఱిన తమ నేత్రములనుండి కన్నీటిం దొఱఁగిరి. అంతలోపల విభీషణుఁడు సేనలనన్నింటిని నిల్పి, గదను జేతఁబట్టికొని వేగిరముగా నా రాముఁ డున్న ప్రదేశమున కేఁగుదెంచెను. అట్లు గదను జేతఁబట్టి కొని వేగముతో వచ్చునట్టి నల్లనికాటుకరాశింబోలు నావిభీషణుం జూచి

"ఇంద్రజిత్తే వచ్చుచున్నాఁడు" అని తలఁచినవారై వానరులు మూల మూలకుఁ బరుగులిడిరి.

50-వ సర్గము

గరుత్మంతుఁడు రామలక్ష్మణులను నాగపాశమునుండి విడిపించుట

అట్లు వానరులందఱు వెఱచి పరుగెత్తుచుండఁగా, మహాతేజో బలములు గలవాఁడయిన సుగ్రీవుఁడు పరుగెత్తుచుండు సేనంజూచి, "యేల యీసేన దిగులుపడినదై సముద్రమున సుడిగాలిచేఁ గొట్టఁబడిన యోడవలె నల్లాడుచున్నది ?" అని యడుగఁగా, వాలిపుత్రుఁడగు నంగదుఁడు సుగ్రీవునిమాటలను విని, "మహాబలశౌర్యవంతు లగు రామలక్ష్మణు లిద్దఱు బాణపుంజముచేఁ గట్టఁబడినవారలై, శరమయశయనమునఁ బరుండి యొడలంతయు నెత్తుటఁ దడిసియుండుట నీవు చూడలేదా?" యని బదులు చెప్పెను. ఆ యంగదుని పలుకు లాలించి సుగ్రీవుఁ డంగదుంజూచి, "అంగదా ! వానరు లిట్లు పరుగెత్తుట కిది గారణము గాదు. వేఱొక్క కారణ ముండవలెను. నిష్కారణముగా నిందఱు పరుగెత్తరు. వానరు చేతులం దున్న యాయుధములను గ్రింద బడవైచి, వ్యసనమును మోములందుఁ గనఁబఱచుచు, వెఱపుచేఁ గన్నుల విచ్చికొని పరుగెత్తు చున్నారు. వీ రొండొరులను జూచి సిగ్గుపడక, వెనుకవచ్చువారికై వేచియుండక తోడవచ్చువారి నీడ్చికొనిపోవుచుఁ దమతోడ రాఁజాలక క్రిందఁబడినవారిని దాఁటికొని వడిగాఁ బోవుచున్నారు అని చెప్పెను. ఇంతలోపల వీరుఁ డయిన విభీషణుఁడు చేతఁ గదఁ బట్టుకొని యేతెంచి, సుగ్రీవుని దీవించి, రామునిని జూచెను. సుగ్రీవుఁడును విభీషణుండు వచ్చుట కాంచి, వానరుల భీతి కితఁడే కారణ మని తలఁచినవాఁడై చేరువ నున్న ఋక్షరాజగు జాంబవంతునిఁగాంచి, "వానరు లితనింజూచి యింద్రజిత్తు వచ్చుచున్నాఁ డని భ్రమపడి, తత్తరపాటుచేఁ బరుగెత్తు చున్నారు. వచ్చినవాఁడు విభీషణుఁడు. నీవు వడిగా నేఁగి, మిక్కిలి వెఱపుచెంది మూలమూలలకుఁ బరుగెత్తుచున్న యీ వానరులను నిలిపి, "వచ్చినవాఁడు విభీషణుఁడుగాని యింద్రజిత్తు గాఁడు. దిగులు పడవలదు. రండు" అని చెప్పు మని యానతియ్యఁగా, జాంబవంతుఁడును సుగ్రీవుని యాజ్ఞగొని, ముందుకుఁ బరుగెత్తుచుండు వానరుల నడ్డగించి,

వచ్చువాఁడు విభీషణుఁ డనిచెప్పి వారిభయము బాపెను. ఆ వానరులును, జాంబవంతుని పలుకు లాలకించి, విభీషణుం బరికించి, దిగులుమాని మఱలివచ్చిరి.

ధర్మాత్ముఁడగు విభీషణుఁడును దేహ మాద్యంతమూ బాణములతో నిండియున్న రామలక్ష్మణులం జూచి, మనమున వ్యసనమునొంది, నీటఁ దడిపిన చేతితో నాతని నేత్రములఁ దుడిచి, వ్యసనమువలన మనమున నొచ్చినవాఁడై పెద్దపెట్టున నేడువఁదొడఁగెను. "ఈ రామలక్ష్మణులు దేహదార్ఢ్యమును, పౌరుషమును గలవారలు. యుద్ధమునం దపేక్షగలవారు. వా రట్టివా రయ్యును, వంచనతో యుద్ధము చేయువారగు రాక్షసులు వారి నిట్టి యవస్థ నొందించిరి. ఆ రాక్షసులందఱుగాక, వారిలో ముఖ్యముగాఁ జెడ్డవాఁడయిన నా యన్నయొక్క దుష్పుత్రుఁడు వంచనారూపమైన రాక్షసబుద్ధిచే న్యాయ్యముగా యుద్ధముచేయు వీరిని మోసపుచ్చెను. వీరు బాణములగాయములు హెచ్చుగాఁ దగులుటంజేసి, నెత్తుటఁదోఁగుచు నేలయందుఁబడి, భూమిపై నిద్రించు ములుపందుల మాడ్కిఁ గానఁబడుచున్నారు. ఎవరిపరాక్రమమున, నేను గొప్పకీర్తి నొందఁగోరితినో, ఆ యీ పురుషశ్రేష్ఠు లిద్దఱు మృతులకైవడి నిద్రించుచున్నారు. నాకు సహాయభూతుఁడయిన రాముఁ డిట్టిస్థితియం దుండుటచే, నేను బ్రాణములతోనుండి నాకంటె మించిన దాయతోడివైరము పెట్టుకొని యాపదనొందితిని. దానికిఁ దోడుగా రాజ్యాపేక్షయుఁ దొలఁగెను. నాశత్రువు తన పట్టినపట్టు నెఱవేర్చుకొనెను. ఆతనికోరికయు సిద్ధించెను.

ఇవ్విధమున విలపించుచుండు నా విభీషణునిఁ గౌఁగిలించికొని, వానరశ్రేష్ఠుఁడగు బలవంతుఁడైన సుగ్రీవుఁ డిట్లనియె: "ధర్మస్వరూపముల నెఱిఁగిన యోవిభీషణా! నీవు లంకాపురరాజ్యాధిపత్యము నొందఁగలవు. దీనికి సంశయము లేదు. రావణునికిఁగాని యతని పుత్రునకుఁగాని కోరికి నెఱవేఱఁజాలదు. ఈ రామలక్ష్మణు లిద్దఱికి నాగపాశబంధమునం జేసి ప్రాణహాని గలుగదు. వారు త్వరలోనే మూర్ఛవొఱంగి రావణాసురుని, అతని పుత్రమిత్రపరివారములను వధింపఁగలరు" అని యివ్విధమున సుగ్రీవుఁడు విభీషణుని మంచిమాటలచే నోదార్చి ప్రక్కన నిలఁబడియున్న తన మామగారగు సుషేణునివైపు దిరిగిచూచి "సుషేణా! శూరులైన

వానరవీరుల నందఱినిగూడఁ దీసికొని, శత్రుసంహారులగు నన్నదమ్ములు రామలక్ష్మణులు మేలుకొన్న వెంటనే వారిని మోసికొని కిష్కింధాపురమునకుఁ బోయిచేరుము. నేనో, రావణుని బంధుపరివారసమేతముగా సంహరించి యింద్రుఁడు పోఁగొట్టుకొన్న యైశ్వర్యలక్ష్మినిఁ బొందునట్లు, నేను సీతాదేవినిఁ దెచ్చెదను" అని పలుకఁగా, సుషేణుఁడును, కోఁతుల తేనిమాట యాలించి, "సుగ్రీవా! నే నింతకుమున్ను దేవాసురులకు జరిగిన భయంకరయుద్ధమును జూచియున్నాను. ఆ యుద్ధమున బాణప్రయోగలాఘవముగల దానవులు శస్త్రవేత్తలైన దేవతలను మాయలచేఁ గంటికిఁ గానఁబడనివారయి నొంచిరి. అప్పుడు దేవతలందఱు దానవబాణపాతపీడితులై మృతులమాడ్కి నేల కొఱఁగిరి. దేవగురువగు బృహస్పతి మంత్రవిద్యలచేతను ఓషధులచేతను వారిని బ్రదికించెను. ఇప్పు డా యోషధులను దెచ్చుటకై సంపాతి, పనసుఁడు మొదలగు వానరులను వడిగాఁ బాల్కడలికిఁ బంపవలయును. వారు పర్వతములందలి యోషధుల నెఱుఁగఁగలరు. మేటి కడలియగు పాల్కడలియందుఁ జంద్ర, ద్రోణములను పేళ్లుగల రెండు పర్వతములున్నవి. ఆ పర్వతములం దమృతమథనప్రదేశమున సంజీవకరణి, విశల్యకరణి యను రెండు మూలికలున్నవి. ఆ మూలికలను దెచ్చుటకై హనుమంతుని బంపుము." అని సుషేణుఁడు సుగ్రీవునితోఁ జెప్పెను.

ఇంతలోపల మెఱుఁగులతోఁగూడిన మెయిళులను జెదరఁగొట్టుచు, సముద్రజలముఁ గలఁచుచుఁ బుడమిఁ గదలించుచు నొక పెనుగాలి వీచె. బలిష్ఠమైన తెక్కల గాలికి లవణసముద్రమందలి దీవులయం దున్న పెక్కు గొప్ప మ్రాఁకులు కొమ్మలు విఱిగి, యడుగులతోఁ బెళ్లగిలినవై క్రిందఁగూలినవి. అచ్చటనుండు గొప్ప సర్పములును, జలజంతువులును వెఱచినవై వడిగా సముద్రములోపలికిఁ జొచ్చెను. తర్వాతఁ గొంతసేపటికి నాకాశమునుండి దిగి వచ్చునట్టివాఁడును, నగ్నిహోత్రునిమాడ్కిఁ బ్రజ్వరిల్లువాఁడును, బలవంతుఁడును నైన గరుత్మంతునిఁ జూచినంతటనే, భయపడి శరరూపముఁ దాల్చినవై యా నరోత్తములను గట్టియున్న పాములెల్లఁ బరుగెత్తినవి. అంతట గరుత్మంతుఁడు రామలక్ష్మణులంజూచి, వారిచే మన్ననఁ బడసినవాఁడయి, తన యిరు

గేలతోఁ జంద్రబింబముఁబోలెడి యా రామలక్ష్మణుల మొగములను దడవెను. వెంటనే యా రామలక్ష్మణుల శరీరములందలి గాయములు మాని, యొడళ్లు చక్కని వన్నెగలవియు,నున్ననివియు నాయెను. మఱియు వారికిఁ బ్రతాపము, శౌర్యము, బలము, కాంతి, యెక్కువ పూనికి, సూక్ష్మవిషయము నెఱుఁగఁ గల జ్ఞానము, జ్ఞాపకశక్తియు, వివేకమును రెట్టించెను. గరుడుఁడు దేవేంద్రుఁబోలెడి యా శూరులగు రామలక్ష్మణుల లేవఁదీసి కూర్చుండఁబెట్టి, సంతోషభరితులైన యా యిరువురిని గౌఁగిలించెను. అప్పుడు రాముఁడు గరుత్మంతునితో నిట్లనియె: "ఓ గరుత్మంతుఁడా! నీ యనుగ్రహమునంజేసి యింద్రజిత్తువలనఁ గలిగిన యాపద దొలఁగెను. మేము శ్రమయంతయుఁ దీఱి మున్నువోలె బలవంతుల మయితిమి. ఇప్పుడు నా తండ్రి యగు దశరథుని, పితామహుఁడైన యజునిఁ జూచినప్పుడు వలె నిన్నుఁ జూచినంతటనే సంతోషము నొందితిని. మేలిగందపుఁ బూత పూసికొని, నెత్తావిగల పూవులఁ దాల్చి, దివ్యాభరణ భూషితుఁడవై, నిర్మలవస్త్రములఁ గట్టి నా కెంతయు నీ వానందము గలిగించుచున్నావు. నీ వెవఁడవు తెలుపు." మని యడిగెను. తర్వాతఁ బక్షులకే డగు తేజోబలవంతుఁడైన గరుత్మంతుఁడు మనమున నుప్పొంగి, కన్నులనుండి యానందబాష్పములను విడుచుచు నతనితో నిట్లనియె. "కాకుత్స్థా! నేను నీకుఁ జెలికాఁడను. వెలుపటఁ దిరుగు ప్రాణ మనఁదగినవాఁడను. నన్ను గరుత్మంతుఁ డందురు. మీకు సాహ్య మొనరింపవచ్చితిని. మొనగాండ్రగు నసురులుగాని, బలవంతులగు దానవులుగాని, దేవేంద్రుఁడు మొదలగు దేవతలుగాని క్రూరపుఁ బనులొనరించు నింద్రజిత్తు మాయాబలముచే సృజించిన కడు భయంకరమైన యీ నాగపాశబంధమును విడిపింపఁజాలరు. ఈ నాగములు కద్రువకుఁ బుట్టినవి. వాఁడి కోఱలును, ఓర్వరాని విషమును గలవి. ఇయ్యవి యా రాక్షసుని మాయాబలముచే బాణములై మిమ్ముఁ జుట్టుకొనినవి. విడువని మగటిమి గలవాఁడా! ధర్మముల నెఱింగినవాఁడా! యుద్ధరంగమున శత్రువుల వధించునట్టి నీ తమ్ముఁ డగు లక్ష్మణుఁడును నీవును దైవముతోడ్పాటుగలవారు కావున మీ కెట్టి భయమును లేదు. మీ రిత్తెఱఁగున నాగపాశముచేఁ గట్టఁబడియున్న సంగతిఁ దెలిసి మీ

యందలి చెలిమినే మీకు సాహాయ్య మొనరింప వచ్చితిని. ఇప్పుడు నే నీ శరబంధమునుండి విడిపించితిని. మీ రెల్లప్పు డేమఱుపాటు లేకుండవలెను. యుద్ధరంగమున రాక్షసు లందఱు స్వాభావికముగా వంచకయుద్ధముఁ జేయువారు. మీరు శూరులరు; కపటము లేనివారలు. మీ కా నిష్కాపట్యమే బలము. కావున సమర ప్రదేశమున రాక్షసులను మీరు నమ్మవలదు. ఆ విషయమున కీ యింద్రజిత్తుచేసిన కార్యమే దృష్టాంతము. రాక్షసు లెల్లప్పుడు మోసముతోడనే ప్రవర్తించువారు, కావున మీరు వారివిషయమున జాగరూకతతో మెలఁగవలయును." అని బలవంతుఁడయిన గరుత్మంతుఁడు రామునితోఁ జెప్పి మంచి మనసుతోను, ప్రేమతోను నారామునిఁ గౌఁగిలించుకొని, చెలికాఁడా! ధర్మజ్ఞుఁడా! శత్రువులందును ప్రేమగలవాఁడా! రాఘవా! నాకు సెలవిండు, నేఁ బోయి వచ్చెదను. రామా! నా చెలిమినిఁగూర్చి తెలియ నపేక్షపడవలదు. వీరుఁడా! నీవు సమరమునఁ గార్యము నొనరించి, తర్వాత నా స్నేహము గూర్చి యెఱుఁగఁగలవు. లంకాపట్టణమును బాణముల గుంపులచే బాలవృద్ధులు మాత్రము మిగులునట్లు సేసి తక్కినవారి నందఱిని రావణుని వధించి సంతసమొందగలవు" అని మఱలఁజెప్పి, తన మగటిమిఁ జూపి, యా వానరుల మధ్యమున రాముని బాధలు లేనివానిఁగా నొనర్చి, రామునికిఁ బ్రదక్షిణముగావించి, యాలింగనము చేసికొని యాకాశమున కెగిరి వాయుదేవునిచందమునఁ బాఱెను.

తర్వాత వానరులు రామలక్ష్మణు లెప్పటియట్లు నెమ్మదినొందఁగాఁ జూచి, యప్పుడే సింహనాదములు సేసి, తోఁకలను విదిలించి, భేరీవాద్యములను గోలలతోఁ గొట్టుచు; మృదంగములను వాయించుచు సంతసము మీఱ శంఖములఁ బూరించి ముందువలెఁ గిలకిల ధ్వనులొనరించిరి. వృక్షములతో యుద్ధము సేయునట్టి వానరులు పౌరుషము పూనినవారై తమచేతులను జఱచి చఱచి పెక్కు వృక్షములను బెకలించి చేతులం దుంచుకొని యుద్ధసన్నద్ధులై, పెడబొబ్బలిడి రాక్షసులను వెఱపించుచు, గంతులు వేయుచు యుద్ధముసేయఁ గోరి లంకాపురద్వారములఁ జేరిరి. అట్లు వానరవీరులు పురద్వారములకడఁ జేరి నడురేయి

చేయునట్టి సింహనాదములు వర్షర్త్వారంభమున జలదములు సేయు నుఱు ముల చందమున నతిభీకరములై యుండెను.

51-వ సర్గము

ధూమ్రాక్షుఁడు యుద్ధమునకు వచ్చుట

అప్పుడు రావణుఁడు రాక్షససమేతుఁడై యఱచుచున్న బలవంతు లగు నా వానరులయొక్క కడు భయంకరమైన నాదమును వినెను. అట్లు రావణుఁడు మిక్కిలి దట్టమై గంభీరమైన యా నాదమును విని, మంత్రుల నడుమఁ గూర్చుండి "సచివులారా! ఉఱుముచున్న పెక్కు మేఘముల యుఱుములకై వడి సంతుష్టులైన పెక్కండ్రు వానరుల గొప్ప యఱపు వినంబడుటచేఁ దప్పక వారికెద్దియో గొప్ప యానందము గలిగి న ట్లున్నది. దీనికి సందియము లేదు. అంతియకాక, సముద్రము సహిత మాగొప్ప ధ్వనులచేఁ గలఁతపడుచున్నది. తోఁబుట్టువు లగు రామలక్ష్మణు లన్ననో వాఁడియమ్ములచేఁ గట్టఁబడిరి. వానరు లన్ననో కడు గొప్ప నాదము గావించుచున్నారు. ఈ కడు గొప్ప నాదము నాకు సందియము గలిగించుచున్నయది." అని చెప్పి, చేరువ నిల్చియున్న మంత్రుల నందఱం జూచి "యీ యందఱు వానరులు వగవవలసిన తరుణమున నిట్లు సంతోష పడుటకుఁ గారణమేమియో వేగ తెలిసికొనుఁడు" అని తన మంత్రుల కానతీయఁగా, వెఱచినవా రయి వారు త్వరపాటుతో నేఁగి ప్రాకార మెక్కి, సుగ్రీవుని యధీనతయం దున్న గొప్పసేనను, మిగుల భయంకర మయిన నాగపాశమునుండి విడువఁబడినవారలై లేచి నిల్చియున్న మహా వీరు లగు రామలక్ష్మణులను జూచి వగగూఱి, మనస్సులం దదురుపాటు నొందుచు, మోములు దిగజార్చుకొని, రాక్షసాధిపునికడ కేతెంచి, "రాక్షసేంద్రా! యుద్ధరంగమున నింద్రజిత్తుచే నాగపాశ బద్ధులై, బాహువు లాడకుండునట్లు చేయఁబడిన యా మదపుటేనుఁగుంబోలు విక్రమముగల రామలక్ష్మణు లిద్దఱు నేనుఁగులు కట్టుగొలుసులఁ ద్రెంచు కొని లేచునట్లు శరబంధమునుండి విడిపించుకొన్నవారుగఁ గనఁబడు చున్నారు." అని రావణునకు విన్నవించిరి.

కడు బలిమిగల యా రాక్షసవీరుఁ డా రాక్షసుల మాటలను విని, విచారశోకములతోఁ గూడినవాఁడై, మొగమున వగపు దోఁప

ని ట్లనియె. "ఇంద్రజిత్తు వరమువలనఁ బడసినవియు, పాములం బోలు నవియు, సూర్యునిమాడ్కిఁ దేజరిల్లునవియు నైనందున భయంకరములును, వ్యర్థములు గానివియు నైన యమ్ములతో నా రామలక్ష్మణులను యుద్ధరంగమున బలాత్కారముతోఁ గట్టివేసెను. అట్టి యస్త్రబంధము నుండియే నా పగతురు విడిపించుకొనియున్నచో నీ రాక్షసబలమంతయు ప్రాణసంశయము నొందినదనియే చెప్పవలసియున్నది. ఇంతకుమున్ను పెక్కుమాఱులు నా పగతుర ప్రాణములఁ గైకొనినట్టి వాసుకివలె వెలుఁగునట్టి నాగమయ బాణములు నిరుపయోగము లయ్యెఁగదా!" యని రావణాసురుఁడు బుసకొట్టు పాముమాడ్కి నిట్టూర్పువిడిచి, రాక్షసుల మధ్యమున నున్న ధూమ్రాక్షునిఁ బిలిచి "భయంకర మగు మగఁటిమిగల యో ధూమ్రాక్షా! గొప్ప సేనను దోడ్కొని, రాముని, వాని యను చరులతో సమేతముగా వధింప నెదుర్కొనుము" అని యానతిచ్చెను.

బుద్ధిశాలి యగు రాక్షసాధిపుఁ డయిన రావణుం డానతియ్యఁగా, ధూమ్రాక్షుఁడు నమస్కారమొనర్చి, గగుర్పాటొంది, రాచనగరునుండి వెలువడివచ్చి, యానగరు వెలుపటి కేతెంచి, సేనాధిపతిం జూచి "యుద్ధము చేయఁగోరుచున్న నా కేల జాగు? సేనను వేగ సన్నాహము సేయుం పుము" అని యానతిచ్చెను. సేనాసమేతుఁ డయిన సైన్యాధిపతియు రావణుని యాజ్ఞవలనఁ జెప్పిన యా ధూమ్రాక్షుని పలుకులు విని సైన్యమును సిద్ధపఱచెను. బలిమికాండ్రును, భీకరరూపములు గలవారును నైన రాక్షసవీరులు గంటలను గట్టుకొనినవారలై, శూలములు, గదలు, దుడ్డుకఱ్ఱలు, ఇనుపదండములు, రోఁకళ్లు, ఇనుపగుదియలు, భిండివాల ములు, ఇనుపయమ్ములు, ఈఁటెలు, గండ్రగొడ్డళ్లు మొదలగు సకలా యుధములఁ దాల్చినవారై యన్ని దెసలనుండి మొయిళుల మొత్తమ్ము లుఱుములతో వెడలునట్లు నగరము విడిచి వెడలిరి. కవచములఁ దొడిఁ గిన కొందఱు టెక్కెములు గట్టినవియు, బంగారపు టలంకారములు గలవియు, పలు తెఱఁగులైన మోములు గలవియునైన గార్దభములు గట్టిన రథములమీఁదను, మఱికొందఱు మదించిన యేనుఁగుల మీఁదను, మఱికొందఱు వడిగల గుఱ్ఱములమీఁదను గూర్చుండి బెబ్బులుల చంద మున నొరులచే నోర్వరాని వారలయి సమరమునకుఁ దఱలిరి. అంతట

నెక్కువ మగటిమియు, భీకరధ్వనియుఁ గల ధూమ్రాక్షుఁడు తోఁడేళ్లయు సింహములయు మోరలఁబోలు మోరలుగలవియు, స్వర్ణ భూషణాలంకృతములు నయిన గర్దభములు పూన్చినదియు, నెక్కువధ్వనిఁ గలదియునైన మేటియరదమెక్కి, యట్టహాసముచేయుచు, హనుమంతుఁ డున్న లంకాపురంపుఁ బడమటిద్వారమునుగూర్చి పోయెను.

శత్రువులకు భయముగావించు శౌర్యము గలవాఁడును, తరలి ఘోరస్వరూపము గలవాఁడునైన యాధూమ్రాక్షుని నాకాశమున సంచరించునట్టి గొప్పపక్షులు యుద్ధమునకుఁ బో వలదని నివారించినవి. కడు గొప్పదైన గ్రద్దయొక్కటి యాధూమ్రాక్షుని రథముమీఁద వ్రాలెను. శవములఁ దినునట్టి పెక్కుపక్షులు ఎక్కెపుఁ గొనయందుఁ గూర్చుండెను. నెత్తుటఁ దడిసినదియు కడుఁ దెల్లనిదియునైన మొండెమొక్కటి వెఱికూఁతకూయుచు ధూమ్రాక్షుని చేరువఁబడెను. నెత్తురువాన గురిసెను. పుడమి యదరెను. పిడుగుపడునప్పుడు గలుగునట్టి ధ్వనితో నెదురుగాలి వీచెను. చీఁకట్లు క్రమ్మి దిక్కులు వెలుఁగవయ్యె. ధూమ్రాక్షుఁడు రాక్షసులకు భయము గలిగించెడి యపశకునములు సంభవించుట చూచి వ్యసనమొందెను. ధూమ్రాక్షుని ముందు నడచునట్టి రాక్షస భటులందఱు మూర్ఛిల్లిరి. అంతట శత్రువులకు భయంకరుఁ డైన బలిమికాఁ డగు ధూమ్రాక్షుఁడు పెక్కండ్రు రాక్షసులతోఁ గూడినవాఁడై, యుద్ధమందలి యుమ్మలికతోఁ బురము వెడలి వచ్చి, రాఘవుని బాహువులచే రక్షింపఁబడుచున్న మహాప్రవాహముఁబోలు గొప్ప వానరసైన్యమును జూచెను.

52-వ సర్గము

ధూమ్రాక్షుఁడు చచ్చుట

అత్తెఱఁగున యుద్ధాపేక్షతో వచ్చునట్టి భీకరపరాక్రమము గల ధూమ్రాక్షునిఁ గాంచి, వానరు లందఱు మనములందు వేడ్క మీఱ యుద్ధమునం దాశగలవారై గొప్ప సింహనాదములను గావించిరి. అట్లు వానరరాక్షసులు వృక్షములతోను, శూలములు, రోఁకళ్లు, గుదియలు, శూలములు మొదలగు నానావిధములైన యాయుధములతోను నొండొరులఁ గొట్టుకొనుచు నిట్టిదని చెప్ప వీలుగాని గొప్పయుద్ధము చేసిరి.

భయంకరు లగు రాక్షసులు వానరులను ఘోరాస్త్రములతో మర్దించిరి. వానరులు రాక్షసులను వృక్షములతో నేలఁ గలిపిరి. రాక్షసులును గట్టలుకఁబూని, భయంకరములును, గ్రద్ద ఱెక్కలు గట్టినవియు నైన కఱకుబాణములచే నా వానరులను మర్దించిరి. ఆవానరులును రాక్షసులచే భీకరము లగు గుదియలతోను, అడ్డకత్తులతోను, సమ్మెటలతోను, గుదియలతోను జీల్పఁబడినవార లయ్యు, రోషమువలన నుత్సాహవంతులై నిర్భయులచందమునఁ బోరు సలుపుచుండిరి, వానర యూథపాలురు శూలములచేతను, శరములచేతను రాక్షసులచేఁ గొట్టఁబడినవా రయి, యచ్చటనున్న ఱాలను జెట్లను గైకొనిరి. హెచ్చు వేగము గల యవ్వానరు లచ్చటచ్చట సింహనాదము లొనరించుచు, శత్రువులకు దిగులు పుట్టించు రాక్షసుల ననేకులను సంహరించుచుఁ దమపేరులఁ జెప్పికొనిరి. పెక్కు టడిదములతోను, పలుఱాలు అప్పలతోను మ్రాఁకులతోను గయ్యమొనరించు నవ్వానర రాక్షసులకు ఘోర యుద్ధము నడచెను. జయశాలు రగు వానరులు గొందఱు రాక్షసులను నలఁగఁగొట్టిరి. కొందఱు నల్లద్రావుళ్లు నోళ్లనుండి నెత్తురు గ్రక్కునట్లు బాగుగా గ్రుద్దిరి. కొందఱు రక్కసులను బ్రక్కలు చెదికిరి. కొందఱిని వృక్షములతోఁగొట్టి రాసులుగాఁ జేసిరి. కొందఱిని ఱాలతోఁ బొడిచేసిరి. కొందఱిని గోఱలతోఁ బీఁకిరి. వానరులచే ఱాలతోఁ దుత్తునియలు సేయఁబడిన ధ్వజములతోను, పడఁగొట్టఁబడిన గార్దభముల తోను, విఱిచి ప్రోవుపెట్టఁబడిన రథములతోను, నేలఁ గూలిన రాక్షస వీరులతోను, పర్వతాకారములగు నేనుఁగులతోను రౌతులతోడఁ గ్రిందఁ ద్రొయఁబడిన యశ్వములతోను గూడినదై యా యుద్ధభూమి వెలయుచుండెను.

మఱియు నోర్వరాని శౌర్యము గల వానరు లుత్సాహము పూని యెగిరి యెగిరి యారాక్షసుల మోములను దమవాఁడిగోళ్లతోఁ జీల్పఁగా, నారక్కసులు మొగములందుఁ గళలేనివా రయి, జుట్టు విఱియఁబోసి కొని, నెత్తురుకంపున కోర్వఁజాలక నేలఁగూలిరి. కొందఱు రాక్షసులా వానరులతోడి పోరున కెక్కువక్రోధమూనినవా రయి, గొప్పయఱపులఱచుచు వజ్రాయుధమువలెఁ గఠినములైన తమ యఱచేతులతో నా

వానరుల నప్పళించుచు నవ్వానరుల నెదుర్కొని తఱిమిరి. అవ్విధముగాఁ దమ్ముఁ దరుమవచ్చిన రాక్షసులను గడు బల్మికాంక్షయిన వానరు లుత్సాహము పూని రాక్షసులను బిడికిళ్లతో గుద్దుచుఁ గాళ్లతోఁ గ్రుమ్ముచుఁ, బండ్లతోఁ బీఁకుచుఁ జెట్లతో మోదుచు నానావిధముల హింసింపఁగా, నా రాక్షసు లా వానరుల తన్నుల కాఁగఁజాలక పరుగు లెత్తిరి.

రాక్షసవీరుఁ డగు ధూమ్రాక్షుఁడు తన సైన్యము పాఱిపోవుట చూచి, కినుక పూని యుద్ధకుతూహలము గల యా వానరులను హింసింపఁ దొడఁగెను. ధూమ్రాక్షుఁ డట్లు తలఁచి, వానరులలోఁ గొందఱిని బ్రాసము లనెడి యాయుధములతోను, మఱికొందఱిని గుదియల తోను బొడువఁగా, నోట రక్తము గ్రక్కుచుఁ గ్రిందఁ బడిరి. కొందఱి నినుపగుదియలతోను, కొందఱిని విడిచివాటు గుదియలతోను, కొంద ఱిని నడ్డకత్తులతోను వ్రేయఁగా, నావానరులందఱు స్మృతిఁ దప్పి నేలఁ గూలి, ప్రాణములను దొఱఁగిరి. కొందఱు కపులను మొనవాలులతోఁ బొడువఁగా, వారు నెత్తుటఁ దొప్పఁ దోఁగిరి. మఱికొందఱు వానరులు పరుగిడిరి. మఱికొందఱు బలవంతు లగు రాక్షసులతో యుద్ధము సేయఁ జాలక రాక్షసులకుఁ దగులక యగపడకపోయిరి. కొందఱిని ప్రక్కలం బొడుచుటచే, వారిహృదయములు చీలినవి. కొందఱిని త్రిశూలము లతోఁ బొడువఁగా, వారి ప్రేఁగులు వెలుపలికి వచ్చెను. వానర రాక్ష సుల యాభయంకరయుద్ధసంకులము గొప్పధ్వనులు పిక్కటిల్ల, ఱాలును మ్రాకులును గలదై యెక్కువ ప్రకాశించెను. విండ్లనారు లనెడు తంత్రుల చేత మధురమయినదియు ఎక్కిళ్లు తాళములుగాఁ గలదియు, హీనస్వరము లయినమాటలు గీతములుగాఁ గలదియు నగు నాయుద్ధమనెడి సంగీతకము మిక్కిలి యొప్పారెను. ఆధూమ్రాక్షుఁ డట్టి యుద్ధమున వింటిని జేతఁ దాల్చి, నవ్వులు నవ్వుచు బాణవర్షముఁ గురిపించి, వానరులను దిక్కు దిక్కులకుఁ బాఱునట్లు చేసెను. వానరసైన్యము ధూమ్రాక్షునిచేఁ బీడింపఁబడినదై, వగచుటం జూచి, హనుమంతుఁడు కనలి యొక్క పెను ఱాతి నెత్తుకొని యాధూమ్రాక్షునిమీఁదికిఁ గవిసెను. అట్లు కవిసి కోపముచేఁ గడు నెఱ్ఱవైన కన్నులు గలవాఁడై తండ్రిని బోలెడు పరా

క్రమము గలవాఁ డగుటంజేసి ధైర్యముతో నా శిల నా ధూమ్రాక్షుని యరదముపై నేసెను. అవ్విధమునఁ దనపైకి వచ్చుచుండు బండను జూచి, యా ధూమ్రాక్షుఁడు సత్వరముగ గదను జేతఁ బూని, రథమునుండి తటాలున దుమికి క్రింద నిలఁబడెను. ఆ హనుమంతుం డేసిన శిల యా ధూమ్రాక్షుని రథమును నొగలు, చక్రములు, ధ్వజములు, విల్లు, గుఱ్ఱములు మున్నగువానితోఁ గూడ దుత్తునియలు సేసెను. వాయుపుత్త్రుఁ డగు హనుమంతుఁడు దాను ప్రయోగించిన బండతో నతని యరదము నట్లు విఱిచి, పెక్కుచెట్లను నమగుతోడఁ బెల్లగించి, వానితో నా ధూమ్రాక్షుని సైన్యమును ధ్వంసము చేసెను. రాక్షసు లా హనుమంతుని మ్రాఁకుల యేటులకుఁ దలలు పగులఁగా నెత్తుటఁ దడిసి, మిగుల నొచ్చిన వారలై నేలం గూలిరి. అవ్విధముగా నాంజనేయుఁడు రాక్షస సైన్యము నుగ్గుసేసి, యొక పర్వతాగ్రము నెక్కొని యా ధూమ్రాక్షుని మీఁదికిఁ గవిసెను. మొనగాఁ డగు ధూమ్రాక్షుండును దనపైకి వచ్చునట్టి యా హనుమంతునిఁ జూచి, ఱొప్పుచు నాతని మీఁదికిఁ గవిసెను. అట్లు కదిసి ధూమ్రాక్షుఁ డలిగి, పెక్కుముండ్లు గల గదను ద్రిప్పి యా హనుమంతుని తలపై వేగిరముగా నేసెను. హనుమంతుని కా గద బాగుగాఁ దాఁకెను గాని, యతండు దానిని లక్ష్యపెట్టక ధూమ్రాక్షుని తలపై నాపర్వతశిఖరము నేయఁగా, నాతఁడు వివశము లయిన యవయవములతో శిథిలమయి చెదరిపడిన పర్వతము కైవడిఁ గ్రిందఁ గూలెను. ధూమ్రాక్షుఁడు హతుఁడు గాఁగాఁ దక్కిన రాక్షసు లందఱు వానరులచే దెబ్బలు దినుచు, వెఱపు చెంది, మఱల లంకలోపలఁ బ్రవేశించిరి. ఆవాయునందనుఁ డన్ననో శత్రువును వధించి, రక్తనదులను బాఱించి, శత్రువును వధించుటచే నలసట నొందినవాఁడై వానరులచేఁ గొనియాడఁబడుచు నెక్కువ మోదమును జెందెను.

53-వ సర్గము

వజ్రదంష్ట్రుండు యుద్ధమునకు వచ్చుట

రాక్షసరాజగు రావణుండు ధూమ్రాక్షుండు మడిసె నన్న మాట విని యెక్కువ కోపము నూని పాముపలె బుసకొట్టుచు, శూరుండును, బలవంతుఁడు నైన వజ్రదంష్ట్రుఁ డనువానిని జూచి, "ఓరీ! నీవు

పెక్కురు రాక్షసులతోఁ గూడినవాఁడవై యుద్ధమునకుఁ బోయి, రామ లక్ష్మణులను సుగ్రీవుఁడు మొదలగు వానరులను సంహరించి ర"మ్మని యానతియ్యఁగా, జిత్తులమారి యగు వజ్రదంష్ట్రుఁ డట్లె యని రాక్షస రాజుతోఁ బలికి, పెక్కుసేనలం దోడ్కొని, ఖరోష్ట్రాశ్వగజములతోఁ గూడి, పెక్కేములు గట్టిన యరదముమీఁదఁ గూర్చుండి వింత లైన భుజకీర్తులు శిరోభూషణములు ధరించిన వాఁడై, కవచముఁ దొడిగి, వింటిని గైకొని యా వానరసైన్యము మీఁదికి బయనమై, పసిఁడిచేఁ గైసేయఁ బడి వెలుఁగుచున్న రథమునకుఁ బ్రదక్షిణముగావించి యా దానిమీఁద నెక్కి పయన మయ్యెను. ఆతనివెంబడిఁ బెక్కండ్రు రాక్షసులు దుడ్డుకఱ్ఱలు, తోమరములు, వింతలైన శూలములు, రోఁకళ్లు, విడిచివాటుగుదియలు, శక్తులు, గుదియలు, పట్టసములు, ఖడ్గములు, చక్రములు, గదలు మొదలగు నాయుధములను ధరించినవారై, చిత్ర వస్త్రములనుగట్టి, పెక్కువిధముల శోభిల్లుచు నతనిని వెంబడించిరి. తోమరాంకుశములను ధరించినవా రైన మావ టీండ్రెక్కి తోలునట్టి మదించిన యేనుఁగులు గదలుచున్న పర్వతములో యన నొప్పుచుండెను. మఱియుఁ బెక్కండ్రు శూరులైన బలవంతులును మహావీరులును రథములమీఁదఁ గూర్చుండి యుద్ధములకుఁ దఱలిరి. అవ్విధముగాఁ దఱలిన యాసేన వర్షాకాలమున నుఱుములు మెఱుములతోఁగూడిన మేఘముల మాడ్కిఁ బ్రకాశించెను. అవ్విధముగా వజ్రదంష్ట్రుం డంగదుం డుండు నట్టి దక్షిణ దిశ కేతెంచెను. వారు బయలుదేరి వచ్చునప్పుడు పెక్కులవశకునములు గలిగెను.

నిర్మల మైన యాకాశమునుండి తీక్ష్ణము లైన ఉల్కలు పడెను. నక్కలు తమ నోటినుండి అగ్నిజ్వాలలు గ్రక్కుచు భయంకరముగాఁ గూసినవి. ఘోరమృగములు రాక్షసులకుఁ జేటు సంభవించె నని తెల్పునట్లు లార్చినవి. భటులును యుద్ధమునకు వచ్చుచు భయముచేఁ గ్రిందు మీఁదు లెఱుఁగక ముందుకుఁ బడిరి. మహాబలుం డగు ప్రతాపశాలి యైన వజ్రదంష్ట్రుఁ డీ యపశకునములం గాంచియు, ధైర్యమూని, యుద్ధమునందలి యుత్సాహముతో సమరాంగణమునకుఁ బోయెను. అ విధమున వచ్చు నా వజ్రదంష్ట్రుఁడు మొదలగు రాక్షసులం గాంచి,

పదిదెసలును మాఱుమ్రోఁగునట్లు వానరులు గొప్ప సింహనాదములు గావించిరి. తర్వాత నొండొరులను వధింపఁ గోరునట్టి భయంకరరూపము గలవార లగు భీకరులైన యా వానర రాక్షసులకు గొప్పయుద్ధ మారంభ మయ్యెను. అట్లుభయపక్షముల వారును గడువేడ్కతో యుద్ధ మారంభించి పోరునప్పుడు దేహములు చీలి, మెడలు విఱిగి రక్తమున దొప్పఁదోఁగిన యన్ని యంగములతోఁ గూడినవారలై, భూతలమునఁ బడిరి. యుద్ధములం దొరులకు వెఱవని వార లగు కొందఱు శూరు లైన వానర రాక్షసులు మ్రాఁకులును గుదియలును జేతులఁ బూని పలుతెఱఁగు లైన యస్త్రములను బ్రయోగించి పోరిరి. వా రట్లొండొరులమీఁద నేసికొన్న మ్రాఁకులయు, తాలయు, ఆయుధములయు గొప్పధ్వని గడు గొప్పదై హృదయభేదకమయినదిగా నుండెను. రథనేమిధ్వనియు, విండ్లనారుల మ్రోఁతలును, శంఖభేరీమృదంగముల ధ్వనులును నేక మయి వీనులు బ్రద్దలగునట్లు చెలరేఁగెను. తర్వాత కొంద ఱవ్విధముగా నస్త్రయుద్ధముచేసి, పిదప మల్లయుద్ధమునకుఁ బూని యఱచేతులతో నప్పళించుచుఁ గాళ్లతోఁ గ్రుమ్ముచుఁ బిడికిళ్లతో గ్రుద్దుచుఁ జెట్లతో బాదుచు, మోకాళ్లతోఁ బొడుచుచు రాక్షసుల దేహములను వ్రయ్యలు సేయఁగా, వారు నేలఁగూలిరి. యుద్ధమున నోర్వరాని గర్వము గలవా రగు వానరులు కొందఱు రాక్షసులను తాలతోఁ బొడిసేసిరి. వజ్రదంష్ట్రుడును సమరమునఁ దన బాణములచే వానరులను గడు వెఱపించుచు లోకసంహారము నిమిత్తమై పాశ మను నాయుధమును జేతఁబూనిన యమునిచందమునఁ గానఁబడెను. బలముగలవారును, అస్త్రముల ప్రయోగోపసంహారముల నెఱిఁగినవారును నైన రాక్షసు లాగ్రహము పూని, వివిధాయుధములతో వానరసేనలను బాగుగ మర్దించిరి. అవ్విధముగాఁ దమ్ముఁ గొట్టుచున్న యారాక్షసుల నందఱిని జూచి, యంగదుఁ డినుమడించిన యాగ్రహ మూని, ప్రలయకాలాగ్నిహోత్రునిమాడ్కి జ్వలించుచుఁ గన్ను లెఱ్ఱనచేసి, సింహమల్పమృగములను జంపు చందమునఁ జెట్టొక్కటిఁ గైకొని దానితో రాక్షసుల నందఱిని జంపి, యింద్రునితో సాటియయిన పరాక్రముగల యాతఁడు పెక్కండ్రను

జమునివీటి కనిచెను. అప్పుడు విఱిగిన రథాశ్వధ్వజములతోను, చిత్రము లైన వానరరాక్షసుల కళేబరములతోను, హారములు, భుజకీర్తులు వస్త్రములు మున్నగువానితోను గూడిన యాయుద్ధభూమి రక్తావృత మయి చూపఱకు గగ్గురుపాటు గలిగించుచు శరదృతువునందలి వెన్నెల చందమున విరాజిల్లుచుండెను. అంగదుని బలమున కోర్వఁజాలని యా రాక్షసబలము గాలికిఁ జెదరు మేఘముమాడ్కి నప్పుడా యుద్ధభూమి యందుఁ గడగడ వణఁకెను.

54-వ సర్గము

వజ్రదంష్ట్రుఁ డంగదునిచే నిహతుఁ డగుట

ఎక్కువ బలిమికాఁ డగు వజ్రదంష్ట్రుఁడు తనసేన క్షీణించుట చేతను, అంగదుఁడు జయించుచుండుటచేతను గడు రోషము పూనిన వాఁడై, ఘోరమైన వింటినారిని మీటి, పిడుగువంటి యా నారి మ్రోఁతచే వానరుల నందఱిని వెఱపించి; యా వానరుల మీఁద బాణ వర్షముఁ గురిపించెను. శూరు లగు ప్రధానరాక్షసులును రథములందుఁ గూర్చుండి సకలాయుధములను గైకొని యుద్ధముచేయఁ దొడఁగిరి. వానరులలో గొప్పవారును, ఱాలను దీసికొని, యన్నివైపులఁ జుట్టు కొని యుద్ధము చేసిరి. అట్లు వానర రాక్షసులకు ఘోరయుద్ధము జరుగు సమయమున రాక్షసులు వానరవీరులమీఁదఁ బెక్కాయుధములను ప్రయోగించిరి. గొప్పశూరు లగు మదపు టేనుఁగులంబోలు వానర వీరులును రాక్షసులమీఁదఁ బర్వతములను, వృక్షములను గొప్ప బండ లను నేసిరి. యుద్ధమునఁ బిఱుఁదివియక పోరాడునేర్పు గలవారలైన శూరులగు వానర రాక్షసవీరులు గొప్పయుద్ధము గావించిరి. కొందఱు వానరులును రాక్షసులును తలలు చీలి, కాళ్లు చేతులు విఱిగి బాణ ములు నెఱయఁగాఁడిన యొడళ్లతో నెత్తుటఁ దడిసిన మేనులు గల వారలై, పుడమిమీఁదఁ బడి, రాపులుఁగులు, గ్రద్దలు, కాకులు, నక్క లును జుట్టు మూఁగియుండఁగా యుద్ధభూమియందుఁ బడియుండిరి. భీరువు లగు కొందఱికి భయముకలుగునట్లు మొండెములు పైకెగిరెను. కొందఱు వానరులును రాక్షసులును భుజములు, హస్తములు, శిరస్సులు దెగిన

వా రయి, దేహములం దంతట గాయములు గలవా రయి యుద్ధ రంగము మధ్యమునఁ గూలిరి.

అవ్విధముగా యుద్ధము జరుగునప్పుడు వజ్రదంష్ట్రుఁడు చూచు చుండ నాతని రాక్షససేన వానర సేనలచే లెస్సగా మర్దింపఁబడి యా వానరసేన తాకుఁడు నోర్వఁజాలక పరుగిడఁ జొచ్చెను. అవ్విధమున రాక్షసాధిపుఁడు వానరులచె దన్నఁబడి, భయముచే వణఁకుచు బరు గెత్తుచుండు రాక్షసులను జూచి, రోషముచే గన్ను లెఱ్ఱనచేసినవాఁడై వింటిని జళిపించి, వానర వీరులను వెఱపించుచు, యుద్ధరంగమునకు వచ్చి, కంకపత్రములు గలవియు సూటిగాఁ బోవునవియు నైన బాణ ముల నేయుచు, నొక్కొక్క బాణపు టేటునకు నైదేసి, యాఱుగు రేసి, యేడుగు రేసి, యెనమండుగు రేసి, తొమ్మండుగు రేసి వానరులను బడఁ గొట్టెను. వానరు లందఱు మెడలు తెగినవారయి వెఱపు చెంది, ప్రజా పతి నాశ్రయించినట్లు లంగదు నాశ్రయించిరి. అట్లు వచ్చుచున్న వానరు లను జూచుచున్న వజ్రదంష్ట్రుని గని యంగదుఁ డాగ్రహపరవశుఁడై యుద్ధమునకు వచ్చెను. అప్పుడు వజ్రదంష్ట్రాంగదు లిరువురు సింహ మద గజేంద్రముల కైవడిఁ బైకొని పట్టరాని కోపము పొందినవారలై యా యుద్ధభూమియందుఁ బోరాడఁజొచ్చిరి. అంత నావజ్రదంష్ట్రుఁ డంగదుని మీఁద వేయి బాణములఁ బ్రయోగించి, యేనుఁగును బల్లెములతోఁ బొడుచునట్లుగా నాయంగదుని నాయపట్టులందుఁ దగులనాటెను. భీమ పరాక్రమ బలములు గలవాఁ డగు నంగదుఁడు నెత్తుటఁ దడిసిన మేను గల వాఁడై, యా వజ్రదంష్ట్రుని మీఁద వృక్షము నేసెను. ఆ వజ్రదంష్ట్రుఁ డును దనపైకి వచ్చుచుండు నావృక్షమును జూచి, తత్తరపాటు నొందక పెక్కు తుత్తునియలు సేయఁగా నా వృక్షము క్రిందఁ బడెను. అంగదుఁ డంత నా వజ్రదంష్ట్రుని పరాక్రమము చూచి, గొప్ప పర్వతమొక్కటి యెత్తి యా వజ్రదంష్ట్రుని నెత్తిని బడవైచి సింహనాదము గావించెను. శౌర్యము గలవాఁ డగు వజ్రదంష్ట్రుఁడును నా వచ్చుచున్న గొప్ప పర్వతమును జూచి, రథమునుండి యుఱికి గద చేతఁ బట్టుకొని నేల మీఁద నిలఁబడెను. తర్వాత నంగదుఁ డా వజ్రదంష్ట్రుని చేరువకుఁ బోయి యా వజ్రదంష్ట్రునిచేత నున్న గద నెగురఁ గొట్టెను. అంత

లోపల నంగదుఁడు ప్రయోగించిన యా పర్వత మా వజ్రదంష్ట్రుని రథ మును గుఱ్ఱములతోఁగూడ నుగ్గుచేసెను. వెంటనే యంగదుఁడు పెక్కు వృక్షములచే నలంకరింపఁబడిన దైన మఱియొక్క పర్వతము నెత్తి యా వజ్రదంష్ట్రుని తలమీఁద నేసెను. అంతట వజ్రదంష్ట్రుఁడు రక్తము గ్రక్కుచు మూర్ఛ చెంది, ప్రజ్ఞ లేక యా గదం బట్టుకొని నిట్టూర్పు విడుచుచు నొక్క ముహూర్తకాల ముండెను. తర్వాతఁ గొంతసేపటి కత డొడలు దెలిసినవాఁడై, తనయెదుట నిలఁబడియున్న యంగదునిం జూచి యత్యాగ్రహము పూని, యా యంగదునిఱొమ్ము గదతోఁ గొట్టెను. తర్వాత నా వజ్రదంష్ట్రు డంత గదను విడిచి ముష్టియుద్ధము నకుఁ బూనెను. అంత నా వానరరాక్షసవీరు లొండొరులం గొట్టుకొనుచు, రక్తము గ్రక్కుచు, దెబ్బలచే బడలిక నొందినవా రయి, యంగారక బుధగ్రహములమాడ్కి గట్టిపూనికితో యుద్ధము చేసిరి. తర్వాత నెక్కువ వెలుఁగు గలవాఁడును, వానరశ్రేష్ఠుఁడును నైన యంగదుఁడు పెక్కుపూవులు పండ్లును నిండిన యొక్క వృక్షము నెత్తుకొనెను. వజ్ర దంష్ట్రుఁడును వృషభచర్మము గప్పిన డాలును, చిఱుగజ్జెలు గట్టినదియు మంచియొర లోపల నుండునదియు, వెడల్పుగలదియు, జక్కనైనదియు నైన యొక ఖడ్గమును గైకొనెను. అంత నా వానరరాక్షసవీరు లిద్దఱు కినుక పూని, యొండొరుల జయింప గోరి, పెక్కువిధములుగాఁ దిరు గుచు నొండొరులను గొట్టుకొనిరి. సరక్తవ్రణములతోఁ గూడిన యా యంగద వజ్రదంష్ట్రులు పూవులు పూచిన మోదుగుచెట్టువలెఁ బ్రకా శించుచు, యుద్ధపు టలసటచేఁ మోఁకాళ్లను నేల నానించికొని కూర్చుం డిరి. వీరుఁ డగు నంగదుఁ డొక్క నిముసములోపల బడియతో మోదఁ బడిన పాముమాడ్కి రేఁగి కన్నులనుండి నిప్పులు ఱాల్చుచు, తటాలున లేచి, దన బలిమిమెఱయ నొక్క నిర్మలమైన పదునుగల ఖడ్గముచే నా వజ్రదంష్ట్రుని గొప్పశిరమును ఛేదించెను. రక్తార్ద్రదేహుఁ డైన యాతని శిరము గోపముచేఁ గన్నులు తిరుగుచుండఁగా నంగదుని కత్తిచే నిరు తునుకలు చేయఁబడి క్రిందఁబడెను. అట్లు వజ్రదంష్ట్రుఁడు హతుండగుట చూచి, రాక్షసు లందఱు భయముచే వివేకముమాని, యా వానరులచే దెబ్బలు దినుచు, దిగులుపడి మోములందు విన్నఁదనము దోఁపఁగా,

సిగ్గుచేఁ దలలు వంచికొని, వెఱపుచే లంకాపురములోనికి మఱలిపోయిరి. దేవేంద్రునిఁ బోలు పరాక్రమము గల యా యంగదుఁడు వానర సైన్యము నడుమ వెలుఁగుచు, నా వజ్రదంష్ట్రుని సంహరించి వానరులచేఁ గొనియాడఁబడుచు, వేల్పులచేఁ జుట్టఁబడిన పూజ్యుఁడైన బలవంతుఁ డగు దేవేంద్రునిచందమున విరాజిల్లుచుండెను.

55-వ సర్గము

అకంపనుఁడు రావణునిచేఁ బ్రేరితుఁడై యుద్ధమునకు వచ్చుట

వాలిపుత్త్రునిచే వజ్రదంష్ట్రుఁడు వధింపఁబడె నను మాట విని, రావణుఁడు చేతులు జోడించుకొని, యెదుట నిలఁబడియున్న సేనాధిపతిం జూచి, సేనాధిపా, భీకర విక్రమముగల రాక్షసు లందఱు సకలాస్త్రము లందును సమర్థుఁడైన యకంపనుని ముందుంచుకొని, యుద్ధమునకు వెడ లున ట్లానతిమ్ము. ఇతఁడు యుద్ధరంగమున శత్రువులను వధించువాఁడు, తన సైన్యములను రక్షించువాఁడు; గట్టి సేనానాయకుఁడు, ఎల్లప్పుడు నామే లరయువాఁడు; మఱియు నెల్లప్పుడు యుద్ధమునం దపేక్ష కల వాఁడు. ఇతఁ డా రామలక్ష్మణులను, బలవంతుఁ డగు సుగ్రీవుని తక్కిన వానరులను సైతము జయింపఁగలఁడు. కావున నీవు సేనలకు నామాట యానతిచ్చి రమ్ము" అని చెప్పి పంపఁగా, లఘుపరాక్రముఁ డగు సేనాధి పతియు నా యాజ్ఞను గైకొని, సైన్యమును యుద్ధమునకై పురికొల్పెను. సేనానాయకుఁ డట్లు పురికొల్పఁగా బుటము వేసిన బంగారుపోఁగులు దాల్చినవాఁడును, మేఘపువన్నె గలవాఁడును, ఉఱుమువంటి కంఠధ్వని గలవాఁడును నైన యకంపనుఁడు భయంకర మైన దృష్టులును నేత్రము లును గలవాఁడై పెక్కుడిదములను గొని వెనుక వచ్చుచుండఁగా నరదమెక్కి యుద్ధమునకుఁ దఱలెను. ఆ యకంపనుఁ డెట్టి యుద్ధమునం దైనను వేల్పులకైనను దలఁకనివాఁడు గనుక నా సైనికుల నడుమఁ దన ప్రతాపముచే సూర్యునిమాడ్కిఁ దేజరిల్లుచుండెను.

అవ్విధమున నా యకంపనుఁడు పూనికి గలిగి యుద్ధాపేక్షతోఁ బోవుసమయమునఁ దటాలునఁ దేరిగుఱ్ఱములు మోముల దిగఁజార్చినవి. ఎడమక న్నదరెను. అతని మొగము వన్నెదప్పినది. కంఠధ్వని డగ్గుత్తిక పడినదాయెను. నిర్మలముగా నున్న యాకాశము సుడిగాలి వీచుటచే

మేఘములచేఁ గ్రమ్మఁబడి, సుదినము దుర్దిన మాయెను. మృగపక్షు లెల్లఁ గడుసులై వెఱపు గలిగించు కూఁతలు కూసినవి. సింహమువలె నెత్తుమూఁపురములును, బెబ్బులిమాడ్కి నెక్కువ పరాక్రమమును గలవాఁ డయిన యకంపనుఁ డయ్యుపశకునము లెల్లఁ బరిగణింపకయె యుద్ధమునకుఁ బోయెను.

రాక్షససేనలతోడం బోవు నాయకంపనుండును, ఆతని సైనికులును సముద్రముసైతము గలఁకపాఱునట్లు కడు గొప్పసింహనాదము గావించిరి. ఆశబ్దమువిని వానరమహావీరులు మఱింత యులికిపడియుఁ బిదప దిటవు పూని వృక్ష పర్వత పర్వతాగ్రములను గైకొన్నవారై, యుద్ధయుసేయ సిద్ధముగా నుండిరి. ఆ బలవంతులు, శూరులు, పర్వతములమాడ్కి నున్న తాకారులును నైన యా వానరరాక్షసులు రామ రావణుల నిమిత్తము ప్రాణములను సైతము విడువఁ దీర్మానించుకొన్నవారై, యొండొరులను వధింపఁగోరి కడుభీతినిగలిగించు ఘోరసంగరము చేసిరి, వా రొండొరుల మీఁది రోషముతో నొండొరులను గడు వేగముతోఁ దాఁకుచుఁ గోపముచే నొండొరులను ఱొప్పుచుఁ జేయునట్టి యా యుద్ధమునందలి కోలాహలధ్వని కడు గొప్పగా వినిపించెను. యుద్ధభూమియందలి యెఱ్ఱని వన్నె గల ధూళి యా వానరరాక్షసుల కాళ్లక్రొక్కుళ్లచేఁ బైకి లేచి, పదిదెసలను నిండించి యతిభీకరముగాఁ గన్పట్టెను. వెలిపట్టువలెఁ దెల్ల నై క్రిందినుండి లేచిన యా దుమ్ముచే నా యుద్ధరంగము గ్రమ్మఁబడి యుండుటంజేసి, యచ్చట నున్న యా యా వస్తువులను గాని, జంతువులనుగాని, యొండొరులను గాని వా రెఱుఁగఁజాలరైరి. "ఇవి ధ్వజములు, ఇవి పతాకములు, ఇవి కవచములు, ఇవి గుఱ్ఱములు, ఇవి యాయుధములు, ఇవి యరదములు" అను వ్యవస్థయే వారికిఁ దెలియకయుండెను. వటియును యుద్ధరంగమున వా రొండొరులమీఁదికి దుముకుచు, నొండొరుతను ఱొప్పుచు నుండునప్పుడు వారి కంఠధ్వనులు వినవచ్చినవె కాని, వారి రూపము లొండొరులకుఁ గాని, చూపఱకుఁ గాని కనఁబడినవి కావు. కావున వానరులు వానరులను రాక్షసులు రాక్షసులను జీకటియందుఁ దెలియక చంపుచుండిరి. ఇవ్విధముగ వానరులును రాక్షసులును దమ వారిని నొరులను గొట్టుచుఁ బుడమియెల్ల నెత్తుటఁ దడిపి, యడుసుతోఁ

Acc. No.

గూడినదగునట్లు చేసిరి. తర్వాతఁ బుడమిలోని దుష్మంతయు రక్తార్ద్రమై యణఁగిపోయెను. పుడమియు నాయుధములతోను శవములతోను నిండినదయి యుండెను. అటుతర్వాత వానరులును రాక్షసులును మఱల యుద్ధమునకుఁ దలపడి, శిలాద్రుమపర్వతాగ్రములతోను, గదా ఖడ్గ పరశ్వధాదు లగు నాయుధములతోను నొండొరులను డీకొని యుద్ధము గావింపఁ దొడఁగిరి. అప్పుడు పర్వతములం బోలు భీకరకర్ములైన వానరులినుపగుదియలం బోలు తమ బాహువులతో రాక్షసులను బాగుగా నప్పళించిరి. రాక్షసులును బల్లెములు, ఈఁటెలు, చిల్లకోలలు మొదలగు నాయుధంబులతోను అతిభయంకరము లైన యస్త్రములతోను వానరులను గొట్టిరి. రాక్షససేనానాయకుఁ డగు నకంపనుఁడు మిక్కిలి యాగ్రహముపూని, యెక్కువ శౌర్యముఁ జూపుచున్న యారాక్షసులకుఁ బ్రోత్సాహము గలిగించుచుండఁగా, నా రాక్షసులు వానరులను బాణములచే నొంచిరి. వానరులును రాక్షసు లేయు నాయుధములను గొప్పమ్రాఁకులతోను, గొప్పబండలతోను వారించి యా రక్కసులను జీల్చిరి. ఇంతలోపలఁ గుముదుఁడు, నలుఁడు, మైందద్వివిదులు మొదలగు వానరవీరు లలిగినవారలై, యెక్కువ యాడంబరముపూని, రాక్షససేనల ముందటఁ జేరి, వేడుక మీఱ రాక్షసుల నందఱిని మేర లేక గుంపులు గుంపులుగా వధించిరి.

56-వ సర్గము

అకంపనవధము

అకంపనుఁడు యుద్ధరంగమునందలి వానరుల గొప్పపని చూచి యోర్వరాని కోపము పూని, యొడలు దెలియక, తనచేత నున్న మేటి వింటిని జళిపించుచు సారథిం జూచి, "సారథీ! యే ప్రదేశమున వానరులు పెక్కండ్రు రాక్షసవీరులను బలువురను సంహరించెదరో, ఆప్రదేశమునకు రథంబుఁ దోలుము. బలిమిగలవారును, భయంకరదేహములు గలవారును నైన వానరులు వృక్షశైలము లాయుధములుగాఁ గైకొన్నవారై నాయెదుట నున్నవారు. ఈవానరు లందఱు నా రాక్షస బలమెల్ల నుగ్గుచేసిరి. కావున యుద్ధరంగమునఁ బొగడ్త కెక్కిన యా వానరుల నందఱను నేను మడియించెదను. వేగిరముగా రథము

నావైపునకుఁ దోలుము" అని సారథి కాన తియ్యఁగా, నతఁ డట్లె యొనరించెను.

రథికులలో నుత్తముఁ డైన యకంపనుఁడు వడిగాఁ బోవు గుఱ్ఱములు పూన్చిన యరదమున నున్నవాఁడై, బాణములఁ బెక్కింటిని బ్రయోగించి, వానరులను నొప్పించెను. వానరు లందఱును నకంపనుని బాణపుటేటుల కోర్చి, యాతని ముందట నిలుచుటకే చాలరై రన, నిఁక యుద్ధము చేయఁజాలరై రను సంగతి చెప్పవలయునా? వానరు లెదుట నిలువఁజాలక మూలమూలలకుఁ బరుగెత్తిరి. అవ్విధమున వానరు లకంపనునిబారిం జిక్కి, చావునకు లోఁబడియుండుటఁ గాంచి, హనుమ యకంపనుని మీఁదికిఁ బోయెను. ఆ హనుమంతుఁడు ముందుకుఁ బోవుట చూచి, శూరు లయిన వానరయూథనాథులును సంతోషభరితులై, యుద్ధమునం దుత్సాహముతో నా హనుమంతునిఁ జుట్టుకొని, బలవంతుఁ డయిన యాతని సాయమునం జేసి, తామును బలముగలవారై యుద్ధముచేయఁ గడఁగిరి. అకంపనుఁడును బర్వతాకారుఁడై తనయెదుట నిలిచియున్న హనుమంతునిమీఁద, దేవేంద్రుఁడు వర్షముఁ గురిపించునట్లు బాణవర్షముఁ గురిపించెను. బలవంతుఁ డగు హనుమంతుఁడు తన శరీరమునందుఁ బడిన యా వాఁడిబాణములను సరకుసేయక యకంపనుని వధమునకై మనమును దృఢపఱచుకొని, పుడమియెల్ల నదురునట్లు నడచుచు నా యకంపనునిమీఁది కేఁగి, జ్వాలలచే వెలుఁగునట్టి యగ్నిహోత్రుని రూపమువలె నోర్వరానిరూపము ధరించినవాఁడై, తనకడ నాయుధములు లేకుండుట యెఱిఁగి యత్యాగ్రహముతోఁ దన చేరువ నున్న యొకపర్వతము నూడఁబెఱికి, దాని నొంటిచేతితోఁ బట్టికొని సింహనాదము చేయుచుఁ దన మగఁటిమి వెల్లడి యగు విధమున నామహాపర్వతము గిఱగిఱఁ ద్రిప్పుచుఁ దొల్లి దేవేంద్రుఁడు నముచి యను దానవునిమీఁదికి వజ్రాయుధముతో నడరినట్లు లా యకంపనుని మీఁది కుఱికెను.

అకంపనుఁడు తనమీఁదఁ బ్రయోగించుటకై హనుమంతుఁడు చేత నెత్తియున్న పర్వతమును జూచి, దానిని దూరముననే యర్ధచంద్రబాణముచేఁ ద్రుంచివేయఁగా, హనుమంతుఁడు తనచేతి పర్వతశిఖరము

నకంపనుఁ డట్లు త్రుంచినందుకై మిక్కిలి యలిగి మచ్చరముపూని గొప్ప శైలముమాడ్కి నెత్తయిన గొప్పబోదెగల మద్దిచెట్టును బెళ్లగించి, యీ వృక్షముతో నితనిం బరిమార్తు నని కడువేడ్కఁబూనినవాఁడై, యావృక్షము గిఱగిఱఁ ద్రిప్పుచుఁ బరుగెత్తుచుఁ దనతొడలవడిచే బలాత్కారముగాఁ జెట్లను బడఁద్రోయుచుఁ బుడమి బ్రద్దలగునట్లు నడచుచు నాయకంపనునిం గదిసి, యా మద్దిచెట్టుచే నాతని యేనుఁగులను, వానిపై నెక్కిన వీరులను, రథములను, రథికులను, కాలిబంటులను నుగ్గునేసెను. అవ్విధమున యమునికై వడిఁ దమ ప్రాణములను దీయుచున్న యాహనుమంతునిఁ గాంచి రాక్షసు లందఱు పరుగెత్తిరి. అట్లు రాక్షసులకు భీతి గలుగఁజేయుచుఁ గోపముతోఁ దనపైకి వచ్చుచున్న హనుమంతుని నకంపనుఁ డవలోకించి, కట్టలుక పూనినవాఁడై యార్చి, ఒడలిని చీల్చునట్టి పదునాలుగు బాణములచే బల్మికాఁ డగు నాతనిఁ గొట్టెను. అప్పుడు హనుమంతుఁడు పెక్కుబాణమ్ములచేఁ గొట్టఁబడినవాఁడై, గొప్ప దేహమును, వీర్యమును, మనమునుం గలవాఁ డగుటంజేసి, వృక్షషండములతో నిండిన గొప్పవనము కైవడినిఁ బూఁచిన యశోకవృక్షము మాడ్కినిఁ బొగలేని యగ్నిహోత్రుని కైవడినియు జ్వలించుచు, మఱి యొక గొప్పవృక్షము నూడఁబెఱికి కడువడితో దాని నాయకంపనుని తల మీఁదనేయఁగా, నాతండు మహాధీరుఁ డగు హనుమంతుఁడు వడితో వేసిన మహావృక్షంపు టేటుచేఁ గ్రిందఁబడి నీల్గెను.

రాక్షసులందఱు తమయధిపుఁ డగు నకంపనుండు పోర నీల్గుటం జూచి, భూకంపము గలిగిన సమయమున మహావృక్షములుంబోలె వ్యసనముచే నవరుపాటొంది, యాయుధములు దిగవిడచి, యోటమి నొంది, వానరులు వెంబడించి తఱుముచుండ భయపడి లంకవైపునకు మఱలి తలవెండ్రుకలు విఱయఁబోసికొని, తత్తరపడుచు మానము గోల్పోయి, యోడి, పరుగెత్తునప్పు డొడళ్లనుండి జోరుచెమ్మటలు గాఱ నిట్టూర్పులు విడుచుచు మోహముచే నొండొరులఁ గొట్టుకొనుచుఁ బగతురు వెంబడించుచున్నా రను వెఱపుచే మాటిమాటికి వెనుకకుఁ దిరిగి తిరిగి చూచుచు లంకలోపలఁ బ్రవేశించిరి.

రాక్షసులందఱట్లు పురము ప్రవేశించిన పదంపడి మహాబలు లగు వానరులందఱుగూడి యా హనుమంతునిఁ గొనియాడఁగా, బలిమికాఁడగు హనుమంతుఁడును గడుమక్కువఁ బొంది, యా వానరులను దగిన రీతిగా, "మీతోడ్పాటునంజేసి కదా నే జయించితిని" అని బదులు మర్యాద యొనరించెను. అంత జయశాలురగు వానరు లందఱు నకంపనుని వధము తెలియుటకై తమశక్తికొలఁది సింహనాదములఁ గావించి, తమ యార్పులకు దిగులు పుట్టించిరి. తొల్లి దేవాసురయుద్ధమున భయంకరుఁడును, శత్రువులను సంహరించువాఁడును, బలిమికాఁడు నైన విష్ణువు కైటభాసురుని సంహరించి తేజస్సుచే వెలుఁగుచందమున వాయునందనుఁడగు హనుమంతుఁడును పూనిక కలిగి, రాక్షసులను వధించి శౌర్యలక్ష్మిచేఁ దేజరిల్లుచుండెను. అప్పుడు దేవతలును, రామలక్ష్మణులును, సుగ్రీవుఁడు మొదలగు వానరులును, బలవంతుఁ డగు విభీషణుఁడును హనుమంతునిఁ బలుతెఱఁగుల మన్ననగావించిరి.

57-వ సర్గము

ప్రహస్తుఁడు యుద్ధమునకుఁ దఱలుట

రాక్షసేశ్వరుఁ డగు రావణుఁ డకంపనునివధవృత్తాంతమును విని, మొదటఁ గోపపడి, పిదప మోమున నించుక విన్నదనము గదుర జేరువనున్న మంత్రులం దేరిచూచి, తనమనమునఁ గొంతతడ వాలోచించి, మంత్రులతోడఁ జక్కఁగా యోచించి, మఱునాఁ డుదయమున లేచి, దండుగూడెముల నన్నిటిని జూడఁగోరి, లంకాపురము చుట్టిరాఁబోయి, వ్యూహములుగా నిల్చియున్న పెక్కండ్ర రాక్షసవీరులచేఁ జుట్టు నిలుచుండి కావలి కాఁచఁబడుచుఁ, బతాకాధ్వజములచే శోభిల్లుచున్న లంకాపురమును గలయంజూచి, శత్రువులు పట్టణము ముట్టడించియుండుట యెఱిఁగినవాఁడై, యుద్ధమున నేర్పుగల ప్రహస్తునిఁ గాంచి యాగ్రహముతో నిట్లనియె: "యుద్ధమునం దాఱితేఱినవాఁడా, శత్రుసైన్యము తటాలునవచ్చి పట్టణమును ముట్టడించిన యప్పుడు దీనిని దప్పింప యుద్ధమునకన్న వేఱుపాయము నాకు గానరాకున్నయది. నేనో, కుంభకర్ణుఁడో, నాసేనానాయకుఁడ వగు నీవో, యింద్రజిత్తో, నికుంభుఁడో, యాయుద్ధము మోయఁజాలుదురుగాని యది యొరులవలనఁ గాదు కావున నీవు వడిగా

సేనను దోడ్కొని యావానరవీరు లంద ఉండుతావునకుఁ బొమ్ము. నీవు యుద్ధమునకుఁ దఱలినమాత్రాననే చపలమైన వానరసైన్యము ఱొప్పు చుండెడి రాక్షసవీరుల సింహనాదము విని పరుగులెత్తఁ గలదు. ఏనుఁ గులు సింహములయొక్క గర్జనముల విన్నట్లుగాఁ జపలులును, నేర్పు చాలనివారును, చపలచిత్తులును నైన వానరులు నీయార్భాటమును విన్న మాత్రముననె పరుగెత్తుదురు. వానరసైన్యము పరుగెత్తఁగా, రామ లక్ష్మణులు తోడులేమిచేఁ జేయునదిలేక నీకు లోఁబడిపోవుదురు. యుద్ధ మున జయము గలుగుట నిక్కముకాదే. అపజయంబే కలుగునని తలంప రాదా యనిన, మన శత్రువులు మనపురమును ముట్టడించి యుండుటచే మన మూరకున్నను మనకుఁ బోరు దప్పక కలుగనే కలుగును. యుద్ధము చేయకున్నచో మరణము రాదనుట లేదు. చేసినచో మరణము వచ్చునను టయు లేదు. కావున జయము గలుగునని యెంచి కయ్యమొనరించు టయే మేలు. ప్రహస్తా, నామాట ననుసరించి చెప్పెదవో, లేక విరుద్ధ ముగాఁ జెప్పెదవో యెదియైన నాకు సమ్మతమే చెప్పుము" అని రావణా సురుఁడు మంత్రియగు ప్రహస్తుని నడిగెను.

రావణుఁ డివ్విధముగాఁ జెప్పి నిల్పినతర్వాత సైన్యాధిపుఁ డగు ప్రహస్తుఁడును శుక్రాచార్యుఁ డసురరాజుతోఁ జెప్పినతెఱఁగున రావణు నితో నిట్లనియె: "ఓ ప్రభూ! యీసంగతి నేర్పరులైన మంత్రులతోడ మన మాలోచనచేసినసంగతియెకదా. దీనికై యొండొరుల యభి ప్రాయములు వేఱుపడుటచే మనకు వాదముగూడ జరిగినదికదా! అప్పుడు సీతాదేవి నొసంగినచో మేలు గలుగుననియు, లేనిచో యుద్ధము సంభవించుననియు నిర్ణయించుకొంటిమి గదా! నన్నుఁ గుడువఁబెట్టి కట్ట నిచ్చి పెక్కుతెఱఁగుల నిరంతరము నన్ను గౌరవించితివికదా. అట్లు నీచే మన్ననలు వడసిననే నదను వచ్చినప్పుడు నీకుఁ బ్రియము సేయకుం దునా? నేను నా యాలుబిడ్డలను గాని నా యాస్తినిగాని, నా ప్రాణము లను గాని లెక్క పెట్టను. ఇదిగో, నీనిమిత్తమై సమరమునఁ బ్రాణము లను వదలఁబోవుచున్నాను జూడుము" అని రావణునితోఁ జెప్పెను.

ప్రహస్తుఁ డిట్లు ప్రభువగు రావణాసురునితోఁ బలికి, ముందట నున్న సైన్యాధ్యక్షులం జూచి, "వేగిరముగా నపారమైన రాక్షససేనను

సిద్ధము చేసికొని రండు. ఇప్పుడే సమరమున వజ్రాయుధముం బోలు నా బాణములవడిచే నీల్గిన వానరుల నంజుల్లను మాంసభక్షకము లగు పక్షు లెల్ల మెసవి దనివి నొందఁగలవు" అని చెప్పఁగా, బలాధ్యక్షులు సేనలను గూర్చి రాక్షసమందిరమునకుఁ జేర్చిరి. తీక్ష్ణములగు నానావిధాయుధ ముల ధరించిన యారాక్షసవీరు లా లంకాపురి యంతటను మదపుటేనుఁ గుల కైవడి నిండియుండిరి. అప్పుడు రాక్షసు లందఱు తమకు జయము గలుగునిమిత్త మగ్నిహోత్రములందు వేల్పులు వేల్చుటంజేసియు, బ్రాహ్మ ణులను గంధపుష్పాక్షతలతోఁ బూజించుటంజేసియు, నాజ్యగంధము తోను, పువ్వులనెత్తావితోను గూడిన కమ్మని గాలి వీచెను. యుద్ధమున కాయితులైయున్న రాక్షసులును ముదము నొందినవారలై జయము గలుగునట్లు లభిమంత్రింపఁబడిన పలుతెఱఁగులైన పూవులదండలను గైకొని, శిరములందుఁ దాల్చిరి. రాక్షస యోధులును విండ్లను ధరించి, మైమరువులు దొడిగి వేగముతో నెగిరి దుముకుచు వచ్చి, రావణునికిఁ బ్రణమిల్లి యావల నా ప్రహస్తునిచుట్టు నిల్చిరి.

అంతటఁ బ్రహస్తుఁడు రావణుని వీడ్కొని, వెఱపు పుట్టించునట్టి భేరీవాద్యములు మ్రోగింపఁజేసి, వలయుపదార్థములతోడ సిద్ధము చేయఁ బడినదియు, వడిగల వారువములు పూన్చినదియు, సేర్పరియగు సారథిచేఁ దోలఁబడునదియుఁ జక్కఁగా నిర్మింపఁబడినదియు, గొప్పమేఘంబు ధ్వనిని బోలు ధ్వనిగలదియు, సూర్యచంద్రులయట్లు ప్రకాశించునదియు, సర్వ చిహ్నిత మగు ధ్వజముతోఁ గూడినదియు, మంచికప్పును, గట్టి చక్ర ములును గలదియు, బంగారు చిఱుగంటలతోఁ గూడినదియు, స్వకాంతిచే నితరవస్తువులను హేళనము చేయుచున్నదో యనునట్లుండునదియు నైన రథ మెక్కి రావణుని యానతినిఁ గొనినవాఁడై గొప్పబలముతోఁ గూడి, లంకాపురమునుండి వెలువడి వచ్చెను. ఆప్రహస్తుఁడు తఱలు నప్పుడు మేఘగర్జనముంబోలెడి దుందుభులు మొదలగువాద్యములమ్రోఁత సముద్రమును నిండించుదానికైవడిఁ జెలరేఁగెను. భీకరరూపములును, గొప్పదేహములును గలవారగు రాక్షసవీరులు పలువిధముల ఘోరముగ నఱచుచు నాప్రహస్తుని ముంగల నేగిరి. నరాంతక కుంభహనుమహానాద సమున్నతులనెడి యాప్రహస్తుని మంత్రులు నలువురును నాతనిఁ జుట్టుకొని

ప్రయాణమైరి. ప్రలయకాల యమునిం బోలునట్టి ప్రహస్తుఁడును జూప రకు వెఱపుపుట్టించునట్టిదియు, వ్యూహములుగాఁ దీర్పఁబడినదియు, గజ యూథముం బోలునదియు సముద్రప్రవాహముఁ బురుడించునదియు నైన గొప్పసైన్యముఁ దోడ్కొని తూర్పుద్వారమునుండి యుద్ధమునకు వెలువడెను. ఆప్రహస్తుఁడు యుద్ధయాత్ర వెడలు సన్నాహముచేతను, బలు తెఱఁగులుగ ఱొప్పుచుండు రాక్షసుల యఱపులచేతను నాలంకా పురమునందలి సర్వజంతువులు భీతినొంది వెఱ్ఱియఱపు లఱచెను. అప్పుడు ప్రహస్తున కపశకునములు గొన్ని సంభవించెను. మాంసము దిని నల్ల ద్రావునట్టిపక్షులు నిర్మలమగు నాకాశమునఁ జేరి, యాప్రహస్తుని యర దంబున కప్రదక్షిణముగాఁ జుట్టివచ్చినవి. వఱళులు నిప్పుకలు గ్రక్కుచు భయంకరముగాఁ గూసినవి. ఆకాశమునుండి యుల్కలు రాలినవి. గాలియు వేండ్రముగా వీచెను. గ్రహము లొండొంటితోఁ బోరుచు వెలుఁగకుండెను. కఠోరధ్వనిగల యుఱుములతోఁగూడిన మేఘము లా ప్రహస్తుని యరదముపై రక్తవర్షము వర్షించి, యాతనిసేన నెల్ల నెత్తుటఁ దడిపినవి. గ్రద్ద యొక్కటి యాప్రహస్తుని రథము కొనను దక్షిణ ముఖముగఁ గూర్చుండి, ముక్కులతోఁ దన యిరుప్రక్కల గీఱుచు నాప్రహస్తుని పూర్ణకాంతిని హరించెను. యుద్ధరంగమునకుఁ జొచ్చునట్టివాఁడును, గుఱ్ఱముల నడుపఁగలవాఁడును, సారథ్యమున నేర్పుగలవాఁడును నైన ప్రహస్తుని రథసారథిచేతినుండి మునికోల జాఱి పడిపోయెను. ఆప్రహస్తుఁడు ప్రయాణమగునప్పు డతని కష్టవసువులకు దొఱకని యెక్కువ వెలుఁగుండెను. కాని యది వెంటనే నశించెను. గుఱ్ఱ ములు చదరమగు నేలలందే తడఁబడినవి. యుద్ధమునకై వెడలివచ్చునట్టి బలపరాక్రమములచేఁ బ్రసిద్ధికెక్కిన యాప్రహస్తునిమీఁదికి వివిధా యుధముల ధరించిన యావానరసేన కవిసెను. అప్పుడు వానరులు యుద్ధము నిమిత్తము గొప్పవృక్షములను గొప్పబండలను గైకొన్నప్పుడు గొప్ప రొద యొక్కటి పుట్టెను. వానరరాక్షసుల యుభయసైన్యములును గడుమోదము నందియుండినవి. మఱియు వానరరాక్షస వీరు లొండొరుల వధము గోరి యెక్కువ నేర్పును వడియును జూపుచు నొండొరులఁ బిలుచునప్పుడు గర్ణకఠోరముగా నఱచిన యఱపులు విశేషముగాఁ వినఁ

బడినవి. అంతటఁ జెడు తలంపు గల ప్రహస్తుఁడు చెడుపుచేయఁ గోరి సుగ్రీవునిసేనను సమీపించి, మిడుత తన చావుకై నిప్పును బ్రవేశించు నట్లు లెక్కువ పూనికిగల యావానరసైన్యమునఁ జొచ్చెను.

58-వ సర్గము

ప్రహస్తుఁడు చచ్చుట

శత్రుసంహారి యగు రాముఁడు భయంకర మయిన విక్రమముతో వచ్చునట్టి ప్రహస్తుం గాంచి, విభీషణునిఁ జూచి, "విభీషణా! గొప్ప యొడలును నెక్కువ బలిమియుఁ గలవాఁ డయిన ఈమొనగాఁ డెవ్వఁడో చెప్పు" మని యడిగెను. విభీషణుఁడును రామునిఁగూర్చి, ఓ ప్రభూ! యితఁడు రావణుని సైన్యాధిపతి. రావణుని సైన్యములో మూఁడవ పాలుసేన యీతని వశమున నుండును. ఇతఁడు మగఁటిమి గలవాఁడు; శత్రువుల నెదిరించి లోఁబఱచుకొనుటకుఁ జాల శక్తిగలవాఁడు" అని బదు లొసఁగెను.

అవ్విధముగా నతి భీకరాకారము నెక్కువ పరాక్రమముం గలిగిన మహాకాయుఁ డయిన యాప్రహస్తునిఁ గాంచి, యెక్కువ బలముగల వానరు లాగ్రహముపూని యా ప్రహస్తుని నెదుర్కొని ఱొప్పుచు నతని నెదిరించిరి. రాక్షసులును జయముగోరి ఖడ్గశక్తియష్టిబాణశూలముసల గదా పరిఘాప్రాసముల ననేకమ్ములఁ దాల్చినవారై యా వానరసైన్యము నెదురు తాఁకిరి. వానరవీరులందఱు యుద్ధముచేయఁ గోరినవారై గొప్ప నిడుపుబండలను, పుష్పించిన వృక్షములను గైకొనిరి. వానరరాక్షసు లొండొరులఁ దాఁకి పరస్పరము బాణవర్షమును శిలాద్రుమవర్షమును గురిపించిరి. పెక్కండ్రు వానరులు పెక్కండ్రను రాక్షసులను, పెక్కండ్రు రాక్షసులు పెక్కండ్రను వానరులను యుద్ధమునఁ బడఁగొట్టిరి. రాక్షసులు వానరులలోఁ గొందఱిని శూలములతోను, కొందఱిని గుదియలతోను, కొందఱిని గొడ్డళ్లతోను నఱికిరి. కొందఱి నూఁపి రాడకుండు లాగునఁ గ్రిందఁ బడఁద్రోసిరి. కొందఱిని బాణము లనెడి త్రాళ్లచేఁ గట్టి ఱొమ్ములు పగిల్చిరి. కొందఱిని జీల్చిరి. శూలములతోఁ బ్రక్కలు పొడిచిరి. రాక్షసు లివ్విధమున వానరులను నొప్పింపఁగా, వానరులును గడుఁగినుక పూనినవారలై రాక్షసులను బడఁద్రోసి మ్రాఁకులతోను, పర్వత

శిఖరములతోను జూర్ణముగావించిరి. వానరులు రాక్షసులను గొంద ఱిని వజ్రాయుధముం బోలు నఱచేతులతో నప్పళించియుఁ బిడికిళ్లతో గ్రుద్దియు నొప్పింపగా, వారు పండ్లూడి చూపులు చెదరి నోళ్లనుండి రక్తముగ్రక్కుచు నేలఁగూలిరి. దీనముగా నఱచునట్టియు సింహనాద ములు సేయునట్టియు నారాక్షసవానరవీరుల భీకరకంఠధ్వనులు యుద్ధరంగ మున నంతట వ్యాపించియుండెను. క్రూరులగు వానరరాక్షసులు కోపము పూని, శౌర్య మవలంబించి, కన్నులు గిరగిరద్రిప్పుచు, వెఱపు మాని యుద్ధమొనరించిరి. ప్రహస్తుని మంత్రులు నరాంతక కుంభహను మహా నాదసమున్నతులు సల్వురును వానరుల నందఱను వధించుచు వడిగా వచ్చుచుండఁగా, ద్వివిదుఁ డొక్క పర్వతశిఖరము గైకొని నరాంతకుని వధించెను. అంత దుర్ముఖుఁ డను మఱియొక వానరవీరుఁడు పైకి లేచి యొక పెద్దచెట్టును బెఱికి, కడువడితో సమున్నతునిం గూలనేసెను. ప్రతాపశాలి యగు జాంబవంతుఁడును గట్టలుకఁ బూని గొప్పబండ నొకదానిం దీసి మహానాదుని ఱొమ్మునఁ బడనేయఁగా, నామహానాదుఁడు కూలెను.తర్వాత మగఁటిమి గల కుంభహనుఁడు తారుని నెదిరించి, యాత నిచే నొక్కమహావృక్షముచే శిరమున మోఁదఁబడి ప్రాణము వెడలెను. ప్రహస్తుఁ డాచేతం జూచి యోర్వనివాఁడై, యరదమున దిటవుగాఁ గూర్చుండి, వింటినిఁ గైకొని యావానరులతో ఘోరముగాఁ బోరఁ దొడఁగెను. ప్రలయకాలమునఁ గలఁతనొందిన యపారసముద్ర ముప్పొంగునప్పుడు గలుగునట్టి ధ్వనివోలె నా రెండుసేనలు పోరు నప్పుడు గొప్పసందడి గలిగిన దాయెను. అట్టి సమయమున యుద్ధనైపు ణ్యముగల ప్రహస్తుండు గొప్పబాణపరంపరం బ్రయోగించి యనేకులను వానరులను నొంచెను. పుడమియంతయు వానరరాక్షసవీరుల కళేబరము లతో నిండినదై, పర్వతములతోఁ గ్రమ్మఁబడినయట్లు వెలసెను. మఱియు రక్తప్రవాహముచేఁ గ్రమ్మఁబడిన యాయుద్ధభూమి వసంతమాసమునఁ బూఁచినమోదుగుచెట్లచేఁ గ్రమ్మఁబడినదానికైవడిఁ బ్రకాశించెను. యుద్ధ మున నీల్గినబంటులగుంపులే తీరములుగాను, విఱిగిన యాయుధములే గొప్పవృక్షములుగాను, రక్తప్రవాహమే నీటివెల్లువగాను, యకృత్ ప్లీహము లను మాంసములే యడుసుగాను, జెదరిపడియున్న ప్రేఁగులే

పాచితీఁగెలుగాను, చీలినదేహములును శిరములును జేఁపలుగాను, శరీరావయవములే పచ్చికపడియలుగాను, గ్రద్దలె రాయంచలగుంపులుగాను, రాపులుఁగులె బెగ్గురుపక్షులుగాను, మెదళ్లె నురువులుగాను, ఆర్తుల యేడ్పులే ధ్వనులుగాను గలిగి, యముఁడనెడి సముద్రమున సంగమించునదియుఁ బిఱికివాండ్రచేఁ దాఁటనలవి కానిదియు నగు యుద్ధభూమిరూపమైన నదిని శరత్కాలమున హంససారసపక్షులతో నొప్పుచున్న నదినివలె దాఁటి వానరరాక్షసవీరులు, పద్మములపుప్పొడిచేత రంగుమాఱిన తామరకొలనినుండి వెలువడిన యేనుఁగుమేటులకైవడి నొప్పినవారైరి.

అంతట రథారూఢుఁడై బాణపుంజములను ప్రయోగించి, వానరులను సంహరించుచుండునట్టి ప్రహస్తుని నీలుఁడు గాంచెను. వెంటనే విలుకాండ్రలో మేటియైన ప్రహస్తుఁడును పెనుగాలి మేఘబృందముమీఁదికిం బోలెఁ దనమీఁదికి వడితో వచ్చుచున్న యా నీలుని సూర్యునింబోలు తన రథముమీఁదఁ గూర్చుండి యెదుర్కొని, వింటియందు బాణముల జోడించి యాకర్ణాంత మీడ్చి పెక్కుబాణముల నా నీలుని మీఁదఁ బ్రయోగించెను. ఆ చక్కని బాణములు కడువడితో నా నీలునిమేనఁ జొచ్చి కినుకపూనిన పన్నగములకైవడిఁ గడువడిగాఁ బుడమిం బ్రవేశించినవి. వీర్యవంతుఁడగు నీలుఁడును నగ్నిహోత్రునిం బోలె వెలిఁగెడి వాఁడియమ్ములచేఁ గొట్టఁబడినవాఁడై, యొక్కవృక్షము నూడఁబెఱికి, యొరులచే నించుకేనియు నోర్వరానివాఁడై యా వచ్చుచుండు రక్కసునిఁ గొట్టెను. రాక్షస వీరుఁడగు ప్రహస్తుఁడును నీలుని వృక్షముల పాటుచే మిక్కిలి కనలినవాఁడై ఱొప్పుచు, వానరసైన్యాధిపుఁ డగు ఆ నీలునిమీఁద బాణవర్షముఁ గురిపించెను. వృషభము వడిగా వచ్చునట్టి శరత్కాలపువాన నోర్చుకొనుచందమున, నీలుండును గన్నులు మూసికొని యారాక్షసవీరుఁడగు ప్రహస్తుఁడు ప్రయోగించు నోర్వరాని బాణవర్షము నోర్చుకొనెను. అటు లోర్చినవాఁడై నీలుఁ డలుకపూని, యొక్క వృక్షముతో నాప్రహస్తుని మనోవేగములగు రథాశ్వములను సంహరించెను. తర్వాత నతఁడా ప్రహస్తుని వింటిని బట్టుకొని, రెండు తునుకలుగ విఱిచి మాటిమాటికి నఱచెను. నీలుఁడు తనవింటిని ద్రుర

పఁగా, ప్రహస్తుఁడు భయంకరమైన ముసలాయుధమును గొని రథము నుండి క్రిందికి దుమికెను. ఆసేనాధిపు లిద్దఱు రోషము నూని, వడిగల వారై నిలిచి, రక్తము కారుచున్నయంగములతోఁ గూడి, మదోదకముఁ గార్చు రెండు మదగజేంద్రములకై వడిఁ బ్రకాశించుచు వాడికోఱలతో నొండొరులను గఱచుకొనుచు, సింహశార్దూలములఁ బోలు చేష్టలుగల వారయి, యంతటను జయమునొందిన మొనగాండ్రు గనుక, యుద్ధము లందు వెనుకకు మఱలనివారై, వృత్రదేవేంద్రుల కెనవచ్చు నా యిరు వురు నొండొరులు జయింపఁ గోరిరి. అంతటఁ బ్రహస్తుఁ డెక్కువ పూనిక గలిగినవాఁడై నీలుని ఱోఁకటితో నొసటఁ బొడిచెను. ఆనీలుని నొసటనుండి రక్తము చొటచొటఁ గాఱెను. వెంటనే, వానర వీరుఁ డగు నీలుఁ డలిగినవాఁ డయి నెత్తుటఁ దడిసిన మేనితోడఁ గూడినవాఁడై యొక గొప్పచెట్టును బెళ్లగించి, దానిని బ్రహస్తునిఱొమ్మునఁ బడవేసెను. ప్రహస్తుండు దాని లక్ష్యపెట్టక తనపైకిఁ గడువేగముతో వచ్చుటఁ గాంచి, నీలుఁడును గొప్పబండను గొని, ముసలయుద్ధము చేయుచుఁ దనమీఁదికి వచ్చెడి యుద్ధకాముఁ డయిన యా ప్రహస్తుని నెత్తినిఁ బడవైచెను. నీలుఁ డేసిన శిలతాఁకుడుతో నా ప్రహస్తునిశిరస్సు బ్రద్దలుకాఁగా, నాతఁడు ప్రాణమెడలి కాంతిజవసత్త్వము లుడిగినవాఁడై మొదటికి నఱకఁబడిన మహావృక్షము వోలె నేలంగూలెను. పర్వతమునుండి సెలయేఱుపాఱు నట్లు, ఆతని భిన్నశిరమునుండియు, నొడలినుండియురక్తము విశేషముగాఁ గాఱెను. ప్రహస్తుఁడు నీలునిచే నిహతుఁ డగుటయు ధైర్యశాలు రగు రాక్షసులందఱును లంకవైపునకుఁ దిరిగి, సేతువును దాఁటి చెదరిన జలము తెఱఁగున నలుదెసలకుఁ బాఱిపోయిరి. రాక్షసవీరుఁడు మృతి నొందఁగా, రాక్షసేంద్రుని సైనికులంద ఱుత్సాహము మాని, రావణుని గృహమున కేగి, శోకసముద్రమున మునిఁగినవా రయి మాటలాడఁజాలక స్మృతిఁ దప్పినవారికై వడిఁ బడియుండిరి. బలవంతుఁ డగు నీలుఁడు జయముఁ బడసి, తనయొనర్చిన యద్భుతకృత్యమునకై వానరులచే మన్ననచేయఁ బడుచు, రామలక్ష్మణుల చేరువ కేతెంచి యెక్కువ సంతసము నొందినవాఁ డయ్యెను.

V.R.NARI D.P.R. Acc. No

59-వ సర్గము

రావణుని మకుటంబు విఱుచుట

రాక్షససైన్యములకుఁ గాఁపరి యగు ప్రహస్తుఁడు వానరశ్రేష్ఠుఁ డయిన నీలునిచే సమరమున నీల్గఁగా, రాక్షసవీరులు భయంకరాయుధములఁ దాల్చినవా రయ్యు రాక్షసేంద్రునిధృతి సెడ, సముద్రతుల్యమైన వేగముతోఁ బట్టణము చేరి రాక్షసేంద్రుఁ డయిన రావణునితో నీలుఁడు ప్రహస్తుని సంహరించె నని చెప్పిరి. వారిమాట లాలకించిన వెంటనే, రావణుఁడు ప్రహస్త మరణమునకై మొదట శోకముచే నొచ్చికొనియుఁ బిదప నెక్కువ యాగ్రహమును బూనినవాఁడై యింద్రుఁడు దేవతలతోఁ బలుకుకైవడి రాక్షసవీరులతో ని ట్లనియె: "దేవేంద్రుని సైన్యమును సైతము గెల్చిన ప్రహస్తుని గజపరివారసమేతముగా నీ వానరుల మూలమున నాశత్రువు సంహరించెను గాన, నాతని నుపేక్షించుట తగదు. కావున నేనే శత్రువినాశము నిమిత్తమై యా యద్భుత మయిన యుద్ధరంగమున కేఁగెదను. మండుచున్న చిచ్చుచే నడవిం గాల్చునట్లు, ఆవానరసైన్యమును రామలక్ష్మణులను నాబాణములచే దహించి, వానర రక్తములచేఁ బుడమిని దనివినొందించెదను చూడుఁడు." అని రాక్షస వీరులతోఁ బలికెను.

దేవేంద్రుని పగతుఁడును, రాక్షసాధిరాజు నైన రావణాసురుఁ డిట్లెఱుఁగునఁ బలికి, కడుమేటివారువంబులు పూన్చినది యాటచేతను స్వతేజస్సు చేతను నగ్నిహోత్రునికైవడి వెలుఁగునట్టి యరదమెక్కి, భేరీ మృదంగశంఖకాహళాదివాద్యముల మ్రోఁతలును, చేతుల చప్పట్లును, సింహనాదములును మిన్నుముట్టుచుండఁగా, వందిమాగధులచేఁ గొని యాడఁబడుచు బర్వతమేఘసమానాకారులును, నగ్నిహోత్రునిచంద మున జ్వలించు మిడిగ్రుడ్లు గలవారును నైన రక్కసులు వెంబడించి వచ్చుటచేఁ బ్రమథగణములచే వెంబడింపఁబడిన పశుపతికైవడిఁ గన్పట్టుచుఁ బట్టణము వెలువడివచ్చి, మహాసముద్ర మేఘముల ఘోషము, బోలు ధ్వనిగలదై శైలములు మహావృక్షములు చేతులందుఁ దాల్చి యున్న భయంకరమైన యా వానరసేనను గాంచినవాఁ డయ్యెను.

ఎక్కువశౌర్యలక్ష్మిచేఁ బ్రకాశించువాఁడును, సేనాసమేతుఁడును పాపతేనియొడలింబోలు హస్తములు గలవాఁడు నైన రాముఁడు కడు భయంకరమై వచ్చెడిసేనం జూచి, "నానావిధధ్వజపతాకలును ప్రాసఖడ్గ శూలాద్యాయుధములను దాల్చినదియు, మహేంద్రపర్వతముఁబోలు నేనుఁగులతోను ధీరులగు భటులతోను గూడినదియు నైన యీ సేన యెవ్వనిది?" యని విలుకాండ్రలో మేటియైన విభీషణు నడిగెను. దేవేంద్రునిఁబోలు మగఁటిమి గల విభీషణుఁడు శ్రీరామునివాక్యము విని, మహాకాయులగు రాక్షసశ్రేష్ఠులయొక్క యుత్తమబలమును దెలుపఁ బూనెను: ఏనుఁగు మూఁపుమీఁదఁ గూర్చుండియున్న మహాకాయుఁ డును, నప్పుడే యుదయించిన బాలసూర్యునింబోలు నెఱ్ఱని మోముగల వాఁడునునై యేనుఁగుయొక్క కుంభస్థలమును గాళ్లతోఁ గదలించుచు వచ్చునట్టి యాతండు ముందు హతుఁ డయిన యకంపనునికంటె నితరుఁ డయిన యకంపనుఁ డని యెఱుఁగుము. సింహధ్వజముగల రథముమీఁదఁ గూర్చుండి యింద్రధనుస్సుమాడ్కి వెలుఁగు తన ధనుస్సును జళిపించుచు క్రూరములైన గుండ్రని కోఱలుగల్గి యేనుఁగుమాడ్కి వెలుఁగు నాతఁడు వరబలముగల యింద్రజిత్తు. వింధ్యపర్వతాస్తమయపర్వత మహేంద్ర పర్వతముల మాడ్కి నెత్తగు నాకారము గలవాఁడై రథమునఁ గూర్చుండి మిక్కిలి నిడివిగల వింటిం జళిపించుచు వచ్చునట్టి గొప్ప దేహముగల యాతఁ డతిరథుఁడును నతివీరుఁడును నైన యతికాయుఁ డని యెఱుఁగుము. అప్పుడే యుదయించిన బాలసూర్యునిఁ బోలి నెఱ్ఱ నయిన కన్నులుగలవాఁడై, గంటలు మిగులమ్రోగుచున్న యేనుఁగు మీఁద నెక్కి పరుషముగా నఱచునట్టివాఁడు మహోదరుఁడు. బంగా రపుటలంకారములుగలిగి సంజెప్రొద్దుటి మబ్బులచేఁ గ్రమ్మఁబడిన పర్వ తముకైవడి భాసిల్లుచున్న గుఱ్ఱముమీఁదఁ గూర్చుండి స్వకీయప్రభచేఁ దేజరిల్లు ప్రాసాయుధముఁ బూనిన యాతఁడు పిడుగువలె నోర్వరాని పిశాచుఁ డను రాక్షసుఁడు. పర్వతముఁ బోలు గొప్ప యెద్దు నెక్కి, వజ్రాయుధమునకంటె మించిన వడి గలిగి, మెఱపువలె మిఱుమిట్లు గొల్పునట్టి వాఁడి మొనవాలు దాల్చినవాఁడై వచ్చువాఁడు ప్రతాప శాలి యని పేరెన్నిక గన్న త్రిశిరుఁ డనువాఁడు. విశాలమై బలిసిన

చక్కని ఱొమ్ము గలవాఁడును, సప్పపుటెక్కెము వాఁడును నై పట్టుదల గలిగి, నారి మీఁటుచు, వింటిని జళిపించుచు నల్లనిమబ్బుం బోలు రూపుతో వచ్చునాతఁడు కుంభుఁ డనువాఁడు. సువర్ణ మయమైనదియు, వజ్రములు చెక్కినదియు, పొగలతోఁగూడ జ్వలించునదియు నైన గదను జేతఁ దాల్చి, రాక్షసబలమున కెల్లఁ డెక్కెమో యనఁదగినవాఁడై వచ్చు నాతఁడు గడు నబ్బురముగాను భయంకరముగాను యుద్ధము చేయఁగల నికుంభుఁడు. ధనుర్బాణములును గదయుఁగల్గి, టెక్కెము చెళ్లు భిల్లుచు నగ్నిహోత్రునిమాడ్కిఁ దేజరిల్లు నరద మెక్కి వచ్చు నెత్తయిన యాకారముగల యాతఁడు పర్వతశిఖరములే యాయుధములుగా నుప యోగించు నరాంతకుఁడు, పలుతెఱఁగులైన ఘోరరూపములును, వ్యాఘ్రోష్ట్రగజోత్తమాశ్వమృగములవంటి మోములును, గుండ్రని కన్నులును గలవై శోభిల్లుచున్న భూతములతోఁగూడినవాఁడు వేల్పుల గర్వము నణఁచిన యసురేంద్రుఁ డగు రావణుఁడు. చంద్రునిభాతిఁ దెల్లనై తోతెంచు సూక్ష్మదండము గల యుత్తమశ్వేతచ్ఛత్రము గానఁ బడుచున్నచోట నాయసురేంద్రుఁడు ప్రమథగణపరివేష్టితుఁడైన రుద్రునిభాతి వెలుఁగుచున్నాఁడు చూడుము. కిరీటము ధరించి, తళతళ మెఱయు నంటుజోళ్లు వేసికొని, మహేంద్రపర్వతముమాడ్కి నెత్తయిన రూపము గలవాఁడును, ఇంద్రాగ్నులగర్వ ముడిపినవాఁడు నైన యా రక్షోగణేశుఁడు సూర్యునిభాతి వెలుఁగుచున్నాఁడు చూడుము."

అని విభీషణుఁ డెఱిరిసేనలఁ జూపఁగా, రాముఁ డాలకించి వెండియు శత్రుసంహారి యగు విభీషణుం గాంచి, "విభీషణా! యాహా! రావణుఁ డెంత ప్రతాపశాలి! సూర్యుని వెలుఁగువోలెఁ జూడ నలవి కాక, యితనిడాలు చూపఱకు మిఱుమిట్లుగొల్పుచున్నది. ఇతఁ డధిక దీప్తి గలవాఁడు. ఇతనిరూప మెక్కువకాంతితోఁ గూడియుండుట స్పష్టముగాఁ గన్పట్టుచున్నది. ఇట్టి వెలుఁగుతోఁ గూడియున్న యీరాక్ష సేంద్రుని రూపము తఱచుగా దైత్యదానవవీరుల కుండనే యుండదు. ఈతని యోధులందఱు పర్వతోన్నతులు. పర్వతములఁబట్టి యుద్ధమొన రించువారు. దగదగవెలుఁగు నాయుధములు గలవారు. ఈరాక్ష సేంద్రుఁ డెక్కువమగఁటిమి గలవారలై తేజరిల్లు జోదులతోఁ గూడి

ప్రాణులతోఁ గూడిన యమునికైవడిఁ బ్రకాశించుచున్నాఁడు. ఈ పాపాత్ముఁడు విధివశమున నేఁడు నాకంటఁబడినవాఁడు. నేఁడు వీనియందు సీతాపహరణజనితకోపము చూపెదను." అని విభీషణునితోఁ జెప్పి, తన మగఁటిమి మెఱయ వింటిని గైకొని వింట బాణోత్తమమును సంధించి లక్ష్మణసమేతుఁడై నిలఁబడెను.

అట మహాకాయుఁ డగు రావణుఁడును బలవంతు లగు రాక్షస వీరభటులం బిలిచి, "నేను బురము విడిచి యిచ్చటికి వచ్చితి నన్న సంగతి దెలియునేని యిదే సందనియెంచి వానరులు గుంపు గూడి వచ్చి పురము లోపలఁ జొచ్చి పురము నాశముచేయుదురు. కావున మీర లందఱు, నలుదారులు గలియుచోటులందలి గృహములందును, పట్టణపుఁ గవను లందును వెఱపు మాని జాగరూకులై యుండుఁడు." అని రాక్షసవీరుల కెల్ల వారివారియోగ్యతలకుఁ దగిన పనులను నియమించి, యుద్ధరంగ మును జేరి గొప్పమీను సముద్రమును గలఁతపెట్టుకైవడి సముద్రపు వెల్లువంబోలు వానరసైన్యమును గలఁచెను. వెలిఁగెడి ధనుర్బాణ ములను గైకొని యుద్ధప్రదేశమున వచ్చుచుండు రాక్షసేంద్రునిఁ దటాలునఁ జూచి, సుగ్రీవుఁ డొకపర్వతశిఖరము నూడఁబెఱికి చేతఁబట్టు కొని యారాక్షసాధిపునిమీఁదికి గవిసి, పెక్కు వృక్షములతోఁ గూడిన యాపర్వతశిఖరము నా రావణునిమీఁద విసరివైచెను. అంతట రాక్షస లోకనాథుఁ డగు రావణుఁడు తనమీఁదికి వచ్చు నాపర్వతశిఖరమును బసిఁడిముల్కులు గల బాణములతోఁ దుత్తునియలు గావించి, యా పెక్కువృక్షములతోఁ గూడిన పర్వతశిఖరము నేలఁ గూలినవెంటనే, వాయువుమాడ్కిఁ బాఱునదియు, మిణుఁగుఱులతోఁ గూడిన యగ్నివలె మండునదియు, దేవేంద్రుని వజ్రాయుధము బోలు వడి గలదియునై, మహాసర్పముం బోలు నాకారము గలిగి యమునివలెఁ దేజరిల్లు సాయక మును గైకొని యాగ్రహముతో దానిని సుగ్రీవుని వధమునకై యేసెను. రావణాసురుఁడు ప్రయోగించిన వజ్రాయుధమువలె వెలిఁగెడి యా బాణము కుమారస్వామిచేఁ బ్రయుక్తమైన భయంకర శక్త్యా యుధము క్రౌంచపర్వతమును భేదించినచందమున నాసుగ్రీవుని ఱొమ్మును భేదించెను. ఆకఱకుటమ్ము దగులుటంజేసి యాసుగ్రీవుఁడు స్మృతిఁ దప్పి

క్రిందఁ బడెను. అట్లు సుగ్రీవుండు తెలివితప్పి పడియుంటను జూచి రాక్షసు లందఱు మిగుల సంతసించిరి.

తర్వాత గవాక్ష గవయ సుదంష్ట్ర ఋషభ జ్యోతిముఖ నభు లనువారు తమ దేహములను బెంచినవారలై గొప్ప పర్వతములను గైకొని యారాక్షసేంద్రుని నెదిరించి, యాపర్వతముల నాతనిపైఁ బ్రయోగింపఁగా, నారాక్షసాధిపుఁడు వారి పర్వతములను వాఁడిములు కులు గల బాణపుంజమ్ములచే వమ్ముచేసి, యా వానరవీరులను బసిఁడి ములుకులు గల బాణములచే నొప్పించెను. ఆవానరవీరు లా రావణా సురుని బాణంపు టేటులచే వికలములయిన శరీరములతో నేలఁగూలిరి. అట్లు వారు కూలుటగాంచి రాక్షసాధిపుఁడు తక్కిన వానరసైన్యము [illegible]టిని బాణపుంజలముచేఁ గప్పెను. శూరు లగు వానరు లందఱు [illegible]చే బాణములతో మోదఁబడి, నేలఁ బడి భయంకరరూపమైన [illegible]ణము లాయపట్టులందు నాఁటుటచే నిఁక నతనితో యుద్ధము చేయఁ జాలక యార్తశరణ్యుఁ డయిన రాముని శరణుఁ జొచ్చిరి.

వెంటనే ధైర్యశాలి యగు మేటివిలుకాఁ డయిన రాముఁడు రావణుని మీఁదికిఁ బోరునకుఁ దఱలెను. అంతట లక్ష్మణుండు దోసిలి యొగ్గి రాముకడకు వచ్చి, "యన్నా! తమ రీ దురాత్మునిఁ జంపఁగల రనుట కేసందియమును లేదు. కాని యీనీచునిమీఁదికిఁ దమరేల పోయె దరు? తమ యానతి యైనచో నేనే యీనీచునిఁ బొలియించెదను." అని వాస్తవార్థము గల పలుకులు పలుకఁగా, సత్యపరాక్రముఁ డగు రాముఁడును లక్ష్మణుం గాంచి, "లక్ష్మణా! యట్లె పొమ్ము. యుద్ధమున జాగ్రత్తతో నుండుము. రావణుఁ డెక్కువ మగఁటిమి గలవాఁడు; యుద్ధమున నందఱు వెఱఁగుపడునట్లులు ప్రతాపము చూపువాఁడు. అతఁ డలిగె నేని, ముల్లోకములవారు వచ్చినను నతని నేమియుఁ జేయఁ జాలరు. ఇది నిక్కము. అతని లోపములను, నీలోపములను గని పెట్టుచు, కంటితోఁ జూచుచు వింటితో బాణము లేయుచుఁ బూనికి గలిగి జాగ్రత్తతో నిన్నుఁ గాపాడుకొనుము" అని లక్ష్మణున కానతిచ్చి పుచ్చెను.

ఏనుఁగుతొండముం బోలునట్టి బాహువులు గల లక్ష్మణుఁడన్న యొక్కమాటలను విని యతనినిఁ గౌఁగిలించి మర్యాదతోడ నమస్కరించి, యుద్ధమునకుఁ దఱలిపోయి, యచ్చట వెలుఁగుచున్న వింటిని జేత నెత్తి పట్టుకొన్నవాఁడై బాణపుంజము లనెడి వర్షముఁ గురిపించి, వానరులకాయములఁ జక్కాడుచున్న యా రావణాసురునిఁ గాంచెను. ఇంతలోపల బుద్ధిమంతుఁడును తేజశ్శాలియు నగు వాయునందనుం డయిన హనుమంతుఁడు లక్ష్మణుఁడు యుద్ధమునకై వెడలినది చూచి, యతని కంటెఁ దానె ముందుగా నారావణుని యమ్ములనుఁ బడఁద్రోయుచు నతని నెదుర్కొని రథముచేరువఁ జేరి, కుడిచేయి పైకెత్తి యాతనిని వెఱపించుచు ని ట్లనియె: "ఓరాక్షసాధిపా! నీవు యుద్ధరంగమున దేవ దానవ గంధర్వ యక్ష రాక్షసుల నోడించినమాట వాస్తవమే. అయిన నీ కిప్పుడు వానరులు తలక్రింది గుండై యున్నారు. ఇదిగో, నేను బ్రతికియైదు వ్రేళ్లుగల నాకుడిచేయి నీయొడలియందుఁ జిరకాలమ[illegible] వసించు జీవాతను నెడలింపఁగలదు; చూడు." మని హనుమంతుఁడు రావణునితోఁ జెప్పెను.

పగతురకు వెఱపుగలిగించు మగఁటిమిగల రావణుఁడు హనుమంతుని పలుకు లాలకించి, కినుకచేఁ గన్ను లెఱ్ఱనై క్రాలుచుండ నాహనుమంతునిఁ జూచి, "ఓరీవానరా! వట్టిమాట లేల వదరెదవు. తడవుసేయక నీవు నిర్భయముగాఁ బోరి రావణునితోఁ బోరినవాఁ డనిన శాశ్వతకీర్తిని బడయుము. నీమొనగానితనముఁ దెలిసికొని యావల నిన్ను రూపుమాపెదను." అని బదులుసెప్పఁగా, వాయునందనుఁడును "ఓరీ! రేఁద్రిమ్మఱేఁడా! నాబలిమి నీకమీద నెఱుఁగఁబోయెదవా? ఇది యింతకుము న్నెఱుఁగవా? నీకుమారుఁ డక్షుఁ డెవరిచేఁ జచ్చినది? నాచేఁగాదా! అది యిప్పుడు జ్ఞప్తికిఁ దెచ్చుకొమ్ము" అని రావణు నెత్తి పొడిచెను. ఎక్కువ వెలుఁగు గల మొనకాఁ డయిన రాక్షసాధిపుఁ డగు రావణుఁడు హనుమంతుని పలుకులు ములుకులవలె మనమునఁ నాఁటనవ్వాయునందనుని నఱచేతితో బొమ్మునఁ గొట్టగా, హనుమంతుఁ డా దెబ్బకు నోర్వలేక పల్లఱు త్రుళ్లిపడి, కొంతతడవూరకుండి తన ప్రతాపమును బుద్ధియు మెఱయ దిటవు పూని, కట్టల్కతో నా వేల్పులగొంగ

నఱచేతితో బాఁదెను. పంక్తికంధరుఁడును ధీరుఁడైన యాహనుమ యఱచేతి బాఁదు నోర్వఁజాలక భూకంపముచే వడఁకు పర్వతముకై వడి గడగడ వడఁకెను. అట్లు రావణుఁ డా హనుమంతుని యఱచేతి బాఁదు నకుఁ ద్రుళ్లిపడుట కాంచి, దేవాసుర మహర్షి సిద్ధ వానరు లెక్కువ వేడ్కమీఱ కోలాహలము కావించిరి. అంత మహాతేజస్సుగల రావణుఁడు వాయునందనుం గాంచి, "ఓరీ కోఁతీ! నీ పరాక్రమము పొగడఁ దగినదే. నీ బలిమికై నిన్ను మెచ్చుకొంటిని" అని యనఁగా, హనుమ "రావణా! నాపరాక్రమము గాల్పనా? ఛీ ఇది నిరుపయోగమైనది. ఏల యన, నాయఱచేతిదెబ్బ నిన్ను జమునిప్రోలికిఁ బంపక యింకను బ్రాణములతో నుంచియున్నది. ఓరీ బుద్ధిహీనుఁడా! యేల యీ పొగడ్త! ఎదీ! యొక్కతడవఁ గొట్టు చూచెదను. ఇదిగో, నా పిడికిటితో నిన్నుఁ బొడిచి యమలోకమునకుఁ బంపెదను. జూడుము" అని చెప్పఁగా, రావణునకుఁ గోపము హెచ్చయ్యెను. అంతట వీర్యవంతుఁ డగు రావణుఁడు కోపముచే నెఱ్ఱనైన నేత్రములు గలవాఁడై పూనికతోఁ గుడిచేయి యెత్తి యతనిఱొమ్మున నొక గ్రుద్దు గ్రుద్దెను. హనుమంతుఁ డా ఱొమ్మునఁ దగిలిన దెబ్బచే మాటిమాటికిఁ ద్రుళ్లిపడెను.

అట్లు హనుమంతుఁడు డస్సిపోవుటను జూచి, యతిరథుఁ డయిన రావణుఁడు వడితో వానరసేనాధిపుఁ డయిన నీలునిమీఁదికి రథముఁ దోలెను. ప్రతాపవంతుఁ డైన రాక్షసాధిపుఁ డగు రావణుఁ డట్లు నీలుని నెదుర్కొని పాములంబోలునవియు, భయము గలిగించునవియు, యొరుల మర్మముల భేదించునవియు నగు కఱకుటమ్ముల నా నీలునిమీఁదఁ బ్రయోగించి యాతని దేహము మంటచే వెలుఁగునట్లు కావించెను. బాణపుంజముచే నొచ్చినవాఁ డయ్యు, నీలుఁ డొక్కచేతితోఁ బర్వతాగ్రము నొక్క దాని నారావణునిపై విసరివైచెను. అంతలోపల ధైర్యతేజములుగల హనుమంతుఁడును నించుక యలసటఁ దీర్చుకొని పోరుసేయఁగోరి సక్రోధముగా నిట్టటు చూచి, రావణుఁడు నీలునితోఁగూడఁ బోరుచుండుట కాంచి, "ఒకరితోఁ బోరుచున్న వానిమీఁదికి మఱియొక్కఁ డుఱుకుట యుక్తంబుగాదు" అని యూరకుండెను. ఎక్కువ తేజస్సుగల రావణుఁడును నీలుఁ డేసిన యా పర్వతశిఖరముపై నేడు వాఁడి ములుకులు గల

బాణమ్ముల నేయఁగా నది తుత్తునియలై నేలఁ జెదరిపడెను. తరువాత వానరసేనానాయకుఁ డగు నీలుఁడు, తా నేసిన పర్వతశృంగమట్లు పొడి పొడియగుట గాంచి ప్రళయకాలాగ్నిహోత్రునికైవడి మండిపడి, వెండియు నారావణునిమీఁద నశ్వకర్ణ, ధవ, సాల, చూతాదులగు పుష్పిత వృక్షములను బెక్కింటినిఁ బ్రయోగించెను. రావణుఁడును నా వృక్షములనెల్లఁ దెగఁగొట్టి యాయగ్నితనూజుఁడగు నీలునిపై భయంకర మైన శరవర్షముఁ గురిపించెను. గొప్పపర్వతము మేఘముచే వర్షింపఁబడిన తెఱఁగున రావణునిచే శరవర్షము గురిపింపఁబడినవాఁడై నీలుఁడు తన రూపము కుఱుచపఱచి యారావణుని టెక్కెముపై కుఱికెను. రావణుఁ డును తన రథపతాకముకొన నుండునట్టి నీలునిఁగాంచి, కోపముచే మండి పడెను. నీలుఁ డచ్చట నుండి సింహనాదము గావించుచు, నాటెక్కెము మీఁదనుండి, వింటికొప్పునకును, అచ్చటినుండి కిరీటముకొనకును నురుకు చుండుటగాంచి రామలక్ష్మణులును హనుమంతుఁడును విస్మయంపడిరి. ఎక్కువ వేఁడిమిగల రావణుఁడును వానరుని యానేర్పున కాశ్చర్య పడినవాఁడై, యబ్బురమయిన మండుచుండెడి యాగ్నేయాస్త్రమును గైకొనెను. రావణుఁ డట్లు పోరాటమున నీలుని నేర్పుచేఁ దత్తరపా టొందియుండుటను గాంచి వానరు లాసంగతి యెఱిఁగి, ముదముతో గగ్గోలుసేసిరి. వానరుల గగ్గోలుచే నంతకుమున్ను నీలునిపై నాగ్నే యాస్త్రము ప్రయోగింప నున్న యారావణుఁడు కొంతతడ వేమియుఁ దోఁపక యూరకుండెను. తర్వాత రావణుఁ డాగ్నేయాస్త్రముతో నభి మంత్రించిన యమ్ముఁ గైకొని, టెక్కెపుఁగొననుండు నీలునిఁ దలయెత్తి చూచి యిట్లనెను :

"ఓరివానరా! యెక్కువ మాయపూని నాయెడ నీచులకందనమును జూపుచున్నాఁడవు. నేర్పరివేని, నీప్రాణములఁ దక్కించుకొనుము. నీవు పలుమఱు పలుతెఱఁగులైన యయ్యయి రూపములు దాల్చుచున్నావు. అయినను నే నిదిగో వింటియం దాగ్నేయాస్త్ర మభిమంత్రించి ప్రయో గించిన యీబాణము ప్రాణము కాపాడుకొనుచున్న నీప్రాణములను దీయఁకలదు సుమా!" అని గొప్ప చేతులవాఁ డగు రావణుఁ డస్త్రముతో నమ్ము నభిమంత్రించి సేనాధిపతిని ఱొమ్మునఁ గొట్టెను. నీలుఁ డా యస్త్ర

సహితమైన బాణపు టేటు దగులుటచే మలమలమాడి స్మృతిదప్పి వెంటనే మోకాళ్లూని నేలమీఁదఁబడెను గాని తండ్రియగు నగ్నిహోత్రుని యను గ్రహమువలనను, దన ప్రతాపమువలనను బ్రాణములను విడువకుండెను. నీలుఁ డట్లు చెయువు లుడిగి పడినదిచూచి, యాతనిపని తీఱినదని యెంచి మేఘముమాడ్కి జ్వలించునట్టి తనరథమును లక్ష్మణునిమీఁదికిఁ దోలెను. అట్లు రావణుఁడు లక్ష్మణునిమీఁది కరదము పోనిచ్చి, యచ్చటనుండు లక్ష్మణు నెదిరించి, పుడమి యదరునట్లు వింటినారిని మీటెను. ధైర్య వంతుఁ డగు లక్ష్మణుఁడు గడునిడుదగైన వింటినారిని మీటుచుఁ దనపై కడరుచుండు రావణుం గాంచి ధైర్యముతో ని ట్లనియె: "రాక్షసాధి రాజా! నాకడకే రమ్ము. వానరులు నీకు సమానులు గారు గనుక వారి తోడి కయ్యమునకుఁ బూనుట యర్హము గాదు" అని చెప్పి వింటినారిని మీటఁగా, రాక్షసాధిపుఁడగు రావణుఁడు గంభీరమైన యాతని పలుకును, భయంకరమైన యట్లెత్రాటి చప్పుడును, విని, ధైర్యముతో నెదుట నిల్చి యున్న లక్ష్మణుం జేరి, "లక్ష్మణా! నీకు వినాశకాలము సమీపించెను గనుక, బుద్ధిహీనుఁడవై నాయదృష్ట వశంబుచే నాకంటఁ బడితివి నా యమ్ముల దెబ్బల కోర్వఁజాలక యీనిమిషముననే యమునిపురము నొంద గలవు?" అని లక్ష్మణునితోఁ బలికెను. లక్ష్మణుఁడును వాని పలుకులకు వింతపడక, గుండ్రని తెల్లనికొనలుగల కోఱలతోఁ గూడియున్న రావ ణుం గాంచి, "ఓరీ పాపాత్ముల మేటీ! ఏల యిట్లు వదరెదవు? నిక్కపు మహిమ గలవారు నీయట్లు వదరరు. రక్కసులఱేఁడా! నీశక్తి, నీబలిమి, నీవెలుఁగు, నీమగఁటిమి యెల్ల నే నెఱుఁగుదును. ఇదిగో నేను ధనుర్బాణ ములను జేతఁబట్టి నిల్చియున్నాను. రా రమ్ము కయ్యమునకు. వట్టి బడాయిమాటలతో నేమి యుపయోగము?" అని పొడుపుమాట లాడెను.

రావణుఁడు లక్ష్మణుని హేళనంపుఁ బలుకుల కలుకపూని, యాతని మీఁద వాఁడిములుకులు గల యేడుబాణములను బ్రయోగించెను. లక్ష్మ ణుఁడు చిత్రపుఁబసిఁడి ములుకులుగల వాఁడికొనలు గల వగు బాణము లచే నా యేడుబాణమ్ములను దుత్తునియలు కావించెను. పాములపడగలు పడఁగొట్టినట్లు తనబాణములఁ ద్రుంచినది రావణుఁడుచూచి కడుఁగోపము

పూని, మఱి పెక్కువాఁడియమ్ముల నేసెను. లక్ష్మణుఁడును వింటిని వంచి వాఁడిబాణములను గ్రుమ్మఱించెను. కత్తి వాతియమ్ము లర్ధచంద్రబాణములు, చెవులుగల యీఁటెలు నను నాయుధములచే రావణుఁ డేయు బాణములను ఖండించెనుగాని, యెంతమాత్రము గలఁతనొందకుండెను. వేల్పుగొంగలఱేఁడుతాను బ్రయోగించెడి యన్నియమ్ములు వమ్ములయినది చూచి లక్ష్మణునిచేతినేర్పున కచ్చెరువంది, మఱి వాఁడియమ్ములనేసెను. తర్వాత నాలక్ష్మణుఁడు వాఁడిములుకులు గలిగి, దేవేంద్రుని వజ్రాయుధముతోను బిడుగుతోను సమానమైన వడితోఁగూడి, యగ్నిహోత్రుని మాడ్కి వెలుఁగుబాణములను రావణుని వధముగోరి ప్రయోగించెను. ఆరాక్షసాధిపుఁ డగు రావణుఁ డా బాణములనెల్ల ఖండించి, యాలక్ష్మణుని బ్రహ్మదేవుఁ డొసఁగిన ప్రలయకాలాగ్నిహోత్రునికైవడి వెలుఁగు శరమ్ముతో నొసటఁ దగులనేసెను. లక్ష్మణుఁడును రావణుని వాఁడియమ్ము తాఁకుడునకు నొచ్చినవాఁడై చేతివిల్లు చేయిజాఱిపోవునట్లు గడగడ వడఁకెనుగాని మఱికొంత సేపటికంతయుఁ దెలివి యెట్టకేలకుఁ దెచ్చుకొని యావేల్పుఱేని గొంగవింటిని ద్రుంచివైచెను. లక్ష్మణుఁ డట్లు రావణుని యమ్మును ద్రుంచి, వాఁడిములుకులు గల మూఁడుబాణమ్ములచే నతనిం గొట్టెను. రావణుఁ డా బాణముల దెబ్బలకు నొచ్చినవాఁ డయి, యెట్టకేలకు సంజ్ఞపొంది యార్భాటము గావించి, తనవిల్లు విఱిగి, బాణములు తగిలి, రక్తముతోను, మేదస్సుతోను తడిసిన శరీరము గలవాఁడై, బ్రహ్మయొసంగిన యెక్కువశక్తిగల శక్త్యాయుధమును గైకొని, పొగలేని యగ్నిహోత్రునికైవడి వెలుఁగునదియు, వానరసేననెల్ల గడగడ లాడించునదియు, దేదీప్యమానమును నైన యాశక్తిని లక్ష్మణునిపైఁ బ్రయోగించెను.

లక్ష్మణుఁడును దనమీఁదికి వచ్చుచుండు నాశక్తిని వేల్వఁబడిన యగ్నిహోత్రునికైవడి వెలుఁగ భయంకర బాణములచేఁ గొట్టెను కాని యా శక్త్యాయుధము వానినెల్ల సరకుసేయక లక్ష్మణుని వెడదఱొమ్మునఁ జొచ్చెను. లక్ష్మణుఁడు శక్తిగలవాఁ డయ్యు శక్తినిహతుఁడై మూర్ఛ నొందెను. రాక్షసేంద్రుఁ డది యెఱిఁగి, తటాలున దగ్గఱ కుఱికి రెండు చేతులతో నతనింబట్టి యెత్తఁబోయెను కాని యాతని నెత్తఁజాలఁ

డయ్యెను. హిమవన్మందర మేరుపర్వతముల నైనను ముల్లోకముల నైనను వేల్పులతో గూడ నెత్తఁగలరు గాని యా లక్ష్మణుని గదలింప నైనను జాలరు. లక్ష్మణుఁ డప్పుడు ఱొమ్మున శక్త్యాయుధము దగిలినతోడనే తాను విష్ణువుయొక్క యచింత్యమైన యంశ మగుటను స్మరించుకొనెను. తర్వాత దేవవిరోధి యగు రావణుఁడు మానుషరూపము దాల్చిన విష్ణువు నంశమును శత్రువుల గర్వం బణఁచువాఁడును నయిన లక్ష్మణునిం జేతులతోఁ బట్టుకొనియు నాతని లేవదీయఁ జాలఁ డయ్యెను.

అంత వాయునందనుఁ డగు హనుమంతుఁ డలిగినవాఁడై రావణుని నెదురుకొని వజ్రాయుధముఁ బోలు పిడికిటితో నతని ఱొమ్మున గ్రుద్దెను. రావణుఁడు హనుమంతుని పిడికిటిగ్రుద్దు నోర్వఁజాలక, మోఁకాళ్లూని రథమునఁ జతికిలఁబడి, వణఁకుచుఁ బరుండి, ముక్కులనుండియు, నేత్రములనుండియుఁ బది నోళ్లనుండియుఁ నెత్తురు పెల్లుగ్రక్కుచుఁ, గొంతతడ విట్టటు పొఱలుచుఁ పిమ్మటఁ జెయువులు మాని, యరదము నడుమఁ గూలి కొంతసేపు మై మఱచి, మఱల స్మృతినొందియుఁ గుదుటఁ బడనివాఁ డయ్యెను. సమరమున శత్రుభీకర మగు విక్రమము గల రావణుఁడు మైమఱపు నొందుటఁ జూచి, వానరులును, ఇంద్రాది దేవతలును ఋషులును నానందసూచక కోలాహలములు గావించిరి. అంతఁ బ్రతాపశాలి యగు హనుమంతుఁడు రావణుని శక్తిప్రహారముచే నొచ్చియున్న యాలక్ష్మణునిఁ జేతులతోఁ గ్రుచ్చియెత్తి రాముని చేరువకుఁ దెచ్చెను. హిమవన్మందరాది పర్వతములకంటెను నెక్కువఁ బరువైన యాలక్ష్మణుఁడు శత్రువులచేఁ గదలింపనైన నలవికానివాఁ డయ్యు, హనుమంతునియొక్క చెలిమిచేతను, పరమభక్తిచేతను నాతనికిఁ దేలికయయ్యెను. రావణుఁడు ప్రయోగించిన శక్తి యుద్ధమునఁ బగతురచే జయింప నలవికాని యా లక్ష్మణుని విడిచి మఱల రావణుని రథమున వచ్చి చేరెను. అంత శత్రుసంహారి యగు లక్ష్మణుఁడు తన్నుఁ జింతింపరాని విష్ణువు నంశమునుగాఁ దలఁచి, వెంటనే తెలివి నొంది, బాణవ్రణములు మానినవాఁ డయి నెమ్మది నొందెను. గొప్ప యుద్ధమున నెక్కువ వేఁడిమి గల రావణుఁడు మఱల ప్రజ్ఞవడసి, గొప్పవింటిని వాఁడి బాణములను గైకొనెను. అతఁడు మఱల యుద్ధసన్నాహముతో వచ్చుటఁ గాంచి,

వానరసైన్యము తమలోని శూరు లందఱు బలుగాయములు దిన్నందుచే వెఱచి పరుగెత్తుట చూచి, రాముఁడు రావణుని నెదురుకొనెను. అప్పుడు హనుమంతుఁడు రామునికడ కేతెంచి, "రాఘవా, బల్మికాఁ డగు గరుత్మంతునిమీఁద విష్ణు వెక్కి యసురులతోఁ బోరునట్లు నా వీపుమీఁద నెక్కి యుద్ధముచేసి యీరాక్షసుని సంహరింపుము" అని ప్రార్థింపఁగా, రాముఁడు హనుమంతుని పలుకులు విని, యా బలవంతుఁ డయిన హనుమంతునిమీఁద నెక్కి, యుద్ధభూమియందు రథారూఢుఁడై యున్న రావణాసురునిఁ జూచి, కోపయుక్తుఁ డయిన విష్ణువు బలిచక్రవర్తినిఁ గూర్చి, యడరినట్లు లా రావణాసురునిమీఁదికి రేఁగి, పిడుగువలె నల్లె త్రాటిని మ్రోగించి, "రావణా! నీవు నాకిట్టి యప్రియ మొనరించి యెక్కడికిఁ బోయి తప్పించుకొనఁగలవు? నీవు దేవేంద్రు నేని, యమునినేని, సూర్యునేని, బ్రహ్మాగ్నిశంకరుల నేని శరణు చొచ్చినను, పదిదెసలలో నేమూలలలో డాఁగినను నాబారినుండి తప్పించుకొనఁ జాలవు. ఓరీ! నీ వెవనిని శక్త్యాయుధముతోఁ గొట్టి త్రోసితివో, రాక్షసగణాధిపా! నీకును నీ పుత్రమిత్రబంధు సుహృజ్జనపరివారమునకును మృత్యువైనట్టి యాతఁడు నీకు విచారము గలిగించువాఁడై యిదిగో యిటు వచ్చినాఁడు. ఇతఁడింతకు మున్నుచూడ వింత గొల్పు చూడ్కులు గలవా రగు జనస్థానమునందలి పదునాలుగు వేవురు రక్కసుల నుత్తమము లయిన యాయుధములతో వచ్చిన వారిని నుగ్గు చేసెను సుమా! అది మఱువకుము." అని రావణాసురునితోఁ జెప్పెను.

తర్వాత రాక్షసాధిపుఁ డగు రావణుఁడు రాఘవుని పలుకులు విని, రణప్రదేశమున నాతని వహించుచుండు నెక్కువ మగతనము గల వాయునందనుని వాడియమ్ములచేఁ గొట్టెను గాని, యా హనుమంతుఁడు స్వకీయమైన తేజస్సుగలవాఁ డగుటచే నతనికాంతి మఱింత హెచ్చెను. తర్వాత నెక్కువ తేజస్సు గలవాఁ డగు రాముఁడు తన్ను వహించుచుండు హనుమంతుని కిట్లు రావణుఁడు గాయములు గల్గించుట గాంచి, యెక్కువ యాగ్రహము పూని, యా రావణుని యరదము సమీపించి, యతని రథమును చక్రాశ్వధ్వజపతాకాఛత్రములతోడను సారథితోను బడనేసి, వాఁడిమునుకులు గల యమ్ములచే నాతని

చేత నున్న పిడుగుంబోలు శూలమును, ఖడ్గమును దుత్తునియలు సేసెను. అట్లు రాముఁడు రావణుని రథాదులను బఁడద్రోసి భగవంతుఁడగు నింద్రుఁడు మేరుపర్వతమునుం బోలె విశాల రమణీయమై యున్న రావణుని ఱొమ్మున వజ్రాయుధముఁ బోలు బాణముతో వడిగా మోదెను. తొల్లి దేవేంద్రుని వజ్రాయుధము దెబ్బలకైనఁ దలఁకని యట్టి రాక్షసేశుఁ డిప్పుడు రాముని యమ్ముదెబ్బచేఁ గడు నొచ్చి గడగడ వడఁకి చేత నున్న వింటిని జాఱవిడిచెను. రావణుఁ డట్లు డస్సియుండుటగాంచి, యర్ధ చంద్ర బాణము గైకొని, సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు రాక్షసాధిపుని కిరీటమును ద్రుంచెను. విషము లేని పాముతో సమానుఁడును, వేఁడిమితగ్గిన సూర్యునికైవడిఁ గాంతిలేనివాఁడును, కిరీటాగ్రము తెగినవాఁడును నైన రాక్షసేంద్రుం జూచి, "ఓరావణా! నీవు మాసేనలోని వీరుల నొప్పించి, కడు నబ్బురమైన కార్యమొనరించి డస్సియున్నట్లు కన్పట్టుచున్నావు గనుక, నీపై బాణప్రయోగము చేసి నిన్ను మృత్యువుపాలు సేయనైతిని. పొమ్ము. నీ కనుజ్ఞ యొసఁగితిని. సమరము చేసి డస్సియున్నాఁడవు. లంకాపురమున కేఁగి, రాత్రికి నేద దీర్చుకొని, మఱల ధనుస్సును బాణములను గైకొని యరద మెక్కి యుద్ధమునకు రమ్ము. అప్పుడు రథారూఢుఁడవై నాబలిమిని జూడఁ గలవు." అని రావణునిఁ దూలనాడెను. రావణుఁ డిట్లు రామునిచేఁ దూలనాడఁబడుచు, గర్వోత్సాహము లుడిగి, వింటిని రథ, రథాశ్వ, రథసారథులం బోఁగొట్టుకొని యమ్ములచే గాడనేయఁబడి భిన్నకిరీటాగ్రుఁడై సిగ్గుచేవడిగా లంకలోఁ బ్రవేశించెను. అట్లు బలవంతుఁడును దేవదానవ విరోధియు నగు రావణుఁడు లంకాపురమునఁ బ్రవేశించిన పదంపడి రాముఁడు సమరమున నొచ్చిపడి యున్న వానరులయు, లక్ష్మణునియొక్కయు గాయములను మాన్పెను. వేల్పుటేనికిఁ బగతుఁ డయిన రావణుఁడు కిరీటము విఱిగి, యవమాన మొంది లంకం బ్రవేశింపఁగా, సురాసుర భూతగణములును, మహర్షి పన్నగములును, భూచర జలచరములును సాగరములలో నుండువారును, బదిదెసల నుండువారును మహాసంతోషము నొందినవారైరి.

60-వ సర్గము

కుంభకర్ణుని యుద్ధమునకై లేపుట

అవ్విధమున రావణుఁడు లంకాపురము సొచ్చి, రాముని బాణములకు వెఱచినవాఁడై దర్పముడిగి, మనమునఁ గలవరపాటొందెను. సింహముచే నేనుఁగుకైవడియు, గరుడునిచేఁ బన్నగము పగిదియు, మహాత్ముఁ డయిన రామునిచే రావణుం డవమానితుఁ డయ్యె. రాక్షసేశ్వరుఁడు బ్రహ్మాస్త్రముఁ బురుడించునవియు, మెఱుఁగుకైవడి మెఱయునవియు నైన యా రాముని బాణములను దలఁచి మిక్కిలి మనమునఁ జింతించెను. ఆరాక్షసేంద్రుఁ డవ్విధమునఁ జింతించి, బంగారు మయమైన దివ్యసింహాసనమునఁ గూరుచుండ మంత్రు లగు రక్కసుల నందఱను గాంచి యిట్లనియె: "నే నొనర్చిన గొప్పతపమెల్ల వ్యర్థమై పోయెను: కావుననే మహేంద్రుం బోలెడి నేను మానవమాత్రున కోడితిని. "ఓరావణా! నీకు మానవులవలన భయము రాఁగలదని యెఱుఁగుము" అని బ్రహ్మదేవుఁడు సెప్పిన ఘోరవాక్యము నావిషయమున నిప్పుడు నిక్కమయ్యెను. నేను బ్రహ్మను గూర్చి తపస్సుచేసినప్పుడు దేవదానవ గంధర్వ యక్షరాక్షస పన్నగులవలన మరణము లేకుండునట్లు బ్రహ్మదేవుని వరముఁగోరితిని గాని, మానవులవలన మరణము గలుగకుండునట్లు వరముఁగోర నైతిని. తొల్లి యిక్ష్వాకుకులాధిపుఁ డగు అనరణ్యుఁ డను నృపాలుఁడు "ఓరాక్షసాధమా! కులాధమా! బుద్ధిహీనుఁడా! నిన్నుఁ బుత్రమిత్రబలసారథి చతురంగ బలములతోఁ గూడ సంహరింపఁ జాలిన పురుషుఁ డొక్కఁడు మావంశమున జనింపఁగలఁ డని శపించెను. దశరథుని పుత్రుఁ డగు రాముఁడె మానుషావతారమెత్తిన నామృత్యువోయని తలఁచెద. నేను తొల్లి వేదవతి నెప్పుడు బలాత్కరించితినో, యప్పు డామె నన్ను శపియించినది. ఇప్పుడా మహాత్తురాలగు వేదవతియె తనశాపము సాధించుటకై జనకరాజ పుత్రిక యగు సీతగా నవతరించియున్నది. మఱియు నేను కైలాసపర్వతముఁ గదలించినప్పుడు పార్వతి స్త్రీ నిమిత్తమై నాకు వధము గలుగు నని శాపం బొసఁగెను. నందీశ్వరుఁడు తన్ను నేఁ బరిహసించినప్పుఁ డలిగి, "కోఁతిరూపముఁ దాల్చిన నన్ను నవమానించితివి కావున నావంటిరూపమును నావంటి వీర్యమును

గలవారివలన నీకుఁ జేటు వాటిల్లు నని శాప మొసఁగెను. రంభయుఁ బుంజికస్థలయుఁ దమ్ము నిర్బంధపఱచుటచే "నీవు కోరికిలేనికాంతను గోరితివేని, నీతల వేయిముక్కలుగాఁ జీలఁగలదు" అని శాపమొసఁగిరి. వారి శాపములెల్ల సిద్ధించినవి. ఋషుల పలుకు లెప్పటికిని వమ్ములుగావు. కావున నమాత్యులారా! యీశాపస్వరూపముఁ బరికించి, శత్రువిజయమునకు తగు యత్నములు సేయవలయును. భటులందఱు పట్టణంపు నడుమలను గోపురములకొనలందును మెలఁకువతో నుండుఁడు. సాటిలేని గాంభీర్యముగలిగి, దేవదానవుల గర్వం బణఁచిన వాఁ డయినను, బ్రహ్మశాపము వలన నిద్రకుఁ బరవశుండయి యున్న కుంభకర్ణుని లేపవలయును" అని యమాత్యులతోఁ జెప్పెను. రావణుఁడు కుంభకర్ణున ట్లకాలమున లేపఁ దలఁచుట యేల? ఆ మహాబలుం డగు రావణుఁడు తానోడుటయు తన మంత్రిసత్తముఁ డగు ప్రహస్తుఁడు మడియుటయుఁ జూచి, కుంభకర్ణుండు భయంకరబలము గలవాఁ డని యెఱిఁగి యాతని లేపవలయు నని బంటుల కానతిచ్చెను. అట్లానతియ్యఁదలఁచి మంత్రులను రాక్షసులం గాంచి "మీరు ద్వారములందుఁ గావలియుండుఁడు. వానరులు దుమికి లోపలికి రాకుండునట్లు ప్రాకారము లెక్కి కావలి కాచుచుండుఁడు. నిద్రాపరవశుఁడై యున్న కుంభకర్ణుని నిద్ర లేపుఁడు. ఈ కుంభకర్ణుఁడు చేటుకాలమున బుద్ధి ముసించుటచే నే నివ్విధమున నాపదలలోఁ జిక్కి యీప్సితార్థము నొందకయుండఁగా నిద్రించుచున్నాఁడు. ఇతఁ డొకప్పు డాఱునెలలును, ఒకప్పు డేడునెలలును, ఒకప్పు డెనిమిదినెలలును, ఒక్కొక్కప్పుడు తొమ్మిది నెలలును నిద్రించుచుండును. అతఁడు నాతో నాలోచించి నేటికిఁ దొమ్మిదవనాఁడే శయనము చేరెను. ఆ మహాబలుఁ డగు కుంభకర్ణుని వేగ లేపుఁడు. సర్వరాక్షసులలో మేటియైన నిడివి చేతులవాఁ డగు కుంభకర్ణుఁడు వానరుల నందఱను, రాజపుత్రులగు రామలక్ష్మణులను వేగమే వధింపఁగలఁడు. ఈకుంభకర్ణుఁ డెల్ల రాక్షసులకు మేటియైనవాఁడు. ఇతఁ డెల్లప్పుడు మూఢుఁ డయి గ్రామ్యసుఖమునఁ దవిలి నిద్రించుచున్నాఁడు. ఈ భయంకర యుద్ధమున రాముఁడు నన్నవమానించి తఱిమినది మొదలు నేను సుఖముచక్కయున్నాను. ఈకుంభకర్ణుని లేపినచో, నావంత మానఁగలదు. అసమయ

మున నిద్ర లేపుట యనుచితముగాదా యనిన, నే నిట్టి యిక్కట్టున నుండఁగా, నెవ్వఁడు నా సాహ్యమునకై పూనఁడో, యట్టి యింద్రునిం బోలు విక్రమముగల యాతఁ డుండి యేమి యుపయోగము ? కావున మీరు తడవు సేయక యతనిని లేపుకొని రండు" అని భటుల కానతిచ్చెను.

రక్తమాంసములు మెసవునట్టి యా రాక్షసు లందఱు రావణుని యానతింబడసి, గంధమాల్యాభరణాదులను, భక్ష్యభోజ్యాదులను గైకొని, వడిగాఁ బయనమై గొప్పద్వారముగలదియు, యన్నివైపుల యోజనము నిడివిగలదియు, యన్ని దెసలఁ గుంభకర్ణుని దేహమందలి గంధపుఁ బ్రవాహములతో నిండినదియు, మనోహరమును నైన యా కుంభకర్ణు డుండు గుహఁ బ్రవేశింపఁ బయనమై, తాము గడు బలిమిగల వా రయ్యు నాకుంభకర్ణుని యూర్పుచే వెనుకకుఁ ద్రోయఁబడినవారలై యెట్టకేలకు పూనికితో నాగుహయందుఁ బ్రవేశించిరి. వారు పసిఁడి మయంపుఁ బ్రదేశము గల యందమైన గుహం బ్రవేశించి, పాన్పుమీఁద మోటుతనముగా నిద్రించువాఁడును, శిథిలమయిన పర్వతము కైవడిఁ బడియున్నవాఁడును, నిక్కఁ బొడుచుకొనియున్న రోమములు గల వాఁడును, పాముపలె బుసకొట్టుచున్నవాఁడును బెదరు పుట్టునట్లు గుఱక పెట్టుచున్నవాఁడును, చూడ్కికి భయము గలిగించుచున్నవాఁడును, నస హ్యపు ముక్కుతొఱ్ఱలవాఁడును, బాతాళముమాడ్కి వెడదమోము వాఁడును, పాన్పుపై నన్నియంగములఁ బడవైచినవాఁడును, మేదో రక్తముల కంపుగలవాఁడును, బంగారపు బుజపురులునుఁ గిరీటమును దాల్చినవాఁడును, శత్రుసంహారకుఁడును నైన బలవంతుఁ డగు కుంభ కర్ణునిఁ గాంచిరి. తర్వాత నమ్మహాబలు లగు రాక్షసులు కుంభకర్ణునిఁ గాంచినవెంటనే యాతని యెట్టయెదుట మేరువుంబోలు మృగమహిష వరాహమాంసపు రాసులను, నాశ్చర్యకర మగు నన్నరాశిని, రక్తంపుఁ గడవలను, పలువిధములగు మద్యపు బానలను నుంచిరి. తర్వాత నా రాక్షసవీరులు నెత్తావిగల గంధముఁ బూసిరి. మేలిమి బట్టలఁ గట్టిరి. నెత్తావిగల పూవులదండలను మెడలో వైచిరి. చక్కని వాసనగల ధూపము లేసిరి. శత్రుసంహారియైన యా కుంభకర్ణునిఁ బలుతెఱఁగుల స్తోత్రము చేసిరి. అంతట రాక్షసులందఱు క్రొక్కాఱు మేఘములకైవడి

మాటమాటికి గగ్గోలు చేసిరి. చంద్రునిఁ బోలెఁ దెల్లనైన శంఖముల నూఁదిరి. ఎంత పట్టుదలతో లేపియు లేవకపోవుటంజేసి యాగ్రహముతో రొద యొనరించిరి. వారు మఱలఁ గుంభకర్ణుని లేపుటకై చేతులతో నాతని దేహముఁ గొట్టిరి. ఇటటు గదలించిరి. గొప్పధ్వనిచేసిరి. వారొనరించిన శంఖభేరీ మర్దలవాద్యధ్వనులును, చేతుల చప్పళ్లు తట్టుటలును, కూఁతలును, సింహనాదముబోలు పెడబొబ్బలును విని పక్షులెల్లఁ జెదరి పదిదెసలకుఁ బాఱి యచ్చటఁ బుడమిపైఁ బడినవి. వారిట్లు నెత్తిని నోరు వెట్టుకొని యవ్విధముగా నఱచియు, మహాధీరుఁడు లేవకపోఁగా వారు గుదియలను, రోఁకళ్లను, గదలను, పర్వతశిఖరములను గైకొని హాయిగా నిద్రించుచుండు నా కుంభకర్ణునిఁ గొట్టిరి. కాని రాక్షసులు బలవంతు లయ్యును నాతనియూర్పులవడికి నెదుట నిలువఁజాలక పోయిరి. అంత భయంకరవిక్రములగువారును, కాటుకకొండఁ బోలువారును నైన పదివేలమంది రాక్షసు లొక్కుమ్మడిగాఁ జుట్టుకొని మృదంగభేరీ శంఖ కుంభము లనెడి వాద్యములను మ్రోగించుచు నాయుధములతోఁ బొడుచుచు పెనుబొబ్బలు వెట్టుచు నతనిని లేఁపఁజూచిరి గాని, యతఁడు మాత్రము మేల్కొనఁ డయ్యెను. అట్లు వారెన్ని చేసియు నతనిని లేపఁ జాలక పోఁగా, మఱింత ఘోరమైన కడుగొప్పయత్నము చేయఁబూనిరి. ఆతని యొడలిమీఁదఁ బరుగెత్తించుటకై గుఱ్ఱములను మునికోలలతోఁ బొడిచిరి. ఒంటెలను గఱ్ఱలతో బాఁదిరి, ఏనుఁగుల నంకుశములతోఁ బొడిచిరి. తమ యావద్బలము నుపయోగించి భేరీమృదంగ వాద్యములను వాయించిరి. శంఖముల నూఁదిరి. అతని యంగములను ములు గఱ్ఱలతోను, గుదియలతోను, రోఁకళ్లతోను గ్రుచ్చిరి. ఆ రాక్షసులు చేయు రొదలు పర్వతారణ్యములతోఁగూడ లంకాపురమెల్లఁ నిండెను. కాని యతఁడు మాత్రము లేవఁ డయ్యెను. అంతట నారాక్షసులందఱు వేయిదుందుభివాద్యములు దెచ్చి యొక్కటేతడవగాఁ బసిండికోలలతో మ్రోఁగించిరి. అట్లు వేయివాద్యము లొక్కుమ్మడిగా వాయించియు నా కుంభకర్ణుండు బ్రహ్మశాపముచే మితిమీఱి నిద్రించుటంజేసి నిద్ర లేవకుండెను. అంతట రాక్షసు లంద ఱెక్కువకోపము చెంది, యాతని లేఁపుటకై పిడికిళ్లతో గ్రుద్దుట మొదలగు తమ పరా

క్రమంబులు చూపిరి. కొందఱు దుందుభివాద్యములు వాయించిరి. కొందఱు గొప్పకూఁతలు పెట్టిరి. కొందఱు దలవెంట్రుకలఁ బట్టి లాగిరి. మఱికొందఱు చెవులఁ గొఱికిరి. నూఱులకొలఁది కుండలనీటి నతని చెవులలోఁ బోసిరి. అయినను కుంభకర్ణుఁడు పెనునిద్దురకుఁ బరవశుఁడయి యుండుటచే నించుకేనియుఁ బొఱలఁ డయ్యెను. అంత వా రందఱు కూటముద్గరముల నెత్తికొని, తలమీఁదను, ఱొమ్మునను నంగము లందును గొట్టిరి. త్రాళ్లతోను, బిగించి కట్టిన గదలతోఁ గొట్టఁబడియు నామహాకాయుఁ డగు కుంభకర్ణుఁడు నిదుర లేవఁ డయ్యెను. తర్వాత నా రాక్షసు లా కుంభకర్ణునిమీఁద వేయియేనుఁగులఁ బరుగెత్తించిరి. అంతఁ గుంభకర్ణుఁడు మేల్కొని పురువు మీఁదఁ బాఱుకాడినట్లుగా, దలఁచెను. రాక్షసులు తనమీఁద నేయునట్టి పర్వతశిఖరములయుఁ వృక్షములయు నేటులను గమనింపక నిద్రాభంగమువలనను, క్షుద్బాధ వలనను నావులించుచు చివాలున లేచెను. ఆరేద్రిమ్మఱీఁడు సర్పశరీరముం బోలె నిడివియుఁ బర్వతశిఖరముమాఁడ్కి బలిమియుఁ గలవైన తన బుజములను సాచి, సముద్రమధ్యమున నుండు బడబ యను నశ్వము నోరువంటి తనవెడఁద నోటిని తెఱచి వికృతముగ నావులించెను. కుంభ కర్ణుఁడు మిక్కిలి భయంకరముగా నావులింపఁగాఁ బాతాళముఁ బోలు నాతని నోఱు మేరుపర్వతశిఖరమున నుదయించిన సూర్యునిమాఁడ్కిఁ గానఁబడెను. అతిబలుఁడైన యాకుంభకర్ణుఁ డావులించుచు మేల్కొనెను. పర్వతమునుండి గాడ్పు వీచునట్లు లాతని నాసికారంధ్రములనుండి నిట్టూర్పు వెలువడెను. అట్లు సకలాభరణములఁ దాల్చిన యా కుంభ కర్ణుని రూపము వర్షర్తువునందు విశేషముగా వర్షించునట్టిదై కొంగలతోఁ గూడిన మేఘాకృతివోలెను, మండుచున్న యగ్నివలెను మెఱుపు వలెను దేజరిల్లునట్టి యాతని మిడిగ్రుడ్లు జ్వలించుచున్న మహా గ్రహములవలెను నగపడెను. అంత బలవంతుఁ డగు కుంభకర్ణుఁడు లేచి కూర్చుండి నిద్దురమత్తు తొఱంగి యాఁకలి గొన్నవాఁ డయి, యెదుట నుంచియున్న నానావిధభక్ష్యములను, వరాహమహిషమృగముల నంజుళ్లను దినుచుఁ దల యెత్తినప్పుడు నల్లను, మెదసును, మద్యమును ద్రాగెను. అంతట నచ్చట నున్న రాక్షసు లందఱు కుంభకర్ణుఁడు

తనివి నొందె నని యెఱింగి లేచి నిలువఁబడినవారై యాతనికి మ్రొక్కి చుట్టును నిలుచుండిరి. నిద్రబరువు తగ్గని యెఱ్ఱనైన కన్నులతో నాకుంభకర్ణుఁ డంతట దృష్టిఁ బర్వఁ జేసి, యారాక్షసుల నందఱను జూచి తన్న కాలమున నిద్ర లేపుటకు వింతపడినవాఁడై, "రక్కసులారా! మీరు నన్నేల యింత యాదరించి లేపితిరి. రాక్షసాధిపునకుఁ గుశలమే కదా? అతనికి భయ మేమియు లేదు గా? మీ కిప్పుడు పగతురవలన నేది యో భయము తటస్థపడిన ట్లున్నది. లేకున్న మీ రింత తత్తర పాటుతో నన్ను లేప నేల? ఇప్పుడు నేను రావణునికిఁ గలిగిన భయ మును వేఱుతోఁ బెళ్లగించి వైచెదను. ఆతనికిఁ గీడొనర్చిన యింద్రు నైనఁ బరిమార్చెదను; అగ్నిహోత్రుని నైన ఛేదించెదను. స్వల్ప మాత్రమునకు నన్నన్నగారు లేప మని యుండరు. కావున నన్ను లేపఁ గారణమును వాస్తవముగా నెఱింగింపుఁడు" అని యారాక్షసుల నడిగెను.

ఇవ్విధముగా నడిగిన కోపాటోపము గలవాఁ డయిన యెక్కువ బలవంతుఁ డగు కుంభకర్ణుంగూర్చి, రావణాసురుని మంత్రి యగు యూపాక్షుఁ డి ట్లనెను: "ఇంద్రాదిదేవతలమూలమునఁ గలిగిన భయ మెద్దియు మాకు లేదు. మానవునివలనఁ గలిగిన భయమే మ మ్మిప్పుడు గడు బాధించుచున్నది. ఇప్పుడు మానవునివలనఁ గల్గినట్టి భయము వంటి భయము దైత్యదానవులవలనను మాకుఁ గలిగినది కాదు. పర్వ తములం బోలినవా రగు వానరు లీ లంకాపురమును ముట్టడించి యున్నారు. సీతాపహరణమువలనఁ గుపితుఁ డయిన రాముఁ డిప్పుడు మాకు గొప్పభయము గలిగించెను. కొన్ని దినముల క్రిందట నొక్క వానరుండు వచ్చి మా గొప్పపురమంతయుఁ గాల్చివేసెను. అక్షకుమా రుఁడు సబలపరివారముగా వధింపఁబడెను. దేవతలకుఁ గంటకుఁ డయిన రాక్షసాధిపుఁ డగు పౌలస్త్యుఁడు తానే సూర్యునిమాడ్కిఁ దేజరిల్లునట్టి రామునిచే మృతప్రాయుఁ డని యెంచి విడిచిపెట్టఁబడెను. తొల్లి దేవ దానవ దైత్యులవలనను నవమాన మొందనట్టి మనప్రభువు రాముఁడు ప్రాణములమాత్రము దీయక తక్కిన యన్ని విధములైన పరిభవము

లొనరించి విడిచెను. ఓ రావణానుజా! ప్రభు వీయాపదం బట్టి నిన్నసమయముప నిద్దురలేపఁ బంపెను'' అని.

కుంభకర్ణుండు యూపాక్షునిమాటలవలనఁ దన యన్నకు రాముని మూలమునఁ గలిగిన పరాజయము విన్నవాఁడై, కోపముచేఁ గన్నులు గిరగిర ద్రిప్పుచు నయ్యూపాక్షుం జూచి "యూపాక్షా! నే నిచ్చటినుండి సమరమున కేఁగి, యా వానరులను, రామలక్ష్మణులను వధించి, పిదప రాక్షసేంద్రునిఁ జూచెదను. వానరుల రక్తమాంసములచే రాక్షసులను, దనివినొందించి, రామలక్ష్మణుల రక్తములను నేనే పానము సేసెదను" అని చెప్పఁగా, రాక్షసభటులలో ముఖ్యుఁ డైన మహోదరుఁడు కుంభకర్ణుడు గర్వయుక్తముగాను, కోపముచే నీతిఁదప్పియుఁ జెప్పిన పలుకులు విని చేతులు జోడించుకొన్నవాఁడై, "మహాబాహువా! రావణునికడకు వచ్చి యతఁడు సెప్పిన పలుకు లాలించి, యందలి గుణదోషములఁ బరికించి యావల శత్రువుల జయింపఁగలవు" అని చెప్పఁగా, మహాబలతేజములు గలవాఁ డగు కుంభకర్ణుఁడుఁ రాక్షసులతోఁ గూడ రావణుని నగరునకుఁ దఱలెను. భీకరము లగు నేత్రములునుఁ రూపమునుఁ బరాక్రమమునుం గల యా కుంభకర్ణుని లేపి, రాక్షసు లందఱు సత్వరముగాఁ బోయి, సింహాసనాసీనుఁడై యున్న రాక్షసేంద్రునిఁ గాంచి జేతులు జోడించుకొన్నవారై "రాక్షసాధిపా! యనుజుఁడు కుంభకర్ణుఁడు నిద్దురలేచెను. తా మచ్చటికిఁ బోయి చూచెదరా! లేక, యిక్కడికిఁ బిలుచుకొని రమ్మనెదరా"యని రావణు నడిగిరి. రాక్షసేశ్వరుఁడును దన్నుఁ గొలుచుచున్న రాక్షసులం జూచి "యాతని నిచ్చటికి రప్పించియే చూడఁగోరుచున్నాను. ఆతనికిఁ దగిన తెఱఁగున మర్యాద గావింపుఁడు" అని చెప్పఁగా, నా రాక్షసు లందఱు మఱలివచ్చి, కుంభకర్ణుం జేరి, "శూరుఁడా! రాక్షసాధిపుఁడు నిన్నుఁ జూడఁగోరుచున్నాఁడు. అచ్చటికి వచ్చి యన్నమాట నంగీకరించి యతనిని సంతోషపఱపుము" అని చెప్పిరి. శత్రువుల కెదిరింప నలవికానివాఁ డగు దీర్ఘబాహుఁ డయిన కుంభకర్ణుఁడును నన్నయానతిని విని యట్లె వచ్చెద నని పలికి పాన్పునుండి, దిగ్గన లేచి, మోముఁ గడుగుకొని, జలక మాడి, యలంకారములను ధరియించి, దప్పిగలవాఁడై బలవర్ధకములైన మద్యములఁ దెమ్మని వేగిరపెట్టెను.

అంత రాక్షసులు రావణుని యానతిం గైకొని కడవలతో నానావిధము లైన మద్యములను దెచ్చియుంచిరి. కుంభకర్ణుఁ డా తెచ్చిన రెండువేల కుండల మద్యములను ద్రావి, మద్యపానముచే నించుక మదించినవాఁడును, స్వాభావికముగా మత్తుఁడును, బలిమియుఁ దేజమునుం గలవాఁడునునై, ప్రలయకాల యమునిచందమునఁ గన్పట్టుచు దనయడుగులుంచుటచేఁ బుడమిని గంపింపఁ జేయుచు, వేవెలుఁగు దన కిరణములచేఁ బుడమిని వెలుఁగఁజేయునట్లు రాజమార్గమును దన వెలుఁగుచేఁ బ్రకాశింపఁ జేయుచు, మార్గమధ్యమునఁ బురజనులును దోసిలియొగ్గి యొనర్చు మ్రొక్కులు కైకొనుచుఁ బురందరుఁడు బ్రహ్మసదనముకుఁ బోవుచందమున నన్నయింటికిఁ బోయెను. అట్లు రాజమార్గమునఁ బోవుచుండువాఁడును, పర్వతశృంగముమాడ్కి నెత్తయిన యాకారము గలవాఁడును, నూహింప నలవికాని బలిమి గలవాఁడును నైన శత్రుసంహారి యగు కుంభకర్ణుం జూచి, వానరులును, వానరయూథనాథులును వెఱచి శరణాగతరక్షకుఁ డైన రాముని శరణుఁ జొచ్చిరి. కొందఱు దిగులుపడి క్రిందఁ బడిరి. కొందఱు నేలఁ బరుండిరి. ఇవ్విధముగాఁ బర్వతశిఖరముమాడ్కి నెత్తయినవాఁడును, కిరీటము ధరించినవాఁడును దన వెలుఁగుచే సూర్యునిఁ బోలునట్టివాఁడును, నప్పటప్పటికిఁ బ్రవర్ధమానుఁడును, జూపరకు వింత పుట్టించువాఁడును నైన యా కుంభకర్ణుం జూచి వారు భీతులై మూల మూలలకుఁ బరుగులెత్తిరి.

61-వ సర్గము

కుంభకర్ణుని స్వరూపమును విభీషణుఁ డెఱిఁగించుట

అంతట నెక్కువ వెలుఁగును మగఁటిమియుం గల రాముఁడు వింటినిగైకొని, కిరీటము దాల్చినవాఁడై వచ్చునట్టి కుంభకర్ణునిఁ జూచెను. పర్వతముమాడ్కి నెత్తయిన యాకారముగలవాఁడును, మున్ను నింగి నాక్రమింపఁ బూనిన సర్వకార్య సమర్థుఁ డగు వామనావతారుఁ డగు విష్ణువుం బోలినవాఁడును, బంగారపు భుజకీర్తులు దాల్చినవాఁ డగుటచే మెఱుపుతోఁ గూడిన వార్షిక మేఘముఁ బోలువాఁడును నైన యక్కుంభకర్ణునిఁ బలుమాఱు గాంచి, యావానరమహాసేన మూలమూలలకుఁ బరుగెత్తెను. రాముఁడు వానరసేన పరుగెత్తుచుండుటను, రాక్షసుఁ డప్ప

టప్పటికిఁ బెంపొందుటనుగాంచి, "విభీషణా! పర్వతముం బోలువాఁడును, కిరీటధారియు, పచ్చని కన్నులు గలవాఁడును, బంగారుభూషణములు ధరించి, నల్లని కాయము కలవాఁ డగుటచే నప్పుడు వర్షింపఁబోవు మెఱుపుతోడి మేఘముకైవడిఁ గనఁబడువాఁడును నై యున్న యీతఁ డెవఁడు? ఇతఁడు పుడమికి గొప్పటెక్కెమో యనఁబరగి యున్నవాఁడు? ఇతనిని జూచినవెంటనే వానరులందఱు పరుగెత్తుచున్నారు. ఈయున్నత రూపమువాఁ డసురయా ? లేక రక్కసుఁడా? నే నింతకుమున్ని ట్టిరూపము చూచినది లేదు. నా కితఁ డెవఁడో తెలుపుము" అని సాశ్చర్యముగా నడిగెను.

మంచిపనులు సేయువాఁ డగు రాజపుత్రుఁ డయిన రాముఁ డడుగఁగా, నెక్కువ బుద్ధిమంతుఁ డగు విభీషణుఁడు కాకుత్స్థునితో నిట్లనియె: "రాఘవా, యితఁడు ప్రతాపశాలి యగు విశ్రవసుని కొమరుఁడు; కుంభకర్ణుఁ డనువాఁడు. ఇతఁడు తొల్లి యొక్కప్పుడు యుద్ధమున నింద్రియములను గెల్చినవాఁడు. ఇతని యాకారముతో సమాన మయిన యాకారముగల రాక్షసుఁడు వేఱొక్కఁడు లేఁడు. ఇతఁడు యుద్ధములందు దేవవానవ గంధర్వ విద్యాధర యక్ష రాక్షస పన్నగ కిన్నర కింపురుషులను బెక్కండ్రను నొంచి యవమానించినవాఁడు. వికృతంపుఁ గన్నులుగల యీ బలవంతుఁ డగు కుంభకర్ణుఁడు శూలమును జేతఁగొని యుద్ధమునకు రాఁగా, వేల్పు లతనియెదుట నిలిచి సమరముచేయఁజాలక, "సర్వప్రాణిసంహారి యగు యముఁ డితఁ" డని భ్రాంతినొందినవా రయి యాతని యెదుట నిలువఁజాలక పోయిరి. తక్కిన రాక్షసశ్రేష్ఠు లందఱును ఘోరతపముచేసి వరములఁ బడసి, యీ వరబలము గలిగియున్నారు. ఇతఁడో స్వభావముచేతనే బలిమి గలవాఁడు, స్వప్రభావముచేతనే వెలుఁగుగలవాఁడు. ఈ గొప్ప మేనివాఁ డగు కుంభకర్ణుఁడు పుట్టఁగానే కడు నాఁకలితోఁ బెక్కువేల ప్రాణులను మ్రింగెను. అవ్విధముగాఁ బలు జంతువులను మ్రింగుచుండఁగాఁ బ్రజలందఱు వెఱచి దేవేంద్రుని కడకేఁగి యతనిని శరణుచొచ్చి యాతని కీవిషయము నివేదించిరి. ఆ దేవేంద్రుఁ డలిగినవాఁడై వాఁడి వజ్రముతోఁ గుంభకర్ణుని మోఁదఁగా, నెక్కువ మహిమగల యతఁ డా

మోఁదు తిని, యెక్కువ యాగ్రహముతోఁ బైకెగిరి పెనుబొబ్బ వెట్టె. ఆకుంభకర్ణుని యార్పును విని దేవతలందఱు మిక్కిలి వెఱచిరి. పుడమి వడఁకెను. అంతట మహాబలుఁ డగు కుంభకర్ణుఁడు వేల్పులతేనికోపము లక్ష్యపెట్టక, యైరావతమును నతని యేనుఁగుయొక్క దంతము నూడఁ బెఱికి, దానితో నింద్రుని ఱొమ్మునఁ గొట్టెను. ఇంద్రుఁడు కుంభకర్ణుని యేటునకు నొచ్చి, మిగుల మండిపడెను. దేవతలు, బ్రహ్మర్షులు, దేవర్షులు, దానవులు మొదలగు వారందఱు వెఱచిరి. అంతట దేవేంద్రుఁడు సకల ప్రజలతోఁ గూడ బ్రహ్మకడ కేఁగి, ప్రజలను మ్రింగుట, దేవతలను బెద రించుట, మునుల తపోవనములఁ బాడుసేయుట, పరస్త్రీలను గొనిపోవుట మొదలగు నతని చెడ్డనడతలను దెలిపి, యిఁక నతఁ డివ్విధమునఁ బ్రజల నెల్లప్పుడు తినుచుండెనేని, లోకమెల్లఁ ద్వరలో నిర్మానుష్యముగాఁగల" దని తెలిపిరి. వాసవునిపలుకు లాలించి, సర్వలోక సృష్టికర్త యగు ప్రజా పతియు రాక్షసులను బిలిపించి, కుంభకర్ణునిఁ గాంచినతోడనే, తానును మిక్కిలి వెఱచి, యతనిని నమ్రకముతోఁ దనకడకుఁ బిలిచి, "యో కుంభ కర్ణా! లోకవినాశమునకే పౌలస్త్యునిచే నీవు పుట్టింపఁబడితివి. కావున నీవు మృతునిమాడ్కిఁ బరుండి యుండఁగలవు" అని శపింపఁగా, నతఁడు బ్రహ్మశాపముచేఁ గొట్టువడి, బ్రహ్మదేవునిముందటఁ బడెను.

అంతట రావణుఁడు కడు నులికిపడి యా బ్రహ్మదేవునిం జూచి, "ఓ ప్రజాపతి! బంగారమువలె వృక్షమును బెంచి, ఫలమునకు వచ్చినవేళలో దానిని నఱకుచున్నావు. నీవు నీ మునిమనుమని నిత్తెఁఱగున శపియించుట పాఁడియే. నీమాట లనృతములు గావు గనుక, నితఁ డెల్లప్పుడు నిద్రించు చునే యుండునే? కావున నితండు మేల్కాంచుటకును నిద్రించుటకును నొక్కనియమము నేయుము" అని ప్రార్థింపఁగా, స్వయంభువు "రావణా! యితఁ డాఱునెలలు నిద్రించి యొకదినము మేల్కాంచును. ఆ యొక్క దినమున నీ వీరుఁ డాఁకలితోఁ బుడమియెల్లఁ దిరిగి, ప్రలయకాలకుపితుం డగు నగ్నిహోత్రుని చందమున నోఱు తెఱచుకొని లోకముల నెల్ల మ్రింగఁగలఁడు" అని యనుగ్రహించెను.

"ఈ రాక్షసాధిపుఁడు వ్యసనమొంది, నీ పరాక్రమమునకు వెఱచి నీ మీఁదికి యుద్ధమునకై కుంభకర్ణుని నిద్దుర లేపి పంపెను. శత్రువులకు

భయంకరమైన శౌర్యముగల యీ కుంభకర్ణుఁడు గృహమునుండి వెడలి, వానరులనందఱను భక్షించుచు వచ్చుచున్నాఁడు. కుంభకర్ణునిఁ గాంచఁ గనే వానరులు వెఱచి పరుగెత్తుచున్నారు. రణమునఁ గట్టలుక పూనిన యీతని నెట్లు వానరు లడ్డగింపఁగలరు? భయంకరమైన యంత్ర మొక్కటి పై కుబికిన దని వానరుల కందఱికిఁ దెలుపుము. అప్పుడు వానరు లందఱు వెఱపుమాని యుద్ధమునకు నిలువఁగలరు" అని విభీషణుఁడు రామునితోఁ జెప్పెను.

అంత రాఘవుఁడు సకారణముగాఁ జెప్పిన విభీషణుని మాటలు విని సేనాపతి యగు నీలునిఁ జూచి, "అగ్నిపుత్రుఁడ వగు నీలుఁడా! నీవు సేనలను మఱలించికొనిపోయి వ్యూహములుగానిల్పి లంకాపురంపు గవను లందును, నాలుగుకాళ్లమంటపములందును, రాజమార్గములు గలియు చోటులందును పర్వత శిఖరములను, వృక్షములను ఱాలను జేర్చి పెట్టుము. వానరు లందఱిని నాయుధధారులై పర్వతములను జేతులందుఁ దాల్చి సమరమునకు సిద్ధముగనుండునట్లు చేయుము" అని నీలుని కాన తిచ్చెను. వానర వీరుఁ డగు నీలుఁడును మహాప్రసాద మని వానరవీరుల కందఱకు రాము నానతిం దెలియఁజేసెను. అంత పర్వతాకారు లగు శరభగవాక్షహనుమదంగదులు పర్వతశిఖరములను, వృక్షములను, ఱాలను గైకొని యచ్చటచ్చట నిలిచి, పాదపములచే శత్రు సేనను నొంచుచుండిరి. పర్వతములను చేతఁ బట్టుకొన్నదై వెలుఁగుచుండెడి యా వానరవీరుల భయంకర సైన్యము పర్వతంపు చఱియయందు వాలిన దట్టమైన భీకర వార్షికమేఘరాశిమాడ్కి వెలుఁగుచుండెను.

62-వ సర్గము

రావణుఁడు కుంభకర్ణుని యుద్ధమునకుఁ బురికొల్పుట

తర్వాత నెక్కువ మగఁటిమి గల యత్యంతము నజేయుఁ డగు కుంభకర్ణుఁడు కానిసమయమున లేచుటచేఁ దూలిపడుచుఁ బానము వలని మత్తు తోడువడఁగాఁ బెక్కండ్రు రాక్షసులు వెనువెంటఁ జనుదేరఁగా రాజ్యలక్ష్మిచే శోభిల్లు రాజమార్గమునఁ బ్రవేశించి, రాజవీథులందలి గృహములలో వసించు పౌరులు విరియఁ జల్లు పుష్పములచేఁ గప్పఁబడి బంగారపుఁ గిటికీలుగలదియు, సూర్యునివలెఁ బ్రకాశించుచుండునదియు,

విశాల రమణీయమును నైన రాక్షసేంద్రుని భవనముంగూర్చి రాక్షస గణముతోడఁ బోవుచుఁ దన కాలినడకచేఁ బుడమిని గదలఁజేయుచు, సూర్యుండు మేఘజాలమునఁ బ్రవేశించుకైవడి నతని నగరులోపలఁ బ్రవేశించి, తొట్టికట్లు దాఁటి, విచారవంతుఁడై పుష్పకవిమానము నందలి సింహాసనమునఁ గూర్చుండియున్న యన్ననుఁ దేవేంద్రుండు కమలాసనుఁ డగు బ్రహ్మదేవునిఁ జూచుకైవడిఁ గాంచెను. దశగ్రీవుఁడు చేరువకు వచ్చిన కుంభకర్ణునిఁ గాంచినవెంటనే, సింహాసనమునుండి లేచి యుప్పొంగుచు నతనినిఁ జేరఁదీసికొనెను. వెంటనే కుంభకర్ణుఁడును దగ్గఱ కేతెంచి, సింహాసనమునఁ గూర్చున్న యన్నగారి పాదములకు మ్రొక్కి, యేమి పని యని యడిగెను. రావణుఁ డాసనమునుండి యుప్పొంగుచు లేచి, తమ్మునిఁ గౌఁగిలించుకొని విడిచిపెట్టఁగా, నంతటఁ గుంభకర్ణుఁడు దివ్యమైన సింహాసనమునఁ గూర్చుండి, కోపముచేఁ గన్ను లెఱ్ఱఁజేసి రావణునిఁ గూర్చి "యన్నా! నీ వేల నన్ను గొప్ప చేసి యకాలమున నిద్ర లేపించితివి? ఎవనివలన నీకు వెఱపు గలిగినది? ఎవనికిఁ జేటుకాలము సమీపించి యున్నది? నా కానతిమ్ము" అని యడిగెను.

రావణుఁ డలుక పూని, యించుక కన్నులు గిరగిరఁ ద్రిప్పుచు, కుంభకర్ణుం గాంచి, "మహాబలుఁడా! నీవు చాలఁ దడవుగా నిద్రించితివి. నీవు పాన్పునఁ బరుండి నిద్రించుటచే బహుకాలము గడచెను. నీవు హాయిగా నిద్రించుటచే రామునివలని భయము నెఱుఁగకున్నావు. రాముఁడు సుగ్రీవాది పరిజనములతో సముద్రము దాఁటివచ్చి లంకా పురములోపలఁ జొచ్చి, మన మూలబలము నెల్ల మడియించుచున్నాఁడు. తమ్ముఁడా! చూడుము లంకాపురమెల్ల వానరమయసముద్రప్రాయమై యున్నది! ఎవరు రాక్షసులలోపల మిగుల ముఖ్యులో, వా రందఱు వానరులచే వధింపఁబడిరి. వానరులలో నొక్కఁడైన మృతుం డైన యట్లు కానఁబడఁడు. తుదకు వానరు లోడినట్లు సైతము కాన్పింపదు. కావున నిప్పు డీ దిగు లొక్కటి పుట్టియున్నది. బలవంతుఁడా! యీ లంకా పురము నీ దిగులునుండి కాపాడుము. ఈ వానరుల నిప్పుడు సంహరింపుము. దీని నిమిత్తమే నిన్ను లేవఁబనిచితిని. నా యైశ్వర్యమెల్లఁ

దఱిగె నని యెఱుఁగుము. బాలవృద్ధులు మాత్రము శేషించియుండు నీ లంకాపురమును వీరి బారినుండి తప్పించి కాపాడుము. ఓ మహాబాహూ! నాయెడ సోదరప్రేమ యుంచి, యొరులచేఁ జేయ నలవి కాని యీ పని చేయుము. ఇతరు లీ పనిచేయఁజాలమిచే నిది నీభారముగా నేర్పడిన దాయెను. శత్రుసంహారి వగు తమ్ముఁడా! నే నింతకు మున్నెప్పుడు ని న్నిట్టిమాట యడిగినవాఁడను గాను గదా? నీ యెడ నాకెక్కువ చెలిమియు నెక్కువ గౌరవమును గలవు. నీ వింతకుమునుపు పెక్కు దేవాసురయుద్ధములందు సేనలను నడిపి, బహుసామర్థ్యముతో శత్రువులను గెల్చితివి కదా? కావున, భీకరవిక్రమము గల యో తమ్ముఁడా! నీ విప్పుడు ధైర్యము వూని, యీపనికిఁ జొఱుము. సకల ప్రాణులలోపల నీతో సమాన బలుఁ డగువాఁడు వేఱొక్కఁడు లేఁడు. నాయనుఁగుఁ దమ్ముఁడా! యుద్ధమునం దెక్కువప్రీతి గలవాఁడా! బంధువులయందుఁ బ్రేమగలవాఁడా! యీ యుత్తమ మయిన హితకార్యమును మనచెలిమికిఁ దగినట్లుగాఁ జేయుము. గొప్ప పెనుగాలి శరత్కాల మందలి మేఘములను జెదరఁగొట్టునట్లు నీ పరాక్రమము నుపయోగ పఱచి, శత్రుసేనను ధ్వంసము చేయుము. ఇదియే నాకుఁ బ్రియకృత్యము." అని రావణుఁడు కుంభకర్ణునితోఁ జెప్పెను.

63-వ సర్గము

కుంభకర్ణుఁడు రావణునకు హితము గఱపుట

రాక్షసాధిపుని మొఱ లాలకించి, కుంభకర్ణుఁడు వక్ష్యమాణ ప్రకారముగాఁ బలికెను: "ఓ రావణా! మునుపు మాతో నాలోచించి నప్పుడు నీ కాపద సంభవింపఁ గల దని చెప్పితిమి. నీవు మా హితవాక్యములఁ బెడచెవిం బెట్టితివి గనుక దానికి ఫలమిప్పుఁ డనుభవమునకు వచ్చినది. పాపకార్య మొనరించినవానికి ఫలము నరకములఁ బడుటయే. నీ వొనర్చిన యీపరదారహరణరూపపాపకార్యము కడుగొప్పది గనుక తత్ఫల మీలోకమునన సిద్ధించినది. ఓమహారాజా! బలమువలని గర్వముచే సీత నపహరించుటకు మున్ను సీతాపహరణము మంచిదా, చెడ్డదా యని యాలోచింపవైతివి. దానివలనఁ గలుగు చెడ్డలను గూడ నాలోచింపవైతివి. బుద్ధిమంతుఁ డగువాఁడు మొదట నాలోచించి,

పిమ్మట గార్య మొనరింపవలయును. లోకమున నెవఁ డైశ్వర్య మదముచే ముందు చేయవలసిన పనులను వెనుకను, వెనుకఁ జేయవలసిన పనులను ముందును జేయుచున్నాఁడో, వాఁడు మంచి చెడ్డల నెఱుఁగని వాఁ డని చెప్పఁబడును. హవిస్సులు వేదాధ్యయనా దులచేఁ బరిశుద్ధులు గానివారియెడ నిష్ఫలము లగునట్లు, దేశకాలముల ననుసరించి చేయనికార్యములు విరుద్ధకార్యములట్లు చెడిపోవుచున్నవి.

తన కభివృద్ధియుఁ బగతునికి హీనస్థితియుఁ గలిగినప్పుడు దండ యాత్ర సేయుట యుత్తమకార్యము. తనకును శత్రువునకును బలము సమముగా నున్నప్పు డొనర్చుసంధి మధ్యమము. పగతును బలవంతులై తాను హీనుఁడై యున్నప్పుడు పగతురకుఁ గప్పము గట్టి వారి నాశ్రయిం చుట యధమము. తన మేలు గోరు మంత్రులతో నాలోచనచేసి నిర్ణ యంబు చేసికొని, పైఁజెప్పిన యుత్తమ మధ్య మాధమకార్యముల నెఱింగి, పనులు దొడఁగుట, పరిజనమును జేర్చి ద్రవ్యము సేకరించుట, దేశకాలములను బరికించుట, చెఱుపును దొలఁగించుట, కార్యసిద్ధి యను నై దుపాయములతో వానిని బొందుపఱచి నడచుకొనువాఁడు తన సునీతిప్రయోగమువలని ఫలమును బొందుచున్నాఁడు. నీతిశాస్త్రము ప్రకారము కార్యనిర్ణయము చేయఁ గోరి, సచివులతోను, తనహిత కాము లగువారితోను కార్యాలోచన చేయు నాతఁడు తన సునీతిప్రయోగము వలని ఫలము నొందుచున్నాఁడు. ఓరాక్షసాధిపా! నరుఁడు ధర్మార్థకామ ములను దాని దానికై విధింపఁబడిన యయ్యె కాలములందు నొక్క టిగాఁ గాని, జంటలనుగాఁ గాని, మూఁటినిగాఁ గాని సేవింపవలెను. అనఁగా ప్రాతఃకాలమున ధర్మమును, మధ్యాహ్నమున నర్థమును, రాత్రికాలమునఁ గామమును సేవింపవలయును. లేక, ప్రాతఃకాలమున ననుష్ఠింపవలసిన ధర్మమును మధ్యాహ్నకాలమున ననుష్ఠింపవలసిన యర్థ మును బ్రాతఃకాలమునఁ జేయవలయును. మధ్యాహ్నమున విహితమైన యర్థమును ప్రాతఃకాలవిహిత మైన ధర్మమును మధ్యాహ్నమున నను ష్ఠింప వలయును. సాయంకాలవిహిత మైన కామమును, మధ్యాహ్న విహిత మైన యర్థమును సాయంకాలమున ననుష్ఠింపవలయును. సాయం కాలమున విహిత మైన కామమును ప్రాతర్మధ్యాహ్నకాలములందు

విహితములైన ధర్మార్థములను అనఁగా మూఁటిని సాయంకాలమున సేవింప వలయును. ఏ రాజుగాని, విరాజ సదృశుఁడు గాని, పైమూఁటిలో నుత్తమమగు ధర్మము నెఱిఁగియు, దాని నాచరింప నెఱుఁగఁడో, యాతని చదువెల్ల వ్యర్థము. దానిదానికిఁ దగిన సమయమునఁ బగతునికడకుఁ జని తిన్నని పలుకులు పలుకుట, ధనాదుల నొసఁగుట, మిత్రబంధుపరివారములను వేఱుపఱచుట, దండయాత్ర వెడలుట యను సామదానభేద దండోపాయముల నొక్కొక్కటిగా అన్నింటి నొకటేతడవగాని యుపయోగించురీతులను, సునీతి దుర్నీతులను, ధర్మార్థకామములను గూర్చి మంత్రులతోడఁ బరికించి, యాయా దానికాలమున దానిదానిని సేవించువాఁడు వ్యసనము నొందఁడు. మఱియుఁ దన కీలోకమున మేలొనరించునట్టి పనులంగూర్చి కార్యముల కలరూపు నెఱిఁగిన సచివులతోడ నాలోచించి, చేయఁదగిన, చేయఁదగనిపనుల నెఱిఁగి, చేయఁదగినపనులే యొనరించు జితేంద్రియుఁ డగు నృపాలుఁ డీ లోకమునఁ బెద్దకాలము సుఖముతో మనుచున్నాఁడు. రాజులసంగతి యిట్లుండఁగా, మంత్రుల యోగ్యత నైతము శ్లాఘనీయమై యుండవలయు. నీతిశాస్త్రరహస్యములను గురుముఖమునఁ దెలిసికొనక, మగవార మని వేషము వేసికొని, యాహారనిద్రాభయాదులసామ్యముచేఁ బశుతుల్య మైన బుద్ధిగలవారగు నధమ మంత్రులు రాజులచే రాజకార్యముల యాలోచనలనిమిత్త మేర్పఱపఁబడినట్లు కప్పిపుచ్చఁబడి, యూహాపోహాలు లేక యుత్తధైర్యముతోఁ జెప్పఁబూనెదరు గాని, లెస్సగాఁ బరికించి మాటలాడరు. అట్టి మంత్రుల పలుకుల వినరాదు. మఱియు వాస్తవముగా హిత మొనరించునది కానిదయ్యు, హితముమాడ్కిఁ గనిపించు పలుకులను శాస్త్రజ్ఞానము లేక వట్టి గంభీరతతోఁ బలుకుచుఁ గార్యములను జెఱచునట్టి మంత్రులను ముందుగాఁ బరికించి మంత్రాలోచనసభనుండి తొలఁగింపవలయు. అట్టి దుర్మంత్రు లహితము బోధించుటయె కాక, యుపాయశాలు రగు పగతుర ప్రేరణచేఁ దమయేలికకుఁ గీడొనరించుచుఁ దమయొడయనిచేఁ దలఁపునకుఁ బ్రతికూలఫలము లిచ్చుపనులఁ జేయించుచుందురు. శత్రువులచే లంచమొసఁగి భేద మొందింపఁబడినవారలై, వాస్తవముగా నమిత్రులయ్యు, మిత్రు లట్లు కనఁబడు మంత్రుల గుణ

ములను రాజతంత్రముల యాలోచన విషయమైన సంవాదములచే నెఱుఁగవలయును. పక్షులు క్రౌంచపర్వతరంధ్రమును జొచ్చునట్లు, చెడుబోధ చేయు మంత్రి యాలోచనలను బరికింపక, యాతని బోధ ప్రకారము కార్యముల నాలోచన చేయఁబూనినట్టి రాజుయొక్క లోపములను బగతురు కనిపెట్టి యా సమయమునఁ బ్రభువును నొంతురు. శత్రువుల మోసపుఁ బనులను మంత్రవ్యవహారాదులచే నెఱుఁగక, దుర్మంత్రులఁ దొలఁగించుట మొదలగు పనులు సేసి యాత్మ సంరక్షణము చేసికొనక యుండునట్టి రాజు కీడులఁ జెందుటయే కాక రాజ్యభ్రష్టుఁడు నగుచున్నాఁడు. మునుపు తమ్ముఁడు విభీషణుఁడు చెప్పిన యితవుమాటల ప్రకార మొనర్చుట మంచిది. అదియే మనకు మే లొసఁగునది. అవి నీ కిష్టమేని ఆప్రకారము చేయుము." అని.

దశగ్రీవుఁడు కుంభకర్ణుని పలుకు లాలకించి, కనుబొమలు ముడిపెట్టి యెక్కువ యాగ్రహము పూనినవాఁడై, "ఓరీ కుంభకర్ణా! గౌరవమునకుఁ దగినవాఁ డయి మంచి నడవడులఁ దెల్పునట్టి గురువుమాడ్కి మర్యాదసేయఁదగిన మంచినడవడుల బోధించునట్టి నన్ను దండింపఁ బూనుచున్నావు. నీ వింతతడవు సెప్పితివి పో. ఏమైనను ఫలితము గలదా? నీమాటలు నా కిప్పు డెక్కవు. వాని కిది తరుణమును గాదు. నీతిప్రయోగమునకుఁ దగిన సమయము మించినది. ఇఁక సమయోచితమైన దండము నొనరింపుము. మునుపు నీతికానిదానిని నీతి యని తలఁచియో, తెలివి లేకయో, బలవీర్యగర్వముననో యప్పుడు చేసిన కార్యమును గూర్చి యిప్పుడు పలుమా అనుకొనుటచే నేమి యుపయోగము? కావునఁ బ్రకృతమున కేది యుక్తమో దానిం జేయుము. కడచినదానింగూర్చి గఱువలు వగవరు. కడచినది కడచినదే కాక మఱలనది రాఁబోదు. నీకు నాయెడ ననురాగము గలదేని, స్వపరాక్రమము నెఱుఁగుదు వేని, యీ యుద్ధరూప మయిన కార్యము చేయఁదగినదే యని నీమనసునకు సమ్మతముగాఁ దోఁచెనేని, నా తెలివిలేమిచేఁ గలిగిన చెఱుపును నీపరాక్రమముచేఁ దొలఁగింపుము. పనిచెడి దిగులుపడి వచ్చినవానిని సదా కాపాడునట్టివాఁడె హితుఁడు. నీతివిషయమునఁ బొఱపడినవానికి సాహాయ్యము చేయు నాతఁడే బంధువు." అని ధైర్య

ముతోను నిష్ఠూరముతోను బలికిన పలుకు లాలకించి, కుంభకర్ణుండు రావణుఁడు చిడిముడిపడుటచేఁ గోపమూని, మిగుల మనోవ్యాకులతతోఁ గూడినవాఁడై యున్నాఁడని చక్కఁగా నెఱిఁగి యతనిని నిమ్మళింపఁ జేయుచు మెల్లని తిన్నని పలుకులతో ని ట్లనియె:

"రాక్షసాధినాథా! నీవు సంతాపము నొందవలదు. కోపము విడిచి, స్వాస్థ్యము నొందుము ఓరాక్షసేంద్రా! నేను జీవించియుండఁగా, నేను తెలియకయో, భ్రాంతిచేతనో యి ట్లొనరించితి." నని వగవ వలదు, నీ వేరామునినిమిత్త మై యిట్లు పరితపించుచున్నాఁడవో, యాతనిని నేను బరిమార్తును. ("రాక్షసాధిపా! నేను జీవించియుందు నేని, నీ విట్లు వగవఁ బని లేదు. ఇతఁడు సుఖముతో జీవించుచు, నా యాపదంగూర్చి తలఁపకున్నాఁ డనియే నన్నుఁగూర్చి తపించుచున్నావో, యా నన్ను రామునిచే నశింపఁజేసెదను" అని వేఱొక్క యర్థము కూడఁ జెప్పవచ్చును.) సామాన్యబంధుత్వమును బట్టియు, అందును దోఁబుట్టు తనముఁ బట్టియు నన్నియవస్థల నొందియున్నట్టి నీకుఁ జెప్పవలసిన హిత వచనముఁ బలికితిని, ఆప్తబంధువు లీ తరుణమునఁ జేయవలసిన, నే నొనర్పంబోవు శత్రుసంహారకార్యమును జూడుము. నిదురచేతుల వాఁడా! నేను యుద్ధమధ్యమున రామునిఁ దమ్మునితోఁ గూడ సంహ రింపఁగాఁ బరుగెత్తుచుండు శత్రుసేన నిదిగో చూడఁగలవు, నే నీదినము యుద్ధరంగమునుండి తెచ్చెడు రాముని శిరమును గాంచి, నీవు సుఖం బొందుము. సీత భర్తృవధమువలని శోకము నొందఁగలదు. బంధు వులను బోఁగొట్టుకొనియున్న లంకాపురమునందలి రాక్షసు లందఱు తమకుఁ గడుఁ బ్రియమైన నాకావింపఁబోవు రామవధ నానందముతోఁ జూడఁగలరు. యుద్ధరంగమున శత్రువును సంహరించి తమ బంధువధము నిమిత్తమై వెత నొందుచుండు రాక్షసుల కన్నీటిని దుడుతును. పర్వత సమానుఁడును, రక్తముచేఁ దడిసిన మేనివాఁడును నైనందున సూర్య రశ్మితోఁ గూడిన వానకాలంపు మబ్బుఁబోలినవాఁడును, వానరులతో మేటియు నగు సుగ్రీవుని నిదిగో నాచేఁ జడిసినవానినిగాఁ జూడఁగలవు. ఓయనఘా! సేనాసమేతుఁడైన రాముని వధింపఁగోరినట్టి యీరాక్షసులును నేనును గాపాడుచుండఁగా ని న్నారాముఁ డెట్లు సంహరింపఁగలఁడు?

ఒకవేళ మొదట నేను రణమున మడియింపఁబడితి నేని, ఆవల రాముఁడు నిన్ను వధింపఁగలఁడు. నాకుఁ బగతునివలని యవమానము గలుగఁగల దనియెడి సందియము నాకు లేనేలేదు. శత్రుసంహారీ! నన్నిప్పుడే యుద్ధమునకుఁ బంపుము. సాటిలేని పరాక్రమము గలవాఁడా! కయ్యము నకై యొరులను బంపవలదు. బలవంతుఁడా! నేనే నీపగతుర నందఱను బరిమార్తును. ఇంద్రు నైనను, యము నైనను, అగ్ని వాయువుల నైనను, కుబేరవరుణుల నైనను నేను యుద్ధమునఁ బరిమార్తును. పర్వతసదృశమగు శరీరమును వాఁడికోఱలును గల నేను వాఁడి మిగిలిన మొనవాలు దాల్చి యుద్ధరంగమున నిల్చి సింహనాదము సేయునప్పుడు వేల్పుల తేఁ డయినను వెఱవఁగలఁడు. లేక బాణములను గైకొనక శత్రువులను బాహువులచే నలుపునట్టి నాయెదుటఁ బ్రాణములమీఁది యాస గలవాఁడు నిలువఁ జాలఁడు. శక్తితోఁ గాని, గదతోఁ గాని, ఖడ్గముతోఁ గాని, వాఁడి యమ్ములతోఁ గాని నేను యుద్ధము సేయను. నేను నాబాహుబలము చేతనే వేల్పుతేని నైనను బరిమార్తును. నేను గ్రుద్దునట్టి నాయొక్క పిడికిటిగ్రుద్దు నతఁ డస లోర్చియుండు నేని, పిదప రాముని యమ్ములు నారుధిరమునుబీల్చఁగలవు కాని, నాగ్రుద్దు తగులఁగానే యా రాముఁడు విలవిల తన్నుకొని ప్రాణముల వదలఁగలఁడు. ప్రభూ! నేను జీవముతో నుండఁగా, నీవేల యిట్లు వగచెదవు? నే నిదిగో నీ శత్రుసంహారము నిమిత్తము కంకణము కట్టుకొని వచ్చితిని. ప్రభూ! రామునివలని భయముఁ బాయుము. నేను బవరమున బలవంతు లగు రామలక్ష్మణ సుగ్రీవులను, లంకాపురము గాల్చి రాక్షసుల నందఱను సంహరించిన హనుమంతుని, మఱియు సమరమునఁ బూనికితో నున్న యుద్ధవీరు లగు వానరుల నందఱను సంహరించి, యొరులచేఁ బొంద నలవికాని గొప్ప కీర్తిని నీకుఁ గలిగింపఁ గోరెదను. ఇంద్రునివలనఁ గాని, బ్రహ్మదేవునివలనఁ గాని కలిగిన నీ భయమును బోకార్చెదను. నే నలిగితేని, వేల్పు లందఱు దిగులుపడి పుడమిపై వాలుదురు. యముని నడఁచెదను. అగ్నిని మ్రింగెదను. సూర్యుని నక్షత్రములతోడ నింగినుండి నేలకుఁ ద్రోసెదను. నూఱుజన్నముల నొనర్చిన వేల్పుతేనిఁ బరిమార్చెదను. కడలిని జుఱ్ఱెదను. కొండలఁ బిండిసేసెదను. పుడమిని బ్రద్దలుసేసెదను. పెద్ద

తడవు బాగుగా నిద్రించిన కుంభకర్ణుని పరాక్రమమును నాచే మ్రింగఁబడు సకలభూతములు చూడఁ గలవు. నాకీ ముల్లోకము లైన నాహారమునకుఁ జాలవు. దాశరథివధముచే నీ కంతటి సుఖము గానను. నేను సుఖము నొందఁగోరి యుద్ధమునకుఁ బోయెద. నేను రాముని లక్ష్మణసమేతముగా సంహరించి, వానరయూథనాథులం నందఱను మ్రింగెదను. నేను రాముని యమునివీటి కనుపఁగా, సీత నీకు వశము నొందఁగలదు. కావున దిగులు మానుము. స్వేచ్ఛగాఁ బను లొనరింపుము. మద్యపానముచేసి సకలసుఖముల ననుభవింపుము" అని కుంభకర్ణుఁడు రావణునిఁ బ్రియవచనములచే నూఱడించెను.

64-వ సర్గము

మహోదరుఁడు కుంభకర్ణుని దూఱుట

మంత్రులతో విచారింపక యా రావణుఁ డకార్యము సేసెననియు, "నేను తోడుపాటు లేకయే రామాదులతో యుద్ధము చేసెద" ననియుఁ గుంభకర్ణుఁడు రావణునితోఁ జెప్పినమాటలను దూషింపఁ గోరినవాఁడై మహోదరుఁడు బలవంతుఁడును, బాహుబలము గలవాఁడును, గొప్ప దేహము గలవాఁడును నైన కుంభకర్ణుని పలుకు లాలకించి, యాతనితో ని ట్లనియె "కుంభకర్ణా! నీవు గొప్పకులమునఁ బుట్టినవాఁడ వయ్యు బుద్ధిహీనుఁడవుగఁ గన్పట్టుచున్నాఁడవు. కావున నీవు గర్వితుఁడవై యన్ని కార్యములందును జేయఁదగిన యాలోచనరూపము లగు కార్యము నెఱుఁగకున్నావు. ఓ కుంభకర్ణా, ప్రభువు మంచిచెడ్డ లెఱుఁగనివాఁ డని చెప్పితివి కదా. ప్రభుండు మంచి చెడ్డ లెఱుఁగనివాఁడు కాఁడు. మఱి నీవే పసితనముచే మంచిచెడ్డ లెఱుఁగక, యూరక తెగువ పూని మాటలాడఁగోరుచున్నావు. రాక్షసాధిపుఁడుస్థలమును కాలమును విభేదములను నొరులయొక్కయు హాని వృద్ధి క్షయములను నెఱిఁగినవాఁడు. కేవల శౌర్యముపూనినవాఁడును,బుద్ధి హీనుఁడును, పెద్దలసేవ సేయనివాఁడును నైనవాఁడు సైతము చేయనికార్యమును వివేకి యగు ప్రభువు చేయఁ దొడఁగునే? ఓ కుంభకర్ణా! సీతాపహరణరూప మైన పాపమునకు ఫలముగా నీ కీ యనర్థము సంభవించె నని ప్రభువుతోఁ జెప్పితివి కదా! అది యెంతయు యుక్తము గాదు. నీవు ధర్మార్థకామములు వెవ్వేఱు

ఫలముల నొసఁగునవి యని చెప్పితివి. ఆధర్మార్థకామము లిట్టి స్వభావము గలవని తెలియుట కేదైన నీకుఁ బ్రమాణము గలదా? సుఖఫలము నొసఁగు యోగాదిధర్మము లనుష్ఠించుసమయమున శరీరాయాసము గలుగుటవలనను, దుఃఖమును గలిగించు పరద్రవ్య పరదారహరణరూపము లయిన యధర్మము లొనరించు సమయమునఁ దాత్కాలిక సుఖము గలుగుటవలనను, ఇట్లు అర్థకామములకు ఫలము నియతము గామి వలనను, నీవు చెప్పినట్లు సదా ధర్మముచే సుఖమును, అధర్మముచే దుఃఖమును గలుగు ననుటకుఁ బ్రమాణము లేదు. స్వర్గప్రాప్తికిఁ బుణ్యకర్మమే కారణము. ఈ పుణ్యకర్మలవలన మేలు గలుగు నంటివి. ఒక్కొక్కప్పుడు గీడును గలుగును. అట్లే పాపకర్మలకు ఫలముగాఁ గీడు గలుగు నంటివి. ఒక్కొక్కసమయమున మేలును గలుగును గాన, ధర్మార్థకామము లీ యీ ఫలముల నొసఁగునవి యను నియమము లేదు. అనఁగా, ధర్మార్థములును, వానికి విరుద్ధములైన యధర్మానర్థములును మే లొసఁగునవియే. అయిన నధర్మానర్థములకుఁ గీడు ఫలముగా సంభవించుట మిక్కిలి యరుదు. ధర్మార్థములసంగతి యిట్లు కదా! ఇఁకఁ గామము సంగతియో యనిన, జను లిహపరములకు సాధకము లగు ధర్మార్థకామరూపములైన కర్మల నాచరించి, వానిఫలము లనుభవించుచున్నారు. కావున స్వేచ్ఛాప్రకారము సంచరించువాఁడును శుభఫలములను బొందుచున్నాఁడు గనుక విధింపఁబడిన కర్మమే శుభఫలముల నొసఁగునది యనియు, త్రోసివేయఁబడ్డకర్మ మట్టిది కానిదనియు నియమము లేదు. ధర్మార్థకామములకు ఫలనియమము లేదు గనుకఁ బ్రభువు సీతాపహరణము చేయవలసినది యని మనమున నిశ్చయించెను. మేమును ఆ కార్యము యుక్తమే యని యంగీకరించితిమి. శత్రువు విషయమున సాహసము చూపిన నందేమి దోషము గలదు? అదియునుంగాక, ఓకుంభకర్ణా! "నే నొక్కఁడనే వెళ్లి యా రామలక్ష్మణులను సుగ్రీవాదివానరులను సంహరించెద" నని చెప్పితివికదా! ఇది యుక్తమును హితమును గాదు. దీనికిఁ గారణము నెప్పెద నాలకింపుము. తొల్లి జనస్థానమున బలవంతు లగు పెక్కండ్రు రాక్షసులను సాయము లేకయే వధించిన యా రాఘవుని నీ వొంటరిగా నెట్లు జయింపఁగలవు? నీ కతఁడు సాధ్యుఁడా? జనస్థానమున

నతఁడు సంహరించిన రాక్షసులకు బందుగు లగు ప్రతాపవంతులైన రాక్షసు లనేకు లిప్పుడును గడగడ వణఁకుచుండుట నీ విప్పుడును చూచుచున్నావు. కావున, నీవు పూనిన సాహసపుఁ బని మంచిదా? కోపముతోఁ గూడిన సింగముం బోలువాఁ డా దశరథ తనూజుఁ డయిన రాముఁడని యెఱుఁగక, నిద్రించుచున్న కృష్ణసర్పమును బోలె నాతనిని లేపఁ గోరుచున్నావు. తన వెలుఁగుచే నెప్పుడు దీపించువాఁడును, కోపసమయమున నేరికైన నోర్వరానివాఁడు నై, మృత్యుదేవతమాడ్కి దగ్గఱఁ జేరరాని యాతని నెవ్వఁ డెదిరింపఁగలఁడు? శత్రువు నెదిరించు విషయమున నిదియెల్ల సంశయాస్పదముగా నున్నది. కావున నతనితోడి కయ్యమునకు నీ వొక్కఁడవు పోవుట నా కెంతయు రుచింపదు. బలహీనుఁ డగువాఁ డెవ్వఁడు ప్రాణత్యాగముచేయ సమకట్టి, బలవంతుఁ డగు శత్రువును నధమునిఁ బోలె లోఁబఱచుకొనఁజూచు? ఓరాక్షస వీరుఁడా, మానవులలో సాటిలేనివాఁడై, పరాక్రమమున నింద్రాద్యములం బోలిన యా రామునితో నెట్లు పోరాడఁ గోరెదవు?"

అని మహోదరుఁడు కోపాటోపము గలిగి కుంభకర్ణునితోఁ జెప్పి, రాక్షసుల నడుమ సింహాసనమునఁ గూర్చుండియున్న లోకముల నేడ్పించువాఁ డగు రావణుం జూచి, "ఓ ప్రభూ, వైదేహిం దెచ్చి యేల యిపుడిట్లు పరిపరివిధములఁ బలికెదవు. నేను జెప్పఁబోవు సంగతి నీకు సమ్మతమేని, నీకు సీత స్వాధీనురాలు గాఁగలదు. సీత నీకడకుఁ చేరఁదగిన యొక్క యుపాయమును గనిపెట్టితిని. అది యుక్త మని నీబుద్ధికిని దోఁచెనేని, దానిని విని యా ప్రకారము చేయుము. నేను, ద్విజిహ్వుఁడు, సంహ్రాది, కుంభకర్ణుఁడు, వితర్దనుఁడును మే మయిదుగురము రాముని తోడి కయ్యమునకై పోవుదుము గాకని వెల్లడి పఱపుము. మే మైదువురము వెళ్లి యా రామునితోడి కయ్యమునకుఁ దలపడెదము. అట్లు మేము పూనికగలిగి నీ శత్రువును జయించితి మేని, సీతాహరణోపాయమునకు మనకుఁ గావలసినది లేదు. మే మైదుగుర మట్లు పోరియు, శత్రువు జీవితము తొలఁగక యుండె నేని యప్పటికి మనసున కెక్కిన యుపాయములను జేయుము. మేము నెత్తుట మేను దడిపికొన్నవారమై రాముని పేరుగల బాణములతో మాయొడళ్లను జీల్చుకొని, యుద్ధరంగ

మునుండి యిటకు వచ్చి, రామలక్ష్మణులను మేము మ్రింగితి మని చెప్పుచు నీపాదములమ్రోలఁ బడెదము. నీవును సంతోషసూచకముగా మాకు బహుమతు లొసఁగుము. మఱియు రాక్షసాధిపా! యొక యేనుఁగుమీఁద నొకబంటు నెక్కించి వానిచేత రాముఁడు లక్ష్మణుని తోడ సపరివారముగా రాక్షసులచే నిహతుఁ డయ్యె నని చాటింపుము. ఓశత్రుసంహారీ, తర్వాత నీవు సంతుష్టుఁడ వైనట్లు నటించి, భృత్యులకు సకలభోగ్యవస్తువులను దాసదాసీజనములను, గుఱ్ఱము లేనుఁగులు మొదలగు పరివారములను, గోరునట్టి యన్నివస్తువులను, విస్తార ధనమును నొసఁగుము. మఱియు యుద్ధవీరు లగువారికిఁ బూవులదండలు, వస్త్రములు, సుగంధద్రవ్యములు, నానావిధపానములును నొసఁగి, నీవును సంతసముతో మద్యపానముచేయుము. ఈవదంతి యప్పటికప్పటికి హెచ్చి యంతట నిండఁగా, రాముఁడు సపరివారముగా రాక్షసులచే మ్రింగఁబడె నని లోక మంతయు వ్యాపింపఁగలదు. పిదప నీ వేకాంతమున సీతాదేవిని దగ్గఱి బుజ్జగించి, ధనధాన్యకనకవాహనాదుల నొసఁగి లోఁబఱచుకొనుము. భయవ్యసనము లే ఫలములు గాఁగల యీవంచనచే నా సీతాదేవి యపేక్ష లేనిదయ్యు ననాథయైనందున ని న్నొందఁగలదు. ఆపరమపతివ్రత యగు సీత నన్నుఁ బొందునా యని సందియపడుదు వేమో? ఆసీత మనోరంజకుఁ డైన భర్త నశించె నని యెంచి, తనభర్త వచ్చుననెడి యాశ లేమిచేతను, స్త్రీచాపల్యమును బట్టియు నీయధీనత నొందఁగలదు. మఱియు నా సీత మునుపు గారాబముతోఁ బెరిఁగినది. సౌఖ్యములకుఁ దగినది. కావున నిప్పుడు వ్యసనములచేఁ గృశించి తనసుఖము నీయధీనమై యున్నదని యెఱిఁగి తప్పక నిన్నుఁ బొందఁగలదు. నాబుద్ధి కిది యే యుక్తముగాఁ దోఁచుచున్నది. నా మాటలు వినక నీవు రామునితోడఁ గయ్యమునకుఁ బోయి నిలిచితి వేని గొప్పచేటు వాటిల్లెడు. నీకు యుద్ధము లేకయే యెక్కువ సుఖలాభము గలుగఁగలదు గనుక, నీవు కయ్యమునకై తలఁపు పెట్టకుము. శత్రుసేనలఁ గాంచక, ప్రాణసంశయము లేక, యుద్ధము చేయకయే పగుతురను లోఁబఱచుకొను నృపాలుఁ డెక్కువకీర్తిని, రాజ్యలక్ష్మిని, లక్ష్మీ కటాక్ష

మును బహుకాల మనుభవించుచున్నాఁడు" అని మహోదరుఁడు రావణునితోఁ జెప్పెను.

65-వ సర్గము

కుంభకర్ణుఁడు యుద్ధమునకు వెడలుట

అంతటఁ గుంభకర్ణుఁడు మహోదరుని వాక్యమును దిరస్కరించి, రాక్షసశ్రేష్ఠుఁ డయిన తన యన్నతో ని ట్లనియె: "ఓయన్నా! దురాత్ముఁడగు నారాముని వధముచే నీకుఁ గలిగియున్న ఘోరభయమును బోఁగొట్టెదను. నీవు దిగులువిడిచి నెమ్మదితో నుండుము. మొసగాండ్రు జలము లేని మబ్బులకై వడిఁ బనిచేయక డంబము లాడరు. యుద్ధరంగమున గర్జితముతోడ నేఁ జేయునట్టి పనులను జూడఁగలవు. శూరులు శత్రువు లొనర్చెడి యవమానముల నోర్వరు. తమ్ముఁ దాము గౌరవించుకొనరు కాని, తమ పరాక్రమ మిట్టిదని డంబము చెప్పుకొనక చేయ నలవి కాని పనినైనను చేయుదురు." అని యన్నతోఁ జెప్పి, మహోదరుం జూచి, "మహోదరా! పందలు, బుద్ధిహీనులు, తామే పండితుల మని తలఁచువారు నైన నీబోటివారిమాటల వినుటవలననే ప్రభువున కిట్టి యాపద వచ్చినది. ఎల్లప్పుడు యుద్ధమునకు వెఱచువారలు, రాజు మెచ్చు పలుకులు పలుకువారు, ప్రభువు నిష్టముచొప్పున నడచువారలు నైన మీచే యుద్ధమే పర్యవసానముగాఁ గల యీసీత నపహరించుట యను కృత్యం బొడఁగూర్పఁబడెను. పైకిఁ జెలికాండ్రనెడి వ్యవహారము గల వాస్తవశత్రువు లగు పిఱికివాండ్రయిన మీరు రాజు నిష్టముచొప్పున నడచుచు లంకాపురమును రాజశేషముగా నొనరించితిరి. బొక్కసమెల్ల వ్యయముచేసితిరి, సేనలను మడియించితిరి. శత్రువధమునకుఁ బూని మీ చెడినకార్యము చక్కఁబఱచుటకై యిదిగో నే నిప్పుడు యుద్ధమునకుఁ బోవ నున్నాఁడను."

అని బుద్ధిమంతుఁ డైన కుంభకర్ణుఁడు పలికిన పలుకు లాలకించి, రాక్షసాధిపుఁ డట్టహాసము చేయుచుఁ గుంభకర్ణు నుద్దేశించి, "అని మొనగాఁడా! నాయనా! యీ మహోదరుఁడు రామునికి వెఱచినవాఁడు. నిక్కమిది. కావుననే వీఁడు యుద్ధమునకు సమ్మతింపకున్నాఁడు. చెలిమిని బలిమిని బట్టి చూడ నీతో సమానుఁడు వేఱొక్కఁడు లేఁడు.

కుంభకర్ణా! శత్రువధము నిమిత్తము, మన జయము నిమిత్తమును వెడలుము. ఆ శత్రువువలని భయ ముడుపు నిమిత్తమే నేను నిన్ను లేపించితిని. ఆప్తు లగు రాక్షసులకు దాడివెడల నిది తరుణము. కావునఁ బాశాయుధముఁ దాల్చిన జముని చొప్పున మొనవాలు గైకొని పోయి, వానరులను, సూర్యునిమాడ్కి వెలిఁగెడి రామలక్ష్మణులను మ్రింగుము. నీభయంకరరూపము చూడఁగానే వానరు లందఱు పాఱఁగలరు. రామలక్ష్మణుల ఱొమ్ములు బ్రద్దలు కాఁగలవు. కావున నీవు యుద్ధమునకుఁ దఱలుము." అని యిటు మహారాజగు రావణుఁడు బలవంతుఁ డయిన కుంభకర్ణునితోఁ జెప్పిఁ తానే మఱలఁ బుట్టినట్లుగాఁ దలఁచెను. మఱియు నా రావణుఁడు కుంభకర్ణుని బలము నెఱిఁగినవాఁ డగుటచేతఁ గళంకము లేని చంద్రునిమాడ్కిఁ గడు వేడుకతో నుప్పొంగెను.

బలవంతుఁ డగు కుంభకర్ణుఁడును రావణుని పలుకుల కానంద మొంది ప్రయాణమున కాయితుఁడై, యంతయు ఉక్కుతోఁ జేయఁబడినదియు, పుటము వేసిన బంగారముతోఁ గైసేయఁబడినదియు, ఇంద్రుని వజ్రాయుధముఁబోలె భయంకర మైనదియు, తెల్లని పూవులదండలతో నలంకరింపఁ బడినదియు, వజ్రాయుధముమాడ్కి బరువైనదియు, దేవదానవ గంధర్వ యక్ష కిన్నరులను బరిమార్చినదియు, యెక్కువ వెలుఁగు గలదియు, తనంత నిప్పులు గ్రక్కుచుండునదియు, శాత్రవుల రక్తముచేఁ బూయఁబడినదియు, వాడిమి గలదియునైన మొనవాలు దాల్చి, రావణాసురునిం జూచి, "నే నొక్కఁడనే యుద్ధమునకు వెళ్లెదను. నాసైన్యమెల్ల నిచ్చట నుండ నిమ్ము నా యాగ్రహము చూచి, కలఁతనొంది యుండు నావానరుల నందఱ నిప్పుడే మ్రింగెదను" అని చెప్పఁగా, రావణుఁడును "కుంభకర్ణా, వలదు వలదు. వానరులు ఎక్కువ సామర్థ్యము, వడి, పూనికియుఁ గలవారు. ఒంటరివిగాఁ బోతివేని, నీ వేమఱుపాటున నున్నప్పుడు, వారు కోఱలతోఁ బీకి నాశము నొందింతురు. కావున రోఁకళ్లు, గుదియలు, మొనవాలులు దాల్చి బగతుర కోర్వరాని బంటులతోఁ జని, రాక్షసులకుఁ జేటొదవించు శత్రుపక్షమువారి నందఱిని సుగ్గుసేయుము." అని చెప్పెను.

ఎక్కువ ప్రతాపము గల యారావణుఁ డవ్విధముగాఁ బలికి, యాసనమునుండి దిగ్గున లేచి, నడుమ రత్నములు చెక్కిన పసిఁడిహారమును కుంభకర్ణుని మెడలో వైచెను. మఱియు భుజకీర్తులు, ఉంగరములు, మున్నగు మేలిసొమ్ములను, చంద్రునిఁబోలెడి ముత్యాలహారము నా కుంభకర్ణునికిఁ గైసేసెను. మఱియు సువాసనగల పూవులహారములు మెడలో వైచెను. నిగనిగమెఱయు నంటుజోళ్లను నాతని చెవులకుఁ దొడిగెను. పసిఁడి బుజపురులు మొదలగు ననేకాభరణములు దొడుగుటచే గొప్పచెవులుగల యా కుంభకర్ణుఁడు చక్కఁగా వేల్వఁబడిన యగ్నిహోత్రునివలెఁ బ్రకాశించుచు, నల్లని లావయిన మొలత్రాటిచే, యమృతమునకై క్షీరసముద్రమథనకాలమునందు వాసుకి యను సర్పముచేఁ గట్టఁబడిన మంథరపర్వతముమాడ్కి వెలుఁగుచు, పసిఁడిమయమును, దృఢమయినదియు, గాలి చొఱ వీలుకానిదియు, మెఱుపుకైవడిఁ బ్రకాశించునదియు, స్వకాంతిచేఁ బ్రజ్వరిల్లునదివోలెఁ గన్పట్టునదియునైన కవచముఁ దాల్చుటచే సంధ్యాకాల మేఘములచేఁ గ్రమ్మఁబడిన యైరావతముకైవడిఁ దోఁతెంచుచు, సర్వాభరణభూషితం బయిన కాయమును ధరించి మొనవాలు చేతఁ బట్టుకొనుటచే బలిచక్రవర్తియొక్క గర్వమణఁచుటకై మూఁడడుగు లిడఁదలఁచి యాత్మదేహము పెంచిన వామనావతారుం డగు విష్ణుమూర్తికైవడిఁ బ్రకాశించుచు నన్నను గౌఁగిలించి, ప్రదక్షిణముసేసి, శిరముతోఁ బ్రణమిల్లి, యుద్ధమునకుఁ దఱలెను. అవ్విధమున భయంకర రవములతోఁ దఱలినట్టి మహాకాయుఁడును బలవంతుఁడు నైన మా కుంభకర్ణుని నన్న ప్రశస్తదీవనలచే దీవించి, యుద్ధమునకుఁ బంపెను. రథికులు శంఖములు పూరించుచు, దుందుభివాద్యములు వాయించుచు, మేటియాయుధములు పూనిన సైనికులతోడను, గుఱ్ఱపురౌతులతోడను, గజారోహులతోడను గూడి, మేఘగర్జనమువంటి గమనధ్వనిగల రథము నెక్కినవారై యాబలవంతుఁ డగు రథికశ్రేష్ఠుఁడైన కుంభకర్ణుని వెంబడించి పోయిరి. కొందఱు సర్పములు, ఒంటెలు, గాడిదలు, గుఱ్ఱములు, సింహ వ్యాఘ్ర మృగ పక్షులు దోలుకొని బలవంతుఁ డగుటచేఁ జూపఱకు వెఱపు పుట్టించువాఁ డగు నాకుంభకర్ణుని వెంబడించి వెళ్లిరి. మార్గమున రాక్షసులు పువ్వులు వెదఁజల్లఁ

బరిజనులు గొడుగుపట్ట, శూలాయుధము చేతఁ బట్టి స్వభావమదముచే నొడలు మఱచినవాఁ డయ్యు, శోణితమద్యపానముచే మఱింత మఱచిన వాఁ డయి, వేల్పులగొంగ యగు కుంభకర్ణుఁడు సాగిపోవుచుండఁగా, బలాఢ్యు లగు పెక్కండ్రు భీకరు లగు వానిబంటు లఱచుచుఁ గన్నులు గిరగిరఁ ద్రిప్పుచు, నాయుధములు చేతులందుఁ దాల్చి యా కుంభకర్ణుని వెంబడించిరి. మఱియు నెఱ్ఱనిగ్రుడ్లు గొప్పయొడళ్లును గలిగి, కాటుక కొండలను బురుడించు మఱికొందఱు రాక్షసులు తీక్ష్ణము లైన గదా ఖడ్గ శూల పరశ్వధములను, పెక్కుబారల పొడవుగల గదలను, గుదియ లను, రోఁకళ్లను పెను తాటిబోదెల వంటి యాయుధములను, సహింప రాని క్షేపణులను నాయుధములను గైకొని యా కుంభకర్ణునితోడ సమర ప్రదేశమునకు వచ్చిరి. ఎక్కువ ప్రతాపముగల యా కుంభకర్ణుఁడు నూఱువిండ్ల వెడల్పును, ఆఱునూఱువిండ్ల యెత్తును గల పర్వత సదృశమైన యాకారమును బండిచక్రములంబోలు కన్నులు గలిగి చూపరకు వెఱపును గగ్గురుపాటును గలిగించెడి రూపముదాల్చి, తన్ను వెంబడించు నానాయుధు లయి యున్న రక్కసులను డగ్గఱించి, తన గొప్పనోఱు తెఱచి యట్టహాసము గావించుచు ని ట్లనియె: "ఓ రాక్షసు లారా! యిదిగో అగ్నిహోత్రుఁడు మిడుతలను భస్మముచేయునట్టు లా వానరవీరుల సేనలనెల్లఁ బరిమార్చెదను. వనసంచారు లగు వాన రులు నాయెడ నేమియుఁ దప్పిదము సేయలేదు. ఈ వానరజాతియె నాబోటి విహారపరు లయినవారికిఁ బట్టణంపు దోఁటల కలంకారము. పట్టణపు ముట్టడికి రామలక్ష్మణులు గారణభూతులు. ఆ యిరువురు నిహతు లైన పిదపఁ దక్కినవారెల్ల నిహతు లయినట్టులే; కావున యుద్ధమున నా రాముని వధించెను."

అని కుంభకర్ణుఁడు పలుకఁగా, సముద్రము కలఁతచెందు విధమునఁ గడు భయంకరముగా నా రాక్షసులు కేక లిడిరి. తర్వాత ధీమంతుఁ డగు కుంభకర్ణుఁడు కడువేగిరముగా వచ్చునప్పు డతనికి మార్గమధ్యమున భయంకరములైన యవశకునములు సంభవించినవి. మేఘములు కొఱవుల తోను, పిడుగులతోను గూడి, గార్దభములకైవడి నెఱుపు దెలుపు గలిసిన వన్నెగలవి యయ్యెను. పర్వత సముద్రములతోడఁ బుడమియు

బాగుగాఁ గదలెను. వఱళులు వాక్కులనుండి మిణుఁగుఱులు వెలువరించుచు భయంకరముగా నఱచినవి. పక్షు లప్రదక్షిణముగాఁ జుట్టెను. పోవుమార్గమున గ్రద్ద యొక్కటి యా కుంభకర్ణునిముందట పూలదండవలె బడినది. ఈతని యెడమకన్నును, ఎడమ బుజమును నదరెను. కొఱవికట్టె యొక్కటి గొప్పరొదతోడ నా కుంభకర్ణునిమ్రోలఁ బడెను. సూర్యునిప్రకాశము మాసెను. గాలి హాయిగా వీవదయ్యె. భయముచే గగ్గురుపాటొదవించు గొప్ప యవశకునములు తోడరియు, వానిని సరకుసేయక యా కుంభకర్ణుఁడు మృత్యు ప్రేరితుఁడై యుద్ధమునకుఁ దఱలి, ప్రాకారమును సాధారణముగాఁ గాళ్లనడకతో దాఁటి, మేఘములపిండుమాడ్కి దట్టముగా నడరియున్న యాశ్చర్యకరమైన వానరసైన్యమును గాంచెను. ఆ వానరవీరు లాపర్వతముఁబోలు నా కుంభకర్ణుం జూచి, గాలికిఁ జెదరిన మబ్బులచందమున మూలమూలలకుఁ బారిరి. ఆ కడుభయంకరమైన వానరసైన్యము చెదరిన మేఘముల సమూహము మాడ్కిఁ బరుగులిడుట కాంచి, యా మేఘవర్ణుఁ డగు కుంభకర్ణుఁడు మేఘపుంజముమాడ్కి గొప్పధ్వని గావించెను. ఆకాశమునందలి క్రొత్తమబ్బుయొక్క యురుముంబోలు నా కుంభకర్ణుని యార్పును విని, వానరులందఱు మొదటికిఁ దెగిన యేఱుమద్దిచెట్లమాడ్కిఁ గూలిరి. గొప్పదిట్టరి యగు కుంభకర్ణుఁడు ప్రలయకాలమున "నే నేమిచేయుదును' అని నిల్చియుండు సచేతనదండముగల యమునివలె వానరుల గుంపునకు కడువెఱపు గలిగించుచు, విస్తీర్ణమైన గదను ధరించి శత్రువధమునకై వచ్చెను.

66-వ సర్గము

కుంభకర్ణుని యుద్ధారంభము

పర్వతశిఖరమునకంటె నెత్తయిన యాకారముగల కుంభకర్ణుఁడు ప్రాకారముదాఁటి, పట్టణమునుండి వడిగా వెలువడివచ్చి, సముద్రమున మ్రోఁత పుట్టునట్లును, పర్వతములు బ్రద్ద లగునట్లును బిడుగులు పుట్టించుకై వడియు గొప్ప యఱ పఱచెను. మిడిగ్రుడ్లుగల్గి, యుద్ధము చేయవచ్చినట్టి యింద్ర యమ వరుణులకు నజయ్యుఁడైన యా కుంభకర్ణునిఁ గాంచి వానరులు మూలమూలలకుఁ బరుగెత్తిరి.

అంగదుఁడు పరుగెత్తుచుండు వానరులను గాంచి, బలశాలు రగు నల నీల గవాక్ష కుముదులతో ని ట్లనియె: "ఓ వానరులారా! మీరు మిమ్మును, మీ పరాక్రమములను, తమ కులమును మఱచి భీతిచే వణఁకుచు, సామాన్యవానరులయట్లే యెక్కడికిఁ బరుగు లెత్తుచున్నారు? నాయనలారా! తిన్నగా మఱలుఁడు. ప్రాణములు కాపాడుకొనెదరా? ఈ రాక్షసుఁడు యుద్ధమునకుఁ జాలఁడు. ఇది భయము గలిపించెడి యొక్క బొమ్మ. వానరులారా! మఱలుఁడు. ఈగొప్పదై వచ్చిన భయంకర మయిన యారాక్షసుల బొమ్మను బరాక్రమము చూపి, ధ్వంసము చేసెదము." అని యంగదుఁడు బోధింపఁగా, ఆవానరులందఱు వెనుకకు మఱలి యందఱుగూడికొని, పర్వతములు వృక్షములు నాయుధములుగాఁ గలవారై యుద్ధరంగమునుగూర్చి తఱలిరి. ఆవానరు లెక్కువ క్రోధము పూనినవారలై మదపుటేనుఁగులకైవడి మదించి యున్నతపర్వత శిఖర ములతోను, బండలతోను, మ్రాఁకులతోను గుంభకర్ణునిఁ గొట్టిరి కాని యాతం డా యేటుల కావంతయైనను గదలఁ డయ్యెను.

ఆ వానరు లేయు ఱా లా కుంభకర్ణుని మేనినిఁ దాఁకి పెక్కు వ్రయ్యలై క్రిందఁబడెను. పూచినకొనలుగల మ్రాఁకులును నట్లే విఱిగి క్రిందఁ బడిపోయినవి. ఆకుంభకర్ణుఁడును కడు నలిగినవాఁడై కాఱుచిచ్చు వనములను కాల్చుచందమున నత్యాగ్రహముతోఁ బ్రతాపశాలు రగు వానరుల సైన్యములను నశింపఁజేసెను. పెక్కండ్రు వానరులు రక్తములఁ దడిసినవారై బాణపుటేటులచేఁ గ్రిందఁగూలి, ఎఱ్ఱని పూవులుగల మ్రాఁకులకైవడిఁ గానఁబడిరి. వానరులు కుంభకర్ణునికి వెఱచి దుముకుచు, వడిగాఁ బరుగెత్తుచు వెనుకకు తిరిగిచూడకుండఁ బోయిరి. అట్లు బల వంతుఁ డగు కుంభకర్ణుని తన్నుల కోర్వఁజాలక పరుగెత్తిన వానరులలోఁ గొందఱు సముద్రమునఁ బడిరి. కొంద ఱాకసమునకుఁ జేరిరి, కొందఱు తాము సముద్రము దాఁటివచ్చిన దారింబట్టి పోయిరి. కొందఱు మోములందు దిగులు దోఁపఁ బఱచుటకుఁ దగిన మిట్టిపల్లపు నేలలను జేరిరి. కొందఱు కొండమ్రుచ్చులు చెట్ల నెక్కిరి. కొందఱు పర్వతము లలో డాఁగిరి. కొందఱు సముద్రమునందు మునిఁగిరి. కొందఱు

MEMORIAL LIBRARY D.P.B.I. ACC. No.

పర్వతగుహలందు దాఁగిరి. కొందఱు కూలఁబడిరి. కొందఱు నిలువకయే పరుగెత్తిరి. కొందఱు మృతులకైవడి నిద్రించిరి.

అవ్విధమునఁ బిఱికితనముతోఁ బాఱుచున్న వానరులం జూచి యంగదుం డిట్లనియె: "వానరులారా! నిలుఁడు. మనము పోరు చేయుదము. మఱలుఁడు. మీరు బన్నమునొంది యీ పుడమియెల్లఁ దిరిగియు మీ కునికిపట్టు దొరకఁబోదు. ప్రాణముల రక్షించుకొన నున్నారా? అందఱు మఱలుఁడు. అడ్డులేని పరాక్రమముగల యో వానరులారా! యాయుధములు దిగనాడి, పరుగెత్తి వచ్చిన మిమ్ముఁ జూచి మీ భార్యలంద అవమానముచేయుదురు గదా! ప్రాణుల కదియే మరణము. మన మందఱము ప్రసిద్ధములైన గొప్పకులములందుఁ బుట్టినవారము. నీచుల మాడ్కి వెఱపుచేఁ గ్రుంగి యెక్కడికిఁ బరుగెత్తెదరు? మీరు పరాక్రమము వదలి పందలై పరుగెత్తుచున్నారు గావున, కేవలము నీచులు. మీరు ముందు జనసమక్షమున నేపొగడ్తలు పొగడికొంటిరో ఆ యౌన్నత్యముం దెల్పు పొగడ్త లెల్ల నిప్పు డే మాయెను? అవమానితుం డయి ప్రాణములతో నున్నాఁడను చెడ్డపేరు లోకమున వాడుకయై వినఁబడుచుండును గదా? ధీరులు పోవునట్టి దారిని బట్టుకొనుఁడు. భయముడుగుఁడు. ఆయువులేనిచో శత్రు నిహతులమై పుడమిం గూలుదము. యుద్ధమునందలి మరణముచే నెవ్వరిచేతను బొందరాని బ్రహ్మలోకము నైనఁ జెందుదుము. లేదా, యుద్ధరంగమున శత్రువుం బరిమార్చి కీర్తినైన బొందెదము. కాకున్న వీరులకు ప్రాప్యస్థానమయిన బ్రహ్మలోకమునకు మూల్యమయిన జీవితమును బరిత్యజింతము. మిడుత యెఱియుచున్న యగ్ని హోత్రునిఁజెంది మఱల నట్లు, కుంభకర్ణుఁడు రాముని కంటఁ బడి ప్రాణములతోఁ దప్పించు కొని పోవఁజాలఁడు. మనమందఱ మీయొక్క కుంభకర్ణునిచేతఁ దన్నులుతిని ప్రాణసంరక్షణమునకై పరుగెత్తితిమేని, మన మింతకు మున్ను సంపాదించిన కీర్తి నశించిపోవును."

ఇవ్విధముగాఁ బలుకుచుండు పసిఁడి భుజకీర్తులు దాల్చిన శూరుఁడయిన యంగదుం జూచి, యా వానరులందఱు శూరులచే నింద్యమైన యొకమాట నెప్పిరి. "అంగదా! మేము కుంభకర్ణునితో ఘోరయుద్ధము గావించితిమి. ఇది మాకు నిలువ సమయముగాదు. మేము వెళ్లెదము.

మాకు, బ్రాణములు తీఁపులు గదా!" అని యీమాట మాత్రము సెప్పి వానర వీరులందఱు మిడిగ్రుడ్లు ద్రిప్పుచుఁ దమపై కడరుచుండు కుంభకర్ణుం జూచి, మూలమూలలకుఁ బరుగెత్తిరి. బుద్ధిమంతుఁ డగు నంగదుఁ డవ్విధమున బాఱుచుండు సేనలను మంచిమాటలచేతను, సాలపర్వత భేదనము మొదలగు దృష్టాంతములచేతను నూఱడించి, యందఱిని మఱలించి యుత్సాహము గలిగింపఁగా, నవ్వానరులంద ఱంగదుని యానతికై వేచియుండిరి. ఆతని యాజ్ఞయైన పదంపడి, ఋషభ శరభ మైంద ద్వివిద ధూమ్ర నీల కుముద సుషేణ గవాక్ష రంభ తార పనస మారుతి ప్రభృతులగు వానరవీరు లంద ఱుత్సాహభరితులై యుద్ధమున కెదుర్కొని వచ్చిరి.

67-వ సర్గము

కుంభకర్ణ వానరులయుద్ధము

గొప్ప మేనులవా రగు వానరవీరు లంద ఱంగదుని మాటలను విని వెనుకకు మఱలి, యంగదునిమాటలచే ధైర్యము నొందింప బడినవారలై, యుద్ధమునఁ బ్రాణముల విడుచుటకైన మది నిశ్చయించుకొని, తమ పరాక్రమములఁ దెలుపుకొనుచు మగఁటిమి పూని, మరణమునకైనఁ దీర్మానించుకొని, ప్రాణాపేక్ష మాని కడు ఘోరయుద్ధము సేయ నిశ్చయించికొని, గొప్పవృక్షములను, గొప్పకొండలను దాల్చి వడితో నా కుంభకర్ణుని నెదుర్కొనిరి. శూరుఁ డగు గొప్ప మేనివాఁ డయిన కుంభకర్ణుఁడు గదను దాల్చి పగతుర నొంచుచు యుద్ధరంగమున వానిఁ బడఁద్రోసెను. ఆ కుంభకర్ణునిచే నొంచఁబడిన వానరవీరు లొక్కొక్క తడవ కేడునూఱులు, ఎనిమిది నూఱులు, వెయ్యేసివంతిగాఁ గ్రిందఁబడిరి. గరుత్మంతుఁడు పాములను మ్రింగుకైవడిఁ గడుఁ గనలిన కుంభకర్ణుఁడు తన నిడుపుచేతులను జాచి, వానరుల నొక్కొక్కతూరి నెనమండుగురను, పదుగురునుగను, పదునాఱ్వురనుగను, ఇరువండ్రనుగను, ముప్పండ్రనుగను బట్టుకొని మ్రింగుచుఁ బోవుచుండెను. వానరు లప్పుడప్పు డెట్టకేలకు సమాళించుకొనుచు నొండొరులుగూడి పర్వతములను వృక్షములను గైకొని యుద్ధభూమియందు నిలఁబడిరి. అట్లు నిలఁబడిన తర్వాత వానరశ్రేష్ఠుఁడగు ద్వివిదుఁడు పర్వతము నొక్క-దానిని బెళ్లగించి

చేతఁబట్టుకొని, క్రిందికి వ్రేలాడు క్రొక్కాఱుమబ్బుకైవడిఁ బర్వతసదృశుఁ డయిన యా కుంభకర్ణునిమీఁదికిఁ గవిసి యాపర్వతము నా కుంభకర్ణుని మీఁద నేయఁగా నది యాతనికిఁ దగులక యాతని సైన్యమధ్యమున నే పడి, యతని సైన్యమునందలి గుఱ్ఱములను, ఏనుఁగులను, రథములను, తక్కిన రాక్షసులను బిండిసేసెను. తర్వాత నలుఁడు మఱియొక్క పర్వత శిఖరము నేసెను. ఆయేటున కనేకాశ్వములు సారథులతోడ మడియుటచే నారాక్షసుల మేనులనుండి కాఱిన నెత్తురు వెల్లువలై పాఱఁగా, నాయుద్ధము భయంకరమై యుండెను. రథములమీఁద యుద్ధముసేయు రాక్షసులు వినువారికి వెఱపు గలుగునట్లు కేకలిడుచుఁ బ్రళయసమయరుద్రుం బోలె వాఁడి యమ్ములనేసి, యా వానరవీరుల శిరములను వ్రయ్యలుసేసిరి. ధైర్యశాలు రగు వానరులును గొప్ప మ్రాఁకులను బెళ్లగించి, రాక్షసుల మీఁద నేసి, యా రాక్షసులను, వారి యరదములను, గుఱ్ఱములను, ఏనుఁగులను, ఒంటెలను సంహరించిరి. తర్వాత హనుమంతుఁడు పర్వత శిఖరములను, పెక్కు తెఱఁగులగు వృక్షములను బెళ్లగించి యెత్తుకొని పైకిఁ బోయి, యా కుంభకర్ణునినెత్తిని యాపర్వతాగ్ర వృక్షములను వర్షించెను. మహాబలుఁ డగు కుంభకర్ణుఁడు శూలాయుధముచే నా పర్వతశిఖరములను దుత్తునియలు చేసి, యా మహావృక్షములను విఱిచెను. అట్లు విఱిచి యా కుంభకర్ణుం డా వాఁడిమిగల శూలము నెత్తుకొని యా వానరసైన్యముమీఁదికిఁ గవియఁగా, హనుమంతుఁ డొక్క గొప్ప పర్వతశిఖరముగైకొని యావచ్చు కుంభకర్ణునియెదుట నిలిచెను. ఆహనుమంతుఁ డెక్కువ యాగ్రహముఁ బూని దానిని వచ్చునట్టి గొప్పపర్వతము బోలు నా కుంభకర్ణుని పై నేయఁగా, నా పర్వతశిఖరము దగులుటచేఁ గుంభకర్ణుని మేను నెత్తుటిచేతను గొవ్వుచేతనుఁ దడియఁగా నతఁడు మిక్కిలి నొచ్చెను. అంత కుంభకర్ణుఁడు బాగుగా మండుచున్న కొనలు గల పర్వతము బోలెను మెఱపువలెను మిఱుమిట్లుగొల్పు శూలాయుధమును ద్రిప్పి, కుమారస్వామి శక్త్యాయుధముతోఁ గ్రౌంచపర్వతమును భేదించుమాడ్కి నా హనుమంతుని ఱొమ్మునఁ గొట్టెను. శూలపుటేటు తగులుటంజేసి, వెడఁదఱొమ్ము బ్రద్దలుకాఁగా, మైమఱపు చెందుచు, నోట నెత్తురు గ్రక్కుచుఁ బ్రలయకాలపర్జన్యగర్జానుకారి యగు రవ

మొనరించెను. హనుమంతుఁడు నొచ్చుటగాంచి రాక్షసులంద ఱుప్పొంగి సంతోషకోలాహలము గావించిరి. వానరులో వ్యథనొంది భీతిచే నొచ్చినవార లగుచు యుద్ధరంగమున నాకుంభకర్ణునిసమక్షమునుండి పాఱి పోయిరి. అట్లు పరుగెత్తు వానరులను నిలిపి బలవంతుఁ డగు నీలుఁ డొక్క పర్వతశిఖరమును మూఁపుఁ డగు కుంభకర్ణుని నెత్తిని నేసెను. కుంభకర్ణుం డావచ్చెడి పర్వతశిఖరమును యొక గ్రుద్దు గ్రుద్దఁగా నా గ్రుద్దుచే నా పర్వతశిఖరము తుత్తునియలై మిణుఁగురులు వెలువరించుచు మంటల తోడఁ గ్రిందఁబడెను. తర్వాత వానరులలో మేటులగు ఋషభ శరభ నీల గవాక్ష గంధమాదనులు కుంభకర్ణునిమీఁదికిఁ గవిసి, యాతనిని పర్వతములతోను, వృక్షములతోను గొట్టుచు నఱచేతులతో నప్పళిం చుచుఁ గాళ్లతోఁ గ్రుమ్ముచుఁ బిడికిళ్లతో గ్రుద్దుచు నాతనిఁ జుట్టుకొనిరి. ఆకుంభకర్ణుఁ డా యేటులను మీఁదఁ దగిలిన తాఁకుళ్లనుబోలె నెంచి, వానిని లక్ష్యపెట్టక, కడువడితోఁ దనపైకిఁ గవిసిన ఋషభుని నిఱు చేతులతో గట్టిగాఁ గౌఁగిలించికొని నలుపఁగా, భయంకరుఁ డయిన ఋషభుఁడు నోటినుండి యెక్కువశోణితముఁ గ్రక్కుచు నేలఁ గూలెను. ఋషభుఁడు కూలినపదంపడి, శరభునిఁ బిడికిటితోఁ బొడిచి, నీలుని మోఁకాలితోఁ గ్రుమ్మి, గవాక్షుని నఱచేతితో నప్పళించి, గంధమాద నునిఁ గాలితోఁ ద్రొక్కి యందఱి నొక్కక్షణములోపలఁ గడు నొప్పిం చెను. ఆవానరవీరు లంద ఱా యేటులకు సొలిసి, రక్తము వెలువరిం చుచు నఱుకఁబడిన పూఁచిన మోదుగుచెట్లమాడ్కి నేలఁ గూలిరి. మహాత్ము లగు నా వానరవీరులు గ్రిందఁబడుచుఁ దక్కినవేలకొలది వాన రులు కుంభకర్ణునిమీఁదికి రేఁగి, యాతని యొడలిమీఁది కెక్కి, యెగు రుచు దుముకుచు నాతనినిఁ గోఱలతోఁ గొఱుకుచు గోళ్లతో రక్కుచుఁ బిడికిళ్లతోఁ బొడుచుచు మోఁకాళ్లతోఁ గ్రుమ్ముచుఁ బరిపరివిధముల నొంచిరి. అట్లు పెక్కండ్రు వానరులచేఁ బొదువఁబడిన యాబల్లికాఁ డగు రాక్షసవీరుఁడు పెక్కువృక్షములతోఁ బర్విన పర్వతేంద్రముకైవడిఁ జూపట్టుచుఁ నిరుగేల నా వానరుల నీడ్చుకొని, గరుడుఁడు పాములను బోలె వారిని మ్రింగెను. పాతాళముఁ బోలువానినోట నుంచఁబడిన వానరులును వాని ముక్కుతొఱలనుండియు, చెవుల రంధ్రములనుండియు

వెలువడి దుమికిరి. పర్వతముంబోలువాఁ డయిన యా రాక్షసవీరు డట్లు వానరులు వెడలివచ్చినది చూచి, మఱింత యాగ్రహము పూనిన వాఁడై, యా వానరులను మ్రింగుచు, చేతఁ జిక్కినవారి నెల్ల నుగ్గు చేయుచుఁ, బుడమియెల్ల మాంసరక్తములచేఁ దడిసి యమసు గలది యగు నట్లొనరించుచుఁ గ్రుద్ధుఁ డయిన ప్రలయకాలవహ్నిమాడ్కి వానరసేనయందు, శూలము చేతఁబట్టినవాఁ డగుటంజేసి, వజ్రాయుధము దాల్చిన దేవేంద్రునిమాడ్కియుఁ బాశాయుధము ధరించిన యముని కైవడియు వెలుఁగుచు మండు వేసవి నెండిన యడవులను గాఱుచిచ్చు దహించుమాడ్కి నా వానరవీరుల నందఱిని బాణాగ్నిచే దహించెను. వానరు లా కుంభకర్ణుచే నట్లు పీడింపఁబడుచు, మేటిగుంపులు నశించుట చేతను, గాఁపరులు కూలుటచేతను వెఱచి యులుకుపాటొందుచు, మిక్కిలి దీనముగా వికృతస్వరములతో నఱచుచుఁ గడునొచ్చినవా రగుటంజేసి, మనమునఁ గుందినవా రయి రాఘవుని శరణు చొచ్చిరి.

వానరులందఱు గొప్పయుద్ధమున బన్నము నొందినది చూచి, వాలి పుత్రుఁ డగు నంగదుఁడు కుంభకర్ణునిమీఁదికి వేగముతో నుఱికి, గొప్ప పర్వతశృంగము నొక్కదానిని గైకొని మాటిమాటికి బిగ్గఱగా నఱచుచుఁ గుంభకర్ణుని వెంబడించు రాక్షసుల నందఱను బెదఱించుచు, నా పర్వతశృంగము నా కుంభకర్ణునినెత్తిని బడవైచెను. అప్పర్వతశిఖరము దగులుటచే మిగుల నొచ్చిన బలముగల యా కుంభకర్ణుఁడు కట్టలుక గదుర నోర్వనివాఁడై యా యంగదునిమీఁది కడరి, వానరుల నందఱిని వెఱపించుచు, బొబ్బరింతపెట్టుచు నా యంగదునిమీఁద శూలాయుధముఁ బ్రయోగించెను. యుద్ధపుఁ బద్ధతులందు నేర్పరియైన బల్మికాఁ డగు నంగదుఁడు తనపైకి వచ్చు శూలమును గనిపెట్టి, చులకదనముతో దానిని నడ్డగించి, పైకెగిరి యాకుంభకర్ణుని ఱొమ్మున నొక దెబ్బ గొట్టెను. పర్వతసదృశుఁ డగు నారాక్షసవీరుఁ డా యేటు దగులఁ గట్టలుకచే మూర్ఛిల్లెను. కొంతసేపటి కా కుంభకర్ణుఁ డొడలుదెలిసి, పిడికిటిఁ బట్టి, పెడచేతితో నంగదుఁబొడువఁగా, నతఁడు స్మృతిదప్పి క్రిందఁగూలెను. అట్టు లా వానరవీరుఁడు మైమఱచి క్రిందఁబడఁగాఁ గుంభకర్ణుఁ డాశూలమును గైకొని సుగ్రీవునిమీఁదికిఁ గడువేగముతో

వచ్చుచుండెను. సుగ్రీవుఁడు మహాబలుఁ డగు కుంభకర్ణుఁడు తనపైకి వచ్చుటఁగాంచి, పైకెగిరి పర్వతశిఖరము నొక్కదాని నాతనిపై వేయ నెత్తుకొని వచ్చెను. కుంభకర్ణుఁడు తనపైకి వచ్చెడి సుగ్రీవునిఁ గాంచి, వికృతములైన యన్ని యంగములు గలవాఁడై యాసుగ్రీవుని కెదుటఁ నిలఁబడెను. వానరుల రక్తముచేఁ దడిసిన మేనుగలవాఁడై వానరులను మ్రింగుచు నిలఁబడియున్న కుంభకర్ణునిఁ గాంచి, సుగ్రీవుఁ డిట్లనియె:

"ఓరీ కుంభకర్ణా! నీవు శూరులను బడఁద్రోసితివి. పరులచేఁ జేయనలవి కాని పని యొనరించితివి. సేనలను భక్షించితివి. ఎక్కువ కీర్తిని సంపాదించితివి. ఆ వానరసేనను వదలుము. ఆ మూఁకతో నేమి పనియున్నది? ఓరీ రాక్షసా! నాపర్వతపు టేటొక్కటి నోర్చు కొనుము." అను సుగ్రీవునిపలుకు లాలకించి, "వానరా! నీవు బ్రహ్మ దేవుని మనుమఁడవు. ఋక్షరజసుని కొడుకవు. ప్రసిద్ధమైన పరాక్రమ ముతోఁ గూడినవాఁడవు. అట్లుండఁగా, నీవేల గర్జనము సేసెదవు?" అని కుంభకర్ణుఁడు సుగ్రీవు నెత్తిపొడువఁగా, సుగ్రీవుఁ డలిగినవాఁడై పిడుగువంటి పర్వతాగ్రముతో నా కుంభకర్ణుని ఱొమ్మునఁ గొట్టెను. ఆ పర్వతశిఖర మాకుంభకర్ణుని ఱొమ్మునఁ దగిలి తుత్తునియ లయ్యెను. అదిచూచి, వానరు లందఱు కుంభకర్ణుని దేహదార్ఢ్యమునకై కడుఁ జింతి ల్లిరి. రాక్షసులు సంతోషసూచకముగా సింహనాదము సల్పిరి. కుంభ కర్ణుఁ డా పర్వతశిఖరముతోఁ గొట్టుఁబడి కట్టలుక వూని నోఱు తెఱచి యార్భాటము గావించి మెఱుపువంటి వెలుఁగు గల శూలమును గిరగిరఁ ద్రిప్పి, యాసుగ్రీవుని వధింప నా శూలమును బ్రయోగించెను. వాయు నందనుఁ డగు హనుమంతుఁ డా కుంభకర్ణుఁ డేసిన పసిఁడిపూలదండ చుట్టిన యావాడిమొనవాలును జేతులతోఁ బట్టికొని, దానిని పెళ పెళమని వడిగా విఱిచెను. ఆకుంభకర్ణుని శూలాయుధము వేయిబారువల యినుముతోఁ జేయఁబడినది; మిక్కిలి గట్టిది. అట్టి గట్టి శూలము నా హనుమ మోఁకాలి కానించి యవలీలగాఁ బెళపెళ విఱిచెను. హనుమంతుఁడు శూలమును విఱుచుట గాంచి, వానరసేన సంతసముతోఁ బలు తెఱఁగులఁ గేక లిడుచు, నా యుద్ధభూమి యెల్ల గంతులు వైచుచుఁ దిరుగు చుండెను. ధైర్యవంతుఁ డగు కుంభకర్ణుఁడు తనశూల మట్లు హను

మంతుఁడు విఱిచినందుకై యెక్కువ కోపించుకొని, లంకాపట్టణము నందలి మలయపర్వతమునుండి యొక్క శిఖరముఁ బెల్లగించి దానితో సుగ్రీవుని నేసెను. సుగ్రీవుఁ డా పర్వతశిఖరము దెబ్బచే స్మృతి దప్పి యుద్ధభూమియందుఁ బడెను. అట్లు సుగ్రీవుఁడు స్మృతి దప్పి క్రిందఁ బడుట గాంచి, రాక్షసు లంద ఱుప్పొంగుచు కేకలు పెట్టిరి. ఆ మేరు పుసంబోలు రూపము గల కుంభకర్ణుఁడు చూపరకు వింత గొలుపు భయంకరపరాక్రమము గల సుగ్రీవునిమీఁదఁ బడి, సుడిగాలి మేఘ మును గొనిపోవునట్లు లాసుగ్రీవునిఁ జేతులతో నెత్తికొనిపోవుచు, మేఘసదృశుఁ డయిన యాసుగ్రీవుని నెత్తికొనిపోవుటవలనఁ గడు నెత్త యిన శృంగముగల మేరుపర్వతముమాడ్కిఁ బ్రకాశించెను. రాక్షస వీరుఁడు వానరరాజగు సుగ్రీవుని నెత్తిని బెట్టుకొని పోవుటచే వేల్పు లందఱు విస్మయంపడి చేయునట్టి కోలాహలములను వినుచు, రాక్షస వీరుల మన్ననల కెక్కుచు, దేవేంద్రునిఁబోలు నతనిఁ గొనిపోయినచో రాఘవుఁడును దక్కినసేన యెల్లను హతమైనట్లె తలఁచెను.

వానరసేన పరుగెత్తుచుండుట, కుంభకర్ణుఁడు సుగ్రీవుని నెత్తు కొని పోవుటయుఁ గాంచి, బుద్ధిసూక్ష్మత గలవాఁ డగు హనుమంతుఁ డి ట్లని చింతించెను : "సుగ్రీవుఁడు కుంభకర్ణునిచేఁ బట్టువడి యున్నాఁడు. ఇప్పుడు నే నేమి చేయ నగును ? నే నేమి చేయుట తగవో, దాని నెల్ల ప్పుడు చేసెదను. నేను బర్వతముఁ బోలు నాకారము దాల్చి, యీ రాక్షసుని సంహరించెదను. నే నీ బలిమికాఁడగు కుంభకర్ణు నొక్క గ్రుద్దు గ్రుద్ది నుగ్గునేసి వానరరాజగు సుగ్రీవుని విడిపించితి నేని, వానరులంద ఱుప్పొంగుదురు. అట్లు చేయుదునా యనిన, వల దని తోఁచెడిని. ఈ మహాఘోర దేవాసురపన్నగులచేతఁ జిక్కినను తానే తప్పించుకొనఁగలఁడు. ఇప్పుడు కుంభకర్ణుఁడు గాడ నేసిన పర్వతంపు దెబ్బచేఁ దెలివి తప్పిపడియున్నాఁడు. ఈతఁ డించుకతడవు లోపలఁ దెలివి నొంది, తనకును వానరులకును హితమైనకార్యము నొనరింపఁగలఁడు. నే నీ సుగ్రీవుని విడిపించితినేని నాయెడ సుగ్రీవుని కప్రీతి గలుగుటే కాక అపకీర్తియుఁ గలుగును. కావున నొక్కింతతడ వా సుగ్రీవుని పరాక్ర మునే వెలిపుచ్చఁగోరి యూరకుండెదను. ఈపరుగెత్తుచుండు వానరసేన

నూఱడించెదను" అని చింతించి యా వానర మహాసైన్యమును మఱల నిలువఁజేసెను.

అంతటఁ గుంభకర్ణుఁ డించుక కదలుచుండు మహావానరుని సుగ్రీవుని బట్టుకొని లంకలోపలఁ బ్రవేశించి, యేడంతస్తుల మేడలయందు, మండపములందు, గోపురద్వారములందును నున్నట్టి రాక్షసులు నెత్తావింగుబాళించు పువ్వులు విఱియఁ జల్ల రాజమార్గము నడుమఁ బ్రవేశించెను. బలవంతుఁ డగు సుగ్రీవుఁడు పేలాలు, గంధము గలిపిన నీళ్లు చల్లునప్పు డా నీరు చల్లగాఁ బైనఁ బడుటచేతను స్వయముగా రాజవీథి చల్లగా నుండుటచేతను నా సుగ్రీవుఁడు స్మృతి నొందెను. అట్లు పరాక్రమశాలి యగు సుగ్రీవుఁడు స్మృతినొంది, బలవంతుఁ డయిన యా కుంభకర్ణుని భుజమున నున్నవాఁ డయి తాను బట్టణమునందలి రాజవీథి యందున్న సంగతి యెఱిఁగి, "ఇతఁడు నన్నిట్లు పట్టితెచ్చినవాఁడుగా! ఇప్పుడు నేఁ జేయవలసిన ప్రతిక్రియ యేమి? కానిమ్ము. వానరుల కంద అకు నిష్టమును, మేలు గావించునదియు నగు కార్యము నొనరించెద." నని నిశ్చయించుకొన్నవాఁడై, వాఁడిగోళ్లతోను, గోఱలతోను నా కుంభకర్ణుని ముక్కు చెవులను గొఱికి గిల్లి ప్రక్కలు చీల్చి వేల్పుఱేని గొంగయైన కుంభకర్ణుని బలు తెఱంగుల నొంచెను. ఆసుగ్రీవుఁడు ముక్కుచెవులు గొఱికి ప్రక్కలు అక్కి యాకుంభకర్ణుని నొప్పింపఁగా, నాతఁడు నెత్తుటఁ దడిసినవాఁడై, కోపము మీఱఁగా నా సుగ్రీవుని గ్రిందఁ బడవైచి పొడిసేసెను. బలవంతుఁడైన కుంభకర్ణుఁడును, ఆతని భటులును సుగ్రీవునిఁ గ్రిందఁద్రోసి త్రొక్కుచున్నను, సుగ్రీవుఁడు వారిని లక్ష్యపెట్టక, తటాలున బైకెగిరి, మఱల రామునికడకు వచ్చిచేరెను.

బలవంతుఁ డగు కుంభకర్ణుఁడు చెవులు ముక్కులు పోఁగొట్టుకొని, మేన నెత్తురు ధారయై పాఱఁగా విఱాలచేఁ గ్రమ్మఁబడిన పర్వతము కైవడిఁ గన్పట్టుచు, నోటినుండి నెత్తురు వెడల, నల్లనికాటుకరాశిని బోలినవాఁ డగుటచే, సంధ్యారాగముతోఁ గూడిన వార్షికమేఘము కైవడిఁ బ్రకాశించుచు, మఱల యుద్ధభూమివైపునకుఁ దిరిగినవాఁడై యాగ్రహముతోఁ గొంతద వ్వేతెంచి, యాయుధము లేవియు లేవుగా యని వగచి యొక భయంకర మైన యినుపగుదియను గైకొని వెడలెను.

తర్వాతఁ బ్రతాపశాలి యగు కుంభకర్ణుఁడు వేగముతోఁ బట్టణమునుండి వెడలివచ్చి, బగబగ మండుచున్న ప్రలయకాలమందలి చిచ్చు ప్రజలను మ్రింగునట్లు వానరసేనలను మ్రింగఁ దొడఁగెను. కుంభకర్ణుఁ డాఁకలి గొనియున్నందున నంజుడు నల్లల నాహారింప గోరినవాఁడై, మేనిమీఁద స్మరణ లేనందునఁ దనవా రని పొరుగువా రని యెఱుఁగక రాక్షసులను, వానరులను, పిశాచులను కొండమ్రుచ్చులను భక్షించెను. బలము గలవాఁ డగు కుంభకర్ణుఁడు వానరులచేఁ బర్వతముతో మోదఁబడి మెదడును, రక్తమును జక్కఁగాఁ గార్చుచు, వానరరాక్షసుల నొక్క తడవ కొక్కరిని, ఇరువురను, ముప్వురను, బల్వురనుగా నొక్కచేతఁ బట్టుకొని యాత్రముతో నోటఁ బెట్టుకొనుచు, యుగాంత యముని మాడ్కిఁ బెక్కండ్రు వానరరాక్షసులను మ్రింగుచు వచ్చెను. అంతట వానరు లట్లు వానిచే మ్రింగఁబడుచుండఁగాఁ దక్కినవారు వెఱచి రాముని శరణు చొచ్చిరి. అయినను, కుంభకర్ణుఁడు కట్టలుక దొడర, వానరులను ఏడ్వురను, ఎనమండుగురను, ఇరువండ్రను, ముప్పండ్రను, నూఱ్వురనుగా, నొక్కొక్కతూరికిఁ జేతులతోఁ గ్రుచ్చియెత్తి మ్రింగుచు వానరులమీఁదికిఁ బరుగెత్తెను.

ఆసమయమున శత్రుసేనలను నొంచువాఁడును, శత్రుపురముల నాక్రమించువాఁడును, మగఁటిమి గలవాఁడు నైన లక్ష్మణుఁ డలిగిన వాఁడై, కుంభకర్ణుని శరీరమున మొదట నేడుబాణముల నేసి, మఱలఁ గొన్ని బాణములను గైకొని యాతనిమీఁద నేసెనుగాని, బలిమిగలవాఁ డగు కుంభకర్ణుఁడు పుడమి బ్రద్దలుసేయువాని కైవడి దడదడ నడచుచు లక్ష్మణుని సరకుసేయక రామునిమీఁదికే యడరెను. అంతట రాముఁ డాకుంభకర్ణునిపై రౌద్రమైన యస్త్ర మొక్కటి ప్రయోగించి, వాఁడి యమ్ములఁ బెక్కింటి నా కుంభకర్ణుని ఱొమ్మునఁ బడనేసెను. రాముని యమ్ముల యేటులు బాగుగాఁ దగులుటంజేసి, శీఘ్రముగాఁ బరుగెత్తుచున్న యా కుపితుఁ డయిన కుంభకర్ణుని నోటిగుండి మిణుఁగుఱులతోడ మంటలు గుభులు గుభులు మనుచు వెడలెను. రాక్షసవీరుఁడు రాముని బాణంపు చేటు బాగుగాఁ దగులుటచే నందఱికి వెఱపు గలుగు తెఱఁగున నార్భుచు, యుద్ధప్రదేశమునందలి వానరుల నందఱిని దఱుముచు

రామునిమీఁదికే యడరఁగా, నాతనియొడలి నిండుగా రాముఁడు బాణములను జొప్పించెను.

రామ కుంభకర్ణుల యుద్ధము

అప్పుడు రాముఁ డేసిన దర్భకొనలవంటి సన్నని ములుకులు గల బాణము లా కుంభకర్ణుని ఱొమ్మునఁ జొఱ నతఁడు పరవశుఁడు కాఁగా నతనిచేత నుండిన గదయు, సకలాయుధములును జాఱి క్రిందఁబడెను. కుంభకర్ణుఁడు తనచేత నుండిన యాయుధము లన్నియుఁ బడిపోవుటచేఁ బిడికిళ్లతోఁ బొడుచుటకును గాళ్లతోఁ దన్నుటకును నారంభించెను. రాముఁ డేసినయమ్ము లాతని ఱొమ్మున నాఁటి పర్వతమునుండి సెలయేఱు వెడలునట్లు లాతని దేహమునుండి రక్తము వెల్లువగాఁ బొఱఁజొచ్చెను. రక్తము మే నంతయుఁ గ్రమ్మ నాతఁ డెక్కువ యాగ్రహము పూనిన వాఁడై వానరులను, రాక్షసులను, ఋక్షములను మ్రింగుచుఁ బరుగెత్తుచుండెను. తర్వాత బలవంతుఁడు జమునిఁ బోలువాఁడు, భయంకరమైన విక్రమము గలవాఁడు నైన కుంభకర్ణుఁడు పర్వతశిఖరము నొక్కదానినిఁ దీసి, రామునిమీఁద నేసెను. పురుషోత్తముఁ డగు రాముఁ డది తనమీఁదఁ బడుటకుఁ వచ్చునంతలోపలనే చాయగాఁ బోవునట్టి పసిఁడి ములుకులు గల యే డమ్ముల నేసి యా పర్వత శిఖరముఁ బడఁగొట్టెను. మేరుపర్వతశిఖరముఁ బోలువాఁ డయి, తన ప్రతాపముచే వెలుఁగునట్లు కనఁబడుచు నిన్నూఱు వానరులమీఁది కడరుటగాంచి, రాముఁ డాకుంభకర్ణుని నేలఁబడఁ ద్రోసెను.

ధర్మస్వభావుఁ డగు లక్ష్మణుఁడు కుంభకర్ణుని వధమునకుఁ బూని, పెక్కుపాయము లాలోచించుచు నిట్లనియె: "ఈ కుంభకర్ణుఁడు రక్తగంధముచే నొడలు మఱచినవాఁడై వీరు వానరులు వీరు రాక్షసులనియు నెఱుఁగక తనవారిని నొరులను సైతము మ్రింగుచున్నాఁడు. వానరులారా! మీరంద ఱీతనిమీఁద నెక్కి యితనినిఁ గదలక మెదలక యుండునట్లు చుట్టు నిలుచుండుఁడు. అంతట నీదురాత్ముఁడు మోయరాని భారము నెత్తిని బడుటచేఁ గ్రింది కడఁగిపోయి యిఁక నితర వానరులను సంహరింపకయుండును." అని బుద్ధిమంతుఁ డయిన లక్ష్మణుఁడు చెప్పిన పలుకులు విని యా వానరవీరులందఱు పేడుకతో నా కుంభకర్ణునిమీఁద

నెక్కిరి. వానరులంద ఱెక్కుటచేఁ గుంభకర్ణుఁ డోర్వరాని యాగ్రహము పూనినవాఁడై, దుష్టగజము మావటీండ్రను ద్రోసినట్టులు వానరులందఱిని విదిలించి క్రిందఁ ద్రోసెను.

రాముఁ డదిచూచి, యీరాక్షసుఁడు చెడ్డవాఁడు వధ్యుఁడు గాఁడని యెఱిఁగినవాఁడై గట్టివింటిం గైకొని యాతనిమీఁదికిఁ బోవఁ దలఁచి, క్రోధముచేఁ గన్నులెఱ్ఱపాఱఁ బగతురను దహించునట్లు చుఱచుఱఁ జూచుచు, కుంభకర్ణునికి వెఱచిపాఱుచున్న వానరవీరుల నందఱిని సంతసపఱచుచు రోషముతో నా కుంభకర్ణునిమీఁది కడరుచుఁ పాముపలె నిడివిగలది, గట్టి యల్లెత్రాటితోఁ గూడినది, బంగారుతోఁ బూయఁ బడినది, వెఱపుగలిగించునదియు నైన వింటిని గైకొని, యమ్ముల పొదులను గట్టుకొన్నవాఁడై, వానరుల నందఱ నూఱడించి, వానర సేనలును లక్ష్మణుండును వెంట వచ్చుటచే నొరుల కజేయుఁడై యాతని మీఁదికి యుద్ధమునకుఁ దఱలెను. రాముఁ డట్టులేతెంచి, శత్రుసంహారి, బలవంతుఁడు, కిరీటము దాల్చినవాఁడు, నెత్తుటఁ దడిసిన మేనివాఁడు, అలిగినదిశయేనుఁగుచందంబున నందఱిమీఁదికి రేఁగుచు, రాక్షస సమేతుఁడయి, వానరులను వెదకుచుండువాఁడు, వింధ్యమందరపర్వతములను బోలువాఁడు, బంగరు భుజకీర్తులుగలవాఁడు, వానకాలపు మబ్బును బోలువాఁడు, నోటినుండి నెత్తురు వెలువరించువాఁడు, నాలుకతో నెత్తుటినినాకుచుండువాఁడు, రక్తమువలెనెఱ్ఱనినేత్రములు గలవాఁడు, వానరసైన్యమును నలుపుచుఁ బ్రళయకాలయముఁడో యనఁదగి మండుచున్న యగ్నివంటి వెలుఁగుగలవాఁడు, ధీరుఁడు నగు రాక్షసవీరునిఁ గాంచి, వింటినారిని మీఁటెను. ఆ రాక్షసవీరుఁడు రాముని వింటినారిమ్రోఁత విని యలిగినవాఁడై, యా మ్రోఁత నోర్వఁ జాలక యా రామునిమీఁది కడరెను.

తర్వాత రాముఁడు గాలికిఁ బైకెగిరిన మబ్బుమాడ్కి వచ్చువాఁడును, వాసుకియొక్క మేనివలె నిడువలైన చేతులు గలవాఁడును, పర్వతమువలె నెత్తయిన దేహముగలవాఁడు నయిన కుంభకర్ణునిఁ గాంచి యిట్లనెను. "ఓ రాక్షసాధిపుఁడా! రమ్ము. దిగులు పడకుము. నేను వింటిని గైకొని నిలిచియున్నాఁడను. ఓరి యింద్రుని విరోధీ! నన్నిం

ద్రునిఁగాఁ దలంపకుము, నేను రాముఁ డని యెఱుఁగుము. నాచేత నొకక్షణములోపల నీవు ప్రాణములు గోలుపోవుదువు." అని రాముఁడు సెప్పఁగా, కుంభకర్ణుఁడు రాముఁ డతఁ డని యెఱిఁగి యలుకపూని, వానరులను రణప్రదేశమునుండి తఱుముచు నా వానరవీరుల గుండె లెల్ల నవియునట్లు రామునిమీఁదికిఁ బరుగెత్తెను. ఎక్కువ ప్రతాపము గల యా కుంభకర్ణుఁడు మేఘపు టుఱుమువంటి వికృతస్వరముతో నట్టహాసము చేసి "రాముఁడా! నేను విరాధుఁడను గాను. కబంధుఁడను గాను. ఖరుండనుగాను. వాలినిగాను. మారీచుండనుగాను. కుంభకర్ణుఁ డను నేను వచ్చినవాఁడను. ఇదిగో వెఱపు గల్గించు నా గొప్ప యినుప గుదియను జూడుము. దీని తోడ్పాటుననే నింతకుమున్ను దేవదానవులను సైతము గెలిచితిని. నా ముక్కుచెవులు తెగిపోయిన వని నన్ను హేళనము సేయకుము. ముక్కు చెవులు దెగిపోయినందున నాకించు కేనియు నొప్పి లేదు. ఓ యిక్ష్వాకువంశతిలకమా! నీచులకనైన నేర్పును నాయెడఁ గనఁబఱుపుము. నీపరాక్రమము చూచి యానందించి పిమ్మట నిన్ను మ్రింగెదను." అని రామునితోఁ బలికెను.

రాముఁ డా కుంభకర్ణుని యాటోపాలాపములు విని, కట్టా యితుఁడై చక్కని ములుకులుగల వాఁడియమ్ముల నా కుంభకర్ణునిపై నేసెనుగాని, వజ్రాయుధముఁబోలు నా వాఁడియమ్ములు దగిలియు నా సురవైరి యించుకేనియుఁ గదలఁ డయ్యెను ; నొప్పి నొందఁ డయ్యెను. తొల్లి సప్తసాలములను భేదించినవియు, వానరపుంగవుఁ డగు వాలిని సంహరించినవియు నైన యావజ్రసదృశము లగు బాణము లీ కుంభ కర్ణుని కావంతయైన నొప్పి గలిగింపఁజాలని వయ్యెను. ఆ యింద్రశత్రువు రాముని యాబాణములను నీటిధారలను బోలెఁ దన శరీరముమీఁదికి రానిచ్చి, యెక్కువ వడిగల యా గుదియను ద్రిప్పుచు నా బాణములఁ బడఁగొట్టెను. తర్వాతఁ గుంభకర్ణుఁడు నెత్తుటిచేఁ బూయఁబడినదియు, దేవతలనెల్ల వెఱపించునదియు, కడువడిగలదియునైన యా గుదియతో వానరసేనను యుద్ధరంగముపుండి తఱిమెను. అంత రాముఁడు వాయ వ్యాస్త్రము నా కుంభకర్ణునిపైఁ బ్రయోగించెను. దానిచే కుంభకర్ణుని గుదియఁబట్టియున్న బాహువును దెగిపడియెను. అంతట నాతఁ డా బాధ

నోర్వఁజాలక గట్టిగా నఱచెను. పర్వతశిఖరముఁబోలు నాతని బాహువు రాముని బాణముచేఁ దెగి, గుదియతోడ వానరసేన నడుమఁ బడి యా వానరసేనలను జదిపెను. చేతులు కాళ్లు విఱిగినవారు, చచ్చినవారుపోఁగా మిగిలిన వానరవీరులు గడగడ వడఁకుచుఁ బ్రక్కన నిలఁబడి భయంకరమైన రామకుంభకర్ణులయుద్ధమును జూచుచుండిరి. కుంభకర్ణుఁడు శిఖరము పోయిన పర్వతశ్రేష్ఠము తెఱఁగునఁ బ్రకాశించుచు, నొక చేయి తెగిపోవుటచే మఱియొక చేతితోఁ జెట్టు నొకదానిని బెళ్లగించికొని యా రామునిమీఁదికి మఱలఁ బోవఁగా, మఱలఁ బైకెత్తినట్టిది, సాలవృక్షముతోఁగూడినది, మహాసర్పశరీరముం బోలినదియైన యాతని మఱియొక చేతిని రాముఁడు బంగారుచే నలంకృతమైన ఐంద్రాస్త్ర మభిమంత్రించిన బాణముతో ఖండించెను. రామునిచే ఖండితమైన పర్వతసదృశ మగు నాతని మఱియొక హస్తము గిరగిరఁ దిరుగుచు వృక్షశైలములను, శిలలను, నుగ్గుచేసిఁ బెక్కండ్రు వానరరాక్షసులను సంహరించెను. ఆట్లు రెండుచేతులు దెగియు, ఱొప్పుచుఁ దనపైకి వేగముతో వచ్చుచున్న కుంభకర్ణునిఁ గాంచి వాఁడిమిగల రెండర్ధచంద్రబాణముల నా రాక్షసవీరుని పాదములను ద్రుంచెను. ఆతని రెండు పాదములును దిక్కులను, విదిక్కులను, గిరులను, గుహలను, మహాసముద్రమును, లంకాపురమును, వానర రాక్షసమహాసైన్యములను మాఱుమ్రోగునట్లు చేయుచుఁ గ్రిందఁ బడినవి. ఆ కుంభకర్ణుఁడు చేతులును కాళ్లును బోవుటచే బడబాముఖము బోలు తనముఖమును దెఱచి, యాకసమున రాహువు చంద్రుని మ్రింగఁబోవునట్లు రాముని మ్రింగుటకై వేగముతో నతనిమీఁది కడరెను. అంతట రాముఁడు బంగారుమయములైన వాడిములుకులుఁగల పెక్కు బాణములను బ్రయోగింపఁగా, కుంభకర్ణుఁడు ముఖమంతయు బాణములతో నిండుటచే మాటలాడఁజాలక, యెట్టకేలకుఁ దిన్నగాఁ గూసి, మూర్ఛచెందెను.

కుంభకర్ణుఁడు చచ్చుట

అంత రాముఁడు సూర్యునికిరణములంబోలునది, బ్రహ్మదండమును బ్రలయకాల యమునిని బోలినది, శత్రువులకుఁ జెఱుపు గలిగించునది, వాయువేగము బోలు వేగముగలది, చక్కని పింజగలది యైన

యింద్రునిచే నిర్మిత మైన యొక తీక్ష్ణ బాణమును గైకొని వింట సంధించెను. రాముఁ డట్లు సంధించి, వజ్రముమాడ్కిఁ గఠినమై, బంగారుమయమై, చక్కని పింజ గలిగి, చక్కఁగాఁ దేజరిల్లు సూర్యాగ్నుల వెలుఁగుం బోలిన వెలుఁగు గలిగినదై, దేవేంద్రుని వజ్రాయుధము యొక్క వేగముఁ బోలు వేగముగల యాదివ్యమైన బాణము నా కుంభకర్ణునిమీఁదఁ బ్రయోగించెను. రాఘవుఁ డట్లు తన వెలుఁగుచేఁ బది దెసలను వెలుఁగఁజేయుచుఁ బొగతోడఁగూడి మండుచున్న యగ్నిహోత్రుని మాడ్కి వెలుఁగుచున్న యట్టి బాణమును వడిగా నా కుంభకర్ణునిమీఁద నేసి, గొప్ప పర్వతశిఖరముఁ బోలునది, దొఱలుచున్న కోఱలుగలది, కదలుచుండు సొగసైన యంటుపోగులు గలదియు నైన యా కుంభకర్ణుని శిరమును, దొల్లి దేవేంద్రుఁడు వజ్రాయుధముతో వృత్రాసురుని శిరమును ద్రుంచినమాడ్కిఁ ద్రుంచెను. త్రుంచిన వేగమువలనఁ బైకిఁ బోయినదై కుండలముతోఁ గూడిన యా కుంభకర్ణుని శిరము రాత్రియందు నక్షత్రద్వయాత్మకమైన పునర్వసు నక్షత్రమునడుమఁ దేజరిల్లు చంద్రునికైవడిఁ దోఁతెంచెను. పర్వతమువంటి యాతని శిరము రామునిచేఁ దఱుగఁబడి, పైకిఁ బోయి యచ్చటినుండి లంకాపురమునఁ గ్రిందఁబడెను. అట్లు పడుటచే నచ్చట నున్న మంటపములును, గొప్ప గవనులును, నెత్తయిన ప్రాకారమును గూలెను. అంతటఁ కుంభకర్ణుని కళేబరము చుట్టును బరుగెత్తుచున్న వానరులను బెక్కండ్రను గ్రిందఁ ద్రోయుచు నేలఁ గూలెను. హిమవంతునిఁ బోలునట్టి యా రాక్షసునికాయము సముద్రమునఁ బడి, యచ్చటి మొసళ్లు, గొప్ప చేఁపలు, సర్పములు మున్నగు జలజంతువులను నుగ్గుచేయుచుఁ బుడమిలోపలఁ బ్రవేశించెను.

ఆ దేవబ్రాహ్మణ విరోధియైన బలవంతుఁ డగు కుంభకర్ణుఁడు బవరంబున మడియఁగాఁ బుడమియుఁ బర్వతము లన్నియుఁ గదలినవి. వేల్పులందఱు వేడ్కమీఱుటచే సంతోషకోలాహలములు చేసిరి. తర్వాతఁ గొందఱు ధైర్యశాలు రగు రావణునిచుట్టములు చేయనలవికాని యా కుంభకర్ణువధముచే మిక్కిలి వగచి, వేల్పులచే నొప్పింపఁబడిన యసురులు విష్ణువును జూచి వెఱచునట్లు లా రఘువంశతిలకుఁ డయిన యా రామునిఁ జూచి వెఱచి యార్చిరి. రాహువు నోటినుండి విడువఁబడిన సూర్యుఁ

డా వేల్పుజగములోని చీఁకటినిఁ బోకార్చి వెలుఁగుచందమున, భూలోకమున రాముఁడును యుద్ధమున గుంభకర్ణునిఁ బరిమార్చి యా వానరుల నడుమ మిగుల వెలుఁగుచుండెను. శత్రుభయంకర మయిన దేహబలము గలవాఁ డగుటంజేసి, పగతురచే నోర్వరానివాఁ డయిన యా సురకంటకుఁడు మడియఁగా, వానరులు పెక్కండ్రు వికసించిన కమలములఁ బోలిన మోములతో వెలయుచుఁ, దమ కోరికసిద్ధించినందుకై రామునిఁ గొనియాడిరి. దేవేంద్రుఁడు వృత్రాసురుని సంహరించినచందమున భరతుని యన్నయైన రాముఁడు వేల్పులమూఁకకు గొంగయు, గొప్ప యుద్ధములందును శ్రమము నొందనివాఁడును, నైన యా కుంభకర్ణుని సంహరించి యెక్కువ యానందము నొందెను.

68-వ సర్గము

రావణుఁడు కుంభకర్ణ మరణమునకై చింతించుట

మహాధీరుఁ డగు రాముఁడు కుంభకర్ణునిఁ దెగటార్పఁగా, రాక్షస వీరులందఱు రాక్షసాధిపుఁడైన రావణుని సమక్షమునకుఁ జని "ఓ ప్రభూ! కాలసదృశుఁ డగు కుంభకర్ణుఁడు కీశులసేనలఁ దఱిమి మ్రింగి, కాలవశమునఁ గీనాశనికేతనము జేరెను. కొంతతడవు రామునిని, వానరులను నొంచియుఁ గడపట రాముని ప్రతాపముచే నడఁగిపోయెను. శిరమును దొడలును బాహువులును దెగఁగొట్టఁబడినవాఁ డయి విశేషముగా నెత్తురు కారుచుండఁగా నా పర్వతసదృశుఁ డయిన కుంభకర్ణుఁడు సగము దేహము నెక్కువ లోఁతుగల సముద్రములోఁ జొప్పించి, తక్కిన యూర్ధ్వకాయముచే ద్వారము నడ్డగించి బహుభీకరుఁడై యున్నాఁడు. ఓ ప్రభూ! నీ తమ్ముఁడు కుంభకర్ణుఁడు రాముని బాణములచే జచ్చినవాఁ డయి, కాఱుచిచ్చుచే మండిన వృక్షముమాడ్కి వికృతుఁ డయి పిండాకారముతో నున్నాఁడు" అని విన్నవించిరి. రావణుఁడు మహాబలుఁ డగు కుంభకర్ణుఁడు సమరమున మృతుఁ డయ్యె నను వార్తను విని, మిగుల వగగూఱి, మూర్ఛిల్లెను. దేవాంతక, నరాంతక, త్రిశిరస, అతికాయు లనువారు తమ పినతండ్రి మరణమునకై మనమున వ్యసనముచే నొచ్చినవారలై కన్నీరు నించుచు నేడ్చిరి. మహోదర మహాపార్శ్వులును దమ తోఁబుట్టువు రామునిచే వధింపఁబడినవానిని గాంచి వ్యసన

పీడితు లైరి. తర్వాత రాక్షసశ్రేష్ఠుఁ డగు రావణుఁ డెట్టకేలకుఁ దెలివి తెచ్చుకొని, కుంభకర్ణ వధముచే దిట వేది పలవింపసాగెను.

కటకటా! పగతురగర్వ మడఁచువాఁడా! ఓరీ బలిమికాఁడా! ఓరి మొనగాఁడా! ఓరి కుంభకర్ణా! దైవవశమున నన్నుఁ బాసి జమునిప్రోలికిఁ బోయితివిగా! ఓ బలవంతుఁడ వగు కుంభకర్ణా! నా యొక్కయు, బంధువులయొక్కయు, మనములందలి దుఃఖశల్యము నూడఁదీయక, నీ వొంటరివిగా శత్రుసేనల మలమలమాడ్చి నన్నుఁ బాసి, స్వర్గమునకుఁ బోవుచున్నాఁడవే! ఏ నీ సాహ్యముఁ గొని, దేవతలకును నసురలకును వెఱవకుంటినో, ఏ నీవు నాకుఁ గుడిబుజమవై యుంటివో, అట్టి నీవు మృతినొందుటచే, నేను జీవితముతోనుండియు లేనివాఁడనైతిని. శూరుఁడవు, దేవదానవుల గర్వము నణఁచినవాఁడవు, ప్రలయకాలరుద్రునిఁ బోలినవాఁడవు నైన నీ వెట్టులారామునిచేఁ జంపఁ బడితివి! ఓరి తమ్ముఁడా! వజ్రాయుధంపు టేటునకును వ్యసనమునొందని నీ విప్పు డెట్టులా రామునిచే వధింపఁబడి నేలఁ బరుండియున్నాఁడవు? ఇదిగో వేల్పులందఱును ఋషులును నింగిని నిలఁబడి నీ మరణమునకై కడు నుప్పొంగి యఱచుచున్నారు. మఱియు సంతోషభరితు లైన వానరులు సమయము గనిపెట్టి యింతకు ము న్నొరులచేఁ జొఱ నలవికాని లంకాపురద్వారముల నన్నిటి నెక్కఁగలరు. నాయనుఁగుదమ్ముఁడు కుంభకర్ణుఁడు నన్నుఁ బాసిపోయిన తర్వాత నా కీ రాజ్య మేల? సీత యేల? నాకు బ్రదుకుమీఁద నాశ యే లేదు. యుద్ధముచేసి, నాతమ్మునిఁ జంపిన రాఘవుని నేను బరిమార్ప నేని, బ్రదికి యుండుటకంటె మృతినొందుట మేలుగాని, యీ పనికిమాలిన బ్రదుకు బ్రదికి యేమి యుపయోగము? నాతమ్మునిఁ బాసి యొక నిమిషమైన నుండఁజాలను గాన, నే నిప్పుడే నా తమ్ముఁడు పోయినచోటి కేఁగెదను. వేల్పు లందఱు తమకు ము న్నుపకారముల నొనర్చిన నన్నుఁ గాంచి పరిహాసము చేయుదురుగదా! కుంభకర్ణా! నీవు నీల్గినతర్వాత నే నెవ్వరితోడ్పాటున నింద్రుని గెల్వఁగలను? బుద్ధిశాలి యగు విభీషణుఁడు సెప్పిన మాటను దెలివి లేక విననిదానికి ఫల మిప్పు డనుభవమునకు వచ్చెను. కుంభకర్ణ ప్రహస్తుల మరణముచే నిప్పుడు విభీషణునిమాట నా మనమునకు వ్యసనముఁ గలిగించుచున్నది.

ధర్మము నడపువాఁడు, కాంతిగలవాఁడు నైన విభీషణునిఁ దఱుమఁ గొట్టిన పాపకర్మమున కీ శోకప్రదమైన ఫలము గలిగెను." అని యిట్టు లా రావణుఁడు మనమునఁ గలవరపాటుతోఁగూడి, కడుదీనముగా నా కుంభకర్ణునిఁ గూర్చి విలపించి, యింద్రశత్రు వయిన తన తమ్ముఁడు చచ్చిన మాట బాగుగా నెఱిఁగి, యా దుఃఖమోర్వఁజాలక నేలఁబడెను.

69-వ సర్గము

అతికాయుఁడు యుద్ధమునకుఁ దఱలుట

దుష్టబుద్ధి యగు రావణుఁడు శోకముతోఁ గూడినవాఁడై విల పించుచుండఁగా, త్రిశిరుఁడు రావణునితో ని ట్లనియె. "ఓ ప్రభూ! నీవు చెప్పినట్లే శూరుఁ డగు నా నడిమితండ్రి దైవము చాలమివలన మడి సెను, శూరులు నీవలె శోకము నొందరు. నీవు ముల్లోకములనైనను నుగ్గుసేయఁ జాలినవాఁడవు. అట్టి నేర్పరివై యుండియు నేల యిట్లు నీవు నిన్నుఁగూర్చి వగచెదవు? నీకు బ్రహ్మ యొసఁగిన శక్త్యాయుధ మున్నది; కవచము, బాణములు, ధనువు నున్నవి. వేయి వేసడములు వూన్చిన మేఘగర్జనముబోలు గర్జనముగల గొప్పయరద మున్నది. నీ వింతకు ము న్నొకతూరి నిరాయుధుఁడవై వేల్పుల నందఱను గెల్చితివి. అట్టిఁవాడ విప్పు డాయుధసామగ్రియుండఁగా మానవమాత్రుఁడైన రాముని నొక్కనిని సంహరింపనేరవా? మహాప్రభూ! నీవు నిర్భయముగా నుండుము. గరుడుఁడు సర్పములను నాశముచేసినతీరున నీ శత్రువులను వేళ్లతోడఁ బెళ్లగించి వైచెదను. ఇంద్రుఁడు శంబరాసురుని, విష్ణువు నరకాసురుని సంహరించినతీరున, నాచే రాముఁడు చంపఁబడినవాఁడయి యుద్ధరంగమునఁ బడఁగలఁడు. రావణుఁడు త్రిశిరసుని పలుకు విని మృత్యువు ప్రేరించుచుండఁగాఁ దాను మఱలఁ బుట్టినట్లుగాఁ దలఁచెను, త్రిశిరసుని పలుకులు విని ప్రతాపశాలు రగు రాక్షసవీరులైన దేవాంతక నరాంతకాతికాయులను రావణుని కొడుకులు నేను నే నని గర్జించుచు రావణునిచుట్టును నిల్చిరి. వారు నల్వురు వేల్పుతేనియొక్క మగఁటిమిం బోలు మగఁటిమిగలవారు; అంద ఱాకాశసంచారులు; అంద ఱెక్కువ బలిమిగలవారు; మాయలందు నేర్పరులు; అందఱు వేల్పుల గర్వము నడఁచినవారు; అందఱు బలిమిచేఁ బ్రసిద్ధికెక్కినవారు; వారు బవర **ము**

లందు దేవగంధర్వపన్నగులకైన నోడినట్లు తెలియరాదు. అందఱు అథర్వవిద్యలఁ జదివినవారు, యుద్ధరంగములందుఁ బ్రసిద్ధికెక్కినవారు, అంద ఱెక్కువ శాస్త్రజ్ఞానముగలవారు, బ్రహ్మాదులంగూర్చి తపంబు లొనర్చి గొప్ప వరములఁ బడసినవారు. సూర్యునినూడ్కి వెలుఁగు వారును, శత్రుసేనల నడఁచువారు నయిన యీ నలువురు పుత్రులతోఁ గూడిన యీ దశగ్రీవుఁడు గొప్పదానవుల గర్వము నణఁచిన వేల్పుల తోడం గూడిన వేల్పుఱేనికైవడి భాసిల్లెను.

తర్వాత దశగ్రీవుఁడు పుత్రులఁ గౌఁగిలించి, తొడవు లొసఁగి, మేటిదీవనలు సల్పి సమరమునకుఁ బంపెను. మఱియు రావణుఁడు మహోదర మహాపార్శ్వ లను తమ్ముల నిద్దఱను కాఁపుదలకై కుమారుల వెంబడిఁ బంపెను. గొప్ప యొడళ్లుగలవార లగు నా యాఱుమువురును మృత్యుదేవత పురికొలుప శత్రువుల నేడ్పించు వాఁ డయిన ధైర్యశాలి యగు రావణునికి మ్రొక్కి ప్రదక్షిణముచేసి, సకల సుగంధ ద్రవ్య ముల నలఁదుకొని, పోరు చేయు కోరికతోఁ దఱలిరి. మహోదరుఁ డైరావతకులమునఁ బుట్టిన నల్లనిమబ్బుఁబోలు సుదర్శనం బనెడి యేనుఁగు నెక్కెను. సకలాయుధములను, అమ్ములపొదులనుఁ జేర్చి కట్టఁబడిన యేనుఁగు నెక్కి, యస్తమయపర్వతశిఖరమున నున్న సూర్యునిమాడ్కిఁ దేజరిల్లెను. రావణుని పుత్రుఁడు త్రిశిరుఁడు సకలాయుధములతో నిండి నది, మేటిగుఱ్ఱములు పూన్చినది యైన మేటియరదము నెక్కెను. విలుకాఁ డయిన త్రిశిరసుఁడు మెఱుపులతోను గొఱవులతోను గూడి నదై పర్వతశిఖరమున వాలిన మేఘము చందమునను, మూఁడు రతనాల కిరీటములు దాల్చినందున మూఁడు బంగారు శిఖరములతోఁ గూడిన హిమవత్పర్వతరాజము కైవడియుఁ బ్రకాశించెను. విలుకాండ్రందఱిలో మేటియుఁ బ్రతాపశాలియు నైన రావణుని మఱొక్క పుత్రుఁ డగు నతి కాయుఁడును జక్కని యిరుసు గలది, చక్కఁగాఁ గూర్పఁబడినది, గట్టి నొగయుఁ గాడియుఁ గలది, బాణములతో నిండిన యమ్ముల పొదులును, ప్రాసఖడ్గగదలునుంచి నదియు నైన మేటి యరదమెక్కి బంగారు మయ మైన రత్నములు చెక్కిన భూషణములను దాల్చి కిరీటము ధరించుటచే, సూర్యకిరణములచేఁ బ్రకాశించు మేరుపర్వతము కైవడియు, రాక్షస

శ్రేష్ఠులతోఁ గూడ రథారూఢుఁడై యున్నందున వేల్పులచేఁ బరివేష్టింప. బడిన వజ్రాయుధధారి యగు వేల్పుటేని మాడ్కియుఁ బ్రకాశించెనుఁ నరాంతకుఁడును బసిఁడి భూషణములఁ దొడిఁగినది, మనోవేగముఁ బోలు వేగము గలది, గొప్పశరీరము గలది, యుచ్చైశ్శ్రవముఁ బోలి నదియు నైన తెల్లగుఱ్ఱమునెక్కి, కొఱవికట్టెమాడ్కి ధగధగ మెఱయు నీఁటెను దాల్చి, నెమిలివాహనముమీఁద నెక్కి శక్త్యాయుధముఁ దాల్చిన కుమారస్వామిచందమునఁ బ్రకాశించెను. దేవాంతకుఁడు రవలు చెక్కిన గుదియను దాల్చి సముద్రమథనసమయమున మందరపర్వ తముఁ దాల్చిన విష్ణువుంబోలె గనఁబడుచుఁ దేజరిల్లెను. పెనుమేనుగల మొనకాఁ డగు మహాపార్శ్వుఁడు గదను జేతఁబట్టుకొని, యుద్ధరంగమున నసురులతోఁ బోరునప్పుడు గుదియ జేతఁదాల్చిన కుబేరునిఁబోలెఁ బ్రకాశించెను. మహాబలు లగు నా రాక్షసవీరు లాఱ్వురు సాటిలేని సేనలతోఁ గూడినవారై, యమరావతీపురమునుండి యసురులమీఁదికి దండెత్తిపోవుచున్న వేల్పులమాడ్కిఁ బ్రకాశించిరి. అట్టి యా వీరు లార్వురు పోవుచుండఁగా, మేటి యడిదములు దాల్చిన మహాత్ము లగు రాక్షసు లందఱు గజతురంగములను బూన్చిన మేఘగర్జనవంటి గమన ధ్వనిగల రథములమీఁదఁ గూర్చుండి, వారిని వెంబడించిరి. సూర్యునిఁ బోలెఁ దేజరిల్లువారు నెక్కువ ధైర్యవంతులు సగు నా రాక్షసవీరులు కిరీటములఁ దాల్చి కాంతితోఁ గూడి యాకాశమున వెలుఁగు గ్రహముల వలెఁ బ్రకాశించిరి.

ఆ రాక్షసవీరులు శరత్కాలపు మబ్బులమాడ్కియు నాకసమున వరుసలు దీఱిన రాయంచల పిందుకైవడియుఁ దెల్లనై వెలుఁగునట్టి యాయుధములు దాల్చి, పగతుర నోడింపనైనను, తాము చావనైనను నిర్ణయించుకొన్నవారలై, బవరము సేయఁ దమితో వెడలి గర్జించుచుఁ బొబ్బలుపెట్టుచు, యుద్ధమున నెవరికిని నడఁగనివారై యాయుధములఁ గైకొని వచ్చిరి. ఆ రాక్షసుల యఱపులకును, భుజములు తట్టుటలకును నప్పు డాకాశము బ్రద్దలయిన ట్లుండెను. ఆ బలవంతు లగు రాక్షసుల ట్లెక్కువ వేడుకతో వచ్చి పర్వతశిఖరములు, వృక్షములు చేతులఁ బట్టి యుద్ధము సేయ నాయితమైయున్న వానరసైన్యమును జూచిరి.

గొప్ప దిట్టరు లగు వానరులును గజతురగరథములచే నిబిడమును, పెక్కు చిఱుగజ్జెల మ్రోఁతగలదియుఁ నల్లని వానకాలపు మబ్బుల గుమిఁ బోలునదియు, గొప్ప యడిదములఁ బైకెత్తుకొనినదియునై, మండుచున్న యగ్ని సూర్యులవంటి ప్రతాపములుగల రాక్షసభటులతో నిండిన రాక్షసబలమును జూచిరి. ఆ రాక్షసబలమును జూచినవెంటనే, బలవంతు లగు వానరు లందఱు తమబలిమి చూప సమయము దొఱకినందుకై యెక్కువ సంతసమంది, గొప్ప పర్వతములను బైకెత్తికొని రక్కసుల యుక్కును సైరింపక కడుభీకరముగా నఱచిరి. బలిమికాండ్రగు రాక్షసులును నా వీరుల యఱపులను సైరింపక హెచ్చిన వేడ్కతో నార్భాటము గావించిరి. వానరవీరు లా భయంకరరాక్షససేనం జూచి, పర్వతశిఖరములను జేతులఁ గయికొనిన వార లయి, శిఖరముగల నడగొండలమాడ్కిఁ గొంద ఱాకాశమునను, కొందఱు క్రిందను నా రాక్షససైన్యము నడుమను నడయాడుచుండిరి. వానరరాక్షసు లట్లొండొరుల నెదిరించి, చూపఱకు దిగులు పుట్టునట్లుగా యుద్ధము సేయఁబూనిరి. రాక్షసులు వానరులను పెక్కు ఆయుధములతో బాగుగా మోదినను, వానరులు వానిని లక్ష్యపెట్టక పర్వత శిలా వృక్షములను గైకొని వర్షించి యా రాక్షసులను నొంచిరి. వానరరాక్షసవీరులు సింహనాదములు సేయుచు నొండొరులను దాఁకుసమయమున, వానరులు రాక్షసులను ఱాలతోఁ బొడిసేసిరి. కవచములు తొడవులు దాల్చినవారును రథములు, ఏనుఁగులు గుఱ్ఱముల మీఁద నెక్కినవారును నైన రాక్షసులను గొందఱు వానరు లెదిరించి బాగుగాఁ దన్నిరి. ఆ యుద్ధరంగమునందలి రాక్షసవీరు లా పర్వతశిఖరములతోఁ గ్రుచ్చుకొనిన యొడళ్లుగలవా రయి, పిడికిళ్ల గ్రుద్దులచేఁ గ్రుద్దు వెలికుఱుక మిక్కిలి నొచ్చి తిన్నగాఁ దిరుగుచు నేలం గూలి యఱచిరి. రాక్షసు లంతటితో విరమింపక, మొనవాలులు, గుదియలు, గండ్రగొడ్డళ్లు, గదలు, బల్లెములు మొదలగు నాయుధములతోను వాఁడియమ్ములతోను నా వానరులను జక్కఁగా మర్దించిరి. ఇట్లు నెత్తుటఁ దడిసినమేనివా రయ్యు వానరరాక్షసు లొండొరుల జయింపఁగోరినవారై యొండొరులను బడఁద్రోయ, క్షణములోపల వానరరాక్షసు లేసిన

పర్వతవృక్షాదులు శూలములు మొదలగు నాయుధము లా యుద్ధభూమి యందంతట నిండి, రక్తప్రవాహమయమై యుండెను. పర్వతసమానము లైన యాకారములు గలవారును, యుద్ధగర్వముతోఁ గూడినవారును నైనందున శత్రుసంహారు లయిన రాక్షసవీరు లచ్చటఁ బడియుండిరి. రాక్షసు లిట్లు వానరులచే, గ్రందఁ ద్రోయఁబడి, త్రోయఁబడుచు నున్నను నాయుధములు పోఁగొట్టుకొన్నవారలయ్యు, మఱలఁ గదిసి యుద్ధమునేయఁ దొడఁగిరి.

ఆ రాక్షసులు వానరులను వానరులతోనే కొట్టిరి. వానరులును రాక్షసులను రాక్షసులతోనే కొట్టిరి. రాక్షసులు వానరులచే రువ్వఁబడు తాలను బట్టుకొని, వానరులను గొట్టిరి. వానరులును రాక్షసులు ప్రయోగించు నాయుధములఁ ద్రుంచివైచి, రాక్షసులను మర్దించిరి. ఆ సంగరమున వానరరాక్షసు లొండొరులను బర్వతములతో, శూల ములతో నస్త్రములతోఁ గొట్టుకొనుచుఁ బెడబొబ్బలు పెట్టిరి. వానరు లచే మైమరువులు చిల్లులు పడునట్లు వృక్షశైలములతోఁ గొట్టఁబడి, చెట్లు పాలుగార్చునట్లు రాక్షసులు తమ యొడళ్లనుండి రక్తముఁ గార్చిరి. అట్లు జరుగు ఘోరరణమునఁ గొందఱు వానరులు రథములను రథము లతోను, ఏనుఁగుల నేనుఁగులతోను, గుఱ్ఱములను గుఱ్ఱములతోను గొట్టిరి. కొందఱు వానరులు గడు నుప్పొంగుచు, మనశ్శిలలను గ్రహిం చిన వారలై రాక్షసులను పెక్కు కొమ్మలుగల వృక్షములతోఁ గొట్టిరి. అట్లు వానరరాక్షసులకు ఘోరయుద్ధము జరిగెను. అప్పుడు రాక్షసులు అర్ధచంద్రబాణములు, వాఁడిబాణములు, బల్లెములు మొదలగు నాయు ధంబులతో నా వానరు లేయు తాలను మ్రాఁకులను బడఁగొట్టిరి. పర్వత శిఖరములు తుత్తునియ లయి పడియుండ, చెట్లు తుండ్లు తుండ్లుగాఁ నఱుకఁబడిపడియుండ వానరరాక్షసులు నీల్గి, గ్రందఁ బడియుండఁ బుడమి నడప నలవికానిదై యుండెను. వానరులు మదోత్కటములైన మన సులు గలిగి యుద్ధరంగము నేరి, భయ ముడిగి, రాక్షసు లందఱితోఁ గూడి వారిచేతులందలి యాయుధములను గైకొని వారితో ధైర్య ముతో యుద్ధము సేయఁబూనిరి. ముమ్మర మైన యా యుద్ధము జరుగు చుండుసమయమున వానరు లుప్పొంగుచు, రాక్షసులు మడియుచు

నుండుట గాంచి దేవతలు, మహర్షులు, యక్షగంధర్వాదులు నెక్కువ హర్షము నొందిరి.

అట్టి సమయమున నరాంతకుఁడు వాయువేగముగల తత్తడి నెక్కి వాఁడిమిగల శక్తిని గైకొని, మహాసముద్రమున మత్స్యము ప్రవేశించినచాడ్పున వానర రాజసేనయందుఁ బ్రవేశించెను. ఆ యింద్ర శత్రువగు నరాంతకుఁ డొక వెలుఁగులు చిమ్ముచున్నట్టి యీఁటెను గొని యొక నిమిషములోన నా వానరసైన్యమున నేడునూఱువురను గొట్టెను. విద్యాధరులును మహర్షులును గుఱ్ఱముమీఁద నెక్కి వానరసేన నడుమఁ దిరుగుచున్న బలశాలి యగు నరాంతకునిఁ జూచిరి. రక్తమాంసములచే నడుసుగల యా నరాంతకుఁడు వచ్చిన మార్గము నిండుగఁ బర్వతముల మాడ్కి నెత్తయిన యొడళ్లుగల వానరులు పడియుండుటచే దారియే లేక యుండెను.

వానరులు తమ మగఁటిమి సూప వెడలునంతలోపలనే యా నరాంతకుఁడు కాఱుచిచ్చు కానలను గాల్చునట్లు మండుచుండు నీటియను బైకెత్తి వానర సేనలను నుగ్గాడెను. వానరులు పర్వతవృక్షములఁ బెల్లగించుటయే తడవుగ నవి వజ్రాయుధముచేఁ దెగఁగొట్టఁబడిన కొండలకైవడి నా యీటియచేఁ ద్రుంపఁబడి క్రిందఁబడెను. బలవంతుఁ డగు నరాంతకుఁడు వానకాలపుగాడ్పుపగిది బవరమున వానరుల నందఱిని జదియఁగొట్టుచు నంతటఁ దిరుగుచుండెను. వీరులగు వానరులు దిగులుపడి, పరుగెత్తుట కేని, నిలఁబడుట కేని, ఇటటు కదలుటకేనిఁ జాలక యట్లె నిలిచిరి. నరాంతకుఁడును దుముకువానిని, నిలిచినవానిని, పాఱువానిని నందఱిని నుగ్గాడెను. యమునిఁ బోలునట్టి యా నరాంతకుఁ డొక్కఁడే సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు నీటియతో నా వానరవీరుల నెల్లను బడఁగూల్చెను. వజ్రాయుధంపు టేటుంబోలెడు నేటుగల యా యీటియ పోటునకు వానరు లోర్వఁ జాలక నెత్తిని గొంతుపెట్టి యఱచుచుఁ గ్రిందఁ బడఁగా, వారి రూపములు వజ్రాయుధము నేటుచే విఱిఁగిన శిఖరములుగల పర్వతముల యాకారమును బురుడించినవి. ఆ వానరు లట్లు నరాంతకని హతులై పడియుండ, ముస్కు కుంభకర్ణునిచే నొప్పింపఁబడిన ధీరులగు వానరవీరు లంతటు లేచి

నెమ్మదిపడి సుగ్రీవునిచేరువ కేతెంచిరి. సుగ్రీవుఁడును నరాంతకునికి వెఱచి యిటటు పరుగెత్తుచుండు వానరసేనను బరికించి యా సేనవెంబడి నీటియ చేతఁబట్టికొని గుఱ్ఱముమీఁద నెక్కి. వారి పైకివచ్చెడి నరాంతకునిఁ జూచి, యింద్రుని విక్రమముంబోలు విక్రమముగల యంగదునిఁ గాంచి, "యోరి నాయనా! వీఁడుగో గుఱ్ఱముమీఁద నెక్కి, వానరసేనల నెల్లఁ గలవరపఱచుచు వచ్చుచున్న యీ రాక్షసుని నెదిరించి, వేగమే వీని ప్రాణములు దీయుము." అని యానతిచ్చెను.

పర్వతముల గుమింబోలు నాకారముగల యా యంగదుఁడు రత నాలు చెక్కిన బుజపురులు దాల్చి, కావిరాలతో నిండిన గొప్పపర్వతము మాడ్కిఁ దేజరిల్లుచు నాయుధములు గొనక, కోఱలు గోళ్లు నాయుధ ములుగాఁ గలవాఁ డయి తనప్రతాపము మెఱయ వానరేంద్రుని మాట విని, మబ్బులమొత్తమునుండి సూర్యుఁడు వెలువడు చాడ్పున, మబ్బుల గుంపుమాడ్కి దట్టమైన యా వానరసేన నడుమనుండి వెడలి వచ్చి, నరాంతకుని నెదిరికొని "ఓరీ రాక్షసుఁడా! యీ బక్కచిక్కిన వానరులతో నేమి యుపయోగము? వీరితో నేమి చేయఁగలవు? ఇదిగో నా బొమ్మునఁ బిడుగుఁబోలు తాఁకుగల నీ యీఁటియ వేగ నేయుము." అని యనెను.

నరాంతకుఁ డంగదునిమాట విని, పండ్లు పటపట గొఱికి యవుడు గఱచి, పాముచాడ్పున బుసకొట్టుచు, నంగదునిమీఁదికిఁ బోయి, తన చేతి గదను గిరగిరఁ ద్రిప్పి యా యంగదునిమీఁద నేసెను. తటాలున నా యీఁటె వజ్రాయుధముమాడ్కి ననిర్భేద్యమైన యా యంగదుని బొమ్ముఁ దాఁకి, పెళపెళ విఱిగి నేలఁబడెను, ఆ ప్రాసాయుధము గరుత్మంతునిచేఁ ద్రుంచఁబడిన సర్పకాయముమాడ్కిఁ దునిఁగి క్రిందఁబడఁగా నా వాలి పుత్రుఁ డఱచేతిని బైకెత్తి, యాతని యశ్వమును నెత్తిని మోదెను. ఆ మోదునకు దౌడలు లోపలి కీడ్చుకొనఁ గంటిగ్రుడ్లు పగిలి నాలుక వెలువడఁ బర్వతముబోలు నాతని గుఱ్ఱము తల పగిలి వ్రయ్యలు గాఁగాఁ గ్రిందఁగూలెను. ఎక్కువ తేజముగల నరాంతకుఁడు తన గుఱ్ఱము పడుట గాంచి, క్రోధమూర్ఛితుఁడై, పిడికిటిఁ బైకెత్తి యావాలిపుత్రుని నెత్తినిఁ బొడిచెను. ఆ నరాంతకుని పిడికిటిపోటునకు నంగదుని తల పగిలి కడువెచ్చ నైన నెత్తురు లొడలొడఁ గాఱెను. ఆతఁడును పలుమాఱు మయిమఱచి

మూర్ఛచెందెనుగాని, యెట్టకేలకు స్మృతిఁ దెచ్చుకొని, నరాంతకుని బలిమి కాశ్చర్యపడి, పిడుగువడిగల, పర్వతంపుఁ గొనను బోలునట్టి పిడికిటిని గట్టిఁగాఁ బట్టికొని యా నరాంతకుని బొమ్మున గ్రుద్దెను. ఆ యంగదుని పిడికిటిపోటున కా నరాంతుఁకుఁడు బొమ్మ చీలి, మంటవలెఁ బైకి లేచుచున్న నెత్తుటిచేఁ దడిసినవాఁడై వజ్రాయుధముచేఁ ద్రుంపఁబడిన యొక కొండమాడ్కి నేలఁ గూలెను. అంతట నంతరిక్షమున వేల్పు పెద్దలును, వానరులును బలశాలి యగు నరాంతకుఁ డంగదునిచే సమరమునఁ గూల్పఁబడినది చూచి సంతోషకోలాహలములు గావించిరి. అంగదుఁ డవ్విధమున నితరులచేఁ జేయనలవికాని దయినందున, రాముని మనమునకు సంతసము గలిగించునట్టి శత్రుసంహారరూపకార్యము గావించి, వెండియుఁ గయ్యముసేయ నాయితుండై యుండె. రాముఁడును నంగదుని బలపరాక్రమోత్సాహములను గాంచి సంతసము నొందెను.

70-వ సర్గము

దేవాంతక త్రిశిర మహోదర మహాపార్శ్వులు మడియుట

నరాంతకుఁడు మడియుటఁ గాంచి, రాక్షస వీరులగు దేవాంతక త్రిశిరమహోదరులు ముగ్గురును గొంతెత్తి పలవించి, దుఃఖము నణఁచుకొని సమరమునకుఁ దఱలిరి. అంత మగఁటిమిగల మహోదరుఁడు పర్వతసదృశ మయిన గజేంద్రము నెక్కి యెక్కువ పౌరుషముగల యా యంగదు నెదుర్కొనెను. బలవంతుఁ డగు దేవాంతకుఁడును తోఁబుట్టువు చావువలని దుఃఖముచే మాడినవాఁ డయి, మండుచున్న గుదియను గైకొని యా యంగదునిమీఁదికి దుమికెను. మొనగాఁ డగు త్రిశిరుఁడు మేటివారువములు పూన్చిన సూర్యునిమాడ్కి వెలుఁగు నరదమెక్కి వాలిపుత్రునిపైకిఁ బోయెను. దేవతల గర్వమణఁగించిన యా ముప్పురు రాక్షసవీరులు తనమీఁదికి వచ్చుట గాంచి యంగదుఁడు చేరువ నున్న యొక్కగొప్పమ్రాఁకు నూడఁబెఱికి, యింద్రుఁడు మండునట్టి వజ్రాయుధమును బగతురపై నేయునట్లు గొప్ప కొమ్మలుగల యా మ్రాఁకును దేవాంతకునిమీఁద వడిగా విసరివైచెను. త్రిశిరుఁ డా వడిగావచ్చెడి మ్రాఁకును పాములంబోలు వాఁడియమ్ములచేఁ ద్రుంచెను. అదిచూచి యంగదుఁడు త్వరగా నాకసమున కెగిరి, వృక్షశైలములను వర్షము

గురిపించునట్లు క్రుమ్మరించుచుండఁగా, త్రిశిరుఁ డలిగి, యా పర్వత ద్రుమములను దీక్ష్ణమార్గణములచేఁ ద్రుంచెను. దేవాంతకుఁడును త్రిశిరునకుఁ దోడ్పడి గదాగ్రముతో నా వృక్షములను ద్రుంచెను. అప్పుడు త్రిశిరుఁడు పెక్కు బాణము లేయుచు వీరుఁ డయిన యంగదునిఁ దఱిమెను. మహోదరుఁ డేనుఁగు నంగదునిమీఁదికిఁ బోనిచ్చి, యలుక గదుర వజ్రమునుబోలిన తోమరములతో నా యంగదుని ఱొమ్మునఁ బొడిచెను. వేగముగల యట్టి దేవాంతకుఁడును గట్టలుకఁ బూని, యంగదునిఁ గదిసి, వడిగా గుదియతో నాతనినిఁ గొట్టి, మఱల నెడము గలుగుటకై వెనుకకుఁ బోయెను. ఆరాక్షసవీరులు ముగ్గు రివ్విధమున నొక్కుమ్మడిగాఁ జుట్టుకొని తన్నుఁ గొట్టుచున్నను, అంగదుఁడు ప్రతాపబలశాలి యగుటచే నించుకయైన నొవ్వఁ డాయెను. అట్లు నొవ్వక పగతురచే నించుకేని నొప్పింప నలవికానివాఁడును, వడిగలవాఁడును నగు నయ్యంగదుఁడు గొప్ప మోహారము పూని, పై కెగిరి, యఱచేతితో నాతని గొప్పయేనుఁగును మోదెను. ఆ మోదున కామేటి యేనుఁగు యొక్క గ్రుడ్లు నేలఁబడినవి. ఆ యేనుఁగును నొప్పికిఁ డాళఁజాలక ఘీంకరించెను. అంగదుఁ డంతటితోఁ జాలింపక, యా మదపుటేనుఁగుకొమ్ము నూడఁబెఱికి, దేవాంతకుని పై కెగిరి, యాతని నాకొమ్ముతోఁ గొట్టఁగా, నాతఁడు గాలికిఁ దూలిన మ్రాఁకుకై వడిఁ బడిపోయెను. వాని యన్ని యంగములనుండి లత్తుకరసముంబోలు నెత్తురుకారెను. అట్లు బాగుగ నొచ్చియు నెక్కువ వెలుఁగుగలవాఁ డగుటంజేసి దేవాంతకుఁ డెట్టకేలకు నూఱడిల్లి పైకి లేచి, భయంకరమైన గుదియను ద్రిప్పి యంగదుని మీఁద నేసెను. అంగదుఁడు గుదియయేటు దగిలి మోఁకాళ్లు నేలకుఁ దగులఁ బడి, మఱలఁ బై కెగిరెను. అట్లు పై కెగురుచుండు నంగదుం జూచి, దేవాంతకుఁడు చక్కఁగాఁబోవునట్టి మూఁడు గడుసరి యమ్ముల నా యంగదుని నొసట గాఁడ నేసెను.

అవ్విధమున రాక్షసవీరులు ముగ్గు రొక్క యంగదుని జుట్టుకొని యుండుట గాంచి, యంగదుని కొక్కనికి వీరు వధ్యులు గా రని యెఱిఁగి, హనుమన్నీలు లిద్దఱును నా రాక్షసులమీఁది కేతెంచిరి. అంత నీలుఁడు త్రిశిరసుని నెత్తిమీఁద నొక్కపర్వతశిఖరము నేసెను. తెలివిగలవాఁ

డగు రావణునికొడుకు త్రిశిరుఁడా పర్వతశిఖరమును వాడియమ్ములచేఁ ద్రుంచివైచెను. మగఁటిమియు బల్మియుఁ గల హనుమంతుఁ డపుడు దేవాంతకుని గ్రుద్ది పెడబొబ్బవెట్టి రాక్షసుల నందఱం గడగడ లాడించెను. హనుమంతుని పిడికిటిపోటునకు మహోదరుఁడు తలపగిలి చెదరి పడి, పండ్లూడి కంటిగ్రుడ్లు గూలి, నాలుక వ్రేలవైచి, ప్రాణము లెడలి తటాలున నేలఁ గూలెను. రాక్షసవీరులలో ముఖ్యుఁ డయిన బలవంతుఁ డగు వేల్పులగొంగ యగు దేవాంతకుఁడు పోర నీలుగఁగా, త్రిశిరసుఁడు వాఁడిమొనలుగల భయంకరమైన బాణములను వాన గురిసినట్లు కురిపించెను. మహోదరుఁడును కడుఁ గనలినవాఁడై, వేవెలుఁగు మందర పర్వతము నెక్కునట్లు వడిగా మఱొక్క యేనుఁగు నెక్కి, యా నీలుని మీఁదికి దుమికి, ఉఱుము మెఱుపులతోఁ గూడిన వానకాలపుమబ్బు పర్వతశిఖరముపై వానను గురిపించినట్లు, నీలుని ఱొమ్మున బాణమయమయిన వానను గురిపించెను. అట్లు రక్కసు డంపవానను గురిపింపఁగా నీలుఁ డవయవములందు గాయములు తగిలి, యంగములు నిస్సత్వములుగాఁగా నేమియుఁ జేయఁజాలక యిటటు కదలలేక క్రిందఁబడి మూర్ఛవోయెను. అంత నీలుఁడు కొంత తడవున కొడలు తెలిసి, పెక్కు వృక్షములతోఁ గూడిన పర్వతమును బెళ్లగించికొని పైకెగిరి, కడు తీవ్రమైన వడితోఁ గూడి, యా పర్వత శిఖరము నా మహోదరుని నెత్తినిఁ బడవైచెను. మహోదరుఁ డా నీలునియేటునకుఁ దన గొప్ప యేనుఁగుతోఁ గూడ నేలకుఁ గదిసికొని చక్కఁగా నలిగినవాఁడై ప్రాణములిడిచి, వజ్రాయుధముతోఁ గొట్టఁబడిన పర్వతముకైవడిఁ గ్రిందఁబడెను.

త్రిశిరుఁడును దన పినతండ్రి గూలుటఁ గాంచి, వింటిని గైకొని, యలుకచే నా హనుమంతునిఁ గఱకుటములతోఁ గొట్టెను. అంతట వాయుసూనుఁడు కుపితుఁడై, యొక్క పర్వతశిఖరము నేయఁగా, నా రాక్షసవీరుఁ డా దానిని వాఁడియమ్ములతో భేదించెను. హనుమంతుఁడు తన యేసిన పర్వతశిఖరము వమ్మగుటగాంచి, యయ్యుద్ధమున నా రావణపుత్రునిపై జెట్లవానను గురిపించెను. వేఁడిమిగల త్రిశిరుఁడు తన మీఁదఁ బడుచుండు చెట్లవానను జూచి, యా చెట్లను కఱకుటమ్ములతోఁ బడఁగొట్టి బొబ్బ పెట్టెను. అంత హనుమంతుఁడు పైకెగిరి,

మెకములవొర గజరాజు కుంభస్థలమును గోళ్లతోఁ జీల్చునటు లా త్రిశిర సునిగుఱ్ఱములను గోళ్లతోఁ జించెను. త్రిశిరుఁ డది చూచి యముఁడు కాలపాశమును గైకొన్నచందమున శక్త్యాయుధమును గైకొని, హను మంతునిమీఁదఁ బ్రయోగించెను. హనుమంతుఁడు రాక్షసవీరుఁ డాకా శమునుండి యేసిన కొఱవికట్టెవలెఁ గన్పట్టుచున్న యాశక్తి దనమీఁదఁ బడకమున్నే చేతఁబట్టికొని, పెళపెళ విఱిచి సింహనాదము గావించెను. భయంకరమైన యా శక్తిని హనుమంతుఁడు విఱుచుట గాంచి, వానర లంద ఉప్పొంగి, వార్షికజలధరముమాడ్కి గర్జిల్లిరి. అంత రాక్షసు లలో మేటి యగు త్రిశిరసుఁడు ఖడ్గమునెత్తికొని యా మారుతి వెడఁద ఱొమ్మున నేసెను. మొనకాఁ డగు హనుమంతుఁ డా దెబ్బతిని, దాని కోర్చుకొని త్రిశిరసుని నఱచేతితో ఱొమ్మునఁ బ్రహరించెను. గొప్ప వెలుఁగుగల యా త్రిశిరుఁ డా యఱచేతిపాటుచే నాయుధములను దిగఁ జార్చి, ప్రాణము లెడలి నేలఁగూలెను. పర్వతసమానుఁ డగు నా హను మంతుఁడు త్రిశిరుఁడు క్రిందఁబడుచుండు నవసరమున నతని చేతిఖడ్గమును ద్రుంచి, రాక్షసుల నందఱను వెఱపించుచు గొప్ప బొబ్బవెట్టెను. రాక్షస వీరుఁ డా యార్పు నోర్వజాలక, పై కెగిరి పిడికిటితోఁ గొట్టఁగా, నా పిడికిటిపోటు దగిలి కడు నలిగి, హనుమంతుఁడు రాక్షసశ్రేష్ఠుఁ డగు త్రిశిరునిఁ గిరీటమును బట్టెను. అట్లు పట్టుకొని, తొల్లి వేల్పుటేఁడు త్వష్టపుత్రుఁ డగు విశ్వరూపుని శిరములను దెగ నఱకినచాడ్పున హనుమంతుఁడు సకిరీటము లగు నా త్రిశిరుని శిరములను వాఁడిమిగిలిన కత్తితో ఛేదించెను. మండుచున్న యగ్నిహోత్రుంబోలు కన్నులు గలిగి, పర్వతాకారమువంటి యాకారములుగల యా త్రిశిరుని శిరములు సూర్యపథమునుండి క్రిందికి జాఱిన రిక్కలచాడ్పున వెలుఁగు చుండెను. వేల్పుటేనిమగఁటిమింబోలు మగఁటిమిగల హనుమంతు నిచే వేల్పులగొంగ యగు త్రిశిరుఁడు చంపఁబడుటఁ గాంచి, వానర లందఱు కేక లిడిరి. పుడమి యదరెను. అంత రాక్షసులందఱు మూల మూలకుఁ బరుగెత్తిరి.

త్రిశిరుఁడును మహోదరుఁడును, యొరుల కలవికాని దేవాంతక నరాంతకులును నీల్గినది చూచి, రాక్షసశ్రేష్ఠుఁ డగు మత్తుఁడు (మహా

పార్శ్వుండు మిగులఁ గోపముచెంది, మంటలు గ్రక్కుచున్నదియు, భయంకరమును, నంతయు నినుముతోఁ జేయఁబడినదియు, బంగారు కట్లుగలదియు, రక్తమాంసముల నురుగంటినదియు, తన డాలుచే వెలుఁగునదియు, పగతుర నల్లచే నెఱ్ఱనైనదియు, వెలుఁగుటచే బాగుగఁ బ్రకాశించునది కాంతులు చిమ్ముచున్న మొనగలదియు, యెఱ్ఱని పూవుల దండలతోఁ గైసేయఁబడినదియు నైన ఐరావత మహాపద్మ సార్వభౌమములను వెఱపించిన గొప్పగద నొక్కదానిని గైకొని, ప్రళయకాలయమునికై వడి మండుచు వానరుల నెదిరించెను. ఆ వచ్చు మత్తునిఁ జూచి చేవగల ఋషభుఁ డను వానరుఁ డాతని నెదుర్కొని ముందట నిలిచెను. ఎదుట నిల్చియున్న పర్వతాకారుఁ డయిన యా ఋషభుం గాంచి యలుక పొడమి యాతనిని వజ్రాయుధముఁ బోలు గదతో మహాపార్శ్వుఁడు గొట్టెను. ఆ గదయేటునకు ఋషభుఁడు గడు నొచ్చెను. అతని ఱొమ్ము పగిలి నెక్కువ రక్తమును గార్చెను. తర్వాత నతఁడు పెద్దయుం దడవునకు స్మృతినొంది వడిగాఁ బరుగెత్తి యా బలశాలి యగు మహాపార్శ్వుఁడు చేతఁబట్టిన భయంకరమైన గదను గైకొని, గిరగిర ద్రిప్పి బల్మిగల యా మహాపార్శ్వునిఁ దల పగులనేసెను. మహాపార్శ్వుఁడ ట్లేయఁబడి, యొడలు విఱిగి, పండ్లును గ్రుడ్లును గూల, వజ్రాయుధ నిహతమైన పర్వతముమాడ్కిఁ గ్రిందఁబడెను. గ్రుడ్లు గూలి జీవముఁ బాసి, బలముడిగి యా మహాపార్శ్వుఁడు నేలఁబడఁగా, సముద్రముం బోలు నా రక్కసుల గుంపాయుధములు దిగనాడి, ప్రాణముల నిల్పుకొనఁ గోరి, కట్టదెగిన సముద్రమువలె నంతటఁ బరుగెత్తెను.

71-వ సర్గము

అతికాయయుద్ధము

అట్లు తనసైన్యము కలవరపడి మేన గగుర్పాటు పుట్టునట్లు వగపాలయి యుండుటయు, వేల్పుటేనివంటి మగఁటిమివా రగు తన తోఁబుట్టువులు, యుద్ధమున నెక్కువ పట్టుదల గలవారు, రాక్షసులలో మేటులు నైన తన పినతండ్రులు మహోదర మహాపార్శ్వులు మృతి నొందుటయుఁ గాంచి, బ్రహ్మదేవునివలన వరమువడసినవాఁడును, పర్వత

తుల్యుఁడును, దేవదానవుల క్రొవ్వడఁగించినవాఁడును, ఎక్కువ కాంతి గలవాఁడునునైన యతికాయుఁ డాగ్రహ మొందెను. అంతట నాదేవ విరోధి యగు నతికాయుఁడు వేయి సూర్యులగుమిపగిది వెలుఁగునట్టి యరద మెక్కి వానరుల నెదుర్కొనెను. అ ట్లెదుర్కొని, కిరీటము, అచ్చపుఁ బసిఁడిపోగులుం దాల్చిన యా యతికాయుఁడు తనగొప్ప వింటి నారిని మీటి, తనపేరు వినిపించుచు గొప్ప సింహనాదమును గావించెను. ఆ యతికాయుఁడు తనపేరు వెల్లడిపఱచియు, సింహనాదముగావించియు, నల్లెత్రాటినిమీటియు వానరుల నందఱను గడగడ లాడించెను. ఆ వానరు లా యతికాయుని గొప్పదేహమును గాంచి, కుంభకర్ణుఁడు లేచి వచ్చెనో యని వెఱపుచే నొచ్చి యొండొరులను గట్టికొనిరి. మఱియుఁ ద్రివిక్రమావతారమునందలి విష్ణురూపముఁ బోలు నా యతి కాయునిరూపముఁ గాంచి, వానరవీరు లంద ఱచ్చటచ్చటికిఁ బరు గెత్తిరి. వానరు లా యతికాయుని డాసి, మనమున నేమియుఁ జేయఁ దోఁపనివారై శరణు చొచ్చినవారిం గాపాడునట్టి రాముని శరణు చొచ్చిరి.

తర్వాతఁ గాకుత్థ్సుఁడు పర్వతముఁ బోలిన యాకారము గల వాఁడై, వింటిని జేతఁ బట్టి, రథారూఢుఁడై, ప్రళయ సమయ పర్జన్యము చందమున గర్జిల్లుచు వచ్చుచున్న యా బలాఢ్యుఁ డగు నతికాయుని జూచి, యాశ్చర్య మొంది, వానరులనందఱ నోదార్చి విభీషణునిఁ జూచి, "ఓయి విభీషణా! పచ్చని కన్నులుగలిగి, కొండంతయెత్తు మేనివాఁడై, వింటిని దాల్చి వేయిగుఱ్ఱములు గట్టిన విశాలరథమునఁ గూర్చుండి వచ్చునట్టి యీతఁ డెవ్వఁడు? ఇతఁడు వాఁడిమి గలిగి గఱకులై వెలుఁగు నట్టి శూలములు, ప్రాసములు, తోమరములు ధరించి, ప్రమథగణపరి వేష్టితుఁ డైన యీశ్వరుమాడ్కిఁ దేజరిల్లుచు, కాలునినాలుకలమాడ్కి వెలుఁగు శక్తు లను నాయుధములతోఁ గూడినవాఁడై మెఱుపులతోఁ గూడిన మొయిలుమాడ్కి వెలుఁగుచున్నవాఁడు. పసిఁడిమయములైన వెనుకటి ప్రదేశములు గలిగి యెక్కువెట్టిన యీతనివిండ్లు ఇంద్రధనుస్సు పర్వతమును బ్రకాశింపఁజేయున ట్లాయుత్తమ రథమును బ్రకాశింప

జేయుచున్నవి. ఈ రాక్షసశ్రేష్ఠుఁడు సూర్యునిఁబోలె వెలుఁగునట్టి యరద మెక్కి యుద్ధరంగమును ప్రకాశింపఁజేయుచు, సూర్యరశ్మిఁబోలు రశ్మిగల యమ్ములచేఁ బదిదెసలను వెలిఁగించుచు, ఎక్కెపుఁగొన నున్న రాహువుచే నెంతయు నొప్పుచున్నాఁడు. ఆదిమధ్యాంతములందు వంగి, మేఘగర్జనంబుఁబోలు ధ్వనిగలిగి, పసిఁడిమయ మయిన వీఁపుగలదై చక్కఁగా సింగారింపఁబడినదయి, నూఱుజన్నములవానివింటిం బోలు నతని విల్లు ప్రకాశించుచున్నది. ధ్వజపతాకలతోను అనుకర్షముతోను గూడిన యీ గొప్ప యరదము నలువురు సారథులచేఁ దోలఁబడుచు యుఱుమువంటి ధ్వనితోడఁ గూడి వచ్చుచున్నది. ఈతని యరదమున భయంకరములయిన ముప్పదియెనిమిది యమ్ములపొదులును, భయంకరము లయిన విండ్లును, బంగారంపు వన్నెగల యల్లెత్రాళ్లును బెక్కు లున్నవి. నాలుగు మూరల పొడవుగల పిళ్లు గలిగి పదిచేతుల నిడివిగల రెండు ఖడ్గములు నతని రథమున నిరుప్రక్కలను ప్రకాశింపఁజేయుచు నతని రెండుప్రక్కల నున్నవి. ఈతఁ డెఱ్ఱని కంఠహారమును దాల్చి గొప్పపర్వతముతో సాటియైనవాఁడై మృత్యువుయొక్క మోమువంటి వెడఁదమోముతోఁ గూడి మబ్బులనడుమ నున్న వేఁడివెలుఁగువేల్పుకైవడిఁ ప్రకాశించుచున్నాఁడు. మఱియు నితఁడు బంగారు భుజకీర్తులు గల బాహువులతోఁ గూడి, యున్నతపు టిరుశిఖరములతోఁ గూడిన హిమవత్పర్వతోత్తమముకైవడిఁ ప్రకాశించుచున్నాఁడు. ఈతని మోము సొగసు గన్నులు గలదై, యంటుపోగులతోఁ గూడి, పునర్వసు నక్షత్రము నడుమ నున్న పున్నమచందురుని బింబముకైవడిఁ ప్రకాశించుచున్నది. ఓ నిడుదచేతుల వాఁడా! యీ రాక్షసునిఁ జూచి దిగులుపడి వానరులు నలుదెసలకు భయముచేఁ బరుగెత్తుచున్నారు. ఈ రాక్షసోత్తముఁ డెవ్వఁడో నాకుఁ దెలుపు." మని యడిగెను.

ఎక్కువ ప్రతాపము గల రాజపుత్రుఁడు రాముఁ డిట్లడుగఁగా, మహాతేజుఁ డగు విభీషణుఁ డతనితో ని ట్లనియె: "పదితలలవాఁడును, ఎక్కువ తేజముగలవాఁడును, గుబేరుని తమ్ముఁడును, భీకరములైన పనులొనర్చువాఁడును, యుద్ధములం దెక్కువ పూనికి గలవాఁడు నైన రాక్షసాధిపుఁ డగు రావణుఁ డున్నాఁడుగదా? అతనికి నాత్మసమానుఁ

డగు పుత్రుఁ డొక్కరుఁడు గలఁడు. ఆతఁడు యుద్ధమున సాటిలేని వాఁడు; పెద్దలఁ గొల్చువాఁడు; శాస్త్రములఁ జదివినవాఁడు; విలుకాండ్రందఱిలో మేటి; గుఱ్ఱముమీఁదను, ఏనుఁగుమీఁదను తేరిమీఁదను, నెక్కి యుద్ధముచేయుటయందును, కత్తిసామునను, విలువిద్యయందును, సామాదిచతురుపాయప్రయోగమునందును, నీతియందును, ఆలోచనమునందును సమర్థుఁ డనిపేరు గన్నవాఁడు. ఈతని బాహుబలము నాదరువుచే లంకాపురము నిర్భయమైయున్నది. ఇతఁడు ధాన్యమాలినికిఁ గుమారుఁడు. ఇతని నతికాయుఁ డని యందురు. ఇతఁడు బ్రహ్మనుగూర్చి తపస్సు చేసి యతనిని సంతోషపఱచి, యస్త్రములను బడసినవాఁడు. పలువురు వేల్పుల నోడఁగొట్టినవాఁడు. బ్రహ్మదేవుఁ డితనికి సురాసురులచే వధ్యుఁడు కాకుండుట యను వర మొసఁగెను. ఈకవచమును, సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు నీ రథమును బ్రహ్మదేవుఁ డొసఁగినవియె. ఇతఁడు పలువురు దేవదానవుల నోడించి యక్షులను జంపి రాక్షసులను రక్షించెను. ఈతఁడు మున్నొకపు డింద్రునితోఁ బోరునపుడు బాణములచే నింద్రుని వజ్రాయుధమును గదలనీకుండున ట్లొనరించెను. వరుణుని పాశాయుధము ద్రుంచెను. ఈ యతికాయుం డంతటి బలముగలవాఁడు. రాక్షసులలో గొప్పవాఁడు; దేవదానవుల గర్వం బణఁచినట్టివాఁడు; బుద్ధిమంతుఁడు. కనుక, పురుషోత్తమా! యతఁడు బాణమ్ము లేసి, వానరసైన్యముల రూపుమాపునంతకుమున్నే యీతనియెడఁ బరాక్రమము చూపవలయును." అని విభీషణుఁడు రామునితోఁ జెప్పెను.

అట్లు వారు మాటలాడుకొనునంతలోపల బల్మికాఁ డగు నతికాయుఁడు వానరసైన్యములోపలఁ బ్రవేశించి, ధనుష్టంకారము చేసి పలుమాఱు సింహనాదము గావించెను. భయంకరరూపమువాఁడై, రథమున నున్న రథికోత్తముఁడైన యతికాయుం జూచి, బలశాలు రని ప్రసిద్ధిగన్న వానరు లంద ఱాతని నెదుర్కొనిరి. కుముద ద్వివిద మైంద నీల శరభు లనువారు వృక్షములను బర్వతములను గైకొని యొక్కుమ్మడిగా నెదుర్కొనిరి. బల్మికాఁడును, గొప్పదేహమువాఁడును, అస్త్రవేత్తలలో నుత్తముఁడును, నెక్కువ వెలుఁగు గలవాఁడును నైన యతికాయుఁడు వానరసేనలోపలఁ బ్రవేశించి, వారి చేతులందలి వృక్షపర్వత

ములను పసిఁడిపింజెల బాణములతో ఛేదించుటయే కాక, యా వానరుల నందఱ నెదిరించి యుక్కుతోఁ జేయఁబడిన బాణములతో వారి నందఱినిఁ గొట్టెను. మహాయుద్ధమున వానరు లంద ఱంపవానచే నొచ్చి, యంగములు విఱిఁగినవారలై య య్యతికాయుని మార్కొనఁ జాలరైరి. కావున నా యతికాయుఁ డలిగినవాఁ డయి, ప్రాయంపు దర్పము గల సింహము మెకములగుంపును వెఱపించునట్లు లా వానర సైన్యమును నొంచెను. ఆ రాక్షసవీరుఁడు వానరసైన్యములోపలఁ దనతో యుద్ధము సేయనివానితోఁ బోరు సేయక, ధనుర్బాణములను గైకొని రాముని డగ్గఱించి, "యేను ధనుర్బాణములను గైకొని యిదిగో నిల్చియున్నాను. నే నల్పులతో యుద్ధము చేయను. ఎవ్వఁడు నాతోఁ బోరాడ నుత్సాహము గలవాఁడో, వాఁడు నాతోఁ బోరు సేయ వేగముగ రావచ్చును" అని యనెను.

ఆరాక్షసవీరుని పలుకు లాలకించి, శత్రువులసంహరించువాఁడయిన లక్ష్మణుఁడు కోపము పూని యోర్వలేక పైకి లేచి యట్టహాసము గావించి వింటిని గైకొనెను. అట్లు కైకొని లక్ష్మణుఁ డమ్ములపొదిలుండి బాణ మెత్తి వింట సంధించి, యా యతికాయుని కెదుట నిలిచి, తన గొప్ప వింటినారి నీడ్చెను. అట్లు లక్ష్మణుఁడు వింటి యల్లెత్రాటి నీడ్వఁగా, నాయుగ్రమైన యల్లెత్రాటి మ్రోఁత రక్కసుల నందఱను వెఱపించుచుఁ బుడమిని, పర్వతమును, ఆకాశమును, సముద్రమును, దిక్కులను నించెను. అట్టి లక్ష్మణుని భయంకర ధనుష్టంకారమును విని, యెక్కువ తేజమును బలమును గల రావణుని పుత్రుఁ డతికాయుఁ డాగ్రహము నొంది, తనమీఁదికి రేఁగిన లక్ష్మణుం గాంచి, వాఁడిబాణమును గైకొని లక్ష్మణునితో ని ట్లనియె.

"సౌమిత్రీ! నీవు పసివాఁడవు; పరాక్రమమున నేర్పు చాలనివాఁడవు; కావున నీవు నాతోఁ బోరు సేయఁ జాలవు. మఱలిపొమ్ము. యమునిం బోలు నాతో సమరం బేల సేయఁ గోరెదవు? నేను బ్రయోగించిన యస్త్రముల వేగములను హిమవంత మొండె భూమ్యాకాశము లొండె యెంతమాత్రము సైరింపఁజాలవు. చక్కఁగ నిద్రించుచున్న ప్రళయ

కాలాగ్ని నేల రగుల్పఁ గోరుచున్నావు. వింటిని గ్రిందఁ బెట్టి, మఱలి పొమ్ము. నాజోలికి వచ్చి వృథగాఁ బ్రాణములఁ బోఁగొట్టుకొనకుము. లేక మఱలిపోవఁగోర వేని, చలముపూని, నిలువుము. ప్రాణములను బాసి జమునివీటి కేఁగఁగలవు. ఈశ్వరుని బాణములను బోలినవి, యప రంజిపూఁతలు గలవి, పగతురపొగరు పోకార్చినవి, వాఁడిమి గలవి యైన నా బాణములను జూడుము. కనలిన మృగేంద్రము మదపుటేనుఁగు యొక్క రక్తమును గ్రోలునట్లు లీ నాయాశీవిషతుల్యమైన బాణము నీ నల్లను బీల్చఁగలదు సుమీ." ఇట్లతికాయుఁడు లక్ష్మణుతోఁ బలికి వింట బాణమును సంధించెను.

అధిక బలసౌందర్యములు గలవాఁడయిన రాజపుత్త్రుఁడగు లక్ష్మణుఁడు రోషాహంకారములతోడ నతికాయుఁడు పలికిన పలుకు లాలకించి, గొప్పయర్థముగల మాటలతో నతికాయుని కిట్లనియె: "ఓరీ! నీవు మాటలమాత్రముచే మొనకాఁడవు కానేరవు. జనులు తన్నుఁ దాఁ బొగడికోలువలనఁ బెద్దలు గానేరరు. ఓరి దురాత్మా! నేను ధనుర్బాణము లనుగైకొని నిలఁబడెదను. ఏదీ నీదుబలము చూపుము. నీబలిమిని బనిచేఁ జూపుము కాని పట్టి మాటలచే నక్కఱ లేదు. ఎవఁడు పౌరుషము చూపువాఁడో, ఆతఁడు శూరుఁ డనఁబడును. నీవు సర్వాయుధములతో గూడిన వాఁడవై, ధనుర్బాణములను గైకొని రథముమీఁదఁ గూర్చుండియున్నాఁడవు. నీ మగఁటిమిని శస్త్రములచేఁ గాని యస్త్రము లచేఁగాని చూపుము. నీబలిమి నెఱిఁగిన పిదప గాలి చక్కఁగాఁ బండిన తాటిపండును దొడిమనుండి క్రిందఁ ద్రోయునట్లు వాఁడియమ్ములతో నీ శిరస్సును గ్రిందఁ ద్రోసెదను. ఇదిగో, యిప్పుడ యపరంజి యలంకార ములుగల నా బాణములు నీ మేనిలోపలఁ జొచ్చి, యచ్చటఁ బుట్టినట్టి రక్తమును గ్రోలఁగలవు. "వీఁడు పసివాఁడు నన్నేమి సేయఁగలఁ" డని నన్నవమతింపకుము. నేను పిన్నవైనను, పెద్దవైనను, నీకు సమరమున సంహారము సమకూరకపోదు. తొల్లి త్రివిక్రమావతారమునఁ బిన్నయైన పురుషోత్తముఁడు ముల్లోకములను గొలువ లేదా? ఇవి యెఱిఁగి ప్రవర్తిల్లుము." అని లక్ష్మణుఁ డతికాయునితోఁ జెప్పెను.

లక్ష్మణాతికాయుల యుద్ధము

లక్ష్మణుఁడు సకారణముగాను, వాస్తవార్థము గల్గునట్లుగాను జెప్పిన మాటలు విని, యతికాయుఁ డెక్కువ యాగ్రహము పూని, మేటి యమ్మును గైకొనెను. అప్పుడాయతికాయలక్ష్మణుల యుద్ధము చూడఁగోరి, దేవ దానవ దైత్య మహర్షి విద్యాధర గుహ్యక పిశాచు లచ్చటి కేతెంచిరి. అంత నయ్యతికాయుఁడు విల్లెక్కు వెట్టి బాణము సంధించి, యాకసమును సైత మెగురఁ దన్నువాఁడు వోలె నా బాణమును లక్ష్మణునిపై వేసెను. శత్రుసేనల సంహరించువాఁ డగు లక్ష్మణుఁడు కోఱలందు విషముగల పాముం బోలిన యా కఱకుటమ్ము నర్ధచంద్రబాణముతో నఱికివైచెను. పాము పడగను ద్రుంచినట్టులు లక్ష్మణుండు తన బాణమును ద్రుంచినది కాంచి, యతికాయుండు మఱింత యాగ్రహము పూని, యైదు బాణములను గైకొని, లక్ష్మణునిపైఁ బ్రయోగింపఁగా, భరతానుజుఁ డవి తనమీఁదికి రాకమునుపే, వాఁడి యమ్ములతో వానిని ద్రుంచెను. శత్రుసంహారియు మొనగాఁడు నయిన లక్ష్మణుఁ డంతటితోఁ జాలింపక, తన వెలుఁగుచే ప్రకాశించునది వోలెఁ గానఁబడు వాఁడి యమ్ము నొక్కదానిని గైకొని, యద్దానిని దనవింట జోడించి, వడిగాఁ జెవి సోఁక నీడ్చి, బాణము ప్రయోగించెను. శూరుఁడు లక్ష్మణుఁడు పూర్ణముగా నారినీడ్చి యమ్ము నేయుటచే, వంగిన గణుపులుగల యా బాణ మా యతికాయుని నొసటఁ దగిలి నెత్తురు గారుటచే నా భయంకరరాక్షసుని నొసట గ్రుచ్చుకొన్న రక్తమునఁ దడిపిన యా బాణము పర్వతాగ్రమున గొప్ప సర్పము కైవడిఁ జూపట్టెను. తొల్లి రుద్రునిబాణము దెబ్బ దగులఁగా త్రిపురాసురుని నగరు వెలుపటిద్వార మూఁగులాడినచందమున, లక్ష్మణుని యమ్ముల పాటుచేఁ గాఁడ నొచ్చిన యా యతికాయుఁడును గడగడ లాడెను. మహాబలుఁ డగు నయ్యతికాయుఁ డూఱడిల్లి లక్ష్మణునిఁ జూచి, "లక్ష్మణా! బాగుగా నమ్ము నేసితివి. నేను నీ బాణ ప్రయోగమునకుఁ గడు మెచ్చుకొంటిని" అని చెప్పి, తల వంచి యిరుగేలను జాఁడించి, రథము నడుమఁ గూర్చుండి, రథమును సమరప్రదేశమున నంతటఁ ద్రిప్పెను. అట్లు త్రిప్పి, యొక్కటి మూఁడై దేదు బాణములను గైకొని, వానిని వింట జోడించి యాకర్ణాంత మీడ్చి వడిగా బాణ

నా లక్ష్మణునిమీఁద నేసెను. రాక్షసవీరుని వింటినుండి వెడలి మృత్యువుం బోలి, పసిఁడి పింజలు గల్గి, సూర్యునిమాడ్కిఁ దేజరిల్లునట్టి యా బాణము లాకాశం బెఱియఁగఁ జేయుచు లక్ష్మణునిపైకి రాఁగా, లక్ష్మణుఁడు తత్తరపాటొందక వాఁడిమి గల పెక్కు బాణములతో నా బాణముల నన్నింటిని ద్రుంచివైచెను. యుద్ధసమయమున వేల్పు తేనిగొంగ యయిన రావణుని పుత్రుఁ డగు నతికాయుఁడు తన యమ్ము లెల్ల భగ్నము లగుట చూచి, యలుక పొడమ మఱియొక్క తీక్ష్ణ బాణమును గైకొని, దానిని వింట సంధించి యేయఁగా నయ్యది తన మీఁదికి వచ్చెడి లక్ష్మణుని ఱొమ్మునఁ దాఁకెను. అంత మదపుటేనుఁగు నొడలినుండి మదోదకము గారునట్లు లా లక్ష్మణుని వక్షమునుండి రక్తము గాఱెను. అంత నవ్విభుఁడు తనయొంట నాఁటిన బాణము నూడఁబెఱికి, గాయమువలని నొప్పిఁ దీర్చికొని, తీక్ష్ణబాణము నొక్క దానిం గైకొని దాని నాగ్నేయాస్త్ర మంత్రముతోఁ జేర్పఁగా నమ్మహా వీరుని వింటియందలి బాణము ధగధగ మండుచుండెను. అతికాయుఁడును సూర్యాస్త్ర సంబంధియైన మంత్రముఁ జదివి, దానితోఁ బన్నగంబుం బోలెడి పసిఁడిపింజ గల బాణమును జేర్చెను. యముఁడు కాలదండము నేయునట్లు లక్ష్మణుఁ డాగ్నేయాస్త్రముతో నభిమంత్రించిన యా బాణము నతికాయునిపైఁ బ్రయోగింపఁగా, నతికాయుఁ డది చూచి సూర్యాస్త్రముతో నభిమంత్రితం బైన తన బాణమును లక్ష్మణుపై నేసెను. రెండు బాణములును స్వకాంతిచేఁ గొనలందు మండుచుఁ గనలిన రెండు పాములకైవడి నాకాశమున నొండొంటిఁ దాఁకెను. ఆ రెండు బాణము లట్లొండొంటిని గదిసిపోయి క్రిందఁబడి చల్లారి బూదియై ప్రకాశింపకుండెను. అంతట నతికాయుఁ డలిగి యైషికాస్త్రమును బ్రయోగించెను. మగఁటిమిగల లక్ష్మణుఁడు దాని నైంద్రాస్త్రముతోఁ ద్రుంచెను. అతికాయుఁ డైషికాస్త్రము వ్యర్థమగుటఁ గాంచి, యమ దేవతాకమైన యస్త్రముతో బాణము నభిమంత్రించి లక్ష్మణునిపై నేయఁగా, లక్ష్మణుఁడు వాయవ్యాస్త్రముతో దానిం ద్రుంచి, మేఘము నీటిధారలం గురియునట్లు బాణధారలను వర్షించెను. ఆ బాణము లన్నియు రవలు చెక్కిన యతికాయుని మైమరువునకుఁ దగిలి మొనలు

విఱిగి తటాలున నేలఁ బడినవి. శత్రువీరులఁ దెగటార్చు లక్ష్మణుఁడు తన యమ్ము లట్లు వమ్మగుటఁ గాంచి, వేయి యమ్ముల నొక్కుమ్మడిగాఁ గురిపించెను. లక్ష్మణుఁ డట్లు బాణవర్షము గురిపించినను, అతికాయుఁ డభేద్య కవచుఁ డగుటచే సమరమున నించుకేని నొవ్వఁ డయ్యెను. లక్ష్మణుఁ డెన్ని బాణము లేసియు నాయతికాయుని నొవ్వఁజేయఁజాలఁ డయ్యెను. అప్పుడు వాయుదేవుఁడు లక్ష్మణుని కడ కేతెంచి, "సౌమిత్రీ! ఇతఁడు బ్రహ్మవలన వరముబడసినవాఁడు; యెరులచే భేదింపనలవి కాని కవచము గలవాఁడు. ఇతనిని బ్రహ్మాస్త్రముతోఁ దప్ప వేఱు సాధనముచే వధింప వీలుగాదు. కవచబలములు గల యీతనినిఁ దక్కిన యస్త్రములు వధింపఁ జాలవు" అని చెప్పెను.

అతికాయ వధము

ఇంద్రునిఁ బోలు విక్రమముగల సౌమిత్రి వాయువు పలుకు లాలకించి, యడ్డము లేకుండఁ బోవునట్టి బ్రహ్మాస్త్ర మభిమంత్రించిన బాణమును వింట సంధించెను. ఆ బ్రహ్మాస్త్రముతో వాడి కొనఁగల శ్రేష్ఠబాణమును జేర్చి యభిమంత్రింపఁగా, దిశలును సూర్యచంద్రాదిమహాగ్రహములును వెఱచెను. ఆకాశము వడఁకెను. పుడమి యదరెను, లక్ష్మణుఁడు యమదూతం బోలునట్టి చక్కని మొలకి గల బాణమును బ్రహ్మాస్త్రముతో నభిమంత్రించి, వింట సంధించి, వజ్రాయుధముఁ బోలు నా బాణమును వేల్పుఱేని గొంగ కొడు కగు నతికాయునిమీఁద నేసెను. అట్లు లక్ష్మణప్రేరితమై, యడ్డు లేకుండఁ బాఱుచు, బంగారున రవలుచెక్కిన పలువన్నెల పింజె గలిగి యగ్నివలెఁ దేజరిల్లుచు నా బ్రహ్మాస్త్రాభిమంత్రితంబై వచ్చు నమ్ము నతికాయుఁడు కాంచెను. అట్లు కాంచి, దానిని వడిగా ననేక బాణములతోఁ గొట్టెనుగాని యది గరుత్మంతునివడితో వచ్చి, యా యతికాయుని పార్శ్వభాగమును సమీపించెను. అంత నతికాయుఁడు మనమున దిగులొంది ప్రలయకాలయమునిమాడ్కిఁ దేజరిల్లు నా బాణమును శక్తితోను, కత్తితోను, గదతోను, గొడ్డళ్లతోను, శూలములతోను హుళము లను నాయుధములతోను, బడఁగొట్టఁ జూచెను గాని, యగ్నిహోత్రునిమాడ్కిఁ దేజరిల్లు నయ్యస్త్రాభిమంత్రితమైన

బాణ మా వింత యాకారములు గల యస్త్రముల నన్నింటిని బడఁ ద్రోసి, యా యతికాయుని శిరమును గిరీటముతోడ నఱకెను. అట్లు లక్ష్మణుని బాణముచేఁ ద్రుంపఁబడిన యా యతికాయుని శిరము బొమిడికముతోఁ గూడ, హిమవత్పర్వతశృంగము కైవడి వేగమే క్రిందఁబడెను. సొమ్ము లన్నియుఁ జెదరి పోయి, నేలఁ బడి నీల్గిన యతికాయుం జూచి హతశేషులైన రాక్షసులందఱు దుఃఖమునంది దైన్యముతో, యుద్ధమున నలఁత నొందినవారలై వెఱ్ఱికూఁతలతో బిగ్గరగా నఱచి, తమ నాయకుఁడు కూలఁగా వెఱచినవారలై వెనుకకు మఱలి, లంకవైపుదిరిగి, జయింపఁగల మన్న యాస మానినవారలై, త్వరగా నేఁగి, లక్ష్మణునిచే నతికాయుఁడు మడిసె నని రాక్షసాధిపుఁ డగు రావణుని కెఱింగించిరి. వానరు లనేకు లన్ననో, సంతోష భరితులయి తమ మోము దమ్ములు వికసింపఁ గోరినకోర్కె లొసంగిన యా రాఘవుని భయంకర శత్రువు రూపుమాయుటచే జయశాలి యగు లక్ష్మణుం బూజించిరి.

72-వ సర్గము

రావణుఁడు తనవారి మరణమునకై చింతించుట

మహాతేజస్సు గల లక్ష్మణునిచే నతికాయుఁడు వధింపఁబడె నన్న వార్త విని, రావణుఁ డెక్కువ దిగు లొంది, చేరువ నున్న రక్కసులం జూచి యి ట్లనియె. "ఇతరుల యవమాన మోర్వనివాఁడును, విలుకాఁ డును, అస్త్రవేత్తలలోపల శ్రేష్ఠుఁడునునైన ధూమ్రాక్షుఁడును, అట్లె అకంపన ప్రహస్త కుంభకర్ణులును శూరులు; బలవంతులు; యుద్ధమునం దుత్సాహము గలవారు; శత్రుసేనలను గెల్చినవారు; ఒక్కప్పుడును శత్రువుల కోడనివారు. ఇంతటి వీర్యవంతులును, గొప్పదేహము గల వారును, సకలశస్త్రములఁ బ్రయోగింప నిపుణులును నయ్యు వీర లాచిత్ర చారిత్రుఁ డగు రామునిచే నిహతులైరి. వీరు గాక, మఱియెందఱో బలవంతు లైన రాక్షసులును మడిసిరి. బలపౌరుషములచేఁ బ్రసిద్ధుఁ డైన నా పుత్రుఁ డింద్రజిత్తు బ్రహ్మదేవుని వరప్రసాదలబ్ధము లైన బాణ ములతో నా ప్రసిద్ధు లగు నన్నదమ్ముల రామలక్ష్మణులను బంధించెను. ఆ బంధనమునుండి విడిపించుకొన బలవంతు లగు దేవ దానవ యక్ష

గంధర్వ కిన్నరుల కైనను నలవికాదు. అట్టి బంధమునుండి వారిద్ద అన్నదమ్ములు విడిపించుకొనిరి. అది తమ మహిమలచేతనో, మాయ చేతనో, వంచనచేతనో! మ ఱెవ్విధముననో తెలిసినది కాదు. నా యాజ్ఞ వడసి శూరు లగు నే యే రాక్షసవీరులు యుద్ధమునిమిత్త మేఁగిరో, వార లంద ఱెక్కువ బల్మి కాంక్షగు వానరులచే వధింపఁబడిరి. ఇప్పు డా రామలక్ష్మణులను సుగ్రీవ విభీషణులతోడ సంహరింపఁగలవాఁ డొక్కఁడైనను మనలోపలఁ గాన్పింపఁడు? రామునికి దేహబలము మెండుగా నున్నట్లు చూపట్టు. దాని కీడుగ నస్త్రబలమును గొప్పదిగా నున్నది. కాఁబట్టియే, ఆతనిమీఁదికిఁ బోయిన రాక్షసు లందఱు మడి సిరి. శూరుఁ డైన యా రాఘవుని నాశరహితుఁ డైన నారాయణ మూర్తియే యని యెంచెదను. ఆతని భయముననే కదా లంకాపట్టణపు గవనుల వాఁకిళ్లను మూసియున్నాము. మీరంద ఱేమఱుపాటొందక యీ పురము గావలి గాచవలయును. ఎవ్వఁడైనను సీత యుండునట్టి యశోకవనములోపలికిఁ బోవుటగాని, యచ్చటనుండి వెలుపలికి వచ్చుట గాని నాయానతి లేకుండ జరుగఁ గూడదు. ఎచ్చ టెచ్చట దండు విడిసి యున్నదో, అచ్చటచ్చట మీరు మీసేనలతోఁ గూడి యంతటఁ గావలి యుండుఁడు. నిశాచరులారా! ప్రాతర్మధ్యాహ్న సాయంకాలములం దును, నడికిరేలందును, ఇప్పు డప్పు డన నేల సర్వకాలములందును వాన రుల ప్రయత్నములను గనిపెట్టుచుండవలయును. మీరు వానరుల విష యమున నొక్కప్పుడు నసడ్డ చేయక, "వా రిప్పుడు యుద్ధసన్నాహము చేయుచున్నారా, లేక వచ్చుచున్నారా? లేక విడిసియున్నారా" యని యప్పు డప్పు డెఱుఁగుచుండవలయును." అని లంకాధిపుఁడు సెప్పిన పలుకు లాలించి, బలవంతు లగు రాక్షసు లంద ఱాతని యానతిప్రకార మంతయు నొనరించిరి.

రాక్షసాధిపుఁ డగు రావణుఁడు రాక్షసుల నందఱ నత్తెఱఁగున నానతిచ్చి, వ్యసనరూపమైన శల్యము మనమున నాఁటుకొన దిట వేది నగరులోపలికిఁ బోయెను. అట్లు మహాబలుఁ డగు రాక్షసాధిపుఁడు గృహము సేరి, యొక్కతూరి తన పగతునిమీఁది పగచే నాగ్రహము

నొందుచు నొక్కతడవఁ దన పుత్ర మరణము దలఁచుకొని కుందుచు మాటిమాటికి వేఁడి నిట్టూర్పులు విడుచుచు నుండెను.

73-వ సర్గము

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే రామాదులను మోహింపఁజేయుట

దేవాంతక నరాంతక త్రిశిరోతికాయాదులు పోర నీల్గినతర్వాత హతశేషులైన రాక్షసు లందఱు వడిగా నేఁగి రావణునికి దేవాంతకాది వధవృత్తాంతము నెఱిఁగించిరి. రావణాసురుఁడు రాక్షసులవలన నన్యాయ్యమైన పుత్రభ్రాతృవధము విని కన్నీరు దృష్టిఁ గ్రమ్మ మూర్ఛ చెంది చాలసేపటికి లేచి కూర్చుండి చింతించెను. అట్లు రావణుఁడు దీనుఁడై దుఃఖసాగరమున మునిఁగిన నతనిఁ గాంచి యతని పుత్త్రుఁ డగు నింద్రజిత్తతనితో ని ట్లనియె:

"రక్కసులతేఁడా! నాయనా! యింద్రజిత్తు బ్రదికియుండగా, నీ విత్తెఱంగున విలపించుట తగదు. ఇంద్రజిత్తు బాణములదెబ్బ తిని యొక్కఁడు ప్రాణములతో దప్పించుకొని పోవఁగలుగునా? రాముఁడు లక్ష్మణ సమేతముగా నాబాణములచే నొడలు నిర్భిన్న మయి యాయువు తోఁ బఱఁగి, పుడమిని గూలినట్లును నా వాఁడియమ్ము లాతని యొడలినిండుగ నాటియుండునట్లును నేను దలఁచెదను. రాక్షసేంద్రా! దైవబలపౌరుష బలములు గలవాఁడై నిర్ణయించి యింద్రజిత్తు చేయు నీప్రతిజ్ఞ నాల కింపుము. రాముని లక్ష్మణ సమేతముగా వమ్ములుగాని నా యమ్ములచే నింపెదను. బలి యజ్ఞశాలయందలి వామనమూర్తి యగు వెన్నుని భయం కరబలమును జూచిన చొప్పున, నింద్ర యమ విష్ణు మిత్త్రులును, సాధ్యులు, అశ్వినీదేవతలు, సూర్య చంద్రాగ్నులును నా వింత యైన పరాక్రమమును జూడఁ గలరు" అని చెప్పి శత్రుసంహారి యగు నా యింద్రజిత్తు రావణు వీడ్కొని, ధైర్య స్వభావముగలవాఁడై, వేసడములను బూన్చిన యరద మెక్కి యుద్ధప్రదేశమున కేఁగెను. బల వంతు లగు పెక్కండ్రు రాక్షసులు ప్రాస గదా ఖడ్గ పరశ్వధములతోఁ గూడినవారై, కొంద ఱేనుఁగులమీఁదను కొందఱు మేటివారువముల మీఁదను నెక్కి పురజనులపొగడ్తల కెక్కుచు వెడలిరి. పరిజనులు శంఖములు పూరింప భేరీవాద్యములు మ్రోగింప నింద్రజిత్తు రాక్షసుల

పొగడ్తల కెక్కుచు సమరమునకుఁ దఱలిపోయెను. ఇంద్రజిత్తు భటులతనికి శంఖముమాడ్కియుఁ జంద్రునిమాడ్కియు వెలుఁగు గొడుగు పట్టుటచేఁ బున్నమచంద్రునితోఁగూడిన యాకాశముమాడ్కిఁ బ్రకాశించెను. మఱియుఁ గొందఱు పసిఁడికాడలు గల బంగారమయము లైన దివ్యచామరములతో వీచిరి. సాటిలేని తేజము గల యా యింద్రజిత్తు వచ్చుచుండ నా లంకాపురము వెలుఁగు గల సూర్యునితోఁ గూడిన యంతరిక్షమువోలెఁ దేజరిల్లెను. అట్లు శత్రుసంహారి యగు నింద్రజిత్తు లంకాపురమును బ్రకాశింపఁజేయుచుఁ దేజము మీఱ సమరప్రదేశమునకు వచ్చి దివ్యరథము నొందుటకై హోమము సేయఁ బూని చుట్టును రాక్షసులను గావలిపెట్టెను. అప్పు డగ్నిహోత్రునిమాడ్కిఁ దేజరిల్లునట్టి రాక్షసశ్రేష్ఠుఁ డయిన యింద్రజిత్తు మంత్రపూర్వకముగాను శాస్త్రవిధిఁ దప్పకయు నగ్నిహోత్రునందు గంధము పూవులతోడ సంస్కరింపఁబడిన హవిస్సులతోను బేలాలతోను హోమములు గావించెను. ఇంద్రజిత్తాహోమమునకై బాణమ్ములు దర్భలుగాను, తాండ్రపుల్లలు సమిత్తులుగాను, ఎఱ్ఱని వస్త్రములను, కాఱినుపస్రువములను నమర్చికొని బాణతోమరములతో నగ్నికిఁ బరిస్తరణమును గావించి, బ్రదికియుండు నల్లనిమేఁకను బశువుగాఁ బట్టి హోమము గావించెను. ఇంద్రజిత్తు సమిధలతో హోమము సేయఁగా, నా యగ్నిహోత్రుఁడు జయముఁ దెల్పుగుఱుతులతోఁ గూడి పొగ లేకుండ గొప్పమంటలు గలిగియుండెను. ఆ యగ్నిహోత్రుఁడు ప్రదక్షిణముగాఁ బోవుమంటలు గలిగి, పసిఁడితొడవులను దాల్చి, తానే వచ్చి యా యింద్రజిత్తొసఁగు నాహుతులను గ్రహించెను. అప్పు డా యింద్రజిత్తు బ్రహ్మాస్త్రమును జపించి యమ్మహాస్త్రముచేఁ దనవింటిని, రథమును మఱి యన్నిటి నభిమంత్రించెను. ఆ బ్రహ్మాస్త్రము పిలువఁబడఁగా, నగ్నిహోత్రమునందు హోమములు సలుపఁబడఁగా నాకాశము సూర్యచంద్రనక్షత్రముల తోడఁ గడు వెఱచినదాయెను. అగ్నిహోత్రునిమాడ్కి జ్వలించువాఁడును, ఇంద్రునిఁ బోలు మహిమగలవాఁడును, చింతింపరాని బలిమిగలవాఁడును రూపమునైన యీయింద్రజిత్తు ధనుర్బాణఖడ్గములను బొంది, సారథులచేఁ దోలఁబడు గుఱ్ఱములు పూన్చిన దివ్యరథ మెక్కినవాఁడై

NARLA MEDIA

యాకాశమున కెగిరి యంతర్ధాన మొందెను. అంత రాక్షససైన్యము హయరథముల నెక్కి, టెక్కెములతో శోభిల్లుచు యుద్ధాపేక్షతో వెడలిపోయెను. ఆ రాక్షసులు యుద్ధప్రదేశముఁ జేరి, నానావిధము లైనవి, యెక్కువ వడిగలవి, చక్కఁగా గైసేయఁబడినవి యైన బాణములతోను నీఁటెలతోను వానరులను గొట్టిరి. అట్లు యుద్ధముచేయుచుండు నా రాక్షసుల నింద్రజిత్తు కాంచి, "రాక్షసులారా! వానరుల వధింప వేడ్కతో సమరము సేయుఁడు" అని వారి కానతిచ్చెను. అట్లానతిచ్చిన పదంపడి రాక్షసు లందఱు బొబ్బరింతలు వెట్టుచు జయకాంక్షతో నా భయంకరులైన వానరులపై నంపవానఁ గురిపించిరి. ఆ యింద్రజిత్తట్టి రాక్షససేనాసమేతుఁడై, నాళీక బాణములతోను, గదలతోను, రోఁకళ్లతోను నా వానరులను దునుమాడెను. వానరులట్లు రాక్షసులచే నొంపఁబడుచున్నను, వృక్షములను గైకొని, గుమికూడి యుద్ధవీరుఁ డయిన యింద్రజిత్తుమీఁదికి విజృంభించిరి. తర్వాత మహాతేజుఁ డగు బలవంతుఁ డయిన యింద్రజిత్తొక్కొక్క బాణముతో నైదుగురేసి, యేడుగురేసి, తొమ్మండ్రుగురేసి వానరులను రాక్షససంతోషజనకముగా సంహరించెను. జయింప నలవికాని శూరుఁ డయిన యింద్రజిత్తు సమరమున స్వర్ణాలంకారభూషితము లయి సూర్యునిమాడ్కి వెలుఁగు బాణములతో వానరుల నిత్తెఱఁగున నుగ్గాడెను. యుద్ధమున నా వానరు లింద్రజిత్తేసిన యమ్ములు తగులుటచేఁ గడు నొచ్చినవారై యొడళ్లు బ్రద్దలయి, వేల్పులచే నుగ్గు సేయఁబడిన గొప్ప యసురులమాడ్కి నేలఁబడిరి. అయినను వానరవీరులు సైరింపరాని బాణముల డాలు పర్వుటచేఁ గాయుచుండు సూర్యునిభాతి మలమల మాడ్చుచున్న యా యింద్రజిత్తుం గూర్చి కట్టలుక మీఱ నెదుర్కొనిరి కాని, యింద్రజిత్తేసిన బాణము లొడళ్లయందు గ్రుచ్చికొని, రక్తధారల లొడళ్లు దడుపుచుండ ధైర్యము విడిచి దిగులుచేఁ బరుగెత్త నారంభించిరి. వానరవీరులు రాముని నిమిత్తమై పరాక్రమించి, ప్రాణములమీఁది యాస మానినవారలై శిలావృక్షములను గైకొని ఱొప్పుచు యుద్ధమునకయి మఱలిరి. అట్లు మఱలి యా రావణాత్మజు నింద్రజిత్తును జుట్టుకొని యతనిపై శాలను, మ్రాఁకులను పర్వతశిఖర

ములను వర్షించిరి. అయినను జయశాలి యగు మహాతేజము గల యింద్రజిత్తు స్వప్రాణహారమయిన యాగొప్ప వృక్షపర్వత వర్షమును ద్రోసిపుచ్చి, యగ్నిమాడ్కిఁ దేజరిల్లుచు సర్పములంబోలునట్టి బాణములతో వానరసేనలను జించి చెండాడెను. ఇంద్రజిత్తట్టులు వానరులనందఱను నొప్పించిన తర్వాత నొక్కొక్కరిపైకిఁ గవిసి, వారిని నొంపఁబూనెను.

అట్లు పూని గంధమాదనునిఁ బదునెనిమిది యమ్ములతోఁ గొట్టెను. దవ్వున నున్న నళునిఁ దొమ్మిది శరమ్ములచే నొప్పించెను. ఆయముల నొంచునట్టి యేడుమార్గణములతో మైందుని, నైదు బాణములతో గజుని, పది బాణములతో జాంబవంతుని, ముప్పది నారసములతో నీలుని నొప్పించెను. మఱియు సుగ్రీవ ఋషభాంగద ద్వివిదులపై వరలబ్ధములయిన వాఁడి యమ్ముల నేసి ప్రాణరహితులను జేసెను. అ యింద్రజిత్తు ప్రలయకాలపుఁ జిచ్చుకైవడి వృద్ధినొందిన వాఁడై, యత్యాగ్రహము పూని, సూర్యునిమాడ్కి వెలుఁగుచు వడిగాఁ బోవునట్టి బాణములను గుఱిచూచి ప్రయోగించి, వానర సైన్యమెల్ల నుగ్గుసేసెను. అట్లు తన బాణపుంజములపాటులచే మై మఱచి రక్తమునఁ దోఁగుచున్న వానరసేనం గాంచి, యాతఁ డుప్పొంగెను. ఎక్కువ దేహబలము తేజోబలమును గల్గి తేజస్సుచేఁ దేజరిల్లు రాక్షసేంద్ర తనూభవుఁ డంతటితోఁ జాలింపక యెక్కువవడితో మఱల బాణవర్షమును భయంకరమైన శస్త్రవర్షమును గురిపించి, వానర సైన్యమును నొంచెను. తర్వాత నతఁడు తన సేనను విడిచి, వానర సైన్యములోపలఁ జేరి, యొరులకుఁ గానఁబడక, నల్లని మేఘాలపు మబ్బు వాన గురియునట్లు, పరుల కోర్వరాని యంపవానను గ్రమ్మరించెను. ఆ పర్వతసదృశులయిన వానరు లందఱు దేవేంద్రుని వజ్రాయుధముచే నఱుకఁబడిన పర్వతములకైవడి నా యింద్రజిత్తుయొక్క బాణపాతములచే దేహ మంతయు గాయము లొందినవారై మోసముచే గొట్టఁబడి వికారముగ నఱచుచు రణభూమియందుఁ గూలిరి. వానరులదృష్టుల కా వాఁడికొనలు గల బాణములు గనఁబడినవి కాని మాయచే నంతర్హితుఁడై యదృశ్యుఁ డయి యున్న యా యింద్రజిత్తు గనఁబడలేదు. అట్టి

NARLA P.R.I. Acc. No.

సమయమున మాయాబలము గలవాఁ డగు నింద్రశత్రుసూనుఁడు సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు వాఁడికొనలు గల బాణములచే దిక్కులెల్ల నిండించి, వానరవీరుల కెక్కువ దిగులు పుట్టించెను. మఱియు మండుచున్న యగ్నిం బోలినవి, మిణుఁగురులతోడఁగూడి మండుచున్న యగ్నిజ్వాలల నెడలించునవియు నైన శూలములను, ఖడ్గములను, గొడ్డళ్లను నా వానరవీరసైన్య మధ్యమున నపారముగాఁ గురిపించెను. అంత వానరవీరు లగ్నిజ్వాలలంబోలు నింద్రజి ద్బాణములచేఁ గొట్టఁబడి, చక్కఁగాఁ బూఁచిన మోదుగుఁజెట్లకైవడిఁ దోఁతెంచిరి. వా రట్లు నొచ్చి యొండొరులమీఁదఁ బడుచు వికృతస్వరములతోఁ గూయుచు నేలఁ గూలిరి. ఎదుట నెవ్వరు గనఁబడమిచేఁ బైకిఁ జూచునప్పుడు బాణములు కండ్లలో గ్రుచ్చుకొని, చూపు దెలియక యొండొరులమీఁది కొరఁగుచు నేలపైఁ బడిరి. హనుమ త్సుగ్రీ వాంగద గంధమాదన జాంబవత్సుషేణ వేగదర్శి మైంద ద్వివిద నీల గవాక్ష గజ గోముఖ కేసరి హరిలోమ విద్యుద్దంష్ట్ర సూర్యానన జ్యోతిముఖ దధిముఖ పావకాక్ష నల కుముదులను వానరవీరుల నందఱి నింద్రజిత్తు మంత్రములచే నభిమంత్రించిన బంగరు పింజెగల బాణములతోను శూలఖడ్గములతోను గొట్టెను. ఇంద్రజిత్తు వానరవీరుల నందఱ నివ్విధమున నొంచినపదంపడి సూర్యుని కిరణముల పగిది వెలిఁగెడి బాణముల నా రామలక్ష్మణులపై వర్షించెను.

సర్వాతిశాయిసౌందర్యము గల రాముం డా యింద్రజిత్తు యొక్క బాణవర్షమును నీటిధారలను బోలె నెంచి, వాని నంతగ లక్ష్యపెట్టక యంతటఁ బరికించిచూచి లక్ష్మణుం గాంచి, "లక్ష్మణా! యీ వేల్పు తేనిగొంగ యగు నింద్రజిత్తు బ్రహ్మాస్త్రబలముచే వానరుల నందఱను బడఁద్రోసి, పూనికిగలిగి మనలను బాణములతో నొంచుచున్నాఁడు. ఈ మహాప్రభావుఁ డగు నింద్రజిత్తు బ్రహ్మవలన వరములఁబడసి, యుద్ధమున నెదుటివారికిఁ గనఁబడనివాఁడై, శస్త్రముల నేయుచున్నాఁడు. ఇతని నేవిధమున వధింప వీ లగును? బ్రహ్మదేవుఁడు త్రికాలజ్ఞుఁడు, ఎంచరాని మహిమ గలవాఁడు, ఈయస్త్ర మాయనదియే. ఆయనయే దీనికిఁ గారణభూతుఁడు. కావున నీవు నావెంబడి నుండి కలఁకపాటు నొందక యీతనిబలిమి కోర్చి యుండుము. ఈ రాక్షసవీరుఁ డేసిన

యమ్ములు పుడమిని నన్నిదిక్కులను దట్టముగాఁ గ్రమ్ముటచే నీ వానర సేన శూరు లందఱు మడియుటంజేసి కాంతి దఱిఁగియున్నది. మనము రోషోత్సాహములు మాని, యుద్ధము చాలించి స్మృతిఁదప్పి క్రిందఁ బడితి మేని, యీ యింద్రజిత్తు జయలక్ష్మిం గొన్నవాఁడై, తప్పక లంకా పురిం జొఱఁగలఁడు" అని చెప్పెను.

తర్వాత నట్లే రామలక్ష్మణు లింద్రజిత్తుయొక్క బాణముల తాఁకుళ్లచే మైమఱచి క్రిందఁబడిరి. ఇంద్రజిత్తును నట్టివారిం గాంచి, యుద్ధరంగమున నెక్కువ మక్కువతో సింహనాదము గావించెను. ఇంద్రజిత్తివ్విధమున వానరసేనలను రామలక్ష్మణులను నొంచి, వెంటనే రావణబాహుపాలితమైన లంకాపురిం బ్రవేశించెను.

74-వ సర్గము

రామలక్ష్మణులు వానరులు బ్రహ్మాస్త్రమునుండి విడిపింపఁబడుట

అని మొనయందు రామలక్ష్మణు లప్పుడు బ్రహ్మాస్త్రముచే గాడ నేయఁజడి మైమఱచి క్రింది కొఱఁగఁగా, వానరశ్రేష్ఠుల సైన్యము మూర్ఛ నందెను. సుగ్రీవ నీల జాంబవ దంగదులును మూర్ఛనొంది, యేమియు నెఱుఁగరైరి. అవ్విధమున వానరసేన వెలవెల పాఱుచుండుట గాంచి, బుద్ధిమంతులలోఁ గడు మేటియైన విభీషణుఁడు వానరవీరుల నందఱను సాటిలేని మాటలచే బుజ్జగించుచు "వానరవీరులారా! యార్యపుత్త్రులు రామలక్ష్మణులు సోలి సొక్కి యిడుమలనొంది యున్నారని వగవ వలదు. వారు బ్రహ్మదేవుని వరమును గారవించుటకై యింద్రజిత్తు నస్త్రమునకుఁ గట్టువడియున్న ట్లున్నారేకాని, వారలు వాస్తవముగా మేను మఱచిన వారు గారు. ఇయ్యది వగలకుఁ దరుణము గాదు. కావున మీరు భయంపడవలదు" అని వానరులను వెఱపు మాన్పెను.

తర్వాత బుద్ధిమంతుఁడయిన వాయునందనుఁడగు హనుమంతుఁ డును ముహూర్తకాలము బ్రహ్మాస్త్రపరవశుఁడై యుండి, విభీషణుని పలుకు లాలకించి, యతనినిఁగాంచి, "విభీషణా! యీ వడిగల వానర సైన్య మిట్లు నేలఁగూరియున్నదిగదా. ఈ సైన్యమున నెవ్వఁ డెవ్వఁ డూఁపిరితో నున్నాఁడో, వానిని లేఁపి యూఱడింత" మని చెప్పెను. వెంటనే శూరులగు హనుమద్విభీషణు లిద్దఱు నా నడికిఱేయి కొఱవులఁ

జేతఁబట్టుకొని, యా యుద్ధరంగమంతయు సంచరించిరి. తోఁకలు, చేతులు, కాళ్లు, తొడలు, వ్రేళ్లు, మెడలు తెగి, మూత్రము విడుచుచు, నెత్తురుఁ గార్చుచు నచ్చటచ్చటఁ బడియున్న పర్వతాకారులైన వానరుల కళేబరములతో నిండినదియు, క్రిందఁబడి జ్వలించెడి యాయుధములతో నిండినదియునై యున్న యుద్ధభూమిని గలయఁజూచి, సమరమున మృతప్రాయులయి పడియున్న సుగ్రీవాంగద నీల శరభ గంధమాదన గవాక్ష సుషేణ వేగదర్శి, ఆహుక మైంద ద్వివిద నళ జ్యోతిముఖ పనసులు మున్నగువారిని యితర వానరులనుజూచిరి. ఇంద్రజిత్తొక్క పగటిపూట నైదవభాగం బగు సాయంకాలమున (నాలుగడియలలోపల) నలువది యెడుకోట్ల వానరులను గొట్టెను. బాణముల తాఁకుళ్లచే నొచ్చిపడి యుండు సముద్రపువెల్లువంబోలు నా వానరసైన్యమును జూచి, యా సైన్యమందు జాంబవంతుఁ డెక్కడఁ బడియున్నాఁడో చూతమని వెదకిరి. స్వాభావికమైన ముసలితనముతోఁ గూడినవాఁడును, పెద్దవాఁడును, బాణశతములు నాటినవాఁడును నైనందునఁ జల్లాఱిపోవ నున్నయగ్ని హోత్రనిచందమునఁ గొనయూఁపిరితో నున్న వాఁడునునైన బ్రహ్మపుత్రుఁ డగు జాంబవంతునిఁ జూచి, చేరువకుఁ బోయి, యెట్టకేలకు నోఱుదెఱచి, "యార్యా! వాఁడి యమ్ములపాటులచే నీ ప్రాణముల కేమియు హాని గలుగలేదుగా" యని యడిగెను.

ఋక్షులలో శ్రేష్ఠుఁ డయిన జాంబవంతుఁడు విభీషుని పలుకు లాలకించి, యెట్టకేలకుఁ దెప్పిఱిల్లి యిట్లనెను. "ఓబలవంతుఁడ వగు రాక్షసాధిపా! నీగొంతునుబట్టి నిన్ను గుర్తించుచున్నానేకాని, వాఁడియమ్ముల పోటులకు నొచ్చినవాఁడనై నిన్నుఁ గంటితోఁ జూడఁజాలకున్నాను. విభీషణా! అంజనాదేవి వాయువులకు నందనుఁడును, వానరపుంగవుఁడు నైన హనుమంతుఁడు ప్రాణములతో నున్నాఁడుగా" అని యడుగఁగా, విభీషణుఁడు జాంబవంతునిమాట విని, "ఓ ఋక్షపుంగవా! రాజపుత్రులగు రామలక్ష్మణులంగూర్చి యేమియు నడుగక యేల మారుతినింగూర్చి యడుగుచున్నావు? నీకు వాయునందనునియెడ నుండునట్టి ప్రేమ వానరాధిపుఁ డగు సుగ్రీవునియెడఁ గాని, యంగదునందుఁగాని, రాముని యందుఁగాని లేనట్లు తోఁచెడి. దీనికిఁ గారణం బేమి?" యని యడిగెను.

"రాక్షసశ్రేష్ఠా! నేను హనుమంతునిఁగూర్చి విచారించినందులకుఁ గారణ మెఱిఁగించెద నాలకింపుము. శూరుఁ డగు మారుతి బ్రతికియుండు నేని, తక్కిన వానరసేన లెల్లఁ జచ్చినను జావనిదియె. హనుమంతుఁడు ప్రాణములఁ దొఱంగెనేని, మన మెల్లరు బ్రతికియున్నను మృతులమే. వీర్యమున వైశ్వానరుని, వడియందు వాయువుం బోలిన హనుమానుఁడు జీవితముతో నుండునేని, యప్పుడు బ్రాణములపై నాశయుండఁగలదు." అని జాంబవంతుఁడు విభీషణునకుఁ బ్రత్యుత్తర మిచ్చెను. అంతట మరు న్నందనుఁడు వృద్ధజాంబవంతుని కడకేతెంచి, చేతులుమార్చి చెవులు పట్టు కొని తన నామోచ్చారణముచేయుచు నాతని పాదములఁ బట్టుకొనెను.

మహాతేజుఁ డగు జాంబవంతుఁడు హనుమంతుఁడు తన పేరు సెప్పి నమస్కరించినప్పటిమాటను విని, యింద్రియపటుత్వము దప్పియున్నను, దన ప్రాణములు మఱలవచ్చినట్లు తలఁచినవాఁడై "వానరశ్రేష్ఠుఁడా! చేరు వకు రమ్ము. నీ వీ నొచ్చిన వానరుల నందఱను గాపాడుము. వీరిని గాపాడఁజాలిన మొనగాఁడును, వీరి కనుఁగుఁజెలికాఁడును నైనవాఁడవు నీవే. నేఁ జెప్పఁబోవు పనిచేయఁగల మొనగాఁడు మఱొక్కఁడు గాన రాఁడు. వానరశ్రేష్ఠా! వానరవీరుల సేనలను సంతోషపఱచి, నొచ్చిపడి యున్న రామలక్ష్మణులను స్వస్థులను గావింపుము. హనుమంతుఁడా! సముద్రమునకుఁ జేరువగాఁ బైననే కడుదూరముపోయి, పర్వతరాజ మగు హిమవత్పర్వతమునకుఁ జేరవలసినది. ఆ పర్వతమునఁ బసిఁడిమయ మయి మిక్కిలి యెత్తయిన ఋషభకైలాసపర్వతము లనెడి శిఖరములు గనఁబడును. ఆ రెండు శిఖరముల నడుమ నెక్కువకాంతితో ధగధగ మెఱయునట్టిదై వివిధౌషధులతోఁ గూడిన యోషధిపర్వతమును జూతువు. వానరశ్రేష్ఠా! ఆ యోషధిపర్వత శిఖరమున నాలుగు మూలిక లున్నవి. అయ్యవి నాలుగును పది దెసలను వెలుగఁజేయుచున్నవి. అయ్యవి యేవి యనిన, మృతసంజీవిని చచ్చినవారిని బ్రతికించునది. విశల్యకరణి బ్రతికిన తర్వాత సంచారయోగ్యతకై గ్రుచ్చుకొన్న బాణములను దొలఁగించునది. సంధానకరణి బాణములు దీసిన పిదపఁ జర్మమును జేర్చునది. సావర్ణ్యకరణి వ్రణములవలని నలుపును బోకార్చి యెప్పటియట్టి రంగు నొసఁగునది. ఓ గంధవహానందనా! నీవు వేగిర

ముగా నయ్యోషధులం దెచ్చి, వానరులఁ బ్రాణంబుతోఁ జేర్చి యూఱ డింపుము" అని జాంబవంతుఁడు హనుమంతునితోఁ జెప్పెను.

వానరశ్రేష్ఠుఁ డగు హనుమంతుఁడు జాంబవంతుని పలుకులు విని, నీటి పొంగులచేఁ గడలి నిండినట్లు లెక్కపబలముతో నిండినవాఁడై, త్రికూటపర్వతశిఖరమున నిలఁబడి, యా పర్వతోత్తమ మగు త్రికూట పర్వతము నదుముచు, రెండవ పర్వతముకైవడిఁ గన్పట్టెను. ఆత్రికూట పర్వత మా హనుమంతుని పాదములచే నదుమఁబడి కడుఁ గదలింపఁబడి నదై, యథాస్థానమునఁ దన్నుఁ దా నిల్పుకొనఁ జాలఁదయ్యెను. హను మంతుఁడు హిమవంతము నుత్తరప్రదేశమందలి యోషధిపర్వతము వఱకుఁ బోవఁదగిన శక్తి పూనుటంజేసి, యా పర్వతమందలి వృక్షములు నేలఁ బడినవి. వడివలని యొఱపున జనించిన నిప్పుచే నా వృక్షము లెల్ల మండిపోయెను. ఆతని పాదముల యదుముటనకు నా పర్వతశిఖరములు పిండియై పోయెను. అట్లా పర్వతమందలి చెట్లుకూలి, ఱాలు తుత్తు నియ లయి యా పర్వత మతలకుతలముగాఁగా నా త్రికూటశిఖరమే యుద్ధప్రదేశ మగుటచేఁ గదలుచుండెడి యా పర్వతమున వానరులు నిలువఁజాలరైరి. లంకాపురియుఁ త్రికూటపర్వతశిఖరమున నుండుటంజేసి, త్రికూటపర్వతము గదలఁగా, లంకాపురి యందలి గొప్ప ద్వారములు గదలెను. ఇండ్లు వాఁకి ల్లిడిసి క్రిందఁబడెను. ఆ లంకాపురి యట్లు భయాకులమై కదలుటఁజేసి, రాత్రియందు నాట్యములుసల్పు చేడియ కైవడిఁ బ్రకాశించెను. కొండను బోలు నాహనుమంతుఁ డా పర్వతము నదుమఁద్రొక్కి, భూమ్యర్ణవములను కలగుండువడఁజేసెను. అట్లొనరిం చుచు మరున్నందనుఁ డా పర్వతము విడిచి పైకెగిరి, పెక్కు సెల యేళ్లతో నిండి, మేరుమందరములను బోలినదియు, చెట్లుచేమలతోఁ గూడినదియు, పూఁచిన తమ్మి కలువ పూవులతో వెలయునదియు, దేవ గంధర్వ విద్యాధరాప్సరసలకు మనికిపట్టును, పెక్కు మృగముల మూఁక లతో నిండినదియు, పెక్కు గుహలచే వెలయునదియునై యఱువది యోజనములయెత్తు గలదైన మలయపర్వత మెక్కి, యచ్చట యక్ష గంధర్వ కిన్నరులు గలవరపడునట్లు తన దేహమును బెంచి, పదములతోఁ బర్వతము నదిమిత్రొక్కి, బడబాముఖమును బోలు తన నోటిని దెఱచి,

రాక్షసు లందఱు వెఱచునట్లు బిగ్గఱగాఁ గూఁతవెట్టెను. విశేషముగా ధ్వనించుచున్న యా వానరవీరుని యాశ్చర్యకరమైన నినాదమును విని, లంకాపురమునందలి రాక్షసు లందఱు భయముచే నిటునటు కదల మెదలఁ జాలరైరి. భయంకర పరాక్రమము గలవాఁ డగుటచే శత్రువుల దహించువాఁ డయిన మారుతి రాముని మనమున ధ్యానించి, యా రాముని నిమిత్తమై యపారమైన కార్యము చేయఁ దొడఁగెను. అట్లు తొడంగి, సర్పమును బోలు తోఁకఁ బైకెత్తి నడుము ముందుకు వంచి, చెవులు నిక్కించి, బడబాముఖముఁ బోలు తన వదనమును దెఱచి, కడు వడితో నాకసమున కెగిరెను. ఆ హనుమంతుని తొడలవడి కాతని వెం బడిఁ జెట్లగుంపులును, పర్వతములును, శిలలును ఆ త్రికూటపర్వతము ననే యెల్లప్పు డుండునట్టి సామాన్య వానరములును మీఁదికెగిరి కొంత దూరము కొట్టుకొనిపోయి వెంటనె వడి తగ్గుటచే సముద్రమునఁ బడినవి.

గరుఁడుని పరాక్రమముఁ బోలు పరాక్రమము గల యా హను మంతుఁ డాదిశేషుని శరీరమువలె దీర్ఘము లైన తన బాహువులను జాఁచి, దిశల నీడ్చికొని పోవువానిచందమునఁ గడువడితో మేరుతుల్య మగు హిమవత్పర్వతము వైపునకు నుత్తరపుదిక్కు నుద్దేశించి పోయెను. అల్ల లాడు నలలతోఁ గూడి, మిక్కిలి యదరు జంతువులతో సమన్విత మయి యున్న సముద్రమును జూచుచు, విష్ణుహస్తముచేఁ బ్రయుక్తమయిన సుదర్శనచక్రముమాడ్కి వడితో నా సముద్రమును దాఁటి, పర్వతము లను, ధనధాన్య సమృద్ధములైన దేశములను తోఁపులను సరోనదీతటాక ములను, బట్టణశ్రేష్ఠములను బరికించి చూచుచు వడిగాఁ బోయి, సూర్య మండలపుదారిఁ బట్టి, యలసట మాని, యెక్కువవడితోఁ గూడి, వాయువు చందమునఁ బాఱుచుఁ దన కిలకిలరవముచే దిశలు పిక్కటిల్లఁ జేయుచుఁ గడు వేగముతోఁ గూడినవాఁడై జాంబవంతుని మాటఁ దలఁచుచు, వాయువేగముతోఁ జని, తత్క్షణమే హిమవంతునిఁ జూచినవాఁ డయ్యె. ఆ హిమవంతము పలు సెలయేళ్లతోను, పెక్కు గుహలతోను నిండియుం డెను. మఱియు నప్పర్వతరాజము తెల్లని మొయిళులమొత్తముం బోలిన రమణీయము లగు శిఖరములు గలిగి, నానావిధవృక్షషండమండితమై కనఁబడెను. హనుమంతుఁడు మిక్కిలి యెత్తయి భయంకరములైన శిఖర

ములు గలిగిన యమ్మహాపర్వతమునొంది, యచ్చట దేవర్షి సమూహములు వసించునట్టి పుణ్యప్రదములగు గొప్ప యాశ్రమములను, బ్రహ్మకోశాశ్రమమును, కైలాసమును, ఇంద్రాశ్రమమును, రుద్రుఁడు బాణములు విడిచిన యాశ్రమమును, హయగ్రీవారాధనాశ్రమమును, రుద్రచ్ఛిన్నమై తేజరిల్లునట్టి బ్రహ్మశిరస్సును స్థాపించిన యాశ్రమమును, యమకింకరులను, వజ్రాలయమును, కుబేరాలయమును, సూర్యప్రభ సూర్యనిబంధ నాశ్రమములను, బ్రహ్మాసనమును, శివుని వింటిని, పుడమియొక్క నాభిప్రదేశమైనపాతాళప్రవేశ రంధ్రమును జూచెను. మఱియు నా హనుమంతుఁడు శ్రేష్ఠమైన కైలాసమును, హిమవచ్ఛిలను, ఋషభపర్వతమును, శ్రేష్ఠ మగు కాంచనశైలమును బాగుగానుండు సకలౌషధులచే విరాజిల్లు నోషధిపర్వతేంద్రమును గాంచెను. వాయుసూనుఁ డగ్నిజ్వాలలచేఁ దేజరిల్లు నా యోషధి పర్వతేంద్రమును గాంచి, యాశ్చర్యపడినవాఁడై యా యోషధిపర్వతముచుట్టు దివ్యౌషధులను వెదకి, యచ్చటవానిం గానక, యచ్చటినుండి వేయియోజనములుదాఁటిపోయి దివ్యౌషధులను దాల్చిన పర్వతమునందు నోషధులకొఱకు వెదకెను. ఆ యోషధిపర్వతమందలి దివ్యౌషధు లన్నియు నా హనుమంతుఁడు తమ్ముఁ గోరివచ్చియున్నాఁడని యెఱిఁగినవై యాతని కంటికిఁ గానఁబడని వయ్యెను. మహాధీరుఁ డగు హనుమంతుఁ డా దివ్యౌషధులను గాననివాఁడై యెక్కువ యాగ్రహము దోఁప నిప్పుకలవలెఁ దన కన్నులఁ దేజరిల్లఁ జేయుచు నొడలు మఱచి యా మహీధరము నుద్దేశించి, "ఓరీ పర్వతశ్రేష్ఠుఁడా! యేమి యిది! నీ విట్టులే రామునియందు దయఁ జూపఁ దలంపవేని, నిన్ను నాబాహుబలముచేఁ దుత్తునియలు చేసెదను జూడుము" అని యా పర్వతమును బెదరించెను. నగనాగకాంచనధాతు సహస్ర సమేత మయి, కొనలు విఱిసి, చఱులకొనలందు మంటలచే నెగయుచున్నట్టి యోషధిపర్వతశిఖరము నొక్కటిఁ బెళ్లగించి యెత్తికొని యా వీరుఁడు పైకెగిరెను. ఆ మారుతి యా యోషధిపర్వత శిఖరము నూడఁబెఱికికొని యింద్రాదిదేవాసురులను వెఱపించుచు నాకాశచారులగు సిద్ధాదు లయిన పెక్కండ్రచేఁ జక్కఁగాఁ గొనియాడఁబడుచు గరుడునంత బలాతిశయము గలిగి పడితోఁ దఱలెను. భాస్కరునిమాడ్కిఁ దేజరిల్లు నోషధిశిఖరము

గైకొని, సూర్యునిమార్గము నొందినవాఁడై సూర్యునిమాడ్కి వెలుఁగు నా హనుమంతుఁడు సూర్యునియెదుట నిలఁబడిన ప్రతిసూర్యుఁడో యనఁ బరఁగి వెలుఁగుచుండెను. పర్వతసమాన దేహుఁ డయిన హనుమంతుఁడు శ్రేష్ఠమైన యోషధిపర్వతశిఖరము గైకొని యాకాశమునఁ బోవుచు నూఱంచులుగలిగి మంటలతోఁగూడిన సుదర్శనాయుధమును జేతఁ బట్టిన విష్ణువుమాడ్కిఁ గడునొప్పి యుండెను. అట్లు వడితో వడ్చెడి యా వానరేంద్రునిఁ గాంచి, వానరు లందఱు బిగ్గఱగాఁ గిలకిలరవము గావించిరి. ఆ హనుమంతుఁడును వానరులం జూచి, వేడ్కతోఁ గిలకిల నాదము చేసెను. వారి గొప్ప బొబ్బరింత నాలించి లంకానివాసు లందఱు కడు భయంకరముగా నఱచిరి.

అంత నా మహాధీరుఁ డగు మారుతాత్మజుఁ డప్పర్వతశిఖరముతో నా పర్వతశిఖరమున వాలి వానరసేనా మధ్యమున వానరోత్తముల కెల్ల మ్రొక్కి విభీషణునిఁ గౌఁగిలించికొనెను. ఆ నరవరాత్మజు లిద్దఱును తక్కుంగల వానరవీరులును దివ్యౌషధులవాసన వచ్చినవెంటనే లేచి కూర్చుండి నిర్వ్రణులై స్వస్థదేహులైరి. రాక్షసులచేఁ జంపఁబడిన వానరవీరు లందఱు నా యోషధుల గంధ మాఘ్రాణించుటచే గాయములు మాని, నొప్పి దఱిగి, రాత్రి నిద్రించినవారు వేఁకువ లేచు చందమున లేచి నిలిచిరి. రాక్షసు లేల వానరులమాడ్కి మేలుకాంచరైరనఁగా, లంకాపురమున వానర రాక్షసులకు యుద్ధము ప్రారంభమైనది మొదలు రాక్షసు లిందఱు నిహతులై రని తెలియకుండుటకై రావణుని యాజ్ఞనుబట్టి వానరులచే దన్నఁబడి మృతులైనవారును, మరణావస్థ నున్నవారును నప్పటికప్పుడే సముద్రమునఁ బడ వేయఁ బడుచుండిరి. కనుక వానరులమాడ్కి రాక్షసులు లేవరైరి. ఎక్కువ వీర్యము గలవాఁడైన వాయునందనుఁడు మఱల నా యోషధిపర్వతమును హిమవంతమునకు మోసికొనిపోయి యచ్చటఁ బడవైచివచ్చి మఱల రామునితోడఁ జేరినవాఁ డయ్యెను.

75-వ సర్గము

వానరులు లంకను గాల్చుట

తర్వాత నెక్కువతేజము గల వానరాధిపుఁ డగు సుగ్రీవుఁడు కర్తవ్యము నెఱింగించుచు హనుమదాదులఁ జూచి, "కుంభకర్ణుఁడును

పుత్త్రులును మృతు లగుటంజేసి, రావణుఁ డిప్పుడు సేనలతోడఁ బురము వెడలివచ్చి యుద్ధము సేయనేఱఁడు. కావున సింహమునుబోలు పరాక్రమమును నెక్కువ బలిమియుఁ గల్గిన నేర్పరు లయిన వానరు లిప్పుడు కొఱవులను గైకొని లంకాపురమును దగులఁ బెట్టుదురు గాక" యని వానరుల కందఱికి నానతిచ్చెను. వెంటనే యతి భయంకరమైన యా నాఁటిరేయి వానరశ్రేష్ఠు లందఱు కొఱవులను బట్టికొని లంకాపురము మీఁదికిఁ దఱలిపోయిరి. వానరవీరు లిట్లు కొఱవులను గైకొని నలువైపులఁ జుట్టుకొని తఱుమఁగా, నగర రక్షకులైన భయంకరాక్షు లగు రాక్షసు లందఱు దిగులుపడి వేగమే పరుగెత్తిరి. వానరులు పురద్వారము లందును, ప్రాకారాగ్రస్థితగృహములందును, వీథులందును, పెక్కుసందు గొందులందును, మేడలందును నుత్సాహముతో నగ్గి వెట్టిరి. అప్పుడే హుతభుజుండు రాక్షసుల వేలకొలఁది గృహములను దహింపఁ బూనెను. పర్వతములమాడ్కి నెత్తయిన మేడలు గాలి నేలఁ గూలినవి. ఆ మేడలందలి యగురుచెక్కలును, మేటి గందపుఁజెక్కలును గాలినవి. మఱియు నున్నని ముత్తెములు, వజ్రములు, పవడములు, మెఱయునట్టి నారబట్టలు, పట్టుబట్టలు, పలుతెఱఁగు లైన గొఱ్ఱెలయు మేకలయు రోమములతో నేసిన కంబళ్లు నానావిధ చిత్ర ప్రతిమలు చెక్కిన పసిఁడి తొడవులు, ఆయుధములు, అశ్వభూషణములు, కళ్లెములు మొదలగునవియు, ఏనుఁగుల కంఠభూషణములు కట్టుగొలుసులు, చక్కఁగా మెఱుఁగువెట్టఁబడిన రథభూషణములు, యుద్ధవీరుల కవచములు, గజాశ్వకవచములు, ఖడ్గములు, విండ్లు, అల్లెత్రాళ్లు, బాణములు, తోమరములు, అంకుశములు, శక్తులు, సాధారణములైన కంబళ్లు, చామరములు, వ్యాఘ్రచర్మములు, గోళ్లు తోఁకలు మున్నగునవి, కస్తూరి మొదలగు సుగంధద్రవ్యములు ముత్తెములతో విరాజిల్లు నున్నని మేడలు, నానావిధాస్త్రసమూహములు, నానావిధగృహసన్నివేశములు, గృహస్థు లగు రాక్షసు లందఱి భవనములును గాలెను. బంగారుమయంపుఁ జిత్రకవచములఁ దాల్చినవారు, నానావిధ పుష్పమాలా ముక్తాహార వస్త్రాదులను దాల్చినవారు, మద్యపానముచేఁ గన్నులు ద్రిప్పువారు, మద్యపానమువలని మత్తుచే నొయ్యారముతోఁ బోవువారు, రతిక్రీడాపరులును, శత్రువులపై రోషంబు పూను,

వారు, గదా శూల ఖడ్గములను దాల్చినవారు, నంజుళ్లఁ దినువారు, నల్లఁ బీల్చువారు మేటిపాన్పులపైఁ బ్రియలతోడ నిద్రించువారు, బిడ్డల నెత్తికొని వెఱపుచే వడిగా నలుదెసలకుఁ బరుగెత్తువారునునైన రాక్షసుల ననేకులను దహించుచు నగ్నిహోత్రుఁడు మీఁదు మిక్కిలి వృద్ధి చెంది, హేమమయపూర్ణచంద్రార్ధచంద్రాకార చిత్రములు గలవి, యున్నతంపు పై మేడలతోఁ గూడినవి, రత్నాలు చెక్కిన పలువన్నెల గవాక్షములు గలవి, అంతట నధిష్ఠానములతోఁ గూడినవి, రత్నములు పవడములచే నలంకరింపఁబడినవి, సూర్యమండలముఁ దాఁకునవో యనఁబరఁగినవి, క్రౌంచపక్షులయు, నెమళ్లయు, వీణలయు, సకలభూషణములయు నాదములచే మ్రోఁగునవి, పర్వతతుల్యములు నైన గృహములను హుతాశుఁడు దహించెను. మంటలచేఁ జుట్టుకొనఁబడిన యా పుర ద్వారములు వేసఁగియందు మెఱపులచేఁ గ్రుమ్మఁబడిన మేఘబృందము కైవడిఁ దోఁతెంచుచు, వజ్రి వజ్రాయుధముచే నఱుకఁబడిన మహాపర్వత శిఖరములమాడ్కిఁ బుడమిం బడెను. మేడలపై నిద్రించుచున్న యతివలు నిప్పు సోఁకినతోడనే లేచి సర్వాభరణములను బరిత్యజించి, కుయ్యో మొఱ్ఱో యని మొఱ లిడఁ జొచ్చిరి. ఆ లంకాపురములోని బవంతులు బగబగమండుకొని, మండుచున్న జ్యోతిర్లతావనములతోఁ గూడిన హిమాలయ శిఖరములకైవడిఁ బ్రకాశించినవి. అట్టి యగ్నిజ్వాలా పరివేష్టితములై యెఱియుచున్న సౌధముల పైభాగములతోఁ గూడిన యా లంకాపురము రాత్రికాలమందుఁ బూఁచిన మోదుగుచెట్టులతోఁ గూడినదో యన్నట్లు ప్రకాశించెను. మావటీండ్రు విడిచిన యేనుఁగు లును, రౌతులు విడిచిన గుఱ్ఱములును విచ్చలవిడిగాఁ దిరుగుచుండుటఁ జేసి, యా లంకాపురము ప్రలయకాలమున బెదరిన మొసళ్లతో నిండిన సముద్రముమాడ్కి నల్లకల్లోలమై యుండెను. తప్పించుకొని తిరుగు చున్న యేనుఁగుం జూచి యశ్వము భయపడి యొకవైపునకుఁ బోయెను. అట్లు తిరిగెడి యశ్వముం జూచి యేనుఁగు భయపడి మఱలిపోయెను. లంకాపట్టణ మెల్ల మండుచుండఁగా, సముద్రమున దాని నీడ ప్రతి ఫలించుటంజేసి యా సముద్రము రక్తోదకముతోఁగూడిన కడలియట్లు వెలిఁగెను. హరివీరులచే దహింపఁజేయఁబడిన యా లంకాపురము

ప్రలయకాలజాజ్వల్యమాన మయిన వసుంధరమాడ్కిఁ దోఁతెంచెను. సెగ దగిలి పొగ గ్రమ్ముటచే దిక్కు దోఁచక బిగ్గఱగాఁ గూయునట్టి యా లంకాపురంపు టతివ లార్చెడి యఱపులు పదియోజనములదవ్వు వినవచ్చెను. పురమున సెగ గ్రమ్మ నోర్వఁజాలక వెలికి వచ్చిన రాక్షసులను వానరులు యుద్ధాభిలాషతో నెదుర్కొనిరి. అప్పుడు వానర రాక్షసుల కంఠనాదములు పదిదెసలను, సముద్రమును, భూమిని మాఱు మ్రోగున ట్లొనరించెను, వ్రణ రహితులైన యా రామలక్ష్మణు లిద్దఱు తత్తరపాటొందక యప్పుడు మేటి రెండు విండ్లను గైకొని రాక్షసుల కందఱికి భయమొదవునట్లుగా నల్లెత్రాళ్లను మీటిరి. అప్పుడు రాముఁడు తనగొప్ప వింటినారిని మీటుచు వేదమయ మయిన వింటి నారిని మీటునట్టి యత్యాగ్రహగ్రస్తుఁ డయిన శివునిఁబోలెఁ బ్రకాశించెను. వానరవీరుల కూఁతలను, రాక్షసుల యార్పులను, శబ్దములమించి రాముని యల్లెత్రాటి చప్పుడును వినవచ్చుచుండెను. ఆమూఁడు శబ్దములును గలిసి యేకమై పది దెసలును నిండిన దయ్యెను. అంత రాముఁ డేసిన బాణములచే కైలాసశిఖరతుల్య మైన రావణుని పురద్వారము విరిసి నేలఁ గూలెను. అంత రాముని బాణములు గృహములందును, సౌధములందును నిండుట గాంచి రాక్షసు లందఱు భయంకరముగా యుద్ధసన్నాహము చేయఁ దొడఁగిరి. వా రట్లు యుద్ధసన్నద్ధులై, పెద్ద బొబ్బరింతలు వెట్టుచుండఁగా నారేయి భీకరమై యుండెను. అప్పుడు వానరరాజగు సుగ్రీవుఁడు వానరులఁ గాంచి, "వానరశ్రేష్ఠులారా! మీరు రావణుని యంతిపురంపు దాపుద్వారముఁ జేరి యుద్ధముసేయుఁడు. మీలో నెవ్వఁ డచ్చట నిలువక నా యానతిని మీఱుచున్నాఁడో, యట్టి రాజాజ్ఞోల్లంఘి యైన వాని నెగిరి పైఁబడి వధింపుఁడు" అని యానతిచ్చెను.

ఆ వానరులు తమతేని యానతిచొప్పున మండెడు కొఱవులను జేతులఁ బట్టినవారై యా రావణుని యంతిపురంపునగరువాఁకిట నిలువఁగా, రావణుని కత్యాగ్రహము గలిగెను. అంత రావణుఁ డొడలు విఱచుకొని యార్పు విడువఁగాఁ బదిదెసలును గలఁత నొందినవి. అప్పుడు రావణుఁడు ప్రలయకాలరుద్రుని యంగములందలి

రూపవంత మైన కోపమో యన్నట్లు కానిపించెను. అంత రావణుఁడు కుంభకర్ణుని పుత్రులగు కుంభనికుంభు లనువారి నిద్దఱిని బెక్కండ్రు రాక్షసులను దోడిచ్చి యా వానరులమీఁదికి బంపెను. ఆ కుంభ నికుంభులతోడ యూపాక్ష శోణితాక్ష ప్రజంఘ కంపను లనువారును బయనమైరి. రావణుఁడు కడు బలవంతు లగు వారి నందఱిని "ఇచ్చట నే జయింపుఁడు. తఱలి పొం" డని యానతిచ్చి పంపెను.

తర్వాత రావణప్రేరితులైన శూరులగు రాక్షసు లందఱు దేదీప్య మానము లగు నాయుధములను గైకొన్నవారై మాటిమాటికి సింహ నాదములు గావించుచు లంకాపురములోపలినుండి తఱలిరి. రాక్షసులు తాము దాల్చిన తొడవులమెఱుఁగులచేతను, వానరులు కొఱవులమంటల చేతను నాకసమును వెలుతురు గలదానిఁగాఁ జేసిరి. ఆ యుద్ధరంగమునఁ జంద్రనక్షత్రముల డాలును, ఆ యుభయసేనల తొడవులసొరుసు నాకా శమును వెలిఁగించెను. మఱియు వెన్నెలయు, భూషణముల కాంతియు, మండుచుండు గృహముల కాంతియు నా హరిరాక్షస సైన్యములను ప్రకాశింపఁజేసెను. ఆలంకాపురమునందలి యిండ్లు పైకి మండుచుండఁగా, వాని కాంతి సముద్రపునీటఁ బ్రతిఫలించి, పాతాళం బంటి, యలలు కదలుటచే మఱింత తళతళ మెఱసెను. పతాకాధ్వజములతోఁ గూడినది, మేటిగదలు, గొడ్డండ్రు దాల్చినది, భయంకరములైన గజాశ్వరథములు గలది, పెక్కండ్రు కాల్బంటులచే నల్లకల్లోలమైనది, జాజ్వల్యమానము లైన శూలగదా ఖడ్గప్రాస తోమర ధనుస్సులను ధరించినదియు నైన యా రాక్షససేన ఘోరమును, భయంకర పరాక్రమ పౌరుషములు గలదియు, జ్వలించు నీటియలలను దాల్చినదియు, పెక్కు చిఱుగంటల మ్రోఁతలతోఁ గూడినదియు, బంగారు భూషణములజ్వాలలచేఁ బర్వఁబడిన భుజములు గలదియు, మదముచే గొడ్డండ్రను ద్రిప్పునదియు, గొప్ప యాయుధము లను జళిపించునదియు, వింట బాణముల జోడించునదియు, గంధపుఁ బూఁతలచేతను పుష్పహారములు దాల్చుటచేతను మధుపానముచేతను గమగమ పరిమళించు నోటి వాసనను వెలువరించునదియు, వీరభటులచే నిండియుండుటంజేసి, భయంకరమై మహామేఘగర్జనముం బోలు రొద గలదియునై సొబగుమీఱి యుండెను. ఆ వచ్చు భీకరమైన రాక్షస బల

మును గాంచి, వానరసేన యాశ్చర్యపడి గొప్ప సింహనాదముగావించెను. అంత నా రాక్షసుల యపారసైన్య మా వానరుల సింహనాదములు విని, పైకెగిరి, మిడుత లగ్నిహోత్రునిపైకిఁ గవియునట్లు లా వానర సైన్యము మీఁదికిఁ గవిసెను. బాహువుల యొఱపిడిచే నొండొంటిని దాఁకి వెలుఁగు చుండు వజ్రములం బోలు గదలు ఢాల్చిన యా రాక్షసశ్రేష్ఠ బలము మీఁదు మిక్కిలి శోభాయమాన మయి యుండెను. ఆ యుద్ధరంగమున వానరులు పోరాడఁ గోరినవారలై రాక్షసులను పర్వతవృక్షములతోఁ గొట్టుచుఁ బిడికిళ్లతోఁ బొడుచుచు నున్నత్తులపగిది రాక్షసులమీఁదికిఁ గవిసిరి. భయంకరాకారు లగు రాక్షసులును తమపైకి వచ్చెడి యా వానరుల శిరములను వాఁడికత్తులతోఁ దటాలున నఱకిరి. వానరులు రాక్షసులయొక్క చెవులను గొఱికిరి. పిడికిళ్లతోఁ దలలు పగల్చిరి. తాలతోఁ గాలుసేతులు విఱిచిరి. రాక్షసవీరులు వానరుల నెదుర్కొనియు, వీరులగు వానరులు రాక్షసుల నెదిరించియు నొండొరుల బాగుగా దన్నుకొనిరి. వానర రాక్షసులలో నొండొరులు గొట్టువారిని గొట్టిరి. పడఁద్రోయువారినిఁ బడఁద్రోసిరి. తిట్టువారిని బదులుదిట్టిరి. కొఱకువారిని బదులు కొఱికిరి. వారిలో నొక్కఁడు కొట్టు మనెను. మఱియొక్కఁడు కొట్టుచుండెను. వేఱొక్కఁ డిదిగో కొట్టెద ననెను. మఱొక్కఁ డేల నన్ను నొంచెదవు? నిలఁబడుము అనెను. ఇవ్విధముగా వా రొండొరులను తొప్పుకొనిరి. కట్టుబట్టలు జాఱిపోవఁగా, కవచాయుధములు వదలి పోవఁగా గొప్ప గుదియలు, కఱ్ఱలు మొనవాలులు ఢాల్చిన రాక్షసులు శిలావృక్ష శైలాయుధు లయిన వానరులును ఘోరయుద్ధము చేసిరి. అప్పుడు వానరు లొక్కొక్కయేటునకుఁ బది పదునేడ్వుర రాక్షసులను, అట్లే రాక్షసు లొక్కొక్కయేటునకుఁ బది బదునేడ్వుర వానరులను సంగరమునఁ బడఁద్రోసిరి. అప్పుడు రాక్షసులకు జుట్టుముళ్లును బట్టలును వీడఁగా, కవచధ్వజములు పాడై పోవఁగా, నా రాక్షససేనలను వానరులు చుట్టుకొని నొంపఁ బూనిరి.

76-వ సర్గము

కుంభవధము

అట్లు రాక్షసశూరనాశక మయిన ఘోరయుద్ధ మెడతెగక జరుగుచుండఁగా, నంగదుఁడు కయ్యము సేయఁగోరినవాఁడై శూరుఁ డైన

కంపనునిమీఁదికిఁ బోయెను. కంపనుఁ డుత్సాహముతో నా యంగదునిఁ గదిసి, కోపము గదుర తొలుత గదతో నతని గొట్టెను. ఆదెబ్బ కంగదుఁడు గడగడ వడకి సోకెను. అంగదుఁడు మఱలఁ దెప్పిఱిల్లి, యొక పర్వతశిఖరము నా కంపనుని నెత్తిమీఁద నేసెను. దాని తాకునకు నొచ్చి కంపనుఁడు నేలఁ గూలెను. కంపనుఁడు రణమునఁ గూలుట చూచి, శోణితాక్షుఁ డంగదుని నిర్భయముగా నెదుర్కొని పైకిఁ బోయెను. ప్రలయకాలాగ్నిమాడ్కి జాజ్వల్యమానరూపములు గలవయి శరీరముల భేదించునవైన వాఁడి యమ్ములతో నా శోణితాక్షుఁ డంగదునిఁ ద్వరగా మోదెను. మఱియు అంగదుఁడు మచ్చుకత్తులు, కొడవళ్లు, నారసములు, దూడపండ్లవంటి యాకారముగల బాణములు, కంకపత్రములవంటి బాణములు, ఇరువైపులఁ జెవులుగల బాణములు, అర్ధనారసములు, చురకత్తులు, వాఁడి యమ్ములు మున్నగు నాయుధముల బాగుగా గొట్టఁ బడిన వాఁ డయ్యు, ప్రతాపశాలి యగుటంజేసి, యా శోణితాక్షుని యొక్క శ్రేష్ఠమైన వింటిని, రథమును, బాణములను ద్రుంచివేసెను. తర్వాత శోణితాక్షుఁడు వేగిరమె కత్తిని, అత్తెమును గైకొని యోజింపక, ధైర్యముతో నింగికి నెగిరెను.

బలవంతుఁ డగు నంగదుఁ డా శోణితాక్షునిమీఁది కెగిరి, యాతనిఁ దాఁకి యాతనిచేత నున్న ఖడ్గమును జేతితో విఱిచి, సింహ నాదము గావించెను. తర్వాత నంగదుఁ డతని మూఁపుమీఁదఁ గత్తితో నేసి, యాతనిని యజ్ఞోపవీతము చొప్పున నఱికెను. వాలిపుత్రుఁ డా గొప్పకత్తిని బట్టుకొని, పలుమాఱు సింహనాదము గావించి యుద్ధప్రదే శమున శత్రువులమీఁది కెదుర్కొనెను. బంగరు భుజకీర్తులు గల వాఁడు, శూరుఁడు నైన శోణితాక్షుఁ డినుపగదను గైకొని యా యంగ దునె కొట్టి యాతనిపైఁ బడెను. తర్వాత బలవంతుఁ డగు యూపా క్షుఁడు ప్రజంఘుసమేతుఁడై యరదముమీఁద నెక్కి కోపముతో మహా బలుఁ డగు నంగదునిపైకిఁ బోయెను. ఆ శోణితాక్ష ప్రజంఘుల నడుమ నున్న యా కపివీరుఁడు విశాఖానక్షత్రముల నడుమ నున్న పున్నమ చంద్రునిమాడ్కిఁ బ్రకాశించెను. మైందద్వివిదు లంగదుని కంగరక్ష కులై తమకుద్ధి యగు జోదులకొఱ కెదురుచూచుచుండిరి. ఆ శోణి

తాక్షాదులతోడ గొప్పదేహములును, నెక్కువ బలిమియు, గల రాక్షసులు గదాఖడ్గధనుర్ధారులై యాగ్రహము మీఱి పట్టుదలతోడ వానరుల మీఁదికిఁ గవిసిరి. అట్టి సమయమున నామైంద ద్వివిదాంగదులకు ముగ్గురికి రాక్షసవీరులు ముగ్గురితోడను రోమాంచకర మయిన ఘోర యుద్ధము జరిగెను. వానరులు వృక్షములను నా రాక్షసులమీఁద నేసిరి. మహాబలుఁ డగు ప్రజంఘుఁ డా వృక్షములను ఖడ్గముతో నఱకివైచెను. మఱల వానరులు పర్వతద్రుమములతో రథమును అశ్వములను గొట్టఁగా, యూపాక్షుఁడు బాణపుంజములచే నా పర్వతపాదములను బడఁద్రోసెను. మైందద్వివిదులు పుడమినుండి పెళ్లగించి యేసిన వృక్షములను శూరుఁ డయిన శోణితాక్షుఁడు గదతో నఱకివైచెను. అంతఁ బ్రజంఘుఁడు పరుల మర్మముల భేదించునట్టి విపులమైన ఖడ్గములను బైకెత్తికొని, వేగముతో నంగదునిమీఁదికిఁ బరుగెత్తెను. అప్పుడు బల్మికాఁ డగు నంగదుఁ డతనిని దగ్గఱకు రానిచ్చి, యశ్వకర్ణవృక్షముతో నాతనిఁ గొట్టెను. మఱియు నంగదుఁడు పిడికిటితో నాతనిచేత నున్న ఖడ్గమును బొడిచె. ఆ పోటున కాఖడ్గము క్రిందఁబడెను. అంత మహాబలుఁ డగు ప్రజంఘుఁడు నల్లగలువవన్నె గల తన ఖడ్గము క్రిందఁబడుటఁ గాంచి, వజ్రాయుధంబుఁ బోలునట్టి పిడికిటిని గట్టిగాఁ బట్టి, తన తేజము వెలుఁగ, వానర శ్రేష్ఠుఁడును, వీర్యవంతుఁడును నైన యంగదుని నొసటఁ బొడువఁగా నయ్యంగదుఁడు కొంతతడవు గడగడ వణఁకెను. తర్వాతఁ బ్రతాపశాలి యగు నంగదుఁ డూఱడిల్లి తేజస్సు వెల్లడిపడునట్లు ప్రజంఘుని శిరమును గత్తితో నఱికి నేలఁ ద్రోసెను.

ఆ యూపాక్షుఁడును పినతండ్రి మరణముచేఁ గడుచింతతోఁ గూడి కన్నులనిండుగ నీరు గ్రమ్మ వేగ నవదమునుండి దిగి, యమ్ములు వమ్ములయి పోవుటచేఁ గద నెత్తికొనెను. బలవంతుఁ డగు ద్వివిదుఁ డా వచ్చు యూపాక్షునిఁ గాంచి, యాగ్రహముతో నతనిని ఱొమ్మునఁ గొట్టి బలవంతముగాఁ బట్టెను. తన యన్నను బట్టినవానినిఁ గాంచి, బలవంతుఁ డగు శోణితాక్షుఁడు గదకొనఁ దీసి యా ద్వివిదుని ఱొమ్మునఁ బొడిచెను. బలిమి గల యా ద్వివిదుఁ డా శోణితాక్షుని గదా ప్రహారము గొని వణఁకెను. గాని మఱల నతఁడు గొట్టుటకై పైకెత్తిన గద

నూడఁదీసికొనెను. ఇంతలోపల వానరులలో శ్రేష్ఠుఁడు శూరుఁడు నైన మైందుఁడు యూపాక్షుని ఱొమ్మున నఱచేతితో నప్పళించెను. ఇట్లు బలిమి గల శోణితాక్ష యూపాక్షులు మైందద్వివిదులతోఁ బోరాడఁ దొడఁగి, యొండొరుల నీడ్చుకొనుచును బాదుకొనుచును దీవ్రయుద్ధము గావించిరి. అప్పుడు ద్వివిదుఁడు శోణితాక్షుని వడిగా నలిపి, పుడమిని బడనేసి, మోమున గీఱెను. మైందుఁడును కట్టలుక పూని యూపాక్షుని బాహువుల నడుమ నుంచి నలిపెను. అట్లు నలుపఁగా నా యూపాక్షుఁడు మృతుఁడై నేలఁ గూలెను. అంత సేనాధిపతులు మడియఁగా నప్పుడు రాక్షసేంద్రునిసేన కుంభకర్ణునిపుత్రుఁడగు కుంభునికడ కేఁగెను.

కుంభుఁడును వడిగాఁ దనకడ కేతెంచునట్టి సేనం గాంచి యూరడించి, సాటిలేని వీర్యము గల వానరవీరులచేఁ బడఁద్రోయఁబడిన శూరులతోఁ గూడిన యా రాక్షససేనం గాంచి, యెక్కువకోపముతో నొరులచేఁ జేయనలవికాని పని యొనరించెను. విలుకాండ్రలోపల శ్రేష్ఠుఁడైన యా కుంభుఁ డెక్కువ పూనికిఁ గలవాఁడై, ధనుస్సును జేతఁ బట్టి, యొరుల మర్మభేదకములైన విషవంతము లగు సర్పములం బోలు బాణములను విడిచెను! ఆ కుంభుఁడు బాణముతో సంధించి యెక్కువెట్టిన యా విల్లు విద్యుద్వైరావతములతోఁ గూడి జ్వలించు రెండవ యింద్రధనుస్సు కైవడి శోభిల్లెను. అంతటఁ గుంభుఁ డాకర్ణాంత మీడ్చి యేసిన పసిఁడిపింజ గల గ్రద్ద ఱెక్కలు గట్టిన బాణముతో ద్వివిదునిఁ గొట్టెను. వానరోత్తముఁడు వడిగా నాతనిచేఁ గొట్టఁబడి యడుగులానని వాఁడై వణఁకుచుఁ బరవశుఁడై పర్వతశిఖరముమీఁదికిఁ గ్రిందఁబడెను. మైందుఁడు తన తోఁబుట్టువు యుద్ధరంగమునఁ గూలుట గాంచి, యొక్క గొప్పబండను గైకొని వడిగా నెదుర్కొనివచ్చి యాశిల నా కుంభునినెత్తి నేసెను. బలవంతుఁ డగు రాక్షసుఁడు వాఁడిమి గల యైదు బాణములతో నా మహాశిలను దుత్తునియలు నేసెను. అంతటితో విరమింపక కుంభుఁడు వజ్రతుల్యమై సుముఖ మయిన మఱొక్క బాణమును సంధించి యా ద్వివిదు నన్నను మైందునిఁ గొట్టఁగా వానరయూథపాలుఁ డగు మైందుఁడు బాణపుటేటాయమందుఁ దగులుటచే సొక్కి సోలి క్రిందఁబడెను. అంగదుఁడు తన మేన

మామ లిద్దఱు పడుట కాంచి, వింటిని బైకెత్తికొనియున్న యా కుంభుని నెదుర్కొనెను. వీర్యవంతుఁ డగు కుంభుఁడు మొఱవపోవనివి స్వర్ణ భూషితములు వాఁడిమిగలవి యగు నెనిమిది యుక్కు బాణములతో నంగదునిఁ గొట్టెను గాని, యా యంగదుఁ డెంతమాత్రము గనలఁ డాయెను. మఱియు నతఁ డతనిపై వృక్షశిలావర్షమును గురిపించెను. వీర్యలక్ష్మి గల కుంభుఁ డంగదుఁ డేసిన యా యన్ని వృక్షములను, శాలను త్రుంచివైచెను. అట్లు త్రుంచి, తనమీఁదికి వచ్చుచుండు నా యంగదునిఁ జూచి, యేనుఁగును గొఱవులతోఁ గాల్చినట్లు బాణములతో నంగదుని నొసటఁ గొట్టెను. దానంజేసి, యాతని మోమునుండి రక్తము గారెను. కన్నులును మూఁతపడెను. అంగదుఁడు రక్తార్ద్రములైన కన్నుల నొక్కచేతితో మూసికొని, మఱియొక్క చేతితో దాఁపుననున్న వృక్షమునొక్కదాని నూడఁబెఱికి, దాని బోదెను ఱొమ్మున కానించి చేతితోఁ బట్టికొని, కొంచెము వంచి, యా దానితో నా కుంభునిఁ గొట్టెను. ఆ కుంభుఁ డింద్రధ్వజముం బోలి, మందరపర్వతముం బురు డించుచుఁ దనపైకి వచ్చునట్టి యా మహావృక్షమును రాక్షసు లందఱు వింతతోఁ జూచుచుండఁగా నేడు వాడిబాణములతో నఱికెను. అంతట నంగదుఁడు మిక్కిలి నొచ్చి, దీనముగా నఱచి, మోహము నొందెను.

పరులచే సాధింప నలవికాని వానరశ్రేష్ఠుఁ డయిన యంగదుఁడు సముద్రమున మునిఁగినవానికైవడి మైమఱపు నొందుచుండఁ జూచి, తక్కిన వానరు లందఱు రాముని కావృత్తాంత మెఱిఁగించిరి. రాముఁడు యుద్ధరంగమున నంగదుఁడు నొచ్చె నని విని, వెంటనే జాంబవంతుఁడు మున్నుగాఁ గల వానరవీరుల నందఱ నాజ్ఞాపించెను. వానరశ్రేష్ఠు లంద ఱా రామునియాజ్ఞను శిరసా వహించి, మిక్కిలి యాగ్రహము నొందిన వారై ధనుస్సును బైకెత్తికొనియున్న యా కుంభునిమీఁదికి రేఁగఁ గోరి, కోపముచేఁ గన్నులందుఁ గెంపు గదుర వృక్షశిలాయుధులై యంగదుని రక్షింపఁగోరినవా రయి యంగదునికడకు దుమికిరి. జాంబవ త్సుషేణ వేగదర్శులు మువ్వు రాగ్రహభరితులై వీరుఁ డయిన కుంభుని మీఁదికిఁ బరుగెత్తిరి. అట్లు తనమీఁదికిఁ బరుగెత్తివచ్చు నా వానర వీరులను మువ్వురను గాంచి కుంభుఁడు నదీప్రవాహమును బ్రవ్వత

ములతో నడ్డగించునట్లు శరములతో వారి నడ్డగించెను. సముద్రము చెల్లెలికట్టను దాఁటఁజాలనట్లు వానరవీరులు ముప్పురు కుంభుని బాణముల బారిం దవిలి యచ్చటనుండి తప్పించుకొని పోవఁజాలరైరి. వానరవీరు లందఱు బాణవర్షములచే నొచ్చినది గాంచి, వానరేంద్రుఁ డగు సుగ్రీవుఁ డంగదుని వెనుకఁ ద్రోసి, పర్వతంపుఁ జఱియయందుఁ దిరుగు నేనుఁగు మీఁదికి సింగము పఱచినట్లు తానే కుంభునిమీఁదికి వడిగాఁ బఱచెను. అట్లు పఱచి, బలవంతుఁ డగు సుగ్రీవుఁడు కుంభునిమీఁదఁ బెక్కు-టశ్వకర్ణ ధవ ప్రభృతు లగు మహావృక్షములను వడిగా నేసెను. భేదింప రానిదై యాకాశముఁ గ్రమ్ముచున్న మహాద్రుమవర్షమును కుంభుఁడు వాఁడిమి గలబాణములతోఁ జెదరఁగొట్టెను. గుఱిచూచి యేయఁగల వాఁడును నోర్వరానివాఁడును నైన కుంభుఁడు వాఁడియమ్ములచేఁ ద్రుంచిన యావృక్షములు ఘోరములయిన శతఘ్ని లను పేరుగల యాయుధములమాడ్కిఁ బ్రకాశించెను. తాను గురిపించిన చెట్లవానను గుంభుఁడు చెదరఁగొట్టుటను వానరాధిపుఁడు కాంచి తాను మహాసత్త్వుఁ డగుటచేఁ గలఁకపాఱనివాఁడై, వెంటనే యాతనిచే బాణములచే నొప్పింపఁబడుచున్నను, వాని యా బాణముల నోర్చుకొన్నవాఁడై యింద్రధనుస్సువంటి వెలుఁగుగల కుంభుని వింటిని లాగికొని దానిని విఱిచెను.

అట్లు సుగ్రీవుఁ డసాధ్యమైన కృత్యం బొనరించి, వడిగా దుమికి వచ్చి కొమ్ము విఱిగిన యేనుఁగుం బోలిన యా కుంభునితో నాగ్రహము మీఱ ని ట్లనియె : "ఓరి నికుంభుని యన్నా, నీ బాణము వేగమునకు హేతు వయిన మగఁటిమి వింతయైయున్నది. ఈ వినయమును ప్రభావ మును నీదా ? లేక రావణునిదా? ప్రహ్లాద బలి దేవేంద్రకుబేరవరుణులకు సాటియైన యా కుంభా! బలముచే నీ వొక్కఁడవే తండ్రిని బోలిన వాఁడవు, జితేంద్రియుని మనోవ్యాధులు బాధింపఁ జాలనియట్లు నిడుద చేతులవాఁడవు, విలుకాఁడవు, శత్రుహింసకుఁడవు నైన నీ వొక్కఁడవే దేవతలకు సైతము సాధ్యుఁడవు గానివాఁడవు. బుద్ధిమంతుఁడా! నేను జూచునప్పుడే నీ పరాక్రమము చూపుము. వరదానమువలన నీ పెద తండ్రి దేవదానవులతోఁ బోరి గెల్చినవాఁడు. కుంభకర్ణుఁడు పరాక్రమ

ముచే దేవాసురులతోఁ బోరాడినవాఁడు. విలువిద్దెయం దింద్రజిత్తుతో సమానుఁడవు. ప్రతాపమున రావణునితో దుల్యుఁడవు. రాక్షససమూహములోపల బలవీర్యములచే నీ వొక్కఁడవే మించినవాఁడవు. తొల్లి భూతములు దేవేంద్రశంబరాసురులకు జరిగినపోరు గాంచినకైవడి నాతోడి నీ విప్పుడు చేయఁబోవు గొప్ప పోరాటమును జూతురుగాక. నీవు సాటిలేని పని యొనరించి, నీ విలువిద్దెయందలి నేర్పెఱింగించితివి. ఎక్కువబలిమి గల వానరవీరుల నెల్లఁ గ్రిందఁద్రోసితివి. పెక్కండ్రతో యుద్ధము సేసి యలసి హతుఁ డయ్యె నను నపమాను వచ్చునేమో యను వెఱపుచే నిన్ను వేగ పరిమార్పకుంటిని. నీ వింతతడవు పనిచేసి యలసితివి. అలసటఁ దీర్చికొని నా బలిమి నించుక చూడుము.

అవమానపురస్సరం బైన యా సుగ్రీవుని మాటలచేఁ గుంభుఁడు రోషము పూని యాజ్యాహుతిం బ్రజ్వరిల్లు నగ్నిహోత్రునికైవడి నెక్కువ వెలుఁగు గలవాఁ డయ్యెను. తర్వాతఁ గుంభుఁడు సుగ్రీవునిఁ జేతులతోఁ గట్టిగాఁ బట్టికొనెను. మదమెక్కిన యిరు గజములకైవడి మాటిమాటికి నిట్టూర్పువిడుచుచు నొండొరుల యొడళ్లను జేర్చికొనుచు నొండొరుల నీడ్చికొనుచు, బడలికచే నోటినుండి పొగతోఁగూడిన జ్వాలలను వెలువరించుచు సుగ్రీవ కుంభులు పోరాడిరి. వా రొండొరులను బడఁద్రోసి గ్రుద్దుకొనుటచే బుడమి క్రుంగెను. సముద్ర మల్ల కల్లోలమై మిక్కిలి కలఁతచెందెను. తర్వాత సుగ్రీవుఁడు గుంభునిఁ బైకెత్తి సముద్రమున నీటియడుగు దగులునట్లు వేగముతో విసరివైచెను. ఆ కుంభునిపాటుచే సముద్రము పై కుబికి వింధ్య మందర పర్వత తుల్యమై యంతటఁ బర్వెను. తర్వాతఁ గుంభుఁడు పైకెగిరి, సుగ్రీవుని మీఁద దుమికి వజ్రాయుధవేగము గల పిడికిటితో నా సుగ్రీవుని ఱొమ్మునఁ బొడిచెను. ఆతని తోలూడి యెక్కువ రక్తము గాఱెను. ఆ పిడికిటిపోటాసుగ్రీవుని యెముకలకుఁ దగిలి వ్యర్థమాయెను. ఇంద్రుఁడు మేరుపర్వతము ఱెక్కలఁ దెగఁగొట్టినప్పుడు వజ్రాయుధ సంఘర్షజన్యమైన వెలుఁగుమాడ్కి నా సుగ్రీవుని ఱొమ్మున ముష్టిసంఘర్షముచే వెలుఁగు పుట్టెను. వానరవీరుఁ డగు సుగ్రీవుఁ డా పిడికిటిపోటు దిని, తన బలిమి మీఱ వజ్రాయుధమువంటి పిడికిటినిబట్టి, వేయి కిరణములచే వ్యాప్తమై

సూర్యమండలముఁ బోలు నా ముష్టితో నా కుంభుని ఱొమ్మునఁ బొడిచెను. ఆ కుంభుఁడు పిడికిటిపోటుచేఁ గడునొచ్చినవాఁడై మయి మఱచి, మంటలు చల్లారిన యగ్నిహోత్రునికైవడిఁ బుడమిఁ బడెను. రాక్షసుఁడు పిడికిటిపోటుచే గాడ నొచ్చి నేలఁ బడినవాఁడై వెలుఁగుతోడ స్వేచ్ఛగాఁ గ్రిందికి వచ్చిన యంగారకునిమాడ్కి వెలిఁగెను. కుంభుఁడు నొచ్చి క్రిందఁ బడునప్పు డతని రూపము రుద్రునిచే నొంపఁబడిన సూర్యుని రూపముమాడ్కిఁ బ్రకాశించెను. ఇట్లు సమరమున వానరరాజగు సుగ్రీవుఁడు గుంభునిఁ దన పరాక్రమము వెఱయ మడియింపఁగా బుడమి పర్వతారణ్యములతోడ వణఁకెను. రాక్షసుల కెక్కువ భయమును గలిగిన దాయెను.

77-వ సర్గము

నికుంభవధము

నికుంభుఁడు తన యన్న సుగ్రీవునిచేఁ జంపఁబడినవానినిఁ గాంచి, దహించువాఁడు వోలె నతనినిఁ గోపముతోఁ జుఱచుఱఁ జూచి, పుష్పమాలారత్నహారములతో నలంకృతంబును, జందన కుంకుమాదులతోఁ బంచాంగుళ ముద్రచే ముద్రింపఁబడినదియుఁ బర్వతశిఖరతుల్యమును, బంగారు కమ్మితోఁ గట్టబడినదియు, రవలు పవడములు నలంకరించినదియు, యముని పాశాయుధముఁ బోలినదియు శత్రుభయంకర మయినందున రాక్షసుల భయముఁ బోకార్చునదియు నైన గుదియను గైకొనెను. అంత నెక్కువ వెలుఁగు గల నికుంభుఁడు చక్రధ్వజముఁ బోలు నా గుదియను బట్టికొని గిరగిరఁ ద్రిప్పుచు నోఱు తెఱచుకొని బిగ్గఱగా నఱచెను. మఱియు నికుంభుఁడు భుజములందు బాహువురులను, చెవులందు వింతలైన కుండలములను, మఱియు విచిత్రమయిన కంఠహారమును, భూషణములను దాల్చినవాఁడై, యుఱుములు మెఱుములు గల మేఘమింద్రధనుస్సుచేఁ బ్రకాశించునట్లు ప్రకాశించెను. ఆ మహాధీరుఁడయిన నికుంభుని గుదియకొన తాఁకుడుచే వాయుకూటము భిన్నమయ్యెను. మఱియు నది శబ్దముతోడఁ గూడి పొగలేని యగ్నివలె మండెను. నికుంభునిగుదియ త్రిప్పుటచేఁ గడుఁ గదలుచున్న యాకాశము విటపావతి, గంధర్వనగరము, అమరావతి మొదలగు నగరముల

తోడను, సూర్యచంద్రగ్రహ నక్షత్రములతోడను గిరగిరఁ దిరుగు చున్నదో యన్నట్లుండెను. ఆ నికుంభుఁ డనెడి యగ్నిహోత్రుఁడు పరిఘా భరణముల ప్రభయను ప్రభగలవాఁడై దగ్గఱఁ జేరవీలుగాక వానరుల నిమిత్త మేర్పడిన ప్రళయాగ్నియో యనఁ బరఁగియుండె. అట్టి నికుం భునిఁజూచి వానరులును రాక్షసులును భీతులై కదలమెదల నైనఁ జాల రైరి.

అప్పుడు హనుమంతుఁడు మాత్రము ఱొమ్ము విచ్చుకొని యాతని యెదట నిలఁబడెను. గుదియలం బోలు బాహువులు గల బల వంతుఁ డగు నికుంభుఁడు సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు గుదియను బలా త్కారముతో నతని ఱొమ్మున వైచెను. దృఢమయి విశాలమైన యాతని ఱొమ్మునఁ దగిలిన గుదియ నూఱుప్రయ్యలై చెదరిపోయి యాకాశ మున వెలుఁగు నూఱుకొఱవులమాడ్కిఁ గనఁబడెను. హనుమంతుఁ డా గుదియయేటు దగులఁగా, భూకంపమునందుఁ బర్వత మదరినట్లు లద రెను. వాయువిక్రముఁడును, వడిగలవాఁడును, బలవంతులను మించిన వాఁడును నైన వానరోత్తముఁ డా కొట్టు వడి, గట్టిగాఁ బిడికిలిఁ బట్టి యెత్తి యా నికుంభుని ఱొమ్మునఁ బొడువఁగా నచ్చటఁ దోలూడెను. నెత్తురు వెలువడెను. మెఱపువంటి యొక మంట పుట్టెను. మహాబలుఁ డగు నికుంభుఁ డా దెబ్బ దిని యదరెను గాని, మఱలఁ దెప్పిఱిల్లి యా బల్మికాఁ డగు హనుమంతునిఁ బట్టెను. మహాబలుఁ డగు హనుమంతుని నికుంభుడు పట్టి పై కెత్తుటఁ గాంచి, యుద్ధ ప్రదేశమున నున్న రాక్షసు లుప్పొంగి శత్రుభయంకరముగా నఱచిరి. నికుంభుఁ డట్లు హనుమంతునిఁ బట్టి యెత్తికొని పోవుచుండఁగా, నతఁడు వజ్రపాత తుల్యమగు పిడి కిటితో మఱల నికుంభునిఁ బొడిచెను. అట్లు హనుమానుండు పొడిచి, తన్నుఁ దాను విడిపించికొని, క్రిందికి దుమికి, యెక్కువ పట్టుదలతో నికుంభునిఁ గ్రిందఁద్రోసి కాలితో నలిపి, వేగముతోఁ బైకెగిరి, యతని ఱొమ్మునఁ బడి, చేతులతో నతని మెడఁ బట్టి త్రిప్పి ఱొప్పుచున్న యాతని గొప్ప శిరమును బగుల నేసెను. అట్లు పవనసుతుఁడు ఱొప్పు చున్న యా నికుంభుని యమపురికి నతిథిం జేయఁగా, నెక్కువ యాగ్రహము పూనిన మకరాక్షుఁడు రామునిమీఁదికిఁ గవిసెను. అంత

నా యిద్దఱికిని ఘోరయుద్ధము నడచెను. నికుంభుఁడు నిహాతుఁడు గాఁగా వానరులు దిశలు పిక్కటిల్ల సంతసముతో గగ్గోలు సేసిరి; పుడమియు నదరెను, నింగియు బ్రద్దలయ్యెను. రాక్షససేనలకు భయమును గలిగెను.

78-వ సర్గము

మకరాక్షుఁడు యుద్ధమునకు వెడలుట

రావణుఁడు నికుంభకుంభులు మడిసి రనిన యుదంతము విని యెక్కువ కోపము పూని, యగ్నిహోత్రునిమాఱ్కి మండిపడుచుఁ బగతునిమీఁది క్రోధ మొక్కవైపునను, పుత్రశోక మొక్కవైపునను గలుగ నొడలు మఱచినవాఁడై, వెడఁదఁ కన్నులుగల ఖరపుత్రుఁ డైన మకరాక్షుని బిలిచి, "నాయనా! నే నానతి యొసఁగితి. నీవు సపరివారుఁడవై యేఁగి యా రామలక్ష్మణుల మడియింపుము." అని యానతిచ్చెను. తన్నుఁ దా శూరుఁ డని తలఁచు ఖరపుత్రుఁ డగు మకరాక్షుఁడు రావణుని పలుకు విని తన్నుఁ బంపఁదలఁచినందుల కెక్కువ యుప్పొంగి యట్లు పోవ నియ్యకొని, దశకంఠునికిఁ బ్రదక్షిణ నమస్కారములు గావించి, శుభ్ర మగు స్వగృహమునుండి పయనమై చేరువనున్న సేనాపతిం గాంచి, తే రాయితము సేయింపను, సేనల వేగ రప్పించుటకును నానతీయఁగా, సేనాధిపతియు రథము దెప్పించి సేనలను రప్పించెను.

నిశాచరుఁ డా రథమునకుఁ బ్రదక్షిణము గావించి, యం దెక్కి కూర్చుండి త్వరగా రథము తోల సారథి కానతిచ్చి, యా సైనికుల నందఱను గాంచి "రాక్షసులారా! మీ రందఱు నాకు ముందుగా యుద్ధముఁ గావింపుఁడు. మహాత్ముఁ డగు రాక్షసేంద్రుఁడు రావణుఁడు నన్ను రామలక్ష్మణుల వధింప నానతి యొసఁగెను. రక్కసులారా! మేటి బాణములను బ్రయోగించి యిప్పుడ రామలక్ష్మణులను, సుగ్రీవునిఁ దక్కిన వానరులను వధించెదను. కాఱుచి చ్చెండుఁ గట్టెలను గాల్చివేయు చందమున శూలపు పోటులతో వానరుల గొప్ప సైన్యమును దహించెదను" అని చెప్పెను.

రాక్షసు లందఱు మకరాక్షుని పలుకులు విని తమ బలిమి మెఱయ వివిధాయుధములను గైకొన్నవారై యుద్ధమునకుఁ దరలిరి. ఆ రాక్షసు లందఱు కోరిన రూపమెత్తువారు; కోఱలు గలవారు; పచ్చని కన్నుల వారు. ఇట్టి యా రాక్షసులు శిరోజములు విరియఁ బోసికొని, మదపు టేనుఁగులకైవడి ఱొప్పుచు నా ఖరాత్మజుని మకరాక్షునిఁ జుట్టుకొని, పుడమి నదలించుచు మక్కువతో వెంబడించిరి. వారు వాయించు భేరీ మృదంగాది వాద్యముల మ్రోఁతలును, రెట్టలు దట్టునప్పటి ధ్వనులును, సింహనాదములును దెస లంతట నిండె. అప్పుడు రథసారథి చేతినుండి మునికోల జాఱిపడెను. మఱియు నమ్మకరాక్షుని తేరి టెక్కెము విరిఁగి పడెను. ఆతని తేరి గుఱ్ఱములు వడి లేనివై కాళ్లు తడఁబడఁ గన్నీరు గార్చుచు దైన్యముతో నడచినవి. భయంకరుఁడును, బుద్ధిహీనుఁడును నైన యా మకరాక్షుఁడు యుద్ధయాత్రకై వెడలునప్పుడు గాలి దుమ్ముతో నిండి, యతిభీకరముగా నెదురు వీచెను. మేఘముల, నేనుఁగుల, నెనుఁబోతులఁ బోలిన మేని డాలు గలవారును, యుద్ధము లందుఁ బలుమాఱు గదాఖడ్గములచేఁ జీల్పఁబడినవారును, యుద్ధసామర్థ్య వంతులును, శూరులలో మేటులు నయిన యా రాక్షసులు మకరాక్షునిఁ జుట్టుకొని యా యపశకునముల గమనింపక రామలక్ష్మణులు నిలిచియున్న యుద్ధప్రదేశమునకు నేను ముందు నేను ముందని బిగ్గఱగా నఱచుచుఁ బోయిరి.

79-వ సర్గము

శ్రీరాముఁడు మకరాక్షుని వధించుట

ఆ వానరయూథనాథులు వెడలి వచ్చిన మకరాక్షునిఁ గాంచి, తటాలునఁ బైకెగిరి, యుద్ధము చేయఁగోరినవారలై, ధైర్యముతో నిలఁ బడిరి. అంత దేవతలకు దానవులతోడం బోలె నవ్వానరవీరుల కా రాక్ష సులతోడ గగుర్పాటొదవించుకడు గొప్పయుద్ధము నడచెను. అప్పుడు వానరులు రాక్షసులను వృక్షశైలశిలలతోను, రాక్షసులు వానరులను శూలగదాఖడ్గములతోను గొట్టిరి. అప్పుడు కొందఱు రాక్షసులు బల్లెములు, కత్తులు, గదలు, కుంతములును, కొందఱు చిల్లకోలలును, మఱికొంద ఱడ్డకత్తులు, గుదియలు, వజ్రాయుధములుం గైకొనియు,

కొందఱు ఱోకళ్లు, త్రాళ్లు, కఱ్ఱలు, పొడిచెడి యాయుధములు గైకొనియు నా వానరవీరులతోఁ గయ్యమొనరించిరి. ఖరపుత్రుఁ డవ్విధమున బాణములచే వానరుల నొంపఁగా, నా వానరులందఱు మనసు కలఁగి, భయముచే నొచ్చినవారై పరుగెత్తిరి. రాక్షసులందఱు పరుగెత్తుచుండు వానరులను గాంచి జయశాలురై, సింహముల మాడ్కి వేడుకతో నఱచిరి.

అప్పుడా వానరులు నలుదెసలకుఁ బరుగులెత్తుచుండఁగా, రాముఁడంపవాన గురిపించి, యా రాక్షసుల నందఱిని నివారించెను. రాముఁడు రాక్షసులను నివారించుట మకరాక్షుఁడు కాంచి, కోపాగ్నిపరీతుఁడై రామునిఁ జూచి, "రామా! న న్నెదిరించి నిలువుము. నేను నీతో ద్వంద్వయుద్ధము చేసెదను. నే నిప్పుడు వింటినుండి యేసిన వాఁడి బాణములతో నీ ప్రాణములను దీసెదను జూడుము. అప్పుడు నీవు దండకారణ్యమున నా తండ్రిని జంపితివిగదా! నీ విప్పుడు నాయెదుట యుద్ధముసేయ నిలువఁగా, నాకు రోషము హెచ్చుచున్నది. ఓ దురాత్మా! రాఘవా! నీ వప్పు డమ్మహావనమున నాకంటఁ బడినవాఁడవు గాకపోతివిగా యని నా యంగము లెఱియుచున్నవి. ఆఁకలిచే డస్సియున్న సింహ మాహారార్థమై యితర మృగములఁ గోరునట్లు నేను నిన్నుఁ గోరితిని. నా యదృష్టవశమున నేఁడు గంటఁ బడితివి. ఇప్పుడు నే నేయు బాణముచే నీవు మడిసి జమునిప్రోలి కేఁగినవాఁడవై, మున్ను నీవు సంహరించిన వారితోఁగూడి యుండఁగలవు. రామా! పెక్కు మాట లేల? నే నొక్క మాట సెప్పెద నాలింపుము. జనులందఱు యుద్ధరంగమున నా సామర్థ్యమును, నీ సామర్థ్యమును జూతురుగాక! రామా! నీవు గదతో యుద్ధము సేయ నేర్చితివో, లేక అస్త్రములచేతనో, లేక బాహువులతోనో, ఎట్లు నీవు నేర్చితివో యా విధమున నిచ్చట నాతో సమరము సేయుము." అనెను.

దశరథపుత్రుఁడు మకరాక్షుని మాట విని, పకపక నవ్వుచుఁ బైఁపయిఁ బ్రేలుచున్న యా మకరాక్షునిగాంచి, "ఓరీ రాక్షసుఁడా! యెలతగని పలుకులు బలికెదవు? యుద్ధము సేయక నోటితోఁ బగతుర గెల్వవలను గాదు. పదునాలుగువేవురు రాక్షసులతోఁ వచ్చిన నీ తండ్రిని,

దూషణత్రిశిరసు లను నే నొక్కడనే వధించితిని. ఓరీ యధమా! యిప్పుడె వాఁడి ముక్కులును గోళ్లును గల గ్రద్దలు, కాకులు, నక్కలు, నీ మాంసమును దనివి దీఱఁ దినఁగలవు, చూడుము." అని ఖరపుత్రుఁ డగు మకరాక్షునితోఁ జెప్పెను.

రాముఁ డటు పలుకునప్పుడే మకరాక్షుఁ డలిగి యుద్ధప్రదేశమున నున్న యా రామునిపైఁ బెక్కు బాణముల నేసెను. రాముఁడు శరవర్షముఁ గురిపించి యా బాణములను ఖండించెను. పసిఁడిములుకులు గల యా బాణము లన్నియుఁ దుత్తునియలయి పుడమిం బడెను. ఒండొరులం దాఁకి పరాక్రమముతోఁ బోరుచున్న యా మకరాక్ష దశరథనందనులకు ఘోరయుద్ధము నడచెను. అప్పు డయ్యుద్ధరంగమున వింటినారియు నత్తెము నొరయుటచేఁ బుట్టిన ధ్వని పరస్పరము గదిసిన మేఘముల గర్జనముఁ బోలియుండెను. దేవ దానవ గంధర్వ కిన్నర పన్నగు లావింతఁ జూడఁగోరి యంతరిక్షమున నిలిచియుండిరి. యుద్ధరంగమున రామ మకరాక్షు లిరువురు నొండొరుల యంగములను బాణములతో నొంచికొనియు, నొకఁడు చేసినదానికి బదులు మఱియొక్కటి చేయుచు నప్పటప్పటికి బలిమిఁ జూపుచు రెండింతలుగాఁ గొట్టుకొనిరి. రణమున రాముఁ డేసిన బాణములను మకరాక్షుఁడు తుత్తునియలు చేసెను. రాముఁడును మకరాక్షుఁ డేసిన యమ్ములను బాణమ్ములచేఁ దుత్తునియ లొనరించెను. ఆ రామ మకరాక్షు లేసిన బాణములచే నిండినవై దిక్కులును, విదిక్కులును, భూమియు కాంతిహీనములై యుండెను.

అంత దీర్ఘబాహుఁ డగు రాముఁ డలిగినవాఁడై యా మకరాక్షుని వింటిని ద్రుంచి, యెనిమిది బాణమ్ములేసి సారథిని జీల్చెను. మఱి కొన్నియమ్ము లేసి తేరిని విరిచి తేరిగుఱ్ఱములను గూల్చెను. అంతట మకరాక్షుఁడు రథములేనివాఁడై నేలమీఁద నిలఁబడి, ప్రలయాగ్ని హోత్రునిమాడ్కి వెలుఁగునది గాన సకలభూతముల వెఱపించునట్టి గొప్ప శూలమును గైకొని, కోపముతో దానిని గిరగిరఁ ద్రిప్పి రాముని మీఁద నేసెను. మకరాక్షుని చేతినుండిజాఱి మండుచు వచ్చెడి యాశూలమును రాముఁ డాకాశముననే మూఁడమ్ములచే నఱికెను. బంగారుగైసేతగల యా శూలాయుధము రామబాణముచేఁ ద్రుంపఁబడి పలు

తునుకలై గొప్ప కొఱవివలెఁ జెదరి పడిపోయెను. సుచరిత్రుఁడగు నా రాముఁడు శూలమును ద్రుంచుట గాంచి, సకల ప్రాణులును మేల్మేలని కొనియాడిరి. మకరాక్షుఁడు తన శూలము వమ్మగుటఁ గాంచి, పిడికిలి బిగించి యెత్తి నిలు నిలు మని రామునిపైకిఁ గవిసెను. రాముఁడు తన మీఁదికి మకరాక్షుఁడు వచ్చుటఁగని, వింట నాగ్నేయాస్త్రమును సంధించి యా మకరాక్షునిమీఁద నేయఁగా, నతఁడు ఱొమ్ము బ్రద్దలయి క్రిందఁ బడి నీల్గెను. తర్వాత నతనివెంట వచ్చిన రాక్షసు లందఱు రామబాణములచే నొచ్చినవారలై లంకాపురికే మఱలిపోయిరి. వేల్పు లందఱు వేల్పుటేనిచే వజ్రాయుధముచే నఱుకఁబడి చెదరిపడిన పర్వతము మాడ్కి రామబాణ నిహతుఁడై పడియున్న మకరాక్షునిఁ గాంచి, కడు నుప్పొంగిరి.

80-వ సర్గము

ఇంద్రజిత్తు యుద్ధమునకు వచ్చుట

జయశాలియైన రావణుఁడు మకరాక్షుఁడును మడిసె నని విన్నవాఁడై, యెక్కువ యాగ్రహముచెంది పండ్లు పటపటఁ గొఱికి, యిఁకఁ జేయవలసిన పని యేమి యని కొంతతడ వాలోచించి నిశ్చయించికొని, తన కొడుకు నింద్రజిత్తును యుద్ధమునకుఁ బంపఁ దలఁచి యాతనిఁ బిలువఁ బంపి యిట్లనెను: "మొనగాఁడా! కంటికిఁ గనఁబడుచుఁగాని, కనఁబడకకాని, యెక్కువ వీర్యముగల యా తోఁబుట్టువు లగు రామలక్ష్మణులను సంహరింపుము. నీ వన్ని తెఱఁగుల నెక్కువ బల్మికాఁడవు. నీవు సమరమున నెదురులేక పోరాడఁ గలయట్టి యింద్రునే జయించితివి. అట్టి నీ కీ మానవు లెంతమాత్రము? వీరిని నీవు వధింపఁజాలవా? చెప్పుము."

అని రాక్షసాధిపుఁడగు తన తండ్రి సెప్పిన పలుకులు విని, రావణి యజ్ఞశాలకుఁ బోయి విధ్యుక్తప్రకారమున నగ్నిని వేల్చెను. అట్లు వేల్చు సమయమున ఋత్విక్కులు దాల్చుటకై యెఱ్ఱనిపాగాలు గైకొని రాక్షస కాంతలు వేగిరపాటుతోడ నచ్చటి కేతెంచిరి. అప్పు డింద్రజిత్తు శస్త్రములను దర్భలుగాను, తాండ్రపుల్లలు సమిధలుగాను నుంచుకొని, యెఱ్ఱని బట్టలనుగట్టికొని, నల్ల యేనుముతోఁ జేసిన స్రువమునుబట్టి తోమరములతో శస్త్రముల నగ్నిచుట్టుపఱచి బ్రతికియున్న నల్లని మేఁకను బలి

యిచ్చెను. ఆ యగ్నిహోత్రుఁ డొక్కతడవ సమిధలు వేసినంతనే, పొగ లేక గొప్ప మంటలతోడఁ బైకెగయఁగా జయసూచకము లగు శుభ శకునములు గాన్పించెను. అగ్నిహోత్రుఁడు కుడిప్రక్కకు మండు జ్వాలలతోఁ గూడి, పసిఁడివన్నెతో వెలుఁగుచుఁ దానే లేచి హవిస్సును గైకొనెను. ఇట్లింద్రజిత్తగ్నిని వేల్చి దేవదానవరాక్షసులను దనివి నొందించి, యంతర్ధానము నొందినట్టి గొప్ప రథము నెక్కెను. ఆరథ శ్రేష్ఠము నాలుగు గుఱ్ఱములు బూన్చినదై, వాఁడిబాణములతోఁ గూడి యెక్కువెట్టఁబడిన విల్లుగలదై కడుఁ బ్రకాశించెను. మఱియు నారథము పసిఁడి యలంకారములచే సింగారింపఁబడి, జింకలయు, పూర్ణ చంద్రార్ధచంద్రులయుఁ జిత్రములతో నలంకృతమై స్వస్వరూపముతో విరాజిల్లుచుండెను. అయ్యింద్రజిత్తుయొక్క యరదమునకుఁ గట్టిన ధ్వజ మున గొప్ప బంగారు వలయముగలిగి వైడూర్యములు చెక్కినదయి మండుచున్నయగ్ని హోత్రునిమాడ్కిఁ దేజరిల్లుచుండెను. మఱియు నెక్కువ బలిగల యింద్రజిత్తు సూర్యునింబోలె వెలుఁగు బ్రహ్మాస్త్రము గలవాఁ డగుటచే నొరుల కెదిరింపనలవికాని వాఁడై యుండెను. జయశాలి యగు నయ్యింద్రజిత్తు రాక్షససూక్తోక్త మంత్రములతో హోమముచేసి యుద్ధమునకై పురము వెడలివచ్చి "వనమునఁ గపటమునివేషు లయి యున్న యారామలక్ష్మణుల నిప్పుడ వధించి, యుద్ధసంపాదితమయిన కీర్తిని రావణుని కొసఁగెదను. రామలక్ష్మణుల నిప్పుడ పెలుకుమార్చి పుడమిని వానరు లన్న పేరే లేకుండఁజేసి, మాతండ్రి కెక్కువ యానందముఁ గలి గించెద" నని చెప్పి, వాఁడిబాణములు గలవాఁ డగుటచే నోర్వరాని వాఁడై కట్టులుక గదుర సమరప్రదేశముచేరి, మూఁడు తలలపాముల కైవడి నెక్కువ మగఁటిమిగలవారై వానరుల నమమనుండి రాక్షసులపై బాణములను గ్రుమ్మఱించుచున్న యా రామలక్ష్మణులను గాంచెను.

ఇంద్రజిత్తు రథమెక్కి యాకాశమునఁ గంటికిఁ గనఁబడక నిల్చిన వాఁ డయి రామలక్ష్మణులను గాంచి "వీరె వా" రని తలఁచి వింటి నెక్కు వెట్టి, వానకాలపుమబ్బు జడివాన గురిపించుచందమున వాఁడి బాణము లను వారిపైఁ గుమ్మరించెను. రామలక్ష్మణు లింద్రజిత్తేయు బాణములు మేనులఁ గ్రమ్ముచుండఁ గనలినవారై, విండ్లయందు బాణములు జోడించి

దివ్యాస్త్రములతో నభిమంత్రించి యేసిరి. బలవంతు లగు రామలక్ష్మణు లేయు బాణము లాకాశమును గప్పినవికాని, యా సూర్యసదృశములగు నస్త్రము లదృశ్యుఁడైన యింద్రజిత్తును సోఁక వాయెను. వీర్యలక్ష్మి విరాజమానుఁ డయిన యింద్రజిత్తు మంచును బొగయు గప్పినప్పుడువలె నాకసమున జీఁకటి పుట్టించినందున, దిశలు దెలియకుండెను. ఆ యింద్రజిత్తుప్పరమున నవ్విధముగా బాణప్రయోగము సేయుచుండఁగా నతని యల్లెత్రాటి యత్తెముల యొరపిడివలని చప్పుడు గాని, తేరియంచుల ధ్వని గాని, తేరిగుఱ్ఱముల గిట్టలచప్పుడు గాని వినఁబడదయ్యె. ఆతని రూపమును గానరాదయ్యె. ఆకాశము మేఘాచ్ఛాదితమై చీఁకటి గ్రమ్మినప్పు డెడతెగని వర్షము గురియునట్లు, ఇంద్రజిత్తు ప్రయోగించు చక్కని యిసుపయమ్ముల వాన మితిలేక గురిసెను. ఇంద్రజిత్తు వరబలముగలవాఁ డయి, మిక్కిలి కనలి, సూర్యునివలె దగదగ వెలుఁగు నమ్ములచే రామలక్ష్మణులను సకలావయవములందును దగులనేసెను. ఆనరవ్యాఘ్రులు పర్వతములపై వాన ధారలు పడినట్లు తమపై వాఁడియమ్ములు పడుచున్నను, పసిఁడిపింజలుగలిగిన వాఁడియమ్ముల నయ్యింద్రజిత్తుపై నేసిరి. కంకపత్రము లయిన యా బాణము లాకాశంబునం దున్న యింద్రజిత్తును దగిలి, యాతని యొడలి రక్తముచేఁ దడిసినవై నేలఁగూలినవి. ఇంద్రజిత్తును వాఁడియమ్ముల నా రామలక్ష్మణులపై గాడ నేయఁగా, వా రాబాణములను బెక్కుబాణములతోఁ ద్రుంచి తమపై కా బాణము లే వైపునుండి వచ్చుచున్నవో, యా వైపునకుఁ బెక్కుటమ్ముల నేసిరి. చులకనగా బాణముల నేయఁగల వాఁడు నతిరథుఁడునైన యా యింద్రజిత్తు మాయాబలముచే రథమును పదిదెసలందుఁ బోనిచ్చుచు నా రామలక్ష్మణులపై వాఁడియమ్ములను మఱల నేసెను. చక్కఁగా నేసిన పసిఁడిపింజలుగల యమ్ములు బాగుగా నాఁటుటచే నాదశరథాత్మజులు పుష్పితములైన పలాశద్రుమములకై వడిఁ దోఁతెంచిరిగాని, యాతనిఁ గనుఁగొనఁజాలరైరి. మేఘములు దట్టముగాఁ గ్రమ్మినప్పుడు సూర్యుని గత్యాదులు తెలియనట్లు, అయ్యింద్రజిత్తు రూపమేనియు, గమనమేనియు ధనుర్బాణములేనియు నొక్కనికైనను గోచరింపవయ్యె. ఇంద్రజిత్తు రామలక్ష్మణులను మాత్రమేకాక వానరులను గూడఁ గొట్టుటచే, వా రా బాణములయేటులు బాగుగా నాఁటుటచే

ప్రాణములు దొఱఁగి యా యుద్ధభూమియందు గుంపులు గుంపులుగాఁ గూలిరి.

అప్పుడు లక్ష్మణుఁడు కడు నలిగినవాఁడై యన్నను గాంచి "యన్నా! సర్వరాక్షససంహారమునిమిత్తము బ్రహ్మాస్త్రమును బ్రయోగించెదను" అని యనఁగా, రాముఁడు శుభలక్షణముల గల లక్ష్మణునిఁ గాంచి, "యొక్కని నిమిత్తమై పుడమింగల రాక్షసుల నందఱను వధింపఁజనదు. యుద్ధము సేయనివానిని, దాఁగి యున్న వానిని, చే మోడ్చినవానిని, శరణుచొచ్చినవానిని, పరుగిడువానిని, ఏమరుపాటుతో నున్నవానిని నీ వెప్పటికిని వధింపవలదు. కావున సర్వరాక్షససంహారకమైన బ్రహ్మాస్త్రము నేయక యీతని నొక్కనిఁ జంపుటకే పూని, యాశీవిషోపమానము లగు నెక్కువపడిగల యస్త్రములఁ గైకొని ప్రయోగింతము. మోసకాఁడై, యెదుట రథము నిలుపక యుద్ధ మొనరించెడి యీ నీచుని వానరవీరులే తమ బలిమి పెంపుచే జయింపఁగలరు. ఇతఁడు పుడమిలోఁ జొచ్చినను, ఉప్పరమున కెగసినను, పాతాళములోపలఁ దూఱినను, సముద్రమున దాఁగినను, ఎవ్విధమున నా కంటికిఁ గనఁబడకయున్నను, నా యస్త్రాగ్ని కాహుతియై నేలఁ గూలఁగలఁడు. సందియము లేదు. నీవు వంతమాని యుండుము" అని చెప్పెను.

81-వ సర్గము

ఇంద్రజిత్తు మాయానిర్మితసీతను ఛేదించుట

బుద్ధిశాలియగు రామునితలంపు నెఱిఁగినవాఁడై వేల్పులకుఁ బగతుఁడును, శూరుఁడును, నెక్కువ తేజము గలవాఁడును, పౌలస్త్యుఁడు నైన యింద్రజిత్తు యుద్ధభూమి వదలి పురము ప్రవేశించెను గాని, బలవంతులైన తన పినతండ్రి మొదలగు పెక్కండ్రు రాక్షసులు రాఘవునిచే మడియుట తలంచి, కోపారుణిత నేత్రుఁడై, పెక్కండ్రు రాక్షసులతోడఁ బురము వెడలి నికుంభిలాహోమము గావింపఁ గోరి పశ్చిమద్వారమునకు రాఁగా, భ్రాతలగు రామలక్ష్మణు లచట యుద్ధసన్నద్ధులైయుండుటఁ గాంచి, తన హోమంబు నిర్విఘ్నముగా నెఱవేఱువఱకు రామాదులు శోకపరవశులై యుండు నిమిత్త మొక్క మాయను బన్నఁదలఁచి, యపారబలముతోఁగూడినవాఁ డయి రథమున మాయామయ మయిన

సీత నుంచుకొని వచ్చి 'యా మాయాసీతను వధించిన రామాదులందఱు వాస్తవసీతయె వధింపఁబడె నని భ్రమసి మోహము నొందుదురు. అంతఁ దన నికుంభిలాహోమము నిర్విఘ్నముగా నెఱవేఱు' నని తలఁచినవాఁడై య ట్లొనరించికొని వానరుల నెదుర్కొనెను.

పురము వెడలి మాయామయసీతతో రథారూఢుఁడై వచ్చు నా యింద్రజిత్తును గాంచి వానరు లెక్కువ యాగ్రహము నొంది ఱాల నెత్తికొని యుద్ధాభిలాషతో నా యింద్రజిత్తుమీఁదికిఁ గవిసిరి. వానరవీరుఁ డగు హనుమంతుఁడు గడు గొప్పపర్వతశిఖరము నొక్క దానిని గైకొని వారి ముందట నడచెను. అట్లు హనుమంతుఁడు వానరుల పురోభాగమున నడచుచు నింద్రజిత్తుయొక్క రథమున నొంటిజడ దాల్చి నదియు, నొక్కప్రొద్దులచే మోము వాడినదియు, సంతసముఁ దక్కినది యు, మాసిన యొంటిచీర దాల్చినదియు, నొడలు తోమమిచే శుద్ధిలేని దియు, దుమ్ముతోను ముఱికితోను నిండిన సర్వాంగములు గలదియు, నుత్తమకాంతయు, రాముని ప్రియయు నైన సీతయుండుటను గాంచి, యీపె యెవతెగా నుండునని యొక ముహూర్తకాలము పరికించిచూచి యా దేవిని గొన్నిదినములకు ముందే చూచినవాఁ డగుటచే నామె సీతా దేవి యనియే నిర్ణయించుకొని, ముఱికితో నిండిన సర్వావయవములు గలదై రథమున విన్నదనముతోఁ గూర్చుండియున్న మైథిలిని గాంచి, కన్నీటిచేఁ జూపు చెదర మనమున నొచ్చినవాఁ డయ్యెను.

వానరశ్రేష్ఠుఁ డగు హనుమాంతుఁడు దుఃఖముచే నొచ్చినదై, మోదములేక, వ్యసనపడుచు రథమున నింద్రజిత్తు ప్రక్కనఁ గూర్చుండి యున్న సీతను గాంచి, వీఁడు సీత నిట్లు తనరథమున నుంచుకొని తెచ్చు టయం దేమి యభిప్రాయ మని యోచించి కనుఁగొనఁజాలక, వానర వీరులతోడ నయ్యింద్రజిత్తుమీఁదికిఁ గవిసెను.

ఇంద్రజిత్తా వానరసైన్యమును గాంచి, కోపముచే మేను మఱ చినవాఁడై, ఖడ్గము నొరనుండి తీసి, మాయాసీత శిరోజములఁ బట్టు కొనెను. అట్లు పట్టుకొని, తన మాయాబలముచేతనే రామ రామ యని వాస్తవసీతవలెనే యఱచుచుండు నా మాయాసీతను వారందఱుచూచు నప్పుడె బాగుగాఁ దన్నెను. అట్లు రావణాత్మజుఁడు కొప్పుపట్టుకొని తన్ను

చుండఁగా రామరామ యని మొఱలిడుచుండు నా మాయాసీతనుగాంచి, వాస్తవసీతనే యిట్లతఁడు బాధింపుచున్నాఁ డని యెంచి, విన్నదనము నొంది కన్నులనుండి దుఃఖజములైన కన్నీటిని గార్చెను. అంత నా హనుమంతుఁ డట్లు సర్వాంగసుందరి యగు రాముని ప్రియదేవి యైన సీత యింద్రజిత్తుచేఁ బీడితురా లగుట గాంచి, యామె వాస్తవసీత యని భ్రమించినవాఁడై యాగ్రహము మీఱ నా రాక్షసాధిప పుత్రుతో నిట్లనియె: "ఓరీ దుర్బుద్ధీ! నీవు బ్రహ్మర్షులవంశమునఁ బుట్టిన వాఁడ వయ్యు రాక్షస యోనియందు జన్మించినవాఁడవు. నీవు మంచిచెడ్డ లెఱుఁగవు. కావున నీచేటు గోరినవాఁడవై పతివ్రత యగు సీతను గొప్పునఁ బట్టితివి. పాపాత్ముఁడ వగు నీజన్మము మంటఁగలియనా! ఓరీ క్రూరుఁడా! ఓరీ హీనుఁడా! ఓరీ చెడునడవడిగలవాడా! ఓరీ! యల్పుఁడా! ఓరీ దుష్పరాక్రముఁడా! ఓరీ దయమాలినవాఁడా! యిట్టి పని యధముఁడు గదా సేయును? నిర్దయుఁడా! నీకు నెన రన్నమాట యించుకేనియు లే నట్లున్నది. ఓరీ యధమా! సీతాదేవి యిల్లువాఁకిలి విడిచి రాజ్యముఁ బాసి యరణ్యమునకు వచ్చినట్టిది. భర్తను సైత మెడఁబాసినది. ఇట్టి యాదేవిని నీవు చంపఁబూనితివే! ఈమె నీ కొన రించిన యపకారమేమి? నీవు సీతను జంపి బహుకాలము జీవింపవు. ఈ పని యొనరించిన తర్వాత వధింప యోగ్యుఁడ వైన నీవు నాచేతి నుండి తప్పించుకొని యెక్కడికిఁ బోవుదువు? ఓరీ లోకవధ్యుఁడా! నీవీ సీతను సంహరించి, తర్వాత స్త్రీహత్య సేసినవా రొందెడి నరకలోక మునకుఁ దప్పక పోవఁగలవు." అని పల్కుచు హనుమంతుఁడు వృక్ష శిలాయుధు లైన పెక్కండ్రు వానరులచేఁ బరివేష్టితుఁడై కట్టలుక గదుర నా యింద్రజిత్తుమీఁది కుఱికెను. వడిగా వచ్చెడి యా వానర సైన్యము నెక్కువ వడి గల యా రాక్షససైన్యము నివారించెను.

ఇంద్రజిత్తు వేయి బాణము లేసి యా వానరసేనను గలంచి, వానరశ్రేష్ఠుఁ డయిన హనుమంతునిఁ గాంచి "ఓవానరా! నీవును రామ సుగ్రీవులును నెవతెనిమిత్త మిచ్చటికి వచ్చితిరో, ఆవైదేహి నిప్పుడు నీ యెదుటనే నఱకెదను జూడుము. ఈమెను నఱకిన తర్వాత నోరి వానరా! రామలక్ష్మణులను, నిన్నును, సుగ్రీవుని, భ్రాతృద్రోహియైన

యా విభీషణునిని వధించెదను. ఓరీ కోఁతీ! స్త్రీహత్య పాతక మనియు, స్త్రీలను వధింపరా దనియుఁ జెప్పితివి గదా. ఏది పగతురకు హాని చేయునదై యున్నదో, ఆకార్య మెట్టి దయ్యుఁ దప్పక చేయఁదగినదియ." అని పలికి, రోదనము చేయుచుండు మాయాసీతను వాఁడి యంచు గల కత్తితోఁ దానే నఱకెను. గొప్పపిఱుఁదులు గలదియు చూడ్కి కిం పయినదియు దీనయు నైన యా సీత యజ్ఞోపవీతమువలె నఱుకఁ బడినదై పుడమినిఁ గూలెను.

ఇంద్రజిత్తు మైథిలి నట్లు వధించి, హనుమంతు నుద్దేశించి, "ఓరి వానరా! రామపత్ని యగు సీతను నఱికితి నిదిగో చూడుము. ఇది రూపు మాసెను. మీపడినపాటు వమ్మయ్యె" అని పలికి, యుప్పొంగి యరద మెక్కి వికృతముగా గొప్ప సింహనాదమును గావించెను. ఇంద్రజిత్తుఁ జేరి, నోఱు తెఱచి యార్వఁగా, చేరువ నున్న వానరవీరు లంద ఱాయింద్రజిత్తుయొక్క యార్పును విసిరి. చెడుబుద్ధి గల యా యింద్రజిత్తు యట్లు మాయాసీతను సంహరించి, డెందమున నుప్పొంగిన వాఁ డయ్యెను. వానరు లంద ఱట్లు సంతసముతోఁ గూడియున్న రావణిని గాంచి మిక్కిలి విషాదము నొంది వేగ మే పరుగెత్తిరి.

82-వ సర్గము

ఇంద్రజిత్తు నికుంభిలాహోమంబు సేయఁబోవుట

పిడుగుంబోలునట్టి యతి భయంకర మైన యా యింద్రజిత్తు యొక్క యార్పును విని, వానరవీరు లందఱు దిక్కులు సూచుచు మూలమూలకుఁ బరుగెత్తిరి. అట్లు మోమునఁ గళ లేక, ధైర్యం బేది, దిగులుచేఁ జెదరి చెదరి మిక్కిలిగఁ బరుగులెత్తుచుండు నా వానరులను గాంచి, వాయుపుత్రుఁ డగు హనుమంతుఁ డి ట్లనియె. ఓ వానరవీరు లారా! మీరు పోరున మిక్కువ మాని యేల యిట్లు పరుగెత్తుచున్నారు? మీ మగఁటిమి యెటఁ బోయె? నేను ముందు నడిచెదను. మీరు నా వెంబడి రండు. గొప్ప కులమునఁ బుట్టినశూరు లిత్తెఱఁగున మఱలి పోవుట యుక్తము గాదు." అని హనుమంతుఁడు చెప్పి యెక్కువ రోషోత్సాహములు కల్గింపఁగా, వానరవీరులు డెందములం దెక్కువ మోదమందినవారలై, పర్వతశిఖరములను వృక్షములను గైకొని

రాక్షస సైన్యమువైపు దిరిగి ఱొప్పుచు, రాక్షసుల మీఁదికి గుప్పించుచు గొప్పపోరు సేయుటకై హనుమంతునిఁ జుట్టుకొని వెంబడించిపోయిరి. అట్లు హనుమానుఁడు నలుదెసలను వానరవీరసేనాపరివేష్టితుఁడై ప్రలయకాల యమునింబోలెను, జ్వాలలతోఁ గూడిన యగ్నిహోత్రునిమాడ్కియు శత్రుసేనలను దహించుచు గొప్పయుద్ధము గావించెను. సీత నశిల్లె ననెడి భ్రమవలని శోకమొక్కవైపునను, ఇంద్రజిత్తిట్లు చేసె నన్న కోప మొక్కనైపునను పెనఁగులాడుచుండఁగా హనుమ గొప్పబండ నొక్కదాని నా యింద్రజిత్తు రథముపై నేసెను. ఆ వచ్చు గొప్పబండను జూచి, సారథి వెంటనే చక్కఁగాఁ దీర్చిన గుఱ్ఱములను వెనుకకు లాగి రథమును జాల దవ్వునకు గొంపోయి నిలిపెను. కావున హనుమంతుఁ డేసిన యా మహాశిల రథమునఁ గూర్చుండియున్న యా యింద్రజిత్తుమీఁదఁ గాని నతని సారథిమీఁదఁగాని పడక పుడమిపైఁ బడి వ్యర్థముగాఁ బ్రయోగింపఁబడి పుడమిలోపలఁ జొచ్చెను. ఆ మహాశిల యింద్రజిత్తునకును నతని సారథికిని దగుల లేదు గాని, తక్కిన రాక్షసులమీఁదఁ బడినందున ననేకులు క్రిందఁబడి నలిగి మృతులైరి. కొందఱు చేతులు గాళ్లు విఱుగుటచేఁ గడు బాధల నొందిరి. హనుమంతుఁ డిట్లు వేడ్కతో యుద్ధము చేయుచుఁ బోవుచుండఁగా, పెక్కండ్రు వానరులు గుంపులు గుంపులుగాఁ గూడి యార్భాటములు గావించుచు నడచిపోవుచు నెక్కువ మగఁటిమియు బలిమియుఁ దేటపడఁ దామును ద్రుమపర్వతాగ్రములను రావణి తత్సైన్యములపై వేయుచుఁ బలుతెఱఁగుల నార్పులు గావించుచు శత్రువులతోడ యుద్ధము సేసిరి. ఎక్కువ వీర్యముగల వానరవీరులచే వృక్షపర్వతాగ్రములతోఁ బరాక్రమము మీఱఁ గొట్టఁబడిన, వెఱపుఁదోఁచు రూపముగల నిశాచరులు యుద్ధాంగణమునందుఁ బడి పొఱలుచుండిరి. తన సైన్య మిట్లు వానరసేనచే నొంపఁబడుట చూచి, యింద్రజిత్తెక్కువ కోపము నొంది, యాయుధములను గైకొని శత్రువుల నెదుర్కొనెను. పెక్కు తడవలు దన పరాక్రమము చూపియున్న యయ్యింద్రజిత్తు సేనతోఁ గూడినవాఁడై, వానరసేనమీఁదికిఁ గవిసి, పెక్కు బాణములను

బ్రయోగించి, పెక్కండ్రు వానరవీరులను నొంచెను. ఆతని యనుచరులును శూలకూటముద్గరపట్టిసఖడ్గాశనులను గైకొని, తమబలిమి వెలుఁగ వానరవీరులను బాగుగా మోదిరి.

మహాబలుఁ డగు హనుమంతుఁడును గొప్ప బోదెలును గొమ్మలును గలవగు మ్రాఁకులతోను జాలతోను గొట్టి భీకరపరాక్రమము గల యా రాక్షసవీరులతో గొప్ప పోరొనరించెఁగాని, తనకును సాధ్యము గా దని తోఁచుటచే వానర వీరుల నందఱిని నివారించి, "వానరవీరులారా! మీరు మఱలుఁడు, మన కీ రాక్షససేన సాధింపఁ దగినదిగాదు. మన ప్రాణములమీఁది యాసనైనను మాని, తలక్రిందుగఁ బడుచు లేచుచు రాముని యిష్టము నెరవేర్చు కోరికతో నెవతె నిమిత్తము రక్కసులతో యుద్ధము సేసితిమో, యా సీతాదేవి మడిసెను. ఇఁక మన మారక యుద్ధముసేసి యుపయోగ మేమి? కావున మన మీ వృత్తాంతము రామునకును సుగ్రీవునకును నెఱిఁగించి, వా రేమి యుపాయము సెప్పుదురో యది చేయుదము" అని వానరసేనతోఁ జెప్పి, వారి నందఱిని మఱలించుకొని భయములేనివాఁడయి మెల్ల మెల్లగా సేనాసమేతుఁ డయి రాముని సమీపమునకు మగిడి చనెను.

చెడ్డమనస్సు గలవాఁ డయిన యా రావణాత్మజుఁడు హోమము గావించుటకై చైత్యమం దున్న నికుంభిలా నామక దేవాలయమునకుఁ బోయెను. అట్లు పోయి యింద్రజిత్తు నికుంభిలను జేరి, యగ్నిహోత్రునందు యథావిధిగా హోమంబు గావించెను. ఇంద్రజిత్తు యజ్ఞభూమి యందు శాస్త్రవిధిప్రకారమున మాంసశోణితములను వేల్వఁగా, నయ్యగ్నిహోత్రుఁ డా రక్తమాంసములను భుజించి, మిక్కిలి వెలిఁగెను. అగ్నిహోత్రుఁడు రక్తమాంసములచేఁ దనవినొందినవాఁడై జ్వలించుచు నోర్వరాని వేఁడిమి గలిగి, సాయంకాలమందలి సూర్యునిమాడ్కిఁ దేజరిల్లెను. అట్లు శాస్త్రోక్తవిధానముల నెఱిఁగిన యా యింద్రజిత్తు రాక్షసుల క్షేమమునకై శాస్త్రప్రకారముగా నగ్నిని వేల్చెను. అచ్చట నున్న రాక్షసులలో విధినిషేధముల నెఱిఁగిన కొంద ఱా హోమకర్మములందు లోపములు గలుగ నీక చూచుచుండిరి.

83-వ సర్గము

వాస్తవసీతావధభ్రమచే విలపించు రాముని లక్ష్మణుఁ డోదార్చుట

శ్రీరాముఁడును విస్తారమైన యా రాక్షసవానరుల యుద్ధకోలాహలము విని జాంబవంతు నుద్దేశించి, "నాయనా! హనుమంతుఁడు చేయ నలవి కాని యుద్ధకార్యము చేయుచున్నట్లున్నది. భీకర మయిన కడు గొప్ప యాయుధధ్వని వినవచ్చుచున్నదిగదా. ఎలుఁగుబంటుల తేఁడా! నీవును సేనాసమన్వితుండవై వేగ యేఁగి, యుద్ధ మొనర్చుచుండు నా హనుమంతునికి సాహాయ్య మొనరింపుము." అని యానతిచ్చెను. జాంబవంతుఁడును రాము నానతిం గొని, తన సైన్యమును దోడ్కొని వానరవీరుఁ డయిన హనుమంతుఁ డున్న పడమటిద్వారము వైపునకుఁ బోయెను. అట్లు పోవుచు, పోరు సేసి, యలంత చెంది నిట్టూర్పులు విడుచుచున్న వానరులచేఁ జుట్టఁబడియే తెంచుచున్న హనుమంతునిఁ గాంచెను. హనుమంతుఁడును దనకు సాహ్యము చేయవచ్చుచున్న నల్లని మబ్బుఁబోలు భయంకర మైన ఋక్షసైన్యమును మఱలించుకొని, వడిగా రామునికడ కేతెంచి, వ్యసనముతోఁ గూడినవాఁడై "రాఘవా! మేము యుద్ధము సేయుచుండునప్పుడే, యింద్రజి త్తేడ్చుచున్న సీతాదేవిని మా యెదుటనే వధించెను. ఓ శత్రుసంహారీ, నే నది చూచి, డెందమున నెమ్మది దప్పి, విచారముతోఁ గూడిన వాఁడ నయి తమ కీ సంగతి విన్నవింప నేతెంచితిని" అని రామునితో విన్నవించెను.

రాఘవుఁడు నా హనుమంతునిమాట విని, శోకపరవశుఁడై మొదలు నఱికినచెట్టుకైవడిఁ బుడమిం బడెను. దేవతాసమానుఁ డగు రాఘవుఁ డవ్విధమున నేలమీఁదఁ గూలుట గాంచి, వానరవీరు లందఱు నలుదెసలనుండి గంతులు వైచుచుఁ బరుగెత్తివచ్చి తామరపువ్వులయు నల్లఁగలువలయుఁ దావితోఁ గూడిన యుదకములతో మిక్కిలి యెఱియుచున్నందున దాపునఁ జేరరానివాఁడై, యెత్తుజ్వాలలు గల యగ్నిహోత్రునికైవడి వెలుఁగుచున్న రాముని దడిపిరి.

అప్పుడు లక్ష్మణుఁడు గడు నగచినవాఁడై నెమ్మది దప్పియున్న రామునిఁ జేతులతో గ్రుచ్చియెత్తి, కేవల యుక్తియుక్తమయిన యర్థము గలమాటల ని ట్లని చెప్పఁ దొడఁగెను.

ఓ పూజ్యుఁడా! నీవు పితృవాక్యపరిపాలనాదిరూప మయిన సన్మార్గమున నుండి, చేతికి వచ్చిన రాజ్యమును పోఁగొట్టిన కైకేయీ దశరథులపై నైనను మనమున నీసుఁజెందమిచే నింద్రియముల నెల్ల జయించినవాఁడవై యున్నను ధర్మము నిన్ను వ్యసనము లొందకుండఁ జేయఁజాలకున్నది. కావున ధర్మము మేలే చేయునది యని చెప్ప వలను కాదు. అది కుందేటికొమ్ముపలె వ్యవహారమాత్రసిద్ధమే కాని, ప్రామాణికమైనది కాదు. అట్లె అధర్మమును రావణుని కేమియుఁ జెఱుపు చేయమిచే నది నిరర్థకమై మేలుచేయనిది యని చెప్పను వీలు గాదు.

ఓ యన్నా! వాస్తవము లయిన స్థావర జంగమాత్మక పదార్థములు మన కంటికిఁ గనఁబడుచునే యున్నవి. ధర్మము గాని, యధర్మము గాని యుండునవియైనచో నవి స్థావరములు గానో, లేక, జంగమములు గానో కంటికిఁ గనఁబడవలెను. అట్లవి కానఁబడమిచే నేనవి లేని వనియే తలఁచెదను. ధర్మము ప్రత్యక్షముగానే యుండు నేని, నీయట్టి ధార్మికుఁడు విపత్తు నొందఁగూడదు. రావణునికి మేలును గలుగక యుండును. అట్టి దేదియు లేదు గనుక, ధర్మ మనునది లేదనియె తలఁపవలయును.

స్థావర మెట్లు కనఁబడుచున్నదో, యట్లె జంగమమును బ్రత్యక్షముగాఁ గన్పట్టుచున్నది. ఈ ధర్మ మట్లు ప్రత్యక్షముగాఁ గన్పట్టదు. పోనిమ్ము. ప్రత్యక్షము గాకున్న మాత్రముననే ధర్మము లే దనుట సరిగాదు. ఇంద్రియగోచరము గాని వస్తు వుండ లేదా యనిన, అట్లు చెప్పను వలను పడదు. ఏల యనిన, ఇంద్రియ గోచరము గానిదిగానైనను ధర్మ మనునది యున్నయెడల, నీ బోటియతఁ డాపదఁ బొరయకుండును. ఇప్పు డట్టిది లేదు. కావున ధర్మ మనునదియే లేదు.

అధర్మ మనునది వాస్తవముగా నుండునేని, అధర్మపరుఁ డయిన రావణుఁడు నరకమును బొందియుండును. ధర్మపరుఁడ వైన నీవు వ్యసనము నొందకయే యుండవలయును. అట్లు ధర్మాధర్మములు వ్యసనావ్యసనములచేతనే యూహింపవలయు. ఇప్పు డట్లు సంభవింప లేదు. ధార్మికుఁడ వను నభిమానము గల నీకు వ్యసనము ప్రాప్తించుటచేతను, అధార్మికుఁ డని యెంచఁబడు రావణునికి వ్యసనము దొడరమిచేతను

సాధ్యవత్పక్షమునకు గారణము లేమివలన ధర్మాధర్మములు లే వనియె నేను దలఁచెదను.

అధర్మిష్ఠుఁ డైన రావణునికి వ్యసనము గలుగక సుఖము గలుగు చున్నది. ధర్మిష్ఠుఁడ వైన నీకు వ్యసనమె కలుగుచున్నది. కావున ధర్మ మధర్మ ఫలప్రదముగను, అధర్మము ధర్మఫలప్రదముగ నగుచున్నది. కావున ధర్మాధర్మములు రెండును శాస్త్రవిరుద్ధము లైన ఫలము లొసఁగు నవియై యున్నవి.

ఆర్యా! ధర్మముచే ధర్మఫలమును, అధర్మముచే నధర్మఫలమును నరుఁడు పొందు నని తలఁచెదవా? అధర్మపరు లగు వారి కధర్మఫలమే కలుగు నేనియు, ధర్మిష్ఠు లగువారికి ధర్మఫలమే కలుగు నేనియు, ధర్మిష్ఠు లగువారికి ధర్మఫలము గలుగు ననియు, అధర్మిష్ఠుల కధర్మఫలము గలుగు ననియుఁ జెప్పవచ్చును. అట్లు గాక, అధర్మ మెవరికడ నెలకొని యున్నదో, వారికే కలిమి మెండగుచున్నది. ధర్మమునే కొన్నవారు గలిమి తఱిగి, యిడుములు పడుచున్నారు. కావున ధర్మాధర్మములు నియత ఫలము లొసఁగునవి కావు.

రాఘవా! పాపాత్ములు తా మొనర్చిన పాపకర్మరూపమైన యధ ర్మముచేఁ బీడింపఁబడువా రైనయెడల, కర్మసామాన్యము క్షణికము గనుక వధకర్మ స్వరూపమైన యధర్మమును మూఁడు క్షణములలోపల నష్ట మాయెను. అట్టి యధర్మ మెవ్వని నేమి చేయఁజాలును? కర్మము క్షణ ధ్వంసియైనను, ఆ కర్తారాధితమైన దేవతయే ఫలము నొసఁగునది యని చెప్పఁగూడదా యనిన, దైవ ప్రేరణముచేతనే యీ మానవుఁడు బాధితుఁ డగుచున్నాఁడు. దైవ ప్రేరణముచేతనే యీ మానవుఁడు మఱొక్కనిని బాధించుచున్నాఁ డనిన, ఆ పాపఫలమైన వ్యసనమును, మానవునిచే నట్టి పాప కృత్యముఁ జేయించిన దైవమొందునుగాని, చేయుచున్నపనిఁ జేసిన మానవుఁడు పొందఁజాలఁడు.

ఓ శత్రుసంహారీ! ప్రత్యక్షఫలము లేనిదియుఁ దానును బ్రత్య క్షముగానిదియు నసత్తయినదియు నైన ధర్మమూలమున నెక్కువ మే లెట్లు పొంద నగును? ధర్మమునకు స్వరూపము లేదు. అది యసత్తుగాను నున్నది. అట్టి ధర్మము నవలంబించినయెడల నెట్లు మే లొందఁగూడును.

సజ్జనోత్తమా! ధర్మ మనెడి వస్తు వొక్కటి యుండునది వాస్తవమే యేని, ధార్మికుఁడ వయిన నీకుఁ గీడు గలుగకయే యుండును. ధార్మికుఁడ వయిన నీకిట్టి యోర్వరాని వ్యసనము సంప్రాప్త మయ్యెఁ గావున ధర్మ మసత్తే యగుచున్నది.

బలహీనమును, కావుననే భయపడునదియునైన ధర్మము కార్యసిద్ధి విషయమునఁ బౌరుషమును గోరుచున్నది. కనుక, బలిమి లేనిదియు, హితమే యెల్లప్పు డొనరించునది యను నియమము లేనిదియునైన ధర్మము నవలంబింప రాదనునదియే నా యభిమతము.

బలమునకు ధర్మ మంగము గా నుండునేని, నీవు ధర్మమును వదలి ధర్మము నం దిప్పుడు బుద్ధియుంచియుండునట్లు బలసాధ్యమైన పరాక్రమమున బుద్ధి యుంచుము.

శత్రుతాపనా! సత్యము నడపుటయే ధర్మముగాదా యనిన, సకల ప్రజల సమక్షమున రామునికిఁ బట్టాభిషేకము సేసెద నని మొదటఁ జెప్పి పదపడి నీయెడ కరుణమాలినవాఁ డయి నిన్నడవులకుఁ బంపి యసత్యదోషమునకుఁ బాలయిన తండ్రి నేల బంధింపవైతివి?

ఓ పూజ్యుఁడా! ధర్మ మే యనుష్ఠేయ మని నియమ మున్నయెడల, అప్పుడు వజ్రాయుధధారి యగు దేవేంద్రుఁడు విశ్వరూపమునినిఁ జంపి యాగము చేసియుండఁడుగదా! విశ్వరూపునిఁ జంపకయె యాగము చేసియుండును. అధర్మ మే యాచరింపవలసిన దని నియమ మున్నయెడల, వేల్పులఱేఁడు విశ్వరూపునిఁ జంపి యాగము చేసియుండఁడు. విశ్వరూపునిమాత్రము చంపునుగాని, యాగముచేయఁడు. క్షత్రధర్మనిష్ఠుఁడయిన దేవేంద్రుఁ డిట్టి ధర్మాధర్మరూపకార్యము నొనరించుటచే క్షత్రియుఁడు సమయోచితముగా రెంటిని జేయవలయును.

రాఘవా! ధర్మమును, అధర్మమును నియతములుగా ననుష్ఠింపఁబడునేని, యవి కర్తకుఁ జేటు దెచ్చును. కావున మానవుఁడు ధర్మాధర్మములను రెండింటిని సమయానుసారముగాఁ జేయవలయును.

ఓ రాఘవా! యివ్విధమున నిష్టానుసారముగా ధర్మాధర్మములనుష్ఠించుటయే యుక్తమని నామతము. ధర్మ మే యాచరింపవలయు నని

యెంచిన నీవు రాజ్యము విడిచిపెట్టుటచే నట్టి ధర్మమునకు మూలమైనది యర్థ మని యెఱుఁగక దానిఁ జెఱుపుకొంటివి.

అర్థము ధర్మమూల మెట్లనిన, నృపాలుఁడు జనులవద్దనుండి పన్నుగాఁగైకొని వృద్ధి నొందించిన యర్థములవలననే పర్వతమునుండి నదులు వెడలునట్లు సకల కార్యములు నడచుచున్నవి. వేసవిని నల్పజల ములు గల నదు లెండునట్లు, అర్థహీనుఁ డయి, వీర్యములేని పురుషు నకు సకలకార్యములు చెడిపోవుచున్నవి.

అర్థ పరిత్యాగముచే ధర్మహాని యగుటయేకాక, దోషములును గలుగును. ఏల యనిన, ఆదినుండి సుఖముతో వర్ధిల్లిన మానవుఁడు సుఖ సాధనమైన యర్థముఁ బరిత్యజించి, మఱల సుఖమును గోరి, సుఖమునకుఁ గారణ మయిన ధనసంపాదనమునకై చౌర్యము మున్నగు పాపము లొన రించుచున్నాఁడు, కావున నతఁడు పాపమును బొందుచున్నాఁడు. ఎవ నికిఁ గలిమియున్నదో ఆతనికే చెలికాం డ్రుందురు. ఏ వానికి సంపద యున్నదో, వానికిఁ బలువురు చుట్టము లుందురు. ఏ వానికి ధనమున్నదో, వాఁడే పురుషుఁడు. ఎవనికి ధన మున్నదో, ఆతఁడే పండితుఁడు. ఎవ నికిఁ గలిమియున్నదో, ఆతఁడే మొనగాఁడు. ఎవనికి సంపదయున్నదో, ఆతఁడే బుద్ధిమంతుఁడు, ఎవనికిఁ గలిమియున్నదో, వాఁడే యెక్కువ భాగ్యము గలవాఁడు. ఎవనికిఁ గలిమియున్నదో వాఁడే గొప్పగుణములు గలవాఁడు. అర్థ పరిత్యాగవిషయమున నీ వే తలంపుగొంటివో కాని, యా యర్థపరిత్యాగమున నిన్ని దోషములు చెప్పితిని. ఎవనికిఁ గలిమి యున్నదో, ఆతనికే ధర్మార్థ కామములును గలవు. వానికే యన్ని కార్య ములు ననుకూలించుచున్నవి. ధనము లేక వట్టి కోర్కెలు కోరుటచే మేలు వడయుటకు వలనుగాదు. నరాధిపా! హర్షము, కామము, దర్పము, క్రోధము, ధర్మము, శమదమములును నర్థమువలననే కలుగుచున్నవి.

ఎవ్వరు తమ కెదుట నున్న ధనములను గాలితోఁ ద్రోసి కేవల ధర్మమునే యాచరించుచున్నారో, వారి కిహలోకసుఖములు లేవు. మేఘాచ్ఛాదిత దినములందు సూర్యచంద్రాదిగ్రహములు గనఁబడని యట్లు నీయెడ నట్టి సర్వసుఖానుభవమునకు మూలము లయిన యర్థ ములు కానిపింపవు. అర్థమున కాధారమైన రాజ్యము విడనాడుటచేతను,

పితృవాక్య పరిపాలనరూపమైన ధర్మ మొక్కటే యవలంబించుటచేతను సంభవించినదోషమే యనిన, నీవు తండ్రిమాటను నడపఁ దలఁచి, వనములకు రాఁగా ప్రాణములకంటెఁ బ్రియురాలగు నీ భార్యను రాక్షసుఁడెత్తికొనిపోయె. ఇప్పుడు చేయవలసిన దేమి యనిన, శూరుఁడా! యింద్రజిత్తు గలిగించిన సీతావధరూపమయిన విస్తారశోకమును బ్రతిక్రియచేఁ బోఁగొట్టెదను. కావున రాఘవా! లెమ్ము. నిడుదచేతులవాఁడా! గట్టి నియమముతోఁ గూడిన రాజశ్రేష్ఠుఁడా! నీవు మహాత్ముఁడగు పరమాత్మవని యెఱుఁగవా? నీవు పరమాత్మవు గనుక శోకము నొందుటకుఁ గారణము లేదు. ఓ యనఘా! నేను జానకీవధము విని యాగ్రహముతో నింతదవ్వు చెప్పితిని కాని వేఱుకాదు. నేను నీ ప్రియావధ ప్రతీకారమునిమిత్తమై బాణము లేసి లంకాపురము రావణునితోను వాని చతురంగబలముతోను నడుగంట ధ్వంసముచేసెదను" అని లక్ష్మణుఁడు రామునితోఁ జెప్పెను.

84-వ సర్గము

విభీషణుఁడు ఇంద్రజిద్వధోపాయంబు సెప్పుట

భ్రాతృవాత్సల్యంబు గల లక్ష్మణుఁడు రాము నిట్టు లూఱడించుచుండఁగా విభీషణుఁడు సేనలను దమ తమ తావులందు నిలిపి కాటుక కొండల గుమింబోలు నేనుఁగులతోఁ గూడిన యేనుఁగుల మేటికైవడి సకలాయుధధారులు శూరులు నగు నల్వురు మంత్రులతోఁ గూడినవాఁడై రాముఁ డున్న చోటి కేతెంచెను. మహాబుద్ధిశాలి యగు విభీషణుఁడు రామలక్ష్మణులసన్నిధికి వచ్చి, దుఃఖపరవశుఁడై యున్న రాముని, కన్నీటిచే చెదరిన చూపుగల వానరులను జూచి, మఱింత దగ్గఱకువచ్చి, మూర్ఛ చెందినవాఁడై లక్ష్మణుని తొడమీఁదఁ బరుండియున్న మహాత్ముఁ డగు నిక్ష్వాకుకులనాథుఁ డయిన రాఘవుని బాగుగాఁ జూచెను. అట్లు లజ్జ గొనినవాఁడై దుఃఖముచే తరించుచున్న రామునిఁ గాంచి విభీషణుఁడు హృదయమున దుఃఖించుచు మోమున విన్నదనముదోప నిది యే మని వారి నడిగెను.

లక్ష్మణుఁడు విభీషణుని మోమును, సుగ్రీవుఁడు మొదలగు వానరులను గాంచి, కన్నీరుగార సంక్షిప్త మయిన యొక మాటఁ జెప్పెను.

"సాధువా! యింద్రజిత్తు సమరమున సీతను దెచ్చి చంపె నని హనుమంతుఁడు వచ్చి చెప్పఁగా, రాముఁడు విని వెంటనే మోహము నొందెను" అని లక్ష్మణుఁ డీమాట, చెప్పుచుండు నపుడే విభీషణుఁ డతని నివారించి, "నరేంద్రా! హనుమంతుఁడు మీకుఁ జెప్పిన సంగతి వాస్తవము గా దని తలఁచెదను. సముద్ర శోషణ మెట్లు సాధ్యపడని కార్యమో యట్లు సీతా వధమును సాధ్య మయిన కార్యము గాదు. మహాబాహుఁడా! సీతా దేవి విషయమున దురాత్ముఁ డగు రావణునికిఁ గల తలంపు నే నెఱుఁగుదును. కావున నతఁ డామెను వధింపఁదలఁపఁడు. నేను మేలు సేయఁ గోరి, "వైదేహిని వదలిపెట్టుము" అని పెక్కు తెఱఁగుల నడుగుకొన్నను, రావణుఁ డాపని కొప్పఁ డయ్యె. ఆ దేవిని సామోపాయముచే గాని దానముచేఁగాని, భేదముచేఁగాని ఇఁక నే యితరోపాయములచేఁ గాని నామెను చూచుటకైనను వలనుగాదు.

ఆ యింద్రజిత్తు వానరుల నందఱను వేసి, నికుంభిలకేఁగి, యచ్చట నగ్నిహోత్రమున హోమము వేల్వఁబోవుచున్నాఁడు. రావణాత్మజుఁ డచ్చట హుతభుజుని హోమంబులచేఁ దనివి నొందించి యావల సమరమునకు వచ్చె నేని, వానిని జయింప నింద్రాదిదేవతల కైనను వీలుగాదు. నికుంభిలయందుఁ దాను గావించుచున్న హోమమునకు వానరులవలన విఘ్నము గలుగకుండుటకయి వారిని దుఃఖపరవశులఁ జేయుటకయి యతఁ డీ మాయను బ్రయోగించెను. దీని కే సంశయమును లేదు. ఆ యజ్ఞము పరిసమాప్తి నొందక మున్నె యచ్చటికి సేనలతోడఁ బోవుదము. ఓ పురుషశ్రేష్ఠా! భ్రమమూలక మయిన యీ వంతను మానుము. శోకముచేఁ బరితపించుచున్న నిన్నుఁ గాంచి, యీ సైన్యమెల్లఁ దల్లడిల్లిబోవుచున్నది. నీవు నెమ్మది వడి ధైర్యముతో నిచ్చటనయుండుము. సైన్యాధిపుల మైన మాతోడ లక్ష్మణునిఁ బంపుము. ఈ నరవీరుఁడు వాఁడిమి గల యమ్ము లేసి యాతని నికుంభిలాహోమము పూర్తి కాకుండ ధ్వంసముచేయును. తర్వాత నతఁడు మట్టువెట్ట నర్హుం డగును. పక్షియీఁకలు గట్టుటచే వడిగాఁ బోవునట్టి యీతని వాఁడి యమ్ములు క్రూరములైన పక్షులవలె నయ్యింద్రజిత్తుయొక్క నెత్తుటిఁ గ్రోలఁగలవు. ఓ నిడుదచేతులవాఁడా! వజ్రాయుధధారి యయిన

యింద్రుఁడు వజ్రాయుధమును బంపినట్లు నీవును శుభలక్షణములు గల లక్ష్మణునిఁ బంపుము. ఓ నరేంద్రా! శత్రువధమునకై యిప్పుడు కాల యాపము సేయుట యుక్తము గాదు. కావున వేల్పు తేనికైవడి శత్రు వధమునకై లక్ష్మణుని కానతిమ్ము. నికుంభిలాహోమము పూర్ణము గావిం చిన పిమ్మట నయ్యింద్రజిత్తు వచ్చెనేని, వాఁడు దేవదానవులకైనను దృశ్యుఁడుగాఁడు. యజ్ఞసమాప్త్యనంతరమున వాఁడు యుద్ధమునకుఁ బూనె నేని, ఇంద్రాది దేవతలకైనను దమ జీవితము విషయమున సంది యము గలుగును. కావునఁ దడవు సేయక మాతోడ లక్ష్మణునిఁ బంపుము" అని విభీషణుఁడు రామునితోఁ బలికెను.

85-వ సర్గము

విభీషణుఁ డింద్రజిత్తుయొక్క పోవిడిఁ దెల్పుట

రాముఁడు విభీషణునిచేఁ జెప్పఁబడిన మాటను విని, శోకముచేఁ జిక్కినవాఁ డయినందున నతఁడు సెప్పిన విషయము చక్కఁగా నెఱుఁగని వాఁడై, దిటవు పూని, వానరుల సమక్షమునఁ గూర్చుండియున్న విభీ షణుం జూచి "ఓ రాక్షసాధిపా! విభీషణా! నీవు చెప్పినది మఱల వినఁ గోరెదను. దానినిఁ జక్కఁగాఁ జెప్పుము" అని యడిగెను.

మాటలలో నేర్పరి యగు విభీషణుఁడు రాఘవుని పలుకు లాల కించి, యతనితో ని ట్లనియె: "ఓ మహాబాహూ! సేనలను గుంపులు గుంపులుగాఁ జీలఁదీసి నిలుపు మని యానతిచ్చితివిగదా? ఓ శూరుఁడా! నీ మాట వచ్చినవెంటనే యదియంతయు నట్లే చేయఁబడెను. ఆ సేనలెల్ల వీడఁదీసి యంతట నిల్పి, వానికిఁ దగిన రీతినిఁ గాఁపరులను గూడ నేర్ప అచితిని. కీర్తిమంతుఁడా! మఱి నే నొక్కటి విన్నవించెద నాల కింపుము. నీవు నిష్కారణ శోకముచేఁ గుందియుండఁగా, మేమును డెంద మునఁ గుందుచున్నారము. నృపాలా! యీ లేని విచారమువలని దుఃఖమును వదలుము. శత్రువులకు సంతోషప్రదమైయున్న యీ చింతను బాయుము. శూరుఁడా! ప్రయత్నముపూని, యుత్సాహము నెఱపుము. రఘునందనా! సీతను బొందవలయు ననియు, రాక్షసులను సంహరింపవలయు ననియు నీ కభిప్రాయమున్నయెడ, నా హితవచనము నాలింపుము. ఇప్పుడు లక్ష్మణు నపారసైన్యముతో నయ్యింద్రజిత్తును

సంహరించుటకై నికుంభిలకు బంపుము. యుద్ధవీరుఁ డయిన లక్ష్మణుఁడు వలయాకారముగా వింటిని వంచి, సర్పములం బోలు బాణములను దానియందు సంధించియేసి యా యింద్రజిత్తును జంపును. ఆ శూరుఁడు బ్రహ్మనుగూర్చి తపం బొనర్చి వరమువలన బ్రహ్మశిర మనెడి యస్త్రమును, స్వేచ్ఛగాఁ బోయెడి గుఱ్ఱములను బడసెను. ఆతఁడు సేనలతోడ నికుంభిలకుఁ బోయియున్నాఁడు గదా. ఆతఁ డచ్చట యజ్ఞము పూర్తి గావించి యుద్ధమునకు వచ్చెనేని, మన మందఱము మడిసితి మని యెఱుఁగుము. తొల్లి యింద్రజిత్తు బ్రహ్మను గూర్చి తప మొనర్చినప్పుడు, బ్రహ్మదేవుఁడు ప్రత్యక్షమై, "నికుంభిలకుఁ బోక హోమము పూర్ణము గావింపక ముందుగా నాయుధధారి వయిన నీతో నే పగతుఁడు యుద్ధము గావించుచున్నాఁడో, వాఁడు నిన్ను వధించుచున్నాఁడు. కాని, నికుంభిలా హోమము గావించి వచ్చిన ని న్నెవ్వఁడు నేమి సేయఁజాలఁడు" అని వర మొసంగెను. కావున బలవంతుఁడా! యింద్రజిద్వధమునకై యాన తిమ్ము. ఆతఁడు మడిసె నేని, రావణుఁడు మిత్రులతోడ మడిసె నని యెఱుఁగుము."

రాఘవుఁడు విభీషణునిమాట విని, విభీషణుంగూర్చి "తిర మగు మగఁటిమి గల యో విభీషణా! ఆ క్రూరుని మాయను నే నెఱుఁగుదు, వాఁడో బ్రహ్మాస్త్రప్రయోగము నెఱిఁగినవాఁడు, విలువిద్య నేర్చినవాఁడు. జిత్తులమారి, బల్మికాఁడు, ఇంద్రవరుణాది దేవతలను గూడ సమరమున మోహితులం జేయఁగలఁడు. విస్తారయశుఁడా! వాఁడు రథము నెక్కి యంతరిక్షమున సంచరించునప్పుడు, మేఘము లాకాశమును గ్రమ్మినప్పుడు సూర్యునిగతి తెలియన ట్లతనిగతి తెలియఁజాలదు" అని విభీషణునితోఁ జెప్పి, యా దురాత్ముని మాయాబలము నెఱిఁగినవాఁడై పరాక్రమశాలి యని కీర్తి వహించిన లక్ష్మణునితో ని ట్లనియె: "లక్ష్మణా! సుగ్రీవుని సర్వసైన్యమును గూడఁ దీసికొని, హనుమంతుఁడు మున్నగు గుంపుకాఁపరులతోఁగూడి జాంబవంతుని, ఆతనిసేనను వెంటఁ గొని నికుంభిలకుఁ జని, మాయాబలవిశారదుఁ డయిన యింద్రజిత్తును సంహరింపుము. ఆ ప్రదేశము నెఱిఁగిన యీవిభీషణుఁడు తన మంత్రులతోడ నిన్ను వెంబడించి వచ్చును."

అని రాముఁడు చెప్పఁగాఁ మిగుల వెఱపుగొలుపు పరాక్రమము గల లక్ష్మణుఁడు విభీషణసమేతుఁ డయి మే లయినవింటిని దాల్చి, మైమఱువు దొడిగి, యుద్ధసన్నాహము చేయుచు, ఖడ్గబాణములను గైకొని రామునికి మ్రొక్కి యిట్లనెను: "రాఘవా! యిప్పుడు నా వింటి నుండి విడువఁబడిన బాణములు రావణ తనయునిఁ జీల్చి హంసలు తామర కొలఁకును జొచ్చునట్లులు లంకాపురములోపలఁ జొరఁగలవు. నా వింటి నారినుండి వెడలిన యమ్ము లా క్రూరునిశరీరమును భేదించి, యాతని వధింపఁగలవు" అని పలికి, శౌర్యలక్ష్మి విరాజమానుఁడై రావణివధముఁ గోరుచు నన్నకుఁ బ్రదక్షిణముగావించి ప్రణమిల్లి దీవనలఁ గొని యింద్రజిత్పాలితమైన చైత్యమందలి నికుంభిలకు వడిగాఁ బోయెను. హనుమంతుఁడు పెక్కుండ్రు వానరులతోఁ గూడియు, విభీషణుఁడు మంత్రులతోఁ గూడియు లక్ష్మణుని వెంబడించిరి. గొప్ప దగు వానరసైన్యము మిగులవడితోఁ దన్ను వెంబడింపఁగా, లక్ష్మణుఁడు తన వెంబడి వచ్చుటకై పయనమైయున్న యెలుఁగుఱేని సైన్యమును గాంచెను. అట్లు వానర ఋక్షసేనలు తన్ను వెంబడించిరాఁగా, చెలికాండ్రకు సంతసము గావించు లక్ష్మణుఁడు కడు దూరమేఁగి, దవ్వున గుంపులుగా నిల్చియున్న రాక్షసాధిపుని సైన్యమును గాంచెను. శత్రుసంహారి యగు ప్రతాపశాలియైన రఘునందనుఁ డా ప్రదేశము సేరి, బ్రహ్మదేవుని వరమువలన మాయయె బలముగాఁ గలిగియున్న య య్యింద్రజిత్తును జయించుటకై శూరులగు విభీషణాంగద హనుమంతులతోఁ గూడి యుండెను. నానావిధ శస్త్రములచేఁ బ్రకాశించునదియు, టెక్కెములచేఁ జొరరానిదియు, విశాలమైన గొప్ప రథములు గలదియు, శత్రువులకుఁ గడు వెఱపు పుట్టించునదియు, సాటిలేని వేగము గలదియు, చీఁకటిని బోలినదియు నైన శత్రుబలమును లక్ష్మణుఁడు ప్రవేశించెను.

86-వ సర్గము

ఇంద్రజిత్తు నికుంభిలాహోమము కాకముందే యుద్ధమునకు వచ్చుట

అప్పుడు విభీషణుఁడు శత్రువుల కహితమును, దమకు మేలొనరించునదియు నైన మాటఁ జెప్పెను. "లక్ష్మణా! మబ్బువలె నల్లనైన యే రాక్షససేన గనఁబడుచున్నదో, యా యీ సేనతోడ వానరులు

వృక్షపర్వతశిఖరములు గైకొని వడిగా యుద్ధము సేయుదురుగాక. లక్ష్మణా! వేగిరముగా నీ మహాసేనను భేదింప వలయు. ఈ సేన చెదరి పోయె నేని, యింద్రజిత్తు కనఁబడును. కావున శత్రువులపై వజ్ర తుల్యము లగు బాణము లేయుచు నా యింద్రజిత్తుయొక్క యజ్ఞము సమాప్తినొందక మున్నే లోపలఁ బ్రవేశించి, చెడు స్వభావము గల వాఁడును, మాయయే ముఖ్యముగాఁ గలవాఁడును, ధర్మము విడ నాడినవాఁడును, జనుల కందఱికి భయము గలిగించువాఁడును, క్రూర కర్మ లొనరించువాఁడును నైన యింద్రజిత్తును వధింపుము."

చక్కని లక్షణములుగల లక్ష్మణుఁడు విభీషణునిమాట విని రాక్ష సేంద్రునిసేనపైన బాణవర్షమును గ్రుమ్మఱించెను, వృక్షశైలములను నఖములను నాయుధములుగాఁ గల ఎలుఁగుబంట్లును వానరులును గుమి గూడి ధైర్యముతో నిల్చియున్న యా సైన్యముమీఁదికిఁ బరుగెత్తిరి. రాక్షసులును వానరసేనలను హింసింపఁగోరి, వాడిబాణములును, గదా శక్తితోమరములును గైకొని వానిపై గవిసిరి. అట్లు వానరరాక్షస సైన్య ము లొండొంటిఁ గదిసి, లంకాపురము నిండునట్లు సింహనాదములు సేయుచు భయంకర మైన యుద్ధము గావించిరి. వికృతముఖములును వికృతబాహువులుం గల రాక్షసులును, వానరవీరులును నానావిధాస్త్ర ములను, వాఁడి యమ్ములను, బర్వతశిఖర ద్రుమములను బైకెత్తి యాకా శమును గ్రమ్ముకొనఁజేయుచు, రాక్షసులు వానరులపైఁ గఱకుటమ్ముల నేసి మిక్కిలి యెక్కువ భయము గలిగించిరి. వానరవీరులును నానా విధ వృక్షములను, పర్వతశిఖరములను నేసి రాక్షసులను నొంచిరి. గొప్ప యొడళ్లును నెక్కువ బలిమియుఁ గల యెలుఁగుబంటులయు వాన రులయు ముఖ్యులు పర్వతశిఖరములు మున్నగు నాయుధములతో రాక్షసుల నొంపఁగా, వారికిఁ గడుభీతి గలిగెను. శత్రువులచే నలపఁ బడి, తనసేన మిగుల విషాదము నొందుట గాంచి, యజ్ఞంబు పూర్తి యగుటకు మున్నే శత్రువుల కసాధ్యుఁ డయిన యా యింద్రజిత్తు లేచి దట్టంపుఁ జెట్ల గుమినుండి వెడలి వచ్చి, మున్నె గుఱ్ఱములు పూన్చి యున్న రథమును రాక్షసులతోడ నెక్కెను. అయ్యింద్రజిత్తు పగతు రకు వెఱపు గలిగించు గొప్పవింటిని దాల్చి, నల్లని మేఘమువంటి మేని

డాలు గలవాఁడై, యలుక గదుర మోమును గన్నులు నెఱ్ఱగాఁ జేసి ప్రలయకాల యమునికైవడిఁ బ్రకాశించెను. రథారూఢుఁ డయిన ఇంద్రజిత్తును జూచిన వెంటనే యెక్కువ వడిగల రాక్షసవీరు లందఱు లక్ష్మణునితోడఁ గయ్యము సేయఁగోరినవారై సమరమునకు వెడలిరి. పర్వతసమానుఁ డయిన హనుమంతుఁ డప్పుడు శత్రువులచే నోర్వరాని యొక్క వృక్షము నెత్తి రాక్షససేనపైఁ బ్రయోగించి, ప్రలయకాలపుఁజిచ్చుకైవడి నా రాక్షససేనను మాడ్చుచు, మఱి పెక్కువృక్షముల నేసి, వారిని నిశ్చేష్టితులం గావించెను.

అవ్విధమున వడిగాఁ దమ్ము రూపుమాపుచుండు వాయునందనునిఁ జూచినవెంటనే పెక్కండ్రు రాక్షసులు పెక్కాయుధముల నా హనుమపై వెదఁజల్లిరి. తీక్ష్ణశూలధరులు శూలములతోఁ గొట్టిరి. ఖడ్గధారులు ఖడ్గముల నేసిరి. శక్తిధారులు శక్తులతో నడిచిరి. పట్టసధారులు పట్టసములతోఁ గొట్టిరి. ఇట్లే వాఁడిమి గల వగు పరిఘ చక్ర శతఘ్ని ముద్గర పరశ్వథ భిండివాలము లను నాయుధములను దాల్చిన శూరు లా యా యాయుధములతోఁ బర్వతమున కెన యగు నా హనుమంతునిఁ గొట్టిరి. కొందఱు వజ్రాయుధములవంటి పిడికిళ్లతోఁ బొడిచిరి. పిడుగుపాటుల వంటి యఱచేతులతో నప్పళించిరి. ఇట్లు రాక్షసులు చుట్టును జుట్టుకొని, యన్ని యాయుధములతోఁ దన్నుఁ గొట్టుచుండఁగా, హనుమంతుఁడు వాని నన్నింటిని లక్ష్యపెట్టక, వారి నందఱిని బాగుగాఁ దన్నెను. అట్లు రాక్షసులను రూపుమాపుచున్న శత్రుసంహారి యగు వాయునందనుని హనుమంతునిఁ గాంచి "సారథీ! యీ వానరుఁ డుండుచోటికి రథముఁ దోలుము. మన ముపేక్ష సేసిన నితఁడు రాక్షసుల నందఱిని రూపుమాపును. ఇఁక వీని నుపేక్ష సేయరాదు. వీఁ డుండుచోటికి రథముఁ బోని మ్మనఁగా, సారథియు శత్రువులచే నెంతయు నోర్వరాని యింద్రజిత్తు గూర్చుండియున్న యా రథమును హనుమంతుని కడకుఁ దోలుకొని పోయెను. శత్రువులకు లొంగనివాఁ డయిన యా రాక్షసాధిప పుత్రుఁడు హనుమంతుని సమీపించి, బాణ గదా పరశ్వథ పట్టిసము లను నాయుధము లను గైకొన్నవాఁడై, యింద్రజిత్తుయొక్క శిరమున వర్షించెను. ఆ మారుతియు నా యమ్ముల నన్నిటిని

గైకొని, యెక్కువరోషముతోఁ గూడినవాఁడై యింద్రజిత్తుతో ని ట్లనెను: "ఓరీ దురాత్ముఁడా! నీవు మొనగాఁడ వేని, నాతోడఁ బోరు సేయుము. పవన తనూజునియెదుటఁ బడి ప్రాణములతోఁ దప్పించుకొని పోవఁజాలవు. నీవు మల్లయుద్ధము సేయఁ గలవేని, నాతోడ ద్వంద్వ యుద్ధము సేయుము. ఓరి మూఢుఁడా! నాబలము నోర్చుకొనుము. పిమ్మట నీవు రాక్షసు లందఱిలోపల మొనఁగాఁడవు" అని వీరాలా పము లాడఁగా, హనుమంతునిఁ జంపఁగోరి యాయుధముఁ బైకెత్తుకొని వచ్చుచుండు నింద్రజిత్తును విభీషణుఁడు లక్ష్మణునకుఁ జూపి, "వాసవుని జయించినవాఁడును, రావణుని పుత్రుఁడు నైన యీ యింద్రజిత్తిదిగో రథం బెక్కి హనుమంతునిఁ జంపవచ్చుచున్నాఁడు. సౌమిత్రీ! పగతురఁ జీల్చుటయందు సాటిలేనివియు, పగతుర ప్రాణములఁ దీయునవి నైనందున భయంకరములైన బాణములతో నీ రావణాత్మజునిఁ జంపుము" అని చెప్పగా లక్ష్మణుఁడు పర్వతముఁ బోలువాఁడును, యుద్ధరంగమున దిట్ట తనముతో నిల్చినవాఁడును, శత్రువులకు భీతిగలిగించువాఁడు నై సింహ నాదము సేయుచున్న యింద్రజిత్తును గాంచెను.

87-వ సర్గము

ఇంద్రజిత్తు విభీషణు లొండొరులఁ దూఱుట

విభీషుఁ డిట్లు చెప్పి, డెందమున నుప్పొంగుచు, వింటిని జేతఁబట్టి యున్న లక్ష్మణుం దోడ్కొని కడువడిగాఁ గొంతద వ్వేఁగి, యొక్కగొప్ప వనము బ్రవేశించి, యాహోమంబు తావును, నల్లనిమబ్బుంబోలి, చూడ వెఱపు పుట్టించునదై యున్నయొక మఱ్ఱిచెట్టును లక్ష్మణునకుఁ జూపి, "సౌమిత్రీ! బలిమికాఁ డగు రావణ తనూజుఁ డిచ్చట భూతములకు బలి యొసఁగి యావల యుద్ధమునకు వెడలిరానున్నాఁడు. పిమ్మట యుద్ధరంగ మున నతఁ డెవరికంటికిఁ గనఁబడక, వాఁడిబాణములతో శత్రువులను గొట్టి, బంధించును. కావున బలిమికాఁ డగు రావణాత్మజుఁడు మఱ్ఱిచెట్టు క్రిందికిఁ బోకముందే వాఁడి బాణములతో నతనిని రథాశ్వసార థులతోఁ గూడ మడియింపుము" అనిచెప్పెను. మహా పరాక్రమ శాలియు, బలవంతుఁడును, చెలికాండ్రకు మోదము గలిగించు వాఁడును నైన లక్ష్మణుఁడు చిత్రమైన తన వింటినారిని సారించుచు నచ్చ

టనే జాగ్రత్తతో నుండెను. బలవంతుఁ డగు రావణాత్మజుఁడు కవచము దొడిగి, వింటింగొని, టెక్కెము నరదమునకుఁ గట్టినవాఁడై యగ్ని మాడ్కిఁ దేజరిల్లు నరదమున నెక్కి లక్ష్మణుని కంటికిఁ గనఁబడెను. తర్వాతఁ బ్రతాపవంతుఁ డగు లక్ష్మణుఁ డపరాజితుఁ డయిన యింద్ర జిత్తును గాంచి "ఓరీ! నేను నిన్ను యుద్ధమునకుఁ బిలుచుచున్నాను ర" మనెను.

ప్రతాపధైర్యశాలి యగు నింద్రజిత్తు లక్ష్మణుని వెనుక నిలఁబడి యున్న విభీషణునిఁగాంచి యతని నివ్విధమున నిష్ఠూరపు మాటలాడెను. "ఓరాక్షసా! నీ విచ్చటఁ బుట్టి పెరిగినవాఁడవు. సాక్షాత్తుగా నాతండ్రితోఁగూడఁ బుట్టినవాఁడవు నాకుఁ బినతండ్రివి. నీ కొడు కగు నా కెట్లు ద్రోహము నెంతువు? ఓ దుర్బుద్ధీ! ధర్మముఁ జెఱుపువాఁడా! బంధు త్వముగాని, చెలిమిగాని, జాత్యభిమానముగాని, తోఁబుట్టుదనము గాని, ధర్మముగాని నీకుఁ బాటింపుకా పోయెఁగదా. ఓరి దుర్బుద్ధీ! నీవు తనవారిని విడిచి పొరుగువారిని గొలువఁబోతివి కావున నిన్నుఁ గూర్చి బంధువులకు విచారము గలుగుచున్నది.నీవు సజ్జనుల నిందలకుఁ బాత్రుడ వైతివి. తనవారితోఁ గలిసిమెలసియుండుట యేడ ? అధమాశ్రయ మేడ? వీనిలో నేది గొప్పదియో యోచించిచూడుము. నీకు బుద్ధిలేదుగనుక, నీ వీ గొప్ప తారతమ్యమును గనిపెట్టఁజాల వైతివి. పరులు గుణవం తులుగానుండనీ. తనవారు నిర్గుణులుగానుండనీ. నిర్గుణు లయిన తనవారి నాశ్రయించుట మేలుకాని, పరుఁ డెప్పటికిని పరుఁడేకాని తనవాఁడు కానేరఁడు. ఎవ్వఁడు తనవారిని విడిచి యొరులను సేవించుచున్నాఁడో. వాఁడు తనవారు క్షీణింపఁగా నొరులచేతనే వధింపఁబడుచున్నాఁడుఁ ఓ రావణానుజా! ఓరి రాక్షసా! నీ విట్లు స్వజనమునందు ద్రోహబుద్ధి తలంచితివే యది నీ కెంతమాత్రము యుక్తము గాదు. నా హోమము నకు విఘ్నము సేయుటకై లక్ష్మణుని నిచ్చటికిఁ దెచ్చితివే. స్వజనుఁ డయిన నీవలె నా కిట్లు ద్రోహము సేయువాఁడు మఱొక్కఁడు లేఁడు."

అని యన్న కొడు కివ్విధమున నిందింపఁగా విభీషణుఁ డి ట్లనియె. "ఓరీ రాక్షసా! నా స్వభావ మెఱుఁగనివానియ ట్లేల యిట్లు వదరు చున్నావు. ఓరీ దుష్టుఁడ వయిన రాక్షసాధిపాత్మజా! నాయెడ గౌరవము

నుంచి పరుసవచనము లాడకుము. క్రూరపుఁ బనులు సేయు రాక్షసులవంశ మునఁ బుట్టినవాఁడ నయ్యు, మానుషగుణము కలవాఁడనే కాని, రాక్షసస్వభావము గలవాఁడం గాను. నాకుఁ గ్రూరకృత్యము రుచింపదు. ధర్మము దప్పి నడచుట నాకు సమ్మతము గాదు. నీవు న న్నిట్లు దూరితివే, చెడు నడత గల మాయన్న తమ్ముని నివ్విధమున వెడలఁ గొట్టఁ వచ్చునా? ధర్మము దప్పినవాఁడై, పాపకృత్యములఁ జేయఁ దలపెట్టు వానిని జేతికిఁ జుట్టుకొన్న పామునువలె విదలించుకొన్న మానవుఁడు సౌఖ్యము నొందుచున్నాఁడు. హింస, ఒరులసొమ్ము దొంగిలించుట, ఒరు నాలింగోరుట మొదలగు చెడ్డనడవడులు గలవానిని గాలుచున్న యింటిని వదలినట్లు వదలిపెట్టవలెను. పరద్రవ్యాపహరణము, పరదారాభిగమ నము, స్నేహితులం దెక్కువ సందేహము నను నీమూఁడును బురుషునికిఁ జేటు గలిగించునవి. మబ్బులు పర్వతములను గ్రమ్మునట్లు, మహర్షుల వధించుట, వేల్పులందఱితోడి పగ, అహంకారము, క్రోధము, విరోధము అను నీయాయుఃసంపదలకు క్షీణతను గలిగించు దుర్గుణములు నా యన్న యొక్క సుగుణముల నన్నిటిని గప్పినవి. నీ తండ్రియు, నా యన్నయు నైన రావణునికడ నీ ముందుచెప్పిన దుర్గుణము లున్నందున నే నతనిని వదలిపెట్టితిని. ఈ లంకాపుర ముండదు. అహంకారివి, బాలుఁడవు, వినయహీనుఁడవు నైన నీవును, నీ తండ్రియు నుండరు. నీవిప్పుడు యమ పాశముచేఁ గట్టఁబడితివి. నీ వేమి న న్నాడఁగోరెదవో యది యెల్ల నాడుము. నీకిప్పుడు చింత దొడరినది. నీ వింక న న్నేమి యనఁగలవు. రాక్షసాధమా! నీ వింక మఱిచెట్టుక్రిందికిఁ బోఁజాలవు. రాఘవులను జయించి జీవింపను జాలవు. యుద్ధరంగమున లక్ష్మణునితోడ యుద్ధము సేయుము. హతుఁడవై, యమలోకము కేఁగి యచ్చట యమభటు లాజ్ఞాపించు కార్యములను జేయుచుందువు. వృద్ధినొంది యున్న నీబల మును జూపుము. సకలాయుధములను బాణములను బ్రయోగించి వ్యయముచేయుము. లక్ష్మణుని బాణములబారిఁ జిక్కిన తర్వాత నీవు బలముతోను ప్రాణములతోను తప్పించికొని పోవఁజాలవు" అని విభీషణుఁ డింద్రజిత్తునకు బదులు చెప్పెను.

88-వ సర్గము

ఇంద్రజిల్లక్ష్మణుల యుద్ధము

ఇంద్రజిత్తు విభీషణుని పలుకులు విని యొడలు దెలియని యాగ్రహము నొందినవాఁడై, చక్కఁగా నలంకరింపఁబడినదియు, నల్లని తేజీలు గట్టినదియు నైన గొప్ప యరదమునఁ గూర్చున్నవాఁడై, యాయుధములను గదను బైకెత్తి మితిమీఱిన పొడవుగలిగి, దిటవయి వడిగలవైన విశాలభీకరధనుస్సును, శత్రుసంహారకము లగు బాణములను గైకొని విభీషణుని యెదుటికి వడిగాఁ బోయి నిలిచి, నిష్ఠూరపు మాటలాడెను. చక్కని భూషణములఁ దాల్చి రథారూఢుఁడై యున్న బలవంతుఁడయిన గొప్ప విలుకాఁడగు నింద్రజిత్తు స్వప్రతాపముచే వెలుఁగువాఁడును, శత్రుసంహారియు, హనుమంతుని వీఁపుమీఁద గూర్చుండి, యుదయకాలసూర్యునిమాడ్కి వెలుఁగు వాఁడును నైన రాముని యనుజుని లక్ష్మణునిఁ జూచెను. అతఁడు విభీషణుని, లక్ష్మణుని వానరుల నందఱనుగూర్చి కడు సంరంభముతో ని ట్లనెను.

"వీరులారా! మీరు నామగఁటిమిం జూడుఁడు. ఆకాశమునుండి జడివాన గురిసినట్లులు నేను వింటినుండి గురిపించెడి పగతురచే నోర్వరాని బాణవర్షమును నివారింపుఁడు. చిచ్చు దూదిరాసిని గాల్చునట్లు నా గొప్పవింటినుండి వెడలిన బాణములు మీ యంగముల నిప్పుడె దహింపఁగలవు. శూలశక్తి గదా తోమర నిశిత సాయకములతో మిమ్ము నందఱిఁ జీల్చి, జమునివీటి కనిచెదను. మేఘము లుఱుముచు జడివాన గురిపించినట్లు, చేతి చులకదనము గల నేను సమరమున సింహనాదము చేయుచు బాణములను వర్షింపఁగా, నాయెదుట నెవ్వఁడు నిలిచి యుద్ధము సేయఁగలఁడు? మున్నొకదినమున రాత్రి యుద్ధము నడచిననాఁడు వజ్రాయుధము బురుడించు వడిగల బాణము లేసి, మిమ్ములను మీ సేనలను ప్రజ్ఞలేనివారిం జేసి నేలఁ బరుండఁ బెట్టితిని కాదే. కదలిన పామును డాయునట్లు, నన్ను డాసి, నాతోఁ గయ్యమొనరింప వచ్చితివే. నాయుద్ధము సంగతి మఱచితివో? లేక నీకు మరణము సమీపించినదియో" యని లక్ష్మణుని నింద్రజిత్తు పొడుపుమాట లాడఁగా, లక్ష్మణుఁడును వెఱవక, మోమునఁ జిన్నదనము నొందక యలుకతో నయ్యింద్రజిత్తున కి ట్లనియె.

"రాక్షసా! నీవు చేయసాధ్యముకాని కార్యములెల్లఁ జేసెద నని నోటిమాటలతోఁ జెప్పితివి. కార్యములను దుదముట్టఁ జేసి ముగించు వాఁడే బుద్ధిమంతుఁడు గాని, నోటిమాటలు సెప్పువాఁడు గాఁడు. ఓరీ మూఢుఁడా! నీ వెందులకును బనికిరానివాఁడవు. అట్లుండియు, నితరులచే నెంతవారిచేత నయినను సాధింపరాని పనిని జేసెద నని నోటితోఁ జెప్పి, యంతటితో నాపని నెఱవేర్చినవాఁడ వైతి నని తలఁచుచున్నావు. మాట లచేఁ బనులు కావు. కార్యముచేసి యావల డంబము లాడవచ్చును గాని, వట్టిమాటలతో నుపయోగము లేదు. నీ వా రాత్రియుద్ధమున నంతర్ధా నము నొంది చేసినపని దొంగపని కాని మొనగాండ్ర పనికాదు. రాక్షసా! నేను నీ బాణమార్గము నొంది నీ యెదుట నిలఁబడియున్నాను, నీవును నాఁటి ప్రతాపమును జూపుము. ఊరక వట్టిమాట లేల ప్రేలెదవు?" అని లక్ష్మణుం డింద్రజిత్తు నెత్తిపొడవఁగా, బలముగలవాఁడును, యుద్ధము లందు జయము నొందినవాఁడును నైన యా యింద్రజిత్తు కఱకు టమ్ములను లక్ష్మణునిపైఁ బ్రయోగించెను. ఆ యింద్రజిత్తేసిన పాము విషమును బోలు కడు వేగముగల యమ్ములు బుసకొట్టు పాముపలె వచ్చి లక్ష్మణుని దేహమునఁ బడినవి. బలము గల యింద్రజిత్తెక్కువ వేగము గల యమ్ములను శుభలక్షణములు గల లక్ష్మణుని దేహమున నాఁటెను. అబాణములు దేహమున నాఁటఁగా నెత్తుటఁ దడిసినవాఁ డగు శౌర్యలక్ష్మీ విరాజమానుఁ డైన లక్ష్మణుఁడు పొగలేక మండు నగ్నిహోత్రుని చంద మున వెలుఁగుచుండెను.

ఇంద్రజిత్తు తన సామర్థ్యముఁ బాఱఁ జూచి, లక్ష్మణుఁడు తన బాణముల యేటులచే డస్సియున్నాఁ డని యెఱిఁగినవాఁడై, గొప్ప యార్పఱచి, యిట్లనియె. "తెక్కలు గట్టినవి, వాఁడియంచులు గలవి పగతురప్రాణములఁ దీయునవియైన నా వింటిమీఁది వెడలిన శరమ్ములు, సౌమిత్రీ, యిప్పుడే నీ యుసురుఁ దీయఁగలవు. మఱియు లక్ష్మణా! నీవు ప్రాణములఁ దొఱఁగఁగనే నక్కల గుంపులును, డేగల గుంపులును, గ్రద్దలును ప్రాణము లెడలిన నీపైఁ బడి నీకళేబరమును తినఁగలవు. పరమధర్మతి యగు రాముఁడు దుష్టుఁ డవును, క్షత్రియాధముఁ డవును, నెల్లప్పుడు తనయెడ భక్తుఁ డవును తమ్ముఁ డవును నయిన నీవు నాచే

నిహతుఁడ వగుటయు నిన్ను వగతోడఁ జూడఁ గలఁడు. సౌమిత్రీ! నీ కవచము పగిల్చి, వింటిని వించి, నీశిరము ద్రుంచి నిన్నుఁ జంపఁగా, అతఁడు నీ కళేబరమును వ్యసనముతోఁ జూడఁ గలఁడు సుమీ." అని యింద్రజిత్తు లక్ష్మణునితో నాటోపంపుఁ బలుకులఁ బలికెను.

ఇత్తెఱఁగున నాటోపముతోఁ బరుసని మాటలాడుచున్న రావణ తనూజునిఁ గూర్చి లక్ష్మణుఁడు చక్కని హేతువుతోఁ గూడిన మాటల నిట్లు బదులు చెప్పెను. "ఓరి బుద్ధిహీనుఁడా! మాటలబలము వదలి పెట్టుము. నీవు క్రూరంపుఁ బనులు సేయువాఁడవే కాదా? అట్లుండఁగా నేల యూరక వదరెదవు. నీ వా పనిని జేసి చూపుము. రాక్షసా! పని యొనరింపక యేల యిట్లు నిన్ను నీవు పొగడుకొనుచున్నావు. నీ పొగడికోలును నేను నమ్మునట్టి పని యొనరింపుము. నేనో నిన్నుఁ బరుసని పలుకులు పలుకక, నిన్నేమియు నాక్షేపింపక, నన్ను నేఁ బొగడు కొనక నీచుఁడ వయిన నిన్ను మట్టువెట్టెదఁ జూడుము" అని యనుచు లక్ష్మణుఁ డా కర్ణాంత మీడ్చిన కడువడిగల గైదు వాఁడి బాణములను రావణి ఱొమ్మున నేసెను. చక్కని ఱెక్కలు గట్టుటచేఁ గడు వేగముతోఁ బాఱునవియు సర్పములమాడ్కి నుండునవియు నైన బాణము లా యింద్రజిత్తుయొక్క ఱొమ్మున నాఁటుకొని సూర్యకిరణములమాడ్కిఁ దేజరిల్లినవి. ఆ లక్ష్మణుఁ డేసిన బాణము లాయములందు నాఁటుటచే, రోషము పూని, మూఁడమ్ములను లక్ష్మణునిపై సూటిగా నేసెను. ఆ రాక్షస నరశ్రేష్ఠు లిరువు రొండొరులను గెల్వఁ గోరి, భయంకరముగా యుద్ధము గావించిరి. వా రిద్దఱు బలముగలవారు, మగటిమిచేఁ దేజ రిల్లువారు; శత్రువులపైఁ బలుమాఱుదండెత్తినవారు, సకల శస్త్రాస్త్రములఁ నెఱిఁగినవారు, ఒండొరులు గెల్వ నలవి గానివారు, సాటిలేని బల ప్రతాపములు గలవారు. కాన నా యిరువురును నాకాశమున నుండు గ్రహములకైవడి యుద్ధముఁ గావించిరి. శత్రువులచే నెదిరింప నలవికాని యా యింద్రజి ల్లక్ష్మణు లిద్దఱును బల వృత్రాసురుల మాడ్కి నెవ్వరికిని వెఱవక, తమతమ ధైర్యము వీడనివారై సింగములమాడ్కిఁ బోరిరి. మానవశ్రేష్ఠుఁడును రాక్షసవీరుఁడును బెక్కు బాణముల గుంపుల నేయుచు, నొండొరులకుఁ బిఱు దియ్యక కడు వేడ్కతోఁ బోరాడిరి.

ఎక్కువ యుత్సాహభరితులైన యింద్రజి ల్లక్ష్మణు లిద్దఱు ధనుర్బాణము లను గైకొని, యొండొరుల గెల్వఁగోరి, మేఘము లాకసమున నుండి వానఁ గురిపించుచందమున నొండొరులపై బాణవర్షము వర్షించిరి. యుద్ధమున నేర్పరులును, యుద్ధవీరులును, తీక్ష్ణ శస్త్రాస్త్రములను ధరించిన వారును, బలవంతులును నైన యింద్రజి ల్లక్ష్మణు లొండొరుల నొప్పించు కొనిరి.

89-వ సర్గము

ఇంద్రజి ల్లక్ష్మణుల యుద్ధము

అటుతర్వాత శత్రునాశకుఁ డయిన లక్ష్మణుఁడు కనలినవాఁ డయి, పాముపలె బుసకొట్టుచు, వింట బాణముల సంధించి రాక్షసేంద్రపుత్రు నిపై నేసెను. రావణతనూజుఁ డా లక్ష్మణునివింటి నారిమ్రోఁతను విని, మోము వెలవెలనై లక్ష్మణుం జూచెను. అ ట్లింద్రజిత్తు మోము వ్రేల వేయుట గాంచి, పోరునం దెక్కువపట్టుదలతో నున్న లక్ష్మణునిఁగూర్చి "మహాబాహువా! యారావణాత్మజుని యెడనున్న చిన్నెలుచూడ నితఁడు డస్సె నని స్పష్టముగాఁ దెలిసెడి. కావున నిప్పుడు నీవు వేగపడుము" అని విభీషణుఁడు చెప్పఁగా, లక్ష్మణుఁడును నగ్నిజ్వాలలపగిది మండుచు నెక్కువ విసము గల సర్పములమాడ్కి నోర్వరాని వయిన బాణము లా యింద్రజిత్తుపైఁ బ్రయోగించెను. అయ్యింద్రజిత్తు లక్ష్మణుఁ డేసిన పిడుగుతాఁకుడుం బోలు తాఁకుడు గల బాణపుటేటులఁ దిన్నవాఁ డయి, యన్ని యింద్రియములు కలఁకపాఱ నొక ముహూర్తము మూర్ఛనొం దెను. శూరుఁ డయిన యింద్రజిత్తొకముహూర్తమునకు మఱల స్మృతి నొంది, యింద్రియస్వాస్థ్యము నొందినవాఁడై దిట్టతనముతో నిల్చి యున్న శూరుఁ డగు లక్ష్మణునిఁ జూచెను. ఆ యింద్రజిత్తు గ్రోధతా మ్రాక్షుఁ డయి మఱల నా లక్ష్మణుని డాసి యివ్విధమున నిష్ఠురపుమాట లాడెను. "మొదటి యుద్ధమునాఁడు నా చూపిన పరాక్రమమును మఱచితివా? నిన్నును నీయన్నను బడఁద్రోసినప్పుడు మీ రిద్దఱు క్రిందఁబడి పొఱలుచుంటిరే. మిమ్ముల నిద్దఱి నింద్రాయుధమును బోలు బాణములతో సపరివారముగాఁ గొట్టఁగా, నొడలు దెలియక నేలమీఁదఁ బడి పొఱలుచుంటిరి గదా? అది యంతయు నీకు జ్ఞప్తిలేదు కాఁబోలు!

ఒకవేళ జ్ఞాపక మున్నను, జమునివీటికిఁ బోవలె నని కోరి వచ్చితివో? కాఁబట్టి నన్ను నీవు నిర్భయముగా నెదిరింపఁ గోరితివి. నీ వొక్కవేళ యా నాఁటి నాపరాక్రమము చూచియుండవేని యిప్పుడు చూపెదను గొంతసే పిక్కడ దిట్టతనముతో నుండుము" అని చెప్పుచు వాఁడి యంచులు గల యేడు బాణములతో లక్ష్మణుని, బదియే డమ్ములతో హనుమంతునిఁ గొట్టెను. తర్వాత మగఁటిమిగల య య్యింద్రజిత్తును మడించిన పూనిక గలవాఁడై కోపముతో గుఱితప్పక నూఱమ్ముల విభీషణునిపై నేసెను. అప్పుడు లక్ష్మణుఁ డింద్రజిత్తొనరించిన పని గాంచి, సరకుచేయక, పకపక నవ్వుచు నివి యెంతమాత్ర మని హేళనము గావించెను. మఱియు నరపుంగవుఁడు మోమున దిగులు దోఁపనీయక యలిగినవాఁడై వాఁడియమ్ములను వింట సంధించి యింద్రజిత్తుపై నేసెను. "ఓరీ రేద్రిమ్మఱీఁడా! యుద్ధరంగమునకు వచ్చిన శూరులు నీయట్లు బాణములతోఁ గొట్టరు. నీ బాణములు చులకనివి, సత్తువ లేనివియు నైనందున బాధయించుక యయినను గలిగింపకయున్నవి. జయకాము లగు శూరు లీవిధమున యుద్ధము సేయరు" అని యాతీరున మాటాడుచు న్యయింద్రజిత్తుపై వర్షమువలె బాణములను పెల్లుగఁ బ్రయోగించెను.

ఆ లక్ష్మణుఁడేసిన బాణములచేఁ బసిఁడితో నలంకరింపఁబడిన యా యింద్రజిత్తుయొక్క కవచము గడు శిథిలమై యాకాశమునుండి నక్షత్రములు పడినట్లు తునుకలుతునుకలుగ రథముపైఁ బడెను. లక్ష్మణుఁ డేసిన బాణములచేఁ గవచ మెగిరిపోవఁగా నొంట గాయములు సోఁక, నింద్రజిత్తు సమరమున పర్వతముమాడ్కిఁ గదలక యుండెను. భీకరవిక్రమము గల యింద్రజిత్తు కట్టలుకఁ బూని, యుద్ధవీరుఁ డయిన లక్ష్మణుని వేయి బాణములతోఁ గొట్టెను. ఆ వేయి బాణములు తగులుటచే నా లక్ష్మణుని గొప్ప దివ్యకవచము చిల్లులువడి తునుక లయ్యెను. ఇట్లు వారిద్దఱు వేఁడి నిట్టూర్పులు విడుచుచు, నొండొరులదేహములు చీల్చుచు, నొడలనంతట నెత్తుటఁ దడిసినవారై, తాము యుద్ధకర్మయందు నేర్పరులు గనుక, పెద్దతడ వొండొరులను కఱకుటమ్ములతోఁ గొట్టుకొనుచుఁ గయ్యము సేసిరి. భయంకరవిక్రమము గలవారైన యింద్రజి ల్లక్ష్మణు లొండొరుల కవచధ్వజములను బోఁగొట్టుకొని, బాణపుంజములచే నొండొరుల

దేహములను నిండించుకొనుచు, సెలయేళ్లు నీటిని గాఱ్ఱునట్లు వేఁడి నెత్తుటిని గార్చుచు, నొండొరుల జయమునందుఁ బ్రయత్నముగల వారయి యుండిరి. ప్రలయమునందలి మబ్బులు నింగిని గప్పి యుఱుముచు జడివానఁ గురిపించిన చందమున నారాక్షసాత్మజనరాత్మజులు భయంకరనాదములు గావించుచు బాణముల నెడతెగక ప్రయోగించుచు యుద్ధము సేయుచుండఁగా బహుకాలము గడచెను. వారు పోరుటయందు విసుఁగునుగాని, యలసటనుగాని పొందరైరి. అస్త్రవేత్తలలో మేటు లయిన యా వీరులు తమయస్త్రబలమును జూపుచుఁ బలుతెఱఁగులైన బాణముల నాకాశమును నిండించిరి. ఆ నరరాక్షసవీరులు గుఱి తప్పకుండునట్లును, మిక్కిలి చులుకనతోను, వింత గలుగునట్లును బాణముల నేయుచు ఘోరయుద్ధము గావించిరి. జనులను గడగడ లాడించుచుఁ బిడుగుమాడ్కి దారుణమైనట్టి వారి యిరువురి యత్తెముల యొక్క ధ్వని వెవ్వేఱుగా వినఁబడుచుండెను.

బలవంతులును, కీర్తిగలవారును, జయము నొందవలయు నని పట్టుదల గలవారును నైన యా లక్ష్మణేంద్రజిత్తు లిద్దఱు బంగారు పింజలుగల బాణములతో గాయములు గలిగించుచు నెత్తుటిఁ బాఱించిరి. ఆ బంగారు పింజలుగల బాణము లా యొండొరుల యొడళ్లలో గ్రుచ్చికొని, నెత్తుటఁ బూయఁబడినవై క్రిందఁబడి పుడమిలోపలఁ బ్రవేశించినవి. వా రేసిన మఱికొన్ని బాణము లెదురెదుర వచ్చు కఱకుటమ్ములతో ఢీకొనినవి. మఱి పెక్కుబాణము లెదుటివారు ప్రయోగించిన బాణములను విఱచి తునుక లొనరించినవి. ఆ యింద్రజి ల్లక్ష్మణులయొక్క బాణమయమైన యుద్ధరంగము యజ్ఞమునఁ బ్రజ్వరిల్లు గార్హపత్య ఆహవనీయము లను పేరులు గల యగ్నులతోఁ గూడిన దర్భల సమూహమువలెఁ బ్రకాశించెను. గాయములు గల యా ధైర్యవంతు లగు నింద్రజి ల్లక్ష్మణుల యొడళ్లు పుష్పములుగలవై యాకులేని బూరుగు మోదుగఁజెట్లకైవడిఁ బ్రకాశించెను. ఆ యింద్రజి ల్లక్ష్మణు లొండొరులను వధింపఁగోరి భయసంకులమైన యుద్ధములఁ గావించిరి. యుద్ధవేళయందు లక్ష్మణుఁ డింద్రజిత్తును, ఇంద్రజిత్తు లక్ష్మణునిఁ గొట్టుచు నించుకేనియు నలఁత నొందరైరి. మహాపరాక్రమశాలురును, బలవంతులునైన

యా యింద్రజిల్లక్ష్మణులు తమ యొడళ్లయందు బాణములు నాఁటు కొనుటంజేసి, పెక్కుఁజెట్లతోఁగూడిన పర్వతములకైవడిఁ బ్రకాశించిరి. దట్టముగాఁ గఱకుటమ్ములు నాఁటుటచే నెత్తుటఁ దడిసిన యా యింద్రజిల్లక్ష్మణుల సర్వావయవములును నెఱియుచున్న యగ్నులమాడ్కి జ్వలించినవి. అట్లు లక్ష్మణేంద్రజిత్తులు వెనుదీయక బహుకాలము పోరాడిరిగాని, యుద్ధమును జాలింపరైరి; అలసటను బొందరైరి. అప్పుడు యుద్ధపరాజితుఁడు కాని యా లక్ష్మణుని యుద్ధశ్రమము దీర్చుటకై యతని కిష్టమును హితమును జేయఁగోరినవాఁడైన విభీషణుండు యుద్ధరంగమున నింద్రజిత్తున కెదుట నిలిచినవాఁ డాయెను.

90-వ సర్గము

ఇంద్రజిత్తుయొక్క రథమును విఱుచుట

అవ్విధమునఁ బోరుచుఁ బూనికతో నొండొరులం గదిసి మదపుటేనుఁగులకైవడిఁ బ్రకాశించుచున్న యా లక్ష్మణేంద్రజిత్తులను జూడఁ గోరినవాఁడై, శూరుఁ డని ప్రసిద్ధుఁడైన విభీషణుఁడు యుద్ధపురోభాగమున నిలఁబడెను.అట్లు విభీషణుఁడు నిలఁబడి గొప్పవింటినారిని మీఁటుచు, వాఁడిములుకులు గల గొప్పశరములను రాక్షసులపై నేసెను. చక్కఁగా గుఱిచూచి యేయఁబడిన యగ్నితుల్యప్రకాశము లగుబాణము లారాక్షసులపైఁ బడి, వజ్రాయుధములు పర్వతములనువలె రాక్షసులను నఱకెను. ఆ విభీషణుని యనుచరు లగు రాక్షసులును శూలగదాఖడ్గములను గైకొని, సమరమున రాక్షసులను ఖండించిరి. అప్పుడు సమయజ్ఞుఁడు, రాక్షసోత్తముఁడు నగు విభీషణుఁ డమాత్యపరివృతుఁడై, యేనుఁగు గున్నలతోఁ గూడిన గజేంద్రునిభాతిఁ బ్రకాశించుచు, రాక్షసులతోడి కయ్యమునందుఁ బ్రేముడిగల వానరులను రక్కసులతోడఁ బోరాడఁ బురికొల్పుచు, నవ్వానరులతో ని ట్లనియె.

"వానరులారా! వీఁ డొక్కఁడే యా రావణునికి దిక్కుగా నుండువాఁడు. ఆతనిసేన కితఁడె తుది. అట్లుండఁగా మీ రేల యూరకున్నారు? క్రూరాత్ముఁ డయిన యీరక్కసుఁడు మడిసెనేని, రావణుఁడు తక్కఁ దక్కిన బలంబెల్ల మడిసినదే. శూరుఁ డగు ప్రహస్తుఁడును, బలవంతుఁ డగు నికుంభుఁడును మడిసిరి. మఱియుఁ గుంభకర్ణ కుంభ ధూమ్రాక్షులును,

జంబుమాలి మహామాలి తీక్ష్ణవేగ అశనిప్రభ సుప్తఘ్న యజ్ఞకోప వజ్ర దంష్ట్ర సంహ్రాది వికట నిఘ్న తపన దమ ప్రఘాస ప్రఘస ప్రజంఘ అజంఘ అగ్నికేతు దుర్ధర్ష రశ్మికేతు విద్యుజ్జిహ్వ ద్విజిహ్వ సూర్యశత్రు అకంపన సుపార్శ్వ చక్రమాలి కంపన దేవాంతక నరాంతకులును మడిసిరి. ఈ బలవంతు లగు రాక్షసు లందఱను జంపిన మీ రీ యింద్రజిత్తును వధించుట బాహువులతో సముద్రమును దాఁటినతర్వాత నావు పాదమును దాఁటుటం బోలినది. వానరులారా! ఇందఱు మహావీరులను జయించిన తర్వాత నీ యింద్రజిత్తు నొక్కనిని సంహరించుట యసాధ్యము గాదు. రాముని నిమిత్తమై నా కొమరుఁ డయిన యాతని సంహరించుట యుక్తముగాదు. నేనే వధింపఁగోరితినేని, నా దృష్టి దెలియకుండు లాగునఁ గన్నీళ్లు క్రమ్ముచున్నవి. కావున నిదుదచేతులవాఁ డయిన లక్ష్మణుఁ డయ్యింద్రజిత్తును వధింపఁగలఁడు. మీరందఱుఁ గలిసి యాతని చేరువ నిలిచియుండు సేనలను వధింపుఁడు."

అని యిట్లు మహాకీర్తిశాలి యగు విభీషణుఁడు సెప్పఁగా, వానర వీరు లందఱు సంతసించి, తోఁకల నాడించిరి. అంత వానరవీరు లందఱు మాటిమాటికి సింహనాదములు గావించుచు, నెమళ్లు మేఘములం జూచినప్పుడు వోలె వివిధనాదములు గావించిరి. జాంబవంతుఁడును వాని భృత్యులును రాక్షసులపై ఱాల ఱువ్విరి. గోళ్లతో గిచ్చిరి; పళ్లతోఁ గొఱికిరి. మహాబలు లగు రాక్షసు లవ్విధమునఁ దమ్ముఁ గొట్టుచుండు జాంబవంతుని నిర్భయముగాఁ జుట్టుకొన్నవారలై బాణములతోడను గొడ్డళ్లతోను, పట్టిసయష్టి తోమరాయుధములతోను రాక్షససేనను సంహరించుచుండు జాంబవంతునిఁ గొట్టిరి. కినుకచే నార్చుచుండు వానర రాక్షసులయుద్ధము దేవాసురుల యుద్ధముకైవడి భయంకరమై యుండెను. మొనగాఁ డయిన హనుమంతుఁడు నలిగినవాఁడై చెట్టు నొక్క దానిని బెళ్లగించి, పెక్కండ్రు రాక్షసులను సంహరించెను. ఇంద్రజిత్తు విభీషణునితో బహుకాలము యుద్ధముగావించి, శత్రుసంహారి యగు లక్ష్మణునిమీఁదికే మఱల వచ్చెను. అట్లు శూరులగు యుద్ధనిపుణులైన యా లక్ష్మణేంద్రజిత్తు లొండొరులపై బాణములను వర్షించుచు నొండొరులను గొట్టుకొనిరి. బలవంతు లగు నా లక్ష్మణేంద్రజిత్తు లొండొరులు బాణము

లనువేయ, వర్షర్తువునందు వడిగల సూర్యచంద్రులు గప్పఁబడినయట్లు తమ బాణములచే గప్పఁబడిరి. వారిరువురు విలువిద్దెయందు నేర్పరులగుటచే, వారు బాణములు గొనుటయు, వింట జోడించుటయు, వింటినెత్తుకొని బాణములను విడుచుటయు, వెనుకకు లాగుటయు, దేహములును, చెవి వఱకు నీడ్చుటయు, గుఱివెట్టి బాణము లేయుటయుఁ గంటికిఁ గనఁబడ వయ్యెను. వడిగా ధనుర్విముక్తములైన బాణము లాకాశమునంతటిని గప్పుటచే నొండొరులరూపము దెలియకుండెను. లక్ష్మణుఁడు నింద్రజిత్తును నొండొరులఁ గదిసి పోరుచుండఁగా, వారిలో నెవ్వఁ డెవనిని గొట్టునదియుఁ దెలియకుండెను. ఆ యిరువురు ప్రయోగించిన వాఁడియమ్ము లాకాశమున దట్టముగా నిండుటచే, నాకాశమునఁ జీఁకటి గ్రమ్మిన ట్లుండెను. ఆ యిరువు రేయు కఱకుటమ్ములు విశేషముగాఁ బడుచుండుటచే దిక్కులు విదిక్కులును బాణములచే నిండియుండెను. ఆ బాణము లాకాశమున నిండుటచే నుప్పరము ప్రొద్దు గ్రుంకిన తర్వాతఁ జీఁకటితోఁ గ్రమ్మఁబడినప్పుడువోలెఁ గడు భీకరమై యుండెను. అప్పుడు గొప్ప నెత్తుటి వెల్లువలు పాఱినవి. భయంకరము లగు మాంసభక్షకములైన పక్షులును భీకరముగా నఱచినవి. అప్పుడు గాలి వీవ దయ్యెను; అగ్నిమండ దయ్యెను. మహర్షులు "లోకములకు మేలు గలుగుఁగాక!" యని పలికిరి. అచ్చటికి వచ్చియుండిన గంధర్వచారణులును భయపడి పరుగెత్తిరి. అప్పుడు లక్ష్మణుఁడు బంగారు తొడవులతో నలంకరింపఁబడిన యా రాక్షసేంద్రుని నాలుగు నల్లని యరదపుఁ దేజీలను నాలుగు బాణములచేఁ గొట్టెను. తర్వాత శౌర్యలక్ష్మీవిరాజమానుం డయిన లక్ష్మణుఁడు తెల్లనిదియు, వాఁడిమి గలదియు, చక్కని తెక్కలు గట్టినదియు, వేల్పుతేని నూఱంచుల కైదువుం బోలునదియునైన మఱియొక బాణమును గైకొని, వింటినారిని మీటుచు, నత్తెముయొక్క ధ్వనికి మాఱు మ్రోగుచున్న పిడుగువంటి యా యమ్ముతో నయ్యింద్రజిత్తు రథమును నేర్పుతో వలయుచోట్లకుఁ ద్రిప్పుచుండు నాతని సారథియొక్క శిరమును దెగనేసెను. తన సారథి నీల్గఁగా నయ్యింద్రజిత్తు తానే రథముఁ దోలుకొనుచు యుద్ధము చేయుచుండెను. ఆతని సామర్థ్యము చూచుటకు వింతగొల్పుచుండెను. ఇంద్రజిత్తు గుఱ్ఱముల పగ్గములు వదలి ధనుస్సును

గొన్నప్పుడు లక్ష్మణుఁడు బాణములను గుఱ్ఱములమీఁదఁ బ్రయోగించెను. ధనుస్సును వదలి గుఱ్ఱములను నడుపునప్పు డింద్రజిత్తు దేహముమీఁద బాణములు ప్రయోగించెను. బాణప్రయోగములందుఁ గడు నిపుణత గల లక్ష్మణుఁడు సమయము దొఱకినప్పుడు నిర్భయుఁడై యుద్ధరంగమునఁ దిరుగుచున్న యింద్రజిత్తును బాణరాసులచేఁ గడునొంచెను. ఇంద్రజిత్తు సమరమునఁ దన సారథి నీల్గుటఁ గాంచి, యుద్ధమున నుత్సాహము మాని వెలవెలపోయెను. అట్లు ఇంద్రజిత్తు మోము వ్రేల వేయుటఁ గాంచి, వానరవీరు లంద ఱెక్కువ మోదమంది, లక్ష్మణునికిఁ బ్రోత్సాహము గలిగించిరి.

తర్వాతఁ బ్రమాథి శరభ రభస గంధమాదను లను నలువురు వానరవీరు లా యింద్రజిత్తు నాటోపము నోర్వనివారలై వడిగా నెగిరి, యాతని మేటి రథాశ్వములపైఁ బడఁగా, పర్వతములంబోలు నా వానరవీరులు పడినందున నాగుఱ్ఱములు నోళ్లనుండి నెత్తురు గ్రక్కుచు నంగములు విఱిగి చతికిలఁబడి ప్రాణముల నెడలినవి. అవ్విధమున నా వానరవీరు లా యింద్రజిత్తుయొక్క గుఱ్ఱములను బీచ మడచి, మహారథమును దుత్తునియలుసేసి, వడిగా లక్ష్మణుని ప్రక్కన వచ్చి చేరిరి. అయ్యింద్రజిత్తు రథాశ్వములు నీల్గుటచే నా రథమునుండి క్రిందికి దిగి యాలక్ష్మణునిపై బాణములను గ్రుమ్మరించుచు నాతని నెదుర్కొనెను. అప్పుడు వేల్పుటేనింబోలు లక్ష్మణుఁడు క్రింద నిలఁబడి తనమీఁద వాఁడి బాణములను గ్రుమ్మరించుచున్న యింద్రజిత్తుయొక్క యా బాణములను దన వాఁడి బాణములచే నివారించెను.

91-వ సర్గము

ఇంద్రజిద్వధము

రథాశ్వములు మడిసిన పదంపడి యెక్కువ ప్రతాపముగల యింద్రజిత్తు నేలమీఁద నిలఁబడినవాఁడై, కట్టులుకఁబూని, స్వప్రతాపముచే వెలిఁగెను. అంతట విలుకాండ్రగు నా లక్ష్మణేంద్రజిత్తు లొండొరులను వాఁడియమ్ములచేఁ వధింపఁగోరినవారై, యడవియందలి మేటి యేనుఁగులకై వడి నొండొరులను జయింపఁగోరికతోఁ గదిసిరి. వానరరాక్షసవీరు లొండొరులమ జంపుకొనుచు యుద్ధరంగమున నచ్చటచ్చటఁ దిరుగుచుఁ

దమ నాయకులను విడువకుండిరి. అంత రావణ తనూజుఁ డా రాక్షసుల నందఱను స్తోత్రములచే సంతోషింపఁజేయుచుఁ దానును సంతోషించుచు ని ట్లనియె. "రాక్షసోత్తములారా! ఈ దెసలన్నియు నెక్కువ చీఁకటితోఁ గ్రమ్మఁబడి యున్నవి. ఇచ్చట నొరుఁడు గాని తనవాఁడుగాని తెలియ రాఁడు. కావున మీరు వానరులు మూర్ఛనొందునట్లు ధైర్యముతో యుద్ధము సేయుచుండుఁడు. నేను బురములోనికిఁ జని మఱొక్క రథము నెక్కి వచ్చెదను. అంతపర్యంతము దురాత్ములగు వానరులు నేను బుర మునకుఁ బోయియుండునపుడు యుద్ధము సేయకుండురీతి మీరు కయ్య మొనరించుచుండవలయును." అని చెప్పి శత్రుసంహారి యగు నింద్రజిత్తు వానరుల నందఱను వంచించి, రథము నిమిత్తమై పురము సొచ్చెను. రథ సారథ్యము చేయఁ నెఱిఁగినవాఁడును, తన కాప్తవాక్యములు బోధించు వాఁడునైన సారథిచేఁ దోలఁబడునదియు, మేటి గుఱ్ఱములు పూన్చి నదియు, నూఱులకొలఁది బల్లెములు గదలును గలదియు, పసిఁడితొడవు లతో నలంకరింపఁబడినదియు, స్వభావరమణీయమునైన రథమును జక్కఁగా సింగారించి, తద్రథమునఁ గూర్చున్నవాఁడై, ప్రధాన రాక్షసులను దోడ్కొని మృత్యువు పురికొల్పఁగాఁ బురమునుండి వడి వడిగా వెడలివచ్చి లక్ష్మణ విభీషణుల నెదుర్కొనెను.

అంతలోపల రథారూఢుఁడైన యింద్రజిత్తునుగాంచి లక్ష్మణుఁడు, వానరులు, విభీషణుఁడును నితఁడెప్పుడు పట్టణములోపటికిఁ జని రథం బెక్కి వచ్చెనని యా బుద్ధిమంతుఁ డయిన యింద్రజిత్తుయొక్క చులకఁదనమునకు మిక్కిలి యచ్చెరువందిరి. ఇంద్రజిత్తును గడు నలిగినవాఁడై, వింటిని వంచి, పెక్కు సాయకములను సంధించి యేయుచు, వానరవీరులను గుంపులుగుంపులుగాఁ బడఁద్రోసెను. భయంకర పరాక్రము లగు వానరు లంద ఱింద్రజిత్తుచేఁ గొట్టఁబడుచు, నా బాణపు టేటులను సైరింప నేరక, ప్రజలు ప్రజాపతిని శరణుచొచ్చినచందమున లక్ష్మణుని శరణు చొచ్చిరి. అంతట లక్ష్మణుఁ డెక్కువ యలుక పొడమఁగాఁ దన హస్త లాఘవముసూపుచు నా పగతునివింటిని ద్రుంచెను. అతఁడును దత్తర పాటొందక వడితో మఱియొక వింటిని వంచి నారికట్టి యెక్కు వెట్టెను. లక్ష్మణుఁడు మఱల మూఁడు బాణములచే నావింటిని ద్రుంచెను. అ ట్లతని

వింటిని విఱిచినపదంపడి లక్ష్మణుఁడు మఱి యైదు పాముమిషమునుబోలు నా రసముల నా యింద్రజిత్తును ఱొమ్మున నేసెను. ఆతని గొప్ప వింటినుండి వెడలిన నా రసము లయ్యింద్రజిత్తు దేహమును వ్రచ్చి రక్తారుణములై యెఱ్ఱని కొండచిలువలవలె నేలఁబడినవి. లక్ష్మణునిచేఁ గవచము చిల్లులు వడఁగా, రావణ తనూజుఁడు ముఖమునుండి రక్తము గ్రక్కుచు, గట్టి నారిగలిగి యుఱేఁదియైయున్న గొప్పవింటిని మఱొక్కటిఁ గొనెను. అంతట నింద్రజిత్తెక్కువపడి పూని, పర్జన్యుఁడు వాన గురిపించుచందమున లక్ష్మణునిపై బాణముల వర్షమును గురిపించెను. ఇంద్రజిత్తు గురిపించిన యోర్వరాని యా బాణవర్షమును శత్రుసంహారి యగు లక్ష్మణుఁడు వెఱవక నివారించెను. మఱియు నెక్కువ తేజముగల లక్ష్మణుండు తత్తరపడక యింద్రజిత్తునకుఁ దన హస్తలాఘవము చూపెను. అది చూపఱకు వింతకొల్పుచుండెను. తర్వాత లక్ష్మణుఁడు మిక్కిలి క్రోధ మొందినవాఁడై, శీఘ్రమంత్రమును బ్రయోగించి, మూఁడేసి బాణములచే నొక్కొక్కని వంతున నా రాక్షసవీరుల నందఱిని నొంచి, యింద్రజిత్తును బాణరాసులచే నొంచెను. శత్రుసంహారి యగు బలవంతుఁ డయిన రావణి పగతునిచేఁ గాఁడనేయఁబడి, లక్ష్మణునిపై నిరంతరముగాఁ బెక్కమ్ముల నేసెను. ధర్మాత్ముఁ డగు లక్ష్మణుఁ డా బాణములు దాపునకు వచ్చునంత లోపలనే వానిని గఱకుటమ్ములచే ఖండించి, యాతని సారథి శిరమును వంగిన గణుపులుగల యొక్కయమ్ముతోఁ బడనేసెను. ఆ గుఱ్ఱములు సారథి లేనివయ్యుఁ జూపఱకు వింత పుట్టునట్లు వలయాకారముగాఁ జుట్టుచుఁ దొట్రుపాటు లేక రథము నీడ్చినవి. దిట్టమగు పరాక్రమము గల లక్ష్మణుఁ డెక్కువ యాగ్రహముపూని, సమరమునఁ బగతుని గడగడలాడించుచు నాతని తేరిగుఱ్ఱములను బాణములచే నొప్పించెను. బలవంతుఁ డగు రావణాత్మజుఁ డాకార్యము నోర్వఁజాలక, శత్రువులచే నోర్వరాని యా సౌమిత్రిని బది బాణములచేఁ గొట్టెను. వజ్రమువలె నుఱేఁదిగలవి, పాముమిషమువంటి తీక్ష్ణతగలవియునైన యా యింద్రజిత్తేసినయమ్ము లా పసిఁడివన్నెగల యా లక్ష్మణుని కవచమునకుఁ దగిలి క్రిందఁబడినవి. లక్ష్మణుని కవచము భేదించుట యసాధ్యమని యెఱిఁగినవాఁడై రావణాత్మజుఁ డెక్కువ కోపముపూని, తన బాణప్రయోగలాఘవము సూపుచు వాఁడి

ములుకులు కల మూఁడు బాణములతో లక్ష్మణుని నొసటఁ గొట్టెను. ఆ బాణములు నొసట నాఁటుటచే, యుద్ధశ్లాఘి యగు లక్ష్మణుఁడు త్రికూట పర్వతముమాడ్కిఁ బ్రకాశించెను.

ఆ గొప్ప యుద్ధమున నింద్రజిత్తాతీరున నొప్పింపఁగా, లక్ష్మణుఁ డయిదు బాణములు గైకొని యాకర్ణాంత మీడ్చి, ధగధగాయ మానము లగు పోగులతోఁ గూడిన యయ్యింద్రజిత్తుయొక్క మోమున నాటనేసెను. భయంకర పరాక్రమముగల లక్ష్మణరాక్షస తనూజు లిద్దఱు నెక్కువ బలముగల విండ్లను గైకొని పెక్కుటంచులు గల అంపములం బోలు బాణములతో నొండొరులను గొట్టుకొనిరి. అట్లు బాణపుఁ బోటులచే రక్తము వెల్లువయై పాఱఁగా, నా శూరు లగు లక్ష్మణేంద్ర జిత్తు లిద్దఱు పూఁచిన మోదుగుఁ జెట్లకై వడిఁ దోఁతెంచిరి. విలుకాండ్రగు నా యిరువురు వీరులును గెల్పునందుఁ దలంపుగొన్నవారయి, యొండొ రులంగదిసి, యన్నియంగములు నొచ్చునట్లు బాణములతోఁ గొట్టు కొనిరి. అటుతర్వాత రాక్షసేంద్రతనూజుఁ డలిగి, పోరునందలి యాగ్ర హము మీఱ నుక్కుకొనలు గల మూఁడమ్ములతో నవ్విభీషణునిఁ జక్కని మోముపగులున ట్లేసి, యొక్కొక్క బాణముతో నా వానర వీరుల నందఱిని గొట్టెను. ఎక్కువప్రతాపముగల విభీషణుఁ డతనిపై మిక్కిలి యలుకవొడమ నాదురాత్ముని తేరి గుఱ్ఱములనుగదతో మోదెను. సారథిని నుగ్గాడెను. అశ్వములు గూలి, సారథి మడియఁగా, మహాతేజుఁ డగు నా యింద్రజిత్తు రథమునుండి క్రిందికి దుమికి, రథమునన్న శక్త్యాయుధమును బినతండ్రిపైఁ బ్రయోగించెను. ఆ వచ్చు శక్తిని జూచి సుమిత్రానందనుఁ డగు లక్ష్మణుఁడు వాఁడియమ్ములనేసి యాశక్తిని గొట్టఁగా నది పదితునుకలై క్రిందఁబడెను. గట్టివిల్లుగల యా విభీష ణుఁడు విరథుఁడై యున్న యా యింద్రజిత్తుమీఁదఁ గట్టలుకపూని పిడుగువంటి తాఁకుడు గలవగు నైదునారసముల నాతని ఱొమ్మున నాట నేసెను. గుఱితప్పక పోవునట్టి పసిఁడిపింజలుగల యాతని యమ్ము లింద్రజిత్తుయొక్క దేహమును జీల్చి యచ్చటి రక్తముచేఁ దడిసినవై, యెఱ్ఱనికొండచిలువలమాడ్కి వెలిఁగెను. బలవంతుఁ డగునింద్రజిత్తు పిన్న తండ్రిపైఁ గడుఁగోపంబొంది, రాక్షసులందఱు చూచుచుండ యముఁ

డొసఁగిన యుత్తమశరమును గైకొనెను. ఎక్కువ తేజముగల లక్ష్మణుఁడును నింద్రజిత్తు ఆ గొప్పబాణమును వింట సంధించుటఁ గాంచి, నిద్రాసమయమున మహాత్ముఁ డగు కుబేరుం డొసంగినట్టిదియు, నింద్రాది దేవతలకైనను దుర్జేయమును నయిన మఱియొక బాణమును గైకొనెను. గడియమ్రానులం బోలునట్టి బాహువులచే బలిమితో నీడ్వఁబడు నా యిరువురి గొప్పవిండ్లను గ్రైంచపక్షులమాడ్కిఁ గూఁత లిడెను. అట్టి విండ్లయం దా వాఁడిమగ లిద్దఱు చేర్పఁబడినట్టి రెండమ్ములును గాంతిచే మఱింత వెలిఁగెను. అట్లు వెలుఁగుచు ధనుస్సులనుండి వెడలినట్టి యా రెండమ్ములును మింటిని వెలుఁగఁజేయుచు నెదురెదురేఁగి యొండొంటితో నొఱసుకొనెను. భయంకరాకారములు గల యారెండు బాణముల యొఱయికవలన గొప్ప ధ్వని పుట్టెను. మిణుఁగురులతోడ భయంకరమైన యగ్నియు వెలువడెను. అంగారకశనైశ్చరాదిమహాగ్రహముల మాడ్కి వెలుఁగునట్టి యారెండు బాణము లొండొంటితోఁ గదిసి కొని, నూఱుతునుకలై యుద్ధ భూమియందుఁ బడినవి. అట్లు తమ బాణము లొండొంటి నొఱసికొని క్రిందఁ బడిపోవుటఁ గాంచి, లక్ష్మణేంద్రజిత్తు లిద్దఱు సిగ్గరులును, కినుకగలవారును నైరి. అప్పుడు సౌమిత్రి యెక్కువ యాటోపము పూని, వారుణాస్త్రమును గైకొనెను. ఇంద్రజేత యుద్ధమున నెక్కువ పట్టుదలగొన్నవాఁడై రౌద్రాస్త్రము నేసెను. వారుణాస్త్ర మారౌద్రాస్త్రముచేఁ గొట్టువడిపోయెను. అంత నెక్కువ తేజముగల జయశాలి యగు నింద్రజిత్తు లోకములను నశింపఁజేయునో యనునట్లు దేదీప్యమానమైన యాగ్నేయాస్త్రమును సంధించి యేసెను. లక్ష్మణుఁ డయ్యస్త్రమును సౌరాస్త్రముచేఁ బడఁగొట్టెను. తనయస్త్రము పడఁగొట్టఁబడుటఁ గాంచి, యింద్రజిత్తు కట్టలుకపూని, శత్రువధ ముద్దేశించి భీకరమైన యా సురాస్త్రమును గైకొనెను. ఆ యస్త్రమునుండి వెలుఁగుగల కూటముద్గర ముసుంటి గదా ఖడ్గ పరశ్వధము లను ననేకాయుధములు వెలువడెను. అన్ని జంతువులకును నివారింప నలవిగానిదియు, సకల శత్రునాశకమైనదియు నైన యా యాసురాస్త్రమునుగాంచి వెలుఁగుగల లక్ష్మణుఁ డా యస్త్రమును మాహేశ్వరాస్త్రముతోఁ బడఁగొట్టెను. ఇవ్విధముగా నా వీరుల కిద్దఱకును

నాశ్చర్యకర మయిన పోరు నడచెను. భయంకర ధ్వనులతోఁ గూడిన యా వానరరాక్షసయుద్ధము చూచుటకై సకల భూతము లాశ్చర్యముతో నాకాశమున నిలవఁబడియుండిరి. దేవ ఋషి పితృ గరుడ గంధర్వ పన్నగులు దేవేంద్రునితోడ వచ్చి యాకాశమున నుండి లక్ష్మణునిఁ గాపాడుచుండిరి. అప్పుడు రామానుజుఁ డగ్నిహోత్రునివలె దహించునదియు, నింద్రశత్రుమారకమును, జక్కని తెక్కలు గలదియు, నంగముల పొందిక గలదియుఁ, జక్కని గణుపులు గలదియు, జక్కఁగాఁ గట్టఁబడినదియు, బంగారు వికారమైనదియు, శత్రువులచే నివారింపరానిదియు, నోర్వరానిదియు, రాక్షసులకు భయ మొసఁగునదియు, సర్పవిషము వోలెఁ దీక్ష్ణమైనదియు, దేవతాబృందములచేఁ గొనియాడఁబడినదియుఁ దొల్లి దేవాసురులకు యుద్ధము నడచినపుడు దేజోవీర్యములు గల యింద్రుఁడు దానవులపైఁ బ్రయోగించి వారిని జయించినట్టిదియు నింతకు మున్నెప్పుడు వ్యర్థము గానిదియు నగు నైంద్రాస్త్రమును మేటి వింట సంధించెను. లక్ష్మణుఁడు శత్రుసంహారకమైన బాణమును సంధించి, ప్రలయకాలరుద్రునిఁబోలె నొరులచే నోర్వరాని యావింటిని వంచి యెక్కువెట్టెను. శ్రీమంతుఁడైన లక్ష్మణుఁడు వింట బాణమును సంధించి యీడ్చుచుఁ దన కార్యసాధకమైన మాట ని ట్లని చెప్పెను: "దశరథనందనుఁ డగు రాముఁడు ధర్మాత్ముఁడును, ప్రతిజ్ఞ దప్పనివాఁడును, పౌరుషమున సాటిలేనివాఁడు నైనచో, ఓ శరమా! నీ వీ రావణతనూజుని నింద్రజిత్తును సంహరింపుము." అని చెప్పి సూటిగాఁ బోవునట్టి బాణము నా యైంద్రాస్త్రముతోఁ జేర్చి దానిని జెవివఱకు నీడ్చి, పగతురఁ బరిమార్చు లక్ష్మణుఁ డా యింద్రజిత్తుపై నేసెను. ఆ శర మా యింద్రజిత్తుయొక్క శిరమును గిరీటముతోడఁ ద్రుంచి యాతని యొడలినుండి క్రిందఁ ద్రోసెను. ఆ రాక్షస తనూభవుని మూఁపునుండి నఱుకఁబడిన యా గొప్పశిరము రక్తధారాసముక్షితమై కనకవర్ణమై భాసిల్లెను. రావణాత్మజుఁ డట్లు దెగ నేయఁబడి ప్రాణము లెడలి, విల్లు చేతినుండి జాఱి, కిరీటం బొఱుగఁ గవచముతోడ నేలఁ బడెను. వేల్పులు వృత్రాసురవధమునందుఁ బోలె వానరులును విభీషణుఁడును నింద్రజిన్మరణము వలని సంతసముచేఁ గడు నుప్పొంగి, కిలకిలనాదములు గావించిరి.

అంత నంతరిక్షమున వేల్పులును, మహాత్ములగు ఋషులును, గంధర్వాప్స రసలును సంతోషసూచకము లగు కోలాహలధ్వనులు చేసిరి. ఇంద్రజిత్తు క్రిందఁబడ, జయశాలు రగు వానరులందఱు రాక్షసుల నందఱిని బాగుగా మర్దింపఁగా, వా రందఱు వెఱచి మూలమూలకుఁ బరుగెత్తిరి. వానరు లట్లు తన్ను చుండఁగాఁ గొందఱు రాక్షసు లాయుధములు క్రిందఁ బాఱవైచి, లంకవైపునకుఁ దిరిగి, మేను మఱచి కడు వడిగాఁ బరుగెత్తిరి. మఱికొందఱు రాక్షసులు గదా ఖడ్గ పరశ్వథా ద్యాయు ధములను దిగనాడి తత్తరపాటుచే నానాదిశలకుఁ బాఱిరి. కొందఱు లంకలోపలఁ బ్రవేశించిరి. కొందఱు సముద్రమునఁ బడిరి. కొందఱు కొండలలో డాఁగిరి. ఇంద్రజిత్తు హతుఁడై యుద్ధభూమియందుఁ బడుట కాంచి, వేలకొలఁది రాక్షసులలో నొక్కఁడైన నా సమరప్రదేశ మునఁ గనఁబడఁ డయ్యె. సూర్యుఁ డస్తమించినపదంపడి సూర్యకిరణ ములు నిలువనట్టు, రావణి క్రిందఁబడినతోడనే, రాక్షసులు దెసలకుఁ బఱచిరి. ప్రాణము లెడలిపోయిన తర్వాత నింద్రజిత్తు కిరణములేని సూర్యునిమాడ్కియుఁ జల్లారిన యగ్నికైవడియుఁ గాంతి లేనివాఁడై యుండెను. రాక్షసాధిప పుత్త్రుఁడు కూలఁగా, లోకు లందఱు మిక్కుట మగు పీడలనుండి విడుదల నొందినవారును, చేటులఁ దొఱఁగినవారును, కాంతి గలవారును నైరి. పాపకర్ముఁ డయిన యింద్రజిత్తు మడియఁగా, ఇంద్రాదిదేవతలును, మహర్షులును సంతసము నొందిరి. ఆకాశమున గంధర్వులు గానము సేయఁగా, నచ్చరలు నాట్యమాడఁగా, దుందుభి వాద్యములు మ్రోఁగ వేల్పులందఱు చూప ఆశ్చర్యపడునట్లు పూవుల వానఁ గురిపించిరి. అనేకు లనేకవిధములఁ లక్ష్మణునిఁ గొనియాడిరి. నీరును దెసలును వెలసెను. దైత్యదానవులును హర్షము నొందిరి. దేవ దానవ గంధర్వ పన్నగులును "బ్రాహ్మణులు దిగులు మాని, కలవర పాటు లేక సంచరింతురుగాక" యని నుడివిరి. యుద్ధప్రదేశమున వానరవీరులందఱు సాటిలేని బలిమిగల యా రాక్షసశ్రేష్ఠుఁడు మడియుటఁ గాంచి మహానందముఁ బొందిరి. విభీషణ హనుమంతులును, యూథనాథుఁ డగు జాంబవంతుఁడును రావణతనూజ సంహారముచే నుప్పొంగుచు లక్ష్మణునిఁ గొనియాడిరి. వానరులందఱు సింహనాదములు చేయుచు,

నార్చుచు, ఱొప్పుచు గారవముతో నా సౌమిత్రిని జుట్టుకొని కొల్చు చుండిరి. మఱియు నా వానరవీరులు తోఁకలు గొఱుకుచుఁ గ్రిందవేసి కొట్టుచు "లక్ష్మణుఁడు జయశాలియై యున్నాఁ"డని యంతటఁ జాటించిరి. మఱియు వానరు లొండొరులఁ గౌఁగిలించికొని, నానావిధములగు రాఘవాశ్రయజన్యములైన కథలను జెప్పుకొనుచుండిరి. యుద్ధరంగ మున నొరులచేఁ జేయనలవికాని లక్ష్మణుని కార్యమును జూచి, యాతని యనుఁగుఁ జెలికాండ్రందఱు కడు నుప్పొంగిరి. వేల్పులును నింద్రు విరోధి మడియుట విని యెక్కువ యానందము నొందిరి.

92-వ సర్గము

రామాదులు లక్ష్మణుని మెచ్చుకొనుట

చక్కని లక్షణములుగల లక్ష్మణుఁడు బవరమున రక్తార్ద్రదేహుఁ డయ్యు నింద్రజిజ్జయముచేఁ గడు సంతసము నొందినవాఁ డయ్యెను. తర్వాత మగఁటిమి గల లక్ష్మణుఁడు జాంబవంతుని, హనుమంతుని, వాన రులనందఱిని గూడుకొని, యుద్ధమునందలి బడలికచే విభీషణుమూపుపై నానుకొని రామసుగ్రీవు లున్నచోటి కేతెంచెను. అట్లు సౌమిత్రి రామునిసమీపమున కేఁగుదెంచి, యతనికి నభివాదనము సేసి, యింద్రుని చేరువ బృహస్పతియున్న చందమున, నన్నచేరువ నిలఁబడియుండెను. అప్పుడు వీరుఁడగు సౌమిత్రి మహాత్ముఁడగు రాముని మెల్లగాఁ జెప్పు కైవడిఁ జేరవచ్చి, యింద్రజిత్తు వధమును దెలిపెను. విభీషణుఁడును సంతసము మీఱ, మహాధీరుఁ డగు సౌమిత్రి యింద్రజిత్తు శిరము నఱికె నని రామునికి నివేదించెను. ఎక్కువ మగఁటిమిగల రాముఁడు లక్ష్మణుఁ డింద్రజిత్తును వధించె నని విని, సాటిలేని సంతసమునొంది లక్ష్మణునితో ని ట్లనియె; "సెబాసు! లక్ష్మణా! నీ వొనర్చిన కార్యముచే నేను నుప్పొం గితిని, రావణాత్మజుని వధించితివి గనుక నిఁక జయము గలిగినట్లే తలం పుము." అని రాముఁడు చక్కనివాఁ డగు లక్ష్మణుని శిరమున ముద్దాడి తన శ్లాఘను వినఁజాలక సిగ్గుపడుచుండు లక్ష్మణుని ననురాగమువలనఁ జేరఁదీసి, తొడమీఁదఁ గూర్చుండఁబెట్టికొని, బాణపు గాయములు గలిగియున్న యాతనిఁ గౌఁగిలించికొని, ప్రేమతోఁ బలుమాఱు చూచెను.

బాణపుగాయములు దిన్నవాఁడై, యలఁతచే నిట్టూర్పులు నిగిడించుచున్న లక్ష్మణునిఁ జూచి, రాముఁడు వెతలం గుందినవాఁడై నిట్టూర్పు విడిచి, శిరమున నతనిని మూర్కొని, బాణపుటేటులవలని బాధ దొలఁగఁజేయుటకై యతనినిఁ జేతులతోఁ జఱిమి, యూరడించుచు నాతనితో ని ట్లనియె.

లక్ష్మణా! చేయనలవికాని కార్యములను జేయఁగలవాఁడవైన నీవు గడు మంచిపని యొనరించితివి. నీవు రావణతనూజుని వధించుటచే నిప్పుడు రావణుఁడును మడిసినవాఁడే యని తలఁచెదను. దుర్గార్గుఁ డగు నింద్రజిత్తును వధించితివిగాన నే నిప్పుడు జయముగొంది తిని క్రూరుఁడైన రావణునికిఁ గుడిచేయివంటివాఁ డగు నింద్రజిత్తును నఱికితివి. అతఁడె కదా యాతని కాదరువైనవాఁడు. విభీషణ హనుమంతు లిద్దఱును రణమున గొప్పకార్యము గావించిరి. మూఁడు రేలుంబవళ్లు సంగర మొనరించి పగతుని నెట్టకేలకు రూపు మాపితివి. ఇప్పుడు నన్ను శత్రువులు లేని వానిఁగా నొనరించితివి. ఇంద్రజిత్తు నీవైనననిన మాట విని, రావణుఁడు గొప్పదండుతోడ ననికి రాఁగలఁడు. జయింప నలవికానివాఁ డయ్యు, పుత్రశోకముచేఁ గుంది వెడలివచ్చిన రాక్షసాధిపుని నపారసేనాసాహాయ్యముచే రూపుమాపెదను. లక్ష్మణా! నీవు నాకుఁ దోడై పోరనింద్రజిత్తును జంపితివికాన నిఁక సీతయుఁ బుడమియు బొంద నలవికానివి కావు." అని లక్ష్మణుని రాముఁ డభినందించి, కౌఁగిటఁజేర్చి, సంతసము మీఱ సుషేణునిఁ గాంచి "ఓ గొప్ప తెలివికాఁడా! చెలికాండ్రపైఁ బ్రేమగలవాఁ డగు లక్ష్మణుని దేహమున బాణములు నాఁటియున్నవి. ఇతఁడు నెమ్మది నొందునట్లు నీ వుపచారములు చేయుము. లక్ష్మణ విభీషణుల యొడళ్లలో నాఁటియున్న బాణములఁ బీకివైచి, గాయములను మాన్పుము. వృక్షపర్వతములతో యుద్ధముగావించిన శూరులగు ఋక్షవానర సైనికుల యొడళ్లలో నాఁటియున్న బాణములను దీసి, గాయములను మాన్పి, వారికి నెమ్మది గలిగింపుము" అని సుషేణుని కానతిచ్చెను.

వానరశ్రేష్ఠుఁ డగు సుషేణుఁడు రాము నానతిని గైకొని, లక్ష్మణుని ముక్కున నొక్క దివ్యమూలిక నుంచెను. లక్ష్మణుఁ డా మూలిక

యొక్క వాసనను బీల్చి గాయములు లేనివాఁడై విశల్యుఁడై నెమ్మది నొందెను. లక్ష్మణునికి నెమ్మది గలిగిన తర్వాత సుషేణుఁడు రాముని యానతిచొప్పున విభీషణుఁడు మున్నగు చెలికాండ్రకును, వానరవీరుల కందఱికిని జికిత్స యొనరించెను. అంతట సౌమిత్రి సంజ్ఞ నొంది, ములు కులు వీడఁగా నొప్పి లేనివాఁడై, క్షణములోపల సంతసము నందెను. తర్వాత రాముఁడును, సుగ్రీవ విభీషణ జాంబవంతులును, వానరసైనికు లును బాధలు లేనివారై లేచి కూర్చున్న లక్ష్మణుం గాంచి యెక్కువ సంతసము నొందిరి. మహాత్ముఁ డగు రాముఁడు చేయ నలవికానిదైన లక్ష్మణుఁ డొనర్చిన కార్యముఁ జూచి, యాతని నభినందించెను. వానర వీరులును నింద్రజిద్వధమును విని మిక్కిలి సంతోషించిరి.

93-వ సర్గము

ఇంద్రజిద్వధజాతకోపముచే రావణుఁడు సీతను వధింపఁబోవుట

తర్వాత రావణునిమంత్రు లింద్రజిత్తు లక్ష్మణునిచే వధింపఁబడిన వృత్తాంతమును విని, రాముని దాని నిజానిజములు గనుఁగొని వగతోఁ గూడినవారలై, దశగ్రీవునికడ కేఁగి, "మహారాజా! మహా ప్రతాపశాలి యగు నీ పుత్రుఁడు మే మందఱము చూచునపుడే విభీషణునితోడ్పాటున లక్ష్మణునిచే వధింపఁబడెను. ఇంతకుమున్ను యుద్ధములం దోటమి నొంద నట్టి దేవేంద్రజేత యగు శూరుఁడైన నీ పుత్రుఁడు శూరుఁడైన లక్ష్మ ణునితోఁ బోరి, యాతనిని బాణములచేఁ గడు నొప్పించి, కట్టకడ కతనిచేఁ జంపఁబడి యుత్తమ లోకములను బొందెను" అని విన్నవించిరి.

రాక్షసాధిపుఁడు జాలిపడఁదగిన పరుసని మాట తనచెవిఁ జుట్టు మనికాల్చినట్లు చొఱఁగా, మూర్ఛనొంది, చాలసేపటికి స్మృతినొంది, పుత్ర శోకముచే నొచ్చినవాఁడై, తెగువమాని, యింద్రియముల నెమ్మదిఁ దప్పి యివ్విధమున విలపింపఁ దొడఁగెను. "హా రాక్షససేనానాయకా! హా నా బిడ్డఁడా!! హా మహారథా!! ముందు వేల్పుటేనిం గెల్చి యింద్రజిత్తని బిరుదనామము వహించినవాఁడ విప్పు డెట్లు లక్ష్మణుని వాతం బడితివి!! ఓరీ నాయనా! నీ వలిగినచోఁ గాలాంతకుల నైనను బాణములచే సంహరింతువుగదా! మందరపర్వతశిఖరములనైనను దుత్తునియలు సేసియుందువుగదా? అట్టి నీ కీ లక్ష్మణుఁ డనఁగా నెంత

మాత్రము! ఇప్పుడు యమధర్మరాజు నాచేఁ గడు మర్యాద సేయఁదగిన వాఁడు.దీర్ఘబాహుఁడా! యతఁడు నిన్నీ మృత్యువుపాలఁ ద్రోసెనుగదా. ఆహా! యీ యముఁ డెంత దొడ్డవాఁ డనవచ్చును!! సుభటుల కీ మార్గమే శ్లాఘ్యమైనది. రాజునిమిత్తమయి యనిమొనయందుఁ బ్రాణములఁ బరిత్యజించు శూరుండు స్వర్గలోకము నొందుచున్నాఁడు. ఇఁక దేవసమూహములును, లోకపాలు రందఱును, మహర్షులును నింద్రజిత్తు యొక్క మరణవృత్తాంతమును విని, దిగులువిడిచి హాయిగా నింద్రింతురు. ఇప్పుడు మూఁడులోకములును పర్వతారణ్యసమేతమైన యీ భూమండలమును నింద్రజిత్తొక్కఁడు లేమిచే నా కంతయు శూన్యముగాఁ దోఁచుచున్నవి. పర్వతగుహాయం దాఁ డేనుఁగులు గుంపులుగూడి యఱచిన చందమున నంతఃపురమున రాక్షసకన్యకలు గావించు రోదనధ్వనులను నేను వినఁబోవుచున్నాఁడను. ఓరీ! శత్రుతాపనా! నాయనా! యువరాజపదవిని, లంకాపురమును, రక్కసులను నన్నును దల్లిని విడిచి యెక్కడి కేఁగితివిరా? నేను పరలోకమునకుఁ బోయిన నీవుగదా నాకుఁ బ్రేతకృత్యము లొనరింపవలయును. ఇది యిప్పుడు విపరీతమయ్యెఁగా. నేను నీకుఁ బితృకృత్యము లొనరింపవలసెఁగదా? రామలక్ష్మణ సుగ్రీవులు ప్రాణములతో నుండఁగా, నీవు నాడెందమునందు నాఁటిన దుఃఖరూప మగు శల్యమును దీయక మమ్ము విడిచి యెచటికిఁ బోయితివి?"

ఇవ్విధమున రావణుఁడు పలవించుచుండఁగా నతనికిఁ బుత్రశోకమువలనఁ గ్రోధము మిక్కుటమయ్యెను. రావణుఁడు స్వభావముచేతనే క్రూరుఁడు. వేసవిని సూర్యుని నతనికిరణములు మఱింత జ్వలింపఁజేయుచందమున నట్టి రావణునిఁ బుత్రవధము వలని క్రోధము మిక్కిలి జ్వలింపఁజేసెను. అతఁడు కనుబొమ్మలు ముడివెట్టి ప్రళయకాలమునందు మొసళ్లతోఁ గూడిన మహాసముద్రముకైవడిఁ బ్రకాశించెను. ఆ రావణుఁ డాగ్రహముచే నావులింపఁగా, వృత్రాసురుని మోమునుండి వోలె నా రాక్షసశ్రేష్ఠుని మోమునుండి పొగతోడ నగ్ని వెలువడెను. శూరుఁ డగు రావణుఁడు పుత్రమరణముచేఁ గడు వగచి, కోపపరవశుఁడై యప్పుడు చేయవలసినపని యేమని యాలోచించి, సీతావధము గార్యమని తలఁచెను. స్వాభావికముగా నెఱ్ఱనైన యా రావణుని కడు

భీకరము లగు కన్నులు క్రోధాగ్నిచే మఱింత యెఱ్ఱనై ధగధగమని యెఱియుచుండినవి. మండుచున్న దీపములనుండి చమురుబొట్లు మంటల తోడఁ గ్రిందఁబడినట్లు, ఆగ్రహముతోఁ గూడిన యా రావణుని నేత్రమూలనుండి కన్నీటిబిందువులు పడినవి. స్వభావక్రూరమైన యాతని రూపము గోపముచే మఱింత క్రూర మయి ప్రలయకాల క్రుద్ధరుద్రుని రూపముమాడ్కిఁ జేరరానిదై యుండెను. ఆ రాక్షసాధిపుఁడు పండ్లు పటపట గొఱుకఁగా, నా దంతముల ధ్వని దానవులచేఁ జుట్టఁబడు యంత్రధ్వని వోలె వినఁబడుచుండెను. ఆతఁడు కాలాగ్నిమాడ్కిఁ గట్టలుక పూని యే యేదిక్కును జుఱచుఱఁ జూచెనో యాయా దిక్కు నందలి రాక్షసులందఱు వెఱపుచే నెక్కడ నెక్కడనో డాఁగిరి. అంతకుని మాడ్కిఁ గినుక పూని, చరాచరభూతముల మ్రింగఁగోరుచు నన్ని దెసలు చూచుచున్న యా రాక్షసేంద్రునికడకు రాక్షసులు రా వెఱచిరి.

అంత రాక్షసాధిపుఁ డగు రావణుఁడు కట్టలుక పూని, భయపడి పరుగెత్తుచున్న రాక్షసుల నందఱిని యుద్ధరంగమున నిలుపఁగోరినవాఁడై వారలం జూచి యి ట్లనియె: "నేను వేనవేలయేండ్లు చేయ నలవికాని యుగ్రతపమొనరించి, యాయా తపస్సులు ముగిసినప్పుడు బ్రహ్మను సంతోషపఱచితిని. ఆ తపోమహిమవలనను, బ్రహ్మదేవునివరప్రభావము వలనను నాకు దేవాసురులవలన నెప్పటికిని భయములేదు. సూర్యుని మాడ్కి వెలిఁగెడియొక్క దివ్యకవచమును బ్రహ్మదేవుఁ డొసఁగెను. అది దేవాసురయుద్ధములం దెప్పటికి నెవ్వరిచేతను భేద్యము గాదు. నే నా కవచము దొడిగి, రథం బెక్కి యుద్ధరంగమున వచ్చి నిలిచినప్పుడు నన్నెవఁ డెదిరింపఁజాలును! సాక్షాత్తుగా నింద్రుఁడు వచ్చినను న న్నేమి యుఁ జేయఁజాలఁడు. అప్పుడు నాతపస్సునకు మెచ్చుకొని నాకుఁ బ్రత్యక్షమైన బ్రహ్మదేవుఁడు దేవాసురవధమునకై యొసఁగిన బాణములతోఁ గూడిన యా మేటి వింటిని రామలక్ష్మణసంహారమునిమిత్తమే యిప్పుడు మంగళవాద్యములతోడఁ దీసికొని రండు."

శూరుఁ డగు రావణుం డివ్విధమున నానతిచ్చి, పుత్రవధశోక పీడితుఁడై యాగ్రహమునొంది, మనమున సీతాదేవిని వధింప నిశ్చయిం

చెను. స్వభావ రక్త నేత్రుఁడును, చూపఱకు వెఱపు పుట్టించు వాఁడును, కడుఁ గ్రూరుఁడునునైన రావణుఁడు దీనుఁడై విన్నఁదనమున నున్న రాక్షసుల నందఱిని జూచి యిట్లనియె: "నాపుత్రుఁడు వానరులను మోసపుచ్చుటకై యిదిగో సీత యని చూపి, మాయామయి యగు సీతను వధించెను. నేను స్వప్రియము గోరి యిక్కార్యమును వాస్తవముగానే యొనరించెద. ఆ క్షత్రియాధముని నమ్మియుండు నాసీత నిప్పుడే నఱికెదను." అని మంత్రులతోఁ జెప్పి, ఖడ్గమును దాఁకెను. రావణుఁడు పుత్రశోకముచే హృదయమున మిగులఁ గలఁతఁజెంది గినుక పూనినవాఁడై పూలదండలచేఁ గై సేయఁబడినదియు నిర్మల మయిన యాకసమువంటి శ్వేతకాంతి గలదియునైన ఖడ్గమును దీసికొని, భార్యను దోడ్కొని మంత్రిసమేతుఁ డయి సీతాదేవియున్న చోటికిఁ బోయెను.

రాక్షసు లంద ఱవ్విధమునఁ బోవుచుండు రావణునిఁ గాంచి సింహనాదము గావించి, కోపముతో నున్న యతనిం గని, యొండొరులఁ గౌఁగిలించికొని యివ్విధమునఁ బలికిరి. 'ఈ మన యేలికను గాంచిన వెంటనే యీ రాజపుత్రు లిద్దఱు దిగులొందుదురు. కట్టలుక పూని యితఁ డింతకుమున్నింద్రాదిదిక్పాలురను నల్వురను జయించెను. మఱియు నెంచఱో పగతు రితనిచే నణఁపఁబడిరి. రావణుఁడు ముల్లోకములందును మేలయిన వస్తువులను దెచ్చి యనుభవించుచున్నాఁడు. బలపరాక్రమములం దితనితో సమానుఁడు వేఱొక్కఁడు లేఁడు. ఇవ్విధమున వారొండొరులు మాటాడుచుండఁగా, రావణుఁ డాగ్రహముచే మేను మఱచినవాఁడై యశోకవనమున నున్న సీతాదేవికడ కేఁగుదెంచెను. తన మేలుగోరు చెలికాండ్రు వలదు వలదని నివారించుచున్నను రావణుఁడు కట్టలుక పూని, యాకాశమున నంగారకుఁడు రోహిణిని సమీపించిన తెఱఁగున సీతాదేవి సన్నిధికిఁ బోయెను.

పతివ్రత యగు సీతాదేవి రాక్షసస్త్రీలచేఁ గాపాడఁబడుచు, మేటి ఖడ్గము దాల్చి తనవద్దకు వచ్చు రాక్షసాధిపునిఁ గాంచెను. పెక్కండ్రు చెలికాండ్రు వలదు వల దని బహుభంగుల నివారించుచున్నను, వారిమాటలఁ బెడచెవిం బెట్టి మఱలిపోక వచ్చుచుండు నారావణునిఁ గాంచి కడునొచ్చినదై, దుఃఖపరవశయాటచేఁ బలవించుచు

ని ట్లనియె: "ఇతఁ డత్యాగ్రహభరితుఁడై నన్ను ద్వేషించి తానే పరుగెత్తి వచ్చుచున్నాఁడు. కనుక, నీ బుద్ధిహీనుఁడు నాథుఁడుగలదాన నైన నన్ననాథనుగా నెంచి వధింపఁ బూనుచున్నాఁడు. భర్తనే యనుసరించిన నియములు గలదానవైన నన్నుఁ బలుమాఱు "నాకు భార్యవు గమ్ము, రమింపుము" అని నిర్బంధపెట్టిన నితనిని నేను సరకుసేయనైతిని. నే నంగీరింపక పోఁగా, నితఁడు నాయెడ నిక్కముగా నిరాశసేసికొన్నవాఁడు కనుకఁ గ్రోధమోహముల నొందినవాఁడై నన్ను సంహరింపఁ బూనిన వాఁడు. ఒకవేళ రాజపుత్రు లగు సోదరులైన రామలక్ష్మణులను నానిమిత్త మై యీదురాత్ముఁ డిప్పు డధించెనో! కావుననే నాకడకు నిర్భయముగా వచ్చుచున్నాఁడో! అక్కటా! యారాజపుత్రులకుఁ జేటు నానిమిత్తమే కదా? ఏల నాయీ పాడుబ్రతుకు! లేక, పుత్రశోకముచే రామలక్ష్మణు లను సంహరింపఁజాలక, పాపాత్ముఁ డగు నీ క్రూరరాక్షసుఁడు నన్ను వధింప వచ్చుచున్నాఁడో! బుద్ధిహీనురాలనై నపుడు హనుమంతుని మాటను విన నైతిని. నే నతనిమాట విని యాతనివీఁపుమీఁద నెక్కి యప్పుడపోయి యుందు నేని యిప్పుడు నేను నాప్రియుని యంకముఁజేరిన దాన నయి శోకము నొందకయుందును గదా! రావణుఁడు యుద్ధరంగ మున రాముని వధించె నని విన్న వెంటనే యేకపుత్ర యగు నాయత్తగారు కౌసల్యాదేవియొక్క హృదయము బ్రద్దలు కాఁగఁల దని తలఁచెదను. మఱియు నాయత్త విలపించుచు మహాత్ముఁ డగు నా నాథుని బాల్య యౌవనచేష్టలను, ధర్మకార్యానుకూలతను దలపోయఁగలదు. ఆమె పుత్రుఁడు మృతినొందఁగా, నతనికి నైనశ్రాద్ధమొనర్చి, బ్రతుకుమాని, మోహమంది, చితిఁబేర్చి యందెక్కఁగలదు. లేదా నేను యుండఁగ గలదు. కౌసల్య కింత వ్యసనము దెచ్చిపెట్టినది యా గూనిమంథర గనుక జెడుతలంపుగల నీచురా లగు మంథరను దూరవలయును." అని పల్కి బాసి యంగారకుని వశమునఁ జిక్కిన రోహిణివలె సీతాదేవి విలపించు చుండెను.

ఇంతలోపల మేధావంతుఁడును, సదాచారసంపన్నుఁడును నైన సుపార్శ్వుఁ డను రావణునిమంత్రి మంత్రులచే నివారింపఁబడు చున్నను బైఁబడి పోవుచున్న రావణునిఁ జూచి "ఓ దశగ్రీవా!

V.R. NARLA MEMORIAL LIBRARY V.R. NARLA & P.R. LIBRARY Acc. No.

నీవు సాక్షాత్తుగాఁ గుబేరుని తమ్ముఁడవు. నీవు సకలధర్మముల నెఱిఁగినవాఁడవు. అట్లుండియుఁ గ్రోధము పూనినవాఁడవై పాఁడి దప్పి యీ వైదేహిని జంపఁగోరుచున్నాఁడవు. నీ వెల్లప్పుడు వేదాధ్యయన మొనర్చి వేదవ్రతము లొనరించినవాఁడవు. స్వకర్తాను ష్ఠానము విడువని వాఁడవు. ఓ మొనగాఁడా! నీ వేల స్త్రీవధము సేయఁ గోరుచున్నావు ? అందకత్తె యగు సీత మఱొక్కప్పుడైనను నిన్నుఁ బొందఁగల దని వేచి యుండుము. నీ వీ కోపమును రామునియందుఁ జూపుము. మే మంద అము నీకు సహాయులమై యుండఁగలము. నేఁడు కృష్ణపక్షచతుర్దశి. నేఁడే యుద్ధప్రయత్న మొనరించుకొని సైన్యములతోడ నమావాస్య నాఁడు శత్రువిజయమునకై వెడలుము. అట్లు వెడలివచ్చి శౌర్యధైర్య ములు పూని, రథమెక్కి ఖడ్గముగొని, రాఘవుని సంహరించి యావల సీతాదేవి నొందఁగలవు." అని రావణునితో విన్నవించెను. తర్వాత నా దురాత్ముఁ డగు రావణుఁడు తన యాప్తుఁడు సెప్పిన పాఁడిదప్పని మాట నియ్యకొని మఱలి నగరమునకుఁ బోయెను. తర్వాత శూరుఁడైన యా రావణుఁడు నగరమునకుఁ జనియు నెమ్మదితో నుండఁజాలక, చెలికాండ్రను దోడ్కొని సభామందిరమునకుఁ బోయెను.

94-వ సర్గము

మూలబలయుద్ధము

ఆ రావణుఁ డెక్కువ వగపునొందినవాఁడై దిట్టతనము వీడి, కొలువుకూటము సొచ్చి, కినుక గదిరిన సింగముమాడ్కి నిట్టూర్పు విడు చుచు సింహాసనముమీఁదఁ గూర్చుండి, పుత్రమరణవ్యసనముచేఁ జిక్కిన వాఁ డయినందునఁ జేతులుమోడ్చి, యాసేనాపతులనందఱిని గాంచి యి ట్లనియె: సైనికులారా, మీ రందఱు మనకడ నున్నట్టి రథగజతురగ పదాతులం దోడ్కొని, యుద్ధమునకు వెడలిపోయి, వార్షికమేఘములు జడి గురిపించునట్లు బాణవర్షమును గురిపించుచు, నా రాము నొక్కనిని జుట్టుకొని వధింపవలయును. ఒకవేళ మీ రతనిని సంహరింపఁజాలరేని, అతనిని వాఁడియమ్ములచే నొంచి, దేహమును జీల్చుఁడు. నేను రేపు యుద్ధరంగమునకు వచ్చి జను లందఱు చూచుచుండఁగా, నా రాముని వధించెదను.

అని రావణుఁ డానతియ్యఁగా, రాక్షసులందఱు చతురంగబలమును దోడ్కొని, శీఘ్రగాము లగు రథములమీఁద నెక్కి యుద్ధరంగమునకుఁ బోయిరి. అట్లు పోయినతర్వాత నందఱు రాక్షసులు శత్రుసంహారకములైన పరిఘ పట్టిస శర ఖడ్గపరశ్వథములను వానరులపైఁ బ్రయోగించిరి. వానరులును రాక్షసులపై వృక్షములను బర్వతములను బ్రయోగించిరి. ఆ నాఁడు సూర్యోదయము మొదలు రాక్షసులకును వానరులకును భయంకరమైన గొప్పపోరు జరిగెను. అప్పుడు వానరరాక్షసులు వింతైన యీఁటియలతోను, బాకులతోను, గొడ్డళ్లతోను నొండొరులను గొట్టుకొనిరి. ఆ గొప్పపోరునందు లేచిన మిగుల నెక్కువైన దుమ్ము వానరరాక్షసుల యొంటినెత్తుటివెల్లువలచేఁ దడిసి యడఁగిపోయెను. గజములు రథములు ననెడి గట్లును, గుఱ్ఱములనెడి మత్స్యములును, టెక్కెము లనెడు చెట్లును, శరీరములనెడి తెప్పలును గలరక్తనదులు పాఱెను. తర్వాత వానరులు రక్తధారలచేఁ దడిసిన మేనులు గలవార లయ్యు దుమికి దుమికి, రాక్షసుల టెక్కెములు, మైమఱుపులు, నరదములు, తేజీలు, పెక్కుటడిదములును విఱిచిరి. మఱియుఁ దమ వాఁడిగోళ్లతోను, కోఱలతోను వెంట్రుకలను లాగిరి. చెవులను, ముక్కులను గొఱికిరి. నొసళ్లను ఱక్కిరి. పక్షులు ఫలవంత మైన వృక్షమునుగూర్చి పరుగెత్తుచందమున, సమరమున నూఱేసి వానరవీరు లొక్కొక్క రాక్షసునిమీఁదికి దుమికిరి, పర్వతములఁబోలు రాక్షసులందఱు భయంకరులైన వానరవీరుల నందఱిని గొప్పగదలతోను, ఈఁటియలతోను, కత్తులతోను, గొడ్డళ్లతోను గొట్టిరి. రాక్షసులచే బహుప్రకారముల నొంపఁబడుచున్న వానరమహాసైన్య మంతయు శరణాగతరక్షకుఁ డయిన దశరథతనూజుని శరణు చొచ్చెను.

తర్వాత మహావీర్యప్రతాపములు గలవాఁ డగు రాముఁడు వింటిని గైకొని రాక్షససేనామధ్యము ప్రవేశించి, బాణవర్షమును గురిపించెను. మేఘములు నింగిని వెలుఁగునట్టి సూర్యునికడకు రాఁజాలనట్లు రాక్షసులు కడుభీకరముగా బాణపుఁ జిచ్చుచేఁ గాల్చుచున్న రాముని దాపునకు రా వెఱచిరి. రాక్షసులు దాశరథి దుష్కరములైన కార్యములను జేసినతర్వాత నా కార్యములను గనుఁగొనిరే గాని చేయునప్పు

డెఱుఁగరైరి. మహారథులను ధ్వంసముచేయుచు గడగడ లాడించు చుండు రాముని వారు వనమున వీఁచు వాయువుంబోలెఁ జూడఁ జాల కుండిరి. ఆయుధ ప్రయోగమున రామునిచే ఛేదింపఁబడినదియు, చీల్పఁబడినదియు, గాల్పఁబడినదియు, మిగుల నలఁగఁగొట్టఁబడినదియు, నొంపఁబడినదియు నైన యా రాక్షససేన రామునియొక్క హస్తలాఘు వమును గనుఁగొనఁ జాలకుండెను. ఇంద్రియవిషయముల ననుభవించుచు ననుభవముచే నూహింపఁదగిన జీవాత్మను జను లెఱుఁగఁజాలనట్లు తమపై బాణముల గ్రుమ్మరించుచున్న రాఘవుని రక్కసులు సూడరైరి. "ఇదిగో యితఁడు వాఁడియమ్ములతో నేనుఁగుల నెక్కువారిని గొట్టు చున్నాఁడు. ఇదిగో యితఁడు మహారథికులను గొట్టుచున్నాఁడు. ఇదిగో యితఁడు కాలిబంటులను గుఱ్ఱపురౌతులను నొంచుచున్నాఁడు." అని రామునిపోలికతోఁ గన్పట్టుచుండువారినిగూర్చి చెప్పుచు రాక్షసులు రాముని పోలికంబట్టి కోపముతో నొండొరులనుగొట్టిరి. రాముఁ డెక్కువ మహిమగల గాంధర్వాస్త్రము నేయఁగా, రాక్షసులు మోహాపరవశులై, తమసేనలం గాల్చుచున్న రాముని జూడరైరి. ఆ రాక్షసు లన్ననో బవర మున వెఱపుచే వేలకొలఁది రాములను జూచిరి. అయిన నాగొప్ప యుద్ధ మున మఱల రాముని నొక్కనినే చూచిరి. ఎడతెగక యల్లెత్రాటి నీడ్చి గిరగిర ద్రిప్పుచుండుటంజేసి, గుండ్రనైన కొఱవింబోలు స్వర్ణమయమైన యా మహాత్ముఁ డగు రాముని వింటికొనను రాక్షసులు గానరైరి. శరీరమే బొడ్డుగాను, బలమె జ్వాలగాను, శరములె యాకులుగను, గుండ్ర నిదిగాఁ జేయఁబడిన విల్లు పరములుగను, జ్యాలతధ్వనులె ధ్వనులుగను, తేజస్సే యింద్రియములుగను, శరీరశోభయే కాంతిగను, దివ్యాస్త్రముల శక్తియే వాదరగను గలదై రాక్షసులను సంహరించునట్టి రాముఁ డనెడి సుదర్శనచక్రమును బ్రజలు గాలచక్రమును జూచునట్లు లా రాక్షసులు చూచిరి. వాయువేగముగల పదివేవురు రథికులను, వడిగల పదునెనిమిది వేల యేనుఁగులను వాని కాఁపరులను, గుఱ్ఱపురౌతులం బదినాలుగు వేవురను వారి యన్ని గుఱ్ఱములను, రెండులక్షలమంది కాలరులను దినమున నెనిమిదవభాగమున (మూఁడుమ్ముక్కాలుగడియ) రాముఁ డొక్కఁడె కోరినరూపం బెత్తఁగల రాక్షసులను బెక్కండ్రను నిప్పు

మంటలఁబోలె మండెడి బాణములచేఁ ద్రుంచెను. ఆ రాక్షసులలో హతశేషులు రథగజాశ్వములం బోఁగొట్టుకొని గర్వ ముడిగి విఱిఁగిన ధ్వజములతోడ లంకాపురము నెరుర్కొని పోయిరి. హతములైన గజాశ్వ పదాతి బలముతోఁ గూడిన యా రాముని యుద్ధప్రదేశము కోపపరితుఁ డయిన రుద్రుని యుద్యానముమాడ్కిఁ బ్రకాశించెను. దేవగంధర్వమహర్షు లా రాముని పరాక్రమముం గాంచి, బాగు బాగని కొనియాడిరి. అప్పుడు ధర్మాత్ముఁడైన రాముఁడు సమీపమున నున్న సుగ్రీవ విభీషణ హనుమజ్జాంబ వన్మైంద ద్వివిదులంగూర్చి "ఈ దివ్యాస్త్ర ప్రయోగశక్తి నాకును, రుద్రునకును గలదు. గాని వేఱొక్కరికి లే."దని చెప్పెను. రాక్షససేన నెల్ల జయించిన దేవేంద్రునివంటి బల పరాక్రమములు గలవాఁ డయినవాఁడును, శస్త్రాస్త్ర ప్రయోగమున నలసట నొందనివాఁడు నైన రాముఁడు సంతుష్టు లయిన దేవతలచే స్తోత్రము చేయఁబడుచుండెను.

95-వ సర్గము

రాక్షసస్త్రీలు విలపించుట

రావణుఁడు పంపినట్టి రౌతులతోడఁ గూడిన గుఱ్ఱములును, మావటీండ్రతోఁగూడిన యేనుఁగులును, టెక్కెములతోఁగూడి యగ్ని హోత్రునిచందమునఁ దేజరిల్లు రథికులతోఁ గూడిన రథములును, గదల తోను గుదియలతోను యుద్ధము చేయువారును, పసిఁడిమయములైన వింతవింత లగు ధ్వజములు ధరించినవారును, కోరినరూపమెత్తఁగల వారునైన పెక్కువేల కాలిబంటులును రామునిచేఁ జక్కని బంగారు తొడవులతో సింగారింపఁబడిన విచిత్రశక్తిగల వాఁడిబాణములతో సంహరింపఁ బడుట చూచి సమరమునుండి వచ్చిన హతశేషులును ఆ వార్తను విన్నట్టి లంకాపురస్థులైన రాక్షసులును మిక్కిలి తత్తర పాటొందిరి. మగలం బోఁగొట్టుకొన్నవారును, పుత్రులఁ గోల్పోయిన వారును, బంధువులం దారపోసికొన్నవారునునైన రాక్షసకాంత లందఱు వెలవెలపోయి వగ గూరినవారై, డెందములందు నొచ్చుకొనుచుఁ గడు దీనముగా నిత్తెఱంగున విలపించిరి.

వికృతరూపిణియు, బొజ్జ పెరిగినదియునైన శూర్పణఖ రూపము నొందిన మన్మథునివలె నున్నవాఁడును, బలవంతుఁడును, సర్వభూతములకు హితముచేయఁ దలపెట్టువాఁడును నైన రామునికడ కేల పోయెనో! పోయినదిపో, లోకనింద్యయు, రూపము లేనిదియు, దయా దాక్షిణ్యాది సుగుణములు లేనిదియు, ముఖసౌందర్యము లేనిదియునైన యా శూర్పణఖ సుకుమారుఁడును, గుణవంతుఁడును మహాప్రతాప శాలియు, సుందర మయిన మోము గలవాఁడును నైనరాము నెట్లు మోహించెనో! ముఖమున ముడతలు గలదియు, నెఱసిన కురులతోఁ గూడినదియు, విరూపిణియు నగు రక్కసి మన దురదృష్టవశమున సకల లోకనింద్యమును, పరిహాసము చేయఁదగినదియు నైన యకార్య మొనరించుటె కాక, ఖర దూషణాది సర్వరాక్షస వినాశమునకై రాముని బెదరించెను. ఆ శూర్పణఖ నిమిత్తమేకదా రావణుఁడు రామునితో బలవద్విరోధము పూనెను. రావణుఁడు తన చావునిమిత్తమై సీతాదేవి నిచ్చటికిఁ దెచ్చెను. దశగ్రీవుఁడు సీతాదేవిని బొందినవాఁడును గాఁడు. కాని యాతనికి బలవంతుఁ డయిన రాఘవునితోఁ తీఱని పగ యేరుపడినది. వైదేహిని గోరివచ్చిన విరాధుం డను రాక్షసుని రాముఁ డొక్కఁడె సంహరించెనే. అదియె రాముఁడు సకలరాక్షససంహారము చేయఁగలఁ డనుటకు జాలినంత నిదర్శనము. జనస్థానమున భయంకరకార్యము లొనర్చు పదునాలుగు వేలమంది రాక్షసులును, ఖరదూషణత్రిశిరసులును రామునిచే సూర్యునిఁ బోలిన వాఁడి నారసములచే నొక్కనిచేతనే వధింపఁబడిరే! ఇది రాముఁడు రాక్షససంహారమునకుఁ జాలినవాఁ డనుటకుఁ జాలినంత నిదర్శనముకదా. యోజనాయత బాహువులఁ జాచికొని, కోపముచే నఱచుచు వచ్చిన కబంధుని రాముఁడు సంహరించిన యంశము మనకు నిదర్శనముగాదా? మేరుపర్వతముమాడ్కి గంభీరుఁ డయిన యింద్రతనూజుఁ డగు బలవంతుఁ డయిన వాలిని రాముఁ డొక్కఁడు సంహరించెను. అది మనకు సంపూర్ణ నిదర్శనముగాదా? రాజ్యాపేక్ష వదలుకొని, దీనుఁడై ఋశ్యమూకపర్వతమున డాఁగియున్న సుగ్రీవుని కభయ మిచ్చి యాతనికి గిష్కింధాపురాధిపత్యం బొసఁగెనే. అది రాముని పరాక్రమమునకుఁ జాలినంత నిదర్శనముగదా? విభీషణుఁడు ధర్మార్థసంపాదకమును, సకల రాక్ష

సులకు హితకరమును, యుక్తియుక్తమును నైన మాటఁజెప్పెను. కాని, అజ్ఞానమువలన రావణుని కది రుచింపదయ్యెను. కుబేరుని తమ్ముఁడగు రావణుఁడు విభీషణుని మాటప్రకారముగా నడచుకొని యుండునేని, యీ పట్టణ మిట్లు వల్లకాడై, యేడ్పులతో నిండియుండదుగదా! మహాబలుఁ డగు కుంభకర్ణుఁడు రాఘవునిచే వధింపఁ బడుటను, శత్రువులచే నోర్వరానివాఁ డగు నతికాయుని, దనముద్దులపట్టి యగు నింద్రజిత్తును లక్ష్మణుఁడు నుగ్గాడుటను వినియు రావణుఁ డింకను దెలిసికొనఁ జాలకున్నాఁడే. "అక్కటా! నా కొడు కీల్గెను? నాతోఁబుట్టువు మడిసెను. నా భర్త సమసె" నని యిత్తెఱఁగున రాక్షసుల యింటింటను నేడ్పుధ్వనులు వినవచ్చుచున్నవే. రాముఁడు సమరమున వేలసంఖ్యగల యోధులను, గజతురంగములను, శూరు లగు రాక్షసులను బెక్కండ్రను సంహరించెను. రుద్రుఁడో, విష్ణువో, మహేంద్రుఁడో, సాక్షాద్యముఁడో రామరూపముతో వచ్చి మనలను హింసించుచున్నాఁడు. మనవీరు లందఱు మడిసిరి. ఇఁక మనము జయింపఁగల మన్న యాస యుడిగెను. ఇఁక మన భయంబుడిపి మనలఁ గాపాడు దిక్కెవ్వరును లేరు. కనుక మన మిప్పు డేడ్చుచున్నాము. రావణుఁడు వరదానగర్వితుఁడై రామునివలన యీ కడుగొప్ప భయము నెఱుఁగకయున్నాఁడు. యుద్ధరంగమున రాముని చేతఁ జిక్కినవానిని రక్షింప దేవ గంధర్వపిశాచ రాక్షసులైనను జాలరు. రావణునికిఁ బ్రతి యుద్ధమునను జెఱుపులు గనఁబడునున్నవి. మఱియు రామునిచే రావణసంహారము జరుగఁగల దని శకునములు సూచించుచున్నవి. రావణుఁడు బ్రహ్మను దపముచే సంతోషపెట్టి, దేవ దానవ రాక్షసులవలనఁ దనకు మరణము లేకుండునట్లు వరము గోరెనుగాని, యలక్ష్యతచే మానవులవలనఁ దనకు మృతి లేకుండునట్లు వరము కోరఁడయ్యె. కావున నిప్పుడు రావణునికిని రాక్షసులకును బ్రాణనాశకమైన దియు, భయంకరమునునైన మానవునివలని యాపద వచ్చిన దని యెంచెదము. తొల్లి రావణుఁడు బ్రహ్మవలనఁ బడసిన బలగర్వముచే దేవతల నందఱను నొంపఁగా, వా రత్యుగ్రతపములచే బ్రహ్మనుగూర్చి యుపాసించిరి. అప్పుడు మహాత్ముఁ డగు బ్రహ్మదేవుఁడు దేవతలయందఱి హితము కోరి, వారిం జూచి సంతసముతో "నేఁడుమొదలు దానవరాక్షసు లంద

తెల్లప్పుడు ముల్లోకములందును దమ్ము నొరు లేమి చేయుదురో యని వెఱపుతోఁగూడి సంచరించుచుందు" రని వరమొసఁగెను. తర్వాత దేవత లంద ఱింద్రుని మున్నిడుకొని యీశ్వరు నారాధించి, ప్రసన్నునిఁ జేసికొనిరి. అప్పుడు మహేశ్వరుఁడు ప్రత్యక్షమై వేల్పుల నందఱిం గూర్చి, "వేల్పులారా! మీ మేలుకొఱకయి, రక్కసులకుఁ జేటు గలిగించునదైన యొక వనిత పుట్టఁబోవుచున్నది" యని వాక్రుచ్చెను. తొల్లి దేవతలచేఁ బంపఁబడిన క్షుత్తు దానవులను మ్రింగునటు లీ సీతాదేవి రావణుఁడు మున్ను గాఁగల మనల నందఱను మ్రింగివేయఁగలదు. దుర్మార్గుఁడును, బుద్ధిహీనుఁడునైన రావణునియొక్క చెడునడవడిచే మనకీ ఘోరమైన మహావిపత్తు సంభవించెను. ప్రలయకాలమున యమునిచేఁ జిక్కినవారిఁ బోలె నీ రామునివశమునఁ జిక్కిన మనకు శరణొసఁగువాఁ డొక్కఁడును గానరాఁడు. కానలయందుఁ గార్చిచ్చునడుమఁ జిక్కిన యాఁడుగజములమాడ్కి నత్యాహితమునను న్న మనల రక్షింపఁజాలినవాఁ డొక్కఁడును లేఁడు. ఆ పౌలస్త్యుఁ డయిన విభీషణుఁడు తన కెవ్వరివలన భయము సంభవించునో యతనినే శరణుచొచ్చెను గాన నతఁడు యుక్తకార్య మొనరించెను." ఇట్లు రాక్షసకాంత లంద ఱొండొరులఁ గౌఁగిలించికొని, యెక్కువ వెతలం గుంది, దీనముగాఁ బలవించుచుఁ గడు భయంకరముగా బిగ్గఱగా గొంతెత్తి యేడ్చిరి.

96-వ సర్గము

రావణుఁడు యుద్ధమునకు వెడలుట

రావణుఁడు లంకాపురమునందలి ప్రతిగృహమునను బుత్ర భర్తృ భ్రాతృవధముచేఁ గరుణముగా విలపించుచున్న స్త్రీల యార్తధ్వనుల నాలకించి, నిట్టూర్పు విడిచి, కొంతతడవు చింతించి, పిదపఁ గట్టలుక పొంది, కన్ను లెఱ్ఱగాఁ జేసి, పెదవులుకొఱికి ప్రలయకాలపుఁ జిచ్చు కైవడిఁ బెరిఁగి, రాక్షసులచేతను జూడ నలవికానివాఁడై తమకుఁ జేటు మాట సెప్పుననెడి భయముచే మాటలాడకయుండు చేరువనున్న మహోదర మహాపార్శ్వ విరూపాక్షు లనెడి మంత్రులనుగూర్చి, "నా యానతిని పోయి సైన్యములను వేగ రా నానతిచ్చి రండు" అని యానతిచ్చెను. ఆ రాక్షసులును నొచ్చియు, వెఱపుచే రావణుని యాజ్ఞప్రకారము

జాగ్రత్తగల యా రాక్షససేనలను బ్రేరేపించిరి. ఆ భయంకరాకారులగు రాక్షసులందఱు మంగళాశీర్వాదములం బొందినవారై యుద్ధమునకు వెడలివచ్చి రాక్షసేంద్రుఁ డగు రావణుని మర్యాదకుఁ దగినట్లు గౌరవించి, తమ యేలికయొక్క విజయముగోరుచుఁ జేతులు జోడించికొని నిలిచియుండిరి.

అప్పుడు రావణుఁడు కోపముచే మై మఱచి, యట్టహాసము గావించి, మహోదర మహాపార్శ్వ విరూపాక్షులం జూచి యి ట్లనియె: "సచివులారా! నావింటినుండి వెడలిన ప్రలయకాల సూర్యునిమాడ్కి వెలుఁగు బాణములచే రామలక్ష్మణులను యమపురికిఁ బంపి, ఖర కుంభకర్ణేంద్రజిత్తుల వధములకుఁ బ్రతి యొనరించి కసిఁ దీర్చికొనెదను. మఱియు, నాకాశమును, దిక్కులును, సముద్రములును మద్బాణాత్మకములగు మేఘములచే నాచ్ఛాదితములై వెలుఁగకుండును. ఇప్పుడ కంకపత్రములుగట్టిన యమ్ముల నేసి, వానరవీరుల నందఱిని నుగ్గునేసెదను. వాయువేగముఁబోలు వేగము గల రథమును వానరులమీఁదికిఁ దోలి, విల్లనెడి సముద్రమునుండి పుట్టిన బాణము లనెడి యలలచే వానరసైన్యములను ద్రోచిపుచ్చెదను. మోము లనెడి విరిసిన తామర పువ్వులు గలవి యగు కేసరములంబోలు మేనిడాలులు గల వానరుల గుంపు లనెడి కొలఁకుల నేనుఁగులమాడ్కిఁ గలఁచెదను. వానరవీరులు కాడలతోఁ గూడిన కమలములం బోలు సశరములైన దేహములచే యుద్ధాంగణము నలంకరింతురు. ఇప్పుడు నే నొక్కొక్కబాణపు టేటునకు యుద్ధవీరు లయిన ద్రుమయోధులగు వానరులను నూఱ్వురేసిని బడఁగొట్టెదను. ఇప్పుడు నాపగతునిం బరిమార్చి, భర్తలను, సోదరులను, కొడుకులను గోలుపోయి యల్లలాడుచుండు రాక్షసస్త్రీల కన్నీటిని దుడిచెదను. నేను వానరులను బాణములచే సంహరించి, క్రిందఁ బడఁద్రోసి, భూమండలమున నించుకేనియు సందు లేకుండున ట్లొనరించెదను. వానరులను బాణప్రయోగముచేఁ గసిమసంగి, నక్కలు గ్రద్దలు మున్నగు నంజుడుదిండ్లగు జంతువులను వీని మాంసముచేఁ దనివి నొందించెదను. వడిగాఁ దే రాయితము చేసి తెండు. వడిగా వింటిని దెండు. మిగిలియుండు రాక్షసు లందఱు నన్ను వెంబడించి వత్తురుగాక!" అని రావ

ణుఁడు చెప్పఁగా, మహాపార్శ్వుఁ డను మంత్రి యా రాక్షసేంద్రుని పలుకు లాలకించి, యచ్చట నున్న సేనాధిపులం జూచి, "సేనలను ద్వర పఱపుఁ" డని చెప్పెను.

లంకాపురమునందలి బలవంతు లగు సేనానాయకు లందఱు పూనికి గల్గి, యింటింటికి వెళ్లి రాక్షసుల నందఱను బురికొల్పుచుఁ బట్టణమెల్లఁ జుట్టిరి. తర్వాత భీకరదృష్టులు గలవారును, వికారపు మోములు గలవారునైన రాక్షసు లందఱు గదా ఖడ్గ పట్టిసాద్యాయు ధములు దాల్చి యా రాక్షసాధిపుని యెదుట నిలిచిరి. తర్వాత సేనా ధ్యక్షుఁ డెన్మిది వారువములు పూన్చిన వడిగాఁబోవు రథమును సార థిచేఁ దోలించుకొని వచ్చెను. అంత భయంకరుఁ డగు రావణుఁడు తేజ స్సుచే వెలుఁగుచుండునట్టి యా రథము నెక్కి, పెక్కండ్రు రాక్ష సులతోఁగూడి, స్వభావగంభీరతవలనఁ బుడమిని బ్రద్దలుగాఁ జేయు వానిపగిదిఁ గడువడిగా యుద్ధభూమికిఁ బయన మయ్యెను. రావణుఁ డానతియ్యఁగా, మహోదర మహాపార్శ్వ విరూపాక్ష దుర్ధర్ష లనెడి యాతని సచివులును రథముల నెక్కిరి. వారు పుడమిని బెకలించువారి చాడ్పున ఱొప్పుచు, భీకరముగా నఱచుచు జయకాంక్షతో వెడలి పోయిరి. తర్వాతఁ దేజస్సుగలవాఁడును, ప్రలయకాలరుద్రయములం బోలినవాఁడునైన యా రావణుఁడు ధనువు నెత్తికొని, వెడలెను. తర్వాత వడిగల గుఱ్ఱములు పూన్చిన యరథముఁ దోలుకొని రావణుఁ డుత్తరద్వారముమూలమున నా రామలక్ష్మణు లున్నచోటి కేఁగెను. అప్పుడు సూర్యునికాంతి తగ్గెను. దెసలెల్లఁ జీఁకటి గ్రమ్మెను. పక్షులు భయంకరముగాఁ గూఁత లిడినవి. పుడమి యదరెను. ఇంద్రుఁడు రక్త వర్షమును గురిపించెను. గుఱ్ఱములకుఁ గాళ్లు తడఁబడెను. టెక్కెపుఁ గొనలందుఁ గ్రద్దలు వాలెను. జంబుకము లమంగళకరముగాఁ గూఁత లిడెను. మఱియు నెడమక న్నదఱెను. ఎడమచేయి వదలెను. మోము వెల వెల పోయెను. కంఠధ్వని తగ్గిపోయెను.

తర్వాత దశగ్రీవుఁడు సమరమునకుఁ బోవుసమయమున మృత్యు సూచకము లయిన యీ యవశకునములు గలిగెను. పిడుగువంటి చప్పుడు గల కొఱవి యాకసమునుండి క్రిందఁబడెను. గ్రద్దలును కాకులును నమంగళ

సూచకముగాఁ బాటలు పాడెను. రావణుఁడు మోహముచే వధము గోరి, మృత్యుదేవత ప్రేరణచే, ఘోరశకునములను లక్ష్యపెట్టక వెడలి పోయెను. కడు ధీరులగు రాక్షసుల రథాగమనఘోషము చెవిసోఁకఁగా, వానరసేనయు యుద్ధమునకుఁ బూనెను. ఆగ్రహము గలిగి, పరస్పర విజిగీషతో నొండొరులం బిలుచుకొనుచు నా యుద్ధవీరు లగు వానరరాక్షసులు గొప్పయుద్ధము గావించిరి. తర్వాత దశగ్రీవుఁ డలిగి, పసిఁడి తొడవులతో నలంకరించిన శరములతో వానరసేనలందుఁ జొచ్చి గొప్ప యుద్ధము గావించెను. రావణునిచేఁ గొందఱు వానరులు శిరములు దెగ నేయఁబడిరి. కొందఱికి బొమ్మలు బ్రద్ద లయ్యెను. కొందఱికిఁ జెవులు పోయెను. కొంద ఱూఁపి రాడకుండునటు చదుపఁబడిరి. కొందఱు ప్రక్కలఁ జెదుకఁబడిరి. కొందఱు తలలు పగుల నేయఁబడిరి. కొందఱు గ్రుడ్లూడఁబెఱుకఁబడిరి. దశగ్రీవుఁ డాగ్రహమునఁ గన్నులు దిరుగుచుండ దన రథంబు నేయే వైపునకుఁ బోనిచ్చెనో, యాయా వైపునందలి వానరవీరు లెల్ల రావణుని బాణవేగము నోర్వఁజాలకుండిరి.

97-వ సర్గము

విరూపాక్షుఁ డనెడి మంత్రి వధింపఁబడుట

రావణుచే బాణములేసి భిన్నాంగులుగాఁ జేయఁబడిన పెక్కండ్రు వానరు లా యుద్ధభూమియం దంతటఁ బడియుండిరి. మిడుత లగ్ని జ్వాలల కోర్వఁజాలనట్లు వానరులు రావణాసురుని యోర్వరాని బాణపాతము నోర్వఁజాలరైరి. చిచ్చు మంటలు క్రమ్ముకొని తమ్ము దహించుచుండఁగా నేనుఁగు లా మంటల కోర్వఁజాలక పరుగిడినచందమున, వానరవీరు లా రావణుని బాణపాతము నోర్వఁజాలక బిగ్గఱగా నఱచుచుఁ గడు దవ్వునకుఁ బరుగెత్తిరి. రావణుఁ డా యుద్ధరంగమున వాఁడియమ్ములచేఁ బగతురను నొంచుచు వానరసేనలను వాయువు గొప్ప మబ్బులంబోలెఁ జెదఱఁగొట్టుచు వడిగా రామునికడకుఁ జేరెను. సుగ్రీవుఁడును సమరమున బన్నమువడి మూలమూలకుఁ బరుగులెత్తుచున్న యా వానరవీరులం గాంచి, సేననడుమఁ దనతో సమానుఁ డగు వీరుఁ డయిన సుషేణుని నుంచి, యాశ్చర్యకరముగా యుద్ధము సేయఁగోరి, వృక్షమును గొన్నవాఁడై శత్రువు నెదుర్కొనెను. గుంపులకాఁపరులగు

వానరవీరు లందఱు గొప్ప గొప్ప బండలను మ్రాఁకులను గైకొని యా సుగ్రీవుని ప్రక్కలను, వెనుకను వచ్చిరి. సుగ్రీవుఁడును గొప్ప గొంతు వెట్టి యార్చుచుఁ బెక్కండ్రు రాక్షసులపైఁ బలుతెఱఁగు లగు వృక్షములను బడనేయుచు, మేటిరాక్షసులమీఁదికిం బోయెను. ప్రలయకాలమున ఝంఝామారుతము పొడవుగాఁ బెరిఁగిన చెట్లను బడఁద్రోయు చందమున నా మహాకాయుఁ డగు సుగ్రీవుఁడు రాక్షసుల నందఱను గ్రిందఁద్రోసి నుగ్గుచేసెను. మేఘుఁడు కానలందుఁ బక్షులమూఁకపై ఱాలవానఁ గురిపించినచందమున, సుగ్రీవుఁడు రాక్షసులపైఁ బర్వతములవానను గురిపించెను. సుగ్రీవుఁ డేసిన పర్వతములు తలలమీఁదఁ బడఁగా రాక్షసులు మైమఱచి, ఱెక్కలు దెగిన కొండలమాడ్కి గ్రిందఁబడిరి.

ఇట్లు రాక్షసులందఱు సుగ్రీవునిచేఁ బర్వతములతో మోదఁబడి గ్రిందఁబడి యార్చుచు నశిల్లుచుండఁగా, విలుకాఁ డగు నోర్వరాని విరూపాక్షుఁడు తనపేరు చెప్పుచు రథమునుండి గ్రిందికి దుమికి, యేనుఁగు మీఁదఁ గూర్చుండి భయంకరధ్వనులతో నఱచుచు వానరులమీఁదికిఁ బోయెను. ఆ విరూపాక్షుఁ డట్లు పోయి వానరసేన కెదుట నిలిచి, దిగులుపడి పరుగెత్తుచున్న రాక్షసుల నందఱిని సంతసింపఁ జేయుచు సుగ్రీవునిపై భయంకరములైన బాణమ్ముల నేసెను. ఆ వానరేంద్రుఁడు విరూపాక్షునిచే వాఁడియమ్ములచే నొంపఁబడి, యాగ్రహము మీఱఁగా నా విరూపాక్షుని వధింప మనముఁ జేసెను. తర్వాత శత్రువుల నుగ్గాడు వాఁడును, మొనగాఁడు నైన యా వానరేంద్రుఁ డలిగి, యా విరూపాక్షుని ముందటికి దుమికి, యాతని ముందట నున్న గొప్పయేనుఁగును మహావృక్షముతో నడిచెను. ఆ మహాగజము సుగ్రీవుని వృక్షప్రహారమును దిని యొక వింటియంత పొడవు వెనుకకుఁ బోయి చదికిలఁబడి బృంహితము గావించెను. వెంటనే వీర్యవంతుఁ డగు చులకని విక్రమము గల విరూపాక్షుఁ డా నుగ్గయిన యేనుఁగుమీఁదినుండి గ్రిందికి దుమికి, పగతుని యెదుట వచ్చి నిలిచి, ఖడ్గమును, ఋషభచర్మంబును గైకొని ధైర్యముతో నిల్చియున్న సుగ్రీవుని ఱొప్పుచు, నెదుట నిలిచెను. ఆ సుగ్రీవుఁడును శత్రువుపైఁ గట్టలుక వొడమఁగా, మేఘసదృశ మగు

గొప్పబండను గైకొని, యా విరూపాక్షునిపై నేసెను. ఆ రాక్షసవీరుఁ డా వచ్చెడి శిలను జూచి, కడువడిగా నావలి కెగిరి దుమికి, ఖడ్గముచే సుగ్రీవునితలమీఁద నేసెను. బలవంతుఁ డగు రక్కసుఁడు గొట్టిన యేటుచే సుగ్రీవుఁడు కొంతతడవు మైమఱచియుండి యావల స్మృతిఁ దెచ్చుకొని, యాతనిమీఁది కెగిరి దుమికి ఱొమ్మున నొక పోటు పొడిచెను. విరూపాక్షుఁ డా పిడికిటిపోటుచే నొచ్చినవాఁ డయి, కడుఁ గోపము పూని, యా ఖడ్గముతో సుగ్రీవుని కవచమును బడఁద్రోసి కాలితోఁ దన్నెను. సుగ్రీవుఁడు క్రిందఁబడి వెంటనే లేచి వజ్రాయుధముతో నడచినట్లుగా, నెక్కువ సందడి గలుగునట్లు లఱచేతితో నవ్విరూపాక్షుని బాఁదెను. ఆ నిశాచరుఁడు నేర్పుచే నా సుగ్రీవుని తల ప్రహారంబు దప్పించుకొని, పిడికిటితో నా వానరేంద్రుని ఱొమ్మునఁ బొడిచెను. సుగ్రీవుఁడు తన తలప్రహారమునుండి విరూపాక్షుఁడు తప్పించుకొనుటఁ గాంచి, యాతనికిఁ నడుమఁ గొంత యెడ ముండుటఁ గని యా విరూపాక్షుని నెన్నొసటి యెముకకుఁ దగులున ట్లొక్క పోటు పొడిచెను. ఇంద్రుని వజ్రాయుధస్పర్శముఁ బురుడించు సుగ్రీవుని యఱచేతి ప్రహారముచే నవ్విరూపాక్షుఁడు సెలయేళ్లనుండి జలమును వెడలించునట్లు ముక్కులు మొదలగు రంధ్రములనుండి నెత్తుటిని గ్రక్కుచు రక్తార్ద్రదేహుఁ డై క్రిందఁబడెను.అట్లు కన్నులు దేలవైచుచు,నోట నురుఁగు వెలువరించుచు, రక్తమునఁ దోఁగి, వికృతనయనుఁడై త్రుళ్లుచుఁ బుడమిపైఁ బొఱలుచుఁ, బ్రక్కలెల్ల నెత్తుటఁ దడిపి, జాలి పుట్టునట్లుగా నార్చుచున్న యా తమ శత్రువును గాంచి, కడు నుప్పొంగిరి. అవ్విధముగా నెక్కువ పూనికియు బలిమియుఁ గలిగి, సముద్రమును బోలిన యా రాక్షసవానరసైనికులుప్పెనయందుఁ జెల్లెలికట్ట దాఁటి మీఁదికిఁ బాఱు సముద్రములకైవడిఁ గడు భయంకరముగా రొద గావించిరి. వానరేంద్రుఁ డగు సుగ్రీవుచేఁ గొట్టి గ్రుడ్లు పీకఁబడి క్రిందఁబడియున్న బలవంతుఁ డగు విరూపాక్షుం గాంచి, వానర రాక్షస సైన్యమంతయు నెక్కువవడితోఁ బాఱు గంగా ప్రవాహముతో సమానముగాఁ బాఱుచుండెను.

98-వ సర్గము

మహోదరుం డను మంత్రి చచ్చుట

మహాయుద్ధమున రాక్షస వానర సైన్యము లొండొంటితోఁ బోరుచు మిడిమిడి వేసవియందలి తటాకములమాడ్కి వరుసగా క్షీణించెను. స్వసైన్యము మడియుటచేతను, విరూపాక్ష వధముచేతను రాక్షసాధిపునికిఁ గ్రోధము రెట్టించెను. యుద్ధమునఁ దనచేరువ నున్న సైన్యము వానరులచే వధింపఁబడుచుఁ జెదరియుండుటయుఁ దనకుఁ గార్యములపట్ల దైవంబు ప్రతికూలమై యుండుటయుఁ దలంచి, శత్రుసంహారి యగు మహోదరుం గాంచి, "యో నిడుదచేతులవాఁడా! నాజయాశ నీయంద యున్నది. ఓరి శూరుఁడా! నీ విప్పుడు పగతునిఁ బరిమార్చి, నీ పరాక్రమము చూపుము. ఇది స్వామి ఋణముఁ దీర్చుకొనఁ దరుణము కావున లెస్సగా యుద్ధము సేయుము" అని యాన తిచ్చెను.

రావణుఁ డిత్తెఱఁగున నానతియ్యఁగా, రాక్షసవీరుఁ డగు మహోదరుఁ డట్లు కానిమ్మని, మిడుత యగ్నిహోత్రునందుఁ జొచ్చునట్లు శత్రుసేనయందుఁ బ్రవేశించెను. అట్లు ప్రవేశించి, మహాబలవంతుఁ డగు నా మహోదరుఁడు తన యజమానుని మాటలకుఁ దోడుగాఁ దన వీర్యమును బ్రేరేపింప నుక్కుమీఱి, వానరుల నందఱను నుగ్గాడఁ దొడఁగెను. ఎక్కువ సత్తువ గల వానరులును గొప్పబండల నెత్తికొని వెఱపుగలిగించునట్టి శత్రుసైన్యముఁ జొచ్చి, రాక్షసుల నందఱను జంపిరి. గొప్ప పోరునందుఁ జేవకాఁ డగు మహోదరుఁడును నెక్కువ కినుక పూని బంగారుసొమ్ములతో నలంకరించిన యమ్ములచే వానరుల కాలుసేతులను దొడలను ఛేదించెను. తర్వాత వానరులందఱు రాక్షసులచేఁ గడు నొంపఁబడి, పది దెసలకుఁ బరుగులెత్తిరి. కొందఱు సుగ్రీవునికడకుఁ బరుగెత్తి యతనిని శరణుఁ జొచ్చిరి. యుద్ధమున వానరమహాసేన గడునొచ్చియుంట గాంచి, సుగ్రీవుఁడు తనచేరువ నున్న మహోదరునిఁ గదిసెను. అట్లు కదిసి సుగ్రీవుఁడు పర్వతమును మించినట్టి యొక గొప్పబండను గైకొని, యాతని వధ ముద్దేశించి, యతనిపై నా బండ నేసెను. ఆ వచ్చునట్టి యోర్వరానిదైన బండను జూచి, మహోదరుఁడు చలింపక బాణములచేఁ బగులఁగొట్టఁగా, నాశిల వేయి తునుకలుగాఁ బగిలి చెదరిన గ్రద్దలగుంపు

కైవడిఁ జెదరిపడెను. సుగ్రీవుఁడు తా నేసినబండ ప్రయ్యలగుటఁ గాంచి, యొడలు దెలియనంతటి కోపము పూని, యుద్ధపురోభాగమున నున్న రాక్షసునిపై నొక్క గొప్పచెట్టును బెఱికివైచెను. శత్రుసంహారి యగు మహోదరుఁడు దానిని బాణములచేఁ ద్రుంచెను. తర్వాత సుగ్రీవుఁ డలిగి క్రిందఁబడియున్న యొక గుదియను జూచి, దానిం గైకొని యాతనికిఁ జూపుచు నా గుదియతో నతనితేరిగొప్పవారువములను దెగటార్చెను. తర్వాత మహోదరుఁడు రథమునుండి దుమికి, గదను గైకొనెను. గుదియను గదను దాల్చినట్టి కోడెలంబోలు నా మహోదర సుగ్రీవులు మెఱుపులతోఁ గూడిన మేఘములమాడ్కి వెలుఁగుచు నొండొరులను గదిసిరి. తర్వాతఁ గుపితుఁ డయిన రేద్రిమ్మఱీఁడు సూర్యునివలెఁ దేజరిల్లు గదను సుగ్రీవునిపైఁ బ్రయోగించెను. కడు భీతికరమై వచ్చెడి గదను జూచి, రోషముచే నేత్రములందుఁ గెంపు గదుర గుదియఁ బైకెత్తి యాగదను గొట్టెను. ఆ గుదియ గదకుఁ దగులుటచేఁ దునుకలయి పడెను. తర్వాతఁ దేజస్సుగలవాఁ డగు సుగ్రీవుఁడు పసిఁడికట్లతోఁ గైసేయఁబడిన ఘోర మగు యినుపరోఁకలిని దీసికొని, యా మహోదరునిపై నేసెను. ఆ మహోదరుఁడును మఱొక్కగదను దీసికొని సుగ్రీవునిపై నేసెను. అంతట నవి రెండును నొండొంటిం దాఁకి తునియలై క్రిందఁబడెను. అట్లు తమకడ నున్న యాయుధములు తునుకలై పోవఁగా, నా సుగ్రీవ మహోదరులు మండెడి యగ్నిహోత్రునికైవడి వెలుఁగును బలిమియుఁ గలవారై, యొండొరులు పిడికిలి పోట్లాటకుఁ దొడఁగిరి. అట్లొండొరులు గదిసి, యా యపరాజితులైన శూరులగు మహోదర సుగ్రీవు లొండొరులను గొట్టుచు నొండొరులను మాటిమాటికి ఱొప్పుచు నొండొరుల నఱచేతులతో నప్పళించుచుం గ్రిందఁబడి, మఱల వడిగా లేచి, యొండొరులను గొట్టుకొని, యొండొరులను భుజములతో విసరివైచిరి. ఇట్లు శత్రుసంహారు లగు వా రిరువురు బాహుయుద్ధము చేసినవా రయి కడు బడలిరి.

వడి గల యా వానరరాక్షస వీరు లగు సుగ్రీవమహోదరు లిద్దఱు దమచేరువల నున్న ఖడ్గముల నత్తెములతోడఁ గైకొనిరి. తర్వాత యుద్ధమున నేర్పరు లగు సుగ్రీవమహోదరు లొడలు దెలియనంతటి

యాగ్రహము నొంది, తమ యుద్ధనైపుణ్యముఁ జూపు గోరికతో ఓప్పుచు నొండొరులపైఁ బగపూని గెల్పుగోరి కుడివైపునుండి యెడమ వైపునకును, నెడమవైపునుండి కుడివైపునకును బ్రదక్షిణములు గావించిరి. శూరుఁడును, వీర్యముచేఁ బ్రఖ్యాతి గన్నవాఁడును నైన మహోదరుఁడు మూఢబుద్ధియై, తనచేతిఖడ్గమును మతిమాలి సుగ్రీవునియత్తెము పై నేసెను. ఖడ్గమును నాతఁ డూడఁదీయునంతలోపలనే సుగ్రీవుఁ డా మహోదరుని సకుండలములతోఁగూడిన శిరమును బొమిడికము తోడఁ దెగనేసెను, ఆ రాక్షసవీరుఁ డగు మహోదరుఁడు క్రిందఁబడినతోడనే యారాక్షసేంద్రుని సైనికు లందఱు చూచి యచ్చట నిలువఁజాలక రాక్షసాధిపునికడకుఁ బరుగెత్తిరి. సుగ్రీవుఁడు మహోదరుం జంపి, వానరులుం దానును సింహనాదము గావించెను. దశగ్రీవుఁ డందులకుఁ గోపపడెను, రాఘవుఁడు సంతోషించెను. రాక్షసు లందఱు మోములు వ్రేలవైచి, డెందములందుఁ దెగువ మాని, భయము మనములందు నాఁటుటచే నచ్చట నిలువక మూలమూలకుఁ బరుగెత్తిరి. సుగ్రీవుఁడు మహాపర్వత సంకీర్ణప్రదేశముం బోలిన యమ్మహోదరుని నేలఁ బడవైచి, స్వకిరణములచే దగ్గఱఁ జేరరాని సూర్యునికైవడి వెలుఁగుచుండెను. అట్టు మహోదరవధముచే జయశాలి యైన యా సుగ్రీవుని నంతరిక్ష సంచారులగు సురయక్ష సంఘములును, భూతలమునందలి సకలభూతములును సంతోషభరితములై కొనియాడెను.

99-వ సర్గము

మహాపార్శ్వుఁడు మడియుట

సుగ్రీవునిచే నిట్లు మహోదరుఁడు వధింపఁబడఁగా, బలిమికాఁడగు మహాపార్శ్వుఁడు కన్నులందుఁ గెంపు గదురఁ బరికించి, భయంకరమై యున్న యంగదునిసేనను బాణములచే నొంచుచు, గాలి తొడిమలనుండి పండ్లను క్రిందఁ బడఁద్రోయుచందమున వానరుల శరీరముల నుండి శిరములను దుల్ల నేసెను. మహాపార్శ్వుఁడు బాణములచేఁ గొందఱు వానరుల బాహువులఁ దెగ నేసెను, కొందఱి ప్రక్కలు చెక్కెను. ఆ వానరు లట్లు మహాపార్శ్వునిచే నొంపఁబడి వ్యసనము గలుగ యుద్ధమునం దాసమాని మూర్ఛచెందిరి.

నిడుదచేతులవాఁడగు నంగదుఁడు తనసేన రాక్షసులచే నొంపఁబడి, భయముచే వణఁకుచున్నస్థితిం గాంచి, పర్వమునందలి సముద్రము చాడ్పున నెక్కువ కోపముఁ బూని, సూర్యకాంతిం బోలు కాంతిగల యినుపగుదియం గైకొని, యా మహాపార్శ్వునిపైఁ బ్రయోగించెను. ఆయేటు తగులఁగానే, మహాపార్శ్వుఁడు స్మృతితప్పి సారథిసమేతముగా నా రథమునుండి క్రిందఁబడెను. కాంతి గలవాఁడును మగఁటిమి గలవాఁడును, నల్లనికాటుకరాశిని బోలువాఁడు నైన గవాక్షుండు జాంబవంతునితో కారుమబ్బువలె నున్న తన దండునుండి వెలికి వచ్చి, పర్వతశిఖరముఁబోలు కడు విశాలమయిన బండ నొక్కదానిని గైకొని, వడిగా నతని తేరిగుఱ్ఱములను జక్కాడి, యతనితేరిని విఱిచెను. బలిమికాఁడగు మహాపార్శ్వుఁ డొక్క క్షణములోపల స్మృతినొంది, యంగదునిఁ బెక్కమ్ములతోను, జాంబవంతుని మూఁడమ్ములతోను, గవాక్షునిఁ బెక్కుబాణములతోను ఱొమ్మునఁ గొట్టెను. అంగదుఁడు శరపీడితు లయిన గవాక్షజాంబవంతులను గాంచి, యొడలు దెలియనంతటి కోపమునొంది, శత్రువులకు వెఱపు పుట్టించునట్టి ఘోరమైన గదను గైకొనెను. వాలిపుత్రుఁడు సూర్యునిమాడ్కి వెలిఁగెడి యా యినుపగదను రెండు చేతులతోఁ బట్టి గిరగిరఁ ద్రిప్పి, దవ్వున నిలఁబడియున్న మహాపార్శ్వుని మీఁద నేసి, యాతని ధనుర్బాణములను, బొమిడికమును గ్రిందఁ బడఁద్రోసెను. ప్రతాపవంతుఁడగు నంగదుఁడు చేరువ కేతెంచి, కట్టలుకపూని, సకుండలమగు కర్ణమూలమున దనయఱచేతితోఁ గొట్టెను. మహాద్యుతిప్రతాపములు గల మహాపార్శ్వుఁ డలిగి, యొంటిచేతితో నాగుదెను బట్టెను. ఆతఁడు ప్రతిదినము దైలము పూయుటచేఁ దెల్లనైయున్న దృఢమగు గండ్రగొడ్డలిని గైకొని వాలిపుత్త్రుని పయి నేసెను. ఆ ఖడ్గమంగదుని యెడమ భుజముపైఁ దగిలెను. అంగదుఁడు రోషముతో నా గండ్రగొడ్డలి యేటును దప్పించుకొనెను. పితృతుల్యపరాక్రముఁడును, నాయపట్టు నెఱిఁగివాఁడు నైన యంగదుఁడు పిడుగునుబోలిన పిడికిలి నమర్చి యా మహాపార్శ్వుని ఱొమ్మునఁ బొడిచెను. ఆపిడికిటిపోటుచే నా మహాపార్శ్వునిఱొమ్ము చీలఁగా నాతఁడు నేలఁగూలెను. ఆ మహాపార్శ్వుఁ డీల్గఁగా, రాక్షససైన్యము కలఁతచెందెను. రావణునికిఁ గ్రోధమును

హెచ్చెను. వానరులును నింద్రాదిదేవతలును మహాపార్శ్వుఁ డీల్గుటచే సంతుష్టులై లంకాపురము ప్రాకారగోపురములతోడ బ్రద్దలగునట్లు సింహనాదము గావించిరి. తర్వాత నింద్రుని విరోధి యగు రాక్షసాధిపుఁ డా వేల్పులయు, వానరులయు గొప్పయార్భాటము విని, రోషము తోడ యుద్ధమునకై వెడలెను.

100-వ సర్గము

రామరావణుల యుద్ధారంభము

మహోదరమహాపార్శ్వులును మహాబలుం డగు విరూపాక్షుఁ డును మడియఁగా, మహాయుద్ధమున రావణుని కెక్కువ క్రోధము గలి గెను. అంత సారథిం జూచి, "ఓ సారథీ! రామలక్ష్మణులను వధించి, నీల్గిన నా మంత్రులయు, ముట్టడింపఁబడిన పట్టణపు జనులయు వ్యస నమును బోకార్చెదను. సీత యనెడి పుష్ప ఫలముల నొసఁగునదియు, సుగ్రీవ జాంబవ త్కుముద నళ మైంద ద్వివిదాంగద గంధమాధన హనుమత్సుషేణులు మున్నగు వానరవీరు లనెడి కొమ్మలు రెమ్మలు గల దియు నైన రాముఁ డనెడి వృక్షమును నఱికి క్రిందఁ ద్రోసెదను. నా రథము నా రామలక్ష్మణు లున్నవైపునకు వడిగాఁ దోలుము." అని సారథిని రావణుఁడు త్వరపెట్టెను. అట్లతిరథుఁ డగు రావణుఁడు దన రథగమన ధ్వనిచేఁ బదిదెసలను మాఱుమ్రోఁత మ్రోగించుచు యుద్ధభూమికి వెడలి వచ్చి రాముని నెదిరించెను. భూమియందలి పర్వతారణ్యము లాశబ్ద ముతో నిండి గడగడ లాడెను. ఆ రావణుఁడు గడు భయంకరమైన యొక్క తామసాస్త్రమును ప్రయోగించి, వానరుల నందఱిని సంహరిం చెను. వానరు లన్ననో యుద్ధభూమియం దంతటఁ బడిరి. ఆ వానరు లందఱు బన్నముపడి పరుగెత్తుచుండఁగాఁ బుడమినుండి యమితమైన దుమ్ము లేచెను. ఆ వానరులు బ్రహ్మనిర్మితమయిన యా తామసాస్త్రము నోర్వఁ జాలక పాఱిపోయిరి. అట్లు వానరసేనలు రావణునియస్త్రములకు వెఱచి పరుగు లెత్తుచుండఁగా, రాముఁడు రావణునియెదుట నిలిచెను. తర్వాత రావణుఁ డట్లు వానరసేనలను దఱుమఁగొట్టి, పరాజయములేనివాఁడును పద్మపత్రాయత నయనుఁడును దీర్ఘ బాహుండును, శత్రుసంహారియు, గొప్పవింటిని బట్టి యాకాశము నొఱయువానికైవడి నున్నవాఁడునై

వెన్నునితోడఁ గూడిన వేల్పు తేనిచందమునఁ దమ్ముఁ డగు లక్ష్మణుని తోడ నిలఁబడియుండు రామునిఁ జూచెను.

ఎక్కువ వెలుఁగు గలవాఁడును, బలవంతుఁడును నైన రాఘవుఁడు వానరుల నందఱ నోడించి తనపైకి వచ్చెడి రావణునిఁ గాంచి, సంతసముతో వింటిని గైకొని, పుడమి బ్రద్ద లగునట్లు కడువడియు నాదమును గలదైన తన మేటివింటినారిని మీఁట నారంభించెను. ఆ రాక్షసు లందఱు రావణుని శరజాలముల ప్రయోగములవలనను, రాముని ధనుష్టంకారమువలనను జనిత మైన ధ్వనిని విని దిగులుపడి గుంపులు గుంపులుగాఁ గూలిరి. ఆ రామలక్ష్మణుల బాణప్రయోగ మార్గమును బొందిన యా రావణుఁడు సూర్యచంద్రుల నడుమ నున్న రాహువు కైవడి వెలిఁగెను. లక్ష్మణుఁడు తాను మొదట నా రావణునితోఁ బోరఁదలఁచి, వింటిని వంచి యగ్నిజ్వాలలమాడ్కి వెలుఁగు బాణములను రావణునిపైఁ బ్రయోగించెను. లక్ష్మణుఁ డేసిన యమ్ము లాకసమున నుండునప్పుడే యెక్కువ తేజస్సుగల రావణుఁడు ప్రతిబాణములచే నా బాణములను బడఁగొట్టెను. లక్ష్మణుఁ డొక్కబాణము నేసిన నొక్క బాణముచేతను, మూఁటినేసిన మూఁటిచేతను, పదింటి నేసినఁ బదింటిచేతను రావణుఁడు దనచేతి నేర్పు చూపుచు నా లక్ష్మణుని బాణములనెల్లఁ ద్రుంచెను. ఆ లక్ష్మణుఁ డేసిన యొక్క బాణమైనను దనపైఁ బడ లేదని యలక్ష్యముచే నా లక్ష్మణుని నిరాకరించి, పర్వతముమాడ్కిఁ గడుదిట్ట తనముతో నిలిచియున్న రాముని డాసెను. రావణుఁ డట్లు రాముని డాసి, కోపముచేఁ గన్ను లెఱ్ఱఁగాఁ జేసి, యతనిపై బాణవర్షమును గురిపించెను.

తర్వాత రాముఁడు రావణుని వింటినుండి వెడలిన శరధారలను జూచినతోడనే వడిగా భల్లములను గైకొని, కనలిన పాములమాడ్కిఁ గడు భయంకరములై జ్వలించుచు వచ్చెడి యా బాణముల నన్నిటిని వానిచేఁ ద్రుంచెను. అట్లు రాముఁడు రావణునిమీఁదను, రావణుఁడు రామునిమీఁదను గఱకు టమ్ములను విడువక గ్రుమ్మరించుకొనిరి. అంతకు మున్నోటమిం బొందనివా రగు రామరావణు లిద్ద ఱొండొరులపై బాణములను గ్రుమ్మఱించుకొనుచు, బ్రదక్షిణముగాను నప్రదక్షిణముగాను

చిత్రవిచిత్రముగఁ దిరుగుచుఁ బోరిరి. యమ రుద్రులంబోలెఁ జూపఱకు వెఱపుపుట్టించుచు ఏకకాలమున బాణముల పరంపర నొండొరులపైఁ బ్రయోగించుచు యుద్ధముగావించుచున్న యారామరావణుల కయ్యముఁ జూచి, సకలభూతములు దిగులు పడుచుండెను. ఆ సమయమున నాకాశము పెక్కు బాణములచే నిండినదై, సందులేక వర్షారంభమున మెఱుపులవరుసలతోఁ గూడిన మేఘజాలములచే నిండినదివోలెఁ గనఁబడెను. సందులు విడిచి విడిచి శరమ్ము లాకసమును గ్రమ్ముటచే నాకసము గవాక్షము గలదిగా నున్నట్లు కానఁబడెను. సూర్యుఁడు క్రుంకినతర్వాతఁ బైకివచ్చిన రెండు గొప్ప మేఘములఁ బోలె రామరావణు లిద్దఱు నెక్కువపడి గలిగి, మిక్కిలి వాఁడికొనలతోఁ గూడి, గ్రద్ద తెక్కలు గట్టుటచేఁ జక్కని పక్షములు గల్గియున్న యమ్ములచే నాకాశమును గప్పి యంతటఁ గటికి చీఁకటి గ్రమ్మున ట్లొనరించిరి. అట్లొండొరుల వధింపఁ గోరుచుండు రామరావణుల కిద్దఱకును వృత్రాసుర దేవేంద్రులకుం బోలె దగ్గఱకుఁ జేరనీయనిదియు, నెంచరానిదియునైన గొప్ప యుద్ధము నడచెను.

ఆ రామరావణు లిద్దఱు గొప్ప విలుకాండ్రు. బాణముల విడుచుట వెనుకదీయుటలయందు నేర్పరులు, అస్త్రవేత్తలలో మేటులు. కనుక వా రిద్దఱు యుద్ధప్రదేశమునఁ బలుతెఱఁగులఁ దిరుగుచుండిరి. ఆ రామ రావణు లిద్ద ఱేయే మండలగమనములం బోవుచుండిరో, ఆయా మండలగమనములందు బాణపు టలలు గాలి వీచుటచే వడిగాఁ దరిఁదాఁకుచుండు సంద్రపు టలలం బోలియుండెను. అంత లోకముల నేడ్పించువాఁ డయిన రావణుఁడు బాణప్రయోగమున నేర్పుగల వాఁడై రాముని నొసట బాణమాలికను బ్రయోగించెను. భయంకరమైన వింటినుండి ప్రయోగించిన నల్లగలువలదండం బోలునట్టి యా మాలికను రాముఁడు ధరించి నొప్పి నొందఁ డయ్యె. తర్వాత రాముఁడు కట్టలుకఁబూని, మంత్రములఁ బునశ్చరణచేయుచుఁ బాశుపతాస్త్రము నెత్తుచు మఱల బాణములఁ గైకొని వింటిని వంచి యందు బాణముల జోడించి యేసెను. ఆ యమ్ములు మహామేఘసంకాశమగు భేదింపరాని యా రావణుని కవచమునకుఁ దగిలియు నాతనికి

నొప్పిని గలిగింప వాయెను. సర్వాస్త్రప్రయోగకుశలుఁ డయిన రాముఁడు రథారూఢుఁడై యున్న రావణుని నొసటఁ దగులునట్లు మఱల దివ్యాస్త్రములను బ్రయోగించెను. నిట్టూర్పు విడుచుచున్న యైదు తలలపాములం బోలు నా బాణములు రావణుని ప్రత్యస్త్రములచే ఖండింపఁబడి బాణ రూపముల భేదించి పుడమిం జొచ్చినవి. రాఘవుని యస్త్రములను రావణుఁడు పడనేసి, కోపముచే నొడ లెఱుంగక మహాభయంకరమైన యా సురాస్త్రమును బ్రయోగించెను. మఱియు రావణుఁడు సింహ వ్యాఘ్రములంబోలు మోములుగల బాణములను, గ్రద్దలయు కాకులయు ముఖములుకల బాణములను డేగలయు మోములుగలశరములను, సృగాలముఖము లగు సాయకములను, సింహాస్యములగువానిని, సర్పాస్యములగువానిని, వివృతవదనము లగువానిని గర్దభముఖము లగువానిని, వరాహముఖము లగువానిని, కుక్కుటముఖము గలవానిని, మకర సర్ప ముఖము లగువానిని, మఱియు ననేకవిధము లగు బాణములను కనలిన పామువలె బుసకొట్టుచు రాముని పైఁ బ్రయోగించెను. అగ్నివలె వెలుఁగు రాముఁడు రావణుని యా సురాస్త్రముచేత జుట్టుముట్టఁబడినవాఁడైనను నెక్కువ యుత్సాహము గలవాఁ డగుటంజేసి, యాగ్నేయాస్త్రమును, అగ్నిహోత్రునిచందమున వెలిఁగెడివి, సూర్యముఖములు గలవి యగు బాణములను, చంద్ర అర్ధచంద్ర ముఖములు, ధూమకేతుముఖములు, గ్రహనక్షత్రముఖములు, గొప్పకొఱవికట్టెల ముఖములు, మెఱుపుమంటల ముఖములునైన వాఁడి యమ్ములు నేసెను. ఆ రావణుని యమ్ములు రాముని శరములచేఁ బడఁగొట్టఁబడి తుత్తునియలై పెక్కు వ్రయ్యలుగాఁ బడి పోయినవి. రావణ ప్రయుక్తాస్త్రమును రాముఁడు ప్రతిసంహరించుట గాంచి, కోరిన రూపమెత్తఁగల సుగ్రీవాదివానరవీరు లందఱును రాముని చుట్టు నిలఁబడి సంతోషసూచకములైన యఱపులు గావించిరి. ఇవ్విధమున రాముఁడు మహాయుద్ధమున రావణుని చేతినుండి వెడలివచ్చిన యాసురాస్త్రమును బలాత్కారముగాఁ బ్రతిసంహరించి, యెక్కువ యానందము నొందెను. వానరవీరులును సంతోషభరితులై కిలకిలరవములు గావించిరి.

101-వ సర్గము

రావణశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుట

రాముఁడు రావణుఁ డేసిన యాసురాస్త్రమును బడఁగొట్టగా, రావణుఁ డినుమడించిన కోపముపూని, వేఱొక్క యస్త్రము వేయఁదలఁచి, మయనిర్మిత మయిన భయంకర మగు రౌద్రాస్త్రమును రాఘవునిమీఁదఁ బ్రయోగించెను. అప్పుడు వింటినుండి వజ్రసారముగల వెలుఁగునట్టి శూలములు, గదలు, ముసలములు, కూటపాశములు, పిడుగులు మొదలగు నాయుధములు ప్రలయకాలమందలి గొప్ప గాలివలె వెడలెను. అట్టి యా రౌద్రాస్త్రమును మేటి విలుకాండ్రలో మేటియైనవాఁడును, నెక్కువ వెలుఁగు గలవాఁడును నైన రాముఁడు గాంధర్వ మను మహాస్త్రముచేఁ బడఁగొట్టెను. మహాత్ముఁ డగు రాఘవుఁడు రౌద్రాస్త్రమును బడనేయఁగా, రావణుఁడు కినుకచేఁ గన్నుల నెఱ్ఱగాఁ జేసి, సౌరాస్త్రమును రామునిపైఁ బ్రయోగించెను. అంతటఁ గడువడి గల యా బుద్ధిమంతుఁడైన రావణుని వింటినుండి ప్రకాశమానము లగు గొప్పచక్రములు వెలువడెను. ఆకాశమును, బదిదెసలు నా వింటినుండి యచ్చటచ్చటఁ బడుచుండు బాణములచే వ్యాప్తములై వెలుఁగుచు సూర్యచంద్రాంగారకాదిగ్రహములతోఁ గూడినదివోలెఁ బ్రకాశించెను. రాఘవుఁడు పెక్కుబాణము లేసినమీఁదట నా రావణునిచేఁ బ్రయుక్తములైన వింతలగు నాబాణములను ఛేదించెను. ఆ తన యస్త్రముగూడ రామునిచేఁ బడఁగొట్టఁబడుట గాంచి, రావణుఁడు రాముని నన్నిమర్మములందును దగులునట్లు పదిబాణములతోఁ గొట్టెను. అట్లు రావణుఁడు గొప్ప వింటినుండి వెడలిన పది బాణములతో రామునిఁ గొట్టినను, రాముఁడు ప్రతాపశాలి యగుటంజేసి యించుకేనియుఁ గదలఁ డయ్యెను. అట్లు కదలక జయశాలి యగు రాముఁడు కట్టలుకపూని పెక్కు బాణములతో నా రావణుని నేసెను. ఇంతలోపల శత్రువీరసంహారి యగు బలవంతుఁ డగు రాముని తమ్ముఁడు లక్ష్మణుఁ డలిగి, యేడమ్ములను గైకొని, యా వాఁడి యమ్ములచే మానిసితలయే గుఱుతుగాఁగల రావణుని టెక్కెమును దుత్తునియలు సేసెను. బలవంతుఁడు లక్ష్మణుఁ డొక జ్వలించెడి బాణము నేసి

కుండలములతోఁ గూడిన రావణునిసారథి శిరమును దఱిగెను. మఱి యైదు బాణముల నేసి, రావణుని గజకరసదృశం బగు ధనుస్సును విఱిచెను.

అంత విభీషణుఁడు పైకెగిరి గదను గైకొని, నల్లనిమబ్బులంబోలి పర్వతములు బురుడించునట్టి యా రావణుని గొప్ప తేరిగుఱ్ఱములను వధించెను. ప్రతాపవంతుఁడగు రావణుఁడు తన తేరిగుఱ్ఱములు గూలఁగా, వడితో నా మహారథమునుండి క్రిందికి దుమికి, తమ్మునిమీఁద నెక్కుచు యాగ్రహము పూని, దీప్యమాన మగు వజ్రాయుధముఁ బోలిన యొక గొప్ప శక్త్యాయుధమును విభీషణునిపైఁ బ్రయోగించెను. లక్ష్మణుఁ డా మహాశక్తి విభీషణునికడకు రాకమునుపే మూఁడమ్ములచే దానిని ఛేదించెను. అప్పుడు వానరులందఱు హర్షధ్వనులు కావించిరి. బంగారపు మాలికలతో నలంకరించిన యా రావణునిశక్తి లక్ష్మణునిచే మూఁడు తునుకలు సేయఁబడినదై మిణుఁగుఱులతోఁ గూడి యాకాశమునుండి పడిన గొప్ప కొఱవిలాగున జ్వలించుచుఁ గ్రిందఁబడెను.

అంతలోపల రావణుఁడు తనచేఁ గడుఁ బూజింపఁ బడినదియు, యమునిచే సైత మోర్వ వీలుకానిదియు, స్వప్రకాశముచే వెలుఁగు నదియునైన గొప్పశక్తినిఁ గైకొనెను. బలవంతుఁ డయిన రావణునిచే నెత్తఁబడినట్టి శత్రుసాధ్యము గాని యట్టి వజ్రాయుధసమప్రభ మగు నాశక్తి చూపఱకు భయంకరమై చూపట్టెను. ఇంతలోపల శూరుఁ డగు లక్ష్మణుఁడు ప్రాణాపాయమున నున్న విభీషణునిఁ గాపాడుటకు వాని కడ్డముగాఁ బోయెను. అంతట మహాబలుఁ డగు లక్ష్మణుఁడు విభీషణుని విడిపించుటకై వింటిని వంచి పెక్కు బాణముల నేసి శక్తిధారి యయిన రావణునిమీఁద బాణములను బ్రయోగించెను. ఆ మహాధీరుఁ డగు లక్ష్మణునిచే బాణపుంజములచే నిండింపఁబడిన రావణుఁడు తన పరాక్రమము విభీషణునిపైఁ జూప నవకాశము లేమింజేసి, యతనిపై బాణప్రయోగము సేయ మనమునఁ దలఁపక, విభీషణుని కడ్డముగాఁ దన యెదుట నిలిచియున్న లక్ష్మణునివైపు తిరిగినవాఁడై యిట్లనియెను.

"ఓరీ బలగర్వితుఁడ వగు లక్ష్మణా! విభీషణుని తప్పించితివి గనుక నా రక్కసుని విడిచిపెట్టి, యీ శక్తిని నీపైఁ బ్రయోగించితిని. పరిఘను బోలు నా బాహువుచేఁ బ్రయోగింపఁబడిన యీ శక్తి

నీఱొమ్మును భేదించి, నెత్తుటఁ దడిసినదై, నీప్రాణములఁ గొనిపోఁగలదు" అని చెప్పి యెనిమిది ఘంటలు గట్టినదియు, గొప్పధ్వని గలదియు, మయునిచేఁ దనమాయ యుపయోగించి నిర్మింపఁబడినదియు, శత్రుసంహారకమును, స్వతేజస్సుచే మండుచున్నట్లుండునదియు నైన యా శక్తిని రావణుఁడు కట్టలుకపూని, లక్ష్మణునిపైఁ బ్రయోగించి, సింహనాదముఁ గావించెను. ఎక్కువ వడిగల యా రాక్షసేంద్రునిచేఁ బ్రయుక్తమయిన యింద్రాయుధముఁబోలు ధ్వని గల యా శక్తి కడువడితో లక్ష్మణుని మీఁదఁ బడెను. రాఘవుఁడు లక్ష్మణునిమీఁదికి వచ్చుచుండు శక్తిం జూచి, "లక్ష్మణునికి మంగళమగుఁ గాక!" అని చెప్పి, యా శక్తిం జూచి "ఓ శక్తీ! లక్ష్మణవధమునందలి పూనికి లేనిదానవై, వ్యర్థమై పోవుదువు గాక" అని పలికెను. అట్లు యుద్ధమునఁ గ్రుద్ధుఁడైన రావణునిచేఁ బ్రయోగింపఁబడిన సర్పతుల్య మగు నా శక్తి శూరుఁ డయినందున దిట్టముతో నిల్చియున్న లక్ష్మణుని ఱొమ్మునఁ జొచ్చెను. ఆ శక్తి యెక్కువ వెలుఁగు గలదై, ధగధగ మెఱయుచుండు నాదిశేషునినాలుకవలెఁ గడు భయంకరమై, లక్ష్మణుని విశాలవక్షమునఁ జొచ్చెను.

రావణుఁడు ప్రయోగించిన శక్తి లక్ష్మణుని ఱొమ్మున బాగుగా నాఁటుటచే ఱొమ్ము పగులఁగా లక్ష్మణుఁడు నేల నొఱఁగెను. దాపున నుండునట్టి యెక్కువ తేజముగల రాముఁ డట్టి యవస్థ నొందిన లక్ష్మణుం జూచి, కలఁత నొందినవాఁడై, కండ్ల నీరు గ్రమ్మఁ గొంతతడవు వగచి, యుగాంతపావకునివలె నెక్కువ యాగ్రహము నొంది, యది వగచుటకుఁ దరుణము గాదని యెంచి, రావణుని వధమునఁ దలఁపుపెట్టి యన్ని విధముల లక్ష్మణుం జూచికొనుచుఁ గడు ఘోరమున యుద్ధము గావింపఁ దొడఁగెను. అంత రాముఁడు మహాయుద్ధమున శక్త్యాయుధ భిన్న హృదయుఁడై, రక్తార్ద్రదేహుఁడై సర్పములతోఁ గూడిన పర్వతము మాడ్కి నొప్పియున్న లక్ష్మణుం గాంచెను. అతిబలవంతుఁడును, వడిగా నేయఁ గలవాఁడును నైన రావణునిచేఁ బ్రయుక్తము లగు బాణములచే వానరులు మిక్కిలి నొంపఁబడినవా రగుటచేత నా రావణప్రయుక్తమైన శక్తిని బడఁగొట్టఁ జాలరైరి. ఆ శక్తి లక్ష్మణుని హృదయము బ్రద్దలుగాఁ జీల్చి పుడమిలోపలఁ బ్రవేశించెను. రాముఁడు కోపగించికొని, శత్రు

భయంకరమైన శక్తి నిరుకేలతోఁబట్టి విఱిచి లాగెను. రాముఁ డాశక్తిని బట్టి లాగుచుండఁగా, బలవంతుఁ డగు రావణుఁడు రాముని యన్ని యంగములందును మర్మభేదకములైన బాణముల నేసెను. రాఘవుఁ డా బాణములను సరకుసేయక, లక్ష్మణునిఁ గట్టిగాఁ గౌఁగిలించుకొని, హనుమ త్సుగ్రీవులను జూచి యిట్లనియె. "ఓ వానరోత్తములారా! మీ రిచ్చట లక్ష్మణునిఁ జుట్టుకొనియుండుఁడు. నేను బహుకాలము నుండి కోరుచుండిన పరాక్రమము చూపఁదగిన సమయము వచ్చినది. మేఘోదయము పెక్కుదినములుగాఁ గోరుచుండు చాతకపక్షికి గ్రీష్మాంతమున మేఘదర్శన మబ్బినపగిది నా పరాక్రమ ప్రదర్శనమునకు సమయ మబ్బెను. వానరులారా! నేను నిక్కపుమాటఁ జెప్పెదను వినుఁడు. ఈలోక మిప్పుడు రావణుఁడో, రాముఁడో లేనిది కాఁగలదు. మీ రిది దృఢమని నమ్ముఁడు. మీరు దీనిని జూతురు. రాజ్యభ్రంశము, వనవాసము, దండకయందుఁ ద్రిమ్మఁదిరుగుటయు, వైదేహి నొరుఁ డెత్తుకొని పోవుటయు, రాక్షసులతోడఁ జేరికయు మొదలగు నరకతుల్య మగు నీ మహాఘోరదుఃఖము నెల్ల నీ రావణుని వధముతోడ విడిచిపెట్టువాఁడను. ఎవనినిమిత్త మీ వానరసేన నిచ్చటికిఁ దెచ్చితినో, ఎవని నిమిత్తము వాలిని సంహరించి, సుగ్రీవునికి రాజ్యము నొసఁగితినో, ఎవని నిమిత్తము సముద్రము దాఁటఁబడినదో, సేతువుం గట్టఁబడినదో, యట్టిక్రూరుఁ డిప్పుడు నా కంటఁబడినవాఁడు. చూపునందు విషముగల పాము కంటఁబడిన వాఁడు వోలె నా కంటఁబడిన యీ దురాత్ముఁ డిఁక జీవింపఁజాలఁడు. శత్రువులచే నోర్వరాని ఓ వానరవీరులారా! మీరు పర్వతశిఖరములపై నెమ్మదిని గూర్చుండి, నాకును రావణునికిని నడచు గొప్ప పోరును జూచుచుండుఁడు. ఇప్పుడు యుద్ధరంగమున రాముఁడ నగు నాయొక్క రామత్వమును దేవర్షి గంధర్వచారణాదులతోఁ గూడిన ముల్లోకములవారును జూడఁగలరు. దేవాదులును చరాచర భూతములును భూలోక ముండునంతవఱకు నొండొరులు గూడి, యిచ్చట నేఁ జేసిన కార్యమును యుద్ధమును గాథలుగాఁ జెప్పుకొనఁగలరు.

అని రాముఁడు సుగ్రీవ హనుమంతులతోఁ జెప్పి, యపరంజి భూషణములతో నలంకరించిన వాఁడి యమ్ములతో నా దశగ్రీవునిఁ

గొట్టెను. అంత రావణుఁడును వార్షికజలధరము వర్షధారలఁ గురిపించుచందమున, రామునిపై మండునట్టి నారసములు, ముసలములు మున్నగు నాయుధములను బ్రయోగించెను. రామరావణు లిద్దఱొండొరులపైఁ బ్రయోగించుకొను నమ్ము లొండొంటిం దాఁకుటచే గొప్ప ధ్వని గలిగెను. రామరావణుల బాణము లొండొంటిని దాఁకి విఱిగి చెదరి కొనలందు మండుచు నంతరిక్షమునుండి పుడమిపైఁ బడినవి. ఆ రామరావణుల విండ్లనారిమ్రోఁత సకల ప్రాణిభయంకరమై యాశ్చర్యకరమైయుండెను. ఆ రావణుఁ డట్లు మహాధీరుఁడును, వెలుఁగు ధనుస్సు గలవాఁడును నైన రామునిచే బాణవర్షముచే నొంపఁబడి, గాలిచేఁ దఱుమఁబడిన మేఘముచాడ్పున వెఱపుతోడఁ గూడి పరుగెత్తెను.

102-వ సర్గము

లక్ష్మణుఁడు మృతసంజీవినిచే బ్రతికింపఁబడుట

శ్రీరాముఁడు బలవంతుఁడైన రావణునిచే శక్తితోఁ గొట్టఁబడి రక్తప్రవాహమునఁ దోఁగియున్న యుద్ధవీరుఁ డగు లక్ష్మణుఁ గాంచి, దుష్టాత్ముఁ డగు రావణునితోఁ బోరుసేసి, బాణపుంజముల నేయుచునే సుషేణునిఁగాంచి యిట్లనియె: "సుషేణా! యీ శూరుఁ డగు లక్ష్మణుఁడు రావణుని పరాక్రమముచేఁ గ్రిందఁబడి నాకు శోకము వర్ధిల్లఁజేయుచు సర్పముమాడ్కిఁ బొఱలుచున్నాఁడు. నాకుఁ బ్రాణములకంటె మిన్నయైన యీ నా తమ్ముఁడు రక్తమునఁ దోఁగుచు నాకుఁ గలవరపాటు కలిగించుచుండఁగా, నే నతనినిఁ జూచుచు నేవిధమున యుద్ధము సేయఁ గలను? యుద్ధములందుఁ గీర్తివహించినవాఁడును, శుభలక్షణుండునైన లక్ష్మణుఁడు ప్రాణముఁ దొఱంగెనేని, నా కీ ప్రాణము లేల? రాజ్యసుఖము లేల? నా తమ్ముఁడు నా యెదుటనే మృతుం డయ్యెఁగా యని నావీర్యము సిగ్గిలుచున్నది. నావిల్లు చేతినుండి జారిపోవుచున్నది. బాణములు సారహీనము లగుచున్నవి. కన్నుల నీరు గ్రమ్ముచున్నది. దురాత్ముఁ డగు రావణుఁడు నా తమ్మునిఁ బడఁగొట్టుటఁ గాంచి, స్వప్నమునందు నడచునపుడు మనుజులకుఁ బోలె నాకు నంగములు దుర్బలము లగుచున్నవి; వగ మీఱుచున్నది; తీవ్రమైన మూర్ఛ గ్రమ్ముచున్నది." అని చెప్పుచు, మర్మములందుఁ గొట్టఁబడి, దుఃఖపీడితుఁడై నిట్టూర్పు

విడుచుచున్న వెలుపటఁ దిరుగు ప్రాణమువంటివాఁ డయిన తమ్మునిఁ గాంచి యెక్కువ వగఁగూడి చింతయు శోకమును గలవాఁ డయ్యెను. అంతట రాముఁ డింద్రియస్వాస్థ్యము దప్పి యివ్విధమునఁ బలవింపఁ దొడఁగెను.

"ఈలక్ష్మణుఁడు శత్రువుచేఁ గాఁడ నేయఁబడి యుద్ధభూమియందుఁ బొఱలుచుండఁగా, నేనేల యుద్ధము చేయవలెను! నాకిఁక యుద్ధముతోఁ గాని, ప్రాణములతోఁ గాని, తుదకు సీతతోఁగాని పనియేమియున్నది? దేశదేశమునను గావలసినందఱు భార్యలు దొఱకుదురు; చుట్టాలును దొఱకుదురు; కాని, ఒక సోదరుఁడు దొఱకుట యెక్కడను లేదు."

అని విలపించుచు, వగ గూడి క్రిందఁబడి పొరలుచు, దీనముగా మాటిమాటికి నిట్టూర్పు విడుచుచున్న రాముని నోదార్చుచు వీరుఁడగు సుషేణుఁ డిట్లనియె. "ఓ మహాబాహువా! చక్కని లక్షణములుగల లక్ష్మణుఁడు మృతుఁడు గాఁడు. ఈతని మోము వికృతము కాదు; నల్లఁబడి నది కాదు; కాంతిహీనమును గాదు; చక్కని మెఱుఁగుగలదై తేటదనము గలిగి యొప్పారుచున్నది. అఱచేతులు తమ్మిఱేకులవలె నెఱనై యున్నవి; లోచనములు మిక్కిలి తేటలై యున్నవి. నృపాలా! గతాసులరూప మీతీరున నుండదు. దీర్ఘాయుస్సుగలవారి రూపమే యీ తీరున నుండును. ఈతఁడు ప్రేతత్వము నొందలేదు. ఇతని కూఁపిరి యున్నది. నీవు విషాదము నొందవలదు. ఇతఁడు మూర్ఛనొంది, నేల కొఱఁగియున్నాఁడు. ఇది యీతని కూఁపిరాడుచు మాటిమాటికి గుండెలు దటతటకొట్టుకొనుటచేఁ దెలియవచ్చుచున్నది."

అని మాటల నెఱిఁగిన సుషేణుఁడు రాముని నోదార్చి, చక్కని హనుప్రదేశము గల హనుమంతునిఁ బురికొల్పుచు "ఓ సౌమ్యుడా, తొల్లి జాంబవంతుఁడు సెప్పిన యోషధిపర్వతమునకుఁ బోయి, యచ్చట దక్షిణశిఖరమున నున్న విశల్యకరణి, సువర్ణకరణి, సంజీవకరణి, సంధాన కరణి యను నోషధుల లక్ష్మణుని బ్రదికించుటకై గైకొనిరమ్ము" అని చెప్పఁగా, హనుమంతుఁ డోషధిపర్వతమునకుఁ జని, యా యోషధిం దెలియక చింతను బొంది, కడపట నొక్కతీరున నిశ్చయించికొని, "నే నీ బర్వత శిఖరమునే పెళ్లగించి యెత్తికొని పోయెదను. సుషేణుఁడు సెప్పిన యోషధి యీ పర్వతశిఖరమునందే యుండవలెను. ఏదియో కనుఁగొని

వచ్చిన యావలఁ గొనిపోవుదు నన్న, నింతలోపల లక్ష్మణుని ప్రాణరక్షర కాలము మించిపోయి యెక్కువ దుఃఖము సంభవింపవచ్చును గాన పర్వతశిఖరమునే పెళ్లగించుకొని పోయెదను." అని యోచించె. మహా బలుఁ డగు హనుమంతుఁడు వడిగాఁ బోయి, యా పర్వతశిఖరమును ముమ్మాఱు గదలించి, పుష్పితము లగు సకలవృక్షములతో నిండిన యా పర్వతశిఖరము నూడఁబెఱికి, బలసంపూర్ణమైన నీలజీమూతముఁ బోలు నా పర్వతశిఖరము నెత్తికొని వాయువుమార్గి నాకాశ మార్గమునఁ బాఱెను. అట్లు పరుగిడివచ్చి, హనుమంతుఁడు పర్వతశిఖరమును గ్రింద నుంచి, కొంతతడవు సేద దీర్చుకొని, సుషేణునిఁ గూర్చి "హరి శ్రేష్ఠా! నా కాయోషధి యిది యని తెలియమిచే నాపర్వతశిఖరమునే పెళ్లగించికొని వచ్చితిని" అని చెప్పఁగా, సుషేణుఁ డివ్విధమునఁ బలికిన హనుమంతునిఁ గడుగొప్పగా శ్లాఘించి, యోషధిని బెళ్లగించి యెత్తెను. దేవతలకుఁ గూడఁ జేయ నలవికాని దగు హనుమంతుఁ డొనర్చిన పని చూచి, వానరులును రక్కసులును నచ్చెరువందిరి. వానర శ్రేష్ఠుఁ డగు సుషేణుఁ డా యోషధిని నలిపి, దానిరసము నా లక్ష్మణుని ముక్కునఁ బిండెను. శత్రువీరసంహారి యగు ములుకు లొడలనాటియున్న లక్ష్మణుఁ డారసము నాఘ్రాణించి, యొడలఁ గ్రుచ్చుకొనియున్న ములుకులన్నియు నూడ, నొప్పిలేనివాఁడై నేలపైనుండి లేచి కూర్చుండెను. పుడమినుండి లేచిన యా లక్ష్మణునిఁ జూచి, సుషేణుని "బాగు బా"గని కొనియాడిరి. శత్రుసంహారి రాముఁడు గన్నుల నీరు నిండుటచే దృష్టిచెదర నెక్కువ యనురాగముతో రా రమ్మని లక్ష్మణు నాలింగనమొనరించి, "ఓ వీరుఁడా! నీవు నా భాగ్యవశమున మరణమునుండి తప్పించుకొంటివి. నీవు పంచత్వము నొందినతర్వాత నాకుఁ బ్రాణముతోను బనిలేదు; సీతతోను నాకుఁ బనిలేదు. అట్లుండ యుద్ధమున జయముచే నా కేమి కావలసినది యున్నది!" అని రాముఁడు లక్ష్మణునితోఁ బలికెను.

లక్ష్మణుఁ డవ్విధమునఁ బలుకుచున్న మహాత్ముఁ డగు రాఘవుని పలుకులు విని, వగ గూరి, తడఁబడు మాటలతో ని ట్లనెను. "ఓ ప్రతిజ్ఞ తప్పనివాఁడా! నీవు రావణుని వధించి, విభీషణునికి లంకారాజ్య మొసఁ

గెద నని ప్రతిజ్ఞ యొనరించితివి. బలహీనుఁడైన యల్పునిమాడ్కి నీ విత్తెఱఁగునఁ బలుకఁ జనదు. ఓ యనఘా! పెద్ద లాడినమాట తప్పరు. వాగ్దత్తప్రతిపాలనమే కదా గొప్పదనమునకుఁ జిహ్నము. అనఘా, నానిమిత్త మయి యుద్ధమునందు నిరాస చేసికొనవలదు. ఇప్పుడు రావణ వధ మొనరించి ప్రతిజ్ఞను నెఱవేర్పుము. వాడికోఱలు గలదై ఱొప్పు చున్న సింగము నెదుటఁ బడిన గజమువోలె నీయెదుటఁ బడిన శత్రువు ప్రాణములతోఁ దప్పించుకొని పోవఁజాలఁడు. దినకరుఁడు తన కార్యము చేసి ముగించికొని యస్తమించులోపల దురాత్ముఁ డగు రావణుఁడు హతుఁడు గావలె నని కోరుచున్నాను. యుద్ధమున రావణుఁడు హతుఁడు గావలె నని కోరితివేని, చేసిన ప్రతిజ్ఞ నెఱవేర్పవలె నని కోరికయున్న, రాజవరాత్మజ యగు సీతం బడయఁగోరిన, తడవు సేయక నా మాటను శీఘ్రముగాఁ గావింపు మని లక్ష్మణుఁడు రామునితోఁ జెప్పెను.

103-వ సర్గము

రామ రావణ యుద్ధము

లక్ష్మణుఁడు సెప్పిన పలుకులు విని, శత్రువీరులఁ బరిమార్చునట్టి మగఁటిమి గలవాఁ డగు రాముఁడు వింటిని గైకొని యోర్వరానిబాణ ముల జోడించి, సేనముందట నిల్చియున్న రావణునిపైఁ బ్రయోగించెను. రావణుఁడును వేఱొక్క రథమెక్కి, రాహువు సూర్యుని మ్రింగవచ్చిన చందమున రామునిమీఁదికి వచ్చెను. దశగ్రీవుఁడు రథమునఁగూర్చుండి, క్రొక్కాఱుమబ్బు వర్షధారలఁ గురిపించు చందమున వజ్రాయుధమున కెన యగు మహాఘోరము లగు బాణములను రామునిమీఁదఁ బ్రయో గింపఁగా, రాముఁడును మండుచున్న యగ్నింబోలిన సువర్ణమయము లైన బాణములచే యుద్ధమున నెక్కువ పట్టుదల గలవాఁ డగు దశ గ్రీవుని బాగుగా నొంచెను.

"రావణుఁడు రథమునఁ గూర్చుండియు, రాముఁడు క్రింద నిలఁబడియు యుద్ధము సేయుట యుక్తము గాదు" అని దేవదానవ గంధర్వులు పలికిరి. అప్పుడు దేవేంద్రుఁడు మాతలి కానతీయఁగా, నతఁడు బంగారపు టంగములు గలదియు, పలుగజ్జెలుగట్టినదియు, బాల సూర్యునిఁ బోలునదియు, వైడూర్యమయ మగు నొగలుగలదియు నై,

బంగారు తొడవులతో సింగారింపఁబడినవియు, తెల్లని చామరములు గలవియు, నాకుపచ్చని వన్నెగలవియు, స్వర్ణభూషణమండితములు నైన మేటి గుఱ్ఱములు గట్టినదియు, బంగారపు దండముగల టెక్కెములతోఁ గూడినదియు, సొబగు మీఱినదియు నైన రథమును దోలికొని, యాకాశమునుండి దిగి, కాకుత్స్థుని నెదుర్కొని, యంజలిచేసినవాఁడై, "ఓ కాంతిగల శత్రుసంహారకా! మహాబలుఁడా! యీ రథమును నీకు జయముగలుగుట కయి మాయేలిక యగు నింద్రుఁడు పంపెను. ఇది యింద్రుని గొప్పవిల్లు. ఇది యగ్నివలెఁ బ్రకాశించు నింద్రుని కవచము. సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు నీ బాణములును, నిర్మలమైన వాఁడిమిగల శక్త్యాయుధమును దేవేంద్రుం డిచ్చిపంపెను. ఓ వీరుఁడా! మున్ను నేను సారథ్యము చేయుచుండ, వేల్పులతేఁడు దానవులను సంహరించిన చాడ్పున నీ రథమెక్కి రాక్షసాధిపుని రావణుని సంహరింపుము." అని మాతలి చెప్పఁగా, రాముఁ డా రథమునకుఁ బ్రదక్షిణ నమస్కారములు గావించి, తనవెలుఁగుచే జనుల సంతసింపఁజేయుచు నా రథము నెక్కెను. నిడుదచేతులవాఁడగు రామునికిని రావణాసురునికిని జూపఱకుఁ బులకలు గలిగించునంత వింతయైన యుద్ధము జరిగెను. సకలాస్త్రవేత్త యగు నా రాఘవుఁడు రావణునియొక్క గాంధర్వాస్త్రమును గాంధర్వాస్త్రము చేతను, దైవాస్త్రమును దైవాస్త్రముచేతను నివారించెను. రాక్షసాధిపుఁడు వెండియు కడు నలిగి ఘోరమైన రాక్షసాస్త్రమును బ్రయోగించెను. రావణునివింటినుండి వెడలి వచ్చెడి యా పసిఁడితొడవులు దొడిగిన బాణము లెక్కువ విసముగల సర్పములై రామునిమీఁదికి వచ్చినవి. వెలుఁగు మోములు గల యా సర్పములు నోళ్లనుండి యగ్నిజ్వాలల వెలువరించుచు, నోళ్లు దెఱచికొని భయము గలిగించుచు రామునిపైకి వచ్చుచుండినవి. వాసుకివలె తాఁకునవియు, జ్వలించుపడగలు గలవియు, నెక్కువ విషముగలవియునైన యా సర్పములు దిక్కులందును, విదిక్కులందును నంతట వ్యాపించెను. రాముఁడును సంగరమునఁ దనపైకి వచ్చెడి యాపన్నగములను గాంచి, ఘోరమైన భీకరగారుడాస్త్రమును బ్రయోగించెను. పసిఁడి ములుకులుగలవి, యగ్నిజ్వాలవంటి ప్రభగలవియునైన

రాముని వింటినుండి వెడలిన బాణములు సర్పవిరోధులగు స్వర్ణమయ గరుడములై యా పాములనెల్ల మ్రింగుచుండెను. అట్లు రావణుని యస్త్రము గారుడాస్త్రముచేఁ బ్రతిహతముగాఁగా, నప్పుడు రాక్షసాధిపుఁడగు రావణుఁడు కట్టలుక పూని, ఘోరము లగు శరములను రాముని మీఁదఁ గురిపించెను. రావణుఁడు ధైర్యశాలి యగు రాముని శరవర్షముచే నొంచి, మాతలిని బాణములచే నొంచెను. ఒక్కబాణమునేసి, యారాముని టెక్కెమును బడఁగొట్టెను. రావణుఁడు రథమునడుమ స్వర్ణమయ మగు నా రథకేతువును బడఁద్రోసి, యింద్రుని రథాశ్వములను బడఁ గొట్టెను.

చెడు నడవడిగల యా రావణుఁ డొనరించిన యా కడు గొప్ప పనినిఁ జూచి, దేవ దానవ గంధర్వ చారణులు విషాదము నొందిరి. రాముఁడు నొచ్చియుండుటఁ గాంచి, సిద్ధ పరమర్షులును, విభీషణుఁడును, వానరవీరులును గడువెత నొందిరి. రామచంద్రుఁడు రావణరాహువుచే మ్రింగఁబడుట గాంచి, బుధుఁడు జనులకుఁ గీడు సేయువాఁడై, ప్రజాపతిదేవతాకమును, చంద్రునికిఁ బ్రియమునైన రోహిణీనక్షత్రము నొందియుండెను. సముద్రము కనలి, పొగతోఁ గూడిన యగ్ని గలదై మండుచున్న దానివలె నుప్పొంగి సూర్యునిఁ దాఁకువాఁడునుంబోలెఁ గన్పట్టెను. సూర్యుఁడు శస్త్రమువంటి నల్లని చాయగలవాఁడును, గడువేఁడిమి గలవాఁడును, వెలుఁగు తగ్గినవాఁడును, కబంధమువంటి రూపు గలవాఁడును, ధూమకేతువుతోఁ గదిసినవాఁడునై యుండునట్లు కనఁబడెను. కోసలవంశజుల నక్షత్రమును, నింద్రాగ్నులె యధిదేవతలు గాఁగలదియునైన విశాఖానక్షత్రము నంగారకుఁ డాక్రమించికొనెను. రావణుఁడు పదిమోములును నిరువదిచేతులును గలవాఁడై, వింటిని గైకొని, మైనాకపర్వతము మాటికిఁ గనఁబడెను. రాముఁడును రాక్షసాధిపుని బాణప్రయోగము నోర్వఁజాలక యుద్ధరంగమున శత్రువులపైఁ బాణములఁ బ్రయోగింపఁ జాలఁ డయ్యెను. మొదటనే కుపితుఁడైన రాముఁడు కనుబొమ్మలు ముడిపెట్టి, కన్నులు మఱింత యెఱ్ఱఁగాఁజేసి, చూపఱను దహించునట్లు కడు నాగ్రహము నొందెను.

104-వ సర్గము

రామరావణయుద్ధము

ఆ కోపవంతుఁ డయిన ధీమంతుఁ డగు రామునిమోమును గాంచి, సకలభూతములును గడు వెఱచెను. పుడమియు గడగడలాడెను. సింహ శార్దూలములతోఁ గూడినదై, గొప్పవృక్షములు గలదగు నా త్రికూట పర్వత మదరెను. నదులకు ఱేఁడగు సముద్రుఁడును మిగులఁ గలఁగి పోయెను. ఆకసమున నోర్వరానిశబ్దముగలవైన పక్షులును, బరుషధ్వనులు గల మేఘములును జేటును దెల్పునట్లు సద్దుసేయుచు నంతటఁ దిరిగినవి. కట్టలుకం బూనిన రాముని, గడు భీకరము లగు చేటులను జూచినవెంటనే సకలభూతములును వెఱచెను; రావణునికిని భయము హెచ్చెను. ఆ శూరు లగు రామరావణులు భయంకరము లగు సకలాయుధములను గైకొని యుద్ధము సేయుచుండఁగా, నప్పుడు దేవ దానవ దైత్య గంధర్వ పన్నగ మహర్షి సిద్ధ సాధ్య కింపురుష కిన్నరులు విమానములందుండి యా ప్రలయకాలమువంటి యునికి గల గొప్ప పోరును గనుఁగొనుచుండిరి. ఆ యుద్ధమును జూడవచ్చిన సురాసురులు గడుఁ బ్రేమమీఱ, వేల్పులు రామునికి జయము గలుగవలె ననియు, నసురులు రావణునికి జయము గలుగవలెననియుఁ గోరిరి. ఆదుష్టాత్ముఁడగు రావణుఁ డంతలోపల రామునిఁ బ్రహరింపఁగోరి, వజ్రాయుధమువంటి సత్తువగలది, యెక్కువ ధ్వనిగలది, సకలశత్రువులను సంహరింపఁదగినది, పర్వతశిఖరములంబోలు మొనలతోఁగూడినది, చూపునకు వెఱపు గలిగించునది, పొగతోఁగూడిన దానివలె సన్నని మొనలు గలది, ప్రలయకాలమునందలి యగ్ని రాశిం బోలునది, కడు భీకరంబును, యమునిచేఁ గూడ నోర్వ నలవికానిది, సర్వ భూతములను వెఱపు గలిగించునది, అన్ని భూతములఁ జీల్చునది, పగిలించు నదియునైన యొక శూలమును యుద్ధవీరు లగు పెక్కండ్రు రాక్షసులు తన్నుఁ జుట్టి నిల్చియుండఁగాఁ గట్టలుక వొడమ నడుమఁ బట్టుకొనెను. గొప్ప మేనివాఁ డగు రావణుఁడు నేత్రములందుఁ గెంజాయ గదుర రోసము పూని, తనసేనలకు హర్ష మెసఁగఁజేయుచు, నాశూలమును బైకెత్తి కడు భీకరముగా సింహనాదముఁ గావించెను. ఆ రావణుని సింహనాదమునకు భూమ్యాకాశములును సకలదిశలును గడగడ

లాడెను. ఆ దురాత్ముని కంఠనాదము వినుటచే సకలభూతములు గలవర పడెను; సముద్రమును గలంగెను. ఎక్కువ వీర్యముగల యా రావణుఁ డా గొప్ప శూలాయుధము గొని, కడుగొప్ప యఱపఱచి, రామునిఁ గూర్చి, కఠినముగా ని ట్లనియె: "ఓ రామా! యీ నాచేతఁ బట్టియుండు శూలము పిడుగువంటి యురిడిగలది. నే నీ యాయుధము నాగ్రహ ముతోఁ బ్రయోగించితినేని, నీ యొక్కయు, నీకుఁ దోడఁగు లక్ష్మణుని యొక్కయుఁ బ్రాణములను దీయఁగలదు. యుద్ధగర్వితుఁడవగు రామా! నిన్ను జంపి యుద్ధరంగమున నిహతులయిన రాక్షసశూరులలోఁ జేర్చెదను. ఓ రాఘవా! నిలుము. ఈ శూలముతో నిప్పుడ నిన్నుఁ బరిమార్చె దను" అని రావణుఁడు రామునితోఁ జెప్పి, యా శూలమును ద్రిప్పి, రామునిమీఁద నేసెను. ఆ రావణునిచేతినుండి విడువఁబడి, మెఱపుల గుమితో నిండినదై వచ్చు నెనిమిదిగంటలు గట్టిన మహాధ్వనిగల యా శూలము గగనమునఁ బ్రకాశించుచుండెను. పరాక్రమవంతుఁడగు రాముఁడు జ్వలించుచున్న భయంకరరూపముగల యా శూలమును గాంచి, వింటిని వంచి, పెక్కుబాణముల నేసి, యింద్రుఁడు నీటివెల్లు వలచేఁ బ్రలయకాలాగ్నిని శమింపఁజేసినచందమునఁ దనపైకి వచ్చెడి యా శూలమును బాణపుంజములచే నివారించెను కాని, చిచ్చు మిడుత లను దహించుమాడ్కి నా రాముని వింటినుండి వెడలిన యా బాణముల నన్నిటిని నాశూలము దహించెను. అట్లు తాను బ్రయోగించిన యమ్ము లాకసముననే శూలపుఁదాఁకుడుచేఁ బొడిపొడి యయి బూది యగుటను గాంచి, రాముఁ డెక్కువ క్రోధము పూని, యింద్రుఁడు మాతలిచేఁ బంపిన శక్త్యాయుధమును గట్టలుకతోఁ గైకొనెను. ఆ శక్తిని రాముఁ డెత్తి జళిపింపఁగా నది ఘంటలు కట్టియుండుటచే మ్రోగుచుఁ గాంతితోఁ గూడిన కొఱవిచందమున నాకసమును బ్రజ్వరిల్లఁజేసెను. ఆ శక్తిని రాముఁడు ప్రయోగింపఁగా నది రాక్షసేంద్రుని శూలముపైఁ బడ నా గొప్ప శూలము విఱిఁగి కాంతిలేనిదై క్రిందఁబడెను. అంత రాముఁడు కడువడితోఁ బాఱుచుఁ గ్రూరము లయి, వజ్రములను బురుడించు వాఁడి యమ్ముల నేసి, యా రావణుని తేరివారువములను గొట్టెను. మఱియు రాముఁడు పెక్కుబాణములతో నాతని ఱొమ్మునఁ గొట్టి,

కట్టలుకఁ బూని మూఁడమ్ములను రావణుని నొసటఁ దగుల నేసెను. యుద్ధప్రదేశమున రావణుఁ డవయవములు బాణములచేఁ బీటలు వాఱ నెత్తుటఁ దడిసిన మేనుగలవాఁ డయి, విరులతో వెలయు నశోకముకైవడి విరాజిల్లెను. రాముని బాణములు దేహమున నాటఁగా, రావణుఁడు మేన నెత్తురు జొబ్బిల్ల వగఁగూరి, మఱల నా రామునిపైఁ గట్టలుక పొందెను.

105-వ సర్గము

రాముఁడు రావణుని నిష్ఠురోక్తు లాడుట

యుద్ధరంగమున రాముఁ డవ్విధమునఁ దన్ను బాణప్రయోగములచేఁ గడు నొప్పింపఁగా, యుద్ధ గర్వితుఁ డగు రావణుఁ డెక్కువ కోపము నొందెను. అంత మొనగాఁడగు రావణుఁడు కట్టలుకచేఁ గన్నులందుఁ గెంజాయ మీఱ వింటిని వంచి, వార్షికజలధరంబు వానను విడువనిధారలుగాఁ గ్రుమ్మరించి, చెఱువులను నిండించుకైవడి విడువని బాణధారలం గురిపించి, రామునియొడ లెల్ల నిండించెను. రావణుఁ డట్లు లెక్కలేనిబాణములను గ్రుమ్మఱించినను, కాకుత్స్థుఁడు మహాపర్వతము చందమునఁ గదలకయుండెను. మగఁటిమి గల రాముఁడు బాణములచే నా రావణుని బాణముల నడ్డగించుచు సూర్యకిరణములను బోలె రావణునిబాణముల నోర్చుచుండెను. అంత రావణుఁడు వడితో ధీరుఁ డగు రాముని ఱొమ్మునఁ బెక్కు నారసములను బ్రయోగింపఁగా, లక్ష్మణాగ్రజుఁడు మేన రక్తము జొబ్బిల్ల నరణ్యమునందుఁ జూచిన కడుఁ బెద్ద మోదుగుచెట్టుకైవడిఁ దోఁతెంచుచు, రావణుని బాణపుటేటులు తగలుటచేఁ గడుఁ గినుక పూని, ప్రలయకాలసూర్యునింబోలె దేదీప్యమానములైన బాణములను గైకొనెను. అంత రామరావణు లిద్దఱెక్కువ పట్టుదలయుఁ బలమును గలిగి, యొండొరులపై శరమ్ముల నేసి, సందు లేకుండునట్లు బాణమ్ము లేయుటచేఁ సూర్యరశ్మి తెలియక చీఁకటి గ్రమ్మఁగా నొండొరుల నెఱుఁగఁ జాలకుండిరి.

అంత, దశరథతనయుఁ డగు వీరుఁ డయిన రాముఁడు కినుక గదుర రావణుం జూచి, పకపక నవ్వి యతనితోఁ బరుసదనము దోఁపనిట్లనియె. "ఓరీ రాక్షసాధమా! నేను దగ్గఱ లేనప్పుడు తెలివిమాలి పరవశమైయున్న నా భార్యను జనస్థానముననుండి తెచ్చితివే?

కావున నీ వొక్క మొనగాఁడవే! నేను సమక్షమున లేనప్పుడు నన్నుఁ బాసి, వగపాలై కాఱడవిని నొంటరిదై యున్న వైదేహిని బలాత్కారముతోఁ దెచ్చి, నేను మొనగాఁడ నని తలఁచుచున్నాఁడవు. ఓరి మొనగాఁడా! పరుల యాండ్రను గోరువాఁడా, అనాథ లగు స్త్రీలవిషయమున సకలజననింద్యమైన పని నేసి, సిగ్గుమాలి, నేను శూరుఁడ నని తలఁచుచున్నాఁడవే. మర్యాద దప్పినవాఁడా! సిగ్గుమాలినవాఁడా! నడవడులఁ దప్పినవాఁడా, గర్వముచే నొడలు దెలియక మృత్యువుఁ దెచ్చి పెట్టికొని, "నేను మొనగాఁడ నని" తలఁచెదవు. శూరుఁడవు, కుబేరుని తోఁబుట్టువవు, విస్తారబలము గలవాఁడవు నైన నీవు కీర్తి దెచ్చునదియు, కొనియాడఁ దగినదియునైన గొప్ప పని యొనరించితివి. ఇంతటి పని నీవు తప్ప మఱెవ్వఁడైనఁ జేయునా? ఆహా! నీ బలిమి యేపాటిది? గర్వముచేఁ జేయఁబడినదియు, సకల జనులచే దూఱఁ దగినదియు, నాత్మహితము గానిదియునైన నీ వొనరించిన కార్యమునకై యిప్పుడు గొప్పఫలము నొందుము. ఓరీ మూఢుఁడా, దొంగతనముతో సీతను దెచ్చియు నిన్ను నీవు శూరునిగఁ దలఁచెదే? నీకు సిగ్గన్నమాట యించుకేనియు లేనట్లునున్నది. నాయెదుటనే సీతాదేవిని బలిమి మీఱినట్లు తేఁ బ్రయత్నించియుందువేని, యప్పుడు నిన్నుఁ జంపి, జమునిప్రోలికిఁ బంపియుందును. ఓరి బుద్ధిహీనుఁడా! నీవు భాగ్యవశమున నా కంటఁ బడితివి. ఇప్పుడు నిన్ను వాఁడి యమ్ములచే జమునివీటి కనిచెదను. ఇప్పుడే నాబాణములచేఁ ద్రుంపఁబడినదై దుమ్ములోఁ బొరలుచు కుండలములతోఁ బ్రకాశించు నీ శిరమును గ్రద్దలు, కాకులు, కుక్కలు, నక్కలు మున్నగు నంజుడుదిండు లగు మృగపక్షులు దినఁగలవు. రావణా, నిన్నుఁ బుడమిని నేను బాణములచేఁ బడఁద్రోయఁగా నప్పుడు బాణముల నాటునుండి వెలువడు రక్తమును గ్రద్దలు తనివి తీరఁ ద్రాగఁగలవు. ఇప్పుడు నాబాణములచే భిన్నదేహుఁడవై నీవు నీల్గి క్రిందఁబడఁగా నీ కళేబరమును గరుడపక్షులు పన్నగములనుంబోలె గ్రద్దలు నీ ప్రేవులను లాగఁగలవు." అని పలుతెఱఁగుల శత్రుసంహారి యగు రాముఁడు రావణుని దూరుచుఁ జేరువ నున్న యాతనిపైఁ బెక్కు బాణములను గురిపించెను.

అప్పుడు శత్రువధము గోరి రాముఁడు పట్టుదలతో నుండఁగా నాతనికి సమరమున మగఁటిమి, బలిమి, సంతసమును, అస్త్రబలమును నిను మడించెను. సకలాస్త్రములును నతని మనమునకు స్ఫురించెను. అంత నాతఁడు గడుఁ జులకదనముతో బాణములను బ్రయోగింపఁబూనెను. రాక్షసనాశకరుఁ డయిన రాముఁ డీ శుభచిహ్నములు దనకుఁ గలుగుట గాంచి, యెక్కువ పట్టుదలతో రావణుని బాణములచే నొంచెను. వానరులును శిలావర్షము గురిపించుటచేతను, రాముఁడు బాణవర్షముఁ గురిపించుటచేతను దశగ్రీవుఁ డా శిలాబాణపాతముచేఁ గడునొచ్చియేమియుఁ దోఁచక కలవరపాటొందెను. ఎప్పుడు రావణునికి బాణము చిక్కక పోయెనో, ఎప్పుడు రావణుఁడు వింటి నీడ్వఁజాలక మనోవ్యాకులతచే శత్రువు లేయు బాణములకు బదులు బాణములను వేయఁజాలక యుండెనో, ఎప్పుడు రాముఁ డేయు శస్త్రములు రావణునిమీఁదఁ బడుచుండెనో, అప్పుడు మృత్యుసన్నిహితుఁడైన యా రావణుని సారథి యట్టి యవస్థ నొందియున్న రావణునిఁజూచి, తత్తరపాటొందక యా రావణుని రథమును యుద్ధభూమినుండి యావలికిఁ దోలుకొనిపోయెను.

108-వ సర్గము

రావణుఁడు సూతుని రథముఁ దోలు మనుట

రావణుఁ డన్ననో మృత్యుదేవత పురికొలుపఁగా, మొఱకుదనమునఁ గడురోసము నొంది, కన్నులందుఁ గెంపు గదుర సారథిం జూచి, "ఓరీ దుర్బుద్ధీ! నన్ను వీర్యములేనివానినిగాను, అశక్తునిగాను, మగతనము లేనివానినిగాను, పిఱికినిగాను, అల్పునిగాను, బలిమి లేనివానిఁగాను, శాంతి లేనివానిఁగాను, మాయ లెఱుఁగనివానిఁగాను, శస్త్రాస్త్రములు దెలియనివానిఁగాను దలఁచినవాఁడవు వోలె నవమతించి, నీయిష్టము చొప్పున నడచితివిగాఁడా! నీవు నా కవమతి యొనరించి, నా యభిప్రాయ మెఱుఁగక యేల నా రథమును శత్రువు నెదుటినుండి యావలికిఁ దోలితివి. ఓ యనార్యా, నేను బలశాలి నని బహుకాలమునుండి యుపార్జించిన కీర్తిని, వీర్యతేజములను, జనులకు నాయెడఁగల విశ్వాసమును నీవు పోకార్చితివి. స్వపరాక్రమముచే జనులచేఁ గొనియాడఁదగినవాఁడును, ప్రసిద్ధమైన పరాక్రమము గలవాఁడునునైన శత్రువు చూచుచుండ సమరమునఁ

బ్రియుఁడనైన నన్నుఁ బిఱికిని జేసితివికాదా? ఓరి దుర్బుద్ధీ! నీవు నా రథమును మోహముచే శత్రువు నెదుటికిఁ దోలకుండుట చూడ, నొరుఁడు నిన్ను లంచమిచ్చి వశపఱచుకొనెనని తోఁచెడి. నీ విపు డొనరించిన పని శత్రు వొనరించెడి పనియేకాని, మేలు కోరు సుహృదుఁ డొనరించు పని గాదు. నీవు బహుకాలమునుండి నాయొద్ద నున్నవాఁడ వను నెనరు గలవాఁడవయితివేని, నా గుణముల నెఱిఁగితివేని, తామసింపక శత్రువు నాకడకు వచ్చునంతలోపల రథము శత్రువున కెదుట నిలఁబెట్టుము." అని దురాత్ముఁ డయిన బుద్ధిహీనుం డగు రావణుఁడు నిష్ఠురపు మాటలాడఁగా, ప్రభుహితముఁ గోరునట్టి సారథి తన యేలిక నూఱడింపుచు ని ట్లనియె.

"ఓ ప్రభూ! నేను శత్రువులకు వెఱచినవాఁడను గాను; మూఢుఁడను గాను; శత్రువులయొద్ద లంచములఁ గొన్నవాఁడను గాను; ప్రమాదపడినవాఁడను గాను; ప్రభువిశ్వాసము లేనివాఁడను గాను; నీ వొనరించిన సత్కారములను మఱచినవాఁడనుగాను; మఱి తమ మేలు గోరియుఁ, గీర్తిని గాపాడఁగోరియుఁ, ప్రభువునందలి ప్రేమచే నిష్కపటమైన మనముతో నీకు మేలు చేయవలె నని యెంచి యప్రియమొనరించినవాఁడనైతిని. మహారాజా! నేను సర్వదా తమకుఁ బ్రియహితమయిన కార్యమొనరించుటయందే తలఁపు గలవాఁడను. కావున నల్పుఁడును నయోగ్యుఁడును నైన మానవునిచందమున నన్ను దూషింపవలదు. నన్నపరాధినిగాఁ దలఁపవలదు. ఉన్నతప్రదేశమునుండి నదీవేగము మఱలునట్లు సమరమున శత్రువు నెదుటినుండి రథము నేల మఱలించితి ననిన, నీ వెక్కువగాఁ బోరుటచేత డస్సియున్నట్లు కనఁబడితివి. నీకు యుద్ధమునఁ గల యుత్సాహ సంతోషముల నెఱుఁగనైతిని. ఈ తేరి గుఱ్ఱములు తేరిని లాగిన బడలికచే డస్సినవై, దీనములై యెండతాకుఁడునకు డస్సి వానకుఁ దడిసిన యావులకైవడిఁ దూలిపోవుచుండినవి. మన సేనలలోఁ గలుగు నిమిత్తము లన్నియు మన కశుభమునే సూచించుచున్నవి. దేశకాలమును, లక్షణములను, ఒరుల యభిప్రాయములను, దేవురింపును, వ్యసనమును, సంతోషమును, రథికుని బలాబలములను, భూమియొక్క మిట్టపల్లములను, సమవిషమప్రదేశములను, యుద్ధసమయ

మును, శత్రులోపములను గనిపెట్టుటయు, రథమును శత్రువునెదుటికిఁ దోలుటయుఁ దొలఁగఁ దోలుటయు, శత్రువునెదుట నిల్చుట తొలఁగఁ దోలుటలును వీని నన్నిటిని రథసారథ్యము చేయువాఁ డెఱిఁగియుండ వలెను. ఓ శూరుఁడా! నీవు డస్సియుండుటవలనను, రథాశ్వము లలసి యుండుటవలనను దమకెక్కువ యుపాయముఁ బోకార్పఁ దలఁచి యీ పని యొనరించితిని గాని నేను స్వేచ్ఛతో రథముఁ దొలఁగఁ దోలిన వాఁడను గాను. ఓ ప్రభూ! నే నీ పనిని భర్తృస్నేహముచేత నే యొనరించి చితిఁ గాని వేఱు తెఱఁగునఁగాదు. ఓ శత్రుసంహారీ! యిప్పు డేపని సేయ వలెనో, దాని నానతిమ్ము. ఓ ధీరాగ్రేసరా! నే నాకార్యము జవదాఁటక మనసార నెఱవేర్చి నీ ఋణము వీఁగువాఁడను."

అని సారథి రావణునితోఁ బలుకఁగా, రావణుఁడు సారథి పలుకు లాలించి, సంతుష్టుఁడై, యతనినిఁ బలుతెఱఁగులఁ గొనియాడి, యుద్ధ మునం దాసతో ని ట్లనియె; "ఓ సారథీ; నీవు వేగ రథము రాము నెదుటికిఁ దోలుము. రావణుఁడు పగతురఁ బరిమార్పక మఱలువాఁడు గాఁడు." అని చెప్పి, సంతుష్టుఁడై యతనికిఁ దనచేతి కడియము నొకదాని నొసఁగెను. సారథియు రావణుని పలుకులు విని రథమును శత్రువున కెదు రుగాఁ దోలుకొనిపోయెను. రాక్షసేంద్రునిరథ మొక్కక్షణములోపల నా రాముని యెదుటికిఁ బోయి నిలిచెను.

107-వ సర్గము

అగస్త్యమహాముని రామున కాదిత్యహృదయ ముపదేశించుట

తదనంతరము యుద్ధసందర్శనాభిలాషతో దేవతలతో సంయుక్తుఁడై వచ్చియున్న భగవంతుఁ డగు నగస్త్యమహాముని యుద్ధమున డస్సియున్న వాఁడును, యుద్ధసన్నద్ధుఁడై యేఁగుదెంచిన రావణు నెదుట వీక్షించి, యాలోచించు వాఁడును నైన రామునికడ కేఁగుదెంచి యి ట్లనెను.

"నిడుదచేతులవాఁడ వగు నో రామా! రామా! నాయనా! సకల శత్రువినాశకమును, జయమును గలిగించునదియు, నిత్యమును, నాశ రహితమును, పరమరహస్యమును, శాశ్వతమును, మహాశుభప్రదమును, సకలమంగళములకంటె నుత్కృష్ట మంగళము నొసంగునదియు, సకల పాపహరమును, చింతావ్యసననాశకమును, దీర్ఘాయుఃప్రదమునునై

పవిత్రమై యుత్తమమైన యాదిత్యహృదయ మను మంత్రము నుపదేశించెదను. దానిని జపించితివేని, నీవు సకలశత్రువులను బవరమున గెల్వఁగలవు. అట్టి మంత్ర మేది యనఁగా; ఓ రామా! నీవు కిరణములు గలవాఁడును, ఉదయించుచున్నవాఁడును, దేవాసురులచేఁ ధ్యేయుఁడును, తన తేజముచే నితర తేజముల నడఁగించువాఁడును, లోకేశుఁడును నైన సూర్యుని నారాధింపుము. ఏలయిన, ఈ సూర్యుఁడు సకలదేవతా స్వరూపుఁడు, తేజస్సుగలవాఁడు, కిరణములచే లోకముల వెలిగించు వాఁడు. ఇతఁడు తన కిరణములచే దేవాసురగణములను బాలించువాఁడు. ఇతఁడే సకల దేవతాస్వరూపుఁడు, ఇతఁడే బ్రహ్మ, శివుఁడు, స్కందుఁడు, ప్రజాపతి, మహేంద్రుఁడు, ధనదుఁడు, కాలుఁడు, యముఁడు, సోముఁడు, వరుణుఁడును. ఈతఁడే పితరులు, అష్టవసువులు, సాధ్యులు, అశ్వినీదేవతలు, మరుత్తులు, మనువు, వాయువు,వహ్ని, ప్రజలయంతర్వర్తి యగు ప్రాణము. ఇతఁడె వసంతాది ఋతువులకుఁ గారణభూతుఁడు, వెలుఁగుఁజేయువాఁడును. కావున నితని నివ్విధమునఁ బ్రార్థింపుము.

ఆదిత్యహృదయస్తోత్రము

"ఓ సూర్యుఁడా! నీ వదితిపుత్రుఁడవు. అఖండభూమండలాధి పతివి. నీవు జగత్తును సృజించువాఁడవు, జనులను స్వకర్మలందుఁ బ్రేరే పించువాఁడవు, లోకోపకారము నిమిత్త మంతరిక్షమునఁ దిరుగువాఁడవు, వర్షముచే జగమును బోషించువాఁడవు, కిరణములు గలవాఁడవు, స్వర్ణ వర్ణుఁడవు, ప్రకాశించువాఁడవు, హిరణ్మయబ్రహ్మాండమును సృజించిన వాఁడవు, పగటినిఁ జేయువాఁడవు, శ్యామవర్ణములగు నశ్వములు గల వాఁడవు, వే వెలుఁగవు, సప్త యనెడి వారువము నెక్కువాఁడవు, ప్రకాశముగలవాఁడవు, అంధకారచ్ఛేదము గావించువాఁడవు, సుఖము గలిగించువాఁడవు, సర్వసంహారకుఁడవు, సర్వసంహారకాలమునఁ బున స్సృష్టిచేయునిమిత్త మయి పుట్టినవాఁడవు, దేదీప్యమానుఁడవు, పర్జన్యుఁ డవు, హిరణ్మయాండమైనవాఁడవు, సంసారతాపత్రయముచే మాఁడు వారికి చల్లఁదనము గలిగించువాఁడవు, తపనుఁడవు, వెలుతురు నొసఁగు వాఁడవు, అందఱిచేఁ గొనియాడఁబడువాఁడవు, పగటిపూట నగ్నిని లోపల నుంచుకొనియుండువాఁడవు, అదితి పుత్రుఁడవుగా నవతరించిన

వాఁడవు, సాయంకాలమున నడఁగువాఁడవు, మంచునకు గొంగవు, ఆకాశ నాథుఁడవు, రాహువును ఛేదించు శీలముగలవాఁడవు, ఋగ్యజు స్సామ వేదములయంతము నొందినవాఁడవు, ఎక్కువ వానను గురిపించువాఁడవు, నీటికిఁ జెలికాఁడవు, దక్షిణాయనమున వింధ్యరూప మగు వీథియందుఁ దిరుగువాఁడవు, ఎండ గాయువాఁడవు,గుండ్రనియాకారముగలవాఁడవు, శత్రువులకు మృత్యువవు, ఉదయమునఁ బింగళవర్ణుఁడవు, మధ్యాహ్న మున నందఱిని మాడ్చువాఁడవు, వ్యాకరణాదిసర్వశాస్త్రములను దెలిపిన వాఁడవు, విశ్వరూపుఁడవు, మహాతేజుఁడవు, రక్తవర్ణుఁడవు, అందఱి యెడ ననురక్తుఁడవు, అందఱి సంసారముల కుద్భవస్థానమైనవాఁడవు, రిక్కలకును గ్రహములకును జేఁడవు, జగత్స్థాపకుండవు, వెలుఁగులకు వెలుఁగు నొసఁగువాఁడవు, ఇంద్ర ధాతృ భగ పూష మిత్ర వరుణ అర్యమ అర్చి వివస్వంత త్వష్టృ సవితృ విష్ణువు లనెడి పండ్రెండు రూపములు గలవాఁడవు. ఇట్టివాఁడవైన నీకు నమస్కారము. తూర్పు కొండపై నున్న నీకు నమస్కారము. పడమటి కొండపై నున్న నీకు నమస్కారము. నక్షత్రముల కేలికవు, దినాధిపతివియునైన నీకు నమస్కారము. జయించువాఁడవు, జయమును మంగళము నొసఁగు వాఁడవును, బచ్చనిగుఱ్ఱములు గలవాఁడవు నైన నీకు నమస్కారములు. వేయి వెలుఁగులు గలవాఁడా! యదితి పుత్రుఁడ వయిన నీకు జోతలు. తన్నుపాసింపనివారికి భయంకరుఁడవు, ప్రాణులను బలుతెఱఁగులఁ బ్రేరించువాఁడవు, వడిగా నడచువాఁడవు, పద్మములను వికసింపఁ జేయు వాఁడవు. మార్తాండుఁడవు నైన నీకొఱకుఁ గేలుమోడ్పులు. సృష్టి స్థితిలయకర్త లగు బ్రహ్మ విష్ణు శివుల కీశుఁడవును, సకల జనులను గార్యములందుఁ బ్రేరించువాఁడవు, ఆదిత్యవర్చస్సు గలవాఁడవు, కిరణములు గలవాఁడవు, సర్వసంహారివి, సంహారకాలమున రౌద్ర రూపుఁడవు నైన నీకొఱకు నమస్కారము. అంధకారచ్ఛేదివి, శిశిరాప నోదకుఁడవు,ఆశ్రితు లగువారియొక్క శత్రువులను సంహరించువాఁడవు, అపరిమేయరూపుఁడవు, కృతఘ్నులను సంహరించువాఁడవు, వెలుఁగు చుండువాఁడవు; వెలుఁగు జేఁడవునైన నీకొఱకు నమస్కారము. పుటము

వేసిన బంగారపుఁ జాయఁ గలవాఁడవు, అగ్నిరూపుఁడవు, సర్వ జగత్కర్తవు, తమస్సును బోఁగొట్టువాఁడవు, జనుల లోపలనుండి వారి సుకృత దుష్కృత కర్మలకు సాక్షివై యుండువాఁడవు నైన జ్యోతిరూపుండ వగు నీకొఱకు నమస్కారము. ఇతఁడే ప్రలయకాలమున జగత్తును సంహరించుచున్నాఁడు. పునస్సృష్ట్యారంభమున నజ్జగమునే సృజించి పాలించుచున్నాఁడు. ఇతఁడే లోకములను దన కిరణములచే శోషింపఁ జేయుచున్నాఁడు. ఇతఁడే దహించుచున్నాఁడు. ఇతఁడే వర్షించుచున్నాఁడు. ఇతఁడే సకలజంతువులు నిద్రించు నవసరమున వారియందంతర్యామి యై, మేల్కొనియున్నాఁడు. ఈతఁడే యగ్నిహోత్రుఁడు. అగ్నిహోత్రము చేయువారి ఫలము నీతఁడే. వేదములును, వేదప్రతిపాదితము లగు యజ్ఞములును, తద్యాగఫలములును నీతఁడే. లోకమున జరుగు కర్మలన్నియు సర్వాత్ముఁ డయిన యా నియామకుఁడగు సూర్యుఁడే, అట్టి సూర్యుని నిడుమలందును, కష్టములందును, అడవులందును, భయములందును గీర్తించు పురుషుఁ డెవ్వఁడును నాశమొందఁడు. ఓ నిడుదచేతులవాఁడా! దేవదేవుఁడును, జగద్రక్షకుఁడు నైన సూర్యమండలాంతర్వర్తి యగు పరమాత్మను నిశ్చలమనముతో ధ్యానింపుము. ఇట్లు ముమ్మా ఱీ యాదిత్యహృదయమును జపించితివేని నీవీ క్షణముననే రావణుని వధించి జయము నొందఁగలవు." అని యగస్త్యుఁడు రామునకాదిత్యహృదయ ముపదేశించి యథాస్థానమునకుఁ జనియెను.

మహాతేజుఁ డగు రాముఁ డగస్త్యుని పలుకులు విని వంతఁ బాసి, జితేంద్రియుఁడై కడుఁ బ్రీతితో నా యాదిత్యహృదయము గ్రహించి, ముమ్మా ఱాచమనము చేసి పరిశుద్ధుఁడై యాదిత్యునిఁ గూర్చి జపించి, యెక్కువ మోదము వెల్లివిఱియ వింటిని గైకొని, శత్రువధము నెట్టయినను జేయ సమకట్టి యుద్ధమునకు వచ్చెను. అంతట సూర్యుఁడును స్వస్తోత్రముచే మనసున నుప్పొంగి, దేవతలనడుమ వచ్చి, రామునిఁ జూచి, రావణవధము గాఁ గలదని యెఱిఁగినవాఁ డయి "రామా! నీవు రావణవధమునకై త్వరపడుము" అని పలికి యంతర్ధానమొందెను.

108-వ సర్గము

రావణునికి దుర్నిమిత్తంబులు గలుగుట

ఆ రావణునిసారథి వేడ్కమీఱఁ బరసైన్యమును గలఁతపెట్టు నదియు, గంధర్వనగరమును బోలునదియు, మిగుల నెత్తగు టెక్కెములు గట్టినదియు, నెక్కువ వేగము గల పసిఁడి తొడవులతో నలంకరింపఁబడిన వారువములు పూన్చినదియు, ధనుర్గకవచాదు లగు యుద్ధసామగ్రులతో నిండినదియు, పతాకలు, ధ్వజములు, పుష్పమాలలు గట్టినదియు, నింగిని మ్రింగునదివోలె నుండునదియు, పుడమిని మ్రోగించునదియు, శత్రుసేనల నాశము చేయునదియు, స్వసేనలకు సమ్మోదము గలిగించునదియు నైన రావణు రథమును వడిగాఁ దోలెను. అట్లు ధ్వనితోడఁ గూడి మాఱుమ్రోఁత మ్రోగించుచు వడిగా వచ్చెడి యా రాక్షసేంద్రుని రథమును నరేంద్రుఁడు చూచెను. నల్లని వారువము పూన్చినదియు, నుగ్రమైన తేజము గలదియు, మెఱుపువంటి టెక్కెములతోఁ గూడినదియు, ఇంద్రాయుధ సదృశము లగు నాయుధములు గలదియు, జడివాన గురిపించునట్టి క్రొక్కాఱు మబ్బుకైవడి నల్లనైనదియు, వజ్రాయుధముచే భిన్నమై పగులుచున్న పర్వతముమాడ్కి శబ్దించునదియు నైన పగతుని యా రథమును గాంచి, రాముఁడు లేఁజందమామ పగిది వంగిన వింటి నారిని మీటుచు, నింద్రుని సారథిం జూచి యిట్లనియె:

"మాతలీ! కడు నాటోపముతో వచ్చు పగతుని యరదంబుఁ జూడుము. అప్రదక్షిణముగా గడు వేగముతో రథముఁ దోలుకొని వచ్చు నాతఁడు తన నాశమునకై మనము చేసినవాఁడు కావున నీవు నతని యట్లేమఱుపాటొంది యప్రదక్షిణముగా రథముఁ దోలక శత్రువు నెదుటికిఁ జక్కఁగా దోలుము. వాయువు పైకి లేచిన మేఘమును జెదరఁ గొట్టినచందమున నీతనిని రూపుమాపఁ జూచుచున్నాఁడను. దైన్యము లేకయు, నేమఱుపాటు లేకయు, మనమును నేత్రములును జెదరనీకయు, కళ్లెములను బిగఁబట్టియు రథమును వడిగాఁ దోలుము. మాతలీ! నీవు దేవేంద్రునియరదము నడపినవాఁడవు గనుక నీ కివి యన్నియు నంతగాఁ జెప్పఁబనిలేదు. అయినను, నే నేకాగ్రుఁడ నయి యుద్ధము చేయఁగోరి

యివి నీకుఁ దెలిపించితినిగాని, నీకు నేర్పువాఁడను గాను." అని రాముఁడు చెప్పిన మాటలను గైకొని, దేవేంద్రసారథియుఁ దన రథము నప్రదక్షిణముగాఁ బోనీయక, ప్రదక్షిణముగాఁ బోనిచ్చి, చక్రముల నుండి లేచిన దుమ్ముచే నా రావణుని వణఁకునట్లు చేసెను.

అంత రావణుఁడు గోపముచే నెఱ్ఱ నయిన కన్నులను గిర గిర త్రిప్పుచుఁ, దన రథమున కెదుట నున్న రాముని బాణములచేఁ గొట్టెను. రావణుని తిరస్కారము నోర్వనివాఁ డయిన రాముఁడు కోపమువలన ధైర్యము పూని, యింద్రుఁడు మాతలిచే నిచ్చిపంపిన కడువడిగల వింటిని, సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు బాణములను ధైర్యముతోఁ గైకొనెను. ఒండొరులవధముఁ గోరి, యొండొరుల నెదుర్కొనియున్న యా రామరావణులకు మదించిన సింగములకుంబోలె గొప్పపోరు జరిగెను. అప్పుడు దేవగంధర్వ సిద్ధ మహర్షులు రావణుని నాశముఁ గోరిన వారయి యే తెంచి వారి ద్వంద్వయుద్ధమును జూడ నాకసమున నిలిచి యుండిరి.

అప్పుడు రావణునికిఁ జేటును రామునికి జయమును దెల్పు శకునములు గనఁబడినవి. పర్జన్యుఁడు రావణుని రథముపై రక్తవర్షమును గురిపించెను. సుడిగాలులు వేంద్రములై యప్రదక్షిణముగా వీచినవి. గొప్ప గ్రద్దలమూఁక యాకసమునఁ బఱచుచు నాతని రథ మేయేవైపునకుఁ బోవుచున్నదో యాయా వైపునకుఁ బోవుచుండెను. దాసానిపువ్వువలె నెఱ్ఱనైన సంజవేళ యా లంకాపురమునఁ గాన్పించుటచే, నాలంకాపురప్రాంతభూమి పగటిపూటనే రాత్రియందుఁ బోలె మండుచుండునట్లుండెను. గొప్ప కొఱవులు సందడితోడఁ గూడి, రావణునికి జెఱుపు సేయునవై నందున రాక్షసులకు వ్యసనము గలిగింపఁబడఁగ్రందఁబడినవి. రావణుఁ డున్న ప్రదేశమునఁ బుడమియుఁ గంపించెను. యుద్ధవీరు లగు రాక్షసులును బగతురచేఁ జేతులఁ బట్టునడ్డయట్లు చేతులు లెత్తజాలకుండిరి. రావణుని యంగములందు నీల పీతరక్తశ్వేతవర్ణములు గల సూర్యకిరణములు ప్రసరించి పర్వతమున నున్న కావిఱాలవలెనో తెలిసినవి. వఱఖములును గ్రద్దలతోఁ గూడినవై నోటినుండి నిప్పులు వెలువరించుచు నా రావణుని మోములు చూచుచు నెక్కువపట్టుదలతోఁ గూసినవి. యుద్ధ

MEMORIAL LIBRARY V.R.NARLA D.P.I. Acc. No.

రంగమున గాలి దుమ్ము రేపుచు నా రాక్షసేంద్రునికిఁ జూపు దెలియక పోవునట్లు లఘవ్యముగా వీచెను. ఉఱుములు లేకయే, క్రూరములును, నోర్వరాని ధ్వని గలవియు నైన పిడుగు లాతని సైన్యమునం దంతటఁ బడెను. గోరువంకలును శ్రావ్యములుగాని ధ్వనులుగలవై యొండొరులతో ఘోరముగాఁ బోరుచు గుంపులు గుంపులుగా భయంకరముగాఁ గ్రిందఁబడినవి. దిక్కులు విదిక్కులు చీఁకటిగ్రమ్మిన వయ్యెను. దుమ్ము విశేషముగా లేచి, యాకాశమంతయు నిండెను. రావణుని తేరి గుఱ్ఱములు పొత్తికడుపులనుండి మిణుఁగుఱులను, నేత్రములనుండి కన్నీటిని గార్చినవి. ఇట్లే యవి యగ్నిని జలమును సమముగా విడిచినవి. ఇట్లు రావణునికి వినాశసూచకములైన భయంకరము లగు పెక్కు వినాశములు గలిగినవి. రామునకును మేలు గలిగించునవియు, మంచివియు నైన జయసూచకము లగు శుభశకునములుం గలిగినవి. రాఘవుఁడును దనజయము నిమిత్తమై కలిగిన శుభశకునములను గాంచి, తా నెక్కువముద మంది, రావణుఁడు నీల్గె నని తలఁచెను. అట్లు శకునజ్ఞుఁ డగు రాముఁడు తనకుఁ గలిగిన శుభశకునములను గాంచి, మేన గగ్గురుపాటు గలుగ నెక్కువ సంతసమంది, రావణవధమునకై కడు మగఁటిమిం జూపెను.

109-వ సర్గము

రాముఁడు రావణునిధ్వజంబు విఱుచుట

అప్పుడు రామరావణుల కిద్దఱకును సర్వలోకభయంకర మయిన కడుగొప్ప ద్వంద్వయుద్ధము మిక్కిలి దారుణముగా నడచెను. అంత వానరరాక్షససైన్యము లాయుధములు గైకొని కదలక నిలుచుండినవి. కడు భీకరముగాఁ బోరుసేయుచున్న యా రామరావణులం జూచి, యా యుభయసైన్యములు యుద్ధావలోకనాసక్తహృదయము లై యెక్కువ యచ్చెరువు నొందినవి. నానావిధాయుధములు దాల్చినవా రయ్యు, నా యుభయసైన్యములవారును దమ కెదుట వచ్చువానినిఁ జూచియు నొండొరులం బ్రహరింపఁ జాలకుండిరి. కన్నులు విచ్చి, రావణునిఁ జూచుచుండెడి రాక్షసులయు, రామునిఁ జూచుచుండెడి వానరులయు సేన చిత్తరువులమాడ్కి శోభిల్లెను. ఆ రామరావణు లిద్దఱును నచ్చటఁ గలిగిన శకునములను గాంచి, మనస్సు దృఢము చేసికొని, కదలని రోష

ముతో నిర్భయముగాఁ బోరు సేయఁదొడఁగిరి. కాకుత్స్థుఁడు జయింప వలయు ననియు, రావణుఁడు చావ వలయు ననియు నిశ్చయించుకొని, తమ యంతటి పరాక్రమము నప్పు డొండొరులపైఁ జూపుకొనిరి.

అంత మగఁటిమిగల దశగ్రీవుఁ డలిగి, వింట బాణములను సంధించి, రామునిరథధ్వజంబుఁ దగుల నేసెను. ఆ బాణము లింద్రుని రథధ్వజ మును బొందక యా దృఢరథమును సోఁకినవెంటనే భూతలమునఁ బడి నవి. తర్వాత వీర్యవంతుఁ డగు రాముఁ డలిగి, వింటిని వంచి చేసినదానికి బదులుచేయఁ దలచి స్వతేజస్సుచే వెలుఁగుచు మహాసర్పమువలె నోర్వ రాని దగు వాఁడి యమ్మును రావణునిధ్వజముఁ దగుల నేసెను. ఆశరము రావణుని ధ్వజమును భేదించుకొని, పుడమిఁ జొచ్చెను. రావణుని తేరి టెక్కెమును తునిఁగి క్రిందఁబడెను.

విశిష్టబలుఁ డగు రావణుఁడు తన ధ్వజము విఱుగుట గాంచి, క్రోధమువలనను నోర్వలేమివలనను దహించువానింబోలె నెక్కువ తేజరిల్లెను. రావణుఁ డట్లు రోషమునకుఁ బాత్రుఁడై, గొప్ప శరవర్ష మును గురిపించుచు, రాముని తురంగమములపై వాఁడియమ్ముల నేసెను. ఆ వారువము లా బాణములు దగిలియుఁ దడఁబాటునుగాని, చలనమును గాని బొందక తామరకాడలతోఁ గొట్టఁబడినవివోలె నెంతయుఁ గదల కుండినవి. ఆయశ్వములు చలింపకుండుట గాంచి, రావణుఁ డప్పుడు మఱల నాగ్రహమునొంది, బాణవర్షమును గురిపించి, గదలను, గుదియ లను, చక్రములను, రోఁకళ్లను, పర్వతాగ్రములను, వృక్షములను, శూలములను, గొడ్డళ్లను పడవైచెను. మఱి తన మాయాబలమునఁజేసి, యనేకవిధమయి, భయంకరమై, భయముగల్గించు మాఱుమ్రోఁతగలదై, గొప్పదైన బాణవర్షమును గురిపించెను. యుద్ధమున నా బహుబాణ మయమైన యావర్షమును రాముఁడు నిజాస్త్రములచే నివారించుటం జేసి, యా బాణములు రాఘవుని రథమును సోఁకక వానరసైన్యమున నంతటఁబడెను. అట్లు రావణుఁడు డెందమున నుత్సాహము వీడక, తదేక ధ్యానముతో బాణములను వేనవేలుగాఁ గుమ్మరించి, గగనము సందు లేకుండు నట్లొనరించెను.

అవ్విధమున బవరమునఁ బట్టుదల గలిగి, ప్రయత్నపడుచున్న రావణుఁ గాంచి కాకుత్స్థుఁడు పకపక నవ్వి వాఁడి యమ్ములను వింట

సంధించి యారావణునిపై వేనవేలుగాఁ గ్రుమ్మరించెను. రావణుఁడును తన బాణములచే నాకసమును సందులేన ట్లొనరించెను. అట్లు వారిద్దఱు ప్రయోగించిన వెలుఁగుగల బాణములు దట్టముగా నాకసమునఁ గ్రమ్ముటచే నది బాణములచేఁ జుట్టఁబడినదై వెలుఁగు రెండవ యాకాశము కైవడి భాసిల్లెను. వారి బాణములలో నొక్కటియైనను గుఱితప్పి వేయఁబడినదిగాని, గుఱితాఁకక పోయినదికాని, ప్రయోజనము లేనిదికాని కానిదయ్యెను. అట్లొండొరులపై బాణప్రయోగము సేసికొను రామరావణుల బాణము లొండొంటినిఁ దాఁకి నేలఁబడిపోయెను. వా రిరువురెడమ కుడిచేతులచేబాణప్రయోగము చేయుచు నెడతెగక పోరుసేసి, తమబాణముల నాకాశమున నిండించి యాకాశమున నూఁపిరి విడుచుటకైనఁ దావులేకుండఁ జేసిరి. ఆ రామరావణు లిద్ద ఱొక్కఁడు చేసినదానికి మఱొక్కఁడు బదులుసేయుచు నొండొరుల రథాశ్వముల నొంచుకొనిరి. ఇవ్విధమున నా వాడి మగలిద్దఱు కట్టలుక పూని పోరుచుండఁగా నా యుద్ధము ముహూర్తకాలము పులకలు గలిగించుచు భయంకరమై యుండెను. బలవంతు లగు రామరావణులు వాఁడియమ్ములతోఁ గయ్యమొనరించుచుండఁగా, రాక్షసాధిపుఁడు తన ధ్వజమును విఱిచినట్టి యా రామునిపైఁ గట్టలుక పూనెను.

110-వ సర్గము

రామరావణ యుద్ధము

అప్పుడు యుద్ధరంగమునఁ బోరుసేయుచున్న యా రామరావణుల నిద్దఱను సకలభూతములు వింత మనములతోఁ జూచిరి. అట్టి సమయమున నా రథికు లగు రామరావణు లిద్దఱు సమరవిషయమున నొండొరులపై జలము పూని, యొండొరుల నెదుర్కొనుచు నొండొరులను వధింపఁగోరి, యొండొరులను నొంచుచు, గుండ్రములను వీథులను గమనవిశేషములను రాకపోకలను నానావిధములైన సారథ్య విశేషము వలని గతులను జూపుచు భయంకరాకారముగలవారై యుండిరి. రాముఁడు రావణుని నొంచుచు, రావణుఁడు రాముని నొంచుచు బాణప్రయోగమునం దెక్కువవడిని జూపువారై యుండిరి. బాణముల నొండొరుపైఁ బ్రయోగించుకొనుచున్న యా రామరావణుల రథములు

రెండును జడిగురియుచున్న మేఘములచాడ్పున యుద్ధభూమియందు సంచరించినవి. ఆ రథికు లిద్దఱు సమరమున బహువిధ గమనములను జూపి, మఱల నొండొరుల కెదురుగా నిలిచిరి. అట్లు వారిద్ద ఱొండొరులకెదుట నిలువఁగా, రథముల కాళ్లును, గుఱ్ఱముల మోములును, టెక్కెములు నొక్కదానితో నొకటి చేరియుండినవి. అంతట రాముఁడు నాలుగు వాఁడి యమ్ములను వింటినుండి ప్రయోగించి, రావణుని తేరి గుఱ్ఱముల నావలికిఁ దోలెను. రావణుఁడును దన తేరిగుఱ్ఱముల నావలికిఁ దోలుటచే నెక్కువ క్రోధము నొంది, రామునిపై వాఁడి యమ్ములను బ్రయోగించెను.

రావణుఁడు బాణములచే రాముని నొప్పించినను, అతఁడు నొప్పినిగాని దిగులుగాని పొందఁ డయ్యెను. అంత నిశాచరుఁ డలిగి వజ్రాయుధతుల్యధ్వనులుగల పెక్కు బాణముల నింద్రసారథిపై బ్రయోగించెను. యుద్ధమునఁ గడు వేగముతో వచ్చిన యా రావణుని బాణములు మాతలి కావంతయేని మూర్ఛనొందె వెతనొందె కలిగింపవయ్యెను. మాతలిని నొంచుటఁ గాంచి, రాముఁడు తన్నుఁ దిరస్కరించునప్పటికంటె నెక్కువగాఁ గోపమునొంది, బాణపుంజము నేసి, పగతునిఁ దనయెదుట నిలువక పాఱునట్లు చేసెను. మఱియు రాఘవుఁ డొక్కొక్కతడవ కిరువది, ముప్పది, యఱువది, నూఱు, వేయేసి వంతున నా రావణుని రథముపై బాణములను బ్రయోగించెను. తర్వాత రథస్థుఁడైన రాక్షసాధిపతి యగు రావణుఁడును గదలను ముసలములను గురిపించి రామునిఁ గడు నొంచెను. అప్పుడు మూఁపఱకు గగ్గుర్పాటొంద వించు భయంకరయుద్ధము జరిగెను. గదా ముసల పరిఘా నినదముల చేతను, బాణముల ములుకులపాటుచేతను నేడు సముద్రములును గలఁతచెందినవి. అట్లు సాగరములు కలఁత చెందఁగా, పాతాళప్రదేశమున నుండునట్టి సర్పములును దానవులును వేలకొలఁదిగా దిగులొందిరి. పుడమియంతయుఁ బర్వతవనారణ్యములతోడఁ గదలెను. సూర్యుని డాలు తగ్గెను. గాలియు వీవ దయ్యెను. అంత దేవ గంధర్వ సిద్ధ కిన్నర మహోరగ పరమర్షు లందఱును వ్యసనము నొందిరి. "గోవులకును బ్రాహ్మణులకును మేలగుఁగాక ! లోకములు సతములయి యుండుఁగాక

రాఘవుఁడు రాక్షసాధిపుఁ డగు రావణుని జయించునుగాక!" యని పలుకుచు దేవర్షిగణము లా రామరావణుల గగుర్పాటొదవించు మహాభయంకరమైన యుద్ధముఁ జూచుచుండెను. అచ్చట గుమి గూడియున్న గంధర్వాప్సరసలు సాటిలేనియట్టి యా యుద్ధమును గాంచి, "గగనమే గగనసదృశ మనియు, సాగరమే సాగరసదృశ మనియు, రామరావణుల యుద్ధమునకు రామరావణులయుద్ధమే సమాన" మనియుఁ జెప్పుచు నా యుద్ధమును జూచుచుండిరి.

అంత రఘువంశమునకుఁ గీర్తిదెచ్చువాఁ డగు నిడుదచేతులు గలవాఁ డయిన రాముఁ డలిగి, సర్పముంబోలు బాణమును వింట సంధించి యేసి, కాంతిగలదై, వెలుఁగు పోగులు గలదయిన రావణుని శిరమును నఱికెను. ఆ శిరము పడుటను ముల్లోకములవారును గాంచిరి. రావణుని కా శిరమువంటి శిరమే మఱి యొక్కటి పుట్టెను. వేగముతోఁ బని చేయునట్టి రాముఁడు పడిగా నా రావణుని రెండవ శిరమును బాణములచేఁ ద్రుంచెను. ఒక శిరము దెగనఱికి నఱుకకమునుపే మఱల వేఱొక శిరము పుట్టుచునే యుండెను. అట్లు పుట్టుశిరస్సులను రాముఁడును వాఁడి యమ్ములచేఁ దెగనేయుచునే యుండెను. అవ్విధముగా రాముఁ డొక్కటేకాంతిగల రావణుని నూటొక్క శిరములను నఱికెనుగాని, రావణుని జీవితమునకు మాత్రము ముగింపు గానఁబడకుండెను. తర్వాత సకలాస్త్రవేత్తయు, శూరుఁడు, కౌసల్యకు సంతోష మెసఁగఁజేయువాఁడును నైన రాఘవుఁడు పెక్కు బాణములతోఁ గూడినవాఁ డయ్యు రావణునివధముకామికి వగవఁ దొడఁగెను.

"ఏ బాణములచే మారీచుండును దూషణుఁడును వధింపఁబడిరో, ఏ శరములచేఁ గ్రౌంచారణ్యమునఁ గబంధుఁడును, దండకారణ్యమున విరాధుఁడును వధింపఁబడిరో, యా బాణములన్నియు రావణునివిషయమున వీర్యహీనములై వ్యర్థములైనందులకుఁ గారణ మే మయి యుండవచ్చును" అని రాముఁ డేమఱక, చింతాపరుఁడై రావణుని మొమ్మున బాణములను వర్షించెను. తర్వాత రాక్షసవీరుఁ డగు రావణుఁడును గదా ముసలవర్షమును వర్షించి రామునిఁ గడు నొంచెను. అట్లు రామరావణు లిద్దఱును నాకాశమునను బుడమిపైనను, ద్రికూటశిఖరమునను

జూపఱకు సంతోషరోమాంచ ప్రదం బగు బాణవర్షమును గురిపించిరి. దేవ దానవ పిశాచ పన్నగ యక్ష రాక్షసులు చూచుచుండఁగా నాయుద్ధ మేడు దినములు నడచెను. రామరావణు లొక్క పగలును నొక రాత్రియు, నొక ముహూర్తము నొక్క క్షణమును విడువక యుద్ధముసేసిరి. మహాబుద్ధిగల దేవేంద్రుసారథి యగు మాతలి సమరమున రామరావణులలో రామునికి జయముగలుగకుండుట గాంచి, యుద్ధము సేయుచున్న యా రామునితో వేగ ని ట్లనెను.

111-వ సర్గము

రావణుఁడు రామునిచే వధింపఁబడుట

అప్పుడు మాతలి రామునిఁ గాంచి, "ఓ పరాక్రమశాలీ! యేల యిట్లు తెలియనివానిచందమున నితని ని ట్లుపేక్ష సేయుచున్నావు? ఓ ప్రభూ! ఇతనివధమునకై బ్రహ్మాస్త్రము నేయుము. వేల్పులు వాక్కుర్చిన చేటుకాల మితని కిప్పుడు వచ్చినది" అని యా రామునికి జ ప్తి పఱచెను.

అట్లు మాతలి మాటలచే జ్ఞప్తి వడసినవాఁడై, యా రాముఁడు వెలుఁగునదియు, బుసకొట్టుచున్న సర్పముంబోలినదియు, బ్రహ్మదేవుని కడనుండి తెచ్చి యగస్త్యునిచేఁ దనకు మొదట నియ్యఁబడినదియుఁ, దొల్లి వేల్పు తేనినిమిత్త మెక్కువ తేజస్సుగల బ్రహ్మచే నిర్మించి, ముల్లోకముల విజయముగోరు వేల్పుతేని కొసఁగఁబడినదియు, వాయువునకుఁ బోలె తెక్కలందు వేగమును, సూర్యాగ్నులకుఁ బోలె వాఁడిమియు నాకాశమునకుఁ బోలె విస్తారశరీరమును, మేరుమందరపర్వతములకుం బోలె బరువును గలదియుఁ, స్వశరీరకాంతిచేఁ గడు వెలుఁగునదియు, జక్కని పింజ గలదియు, బంగారు తొడవులతో నలంకరింపఁబడినదియు, సకలభూతములందలి తేజస్సుచే నిర్మింపఁబడినదియు, సూర్యునివంటి తేజస్సుగలదియు, పొగరాజుచుండెడి ప్రలయకాలాగ్ని కైవడి వెలుఁగునదియు, విసముగల సర్పముకైవడి వెలుఁగునదియు, శత్రువుల యేనుఁగులయు నశ్వములయు గుంపులను భేదించునదియు, శీఘ్రముగాఁ బని చేయునదియు, ద్వారములను నగ్గడ్డలను బర్వతములను భేదించునదియు, సకలశత్రువుల రక్తముచేఁ దడిసిన యంగములు గలదియుఁ,

గడు భీకరమైనదియు, గ్రొవ్వుచేఁ బూయఁబడినదియు, వజ్రాయుధము మాడ్కి నుఱిది గలదియు, గొప్పధ్వనితోఁ గూడినదియు, పెక్కు యుద్ధములందు శత్రువులఁ బరిమార్చినదియు, శత్రువుల కందఱకు భీతి గలిగించునదియు, గొప్పయాకృతి గలదియు, నంజుడుదిం డ్లగుగృధ్ర కాక వళ జంబుక రక్షోగణములకు సదా యాహారము నొసఁగునదియు, యుద్ధరంగమున యమునివలె దిగులుపుట్టించు రూపముగలదియు, వానరవీరులకు సంతోషప్రదమును, రాక్షసులకు భయావహమును, మనోహరములై విచిత్రములైన పలుఱెక్కలుగట్టుటచే వడిగాఁ బోవు నదియు, లోకములలో నుత్తమాయుధమును, ఇక్ష్వాకుభయనాశక మును, శత్రువులకీర్తి నాశకమును, తనకు సంతోషమును గలిగించు నదియునైన బ్రహ్మాస్త్రమును గైకొనెను.

బల్మికాఁ డగు రాముఁ డా యస్త్రమును వేదోక్తవిధానముచే నభిమంత్రించి, వింటియందు జోడించెను. రాముఁడు వింట నా శరమును సంధించు సమయమున సకలభూతములు వెఱచినవి; పుడమియు వడఁకెను. అంత రాముఁడు కట్టలుకఁ బూని కట్టాయితుఁడై, వింటిని వంచి యాకర్ణాంత మీడ్చి, శత్రువు మర్మఘాతి యగు నా బ్రహ్మాస్త్రాభిమంత్రిత శరము నా రావణునిమీఁద నేసెను. ఆ శర మింద్రుఁడు ప్రయోగించిన వజ్రాయుధముపగిది నోర్వరానిదై, యమునికైవడి నడ్డగింపరానిదై, యారావణుని ఱొమ్మునఁ బడెను. కడువడితో విడువఁబడినదై వచ్చిన ప్రాణహానికర మగు నా యమ్ము దురాత్ముఁ డగు నా రావణుని ఱొమ్మును జీల్చెను. శత్రుప్రాణ సంహారకమైన యా శరము రావణుని ఱొమ్మునఁ జొచ్చి వడితో నాతని ప్రాణములను గైకొని వెలువడి యతని మేని రక్తముచేఁ దడిసి భూమితలమునఁ బ్రవేశించెను. ఆశరము రావణుని సంహరించి, నెత్తుటఁ దడిసినదై, కార్యము సాధించి, మఱలఁ దన యమ్ముల పొదిలోపల వచ్చి చేరెను. ఆ రావణుఁడు నిహతుఁడయి క్రిందఁబడు నప్పు డతనిచేత నుండిన బాణసహితమైన విల్లతని ప్రాణములతో నెడలిపోయెను. మహాతేజస్సును వేగమును గల రాక్షసుఁడు మృతుఁడై వజ్రాయుధనిహతుఁ డయిన వృత్రాసురుని కైవడి రథమునుండి నేల మీఁదఁ బడెను. హతశేషు లయిన రాక్షసు లందఱు భూమియందుఁ

బడిన యా రావణునిఁ గాంచి, నాథుఁడు చచ్చుటచే వెఱపుచే నంతటఁ బరుగెత్తిరి. వానరులు వృక్షముల నెత్తికొని కిలకిలరవములు గావించుచు నా రాక్షసులను దఱుమఁగొట్టిరి. ఆ రాక్షసులు రావణుని చావును, రామవిజయమును గాంచి, పొంగుమీఱిన వానరులచే నొంపఁబడుచుఁ దమ యాదరువు నశించుటచేఁ గన్నులనుండి కన్నీటిని గార్చుచు మోములు వ్రేలవేసికొని లంకాపురమువైపు దిరిగి పరుగెత్తిరి. జయశాలు రగు వానరులు రాఘవ జయమును, రావణుని వధమును జెప్పుచు సంతసముతోఁ గిలకిలరవములు గావించిరి. అప్పు డంతరిక్షమున మంగళ సూచకము లగు దివ్యదుందుభివాద్యములు మ్రోఁగెను. అచ్చటఁ గమ్మని తావులతోడ గాలి కడు సుఖావహమై వీఁచెను. ఇతరులచేఁ బొంద నలవికానివియు, మనోహరమును నైన విరులవాన రాముని యరదముపై నాకసమునుండి గురిసెను. మహాత్ము లగు వేల్పు లందఱు రాఘవుని విజయమును బాగు బాగని నానాప్రకారములుగ నంతరిక్షముననుండి మేల్మి వాక్కులఁ బలుకుచుండిరి. సకలలోకభయంకరుఁడైన క్రూరుఁ డగు రావణుఁడు హతుఁ డగుటయు దేవగంధర్వచారణులు సంతసము నొందిరి. అంతట రాముఁడు రాక్షసవీరుని మడియించి ముదము నొంది, మహాబలు లగు సుగ్రీవాంగదులకును సంతసముఁ గలిగించెను. అంతట దేవతల కడగండ్లు దొలఁగెను, దిక్కులు వెలసెను, నింగి దేట యయ్యెను. భూకంప మడఁగెను. గాలి వీవఁ దొడఁగెను. సూర్యునికిఁ గాంతి హెచ్చెను. అంత సుగ్రీవ విభీషణులు మున్నగు చెలికాండ్రందఱు లక్ష్మణపురస్సరులై రావణుని వధముచే సంతసంబొంది, జయశాలియై సమరమున నొప్పియున్న రాముని మన్నన గావించిరి. ఎక్కువ ప్రతాపము గల యిక్ష్వాకునందనుండు శత్రువును వధించి, ప్రతిజ్ఞ నెఱవేర్చి తన బందుగులు చెలికాండ్రును గూడియుండ వేల్పు లగు మునులతోఁ గూడిన యింద్రుని కైవడి వెలుఁగుచుండెను.

112-వ సర్గము

భ్రాతృవధముచే శోకించుచున్న విభీషణుని రాముఁ డోదార్చుట

రామునిచే నోడఁగొట్టఁబడి, నిహతుఁ డయి పుడమిపై శయనించి యున్న తన యన్నయగు రావణునిఁ గాంచి, విభీషణుఁడు మనమున

వ్యసనము పర్వఁగా నిట్లని పలవింపఁ దొడఁగెను. "ఓ శూరుఁడా! ప్రసిద్ధ పరాక్రమశాలీ! సకలశాస్త్రపండితుఁడా! నీతినిపుణుఁడా! సూర్యునిబోలు కిరీటం బొఱఁగఁగా, నంగదములచేఁ గైసేయఁబడిన నిడుదచేతు లాడింపక క్రిందవైచికొని, యింతకుమున్ను మేటిపాన్పునఁ బరుండునట్టి వాఁడ వయ్యు నిప్పు డిట్లు నేలఁబడి యున్నాఁడవే? ఓ మొనగాఁడా! నీవు కామమోహములుమీఱఁగా నే నప్పుడు సెప్పినమాట వినకపోతివికాదా దానికి ఫలం బిప్పు డనుభవింపవలసివచ్చినది. అప్పుడు ప్రహస్తుఁడేని ఇంద్రజిత్తేని, కుంభకర్ణుఁడేని, అతిరథుఁ డగు నతికాయుఁడేని, నరాంతకుఁ డేని, స్వయముగా నీ వేని సీతను దొంగిలించి తెచ్చినది తప్పని యేల తలఁపరైతిరో దాని కుత్తరఫల మిపు డనుభవమునకు వచ్చినది. శాస్త్ర జ్ఞులకుఁ గట్టియై యున్నవాఁడు గతించెను; ధర్మస్వరూపుఁడు గతించెను; బలముయొక్క కూట మనఁదగినవాఁడు వెళ్లెను. స్తోత్రములకుఁ దగిన వాఁడు పడిపోయెను. విలుకాండ్రలో మేటి యగు నీ రావణుఁడు పుడమిం గూలఁగా, సూర్యుఁడు నేలమీఁదఁ బడెను; చంద్రుఁడు చీఁకటియందు మునిఁగెను. అగ్ని జ్వాలలు లేనివాఁడై చల్లాఱెను. ఉత్సాహశక్తి రావణుంబోలు నాశ్రయము లేమింజేసి, యడఁగిపోయెను. రాక్షసశ్రేష్ఠుఁ డగు రావణుఁ డివ్విధమున దుమ్మునఁ బొఱలుచుండ శూరలోకము శూన్యముగాక యింకను మిగిలియున్నదా యని తోఁచుచున్నది. ధైర్య మనెడి చిగుళ్లు గలదియు, నోర్పనెడి మేటి పుష్పములు గల దియు, తపస్సనెడి బలము గలదియు, శౌర్యమనెడి కదలని వేఱు గలదియు నైన రాక్షసేంద్రుఁ డనెడి గొప్పవృక్షము రాఘవుఁ డనెడి గాలిచే విఱిచి క్రిందఁ ద్రోయఁబడెను. తేజస్సే కొమ్ముగాఁ గలదియు, పెద్దలవంశ మనెడి వెన్నెముక గలదియుఁ, గోపమనెడి యపరకాయమును ప్రసాద మనెడి హస్తమును గలదియునైన రావణుఁ డనెడి మదపుటేనుఁగు రాముఁ డనెడి సింహము గట్టిగాఁ బట్టుకొనుటచేఁ బుడమిని నిద్రించువానికై వడి నీల్గినది. పరాక్రమోత్సాహము లనెడి విస్తరించిన జ్వాలలు కలదియు, నిట్టూ ర్పనెడి పొగ గలదియుఁ దన బలిమి యనెడి వేఁడిమి గలదియు వెలుఁగు గలదియునైన రాక్షసేంద్రుఁ డనెడి యగ్ని రామమేఘముచేఁ జల్లార్పఁ బడెను. రాక్షసు లనెడి తోఁకయు మూఁపును ఱొమ్మును గలదియు,

శత్రువులను జయించునదియు, శత్రుసంహారమునందుఁ బ్రసిద్ధి చెంది నదియు, విషయాశ యనెడి కన్నులు చెవులు గలదియునైన రావణుఁ డనెడి వృషభము రాముఁ డనెడి వ్యాఘ్రముచే మడియింపఁబడి నీల్గెను.

వగగూరి కృతార్థ నిశ్చయమైన సకారణ మగు పలుకులాడుచు న్నట్టి విభీషణునిఁగాంచి, రాముఁ డి ట్లనియె. "విభీషణా! యీతఁడు సమరమునఁ బ్రతాపముఁ జూపకయే నశించినవాఁడుకాఁడు; ఇతఁడు నిర్భయుఁడై యోర్వరాని పరాక్రమమును నెక్కువ పూనికయుఁ జూపి మృతినొందినవాఁడు. పరలోకవృద్ధిని గోరి యుద్ధరంగమున నీల్గిన క్షత్రియునికి ధర్మ మగు శౌర్యము నవలంబించినవారింగూర్చి యివ్విధమున వగఁగూరరాదు. తొల్లి యింద్రాదిదేవతలను ముల్లోకములను వెఱపించిన యీ రావణుఁడు కాలధర్మము నొందుటఁగూర్చి విచారపడుట యుక్తముగాదు. బంధువులు మృతినొందిన వగవకుండుట యెట్లందువో, రావణుఁ డింతకుము న్నొకప్పుడును నపజయము నొందినవాఁడుకాఁడు; వీరుఁ డొకప్పుడు బవరమున శత్రువులను గెల్చును; మఱియొకప్పుడు తానుం బరులచే నోడఁగొట్టఁ బడును. ఇదియే పెద్దలచే నేర్పఱచఁబడిన శూరసమ్మతమయినమార్గము. కావున రావణుఁడు యుద్ధరంగమున మడిసెను. ఈతనిఁ గూర్చి వ్యసనపడుట యుక్తము గా దని నేఁ దలఁచెదను. కావున నిట్టి తత్త్వము నెఱిఁగి మనస్సున దాని నెలకొల్పిఁ శోకము వీడినవాఁడవై యనంతరకార్యము నాలోచింపుము."

ఇట్లు పరాక్రమవంతుఁ డయిన రాముఁడు పలికిన పలుకు లాలకించి, విభీషణుఁడు దుఃఖించుచు వెండియు దనయన్నకు హితము గోరి రాముని తో ని ట్లనియె. "తొల్లి యింద్రాదులగు వేల్పులందఱుఁ గూడి యెత్తి వచ్చినను, నవమానము నొందనట్టి యీ రావణుఁ డిప్పుడు, సముద్రము చెల్లెలికట్టెను దట్టి యాగిపోవునట్లు నిన్నుఁదాటి భగ్నుఁ డయ్యెను. ఇతఁడు తొల్లి పెక్కుదానము లొనరించెను. అనేక సత్కార్యములు చేసెను. పెక్కుభోగము లనుభవించెను. భృత్యులను నిరంతరము పోషించెను. తన మిత్రులకు మితిలేని ద్రవ్య మొసఁగెను. తన యమిత్రులయెడఁ గసి దీర్చుకొనెను. ఇతఁ డాహితాగ్ని; ఎక్కువ తపస్సు చేసినవాఁడు, వేదాంతము నెఱిఁగినవాఁడు, పనులందు గొప్పమొనగాఁడు. కావున

నీ వనుగ్రహించినఁ బ్రేతత్వము నొందిన యీతనికి స్వర్గలోకాధ్యక్షమయిన కర్తవ్యకర్మము చేయఁగోరుచున్నాను." అని విభీషణుఁ డడుగఁగా ధీరస్వభావుఁడును మహాత్ముఁడును నగు రాముఁ డతని మాటలను బాగుగా విన్నవాఁడై, యా రావణునికి స్వర్గలోకము గలిగించు సంస్కారము చేయింప నెంచి, "వైరములు మరణాంతములు, మన కార్యము నెఱవేఱెను, నీ వితనికి సంస్కారము నొనరింపుము. ఈతఁడు నీ కెట్లో నాకును నట్లె." యని విభీషణునితోఁ జెప్పెను.

113-వ సర్గము

రావణుని మరణమునకై యంతఃపురస్త్రీలు విలపించుట

మహాత్ముఁ డగు రాఘవునిచే రావణుఁడు వధింపఁబడిన మాటను వినిన రావణుని యంతిపురపు టంగన లందఱు పెక్కండ్రు వలదు వలదని నివారించుచున్నను నిలువక, పుడమి దుమ్మునందుఁ బొఱలుచు శిరోజములు విఱియఁబోసికొని, దూడలఁ బోఁగొట్టుకొన్న యావులకైవడి వెతలఁ గుందుచు నంతిపురమునుండి వెలికి వచ్చిరి. ఆ రాక్షసకాంతలు రాక్షసులతోడ నుత్తరద్వారమునుండి వెడలివచ్చి, ఘోరమైన యుద్ధభూమిని బ్రవేశించి, పోర నీల్గిన తమపతిని వెదకుచు, "రాజపుత్రుఁడా" యని రామునిఁగూర్చియు "హా నాథా" యని తమ మగనిఁ గూర్చియుఁ బలుమాఱు వగచుచు, మొండెములతో నిండి, నెత్తురుబురద గలిగియున్న యుద్ధభూమిని జుట్టుకొని, కన్నుల నీరు గ్రమ్మఁ బెనిమిటిపోక వలన నొడలు మఱచినవారలై మేటియేనుఁగులంబోఁగొట్టుకొన్న యాఁడుటేనుఁగులకైవడి విశేషముగా నఱచుచు, మహావీర్యుఁడును, మహాకాయుఁడును, మహాతేజుఁడును నై నల్లనికాటుకరాశింబోలిన మగనిఁ జూచి, ఛేదింపఁబడిన వనలతలవలె నతని యంగములందుఁ బడిరి. ఆ రాక్షసకాంతలలోఁ బ్రేమవలన నొక్కతె రావణుఁ గౌఁగిలించికొనియు, నొక్కతె కాళ్లు పట్టుకొనియు, నొక్కతె కంఠమును బట్టుకొనియుఁ బలవించెను. ఒక కాంత యతని చేతులం బట్టికొని పుడమినిఁ బొఱలెను. మఱొక్క కాంత హతుఁ డయిన తన మగని మోమును గాంచి మూర్ఛ చెందెను. ఒకానొక కాంత తన పతిశిరమును దొడమీఁద నుంచుకొని, మోమును దేఱిచూచుచు, మంచుబొట్లచేఁ దమ్మిపూవును బోలెఁ దన

కన్నీటిచే రావణుని మోమును దడుపుచు నేడువఁ దొడఁగెను. ఆ రావణుని భార్యలు రామునిచే మడియింపఁబడి నేల నొఱఁగియున్న భర్తను గాంచి, పలుమాఱు పరిపరివిధములఁ బనవి నివ్విధంబునఁ బరిదేవనము గావించిరి. "ఎవనిచే నింద్రుఁడు వెఱపింపఁబడెనో, ఎవనిచే యముఁడు దిగులొందింపఁబడెనో, ఎవనిచేఁ గుబేరునిపుష్పకవిమానము దేఁబడెనో, దేవగంధర్వ మహర్షులకును నెవ్వనిచే భయ ముత్పాదింపఁబడెనో, ఆ యీ రావణుఁడు రణ నిహతుఁడై పుడమిని శయనించుచున్నాఁడు. ఇంతకుమున్ను సురాసురులవలనఁ గాని, పన్నగులవలనఁగాని భయ మన్నమాట నెఱుఁగని యీ రావణుని కిప్పుడు మనుష్యమాత్రుని వలన నాపద యొదవెను. దేవదానవ రాక్షసుల కవధ్యుఁడై యుండిన యీ రావణుఁ డిప్పుడు కాలిబం టయివచ్చిన మానవునిచే వధింపఁబడి రణభూమిని శయనించుచున్నాఁడుగా! దేవతలచేఁగాని, యక్షులచేఁ గాని, యసురులచేఁగాని వధింపఁబడఁజాలని రావణుఁడు దుర్బలుఁడైన మానవునిచందమునఁ గేవల మానవునిచే మృత్యువుపాలు సేయఁబడెను.

ఇవ్విధముగా నా రావణుని భార్యలు రావణుని పరాక్రమములఁ బేర్కొనుచు దుఃఖము పెల్లగించుకొని వచ్చుచుండుటచే మాటి మాటికిఁ బలవించిరి. మఱియు నా రావణపత్నులు రావణునిఁగూర్చి "యో నాథా! యెల్లప్పుడు నీహితముఁ గోరు చెలికాండ్ర మాటలను వినక నీవు నీ మరణమునకై యీ సీతం దెచ్చితివి. పెక్కండ్రు రాక్షస వీరులు జంపఁబడిరి. ఇప్పుడు మేమును నీవును రాక్షసులును మన మెల్ల రము నొక్కమారుగా వధింపఁబడితిమి. నీవు చావుగోరి, హితము పలుకు నట్టివాఁ డగు విభీషణునిఁ దెలివిలేక నిష్ఠురపుమాటలచేఁ దిరస్కరించితివి. ఓ నాథా! నీవు తెచ్చిన సీతను రామునికి మఱలఁ గొనిపోయి యిచ్చితి వేని, మాకు సర్వస్వముఁ బోఁగొట్టునట్టి యీ ఘోరవ్యసనము జరిగి యుండదు. విభీషణునికోరిక నెఱవేర్చియుందువేని, రాముఁడు మనకుఁ జెలికాండ్రలోనివాఁడై యుండును, మేమును విధవలము గాకయుం దుము. మన శత్రువుల కోరికలును ఫలింపకయుండును. నీవు కనికరము లేనివాఁడ వయి సీతను బలాత్కారముగాఁ జెఱపట్టుటచే రాక్షసులును, నీవును, మేమును నేకకాలమున నిహతులమైతిమి. రాక్షసేంద్రా! యీ

కార్యమెల్ల నీవే స్వేచ్ఛతోఁ జేసితి వనుట యుక్తముగాదు. అంతయు దైవంబు నడిపించును. అంతయును దైవముచేతనే చేయఁబడుచున్నది. కాన దైవహతుఁడే శత్రు నిహతుఁ డగును. ఓ మహాబాహూ! వానరులకును, రాక్షసులకును, నీకును, జేటుకాలము దైవయోగము వలనఁ గలిగినదేకాని, వేఱొక కారణమునఁ గాదు. లోకమున నర్థకామములచేతఁగాని, పరాక్రమముచేఁగాని, ఆజ్ఞచేఁగాని, దైవగతి నుల్లఘింప నెవరికిని శక్యముగాదు." అని యివ్విధమున నా రాక్షసేంద్రుని భార్యలు కన్నీటిచే దృష్టి చెదరఁగా, క్రౌంచపక్షులమాడ్కి వ్యసనముతోఁ గడు దీనముగాఁ బలవించిరి.

114-వ సర్గము

మండోదరి భర్తృమరణమునకై విలపించుట

అవ్విధమున రాక్షసకాంతలు విలపించుచుండఁగా, రావణాసురుని యనుఁగుఁబట్టపుదేవి యయిన మండోదరి యోర్వరాని పనులు చేయునట్టి రామునిచే నిహతుఁడైన భర్తను జూచి కడు దీనముగాఁ బలవింపఁ దొడఁగెను. "ఓ మహాత్ముఁడ వగు కుబేరుని తమ్ముఁడా! కినుకతోఁ గూడిన నీ యెదుట నిలుచుటకు వేల్పుఱేఁడును వెఱచును గదా! ఓ నాథా! మహాప్రభావు లగు ఋషులును, పుడమివేల్పులును, గంధర్వులును నీయెదుట నిలువఁజాలక నీకు వెఱచి, మూలమూలకుఁ బోయిరిగదా! రాక్షసశ్రేష్ఠుఁడ వగు ఓ నాథా! మానుషమాత్రుఁ డయిన రామునిచే నిహతుఁడవై యిట్లు క్రిందఁబడి నీ వించుకయైనను సిగ్గులేక యున్నాఁడవే? ముల్లోకముల నాక్రమించి ప్రభుత్వసంపదతోను, శౌర్యముతోను గూడి, శత్రువులచే నోర్వరానివాఁడ వయిన నిన్ను నడవులపా లయిన మానవుఁడు చంపుట యెట్లు? మనుజులకుఁ బొంద నలవి కాని ప్రదేశమున నుండువాఁడవును కామరూపుఁడవును నగు నీవు సమరమున రామునిచే వధింపఁబడుట యుక్తముగాదు. అన్ని యుద్ధసామగ్రులతో నిండిన నిన్ను రాముఁడు యుద్ధరంగమున సమయించె ననుట యెంతయు నాకు విశ్వాసార్హముగాఁ దోఁపలేదు. జనస్థానమునఁ బెక్కండ్రు రక్కసులతోఁ గూడిన నీ తమ్ముఁడు ఖరు నారాముఁ డెప్పుడు దా నొక్కఁడే సంహరించెనో, యప్పుడే యతఁడు మానవమాత్రుఁడు

గాఁడని తలంచితిమి. వేల్పులకైనను జొరనలవికాని లంకాపురమును హనుమంతుఁ డెప్పుడు ప్రవేశించెనో, యప్పుడే మేము మనమున దిగులొందితిమి. ఎప్పుడు మహాసముద్రమున భయంకరు లగు వానరులు సేతువును గట్టిరో, యప్పుడే రాముఁడు మానవుఁడుగాఁడని నిశ్చయించితిని. అటుగాక, యముఁడు సాటిలేని రూపసౌందర్యముగల సీతారూపమైన మాయను సృజించి తానే రామరూపముతో నవతరించి వచ్చెనో! లేక యింద్రుఁడు నిన్నీ రామరూపముతో వచ్చి తిరస్కరించెనో! ఇంద్రునికి సమరమున నిన్నుఁ దేఁజిచూచుటకేనిశక్తిగలదే! లోకరక్షణోపాయచింత గలవాఁడును పరమాత్మస్వరూపుఁడును, శాశ్వతుఁడును, ఆదిమధ్యాంతరహితుఁడును, పరాత్పరుఁడును, ప్రాకృతసమూహమునకంటె మహత్తయినవాఁడును, సృష్టికర్తయు, శంఖ చక్రగదాధరుఁడును, శ్రీవత్స మను మచ్చగలవాఁడును, లక్ష్మీదేవి నెడఁబాయకుండువాఁడును, జయింప నలవికానివాఁడును, త్రివిధవికారశూన్యుఁడును, కదలింపరానివాఁడును, పరాక్రమము వీడనివాఁడును, సర్వలోకాధిపుఁడును, మహాతేజుఁడును నైన సాక్షాద్విష్ణువే రామావతారమెత్తి లోకములకు మేలు సేయఁగోరి, వానరరూపములు దాల్చిన వేల్పులతోడ వచ్చి నిన్ను సపరివారముగా వధించెను. ఇది నిక్కము."

నీవు మున్నింద్రియముల వశపఱచుకొని, ముల్లోకములను గెల్చితివి. కావున నావైరమును దలఁచుచున్న యింద్రియము లేనిన్ను మఱల నోడించినవి. ఓ నాథా! రామునితోఁ జెలిమి యొనరింపుమని నేను బెక్కుతెఱఁగులఁ బల్కినను, నా మాట వినవైతివికదా! దాని కిప్పుడు ఫల మనుభవింపవలసి వచ్చినది. రాక్షసోత్తమా! నీవు నిష్కారణముగాఁ బ్రాణధనములు రెండింటిని గోల్పోవుటకును, స్వబంధు నాశమునకును సీతాదేవిం గోరితివి. నీవు దుర్బుద్ధిగలవాఁడ వయి అరుంధతీరోహిణుల కంటె మిన్నయైనదియు, గారవమున కర్హురాలును నైన సీతాదేవిని బెదరించి యన్యాయము నాచరించితివే! నీసొమ్ముగు మమ్ము-నీప్రియభార్యలను దూషించు నాప్రభువా! భూదేవికంటె నోర్పుగలదియు, సర్వసౌభాగ్యముగల యతివలకు దృష్టాంతమయిన శ్రీకిని దృష్టాంతమైనదియు, భర్తయందు ననురాగము గలదియు, నిర్దుష్టములైన సర్వాంగములు

గలదియు, దీనురాలు నైన సీత యరణ్యమున నొంటరియై యుండఁగా, నామెను గపటముతోఁ దెచ్చి నీవు తలఁచినట్లుగా నా దేవితోడి సంగమమును బొందకయె, పతివ్రత యగు నామెయొక్క పాతివ్రత్యబలముచేఁ దప్పక కాలిపోయితివి. ఓ నాథా! నీవు పతివ్రత యగు సీతను దాఁకినప్పు డామె పాతివ్రత్యమహిమచే దహింపఁబడవైతివి గా యని దేవతలందఱు నీప్రభావమునకు వెఱచుచుండిరి. అట్టి భీతులైన వేల్పులు నీ కెట్లు దాహమును గలుగఁ జేయఁగలిగిరి! పాపము లొనరించినవాఁడు దా నొనరించిన పాపములకు ఫలమును గాలము పర్యవసించునపుడు పొందుచున్నాఁడు. మంచి చేసినవాఁడు మంచి యొందును, చెడుగొనరించినవాఁడు చెడు గొందును. మంచి చేయునట్టి విభీషణుఁడు సుఖము నొందెను. ఇట్టి చెడుగొనరించిన నీ వీ దుఃఖము నొందితివి. ఆ సీతకంటెఁ జక్కనైన జవరాండ్రు నీకడ నెందఱో యున్నారు. నీవు మరుని వశమునఁ జిక్కి మోహమునంజేసి వారి నెఱుఁగవైతివి. ఆ సీత నాకంటెఁ గులమునఁగాని, రూపమునఁగాని, నేర్పునఁగాని మించినదా? లేక సాటియైనదా? అట్లుండియు నీ వవివేకముచే దీని నెఱుఁగవైతివి. లోకమున సకలజంతువులకుఁ గారణములేక మృత్యువు సంభవింపదు. నీ కన్ననో యీ సీతాదేవిం దెచ్చుటయే మృత్యువునకు హేతు వయ్యెను. ఈ సీతాదేవి యను కారణముగల మృత్యువును నీ వెంత దవ్వునుండియో తెచ్చి మెడకుఁ గట్టికొంటివి. ఈ జానకి శోకము విడిచి రామునితో విహరింపఁగలదు. దౌర్భాగ్యవంతురాల నయిన నేనో భయంకరమైన దుఃఖసాగరమున మునిఁగితిని. ఓ శూరుఁడా! నేను వివిధాభరణపుష్పమాల్యాంబరములను దాల్చి సాటిలేని కాంతితో నొప్పినదాననై నీతోడ విమానమునెక్కి వివిధములయిన యాయాదేశములను జూచుచు, కైలాసమునను, మందర మేరుపర్వతములందును, జైత్రరథ మను కుబేరుని యుద్యానమునను, వేల్పుల యాటతోఁటలయందును విహరించితినే. ఇప్పుడు నీమరణమువలన నట్టి కామానుభవము లెల్ల నశించినవిగదా! అట్టి మండోదరినే యిప్పుడు వేఱొక్కదాననైతిని. భీమరాజుల కలుములు తిరములు కావు. ఓ రాక్షసేంద్రుఁడా! నా నాథుఁడా! సుకుమారమును, చక్కని కనుబొమ్మలును నున్నని చర్మమును గలదియు, నున్న

తంపు ముక్కుకలదియు, కాంతియందుఁ జంద్రుని, లావణ్యమునఁ బద్మ మును, తేజస్సునందు సూర్యునిఁ బురుడించినదియు, కిరీట శిఖరముచేఁ బ్రజ్వరిల్లునదియు, నెఱ్ఱని యోష్ఠములుగలదియు, మనోహరమును నైన నీమోము మున్ను మద్యపానముచేయు తావులందుఁ గైపుచే గిరగిరఁ దిరుగు కన్నులచే నొప్పుచుఁ బలుతెఱుఁగులైన పుష్పమాల్యములను దాల్చినదై, మాటలాడునపుడు తిన్నని చిఱునవ్వుతోఁ గూడి శోభిల్లు చుండెనుగదా! ఆ నీ మో మిప్పుడు రామబాణములచే నిర్భిన్నమై నెత్తుటివెల్లువలందుఁ దడిసి, మెదడు చీలి యందలి క్రొవ్వును మాంస మును చెదఱిపడియుండఁగాఁ దేరిదుమ్మున బ్రుంగింపుదఱిగి చూడరానిదై యున్నది, నేను మూఢనై యింతకుమున్నిట్లు మనకు రాఁబోవుననితలఁప నట్టి మదైశ్వర్యదశకు హేతువైన యీ మృత్యువు నీకు సంప్రాప్త మైనది కాదా! నా తండ్రి దానవుల కధిపతియనియు, నామగండు రాక్ష సాధిపతి యనియు, నాపుత్రుఁ డింద్రుని జయించినవాఁ డనియు నేను గడుఁ బొంగుచుంటిని. మఱియు, నన్నుఁ గాపాడవలసినవా రగు నీ మువ్వురును మదించిన పగతుర నడఁచువా రనియు, వాఁడిమిగలవా రనియు, బలపరాక్రమములచేఁ బ్రసిద్ధి గన్నవా రనియు, నేరికి వెఱవని వారనియు దృఢవిశ్వాసము గలదానను నై యుంటిని. ఓ రాక్షసాధిపా! అట్టి మహిమ గల మీకుఁ గించిత్తయినను యెఱుఁగఁబడకయే యీ మానవమాత్రునివలని భయ మెక్కడినుండి వచ్చెనో! నున్నని యింద్ర నీలమువలె నీలమైనదియు, నున్నతశైలముమాడ్కి నెత్తయినదియు, బాహుపురులు ముత్యాలసరములు మున్నగు భూషణములచే దీపించు నదియు, విహార సమయములం దెక్కువ చక్కనిదియు, యుద్ధభూము లందుఁ గడు వెలుఁగునదియు నైన యే నీ శరీరము సకలాభరణములచే శోభిల్లుచు మెఱుపులతోఁ గూడిన వార్షికజలధరమువలె నొప్పు చుండెనో, యా మే నిప్పుడు పెక్కు వాఁడియమ్ములు గ్రుచ్చుకొనుటచేఁ దాఁకుటకైనను నవకాశహీనమై కౌఁగిలించుకొన నలవికాకున్నది. రాక్ష సేంద్రా! యట్టి నీ శరీర మేదుపంది ముండ్లచే నిండియుండునట్లు వాఁడి యమ్ము లాయపట్టులందు దట్టముగా గ్రుచ్చుకొనుటచే నరములమున్లు భిన్నములు గాఁగా రక్తార్ద్రమయి, నల్లపాఱి, వజ్రాయుధప్రహారముచేఁ

గొట్టఁబడిన పర్వతముకైవడిఁ బుడమినిఁ బడియున్నది. హా నాథా! నీవు రామునిచే వధింపఁబడితి ననుట కలయా లేక నిక్కమా! మృత్యువునకుఁ గూడ మృత్యువైన నీ వెట్టు లా మృత్యువునకు లోఁబడితివి.

ముజ్జగములలోని శ్రేష్ఠవస్తువుల ననుభవించువాఁడును, ముజ్జగములకు గొప్ప భీతిని గలిగించువాఁడును, నింద్రుఁడు మున్నగు లోకపాలుర గెలిచినవాఁడును, శంకరు ధిక్కరించినవాఁడును, గర్వితుల నడఁగించువాఁడును, శత్రువులపైఁ బరాక్రమముఁ జూపువాఁడును, లోకములను గలఁచువాఁడును, తన యార్పులచే భూతములను వెఱపించువాఁడును, శత్రువులయెడ బలిమి మెఱయ వీరాలాపముల నాడువాఁడును, భయంకరకార్యము లొనరించెడి తనదు జోదులను బనివాండ్రను గాపాడువాఁడును, దానవవీరులను, యక్షులను బెక్కండ్రను మడియించువాఁడును, నివాతకవచులను బట్టుకొన్న మేటియు, పెక్కు జన్నములఁ బాడుసేసినవాఁడును, తనవారినిఁ గాపాడువాఁడును, న్యాయపద్ధతిని బోఁగొట్టువాఁడును, సమరమున మాయలను బన్నువాఁడును, నచ్చటచ్చటనుండి దేవ అసుర మానవ కన్యకలను దెచ్చువాఁడును, పగతురఁ బరిమార్చుటచే వారికాంతలకు ఖేదము గలిగించువాఁడును, దన బందుగులను బోషించువాఁడును, లంకాపురమునకు రక్షకుఁడును, ఘోరకర్మము లొనరించువాఁడును, మాకు సకల సుఖముల నిచ్చువాఁడును, రథికులలోపల మేటియు నైన యీ నా ప్రియుండు రాముని చే హతుఁడై యిట్లు క్రిందఁ బడియుండఁగాఁ బ్రాణముల విడువక కఠినహృదయ నయి యున్నాను. రాక్షసేశ్వరా! మేటిపాన్పులందుఁ బరుండెడు నీవు నేఁడు దుర్మార్గముగా నెఱ్ఱఁదనముగలిగి వట్టినేలఁ బొఱలుచున్నాఁడ వదేల? నా కుమారుఁ డింద్రజిత్తెప్పుడు లక్ష్మణునిచేఁ గూల్పఁబడెనో, యప్పుడే నాకు గొప్ప దెబ్బ తగిలినది. ఇప్పుడు నీ వధముచే బొత్తిగాఁ గూలి పోయితిని. నేను జుట్టాలు లేక మగఁడవైన నిన్నును గోల్పోయి, సుఖము లనుభవించుట మాని పెక్కేండ్లు దుఃఖములఁ గుందుచుండఁ గలను. రాక్షసాధిపా! పో నలవికాని కడుదవ్వునకుఁ బోయితివి. వ్యసనములఁ జిక్కియున్న నన్ను నచ్చటికిఁ గొనిపొమ్ము. నేను నిన్నుఁ బాసి యుండఁజాలను. నాథా! దిక్కులేనిదాన నైన

నన్నొంటిఁజేసి నీవుమాత్ర మేల పోఁగోరెదవు. నాథా! అదృష్టహీను రాలనైన నాయొక్క మొఱ లాలించి నాకుఁ బ్రత్యుత్తరము చెప్ప వేమి? ఓ ప్రభూ! ముసుఁగుదీసి యంతఃపురము విడిచి, పాదచారినై వచ్చిన నన్నుఁ జూచి యేల వచ్చితి వని కోపపడకున్నావ దేమి? భార్యలందుఁ బ్రేమగలవాఁడా! నీ భార్య లందఱు సిగ్గువిడిచి, ముసుఁగు దీసివైచి వెలుపటికి వచ్చియున్నారే, నీవు వీరిని చూచియుఁ గోపపడక యూరకున్నా వేమి? నీకు విహారములందుఁ గూడ నుండెడి యీ నీ ప్రియలు దిక్కుమాలి యల్లలాడుచున్నారే? ఏల వీరి నూరడింపకయు గారవింపకయు నున్నావు. ఓ రాక్షసాధినాథా! పతివ్రతలును, సదాచారసంపన్నలును, గురుశుశ్రూష లొనరించుటయం దాసక్తగలవారును నైన కులకాంతలను బెక్కండ్రను వారిభర్తల వధించుటచే విధవలఁ గావించితివి కాదా! అట్టి పరమపతివ్రత లందఱు వ్యసనపీడితలై నిన్ను శపింపఁగా నీ వీ గతి నొందితివి. పతివ్రతలకు నీవు హాని చేయఁగా వారు శపించి నందులకు ఫల మిప్పు డనుభవమునకు వచ్చినది. నాథా! పతివ్రతలు కన్నీరు నించినఁ జేటు గలుగకపో దని పెద్దల నానుడి గలదు. ఇప్పు డది నీవిషయమున వాస్తవమె యయ్యెను. రాక్షసులకు ఱేఁడా! శూరుఁడ వని తలఁచెడు నీవు స్వప్రతాపముచే లోకముల నెల్ల జయించి యీ నీచమైన పరస్త్రీహరణరూప మగు దొంగతన మేల చేసితివి? ఓరీ, నీవు మృగ మను నెపము వెట్టి, రాము నాశ్రమమునందు లేకుండఁజేసి, యా రామునిదేవిని దొంగిలి తెచ్చితివే! అది నీవు పిఱికి వని తెల్పుచున్నది గదా! నీ వొకప్పుడైనను సమరమునఁ బిఱికితనముఁ జూపితి వని నేనొక్క తడవ యయినను విన్నదానను గాను. ఈ సీతాపహరణమున నీవు వెఱపు చూపుట నీ చేటుకాలమునకు సూచకమైనదికాని వేఱుగాదు. భూత భవిష్యద్వర్తమానముల నెఱిఁగినవాఁడును, యథార్థవాదియు, మహానుభావుఁడును నయిన నా మఱఁది నీవు సీతను గొనివచ్చుటఁ గాంచి, వేఁడి నిట్టూర్పు విడిచి, చెప్పిన చొప్పుననే నీకామక్రోధములవలనఁ బుట్టిన వ్యసనముచే రాక్షసవీరుల కందఱకుఁ జేటు సంభవించినది. అట్టి దుంప ద్రెంచునట్టి యీ వినాశము నీ నిమిత్తమై మాకు సంభవించినది. నీ మూలమున నీ రాక్షసకుల మెల్ల దిక్కులేనిదయ్యెను. బలపరాక్రమములచేఁ బ్రసిద్ధుఁడ

వైన నీవు యుద్ధమునఁ గూలుటం గూర్చి చింతింప నవసరము లేదు. నే నాఁడుదాన నగుటంజేసి, వ్యసనము పట్టలేక వగచుచున్నాను. నీవు స్వయముగా నొనర్చిన దుష్కృతములను గొని, పోఁదగిన స్థానము చేరితివి. నిన్నుఁ బోఁగొట్టుకొనిన నేను నన్నుఁ గూర్చియే యిప్పుడు వగచుచున్నాను. నీ మేలు గోరెడి చెలికాండ్రు సెప్పిన మాటలను విన వైతివి. నీతమ్ములు నుడివిన యితవు మాటలను వినవైతివి. నా మఱఁది విభీషణుఁడు నీహితముగోరి కారణప్రయోజనములతోఁ గూడినవియు, తిన్ననివియు నయిన మాటలను జెప్పెను. ఆతని మాటలను నీవు వినవైతివి. నేను పరాక్రమము గలవాఁడ నని గర్వితుఁడవై నీవు మారీచ కుంభకర్ణులును నా తండ్రియుఁ జెప్పిన పలుకులు వినవైతివి. నల్లని క్రొక్కాఱు మబ్బువంటి మేనిడాలు గలవాఁడా! పచ్చని పట్టుబట్ట గట్టినవాఁడా! సొగసయిన బాహుపురులు గలవాఁడా! నీ విట్లు నెత్తుటఁ దడిసిన, చేతులు మున్నగు సకలాంగములను జాచుకొని యేల పరుండియున్నాఁడవు! నేను వగచేఁ గుందినదాన నయి కడు వెతలం బడుచున్నాను. నీవు నిద్రితుఁడవు వోలె నన్నుఁ బలుకరింపకయున్నావు. వీర్యవంతుఁడవు, సమర్థుఁడవు, యుద్ధములందు వెఱపుచేఁ బరుగెత్తనివాఁడవు నయిన నీవు నన్నేల కన్నెత్తియైనఁ జూడకున్నావు! క్రొత్త యవమానము సంప్రాప్తము గాఁగా నింకను నేల నిద్రపోవుచున్నావు? లే లెమ్ము. నీవు మడియుటచే సూర్య కిరణములు నిర్భయముగాఁ బురములోపలఁ జొచ్చుచున్నవి. తొల్లి నీవు శత్రువులను సంహరించునట్టిదియు, సూర్యుని మాడ్కి వెలుఁగునదియు, నింద్రునిచేత వజ్రాయుధమువోలె నీచే నెల్లప్పుడు గారవింపఁబడి నదియు, శత్రుసంహారకమును, పసిఁడి యలంకారములు గలదియు నయిన నీ పరిఘాయుధము రామబాణములచే భిన్నమై, పెక్కు వ్రయ్యలై క్రిందఁ బడియున్నది. ఓ నాథా! నీవు ప్రియకాంతనుబోలె సమర భూమినిఁ గౌఁగిలించికొని నిద్రించుచున్నాఁడవు. నన్ను నప్రియురాలిగాఁ దలఁచినవాఁడవువోలె నిత్తెఱఁగునఁ పలవించునన్నుఁ బలుకరింపకున్నావ దేల! ప్రాణనాథుఁడ వయిన నీవు చనిన తర్వాత సైతము శోక వ్యాకుల మైన నా మనస్సు వేయివ్రయ్యలుగాఁ జీలకయున్నదే! ఛీ! యిట్టి కఠిన హృదయురాలనై యుండి యేమి యుపయోగము! అందఱు నన్ను

బాపాత్మురా లని నిందింతురు" ఇవ్విధమున మండోదరి విలపించుచునే కన్నులఁ గన్నీరు గ్రమ్మ నెక్కువ యనురాగాతిశయమునఁజేసి మూర్ఛ నొందెను. దుఃఖముచేఁ జిక్కినదైన యా మండోదరి మూర్ఛాపరవశయై రక్తార్ద్రమైన రావణుని ఱొమ్మున వాలి సంధ్యారమతో గూడిన నల్లని మేఘమునందు సంక్రమించిన ప్రకాశమాన మగు మెఱుపును బోలియుండెను. కడు వెతలఁ గుందుచున్న తక్కిన రావణునియతివ లందఱు విలపించుచు రావణునిమీఁది కొఱఁగి పలవించుచు నా మండోదరి నావలికిఁ దీసి "ఓ దేవీ! మానవులకు బాల్య యౌవన కౌమార వార్ధక్యములనెడి యవస్థలు మాఱుచుండు ననియు, రాజుల సంపదలు తిరములుగా వనియు నీ వెఱిఁగినదియే కదా! ఏల యిట్లు వగచెదవు? కారాదు లెమ్ము" అని యామండోదరి నూఱడించిరి. ఇట్లు తోడికాంత లూఱడించుచుండఁగా, నా మండోదరి కన్నీటిధారలచే నున్నతస్తనములను దడుపుచు గొంతెత్తి బిగ్గఱగా నేడ్చెను.

ఇంతలోపల రాముఁడు విభీషణుం జూచి, "యీ స్త్రీలనందఱిని మఱలించి మీయన్నకు సంస్కారముచేయు" మని యానతిచ్చెను. అంత ధర్మవేత్తయు, వినయవంతుఁడు నయిన విభీషణుఁడు రామునిపలుకు లాలకించి, యా మాటలయందలి ధర్మమును నౌచిత్యమును బరికించి, మున్ను తానే రావణునికి సంస్కారము గావించెద నని చెప్పియున్న మాటను బట్టియే రాముఁ డిట్లు చెప్పెనో యని సంశయించి, యాతని యభిప్రాయము చక్కఁగాఁ గనుఁగొనఁ గోరినవాఁడై యాతనితో ని ట్లనియె: "ఓ రాఘవా! ధర్మమును విడిచినవాఁడును, క్రూరుఁడును, ఘాతకుఁడును, నసత్యవాదియుఁ బరదారగమనము సేయువాఁడును నైన యిట్టి వానికి నే నెట్లు సంస్కారము గావింతును! అంతియకాక, యీతఁడు నాకుఁ దోఁబుట్టువురూపుతోఁ బుట్టిన పగతుఁడు; సకలానర్థకరుఁడును. నా కితఁడు పెద్దయన్న యను గౌరవమున మర్యాదచేయఁ దగినవాఁ డయిన, నీ చెడు నడతలంబట్టి పూజార్హుఁడుగాఁడు. అన్నకు సంస్కారము గావింపమిచే నన్ను లోకులు క్రూరుఁ డని నిందింతురు! ఆతని దుర్గుణములఁ దలఁచినచో, నే నొనరించినపని చక్కనైనది యనియె నన్ను శ్లాఘింతురు."

ఇవ్విధమునఁ బలికిన విభీషణుని పలుకులు లాలించి, ధర్మపోషకులలో నుత్తముఁడును, మాటలందు నేర్పరియు నైన రాముఁడు గడునుప్పొంగి, మాటలందు నేర్పరియైన విభీషణునితో నిట్లనెను: "విభీషణా! నీవును నాకుఁ బ్రియం బొనరింపవలసినదే. నీ సాహాయ్యమువలన నేను శత్రువును జయించితిని గావున నేనును నీకు సాయమొనరింపవలసినది. ఈ రావణుఁ డధర్మాసత్యదోషములతోఁ గూడినవాఁ డగుటయు నిక్కము. అయినను, ఇతఁడు బలప్రతాపములు గల శూరుఁడు; యుద్ధములం దొక్కప్పుడుఁ బరాజయ మొందనివాఁడు. మహాప్రభావుఁడును, బలశాలియు, లోకుల నేడ్పించువాఁడును నైన యీతఁడు దేవేంద్రుఁడు మొదలగు వేల్పులకైన నోడినవాఁడుకాఁడు. పగలు మరణమువఱకే సాధింపఁదగినవి. మన కార్యము దీఱెను. ఇతనికి సంస్కారము గావింపుము. ఇతఁడు నీ కెట్లో నాకును నట్లే. నీచే దశగ్రీవుఁడు శాస్త్రరీతిని సంస్కారము గావింపఁదగినవాఁడు. ధర్మజ్ఞా నీ వట్లొనరించితివేని, నీవును కీర్తిమంతుఁడ వగుదువు" అని రాముఁడు విభీషణునితోఁ జెప్పెను.

విభీషణుఁడును రాముని పలుకులు విని రావణునికి సంస్కారము యథావిధిగాఁ గావింపఁ బూనెను: అంత ఋత్విజులు పద్మకము వట్టివేళ్లను సుగంధద్రవ్యములతోఁ గూడఁ జందనపుఁ గట్టెలతోఁ జితినిబేర్చి, దానిపైఁ దెల్లని బొచ్చు గల జింకచర్మమును గప్పిరి. వారు రాక్షసేంద్రుఁడగు రావణునికిఁ బితృమేధోక్తవిధానమున సంస్కారము జరిపించిరి. ఋత్విజులు చితి కాగ్నేయభాగమున వేది నేర్పఱచి, యా వేదియందగ్నిని యథావిధిగా నునిచి స్రువములను దధిమిశ్రమైన నేతితో నింపిరి. రావణుని పాదములకడ సోమలతను దెచ్చు శకటమును, తొడలనడుమ యజ్ఞార్థము ఓటి నుంచిరి. ప్రయోగవేత్త లగు ఋత్విక్కులు సకలము లయిన కొయ్యపాత్రలను, అరణిని, నుత్తరారణిని, మఱొక్క ఓటిని నన్యైస్థానములం దునిచి, వేదములందును శాస్త్రములందును జెప్పఁబడిన విధానమునఁ బరిశుద్ధమైన నల్లని మేఁకను వధించి, హోమము గావించి, దాని చర్మము నాజ్యమునఁ దడిపి యా రావణునిపైఁ గప్పిరి. డెందములందు వగచుచున్న యా రాక్షసులు విభీషణునివెంబడి నుండి

గంధమాల్యవివిధాంబరములతో నతని నలంకరించి, వ్యసనముచేఁ గన్నీరు విడుచుచుఁ బేలాలు చల్లిరి. అంత విభీషణుఁడు రావణునకు సమంత్రకముగా నగ్ని నుంచెను. తర్వాత నతఁడు స్నాన మాచరించి, తడిబట్టలతోనే నూవులు గఱికెను జేర్చి నీళ్లు విడిచి, యతనికిఁ బ్రదక్షిణ నమస్కారములు గావించి, యా రాక్షసకాంతల నందఱను మంచి మాటలచే నూఱడించి, పొండుపొం డని వారినందఱిని పురములోనికిఁ బంపెను. విభీషణుఁడును వారు పురము ప్రవేశించిన పదంపడి రాముని చేరువకు వచ్చి యడఁకువతో నిలిచియుండెను. ఇంద్రుఁడు వృత్రాసురవధము చేతంబోలె రాముఁడు రావణ సంహారముచే లక్ష్మణ సుగ్రీవాది సకల వానరసేనా సమేతముగా నపార సంతోషము నొందెను.

115-వ సర్గము

విభీషణపట్టాభిషేకము

ఆమహాత్ములగు దేవదానవగంధర్వులు రావణుని వధమును గాంచి, తమతమ విమానముల నారోహించి, ఘోరమైన రావణవధమును, రాముని పరాక్రమమును, వానరుల గొప్ప యుద్ధమును, సుగ్రీవుని యాలోచనను, లక్ష్మణుని యనురాగమును మగఁటిమిని జెప్పికొనుచుఁ గడు నుత్సాహముతో వచ్చినదారింబట్టి పోయిరి. రాముఁడును మాతలిం గారవించి, యగ్నివలె దీప్యమాన మగు నింద్రుఁ డిచ్చిపంపిన రథమును గొంపోవ నానతిచ్చి పంపెను. మాతలియు రాముని వీడ్కొని యా దివ్యరథము నెక్కి స్వర్గమునకే పోయెను. మాతలియు స్వర్గమున కేఁగిన పదంపడి, రాఘవుఁడు సుగ్రీవుని తోడ్పాటునంజేసి, తనకు జయము గలిగెఁ గాన నతనినిఁ గడుమోదముతోఁ గౌఁగిలించుకొనెను. అట్లు రాముఁడు సుగ్రీవునిఁ గౌఁగిలించి, లక్ష్మణుఁడు శిబిరమునకుఁ బోవఁ బ్రేరేపింపఁగా, వానరశ్రేష్ఠులచే మన్నన చేయఁబడుచు శిబిరమునకుఁ బోయెను.

అంతట రాముఁడు సత్యవంతుఁడును, వెలుఁగు గలవాఁడును నైన లక్ష్మణునిఁ జేరువఁ దిరుగుచున్న వానినిఁ గాంచి, "నాయనా! నా కనురక్తుఁడును, భక్తుఁడును, నుపకారము నొనరించువాఁడును నైన విభీషణుని లంకాపురరాజ్యమునకుఁ బట్టాభిషిక్తుం జేయుము. ఈ రావణానుజుఁ

డగు విభీషణుఁడు లంకాపురమున నభిషిక్తుఁగాఁ జూడఁ గుతూహల పడుచున్నాను. కావున నా కార్యమునకై వేగిరపడుము" అని లక్ష్మణు నితో ననెను.

మహాప్రభావుఁ డగు రాముఁ డిత్తెఱఁగునఁ బలుకఁగా, లక్ష్మణుఁ డట్లే యని, కడు నుప్పొంగి, బంగారు గిండి నొక్కటి కైకొని, దానిని వానరవీరులకు నిచ్చి, మనోవేగముఁబోలు వేగముగలవారును, బలవంతు లును నైన యా వానరులను సముద్రజలమును దేఱ నియోగించెను. బలవంతులగు నా వానరులు వేగ సముద్రమునకుఁ బోయి యుదకముఁ గైకొనివచ్చిరి. తర్వాత లక్ష్మణుఁడును రామునాజ్ఞ వడసి, లంకాపురమున రాక్షసుల మధ్యమున సుహృద్గణ పరివృతుఁడైన యా విభీషణుని నుత్త మాసనమునఁ గూర్చుండ బనిచి, మంత్రోక్తవిధానమునఁ బరిశుద్ధ మనస్కుఁ డగు నా విభీషణుని నా ఘటోదకముతో నభిషిక్తుఁ గావించెను. ఆ విభీషణుని యమాత్యులును, ఆతని చెలికాండ్రును లంకాపురమున నభిషిక్తుఁడైన విభీషణుఁగాంచి, మహానందమునొందిరి. విభీషణుఁడును రాము ననుగ్రహముచే వడసిన రాజ్యమును బొంది, పౌరులను మంచిమాటలచే నూరడించి, మఱల రామునికడకు వచ్చిచేరెను. అంతటఁ బత్తనమున నున్న రాక్షసు లక్షతలను, మోదకములను, బేలాలను, దివ్యపుష్పములను మంగళార్థము గైకొని వచ్చి విభీషణు కర్పించిరి. శత్రువుల కజేయుఁడును, మగఁటిమి గలవాఁడును నైన యా విభీషణుఁడు మంగళకరములైన యా సకలవస్తువులను గైకొని, రామలక్ష్మణుల కర్పించెను. రాముఁడును కృత కృత్యుఁడై మనోరథము వడసిన తనకడకు వచ్చిన యవ్విభీషణుం గాంచి యవ్విభీషణుని ప్రీతికై యా వస్తువుల నన్నింటిని గ్రహించెను.

తర్వాత రాఘవుఁడు చేతులు జోడించుకొని ప్రక్కన నిల్చియున్న పర్వతాకారుఁ డగు హనుమంతునిఁ గాంచి, "ఓ జయశీలురలో మేటీ! సాధువా! యీ విభీషణుని గారవించి, న్యాయ్యప్రకారముగా నతని యనుమతిం బొంది, లంకాపురములోపలఁ జొచ్చి, రావణు నగరును బొంది, వైదేహిని మన విజయవార్తచే సంతోషింపఁ జేయుచు, నేనును లక్ష్మణ సుగ్రీవులును సేమముతో నున్నార మనియు, రావణుఁడు నాచే వధింపఁబడె ననియు నీ ప్రియవృత్తాంతము జానకికిఁ జెప్పి, యాపెకడ నుండి సంగతిఁ దెలిసికొని రమ్ము" అని పంపెను.

116-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవికి రాముని విజయముఁ దెల్పుట

ఇవ్విధమున రాముఁ డానతీయఁగా, నెక్కువ ప్రతాపముగల హనుమంతుఁడు రక్కసులు చేయు మర్యాదలను గొనుచు, లంకాపురము సొచ్చి, రావణునగరు చేరి, యచ్చట నశోకవనమున రాక్షసకాంతలచేఁ జుట్టఁబడినదై, సంతసము వీడి, యొడలినిండ ముఱికిగలిగి క్రూరగ్రహ భయముతోఁ గూడిన రోహిణి వలె నొప్పుచున్న సీతాదేవిం గాంచి, యా దేవిచేరువకుఁ జని, కదలక మెదలక యడఁకువతోఁ దన ప్రవరసెప్పి నమస్కృతిఁగావించి, నమ్రుఁడై నిలిచెను. అట్టి మహాబలుఁ డగు హనుమంతునిఁ గాంచి, మొదట నతని నానవాలు పట్టఁజాలక మౌనముతో నుండెనుగాని, యావల నతనిని గుర్తించిచూచి హనుమంతునిఁగా నెఱిఁగి, పిదప నెక్కువ మోదమందెను. తర్వాత వానరోత్తముఁ డగు హనుమంతుఁడు తన్నుఁ జూచి సీతాదేవి మోము తేటవాఱుటఁగాంచి, రాముఁడు సెప్పి పంపిన వృత్తాంతము సెప్పఁ బూనెను.

ఓ వైదేహీ! రాముఁడు లక్ష్మణ సుగ్రీవులతోను, విభీషణునితోను, వానరబలములతోను సేమముగా నున్నవాఁడు. శత్రుసంహారి యగు రాముఁడు శత్రువులను వధించి, మనోరథము నీ డేర్చుకొన్నవాఁడై, తన సేమమును నీకుఁ జెప్పిర మ్మనెను. విభీషణుఁడు తోడైయుండ, రాముఁడు వానరులను సహాయులఁగా నుంచుకొని లక్ష్మణుని యాలోచన ప్రకారము నడచి రావణుని వధించెను. శూరుఁ డగు రాముఁడును దనకార్య మీడేరుటచేత మనమున నుప్పొంగి నీ క్షేమ మరసి, నీతోఁ గొన్ని మాటలఁ దనమాటలుగాఁ జెప్పి రమ్మనెను. ఓ దేవీ! రాముఁడు నీ కిష్టంబగు మాటఁ జెప్పి, నీకు వెండియు సంతసముఁ గొలిపెను. ఓ ధర్మజ్ఞురాలా! నా యదృష్టవశమున నీవు జీవించియున్నావు. ఓ సీతా! పరాక్రమమువలన మనకు జయము గలిగెను. ఇఁక వగమాని, నెమ్మదితో నుండుము. మన శత్రు వగు రావణుఁడు వధింపఁబడెను. ఈ లంకాపురియు మనవశ మాయెను. నిన్ను శత్రువుచేతినుంచి విడిపించుటకై పట్టుపట్టి, నిద్రమాని, గొప్ప కడలినడుమ సేతువుగట్టి, శత్రువధము గావింపవలె నన్న ప్రతిన నెఱవేఱినది. ఇఁక నీవు రావణుని గృహమున నున్నా

ననెడి దిగు లొందవలదు. ఈ లంకాపుర ప్రభుత్వము విభీషణుని యధీనము సేయఁబడెను. కావున నీవు స్వగృహముననే యున్నట్లు తలఁచి యూఱడిల్లియుండుము. సంతసముతో నీ విభీషణుఁడును నిన్నుఁ జూడఁగోరి యిదిగో! రాఁగలఁడు" అని రాముఁడు సెప్పినట్లు సీతతోఁ జెప్పఁగా, బున్నమచంద్రునిఁబోలు మోముగల యాసీత పైకి లేచి, యానందముచే మేను మఱచి, యేమియుఁ బలుకక యూరకుండెను. అప్పుడు వానరశ్రేష్ఠుఁడు సీత తనకు బదులు చెప్పకుండుటం గాంచి, "యో దేవీ! యేమి యాలోచించెదవు? నాతో నేల బదులు మాటాడవు?" అని వెండియు సితాదేవి నడుగఁగా, బరమపతివ్రత యగు సితాదేవి యానందముచే డగ్గుత్తిక పొడమఁ గడుమోదముతో ని ట్లనెను.

ఓ హనుమంతుఁడా! నాథుని విజయము దెల్పు నీ యీ మాటలాలకించి, సంతోషపరవశనై యొకింతతడవు నోట మాటరాకయే యి ట్లుంటిని. హరిపుంగవా! నీ విప్పుడు నా కీ శుభవృత్తాంతముఁ దెచ్చినందుకై ని న్నే విధముగాఁ బొగడను నాకుఁ దోఁచకున్నది. లోకమునందలి వాక్కులన్నియు నీవుచెప్పిన శుభవార్త కీడు కావు. ఓ మరున్నందనా! నీ వీ ప్రియవృత్తాంతము చెప్పినందు కేదేని పారితోషికము నిత్తు నన్నను దాని కీ డగు వస్తు వొక్కటియు నీలోకమునఁ గానిపింపదు. వెండి బంగారు భూషణములుగాని, నానావిధ రత్నములుగాని త్రిలోకాధిపత్యముగాని యీ ప్రియవార్తాహరణమునకు సమానములు గావు. కావున నే నేవిధముగా నిన్నుఁ బొగడుదు ననియు, నీ కేమి బహుమతి యిత్తు ననియు నాలోచించియుఁ బ్రతి గానక యూరకున్నాను" అని హనుమంతుని సీతాదేవి పొగడెను.

అంతట వానరర్షభుఁ డగు హనుమ చేతులు జోడించికొని, సీతాదేవి కెదుట నిలిచి, "భర్తకుఁ బ్రియమును హితమును గోరుదానా! భర్తకు విజయముగోరుదానా! యిట్టి ప్రీతిపురస్సరమైన మాటసెప్ప నీవయర్హురాలవు. ఓ సౌమ్యురాలా! నీవిప్పుడు సెప్పిన యింపుగులుకు గంభీరార్థము గలమాటయే నానావిధరత్నరాసులకంటెను, స్వర్గరాజ్యమునకంటెను మించినదిగా నున్నది. శత్రువును వధించి, జయశాలియై కడుధైర్యముతో నిల్చియున్న రామునిఁ జూచుటచేతనే వాస్తవముగా స్వర్గాది

సకల సంపదలు నాకుఁ గలిగినవి." అని మైథిలితోఁ జెప్పఁగా నా దేవియు హనుమంతునితోఁ గడు మేలొదవించు పలుకుల ని ట్లనెను. "ఓ హనుమంతుఁడా! సులక్షణ యుక్తముగాను, చెవులకింపు గులుకునట్లును నెనిమిది విధములుగ వెలయు బుద్ధితోఁగూడి మాటాడ నీవు దప్ప నెవ్వఁడు చాలును? పరమధార్మికుఁడ వయిన నిన్నుఁ బుత్రునిఁగాఁ బడయుటచే నా వాయుదేవుఁడు గడు ధన్యుఁ డయ్యెను. నీకడనే మేలగు బలిమి, మగఁటిమి, సత్తువ, విక్రమము, నేర్పు, వెలుఁగు, ఓరిమి, దిట్టతనము, తెగువ, అడఁకువ ఈ మొదలగు పెక్కు సుగుణము లున్నవి. ఈ మాట నిన్ను ముఖస్తుతి చేయఁదలఁచి చెప్పినదానను గాను. ఈ మాట నిక్క మనియే నమ్ముము" అని చెప్పెను.

అంత హనుమంతుఁడు కడు సంతసించి, వేగిరపడక చేతులు జోడించికొని, వినయసమ్రుఁడై వైదేహి ముందట నిలఁబడి వెండియు ని ట్లనెను: "ఓ దేవీ! నీ వానతిచ్చితివేని, ని న్నింతవఱకుఁ గాఱించిన యీ రాక్షసకాంతల నందఱను మడిపెదను. అశోకవనమునఁ జేరి భర్తయే దైవమని నమ్మి క్లేశపడుచుండు నిన్ను భయంకరాకారములును, భీకరదృష్టులును, భయంకరచేష్టలునుగలిగి వెఱపు పుట్టించు రాక్షస వనితలు నీయెడఁ గడుఁ గ్రూరంపు నడతలఁ జూపిరిగదా! వీరిని నుగ్గుసేయవలె నని నా మనోరథ మున్నది. అందుకు నీ యనుమతి వేఁడెదను. నీ వనుమతి యొసంగినచో, నీ కప్రియము గావించిన యీ రాక్షసస్త్రీలఁ నందఱను బిడికిళ్లతోఁ బొడిచియుఁ నేతులతో నప్పళించియు. గాళ్లతోఁ గ్రుమ్మియు, మోఁకాళ్లతోఁ బొడిచియు, పండ్లూడఁగొట్టియు, ముక్కులఁ జెవులఁ గొఱికియు, కురు లూడఁదీసియు, ఎండిన కొనలుగల గోళ్లతో అక్కియు, చీల్చియు, నెగిరియెగిరి దుమికియుఁ, గఱ్ఱలతోఁగొట్టియు వధింపఁ గోరుచున్నాను. నీ కపకృతి యొనరించిన వీరిని మిగిలింప నాకు మనము లేదు. కావున నా కందుల కానతిమ్ము" అని హనుమంతుఁడు సీతాదేవి నడిగెను.

పతివ్రత యగు జానకి హనుమంతునిమాట లాలకించి, ధర్మయుక్తముగా నతనితో ని ట్లనియె. "వానరోత్తమా! ఈ రాక్షసకాంతలు రావణునికి విధేయలు; రాజాజ్ఞకులోఁబడి, వీరు చేయుపనులకై వీరిని

గోపించుకొనరాదు. నేను దొల్లింటి జన్మము పాపకర్మమువలనను, దౌర్భాగ్యమువలనను నే నొనరించిన దాని కీఫలము ననుభవించితినే కాని వీరి దేమియుఁ దప్పు గాదు. నావిధివశమున నే నిట్టి కష్టము లను భవించితిని గాన నీ రాక్షసకాంతలను దండించుటచే నా కేమి ఫలము గలుగు? వానరోత్తమా! ఈ కాంతలు రావణుని నానతిచే నన్ను నన్ని తెఱఁగులఁ గాఱించిరి కాని యాతఁడు హతుఁడు గాఁగా నన్ను బాధిం చుట మానిరి. ఈ రాక్షసస్త్రీలు రావణునియాజ్ఞచేఁ గాక స్వయముగా నన్ను బాధించియున్నను, నేను వీరి కిప్పుడు ప్రత్యపకార మొనరించుట పాడిగాదు. ఇవ్విషయమయి యొక యెలుఁగుబంటి యొక వ్యాఘ్రి ముతోఁ జెప్పిన ధర్మసంస్థాపకమైన యొక శ్లోకమును దృష్టాంతముగాఁ గొనుము. అ దేది యనిన, ఒక యరణ్యమున నొకపులిచేఁ దఱుమఁబడుచు నొక బోయఁడు చెట్టెక్కెను. అచ్చట నొక్క యెలుఁగుబంటి యుండుట గాంచి, పులి "ఇతఁడు మనకు జన్మవైరి. ఈమనుష్యునిఁ గ్రిందఁ ద్రోయు" మని యా యెలుఁగుబంటిని యాచింపఁగా, నది తనకడకువచ్చిన వానిని గ్రిందఁ ద్రోయను. అట్లు చేయుటచే ధర్మహాని గల్గు నని చెప్పి నిద్ర వోయెను. అంతట వేఁటగానిని జూచి "ఓరీ నిన్నుఁ గాపాడెదను. నిద్రించునట్టి భల్లూకమును గ్రిందఁ ద్రోయు" మని వ్యాఘ్రము పురి కొల్పఁగా, నా వ్యాధుఁ డా భల్లుకమును గ్రిందఁ ద్రోసెను గాని యది వాడుకచేఁ గ్రిందఁబడక మఱియొక్క కొమ్మను బట్టుకొని యథాస్థానముఁ జేరెను. తర్వాత "భల్లుకమా! నీ మే లెంచక ద్రోహముదలఁచినకృతఘ్నుఁ డయిన యీ వేఁటగానిని గ్రిందఁదోయు"మని పలుమాఱు వ్యాఘ్రము ఋక్షమును బ్రార్థించినను, నది పెక్కు భంగులఁ దన కపకారము గావిం చినవాని నయినను దన యిల్లు సొచ్చినవానిని విడువ నని కాపాడెనఁట. అట్లె యీ రాక్షసకాంత లొక్కవేళఁ దామే నా కపకృతి యొనరించి యున్నను, వారికిఁ బ్రత్యపకృతి యొనరించుట పాడిగాదు. అట్లుండ నొకరికై పీడించిన వీరి విషయమున నట్లు తలఁచుట తగినదేకాదు. నీచు లపకృతి యొనరించినప్పుడు పండితుఁడు వారికిఁ బ్రత్యపకారము సేయ వలెనని తలఁపడు. అట్టి యాచారము నెప్పటికి నవలంబింపవలసినదేకదా! సత్పురుషులు గొప్ప నడవడులె భూషణములుగాఁ దలఁచువారు.

పాపాత్ములు వధ్యులయినను, సజ్జనులు వధ్యులయినను వారియెడ సజ్జనుఁడు గరుణ చూపవలయును. లోకమునఁ దప్పు చేయనివాఁడు లేఁడు గావున నందఱను వధింపవలసివచ్చును. కనుక సజ్జనుఁ డందఱియెడ దయ చూపుటయే యుక్తము. మఱియుఁ గామరూపు లగు రాక్షసులు జన హింసయందే విహరించువారు. వారు స్వాభావికముగాఁ బాపకృత్యము లొనరించినను, వారిని దండింపరాదు." అని సీత చెప్పఁగా హనుమంతుఁడు విని, "దేవీ! రాముని పత్నివైన నీ విట్లు పలుకుట యుక్తమే. నాకు బదులు సంగతి చెప్పుము. నేను రామునికడ కేఁగెదను" అని యడుగఁగా, సీతయు "నేను నాథునిఁ జూడఁ గోరెదను" అనఁగా హనుమంతుఁడును సంతోషపూర్ణమానసుఁడై, "సత్కులప్రసూతురాలా! శత్రుసంహారము గావించిన పూర్ణచంద్రాననుఁ డగు నీ మగనిని, దేవేంద్రుని శచీదేవి వీక్షించినపగిది నీవును జూడఁగలవు" అని సాక్షాల్లక్ష్మి మాడ్కిఁ దేజరిల్లు నా సీతకడ నానతిగైకొని రాముఁ డున్నచోటికి వచ్చెను.

117-వ సర్గము

విభీషణుఁడు సీతను దోడితెచ్చుట

అంతటఁ గార్యములతెఱఁగు నెఱిఁగిన హనుమంతుఁడు సీతాదేవికడ నుండి యేఁగుదెంచి, మహాబుద్ధిమంతుఁడును, విలుకాండ్రందఱి లోపల మేటియునైన రామునిఁగూర్చి యిట్లనెను. "ఓ రాఘవా! యెవతెనిమిత్త మింతప్రయత్నము చేసితిమో, ఎవతెనిమిత్త మయి సేతుబంధము మొదలగు పనులు నెఱవేర్పఁబడినవో, యట్టి సీతాదేవిని వగలపాలై కుందుచుండుదానినిఁ జూడఁ దగును. చింతచేఁ గలవరపడి, కన్నీటిని గార్చుచున్న యా సీతాదేవి నీ విజయమును విని సంతోషమునొందెను. ముందటి యానవాలుంబట్టి నన్ను గుర్తించి "రావణవధముచేఁ గృతార్థుఁ డయిన నా నాథుని నా మఱఁది యగు లక్ష్మణునితోఁ గూడఁ జూడఁగోరుచున్నా నని నాతోఁ జెప్పి పంపినది." అని హనుమంతుఁడు చెప్పఁగా, ధర్మరక్షకులలో మేటి యగు రాముఁ డించుకసేపు గన్నీరు విడిచి రావణునింటఁ జిరకాలముండిన నాఁతినిఁ జేకొనిన లోకాపవాదము గలుగును. నిర్దోషిణి యగు నాఁతిని విడిచినఁ బాతకము

కలుగు నిప్పు డేమి చేయవచ్చు నని కొంతతడ వాలోచించి, వేఁడి నిట్టూర్పు విడిచి, పుడమినిఁజూచి, చేరువ నున్న మేఘసదృశాకారుఁ డగు విభీషణుఁ గాంచి, "విభీషణా! నీవు పోయి, మంగళస్నానముచేసి కమ్మని గంధము నలఁది, మేటి నగల నలంకరించుకొనిన సీత నిచ్చటికి వేగఁ దోడ్తెమ్ము" అని యానతిచ్చెను.

రాముఁ డత్తెఱఁగున నానతియ్యఁగా, విభీషణుఁడు వడిగా నంతఃపురము సొచ్చి, తన కాంతలం బిలిచి, మీరు సీతకడ కేఁగి "ఓ వైదేహీ! నిన్ను నీ నాథుఁడు చూడఁగోరుచున్నాఁడు. కావున నీవు మంగళస్నాన మాచరించి, దివ్యగంధము నలఁదికొని దివ్యభూషణములఁ దాల్చిన దానవై పల్లకి నెక్కుము. నిన్ను నీ నాథుఁడు చూడఁగోరుచున్నాఁడు. నీకు మే లయ్యెడు"నని చెప్పుఁడని తనవారితోఁ జెప్పింపఁగా, వైదేహియు "రాక్షసాధిపా! మజ్జనమాడకయ నా మగనిఁజూడఁ గోరుచున్నాను." అని బదులు పలికెను. విభీషణుఁడును "దేవీ! మగని యాజ్ఞప్రకారము సేయుట మంచిదిగదా" అని మఱలఁ జెప్పి పంపఁగా, పతియె దైవముగా భావించునదియు, భర్తృప్రేమయే ముఖ్యవ్రతముగాఁ గలదియు నైన సీతయు నట్టులే పోవుటకు సమ్మతించెను. అంతట విభీషణుఁడు తన కాంతలచే సీతాదేవిని మంగళస్నానముసేయించి, యమూల్యాభరణాలంకృతంజేసి, మేటిదువ్వలువలు గట్టనిచ్చి, చక్కని వస్త్రముపఱచినట్టి నిగనిగ మెఱయు పల్లకిలోఁ గూర్చుండఁజేసి, పెక్కండ్రు రాక్షసులు చుట్టు నిలుచుండి కాపాడుచుండఁగా నా పల్లకిని రామునికడకు మోయించుకొనివచ్చి, సీతాదేవి వచ్చుటఁ దెలిసియుఁ జింతనొందియున్న మహాత్ముఁ డగు రామునిఁ కడ కేఁగుదెంచి, యడఁకువ మెఱయ నమస్కరించి, వేడ్క మీఱ, సీతాదేవిం దోడ్కొనివచ్చితి నని రామునితో నివేదించెను.

రక్కసునియింట బహుకాల ముండిన సీత వచ్చిన దని విన్న మాత్రముననే చిరకాలము దన్నెడఁబాసియున్న సీతను జూడఁగలిగితిని గదా యను సంతోషమును, ఇట్టి ప్రియురాలిని విడనాడుట యెట్లను విన్న దనమును, పరపురుషునియింట నింతకాల ముండివచ్చిన పత్నిని జేకొనుట యెట్లను రోషమును రామున కేకకాలమునఁ గలిగెను. తర్వాత రాముఁడు బాగుగాఁ బర్యాలోచనచేసి, తన యాకారభేదముఁ గని

సంతసము లేక యున్న విభీషణునిఁ గని, "రాక్షసాధిపా! సాధువా! సతతము నా విజయము గోరువాఁడా! జానకిని వేగమ నాయెదటికిఁ దోడ్కొని రమ్ము" అని విభీషణునితోఁ జెప్పెను.

అంత విభీషణుఁడు రాముని యా మాటను విని, "వేగిరముగా నచ్చట నిలిచియున్న జనులనందఱి నావలికిఁ దోలుఁడు. రాముని దేవిని 'రామసన్నిధికిఁ దోడితేవలయును" అని తన పనివారి కానతియ్యఁగా, చొక్కాలును దలపాగాలును దాల్చిన యా భటు లచ్చట నిల్చియున్న ఋక్ష వానర రాక్షస సమూహములను బెత్తములచే బెదరించుచుఁ దఱిమిరి. అవ్విధముగా నా భృత్యులు వేత్రపాణులై యందఱిఁ దఱుము చుండఁగా, సముద్రము వాయుక్షుభితమై యున్నప్పుడువోలె గొప్ప రొద యొక్కటి పుట్టెను. అట్లు భృత్యులు బెత్తములఁ బట్టుకొని త్రోయుచుండఁగా, ఋక్షవానర రాక్షసులు భయముచే నంతట నలుఁగు చుండుటఁ గాంచి, రాముఁ డా జనుల త్రొక్కటపాటు నోర్వనివాఁడై, ఋక్షవానరులందలి దాక్షిణ్యముచేత "వారి నట్లు త్రోయవలదు" అని నివారించి, కట్టలుకపూని చూడ్కిచే దహించువానికైవడిఁ జుఱచుఱఁ జూచి, గొప్ప తెలివికాఁ డగు విభీషణునిఁ దిరస్కార పూర్వకముగా ని ట్లనియె: "ఓ విభీషణా! నే నిక్కడ నుండఁగా, నన్ను లక్ష్యపెట్టకయ వీరి నేల యిట్లు పాటులఁ బెట్టుచున్నావు? ఇఁక వీరిఁ దఱుముపని చాలిం పుము. వీ రందఱు నావార కాని యితరులు గారు. స్త్రీకి సుశీలమ యావరణముగాని, యిండ్లును, వస్త్రములును, ప్రాకారములును, తెర లును ఈ మున్నగు రాజోపచారము లావరణములు గావు. వ్యసనములు వచ్చునప్పుడును, ఇడుమలు వాటిల్లునప్పుడును, గయ్యములందును, స్వయంవరమునందును, యజ్ఞసమయములందును, వివాహవేళలందును స్త్రీలు పురుషులను జూచుట దోషకరము గాదు. ఇప్పుడు సీత యుద్ధ భూమి నున్నది. భర్తృవిరహము మొదలగు మహాపదలఁ బొంది యున్నది. అంతియకాక నేను సమక్షమున నుండునప్పుడు సీత పరుల కంటఁబడుట దోషము గాదు. కావున విభీషణా! నీవు సీత నిచ్చటికి వడిగాఁ దోడితెమ్ము. చెలికాండ్రందఱు నాచుట్టు నుండునప్పుడే న న్నీ సీత చూచుఁగాక." యని విభీషణుని కానతిచ్చెను. రాముఁ డి ట్లాన

తీయఁగా విభీషణుఁడు రాముఁడా విధమున నానతిచ్చుటకుఁ గారణ మే ముండు నని విచారపడినవాఁడైనను, వినయముతోడ సీతను రాముని కడకుఁ దోడ్కొనివచ్చెను. అప్పుడు లక్ష్మణ సుగ్రీవులు హనుమంతుఁ డును రాముని పలుకు లాలకించి, పెద్దయుఁ దడవు తన యెడఁబాటుచే ఖిన్నయై యున్న సీతాదేవిపై రామునకు వలపు లేకుండుట గాంచి, మన మున వగచిరి. మఱియు పత్నియం దుపేక్షాభావమును సూచించునట్టి యా రాముని దారుణాభిప్రాయములు చూచి, రామునకు సీతయందు వలపు దప్పిన ట్లున్నది యని వా రూహించిరి. సీత యన్ననో సిగ్గుచే నవ యవములు గ్రుంగఁ దలవంచుకొని, విభీషణుని వెంబడిఁ బెనిమిటి యెదు టకు వచ్చెను. ఆ సీత జనమునడుమ లజ్జచే మోమును బైఁటఁజెఱఁ గుతోఁ గప్పికొని "యార్యపుత్రా!" యని పిలిచి పైన నేమియుఁ బలు కక పలవించెను. పతియే దైవముగాఁ గొల్చునదియు, మిగులఁ దేఁట యైన మోము గలదియు నైన సీతాదేవి, "సకలకష్టముల ననుభవించిన యట్టి దానను. నేఁడు నాథుని మోము చూడఁగంటిని గదా యను నచ్చెరువునను, నన్నిదినములుగాఁ జూడని మోమును నేఁడు చూడఁ గంటిని గదా యను మోదమునను, భర్తయందలి స్వాభావికముగా నుండు ననురాగమునను భర్తయొక్క ముఖమును దలయెత్తి బాగుగాఁ జూచెను. నిష్కళంకుఁ డయిన చంద్రునిఁబోలు మోముగల యాసీతా దేవి బహుకాలమునుండి చూడఁబడని పున్నమ చందురునిమాడ్కి మనోహరమైన నాథుని మోమును గాంచి, మనోవ్యథను బాసిన దాయెను.

118-వ సర్గము

రాముఁడు సీతను వలదు పొమ్మనుట

రాముఁడు వినయముచేఁ దలవంచుకొన్నదై ప్రక్కన నిలఁబడి యున్న సీతను గాంచి, కోపమును మనములోపల నడఁచుకొని, దానిం బైకిఁ దెలియనీయక, యా దేవితో ని ట్లనియె: "ఓ మంగళాంగీ! నేను శత్రువును సమరమున వధించి, ని న్నిదిగో విడిపించితినిగదా! పరాక్రమ ముచే సాధింపఁదగిన దేదియో యాపని నెఱవేరినది. కోపమునకు ఫలము సూపితిని. శత్రువుచేసిన తిరస్కారమునకు బదులు నేసితిని.

అవమానముతోడ శత్రువును సమూలముగఁ జెల్లగించివైచితిని. ఇప్పుడు నాపరాక్రమము నందఱ కెఱిఁగించితి. ఇప్పుడు నాపడిన శ్రమము సార్థక మయ్యె. నేను జేసిన ప్రతిన నెఱవేర్చుటచే స్వాతంత్ర్యుఁడ నైతిని. చపలచిత్తుఁ డయిన రాక్షసుఁ డొంటరి వైయున్న నిన్నుఁ గొని పోయినందున, నీకు దైవవశమునఁ బ్రాప్తించిన యవమానమును బరాక్రమముచే శత్రుసంహారము చేసి పోఁగొట్టితిని. తనకు సంభవించిన యవమానమును దన ప్రతాపము చూపి పోఁగొట్టుకొనని వీర్యహీనుని కే కార్యమును సమకూరదు. హనుమంతుఁ డొనరించిన సముద్రతరణము లంకాదహనము నను కొనియాడఁ దగిన గొప్ప కార్యములు సఫలము లాయె. యుద్ధమునందుఁ బరాక్రమము సూపియు, సమయము వచ్చి నప్పు డాలోచనలఁ జెప్పియు సాహాయ్యముఁ జూపిన సుగ్రీవుని యొక్కయు, నతని సేనలయు శ్రమము సార్థక మయ్యెను. గుణ హీనుఁడైన తోఁబుట్టువును విడిచివచ్చి నన్ను శరణు చొచ్చిన నా భక్తుఁ డగు విభీషణుని శ్రమయు సఫలమయ్యె." ఇట్లు రాముఁడు తనయం దనురాగము లేమిని దెలుపు పలుకు పలుకుచుండఁగా విని, సీత లేడివలెఁ గన్నులు విచ్చికొని, కన్నీటిని ధారలుగాఁ గార్చి, తన మేనిని దడిపిన దయ్యెను. ఆజ్యాహుతిచే నగ్ని ప్రజ్వరిల్లుకైవడి, సీతాదేవిఁ జూడఁగానే రామునకుఁ గోపము మఱింత హెచ్చెను.

అంత నాతఁడు కనుబొమ్మలు ముడివెట్టి, తనమోము నడ్డముగాఁ ద్రిప్పుకొని, వానర రాక్షసుల నడుమ సీతంగూర్చి కఠినముగాఁ బలికెను. "ఓసీతా! శత్రుతిరస్కార మోర్వని పురుషుఁడు సేయవలసిన పని యంతయు నొనరించితిని. తపోబలముచే నాత్మజ్ఞానమును సంపాదించిన యగస్త్యమునీంద్రుఁడు జంతువులచే సాధింపరాని దక్షిణపు దిక్కును సాధించినట్లు రావణుండు ని న్నెత్తికొనిపోఁగా నాకుఁ గలిగిన యవమానము నోర్వలేక, యా రావణునిఁ దెగటార్చి నిన్ను విడిపించితి. ఓ మంగళాంగీ! నేను గయ్యమునఁ బడిన శ్రమయెల్ల నీ వెఱిఁగి యుండుము. చెలికాండ్ర సాయమువలన నిప్పుడు నాకు జయము గలిగెనే కాని వేఱుగాదు. అదియెల్ల నీనిమిత్తము చేయఁబడినది కాదని యెఱిఁగియుండు. అయిన నేల యింత శ్రమపడితి వనిన, ప్రసిద్ధమైన

స్వవంశమునకు నపకీర్తియు నిందయు రాకుండఁ గోరియు, నడవడి, గాపాడుకొనఁ గోరియు నే నింతకష్టపడితిని కాని, యదెల్ల నీనిమిత్తము గాదు. పరాయియింటఁ జిరకాల ముండుటచే నడతల విషయమున సంశయాస్పదురాలైన నీవు నాయెదుట నుండుటచేఁ గంటి నొప్పి వచ్చిన వానికి దీపపు వెలుతురు మఱింతపోట్లు పొడుచునట్లు నీ దర్శనము నా కెక్కువ యాయాసాస్పదముగ నున్నది. కావున నో జనకరాజపుత్రీ! నే నానతిచ్చెదను; ఈ పదిదెసలలో నీ మనసున కెక్కినచోటునకుఁ బొమ్ము. నాకు నీతోఁ గావలసిన యక్కఱ యేదియు లేదు: సత్కులమునఁ బుట్టిన, యందును పౌరుషముగల యెట్టి మానవుఁ డయినను జిరకాలము పొరుగింటనుండి వచ్చిన యాఁడుదానిఁ బ్రేమతోఁ జేపట్టునా?ఇంత దనుక క్రూరుఁడైన రావణుని తొడమీఁద నుండి జాఱిపడినదానవు, ఆ దుష్టునిచేఁ గామాతుర మగు చూపుతోఁ జూడఁబడినదానవునైన నిన్ను గొప్ప కులమునఁ బుట్టినవాఁడ నని పేరొందియుండు నే నెట్లు చేపట్టువాఁడను. నాకు వచ్చిన యవమానముం బోఁగొట్టుకొనుటకై నిన్ను జయించితిని కాని, నీయందలి యాశచేఁ గాదు. పోయినకీర్తిని మఱల సంపాదించితిని. ఇఁక నీవు నీ యిష్టమైన చోటికిఁ బొమ్ము. ఓ శుభాంగీ! నే నెంతయో యాలోచించి యిట్లు పలికితిని గాని, యన్యము కాదు. నీవు లక్ష్మణుని కడనో, భరతునికడనో, వానరరా జగు సుగ్రీవునికడనో, రాక్షసేంద్రుఁ డగు విభీషణునికడనో, లేక నీ కెచ్చట నుండుట కిష్టమో యచ్చట సుఖముగా నుండి జీవింపుము. దివ్యరూపము గలదానవు; మనోరమవు నైన నీవు బహుకాలము తన గృహమున నుండఁగాఁ, గామాతురుఁ డగు రావణుఁడు నిన్నుఁ జూచి తనకామము నణఁచుకొనియుండి యుండునా?"

అని రాముఁడు పతివ్రత యగు సీతను గర్ణకఠోరపుఁ బలుకుల నొప్పింపఁగా, నింపుఁ బలుకులు పలుకఁదగిన యా సీతాదేవి, బహు కాలమునకుఁ దన ప్రియుఁ డాడిన యింపుగాని పలుకు లాలకించి, యేనుఁగు తొండముచేఁ గొట్టఁబడిన యందుగు తీఁగెకైవడిఁ గడు మిక్కిలి వణంకి, కన్నీటిని గార్చెను.

119-వ సర్గము

సీత యగ్నిని బ్రవేశించుట

ఇత్తెఱఁగున రాముఁడు సరోషుఁడై వెఱపుచే గగుర్పాటొందవు నట్లు పరుసని మాటలాడఁగా, నా సీతాదేవి మహాజనమధ్యమున నంతకు ము న్నెప్పుడును వినని యా వినరాని పరుసని మాటను విని మనమునఁ గడునొచ్చి తనయంగములనే చొచ్చుదానికైవడి లజ్జచేఁ దలవంచినదై, ములుకులంబోలు నా పలుకులు మనమున నాఁటుటచేఁ గడు విలపించుచుఁ గన్నీరు గార్చెను. తర్వాత మైథిలి గన్నీటిచేఁ దడిసిన తన మోమును దుడుచుకొనుచు, మెల్లగా డగ్గుత్తికతో నిట్లు పలికెను.

"శూరుఁడా! నీచుఁడు నీచురాలి ననినట్లు నీవు నన్నిట్టి కర్కశపు రంపుఁ బలుకులు పలుకుచున్నాఁడవే! ఓ మహాబాహువా! నీవు తలఁచి నట్లు నేను దోషయుక్తురాలను గాను. ఏదైనఁ బ్రమాణము సేసెదను నమ్ముము. నా సచ్చరిత్రముపై నానఁబెట్టి చెప్పుచున్నాను. చెడిపలగు స్త్రీలు దుష్కృత్యము లొనరింతురు. కావున నన్నును నట్లె దుష్టురాలినిగాఁ దలఁచుచున్నావె. నా స్వభావము నీ వెఱిఁగియుందువేని, ఈ శంకను మానుము. ఓ నాథా! నీవు రావణుని తొడమీఁద గూర్చుండ లేదా యని యడిగెదవో, ఒకవేళ నేను బరపురుషునిమేనిని దాఁకి యున్నను, అది నేను స్వాధీనతలేమిచే జరిగినదేకాని, నేను పరపురుషా పేక్షతోఁ దాఁకినదానఁ గాను. ఆ విషయమున దైవముయొక్క తప్పిదమె కాని నాతప్పేమియు లేదు. నా యధీనమైన మన సేది గలదో, అయ్యది నీయందే యున్నది. అంగములు పరాధీనములై యుండునప్పుడు బలహీనురాల నయిన నే నా యంగముల నెట్లు విడిపించుకొనఁగలను? మానము నిచ్చువాఁడా! మన మిద్దఱ మింతకాలము కూడఁ బెరిఁగియు, కలిసి మెలసి యుండియు నా స్వభావము నీ వెఱుఁగవేని, నేను దురదృష్టవంతురా లనియె తలఁపవలయును. ఎప్పుడు శూరుఁ డగు హనుమంతుని లంకకు నన్ను వెదకఁబంపితివో, లంకాపురమున నే నున్నాను గనుక, కడు దూరముల నుండునట్టి నన్ను నీ వప్పుడె విడిచిపెట్టి యుండవలసినది. ఓ వీరుఁడా! నీవు నన్ను విడిచితి నన్నమాట హనుమంతునిమూలమునఁ జెప్పి పంపియుందువేని, నీ మాట విన్నతర్వాత, వానరేంద్రుని సమక్ష

మునవే, నీచే విడువఁబడిన తర్వాత నాకీ ప్రాణములేల యని యప్పుడే నేను ప్రాణములను వదలియుందునుగదా! అట్లు చేసియున్నచో నాజీవితమును సందియమున నుంచి, యీ యుద్ధము చేయవలసిన శ్రమయు నీకు లేక పోవును. నీ చెలికాండ్రకును నిష్ప్రయోజనముగా నింతశ్రమ పడవలసిన యక్కఱయు లేక యుండును. ఓ నరశ్రేష్ఠా! నీవు క్రోధమునే తలఁచి, యల్పునిమాడ్కి యుక్తాయుక్తము లాలోచింపక నాస్త్రీత్వమునే పరికించితివి కాని నాశీలమును బరికింప వయితివి. నేను జనకమహారాజునకుఁ బుత్రి నని వ్యవహారమే కాని, నేను వాస్తవముగా భూమియందుఁ బుట్టినదానను. సదాచారముల నెఱిఁగినవాఁడా! నేనయోనిజ ననియు, గుణవతి ననియు నీవు తలంపవైతివిగదా! నా పసితనమున బాలుఁడ వైన నీవు నన్నగ్ని సాక్షికముగా వివాహమాడిన సంగతి మఱచితివి! నాకు నీయెడఁగల భక్తిని నా స్వభావమును నంతయు నీవు నమ్మవైతివి." అని యివ్విధమున సీతాదేవి పల్కుచు, నేడ్చుచు, కన్నీరు గార్చుచు డగ్గుత్తికచే మాటలు తొట్రిలుచుండ విచారగ్రస్తుఁడై నిలఁబడియున్న లక్ష్మణునిఁ జూచి, "ఓసౌమిత్రీ! అపదూరనెడి గాయము దగిలిన తర్వాత నేను బ్రాణములతో నుండఁ గోరికలేదు. కావున నీ వ్యాధికిఁ జికిత్సగాఁ జితిని బేర్చుము. నే నందుఁ జొచ్చి ప్రాణములఁ దొఱఁగెదను. ఇందఱు జనుల నడుమ నాగుణములయందుఁ బ్రేమ వదలి భర్తయే "నీవు నాకు వలదు. నీవు యథేచ్ఛఁ బో" మన్నప్పుడు నాకిఁకఁ దగిన దిక్కు అగ్నిని జొచ్చి ప్రాణములఁ దొఱఁగుటయే కాదా. కావున నీవు వేగ చితిని బేర్చుము." అని లక్ష్మణునిఁ బ్రేరేపణ సేయఁగా, శత్రుసంహారి యగు లక్ష్మణుఁడు కడు దైన్యము నొందినవాఁడై రామునిముఖమును జూచి, రామునిముఖభావముచే నతని కీ యభిప్రాయము సమ్మతముగా నున్నది యని యెఱిఁగి చితిని బేర్చెను.

తర్వాత సీతాదేవియుఁ దలవంచుకొనియుండు రామునికి మెల్లగాఁ బ్రదక్షిణము గావించి, వెలుఁగుచున్న యగ్నిహోత్రుని సమీపించెను. అగ్ని సమీపమున నా సీతాదేవి నిలిచి చేతులు జోడించి, దేవతలకును బ్రాహ్మణులకును నమస్కరించి యిట్లు చెప్పెను. "ఎప్పుడును నా హృద

యము రామునిఁ దప్ప వేఱొక్కపురుషునిఁ గోర దనుట వాస్తవము యగు నేని, అట్లే సర్వలోకసాక్షి యగు నీ యగ్నిహోత్రుఁడు నన్నన్ని తెఱఁగుల రక్షించునుగాక! నేను పరిశుద్ధమైన నడవడిగలదానను గా నున్నను, రాఘవుఁడు నన్నుఁ దోషము గలదానినిగాఁ దలఁచుచున్నాఁడు. నాయందు దోషము లే దనుట వాస్తవమేని,సర్వలోకసాక్షి యగు పావకుఁడు నన్ను సర్వవిధములఁ గాపాడుఁగాక! నేను సకల ధర్మముల నెఱిఁగిన రామునిఁ దప్ప వేఱొక్కనిని మనోవాక్కాయములచేఁ దలఁపనిదానను నేని, యీ పావకుఁడు నన్ను రక్షించును గాక! సూర్యభగవానుఁడు, వాయువు, దిక్కులు, చంద్రుఁడు, సాయంప్రాతస్సంధ్యాకాలములు అహోరాత్రములు భూమియుఁ దక్కుఁగల వేల్పులు నాపవిత్ర చరిత్రములు నెఱిఁగినవారేని, యీ యగ్నిహోత్రుఁడును నన్ను రక్షించునుగాక!" అని చెప్పి వైదేహి యగ్నిహోత్రునికిఁ బ్రదక్షిణము గావించి, జ్వలించుచున్న యగ్నిహోత్రునిఁ దదేకాగ్రమనముతోఁ బ్రవేశించెను. సకల జనములు నా బాలవృద్ధము గలఁగినవా రయి యగ్ని ప్రవేశము చేయుచున్న మైథిలిం జూచుచుండిరి. పుటము వేయఁబడిన బంగారపురంగుబోలు మేనిరంగుగలదియు, నపరంజితొడవులం దాల్చినదియు నైన యా సీత సకలజనుల సమక్షమునఁ బ్రజ్వరిల్లు నగ్నిహోత్రునిఁ బ్రవేశించెను. ముల్లోకములలోనివారును బరిశుద్ధమైన యాజ్యాహుతింబోలె నగ్నియందుఁ బడుచున్న పుణ్యాత్మురా లగు సీతాదేవిని జూచిరి. యజ్ఞసమయమున మంత్రములచే సంస్కరింపఁబడినదై యగ్నియం దెడతెగని యాజ్యధారయుఁబోలె బడుచున్న యా సీతాదేవి నచ్చట నున్న స్త్రీలందఱు గాంచి హా హా యని యఱచిరి. శాపవశమునం జేసి, స్వర్గమునుండి పుడమింబడు దేవతయో యనునట్లు హవ్యవాహనునందుఁ జొచ్చుచున్న యా సీతాదేవిని ముల్లోకములవారును, దేవదానవ గంధర్వులును జూచిరి. ఆ సీతాదేవి యగ్నిప్రవేశము చేయునప్పుడు రాక్షసులును వానరులును గడు నచ్చెరువంది హాహా యని యఱచిరి.

120-వ సర్గము

బ్రహ్మాదులు రామునికడకు వచ్చుట

ధర్మాత్ముఁ డగు రాముఁడు వానర రాక్షసుల హాహాకారములు విని తోడనే మనోవ్యాకులత్వము చెంది కన్నీటిని గార్చుచుఁ గొంతసేపు చింతాక్రాంతుఁడై యుండెను.

తర్వాత నింద్ర యమ వరుణ కుబేర శంకర బ్రహ్మలు సూర్యుని మాడ్కిఁ దేజరిల్లు విమానములమీఁద నెక్కి లంకాపురమున కేతెంచి, రామునియెదుటికి వచ్చిరి. అంత వేల్పులమేటు లందఱు తమ యెదుటఁ జేమోడ్చి నిలిచియున్న రాఘవునిఁ జూచి, సవలయము లగు తమ నిడుద చేతులం బైకెత్తికొని, యివ్విధముగాఁ బలికిరి. "ఓ రాఘవా! నీవు సకల లోకములకు సృష్టికర్తవు, పరాత్పరుఁడవు, జ్ఞానులలో మేటివి. నీ వన్నియు నెఱిఁగినవాఁడ వయి యుండియు, సీతాదేవి హవ్యవాహనుం జొచ్చుచుండఁగా నేల యుపేక్ష సేయుచున్నావు? నీవు సకలదేవతా గణశ్రేష్ఠుఁడ వని నీ వెఱుఁగవా? నీవు ముమ్ము ఎనమండ్రు గురు వసువు లలోఁ బ్రజాపతి యగు ఋతధామయను వసువుగానుంటివి. నీవు ముల్లో కములకును మొదటికారణమైనవాఁడవు, తనంతటఁ బుట్టినవాఁడవు, రుద్రులలో నెనిమిదవ మూర్తియైన మహాదేవుండవు. సాధ్యులలో వీర్య వంతుఁ డను నైదవ సాధ్యుఁడవు. ఓ పరంతపా! అశ్వినీదేవతలు నీకుఁ జెవులు, చంద్రసూర్యులు నీకుఁ గన్నులు. నీవు లోకములసృష్టి ప్రలయ సమయములకు ముందును వెనుకను నుండువాఁడవు. అట్టి సర్వేశ్వరుఁ డవు, సర్వశక్తివి, సర్వజ్ఞుఁడవునై యుండియు నీ వేమియు నెఱుఁగని వానివైవడి సీత యగ్నిహోత్రునందుఁ బ్రవేశించుచుండఁగాఁ జూచుచు నుపేక్షసేయుచున్నా వదేల?

అని లోకపాలు రంద అడుగఁగా, సర్వలోకముల కేలిక ధర్మ పోషకులలో నుత్తముఁడు నైన రాముండు వేల్పుపెద్దలం గాంచి, "నేను నన్ను మానవమాత్రునిగాను దశరథపుత్రుఁ డగు రామునిఁగా నెఱుఁగుచున్నాఁడను. నే నెవ్వఁడను? ఎవ్వరికిఁ బుత్రుఁడను? ఏమి నిమిత్తమయి పుట్టినవాఁడ? త్రికాలజ్ఞుఁ డగు బ్రహ్మదేవుఁడు దీని నెఱిఁ గింపవలయును." అని బ్రహ్మదేవు నడిగెను. బ్రహ్మవేత్తలలో మేటి యగు

బ్రహ్మదేవుఁడు "తిరమగు మగఁటిమిగల యోరామా! నా నిక్కపు మాటలను విను" మని యా రాముని కిట్లనియె.

"ఓ రాఘవా! నీవు నారాయణుఁడవు, స్వయంప్రకాశస్వరూపుఁడవు; లక్ష్మీసమేతుఁడవు, చక్రాయుధుఁడవు; విభుఁడవు; ఒక కోఱగల వరాహుఁడవు; పుట్టిన పుట్టఁబోవు దుష్టులను సంహరించువాఁడవు; నాశరహితమును శాశ్వతమునునైన పరమాత్మ స్వరూపుఁడవు, ఆదిమధ్యాంతములం దుండువాఁడవు, లోకములకుఁ బరమధర్మమవైనవాఁడవు సర్వలోకాధీశుఁడవు; నాలుగు భుజములు గలవాఁడవు; శార్ఙ్గమను వింటిని దాల్చినవాఁడవు; సకల జనముల యింద్రియవ్యాపారములను నడపించువాఁడవు; జీవాత్మస్వరూపుఁడవు; పురుషోత్తముఁడవు; జితుఁడు గానివాఁడవు; నందకమను ఖడ్గమును ధరించినవాఁడవు; సర్వవ్యాపివి; భూమికి భారముఁ దొలఁగించి శాంతిని గలిగించువాఁడవు; దేవసేనలను నడపువాఁడవు; ప్రాణులకుఁ బెద్దవు; బుద్ధిక్షమాదమ స్వరూపుఁడవు; ఉత్పత్తి నాశములకుఁ గారణభూతుఁడవు; ఇంద్రానుజుఁడవు; మధువను రక్కసుని సంహరించినవాఁడవు; ఐశ్వర్యవంతుఁడవు; ఇంద్రుఁడవు, నాయుత్పత్తికాధార మగు కమలము నాభియందుఁ దాల్చినవాఁడవు రణమున శత్రువులను నశింపఁజేయువాఁడవు; దేవలోకసంచారు లగు సనకసనందనాది మహర్షులందఱు నిన్ను రక్షణకై యాశ్రయింపఁదగిన వానినిగాను, శరణాగతరక్షకునిగాను వచింతురు. వేయిశాఖ లను శిఖరములు గలదియు, పెక్కువిధు లను నాలుకలు గలదియు,సకలజనులచేఁ బూజ్యంబునైన వేదము నీవే. నీవు ముల్లోకములకు నాదికారణుఁడవు. స్వయముగాఁ బుట్టినవాఁడవు;ముక్తులకును ముక్తులుగాఁగోరువారికిని నీవే యాశ్రయుండవు; సృష్టికి ముందును నున్నవాఁడవు; నీవ యజ్ఞంబవు; నీవ వషట్కారమవు; నీవ యోంకారరూపుఁడవు; పరంతపుఁడవు. నీకు మొదలు కొన లున్నవని కాని, నీ వెవ్వఁడ వని కాని యొక్కరు నెఱుఁగరు. సర్వభూతములందును, గోబ్రాహ్మణులయందును, దెసలన్నిటియందును, ఆకాశమునందును, బర్వతారణ్యములందును గనఁబడుచున్నావు. నీవు సహస్రపాదుఁడవు; శతశీర్షుఁడవు; సహస్రనేత్రుఁడవు; శ్రీమంతుఁడవు; నీవు సకలభూతములను, పర్వతాదులతోఁగూడిన భూమిని ధరించుచున్నావు.

ప్రలయసమయమున జలమధ్యమున నాది శేషశాయివై దేవదానవగంధర్వులను ముల్లోకములను దాల్చుచున్నాఁడవు. రామా! విరాట్పురుషుండవైన నీకు బ్రహ్మదేవుండ నైన నేను హృదయముగాను, సరస్వతీదేవి నాలుకగాను, దేవతలు నీ యంగములందలి రోమములుగాను సృజింపఁబడినవారలము. నీవు తెప్ప మూయుటయె రాత్రి. నీవు తెప్పదెఱచుట పగ లగును. నీయూర్పులే వేదములైనవి. నీవులేని వస్తువు వేఱొక్కటి లేదు. జగత్తంతయు నీ శరీరము. నీధైర్యమే భూమియంతయు, నీకోపమే యగ్ని, నీయనుగ్రహమే శశచిహ్నముగల చంద్రుఁడును. తొల్లి వామనావతారమున మూఁడడుగులచే ముల్లోకములను గొలిచి, బలి యను మహాసురు నడఁగఁద్రొక్కి దేవేంద్రుని స్వర్గాధిపతిని గాఁజేసితివి. సీతయే లక్ష్మి. నీవ సృష్టిస్థితిలయకారణుఁడును, జనుల సంకల్పముల నెఱుఁగువాఁడును, సర్వలోకాధీశుఁడును నైన విష్ణువు. ఇప్పుడు రావణసంహారము నిమిత్తము భూమిని మానుషావతార మెత్తినవాఁడవు. ధర్మరక్షకులలో మేటీ! మా యీ రావణవధరూపకృత్యము నీవు నెఱవేర్చితివి. ఇఁక సంతసముతో దివమునకు వచ్చి చేరుము. నీ బలవీర్యములు వ్యర్థములు గానివి. నీ పరాక్రమము వ్యర్థము గానిది. రామా! నీదర్శనము నీ పొగడ్తయు నెన్నిటికిని వృథగావు. నీ భక్తు లగువారు కార్యసిద్ధుల నొందుదురు. పురాణపురుషోత్తముఁడవు శాశ్వతుఁడవునైన నిన్నుఁగొల్చునట్టి భక్తు లెల్లప్పు డిహలోక పరలోక సుఖములను సదా పొందుచున్నారు. ఈ వేదోక్తమును, బురాతనమును నగు నితిహాసరూపమును నైన యీ స్తోత్రమును గీర్తించు మానవులకుఁ బరాజయమెన్నటికిని గలుగదు." అని బ్రహ్మదేవుఁడు రామునితోఁ జెప్పెను.

121-వ సర్గము

అగ్నిహోత్రుఁడు రామునకు సీతాదేవి నొసంగుట

బ్రహ్మదేవుఁడు చెప్పినమాటలను విని, సర్వలోకసాక్షి యగు యగ్నిహోత్రుఁ డాచితిని ద్రోసి, బాలసూర్యునిమాడ్కి వెలుఁగు నదియుఁ, బసిఁడి తొడవులఁ దాల్చినదియు, నెఱ్ఱని కోక గట్టినదియు, నల్లని వంకరకురులు గలదియు, వాఁడని పూలమాలికలును నిగనిగ మెఱయు తొడవులును అగ్నిప్రవేశమునకు ముందున్నట్లే కల్గియుండు

నదియునైన యా సీతను తొడమీఁద నుంచుకొని మానవస్వరూప ముతో వచ్చి, రాముని కిచ్చి యిట్లనియె.

"ఓ రామా! యిదిగో సీత నీయదియ. ఈమెకడ నీవు దలఁచి నట్టి పాపము లేవియు లేవు. మిగులఁ బ్రియురా లగు సీతాదేవి నిర్దోషు రాలని యెఱిఁగియు, సదాచారవంతుఁ డను పేరునకు లోపము రాఁగూడ దని యెంచి ప్రియపత్నిచే నగ్నిప్రవేశము చేయించిన యో రామా! యీ సీత చక్కని నడత గలది, నిన్నుఁదప్ప వేఱొక్క పురుషుని మనోవాక్కాయములచేఁ దలఁచికాని కంటితోఁ జూచికాని యెఱుఁగ నిది. బలముచే గర్వించిన రావణుఁడు నీవు లేనట్టిసమయమున నిర్జన వనమునుండి యీసీతను దెచ్చి యంతఃపురమున నుంచి భీకరరూపిణు లగు పెక్కురు రాక్షసకాంతలచేఁ గాపాడఁబడుచున్నను, ఈ సీత నీయందే డెందము నుంచినదై నిన్నే గతిగా భావించియుండెను. ఆ దుష్టరాక్షసుఁడు నయభయములు రెంటిచేతను సీతను లోఁబఱచుకోఁ జూచెను గాని, సీత తన డెందము నీయందె తగిలియుండుటచే, నా రాక్షసునిమాటలు సరకుసేయ దయ్యెను. రాఘవా! యీ సీతాదేవి నిర్మలమైన తలఁపుగలది; పాప మెఱుఁగనిది. ఈమెను నీవు జేకొనుము. నే నానతిచ్చెదను. నామాటకు బదులు సెప్పక దీనిం గైకొనుము." అని యగ్నిహోత్రుఁడు రామునితోఁ బలుకఁగా, పలుకరులలో మేటి యైనవాఁడును,ధర్మాత్ముఁడునైన రాముఁడు తనపత్ని నిర్దోషురాలని యగ్ని హోత్రుఁడు సాక్ష్యము నిచ్చినందులకై సంతసించి, యట్టిదానిని నిష్ఠూ రపుమాటలచే నొప్పించినందులకై కన్నీరు విడుచుచు క్షణముకాలము యోచించి, "వీతిహోత్రుఁడా! సీత ముల్లోకములందును దప్పక బాపముచేసినది కాదనుట వాస్తవమే. అయినను, పుణ్యశీల యగు నీ సీత బహుకాలము రావణుని యింట నుండినదికదా! నేను సీతను శోధింపకయ చేకొనియుంటినేని, "ఈ దశరథాత్మజుఁ డగు రాముఁడు కామాతురుఁడు, నీచుఁడు" అని పెద్దలు నన్ను దూషించియుందురు. ఈ సీత వేఱొక్కనిని దలఁపనిదనియు, నాయందే భక్తిగలది యనియు నే నెఱుఁగుదును. నేను సత్యమును దప్పనివాఁడ నగుటచే జనులకు నమ్మిక గలుగు నిమిత్తమై యీ మైథిలి యగ్నిప్రవేశము చేయుచున్నను నుపేక్షించితిని. మహా

సముద్రము చెల్లెలికట్టను దాఁటఁజాలనట్లు తన పాతివ్రత్యమహిమచేఁ గాపాడఁబడుచుండు విఱివి కన్నులుగల దగు సీతాదేవిని రావణుఁడు కదియఁజాలఁడు. నరుఁడు మండుచున్న యగ్నిజ్వాలను సమీపింపఁజాల నట్లు, దుష్టాత్ముఁ డగు రావణుఁడు పాతివ్రత్యముచే విరాజమాన యగు సీతను మనమున స్మరింపనైనను జాలినవాఁడు కాఁడు. ఈ చక్కనిదగు మైథిలి రావణుని యంతిపురమునందలి కలిమిఁ గోరదు. సూర్యప్రభ యతని నెడఁబాయనట్లు, సీత నన్నుఁ దప్ప వేఱొక్కనిఁ జేరియుండదు. ఈ జానకి ముల్లోకములందలి యతివలకంటెఁ బతివ్రత. మానవుఁడు కీర్తిని విడువఁజాలనట్లు నేను నీ మైథిలి నెంతమాత్రము విడువఁజాలను. నాయం దనురక్తులును, లోకపూజ్యులును నైన మీ రందఱును జెప్పు నట్టి మేలిమి వచనములు నాకు క్షేమకరములు గనుక, నే నవశ్య మట్లు లాచరింపవలెను." అని యగ్నిహోత్రుఁడు మున్నగు వేల్పులతోఁ జెప్పెను. బలవంతుఁడును, సుఖములే యనుభవింపఁదగినవాఁడును నైన రాముఁ డివ్విధమున శాస్త్రీయముగాఁ బలికి, తన యొనరించిన కార్య మునకై వేల్పులచేఁ గొనియాడఁబడుచుఁ దన ప్రియురాలితోఁ గూడి సంతసము నొందెను.

122-వ సర్గము

పరమేశ్వరుఁడు రామునితో సంభాషించుట

రాఘవుఁడు సెప్పిన మంచి పలుకులు విని, పరమేశ్వరుఁడు వాని కంటెఁ గడు మంచివైన మాటలఁ జెప్పఁదొడఁగెను. "కమలాక్షా! మహా బాహువా! విశాలవక్షుఁడా! శత్రుసంహారీ! శస్త్రభృత్తులలో శ్రేష్ఠుఁడా! నీవు సకలజనులభాగ్యవశమునంజేసి రావణునివలని భయ మనెడి యడరి యున్న కాఱుచీఁకటిని బోఁగొట్టితివి. వగపాలై యుండు భరతునిఁ గౌసల్యను నూఱడించి, కైకేయీ సుమిత్రల దర్శించి, యయోధ్యాపుర మునఁ బట్టాభిషిక్తుఁడవై చెలికాండ్ర నందఱిని సంతోషపెట్టి, సంతతిం బడయుటచే నిక్ష్వాకువంశమును నిల్పినవాఁడవై యశ్వమేధయాగ మొనరించి, విస్తారకీర్తిని బొంది, బ్రాహ్మణులకు ధనము నొసఁగి, స్వర్గము నకు వచ్చి చేరవలసినది, ఓ కాకుత్స్థా! యిదిగో, కీర్తిశాలియైన నీతండ్రి దశరథుఁడు విమానము నెక్కినవాఁడై మానుషలోకమునకు వచ్చి

యున్నాఁడు చూడుము. శ్రీమంతుఁ డగు నీ దశరథనృపాలుఁడు నీ వొనర్చిన సత్యవాక్యపరిపాలనముచే నసత్యదోషము వొరయకుండు నట్లు చేయఁబడినవాఁడై, యింద్రలోకము నొందెను. నీవును దమ్ముఁడు లక్ష్మణుఁడును నితనికి నమస్కారము గావింపుఁడు."

అని మహేశ్వరుఁడు చెప్పిన మాటలు విని, శ్రీరాముఁడు లక్ష్మణ సమేతుఁడై మ్రొక్కి, స్వప్రకాశముచే వెలుఁగువాఁడును, తెల్లని పట్టు బట్ట గట్టినవాఁడునునై విమానారూఢుఁడునునై యున్న తండ్రిని దశ రథునిఁ గాంచెను. తర్వాత దశరథనృపాలుఁడు విమానారూఢుఁడై, తనకుఁ బ్రాణములకంటె మిన్నయైనట్టి కుమారునిఁ జూచి యెక్కువ సంత సము నొందినవాఁడై, దాను మేటి యాసనమునఁ గూర్చుండి, తనపుత్రు లను దనతొడమీఁదఁ గూర్చుండఁ బెట్టికొని, యిరుగేలఁ గౌఁగిలించి, యి ట్లనెను: "రామా! నిక్కము నెప్పెదను. నిన్నుఁ బాసి స్వర్గమున నుండుటయేని, దేవర్షు లొనరించు సమ్మానమేని నాకు గొప్పగాఁ దోఁప లేదు. రామా! శత్రువులను సంహరించి, పూర్ణమనోరథుండవై ప్రతిజ్ఞ నెఱవేర్చియున్న, నిన్నుఁ జూచిన నాకు మహానంద మొదవుచున్నది. కైకేయి నిన్ను వనమున కంపుటకై చెప్పిన పలుకు లెల్ల నా మనమున నాఁటికొనియె యున్నవి కాని, యింకను మఱపునకు రాకయున్నవి. నీవు లక్ష్మణసమేతముగా క్షేమముగ నుండఁజూచి నేను మిక్కిలి యానంద మొందుచున్నాను. కాహళుఁ డను బ్రాహ్మణుని నష్టావక్రుఁడు తరింపఁ జేసినచందమున మహాధీరుఁడవైన సుపుత్రుఁడ వగు నీవు నావాక్యపరి పాలనముచేసి నాకు నుత్తమలోకములఁ గలిగించితివి. పురుషోత్తమా! సౌమ్యుఁడా! వేల్పులందఱు రావణవధము నిమిత్తమై నీయొక్క పట్టాభిషేకమునకు విఘ్నమును గలిగించి రని యిప్పుడే నే నెఱిఁగితిని. శత్రుసూదనా! వనవాసము సేసి, శత్రుసంహారము కార్యము నీడేర్చిన వాఁడవై మఱల వచ్చిన నిన్ను కౌసల్య చూచి కృతార్థురాలు కాఁగలదు గదా! రామా! నగరమునకుఁ జని పట్టాభిషిక్తుఁడ వయిన నిన్నుఁ జూడఁ బోవు నయోధ్యానగరవాసు లగు జనులు ధన్యులు గదా! రామా! నీయం దనురాగముగలవాఁడును, బలవంతుఁడును, సదాచారసంపద గలవాఁడును, స్వధర్మము నడపువాఁడునునైన భరతుఁడును నీవును

గలియఁగా నేను జూడఁ గోరెదను. సౌమ్యుఁడా! ధీమంతుఁ డగు లక్ష్మణునితోను సీతతోను గూడి పదునాలుగేం డ్లరణ్యమునఁ గడపితివి; వనవాసము నెఱవేర్చితివి; నా ప్రతిజ్ఞయు సార్థకము చేసితివి; రావణుని సంహరించి దేవతలను సంతోషపెట్టితివి. శత్రుసంహారీ! చేయవలసిన కార్యము చేసితివి; సకల జనులచేఁ గొనియాడఁదగిన కీర్తిని బొందితివి. ఇఁక దీర్ఘాయువు గలవాఁడవై రాజ్యమును బొంది తమ్ములతోడ సుఖముండుము."

అని దశరథుఁడు సెప్పఁగా, రాముఁడు చేతులు మోడ్చి "ధర్మజ్ఞా! నిన్నుఁ బుత్రునితోడఁ గూడ విడిచెద నని కైకేయితోఁ బలికితిరి కదా! అట్లు చేయక కైకేయీ భరతులందు దయ యుంచుము. ఘోరమైన తమశాప మా కైకయికిని నామె పుత్రునకును దగులకుండ చేయవలయును" అని తండ్రిని బ్రార్థింపఁగా, నతఁడు చేమోడ్చియున్న రామునితో నట్లే యగుఁగా కని లక్ష్మణునిఁ గౌఁగిలించికొని, "నాయనా! లక్ష్మణా! నీవు వైదేహికిని రామునకును శుశ్రూషలు చేయుటచే నా కెక్కువ ప్రీతి గలిగెను. నీకును నెక్కువ పుణ్యము గలిగెను. ఓ ధర్మము నెఱిఁగినవాఁడా! రాముఁ డనుగ్రహించెనేని, పుణ్యమును, భూమిని, విస్తారమయిన కీర్తిని, స్వర్గసుఖమును, గొప్పపేరును బొందఁగలవు. సుమిత్రముద్దులకొడుకా! రామునిఁ గొల్చుచుండుము. నీకు మే లయ్యెడు. రాముఁడు తనవారని పొరుగువా రని భేదము నెంచక యెల్లరకు నెల్లప్పుడు మేలు సేయఁదలఁచువాఁడు. ఈ యింద్రాదులును, ముల్లోకములవారును, సిద్ధులును, బరమర్షులును మహానుభావుఁడును బురుషోత్తముఁడును నైన రామునిఁ గొల్చుచుందురు, సర్వస్వరూపమును, భక్తిలేని వారిచేఁ దెలియ నలవికానిదియు, రహస్యమును, షడ్భావవికారశూన్యమును, వేదప్రతిపాదితమును, వేదములకుఁ దాత్పర్యవిషయ మైనదియు నైన పరబ్రహ్మ మేది కలదో, ఆ పరబ్రహ్మమే రామరూపమున నవతరించియున్నది. లక్ష్మణా! నీవు సీతారాములకు శుశ్రూష యొనరించి, ధర్మము నొందితివి. విస్తారకీర్తిని సంపాదించితివి." అని ధర్మాత్ముఁ డగు దశరథుఁడు చేమోడ్చి నిలుచున్న లక్ష్మణునితోఁ బలికి, వైదేహిని గాంచి, "జానకీ! రాముఁడు నిన్ను మొదట విడిచె నని యాగ్రహము నొంద

కుము. రాముఁడు నీపాతివ్రత్యము వెల్లడింపఁగోరి, నీ వగ్నిప్రవేశము చేయఁగాఁ జూచుచుండెను. నీవు భర్తకు శుశ్రూష చేయుచుండు మని నీకు వేఱ చెప్ప నక్కఱలేదు. ఇతఁడు పరమదైవత మని నే నదిమాత్రము నీకుఁ జెప్పెద" నని పుత్రు లగు రామలక్ష్మణులను కోడలిని సీతను నూఱడించి విమానమెక్కి యింద్రలోకమునకుఁ బోయెను.

123-వ సర్గము

యుద్ధహతులైన వానరు లింద్రుని వరమువలన బ్రదుకుట

దశరథుఁడు తన పుత్రుల వీడ్కొని స్వర్గమున కేఁగిన పదంపడి, యింద్రుఁడు గడు సంతసము నొంది, చేమోడ్చికొని నిలిచియున్న రామునిఁ గాంచి, "శత్రుసంహారకా! రామా! దశరథుఁడు పుత్రకామేష్టి చేసిన సమయమున నిన్ను మేము గాంచుట నీ రావణ వధముచే సఫల మయ్యెను. నీ వొనరించిన కార్యమునకు సంతసించితిమి. నీ మనము నందలి కోరికను దెలుపుము" అని చెప్పఁగా రాముఁడు లక్ష్మణునితోడను, సీతతోడను గూడినవాఁడై చేతులు మోడ్చి "యో దేవేంద్రా! నీకు నాయెడఁ బ్రీతి గలదేని, నా ప్రార్థన నెరవేర్పుము. అది యేది యనిన, నా నిమిత్తమై యే వానరు లాలుబిడ్డలను విడిచి, నా కార్యము నెఱవేర్చుటయందే పట్టుదలగలిగి, యుద్ధములందుఁ దమ ప్రాణములఁ గోల్పోయిరో, అట్టి వానరులనందఱిని బ్రతికింపవలయును. మఱియు నీ వానరవీరు లందఱు బాధలేనివారై గాయములు మాని, బలపరాక్రమములతోఁ గూడినవా రగుదురు గాక! ఈ వానరు లున్నచోట్ల నకాలము లందును నదులు జలపరిపూర్ణములై యుండుఁగాక! కందమూలఫలములు సమృద్ధములుగా నుండునుగాక! ఇదియే నేఁగోరు వరము" అని యింద్రునితోఁ బలికెను.

"ఓ రఘునందనా! నీ వడిగిన యీ వరము గడు గొప్పది. అయినను నే నెప్పుడును రెండు తెఱఁగుల మాటాడినది లేదు. కావున నీవు తలఁచినట్లు యీ వరము నెఱవేఱఁగలదు. రణమున రాక్షసులచే నిహతులును, చేతులు మోములు దెగనేయఁబడినవారును నైన వానరులును, ఎలుఁగుబంటులును, కొండముచ్చులును వ్రణములు మాని, నొప్పిలేనివారై, బలపరాక్రమములతోఁ గూడి నిద్రవోయి

మేల్కాంచినవారు వోలె లేచి, తమ బంధుమిత్రపరివారములతోడఁ గూడి యెక్కువ మోదము నొందఁగలరు. మఱియు నీ కోరినచొప్పుననే వానరాదు లున్నచోట్ల నకాలమునను గంద మూల ఫల జల సమృద్ధి గలిగియుండఁగలదు." అని యింద్రుఁడు పలికెను. అంతకుమున్ను గాయములతో నిండిన మేనులు గల వానరర్క్షగోపుచ్ఛులు గాయములు లేని మేనులతోఁ గూడి నిద్రించినవారికై వడి లేచి కూర్చుండి, మృతులు మఱల లేచుటం గాంచి, "యి దేమి వింత!" యని యాశ్చర్యభరితులై రాఘవునికి మ్రొక్కిరి.

తర్వాత నా వేల్పుపెద్ద లందఱు సకల మనోరథముల నందిన వాఁడై యొప్పారు రాఘవునిఁ గాంచి, స్తోత్రపాత్రుఁ డయిన యారాఘవుని మొదటఁ బొగడి యి ట్లనిరి; "ఓ వీరా! యిటనుండి యయోధ్యకు వెడలిపోయి, వానరుల నందఱను దమతమ తావుల కంపి, నీయెడ ననురాగము గలదైన దీనురా లగు నీ మైథిలి నూఱడింపుము. పరంతపా! మహాత్ముం డగు శత్రుఘ్నుని నీ తల్లుల నందఱను, నీ వియోగశోకముచే మునివ్రతము దాల్చియున్న భరతునిఁ జూచి, వారి నూఱడించి పట్టాభిషేకము గావించికొని పౌరప్రజలను సంతోషపెట్టుము." అని వేల్పు లందఱు రామునితోఁ బలికి యాతనిని వీడ్కొని సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు విమానములపై నెక్కి సంతసముతో స్వర్గలోకమున కరిగిరి. కాకుత్స్థుఁడును లక్ష్మణ సమేతముగా వేల్పుపెద్దలకందఱకు నమస్కరించి వానరుల నందఱను విశ్రమింప నానతిచ్చెను. ఆ రామలక్ష్మణులచేఁ బాలింపఁబడు నా మహావానరసైన్యము జయమును గీర్తిని నొంది, జయలక్ష్మిచే విరాజిల్లుచుఁ జంద్రునితోఁ గూడిన రాత్రివోలెఁ దేజరిల్లుచుండెను.

124-వ సర్గము

విభీషణుఁడు విమానము దెచ్చుట

బ్రహ్మాదులు రాముని స్తుతించి, తమ తమ నివాసములకు నేఁగిన తర్వాత, శత్రుసంహారి యగు నా రాఘవుఁ డా రేయి సుఖముగా నిద్రించెను. మఱునాఁ డుదయమున విభీషణుఁడు చేతులు జోడించికొని, రాముని జయ మడిగిన తర్వాత "ఓ రాఘవా! యివిగో, స్నానమున

కుపయుక్తములగు నుదకములును, నలుఁగుఁ బిండ్లును, వస్త్రాభరణములును, మేటిగంధములును, నానావిధపుష్పహారములును నున్నవి. వీరుగో, అలంకారము చేయ నేర్పరులగు పద్మపత్రములం బోలు కన్నులు గలయువిదలు నున్నవారు. వీరు నిన్నుఁ జక్కఁగా జలకమాడింతురు. నాయెడఁ గరుణించి, స్నాన మొనరించి, వీని నన్నింటినిఁ జేకొను" మని రామునిఁ బ్రార్థింపఁగా, నతఁ డతనితో ని ట్లనియె. "విభీషణా! నీ వీ సుగ్రీవాది వానరులను స్నానము జేయింపుము. నియమము దప్పని వాఁడును, సుఖము లనుభవింపఁదగినవాఁడును, సుకుమారుఁడును, జేసిన ప్రతిన దప్పనివాఁడును, నిడుదచేతులవాఁడునైన పిన్నవాఁ డగు భరతుఁడు నా నిమిత్తమై యిడుమలఁ గుందుచున్నాఁడు. నేను బదునాలవయేఁడు నిండినవెంటనే రానేని యగ్ని ప్రవేశము సేయుదు నని ప్రతిజ్ఞ యొనరించియున్నాఁడు. నేను పోకయుందునేనిఁ బ్రతిజ్ఞ తప్పని వాఁడు గనుక భరతుఁ డగ్ని ప్రవేశము సేయును. అట్టి ధర్మనిష్ఠుఁ డగు భరతునిఁ బాసి నాకు మంగళస్నానము చేయుటగాని, యీ వస్త్రాభరణములు దాల్చుటగాని యభిమతము గాదు. నే నిప్పుడే యీ దారిని బట్టియే యయోధ్యకుఁ బోయెదను. కడుదుర్గమ మయిన యీ మార్గ మెట్టులైనను నయోధ్యకుఁబోయి సేరునుగదా! నే నిప్పు డిచ్చట మసలుట యుక్తముగాదు. ముందుగా నా తమ్మునిఁ జూడవలయు." నని చెప్పఁగా, విభీషణుఁడును రామునితో వెండియు ని ట్లనియె.

"ఓ రాఘవా! ని న్నొకదినములోపలనే యయోధ్యను జేర్పించెదను. ఇచ్చటఁ గుబేరునిదైన సూర్యసన్నిభ మగు పుష్పకవిమానమున్నది. ఇది మాయన్న యగుకుబేరునిది. రావణుఁడు కుబేరుని యుద్ధమున జయించి, స్వేచ్ఛతోఁ దిరుగు నీదివ్యమయిన విమానమును బలాత్కారముగఁ దెచ్చెను. దీనిని రావణుఁడు మడిసిన తర్వాత మాయన్న గుబేరుఁడు వచ్చి యడిగినను నీయక నీనిమిత్తమై యుంచియున్నాను. ఈవిమానమున నెక్కి యొక్కదినములోపలనే యయోధ్యకుఁ బోఁగలవు. దీనికై నీవు వంత నొందవలదు. ఓ ప్రాజ్ఞుఁడా! నేను నీదాసుఁడ నగుదునేని, నాయొక్క గుణముల నెఱుఁగుదువేని, నాయెడఁ బ్రేమగలదేని యిచ్చట నిలువవలెను. నీవు సుహృజ్జన సైన్యసమేతుఁడ వయి, నామీఁది గౌరవ

మునను, బ్రేమవలనను, జెలిమివలనను నాచేయు సత్కారములఁ గైకొని యావల నయోధ్యకుఁ బోవచ్చును. నేను మీకు విధేయుఁడనై వేడు కొనుచున్నాఁడనే కాని మీ కానతిచ్చువాఁడను కాను." అని విభీషణుఁడు రాముని సవినయముగా వేఁడఁగా, రాముఁడు రాక్షసులు వానరులు నందఱు వినుచుండఁగా ని ట్లనియె.

సౌమ్యుఁడా! శత్రుతాపనా! నీవు నాకు సహాయుఁడవై యుండి యాలోచనలు చెప్పుట, నీవు చూపిన యుత్తమభక్తి, నీ చేష్టలు, నీమేటి చెలిమి వీనిచేతనే నాకు మర్యాద గావించితివి. నా తోఁబుట్టు వగు భరతునిఁ జూచుటకై నా మనము త్వరపడుచున్నది. ఆ భరతుఁడు వన వాసమునకు వచ్చిన నన్ను మఱలించుకొనిపోవ వచ్చి నాప్రత్యాగమన మునకై నన్ననేకవిధములఁ బ్రార్థించెను గాని, నే నతనిమాట నియ్య కొనక, పదునాలుగవయేఁడు గడచిన మఱునాఁడే నిన్నుఁ జూచెద నని చెప్పి వచ్చితినిగాన నామన మతనిఁజూడఁ ద్వరపడుచున్నది. ఆ కార్యము లేకున్న నీమాటను నేను వినకయుందునా? మఱియు నా తల్లులను, గురు వులను, జెలికాండ్రను, బురవాసులను, వారి బిడ్డలను జూడఁగోరు చున్నాను. కావున విభీషణా! కార్యమయిన పిమ్మట నిచ్చట నుండుట నాకు సమ్మతముగాదు గనుక వేగిరముగా దివ్యవిమానమును దెప్పిం పుము. నాప్రయాణమునకు సమ్మతింపుము. నేను వెళ్లెదను. నీవు నాపై నాయాసపడక నా గమనమున కనుమతింపుము." అని రాముఁడు విభీష ణునితోఁ జెప్పెను.

అటుపిమ్మట విభీషణుఁడు బంగారుమయము లయిన విచిత్రము లగు నవయవములుగలదియు, వైడూర్యమణిమయము లగు తిన్నెలతోఁ గూడి నదియు, మంటపములచే నంతట నిండినదియు, నన్నిదెసల వెండివన్నె గలదియు, ధవళవర్ణధ్వజ పతాకలు గట్టినవియు, బంగారు పై మేడలతో నొప్పారునదియు, చిఱుగజ్జెలవరుసలు గలదియుఁ, బసిండితామరపూవు లతోఁ గైసేయఁబడినదియు, ముత్యాలకిటికీలు గలదియు, పెక్కుగంటలు చుట్టు గట్టినదియు, నింపుగులుకు ధ్వనితోఁగూడినదియు, మేరు శిఖరమంత గొప్పదిగా విశ్వకర్మచే నిర్మింపఁబడినదియు, ముత్యములు వెండి వీనికాంతు లతో సమానము లగు కాంతులుగల మేడలతో నొప్పుమీఱునదియు,

స్ఫటికంపుఁ జిత్రవర్ణాంగములు గలవియు వైడూర్యమణులు చెక్కినవియు మేటి విలువగల పఱపులు పఱచినవియునైన యుత్తమాసనములతోఁ గూడినదియు, నొరులచే నడ్డగింపరానిదియు, మనోవేగము గలదియునైన విమానమును దెప్పించి, రాముని ముందట నిలిపి, "యిదిగో విమానముఁ దెప్పించితి" నని రామునికి నివేదించి చేరువ నిలఁబడియుండెను.

125-వ సర్గము

విభీషణుఁడు వానరుల గౌరవించుట

రాక్షసాధిపుఁ డగు విభీషణుఁడు పుష్పములచే నలంకరింపఁబడిన పుష్పకవిమానము నచ్చటఁ దెచ్చియుంచి, చేరువ నిలుచుండి చేతులు జోడించుకొన్నవాఁడై, యడఁకువ మెఱయఁ ద్వరపాటుతో "రాఘవా! నే నిఁక నేమిచేయవలె" నని యడిగెను. అంత రాముఁడు లక్ష్మణుఁడు మాత్రమే చేరువ నుండి వినుచుండఁగా విభీషణునిఁ జూచి, ప్రేమ మీఱ ని ట్లనెను. "విభీషణా! యీ వానరులందఱు పూనికితో నిక్కార్యము చేసినవారు. వీరిని రత్నవస్త్రభూషణములచే మర్యాద సేయుము. రాక్షసాధిపా! యింతకుమున్ను జయింపఁబడని యీలంకాపురమును దమ ప్రాణములమీఁది యాసనుసైతము మాని, యుద్ధమునఁ బాఱక యుత్సాహముతో నీ వానరు లందఱు జయించిరి. కావునఁ గార్యసాధకులైన యీ వానరుల నందఱను ధనకనకవస్తువాహనముల నొసఁగి మర్యాద చేసి, వారిశ్రమ సార్థకమగునట్లు చేయుము. గొప్పవారిని గౌరవించునట్టి యో విభీషణా! నీవు వీరు చేసిన మేలును గుర్తించి, మాననీయులైన వీరికి మన్నన చేసితి వేని, వీరు నీయెడ మిక్కిలి ప్రేమగలవారై యుందురు. అట్లు నీ వొనరింతువేని, నీవు దాత వనియు, జనులను దానమానాదులచే వశపఱచుకొనువాఁడ వనియుఁ, దయాపరుఁడ వనియుఁ గీర్తిమంతుఁడ వనియు జనులందఱు నిన్నుఁ దలంతురు. కావున నే నీసంగతిని నీకుఁ జెప్పితిని. రాజు సంతసించు పనులు సేయక యెల్లప్పుడుఁ గ్రోధమునే చూపుచు, దానమానాదులచే సేనలను సమ్మానింపఁడేని, అట్టిరాజు నతని సేనలు విసుఁగుచే విడిచిపెట్టి పోవుదురు" అని రాముఁడు చెప్పఁగా, విభీషణుఁడు వానరుల నందఱను ధనకనకరత్నాభరణములచే వారివారి యోగ్యత ననుసరించి వారివారిని మర్యాద గావించెను.

విభీషణుఁ డట్లు వానరుల నందఱను రత్నములను, ధనమును నొసఁగి పూజించిన తర్వాత, రాముఁడు సిగ్గుతోడ నిల్చియున్న పతివ్రత యని పేరుగొన్న వైదేహినిఁ దొడమీఁదఁ గూర్చుండఁ బెట్టికొని పరాక్రమశాలియు విలుకాఁడును నయిన లక్ష్మణునితోడఁ బుష్పకవిమానము నెక్కినవాఁడై వానరుల నందఱను వీర్యవంతు లగు సుగ్రీవ విభీషణులను గూర్చి యిట్లనియె: "ఓ వానరోత్తములారా! మీరందఱు చెలికాని యీ కార్యము సాధించితిరి. నే నానతిచ్చితిని. ఇఁక మీరు మీ మీ తావులకుఁ బొండు. సుగ్రీవుఁడా! అధర్మమునకు వెఱచి, చెలికాఁడును, బంధుగుఁడునైన వాఁ డొనరింపవలసిన కార్యమంతయు నెఱవేర్చితివి. ఇఁక నీవు నీసైన్యమును దోడ్కొని కిష్కింధాపురికి వేగిరముగాఁ బొమ్ము. విభీషణా! నీవును నే నొసంగిన లంకాపురమున రాజ్యపాలనము సేయుచుండుము. ఇంద్రాదిదేవత లయినను నిన్నెదిరింపఁజాలరు. నేనును నాతండ్రి దగు నయోధ్యకుఁ బోయెదను. మీ రందఱు నా కనుమతి యొసఁగుఁడు. నే నందఱిని వీడ్కొనెదను."

అని రాముఁడు పలుకఁగా, బలవంతు లగు వానరులును విభీషణుఁడును జేతులు జోడించి యిట్లనిరి: "ఓ రాఘవా! మేమును మీతోఁ గూడ నయోధ్యకు రాఁ గోరుచున్నాము. నీ వందులకు సమ్మతింపవలయును. మే మచ్చట జనుల కెట్టి కీడును జేయక, వనములందును నగరములందును దిరుగువారము. రాజపుత్రా! నీవు సింహాసనమునఁ గూర్చుండి పట్టాభిషేకము చేసికొనఁగాఁ జూచి, కౌసల్యాదేవికి వందనము లాచరించి, తడవుసేయక మేము మామా యిండ్లకు వచ్చి చేరఁగలవారము." అని సుగ్రీవాది వానరులును విభీషణుఁడును బలుకఁగా, ధర్మాత్ముఁడును, జయలక్ష్మిచే శోభిల్లువాఁడునునైన రాఘవుఁడు వారి నందఱిని గాంచి "మీ రందఱు నాతోడ రాఁగా, నేను మీబోఁటి చెలికాండ్రందఱు చూచుచుండఁ బట్టము గట్టుకొనుట నాకు సీతా సమాగమ భరతదర్శనాదుల కంటె హెచ్చుగు సంతోషప్రదమైన విషయమేకదా. సుగ్రీవా! వానరులతోడ నీవును, విభీషణా! మంత్రులతోడ నీవును విమానము వేగ యెక్కుఁడు" అని వారిని వేగిరింపఁగా, సేనలతోడ సుగ్రీవుఁడును, మంత్రులతోడ విభీషణుఁడును విమానము నెక్కిరి. వారంద ఱెక్కఁ

గానే, కుబేరుని దగు పుష్పకవిమానము రాముని యానతిచే నాకసమున కెగిరెను. ఆ రాముఁడు హంసలు చెక్కిన ప్రకాశమాన మగు పుష్పక విమానమునఁ బోవుచు, వేల్పులచేఁ గొనియాడఁబడుచు వేడ్కతోఁ గుబేరుని మాడ్కిఁ బోవుచుండెను. బలవంతు లగు ఆ వానరులును, రాక్షసులును, నా దివ్యవిమానమున నిఱుకులేకుండను, సుఖముగఁ గూర్చుండిపోయిరి.

126-వ సర్గము

రాముఁడు సీతాదేవికి జరిగిన వింతలఁ జూపుట

ఆ పుష్పకవిమానము రాముని యానతిం బడసినదై, గాలికిఁ గదలిన మహామేఘముకైవడిఁ బైకి లేచెను. అప్పుడు రాముఁడు చంద్ర నిభాస్య యగు సీతాదేవికి నచ్చటి వింతలను జూపుచుఁ బోయెను. "వైదేహీ! కైలాసశిఖరముఁబోలు త్రికూటశిఖరమున విశ్వకర్మచే నిర్మిత మయిన యీ లంకాపుర మున్నది చూడుము. ఓ సీతా! మాంస రక్త ప్రవాహ మయమైయున్న వానర రాక్షస నాశకమైన యీ యుద్ధ భూమిని జూడుము. ఓ విశాలాక్షీ! బ్రహ్మాదుల వరముఁ బడసిన రాక్ష సాధిపుఁ డగు రావణుఁ డిదిగో నీనిమిత్తము నాచే వధింపఁబడియున్నాఁడు; చూడుము. ఇచ్చటఁ గుంభకర్ణుఁడు నాచే వధింపఁబడెను. ఇచ్చట ప్రహ స్తుఁడు నీలునిచేతను, ఇచ్చట ధూమ్రాక్షుఁడు హనుమంతునిచేతను వధింపఁబడిరి. ఇచ్చట విద్యున్మాలి సుషేణునిచే వధింపఁబడెను. ఇచ్చట లక్ష్మణుఁ డింద్రజిత్తును వధించెను. ఇచ్చట వికటుఁ డను రక్కసు నంగ దుఁడు పీచ మడఁచెను. ఇచ్చటనే విరూపాక్ష దుర్ధర్ష మహాపార్శ్వ మహోదరాకంపనులును మఱి యనేకులు రక్కసులును వధింపఁబడిరి. ఇచ్చట మండోదరి వేయి సవతులు చుట్టుకొని కన్నీరు విడుచుచుండఁ గాఁ దనపతినిగూర్చి విలపించినది. ఓ ముద్దులమోముగలదానా! యిదిగో సముద్రపు రేవు గనఁబడుచున్నదిగదా. ఇచ్చట మేము సముద్రముదాఁటి యారేయి గడపితిమి. ఓ వెడఁదకన్నులదానా! నీ నిమిత్తమై నేను నలుఁ డను వానరునిచే నీ సేతువు గట్టించితిని జూడుము. వైదేహీ! కలఁతపెట్టరానిదియుఁ, దుదిలేనిదియు, నలలరొదతోఁ గూడినదియు, శంఖ శుక్తి సమన్వితమునునైన యీ సంద్రమును జూడుము. మైథిలీ!

స్వర్ణమయ మయిన యీ మైనాక మను పర్వతమును జూడుము. హనుమంతుఁడు నిన్ను వెదకుటకై లంకకు వచ్చునప్పు డతనికి శ్రమాపనోదనార్థమై సముద్రమునుండి పైకి వచ్చినది యీ పర్వతము. సముద్రమధ్యమున వానరసేన యీ గుడారమునఁ గొంతతడవు విడిసినది. ఇదిగో, సముద్రపు టీవలిగట్టున సేతుబంధ మని ప్రసిద్ధిగాంచిన యొక్క రేవు గనఁబడుచున్నది గదా! అది ముల్లోకములవారిచేఁ బూజితమయినది. ఇది పరమపావనమును సర్వపాపహారమునైనది. ఇచ్చటఁ ప్రభు వగు మహేశ్వరుఁడు నాకుఁ గార్యసిద్ధి యగునట్లు ప్రసాదించెను. ఇచ్చట రాక్షసాధిపుఁ డగు విభీషణుఁడు నాకడకు వచ్చెను. ఇదిగో వింతయడవులుగల రమ్యమైన కిష్కింధాపురము గన్పట్టుచున్నది గదా! ఇది సుగ్రీవుని పురము. ఇచ్చటనే నేను వాలిని వధించితిని."

ఇట్లు రాముఁడు పలుకఁగా, సీత వాలి పాలించిన కిష్కింధను జూచి, ప్రీతియు వెఱఁగును గొన్నదై, రామునితో సవినయముగా, "నాథా! తార మున్నగు సుగ్రీవుని ప్రియపత్నులను, దక్కుంగల వానరేంద్రులకాంతలను దోడ్కొని యయోధ్యకుం బోవుద" మని యనఁగా, రాఘవుఁడును నట్లె కిష్కింధాపురముచేరువ విమానము నిలిపి సుగ్రీవునిఁ జూచి, "సుగ్రీవా! వానరుల నందఱను దమతమభార్యలతో రా నానతిచ్చి, నీవును వేగిరమే నీభార్యలం దోడ్కొని వేగరమ్ము. తామసింపకుము" అని యానతిచ్చెను.

అమితపరాక్రముఁ డగు రాముఁ డి ట్లానతియ్యఁగా సుగ్రీవుఁడు వానరులందఱితోడఁ బోయి తారను జూచి, "ఓసీ చెలీ! వానరకాంతలతోడ నయోధ్యకుఁ బోవుద మని సీతాదేవి యిష్టపడుటచే రాఘవుఁడు నాకు మిమ్మునందఱఁ దోడ్కొని రానానతిచ్చెను. నీవు జాగుసేయక వానరకాంతలను బిలుచుకొని రమ్ము. మన మందఱ మయోధ్యకుఁ జని దశరథునికాంతల నందఱను జూతము." అని తారతోఁ జెప్పఁగా, తార తక్కిన వానరకాంతలఁ బిలిపించి, మీరందఱు మీ మీ మగలతోడ వచ్చునట్లు సుగ్రీవుఁ డానతిచ్చెను. మీ రందఱు నాతోడ వచ్చి, యయోధ్యాపురము జూచి రాముఁడు బౌరులతోను బల్లెలవారితోను బట్టనముఁ బ్రవేశించుటను, దశరథకాంతలవైభవమును జూచి వత్తము

రండు" అని తక్కిన వానరస్త్రీల నందఱఁ బ్రేరించెను. తర్వాత వానరుల భార్యలు తార యనుమతి గైకొన్న వెంటనే చక్కఁగా నలంకరించికొని, సీతాదేవిం జూడఁ గోరికతో వచ్చి విమానమునకుఁ బ్రదక్షిణము గావించి యావల విమానము నెక్కిరి.

రాముఁడు తార మున్నగు స్త్రీ లెక్కిన తర్వాతఁ బైకెగసి పోవుచుండు విమానము ఋశ్యమూకపర్వతము దాపునకుఁ బోయిన పదంపడి వైదేహిం గాంచి వెండియు నిట్లనియె. "ఓ దేవీ! మెఱపులతోఁ గూడిన క్రొక్కాఱు మబ్బుకైవడి నిదిగో పసిఁడిమయంపుఁ గావిఱాలతో నిండిన ఋశ్యమూక మను పర్వతశ్రేష్ఠము గన్పట్టుచున్నది గదా! ఇచ్చట నేను సుగ్రీవునితో నగ్నిసాక్షికముగాఁ జెలిమి యొనరించుకొని, మఱియు, వాలివధమునకై ప్రతిన యొనరించితిని. ఇదిగో! వింతవింత వనములతోఁ గూడిన పంపాసరోవరము గన్పట్టుచున్నదిగదా! ఇచ్చట నేను నీ వియోగముచేఁ గడు వ్యసనము నొంది పలవించితిని. ఈ సరోవరము గట్టునఁ దాపసి యగు శబరిని గాంచితిని. ఇచ్చట యోజనము పొడవు చేతులుగల కబంధుని జంపితిని. ఇదిగో! జనస్థానమున సొబగు మీఱెడి యొక్కమ్రాఁకు గన్పట్టుచున్నదిగదా! సొగసుదానా! యిచ్చట నీనిమిత్తమై క్రూరుఁ డగు రావణునికిని మహాత్ముఁ డగు జటాయువునకును యుద్ధము జరిగెను. ఓ యుత్తమ వనితా! యిది మన మున్న యాశ్రమము. ఇచ్చటనే వీర్యవంతు లగు ఖర దూషణ త్రిశిరులను గుఱి తప్పక పోవునట్టి బాణములచే వధించితిని. ఇదిగో శుభదర్శనమగు వింతగొల్పు నాకుటిల్లు గన్పట్టుచున్నదిగదా. ఇది నిన్ను రావణుఁ డెత్తుకొనిపోయినచోటు. ఇదిగో నిర్మలమైన యుదకముగల పవిత్రమైన గోదావరినది కన్పట్టుచున్నది. ఓ మైథిలీ! యిదిగో యగస్త్యాశ్రమము గన్పట్టుచున్నది చూడుము. ఇదిగో సుతీక్ష్ణమునీంద్రుని యాశ్రమము దేజరిల్లుచున్నది చూడుము. ఇదిగో శరభంగమహాముని యాశ్రమము. ఇచ్చట నుండునట్టి మనకడకు వేల్పులతేఁ డేతెంచెనుకదా! ఇచ్చట నేను మహాకాయుఁ డగు విరాధుని సంహరించితిని. ఓ సన్నని నెన్నడుముగలదానా! యివి మునుల పల్లెలు. ఇచ్చటనే సూర్యాగ్నిసమప్రభుఁ డగు నత్రిమహాముని యున్నాఁడుగదా. ఇచ్చటనే నీవు తాపసియుఁ

బతివ్రతయు నగు అనసూయాదేవిం గాంచితివి. సుందరాంగీ! ఇదిగో చిత్రకూటము సకలవృక్షమండమండితమై వెలుఁగుచున్నది చూడుము. భరతుఁడు నన్ను బ్రతిమాలుటకై వచ్చినచో టియ్యదియ. ఇదిగో చేరువనే వింతకానలుగల యమునానది కన్పట్టుచున్నది చూడుము. ఇదిగో భరద్వాజాశ్రమము వెలయుచున్నది చూడుము. ఓ యుత్తమాంగనా! యిదిగో నానావిధ పక్షిజాలములతోఁ గూడినదై, పూచిన మ్రాఁకులతో వెలయు ముత్త్రోవ యగు గంగానది కన్పట్టుచున్నది చూడుము. ఇదిగో శృంగిబేరపురము. ఇచ్చటనే గుహుఁ డుండునది. యూపస్తంభముల వరుసలచే నొప్పాఱుచుఁ బూఁచినట్టి పెక్కువృక్షములవరుసలతో నిండినదైన సరయూనది యిదిగో చూడుము. ఇదిగో నాతండ్రి రాజధాని యగు నయోధ్య. మనము సుఖముగా మఱలివచ్చి చేరితిమి గావున నయోధ్యాపురికి వందనము సేయు"మని రాముఁడు సీతాదేవికిఁ జెప్పెను. అప్పుడు వానరు లందఱును విభీషణుఁడును నెగిరి యెగిరి సున్నపుఁ బూఁతలచేఁ దెల్లనైన మేడల వరుసలతో నొప్పారునదియు, విశాలములగు తొట్టికట్లు గలదియు, గజాశ్వములతో నిండినదియునైన యమరావతిని బురుడించు నయ్యయోధ్యాపురిం గాంచిరి.

127-వ సర్గము

రాముఁడు భరద్వాజాశ్రమమున విడియుట

శ్రీరాముఁడు తా నయోధ్యాపురము విడిచి బయలుదేరినదినము మొదలు పదునాలుగవ యేడు నిండిననాటి పంచమినాఁడు భరద్వాజాశ్రమముఁ జేరి భక్తితో నమ్మునీంద్రునికి నమస్కరించి, "యో మునీంద్రా! పట్టణమున జనులు సుభిక్షము నారోగ్యము గలవారైయున్నారా? భరతుఁడు శ్రద్ధతోఁ బ్రజాపాలనము సేయుచున్నాఁడా? మా తల్లులు జీవితలై యున్నారా? ఈ సంగతి యేమైన మీ కర్ణగోచర మయ్యెనా?" యని యడిగెను. అంత భరద్వాజమహాముని రాముని పలుకులు విని, యుప్పొంగి చిఱునగవు మోమునఁ దోఁప నిట్లనెను.

"ఓ రాఘవా! భరతుఁ డొడలు దోమక జటావల్కలములు దాల్చి, నీ పాదుకలను ముందుంచుకొని, నీ రాక కెదురుచూచుచున్నాఁడు.

నీ గృహమున నందఱకు, గుశలంబ. నీవు రాజ్యము వదలి, కేవల ధర్మమునే కోరి, సర్వస్వముం బాసి, తండ్రి యానతిం జేయఁగోరినవాఁడవై స్వర్గభ్రష్టుఁ డయిన వేల్పుకైవడి సకలసౌఖ్యములఁబాసి, కైకేయి మాట యందు నిలిచి, నారబట్టలఁ గట్టుకొని కాలినడకతోఁ బోవుచుఁ గంద మూలములను దినుచు సీతను లక్ష్మణుని మాత్రము దోడ్కొని యటవికిఁ బోయినప్పుడు నాకు నిన్నుఁ జూడ జాలి గలిగెను. ఇప్పుడు నీవు శత్రువుం బరిమార్చి కార్యము సాధించి, మిత్రబంధుగణములతోడ వచ్చునప్పుడు చూడఁగానే నా కెక్కువ యానందము గలుగుచున్నది. రాఘవా! నేను నీ కరణ్యవాసమున సంభవించిన సుఖదుఃఖముల నెఱిఁగితిని. నీవు దండకారణ్యమునందలి తాపసుల ప్రేరణచే జనస్థానమందలి రాక్షసుల వధించుట, మారీచుఁడు నిన్ను వంచించుట, నీ భార్య యగు సీతను రావణుఁ డపహరించుట, నీవు కబంధుని వధించుట, పంపాసరస్సునకుఁ బోవుట, సుగ్రీవునితోడి చెలిమి యొనరించుకొనుట, వాలివధము గావించుట, సీతాన్వేషణము, హనుమంతుని కార్యము, సీత పోవిడి దెలిసిన తర్వాత సేతువుగట్టుట, వానరులు లంకను గాల్చుట, దేవకంటకుఁ డగు రావణుని సపుత్ర మిత్ర పరివారముగా రూపుమాపుట, వేల్పులు నిన్నుఁ జూచుట, వారు వరము లొసఁగుట యను వృత్తాంత మెల్ల నేను జ్ఞాన దృష్టిచే నెఱిఁగితిని. ఓ శస్త్రధారులలో మేటీ! నేనును నీకు వర మొసఁగెదఁ గైకొనుము. నేఁడు నా యాశ్రమమున నా యిచ్చు పూజలఁ గైకొనుము. రే పయోధ్యకుఁ బోయెదవుగాక" యని మునీంద్రుఁడనెను.

రాముఁ డమ్మునీంద్రుని మాటలను శిరసావహించి, యట్లె యా రేయి యచ్చటనుండి "ఓ మునీంద్రా! నాకు వర మొసఁగెద నంటివిగదా, అయోధ్యాపురమార్గమునందలి వృక్షము లెల్ల సకాలమునను ఫలించి, తేనియలు గార్చుచు నుండుఁగాక. నానావిధము లగు పెక్కు ఫలము లమృతముతో సమానములుగా నుండునుగాక. ఈ వరము నాకుఁ బ్రసాదింపుము" అని యడిగెను. అట్లే యని మునీంద్రునిమాట నోటి నుండి వచ్చిరాక మునుపే మార్గమందలి వృక్షము లెల్లఁ గల్పవృక్ష సదృశము లాయెను. వారు వెళ్లునప్పుడు చుట్టు మూఁడు యోజనముల దూరము ఫలము లేని వృక్షములు ఫలములు గలవయ్యె. పుష్పములు

లేనివి పుష్పభరితము లాయెను. ఆకులు రాలినచెట్టులెల్లఁ జిగిరించి, తేనియలు గార్చుచుండెను. ఆ వానరోత్తము లందఱు సంతసముతోఁ గూడి, గుంపులు గుంపులుగా నా చెట్లపై పెక్కు దివ్యఫలములను స్వర్గమున నుండువారుం బోలె విస్తారముగాఁ దినుచు సంతోషపడు చుండిరి.

128-వ సర్గము

రాముఁడు హనుమంతుని భరతునికడ కంపుట

రాఘవుఁడు భరద్వాజాశ్రమమున విడిసినపుడే యయోధ్యా పురింగూర్చి తలంచుకొని, హనుమంతునిఁ బిలిచి, "వానరోత్తమా, నీ వయోధ్యకు ముందుగా వెళ్లి రాచనగరున నందఱు సేమముతో నున్నారా కనుఁగొనుము. నీ విచ్చటినుండి వెడలి శృంగిబేరపురము సేరి, యడవులలోఁ దిరుగువాఁ డగు బోయలతేఁ డయిన గుహునితో నామాటలుగా నా క్షేమము తెల్పుము. నేను రోగములు బీడయు లేక శత్రువును సంహరించి సేమముతో వచ్చితి నన్నమాట విని నాప్రాణ సఖుఁడగు గుహుఁ డెక్కువ సంతుష్టుఁడు గాఁగలఁడు. ఆ గుహుఁడే ప్రీతుఁడై నీ కయోధ్యాపురమునకు దారి చూపుటయే కాక భరతుని వృత్తాంతమును సైతము దెల్పును. ఈ గుహునివలన దారి గనుఁగొని పోయి యయోధ్యఁజేరి భరతునితో నేను లక్ష్మణునితోను సీతతోను గూడి క్షేమముతో వచ్చి చేరితినని చెప్పవలసినది. మఱియు, రావణుఁడు సీత నెత్తికొని పోవుట, నేను సుగ్రీవునితోఁ జెలిమి చేసికొనుట, వాలిని వధించుట, సీతను వెదకించుట, నీవు సీతను గనుఁగొనుట, సముద్రమును దాఁటుట, సేతువును గట్టించుట, రావణుని వధించుట, మహేంద్ర బ్రహ్మ వరుణ మహేశులు వరము లొసఁగుట, మహేశుని దయచే నేను దండ్రిని గాంచుట, రాక్షసరాజుతోను సుగ్రీవునితోను వచ్చుట యను నీ వృత్తాంతము నెఱిఁగింపుము.

ఈ మాట విన్నతోడనే, యా భరతునిమోమున నేమి రూపు గన్పట్టునో, నన్నుఁగూర్చి యేమి యభిప్రాయము వెలువడునో, దాని నీవు నా కెఱిఁగింపవలసినది. రాముఁడు శత్రువుల నందఱఁ బరిమార్చి యత్యంతమైన కీర్తిని బడసి, బలవంతు లగు చెలికాండ్రతోఁగూడి వచ్చు

చున్నాఁడని తెలుపుము. నీ వచ్చటి వృత్తాంతముల నన్నింటిని, భరతుని యభిప్రాయములను, చేష్టల, నాతని కలరూపును మోమువన్నెను, చూపును మాటలను బట్టి తెలిసికొని రావలసినది. "నీయెడ నంతటి చెలిమిగల భరతుని తలంపు గనిపెట్టుట యేల? ఇంతకు మున్నతని నడతలచేతనే తెలియలేదా" యని, నీ వనెదవేమో? ధనధాన్యసమృద్ధి గలిగి సకలసంపదలతో నిండి వంశపారంపర్యముగా వచ్చిన రాజ్య మెట్టి వానికైనను చిరకాలానుభవముననే లోభము గలిగింపకపోదు. ఆ భరతునికిఁ గాంక్ష యున్న నేమి చేయుదు నందువేమో! భరతుఁడు తానే తన నడతచే రాజ్యాభిలాష గలవాఁడని తెలియవచ్చెనేని, రఘునందనుఁడయిన యాతఁడే సకలజనముతో నిండిన యీ విస్తార భూమండలము నెల్ల నేలునుగాక! నీ వచ్చటికిఁ జని, భరతుఁడు రాజ్యమును గోరునదియు, లేక రాజ్యమును నా కొసఁగ నుండునదియుఁ దెలిసికొని, యతఁ డియ్యకొనునట్లుండునేని, మే మిచ్చటినుండి దవ్వు రాకమునుపే నీవు వేగిరముగ మాకు సంగతిఁ దెలుపవలసినది."

ఇట్లు రాముఁ డానతీయఁగా, హనుమంతుఁడు పాము నొడిసిపట్టు కొనఁబోవు గరుడునికైవడిఁ బైకెగిరి, వేగిరముగా నయోధ్యాపురము నకుఁ దఱలి యాకాశమునఁ బోవుచుఁ, బాముల కిరవైన గంగా యమునానదుల మధ్యభాగమును, సంగమస్థలమగు ప్రయాగను దాఁటి, శృంగిబేరపురము సేరి, గుహునిఁ జూచి "సత్యపరాక్రముఁ డగు నీ చెలి కాఁ డగు రాముఁడు సీతాలక్ష్మణ సమేతముగా నిన్నుఁ గుశల మడిగెను. రామాదులు భరద్వాజముని యానతివలన వారి యాశ్రమమున విశ్ర మించియున్నారు. ఈ పంచమిరేయి యచ్చట నుండి తెల్లవాఱ భర ద్వాజమునీంద్రుని యానతిఁ బడసినవా రయి రాఁగలరు. నీవు వారిని జూతు వని చెప్పి, మేన గగుర్పాటు వొడమ వడిగలవాఁడై మార్గా యాసమును లక్ష్యపెట్టక, మఱల నింగి కెగిరి పరతెంచుచుఁ బ్రసిద్ధ మగు పరశురామతీర్థమును, వాలుకినీనదిని, ప్రసిద్ధ మగు గోమతీనదిని, భయం కర మగు సాలవనమును, సకలవస్తుపరిపూర్ణము లగు దేశములను, ఆ దేశ వాసు లగు జనులను, ఆబాలవృద్ధముగా విహరించు స్త్రీలు గలవై, దేవేంద్రుని నందనవనమునను, కుబేరుని చైత్రరథమునను నుండు వృక్ష

ములను బోలిన నందిగ్రామమునకుఁ జేరువ నున్న పూఁచిన వృక్షములును జూచుచుఁ బోయెమ. అట్లు పోయిన హనుమంతుఁ డయోధ్యాపురమునకు రెండు కోసులదూరమున నుండు నందిగ్రామమున నారబట్టల జడలఁదాల్చి, స్నానము లేమిచే నొడలి నిండుగ ముఱికి గలవాఁడై, భ్రాతృవియోగ వ్యసనముచే సంతసమును మాని, యుపవాసములచేఁ జిక్కినవాఁడై, కందమూలఫలములే యాహారముగాఁ గొనుచు, బహిరింద్రియముల గెల్చి, తపస్సు సేయుచు స్వధర్మము నడపుచు మనమున రామునే ధ్యానించుచు, రాముని పాదుకల ము న్నిడుకొని రాజ్యము నేలుచు నాలుగువర్ణముల కషాయము పొరయ నీయక, కావిబట్టలను జడలను దాల్చినట్టి సదాచారవంతు లగు మంత్రిపురోహితులు గొల్చియుండ, జాగ్రత్తగల సేనాపతులు చుట్టు నిల్చియుండఁగా నొప్పారుచున్న భరతునిఁ గాంచెను. భరతుఁడు భ్రాతృవియోగ వ్యసనముచే జటావల్కలాజినముల ధరించియుండుట సరియే. వారి పరిజనులు నేల వానిని ధరించి రనినఁ బౌరులు ధర్మాత్ముఁ డగు తమయేలిక నారబట్టలను దాల్చియుండఁగాఁ దాము సర్వసుఖముల ననుభవింపకుందురుగదా. అట్లు మంత్రిపురోహితాదిపరిజనపరివృతుఁడై, రూపుగొనిన రెండవ ధర్మమో యనఁదగినవాఁడును ధర్మజ్ఞుఁడును నైన భరతునిఁ జూచి, చేతులు జోడించి, "యో రాజపుత్రా! నీవు దండకారణ్యమునఁ జిత్రకూటాశ్రమమునఁ జూచినప్పటినుండి జటావల్కలధారియైయున్న యే రామునిఁ గూర్చి వ్యసనపడుచున్నావో యా రాముఁడు నీతోఁ దన సేమముఁ జెప్ప నన్నుఁ బనిచెను. ఓ రాజా! నీకుఁ బ్రియము సెప్పెద నాలింపుము. నీవు కొలఁది కాలములోపల నన్న యగు రామునితోఁ గలిసి, శోకము మానఁగలవు. రాముఁడు రావణుని సంహరించి, సీతాదేవిం బడసి, సకలార్థముల నొందినవాఁడై మహాబలు లగు మిత్రులతోడ వచ్చుచున్నాఁడు. మహాతేజముగల లక్ష్మణుఁడును, దేవేంద్రునితోఁగూడిన శచీదేవికై వడి సకలార్థములు వడసిన కీర్తిమతి యగు సీతయు వచ్చుచున్నారు."

అని హనుమంతుఁడు చెప్పఁగా, తోడఁబుట్టువునందుఁ బ్రేమగల భరతుఁడు వాయునందనునివలన రాముని రాకను విని యానందపర

వశుఁడై క్రిందఁబడి మూర్ఛిల్లి కొంతసేపటికిఁ దెప్పిఱిల్లి యిష్టవాక్యములఁ జెప్పిన హనుమంతునిఁ గట్టిగాఁ గౌఁగిలించుకొని, యానందబాష్పములచే నతనిని దడిపి, "ఓ సాధువా! నీవు దేవతవో, మానిసివో, నాయెడ దయచే నిచ్చటి కేతెంచితివి. నీవు ప్రియవృత్తాంతము సెప్పినందులకై లక్షగోవులను, నూఱు మేటిగ్రామములను, చక్కని నడవడి గల్గి నిగనిగ మెఱయు కమ్మలు వెట్టుకొన్నవారును, బంగరు చాయ గలవారును, రంభాస్తంభములంబోలు నూరువులును, దిల పుష్పమువంటి ముక్కును పున్నమచంద్రునిఁ బోలిన మోమునుగలిగి, నానావిధ భూషణములఁ దాల్చిన సత్కులప్రసూత లగు పెండ్లికాని పదునాఱ్వురు పడుచులను నీకు నొసఁగెదను." అని చెప్పి, హనుమంతుండు చెప్పిన యాసంతోషావహ మగు రాముని రాకను విని యాతనిఁ జూడఁగోరి వెండియు నక్కపివీరునితో ని ట్లనెను.

129-వ సర్గము

హనుమంతుఁడు రాముని యరణ్యవాసవృత్తాంతము నెఱిఁగించుట

పెక్కేండ్లకుముందు గొప్ప యరణ్యములకుఁ బోయిన నా నాథుని రాకం దెల్పు ప్రియవృత్తాంతము నేటికిఁ గదా వింటిని. లోకమున నరుఁడు బ్రతికియున్నచో నూఱేండ్లకైనను సుఖములఁ బడయవచ్చు నని పెద్ద లందురు. ఈ లోకోక్తి వాస్తవ మనియే నాకుఁ దోఁచుచున్నది. వానరుల తేఁడగు సుగ్రీవునితో నెచ్చట నెందులకై చెలిమి గలిగెను. నేను వాస్తవము నెఱుఁగఁగోరెదఁ జెప్పు మని యొక దర్భాసనమున భరతుఁడు హనుమంతునిఁ గూర్చుండఁబెట్టి యడుగఁగా, హనుమంతుఁడు రాముని యరణ్యవాసమున నడచిన వృత్తాంత మంతయు నెఱిఁగించెను.

ఓ భరతా! దశరథుఁడు కైకేయికి వరము లొసఁగుట, రాముని నడవికిఁ బంపుట, దశరథుఁడు పుత్రవిరహ వ్యసనముచే మృతి నొందుట, రాజగృహమునుండి దూతలు నిన్నుఁ దోడితెచ్చుట, అయోధ్యకు వచ్చిన నీవు పట్టాభిషేకము నొల్లకుండుట, చిత్రకూటమునకు నీవువచ్చి రాముని రమ్మని ప్రార్థించియుఁ బితృవాక్యపరిపాలన రూపధర్మరతుఁ డగు నతఁడు రా నొప్పమిచేఁ బాదుకలు గైకొని వచ్చుటయు నింతవఱకు నీ వెఱిఁగిన

NARLA MEMORIAL LIBRARY N. R. P. R. I. Acc. No.

వృత్తాంతమే కదా. నీవు మఱలి వచ్చినతర్వాత జరిగిన వృత్తముఁ దెలి పెద నాలకింపుము.

నీవు పయనమై వచ్చిన తర్వాత నా యరణ్యమునందలి మృగపక్షి సంఘములు దిగు లొందినందున నా యరణ్యము గడు దీనమైయుండెను. కావున రాముఁ డడవి యేనుఁగుల సంచారముతోఁ గూడినదియు, సింహ వ్యాఘ్రమృగములతో నిండినదియు, నిర్మానుషమునైన కడు గొప్పదండ కారణ్యముఁ బ్రవేశించెను. రాముఁడు సీతా లక్ష్మణులతోడ నరణ్యమునఁ బోవుచుండఁగా, వారియెదుట విరాధుఁ డను నొక రాక్షసుఁ డార్భాటము గావించుచు వచ్చెను. అఱచుచు వచ్చిన యా విరాధునిఁ జేతులు పైకిని దలక్రిందికిని బోవునట్లుగా గర్జిల్లుచున్న యేనుఁగునుంబోలెఁ బల్లమునఁ బూడ్చిపెట్టిరి. ఆ రామలక్ష్మణు లిద్దఱు దుష్కరమైన యా విరాధ వధ మొనరించి, సాయంకాలమున రమ్య మగు శరభంగాశ్రమము చేరిరి. శరభంగ మునీంద్రుఁడు దేహముపదలిన తర్వాత రాముఁడు మునుల నందఱను మ్రొక్కి జనస్థానమునకుఁ జేరెను. అచ్చట శూర్పణఖ యను రాక్షసి రామునిచెంతకు వచ్చెను. అంత రాముని ప్రేరణవలన లక్ష్మణుఁ డా శూర్పణఖయొక్క ముక్కుచెవులం దఱిగెను. మఱియు నచ్చటనే భయంకరు లగు పదునాలుగువేవురు రక్కసులను రాముఁ డొక్కఁడే మూఁడు గడియలలోపల యుద్ధరంగమున వధించెను. దండ కారణ్యవాసు లగు మునీంద్రులతపస్సులకు విఘ్నము లొనరించు బల పరాక్రమవంతు లగు పెక్కండ్రు రాక్షసులను ఖరుఁ డనువానిని రాముఁడు యుద్ధమున సంహరించెను.

అంతట శూర్పణఖ తన యవమానమునకును, జనస్థాన వధమున కును వగచుచుఁ దనయన్న యగు రావణునియొద్ద మొఱవెట్టఁగా నతని ప్రేరణచే మారీచుఁ డను రక్కసుఁడు స్వర్ణమయమృగమై వై దేహిచేరువ నిలిచెను. అప్పుడు సీత మాయాస్వర్ణమృగమును గోరఁగా రాముఁడు వింటిని గొని పరుగెత్తుచుండు నా మృగము వెంటఁ దగిలిపోయి, యది చిక్కమిచే మాయామృగ మని తలఁచి వంగిన గణుపులుగల బాణము నేసి, దానిని బరిమార్చెను. అమ్మాయామృగమైన మారీచుఁడు "హా లక్ష్మణా! హా సీతా!" యనుచుఁ బ్రాణము వదలెను. అప్పుడు రాముని

కేమోయపాయము సంభవించె నన్న భీతి చెందిన సీతపురికోలుచే లక్ష్మణుఁడు రాముని వెదకం బోయెను. అంతలో రావణుఁడు కపటసన్యాసి రూపముతో వచ్చి యా సీత యుండు నాశ్రమమున కేతెంచి, యంగారకుఁడు రోహిణిం బట్టుకొనుతీఱున, సీతాదేవిని సిగం బట్టెను. అప్పుడు జటాయు వను గ్రద్దలఱేఁడు రావణుని చేతినుండి సీతను విడిపింపరాఁగా, నా రావణుఁ డా జటాయువును బరిమార్చి యా సీతాదేవి నెత్తికొని పోవుచుండెను. అప్పుడు ఋశ్యమూకపర్వత శిఖరమున నున్న కొందఱు వానరులు సీతను గొనిపోవుచున్న యా రావణుని నాశ్చర్యముతోఁ గాంచిరి. లోకకంటకుఁ డగు రావణుఁడు సీతాదేవి నెత్తికొని లంకాపురమునకుఁ బోయెను. తర్వాత రావణుఁ డా సీతాదేవిని సువర్ణభూషణాలంకృతమైన తన నగరున నుండి యామెను మంచిమాటలచే బతిమాలెను. కాని, ఆ రాక్షసపుంగవుని పలుకులను, ఆ రాక్షసాధిపునిఁ దృణప్రాయముగాఁ దలఁచినదై సీత యశోకవనమున నుండెను. ఇట రాముఁడు మృగముఁ జంపి, వనమునకు వచ్చి సీతను గానక యచ్చట వెదకఁగా ఱెక్కలు దెగిపడియున్న జటాయువును జూచి, యతనివలన సీతాదేవిని రావణుఁ డెత్తికొనిపోయె నన్న మాటను విని, తన తండ్రి చెలికాఁ డగు నతని కగ్నిసంస్కారము గావించి, సీతాదేవిని వెదకుచు వచ్చి గోదావరీనదీతీరమందలి వనప్రదేశములందు విహరించుచుండెను. ఆ మహారణ్యమధ్యమునఁ గబంధుఁ డను రాక్షసునిఁ గాంచి, యాతని మాటలవలన ఋశ్యమూకపర్వతముఁ జేరి, సుగ్రీవునితోఁ గలిసెను. వారిద్ద ఱొండొరులఁ జూచుటకు మునుపే యొండొరులు మనమునఁ జెలిమి గోరియుండిరి. సుగ్రీవుఁడు కారణాంతరమునఁ గినుకపూనిన వాలిచే దఱుమఁబడి ఋశ్యమూకపర్వత శిఖరమున డాగియుండెను. అట్టి సుగ్రీవుఁడును రాముఁడు నొండొరులస్థితులంగూర్చి మాటలాడుకొంట వలన దృఢప్రేమ గలిగెను. రాముఁడు తన బాహుపరాక్రమముచే సుగ్రీవునికి రాజ్యము నిప్పించెను. రాముఁడు గొప్పదేహమును నెక్కువ పరాక్రమమునుం గల వాలిని సంగరమునఁ బరిమార్చి, సుగ్రీవుని సమస్తవానరుల సమక్షమునఁ గిష్కింధాపురాధీశునిఁగాఁ జేసెను. సుగ్రీవుఁడును దానికి బదులుగా సీతను వెదకి తెచ్చి యిచ్చునట్లు ప్రతిజ్ఞ

చేసెను. సుగ్రీవుఁడు బలశాలు రగు పదికోట్ల వానరులను నలుదెసలకు సీతాన్వేషణమునకై పంపెను. మే మట్లు కడు దవ్వేగి వింధ్యపర్వత మునఁ బ్రవేశించి దారి తెలియక విచారపడుచు బహుకాలము గడపితిమి. అప్పుడు వీర్యవంతుఁ డగు సంపాతి యను జటాయువునన్న సీతాదేవి రావణాలయమున నున్న ట్లెఱిఁగించెను. అప్పుడు నేను మావారి శోకముఁ బరిహరించుచు, బలముపూని నూఱుయోజనములదవ్వుగల సముద్రమును దాఁటి లంకాపురము సేరి యచ్చట నశోకవనమున దుకూలము దాల్చినదియై, స్నానము లేమిచే ముఱికితో నిండినదై, సంతసము దక్కి తనపతినే దైవముగా భావించి యొంటిమై నున్న సీతాదేవిని గాంచి, యామెను సకలవిధముల క్షేమ మడిగి, రాముఁ డిచ్చిన యంగుళీయకమును గుఱుతుగా నిచ్చితిని. మఱల నామె దగ్గఱనుండి యొక్క రత్నము నానవాలుగాఁ గైకొని, కార్యము నెఱవేర్చుకొన్న వాఁడనై యట కేతెంచి, యా మణిని దెచ్చి, యెవరికిని హానిచేయని వాఁ డగు రామునిచేత నిచ్చితిని. కొనయూఁపిరితోనున్న రోగి యమృతముఁ ద్రాగి, జీవితముపై నాశను వహించినచందమున, రాముఁడు నా వలన సీతాదేవి వృత్తాంతమును విని సంతసముతో జీవితముపైఁ గోరిక వహించెను. అంతట రాముఁడు ప్రలయకాలమందు సర్వలోకములను దహింపఁబూనిన యగ్నిహోత్రునికైవడి నా రావణుని వధమునకై మనసుంచినవాఁ డయి, నలునిచేత సముద్రమున సేతువుఁ గట్టించెను. దాని మూలమునఁ గపిసేన సముద్రమును దాఁటెను. నీలుఁడు ప్రహస్తుని, రాముఁడు గుంభకర్ణుని, లక్ష్మణుఁ డింద్రజిత్తును, రాముఁడు తానే రావణుని సంహరించెను. తర్వాత రామునిఁ జూచుటకై యింద్ర యమ వరుణ మహేశ్వర బ్రహ్మదేవులును, దశరథనరపాలుఁడును, మఱి యనేక దేవర్షిమహర్షులు నేతెంచిరి. కాకుత్స్థుఁడు వారివలనఁ బెక్కు వరములను బడసి, వానరులతోడఁ బుష్పకవిమానము నెక్కి కిష్కింధాపురమునకు వచ్చి యచ్చటనుండి తరలి గంగానదిని దాఁటి, భరద్వాజాశ్రమమున విడిసియున్నాఁడు. రేపు పుష్యమీనక్షత్రమునందు నీవు నిరాటంకముగా రామునిఁ జూతు వని హనుమంతుఁడు భరతునితోఁ జెప్పెను.

తర్వాత భరతుఁడు నిక్కమును నెక్కువ విషయముఁ దెల్పు నదియు నైన మాటను విని, చేతులు మోడ్చుకొని, "యింతకాలమునకుఁ గదా నా మనోరథము నెఱవేఱె" నని మనస్సంతోషము గలిగించు మాటఁ జెప్పెను.

130-వ సర్గము

రాముఁ డయోధ్యం బ్రవేశించుట

స్థిరపరాక్రముఁ డయిన శత్రువీరుల సంహరించునట్టి భరతుఁడు మహానందకరమైన మాట విని, శత్రుఘ్నుం బిలిచి, "స్నానములచేతఁ బరిశుద్ధు లయిన పనివారిని బిలిచి కోవెలలను పట్టణములందలి మంటపములను నెత్తావిగల పుష్పహారములచే నలంకరించి మంగళవాద్యములచేఁ బూజించునట్లుత్తరు వొంపగుము. మఱియు స్తోత్రములను వంశావళులను నెఱిఁగిన సూతులు, వైతాళికులును, వాద్యములందు నేర్పరు లగువారును, వారకాంతలును గుంపులుగూడి పున్నమచంద్రునిం బోలు రామునిమోమును జూడఁబోవునట్లుత్తరు వొసంగుము." అని చెప్పఁగా, శత్రువీరుల మడియించునట్టి శత్రుఘ్నుఁడు భరతుని యానతి శిరసావహించి, పెక్కండ్రు కూలివాండ్రను బిలిచి, "ఓ భృత్యులారా! మీరు సందిగ్రామమునుండి యిక్కడివఱకు మార్గమున నుండు పల్లములకు మట్టిద్రోసియు, మిట్టలను బెల్లగించియు నేల చదరపఱపవలఁయును. తర్వాత మార్గమంతయు నీరు చల్లించి యూడ్చి, యావలఁ బేలాలను, పుష్పములను జల్లవలయును. సూర్యోదయ మగులోపలఁ బట్టణపురాజవీథులందలి మేడలను డెక్కెములుగట్టి చక్కగా నలంకరింపవలయును. మఱియుఁ బట్టణపువా రందఱు చేరి, రాజమార్గములందుఁ బువ్వుల తోరణములుగట్టియు, నెత్తావిగల విడిపువ్వులును, సుగంధద్రవ్యములను జల్లియు, నయిదురంగుల ముగ్గులుపెట్టి బాగుగా నలంకరింపఁజేయుఁడు." అని పనివారి కానతియ్యఁగా, వా రామాట యా శత్రుఘ్నుని నోటినుండి వచ్చి రాకమునుపే యాజ్ఞాప్రకారము పత్తనమును సర్వాలంకారభూషితము గావించిరి.

రామునిరాక విన్నమాత్రముననే రాజభార్యలును, మంత్రులును, సైనికులు, సైనికుల పత్నులును, బ్రాహ్మణులును, క్షత్రియు

లును, బురములో ముఖ్యు లగువారును, దృష్టి జయంత విజయ సిద్ధార్థ అర్థసాధన అశోక మంత్రపాల సుమంత్రులను మంత్రులును బంగారు తొడవులతోఁ గైసేసిన మదించిన యేనుఁగులమీఁద నెక్కియు, మఱి గొందఱు రాజబంధువులు నడుములకు బంగారుమోకులతోఁ గట్టిన యేనుఁగులమీఁదను నాఁడేనుఁగులమీఁదను, మఱికొందఱు గుఱ్ఱముల మీఁదను, గుఱ్ఱములుపూన్చిన యరదములమీఁదను నెక్కి యా రాము నెదుర్కొనిరి. శక్తి అష్టిప్రాసాయుధములను ధరించినవారలై టెక్కెములను బట్టుకొని గుఱ్ఱములమీఁద నెక్కిన గుఱ్ఱపు రౌతులును, కాలి బంటులును ముందు నడువగాఁ బెక్కండ్రు వీరులు నడచి పోయిరి. దశరథకాంత లందఱు పల్లకులలోఁ గూర్చుండి, కౌసల్య సుమిత్రల పల్లకులను ముందుగాను తమ పల్లకులను వెనుకను బోనిచ్చి నందిగ్రామమునకుఁ జేరిరి. వారివెంబడిఁ గైకేయియు వచ్చెను. వేయిమాటలేల, అయోధ్యాపురమెల్ల నందిగ్రామముననే యుండెను. అప్పుడు గుఱ్ఱముల గిట్టల యొరపిడిచేతను, రథచక్రపుటంచుల ధ్వనులచేతను, భేరీ శంఖ దుందుభి వాద్యములమ్రోఁతలచేతను బుడమి యదరినట్లుండెను. తర్వాత ధర్మాత్ముఁడును, సకలధర్మములు నెఱిఁగినవాఁడును, నుపవాసములచేఁ జిక్కినవాఁడును, ధైర్యము వీడినవాఁడును, నారబట్టలుగట్టి జింకతోలు కప్పికొన్నవాఁడును నైన భరతుఁ డన్న రాక విని యెక్కువ యుప్పొంగినవాఁడై, బ్రాహ్మణోత్తములును, ఊరిలోని పెద్దలును, వర్తకులును గూడ వచ్చుచుండఁగా, మంత్రులు పువ్వులమాలలు, కుడుములు గైకొని వెంబడించుచుండఁగా, పరిజనులు శంఖభేరీనినాదంబులు మ్రోగించుచుండఁగా, స్తుతిపాఠకులు స్తోత్రములు సేయుచుండఁగా, నన్నగారి పాదుకలను నెత్తికొని, మల్లెపూవులు మొదలగు నెత్తావిం గుబాళించు పువ్వులతో నలంకరించిన తెల్లని గొడుగుం బట్టికొని, బంగారుకాడలు రెండు తెల్లని వింజామరలను గైకొని మంత్రులతోడ రాముని నెదుర్కొనెను.

అప్పుడు భరతుఁడు కొంతతడ వాలోచించి, యా హనుమను గాంచి, "నీవు కపికులమునకు సాధారణమయిన చిత్తచాపల్యము నొంది, రాముఁడు వచ్చుచున్నాఁ డని చెప్పలేదు గదా! వాస్తవమైనచోఁ

గాకుత్స్థుఁ డింకను నాకుఁ గనఁబడఁడే. కామరూపు లగు వానరులుగాని నాకంటఁబడరే. వారేరి?" యని హనుమంతుని నడుగఁగా, హనుమంతుఁడు తిరమగు మగఁటిమిగల యా భరతునకు నాలస్యమునకుఁ గారణముఁ దెలుపుచు, "ఓ భరతా! భరద్వాజుని యనుగ్రహమువలన వానరులందఱు నిరంతర ఫలములుగలిగి, పుష్పవంతములై తేనియలు గార్చుచు మత్తభ్రమరఝుంకారములతో నిండియున్న యాశ్రమమున నున్న మధ్యము లానినవార లయి మదించియున్నవారు. ఓ శత్రుసంహారకా! మార్గమునందు వనములందలి వృక్షము లకాలమం దయినను బుష్పఫలభరితములై యుండునట్లు వేల్పులఱేఁడు రామునికి వరము నొసంగెను. కాఁబట్టి రామునికి నితని సేనకును సకలగుణములతోఁ గూడిన విం దొనరింపఁబడియె. వేడుకతోఁ గూఁత లిడుచుండు వానరుల యార్భాటములు వినఁబడుచున్నవి. వానరసైన్య మిప్పుడు గోమతీ నదిని దాఁటుచున్న దని తలఁచెదను. వాలుకినీనది దాపున దుమ్ము పైకి లేచియున్నది. చూడుము. ఇప్పుడు వారు వాలుకినీ నదిని దాఁటుచుందురు. ఇప్పుడు వానరులు సాలవనమునకు వచ్చి యుందు రని తలఁచెదను. ఇదిగో, చంద్రునిమాడ్కిఁ దెల్లనైన బ్రహ్మ నిర్మించిన పుష్పక విమానము కన్పట్టుచున్నది. మహాత్ముఁ డగు రాముఁడు రావణుని బంధువులతోఁగూడ వధించి, యీ విమానమును బడసెను. బాలసూర్యునిం బోలె వెలుఁగుచు రాముఁ డెక్కినట్టి మనోవేగముగల యీ దివ్య విమానమును గుబేరుఁడు బ్రహ్మదేవుని యనుగ్రహబలమునఁ బడసెను. ఓ భరతా! యీ విమానమున సీతాదేవియు, రామలక్ష్మణులు గూర్చుండి యున్నారు చూడుము. వారివెంబడి నెక్కువ ప్రకాశము గల సుగ్రీవుఁడును రాక్షసరా జగు విభీషణుఁడును గూర్చుండి యున్నారు చూడుము" అని హనుమంతుఁడు భరతునకు సీతారామలక్ష్మణాదులను జూపెను.

అంత నయోధ్యాపురవాసు లగు జను లా బాలవృద్ధముగా "నిదిగో రాముఁడు వచ్చినాఁ" డని మిన్ను ముట్టునట్లుగా రొద గావించిరి. తర్వాత వారందఱు రథగజాశ్వములనుండి డిగ్గి, పుడమిని నిలిచిన వారలై యాకసమున వెలుఁగుచంద్రునిమాడ్కి విమానమున విరాజిల్లు

చున్న రామచంద్రునిఁ గాంచిరి. బ్రహ్మచే మనసుతో సృజింపఁబడిన యా విమానమునఁ గూర్చున్న విశాలదీర్ఘవక్షుఁ డగు రాముఁడు రెండవ దేవేంద్రునిమాడ్కిఁ బ్రకాశించెను. అంతట భరతుఁడు కడు నుప్పొంగి, రాముని కెదుట నిలిచి, "ప్రతిజ్ఞ దప్పక మా కందఱకు మేలు గలుగు నట్లు వచ్చి చేరితివి గదా" యని రాముని గొనియాడి మేరుపర్వత శిఖరమునందు వెలుఁగు సూర్యునిమాడ్కి విమానాగ్రమున విరాజిల్లు చున్న రామునిఁ బరిశుద్ధ హృదయముతో నమస్కరించెను. అంతట రాముని యానతిచేఁ గడువేగముతో వచ్చుచున్న హంసప్రతిమలతోఁ గూడిన యవ్విమాన మాకసమునుండి క్రిందికి దిగెను. వెంటనే రాముఁడు సత్యపరాక్రముం డగు భరతునిఁగూడ విమానము నెక్క నాజ్ఞాపించెను. వెంబడి భరతుఁడు విమాన మెక్కి వేడ్కమీఱ మఱల రామునికి వందన మొనరించెను. తర్వాత రాముఁడు బహుకాలమునకుఁ దన కన్నులకుఁ బండువుగాఁ గనఁబడిన భరతుని లేవనెత్తి తొడపైఁ గూర్చుండఁబెట్టుకొని ముదం బార నాతనిఁ గౌఁగిలించెను. తర్వాత భరతుఁడు లక్ష్మణునిఁ బలు కరించి, యావల సీతాదేవికడ కేఁగి, యామెకుఁ బ్రవరచెప్పి యభివాద నముగావించెను. మఱియు భరతుఁడు సుగ్రీవ, జాంబవ, దంగద, మైంద, ద్వివిద, నీల, ఋషభ లను వానర ఋక్షవీరులను, సుషేణ, నల, గవాక్ష, గంధమాదన, శరభ, పనసులను గవుఁగిలించెను. వానరులు కామరూపు లగుటవలన మానుషరూపముఁ దాల్చియుండిరి. కావున వారును భరతుని సంతోషముతో క్షేమవార్త నడిగిరి.

తర్వాత భరతుఁడు సుగ్రీవుని మరలఁ గౌఁగిలించికొని, "ఓ వానరాధిపా! లోకమున నుపకారమువలన మిత్రులును, నపకారము వలన శత్రువులును గలుగుట స్వాభావికము. కావున నీవు మా కుపకార మొనరించితివి కాఁబట్టి, నీవు మా నలుగు రన్నదమ్ములతోడ నైదవ వాఁడవు" అని సుగ్రీవునిఁ బొగడి, విభీషణునిఁ జూచి, "విభీషణా! నీవును మాభాగ్యవశమునంజేసి, చేయ నలవికాని గొప్ప సాహ్య మొనరించి తివి" అని విభీషణుని మంచిమాటలచే సత్కరించెను. శత్రుఘ్నుఁడును భరతుని వెంబడిన మొదట రామ లక్ష్మణులకును తర్వాత సీతాదేవికిని బ్రణమిల్లెను.

పిదప రాముఁడు తన వియోగశోకముచేఁ గృశించియున్న తల్లికి హర్ష మెసఁగునట్లుగా నామె పాదములఁ బట్టుకొని యెఱఁగెను. తర్వాత సుమిత్రా కైకేయులకును, దక్కిన తల్లులకును నమస్కరించి, యావలఁ బురోహితుఁ డగు వసిష్ఠ మునీంద్రునికిని బ్రణమిల్లెను. తర్వాత నగర వాసులగు జను లందఱు "కౌసల్యాదేవికి హర్షప్రదుఁడవగు ఓ మహాత్మా! నీకు స్వాగతమే కదా" యని సవినయముగాఁ గుశలప్రశ్నగావించిరి. ఆ భరతాగ్రజుఁ డగు రాముఁడు బురజనులు మోడ్చియున్న యంజలి బంధములను ముకుళించిన తామరమొగ్గలం బోలినవానిని వేనవేలను గాంచెను. అటుపిమ్మట భరతుఁడు తానే రాముని పాదుకలను మోచి కొని వచ్చి, రాముని పాదములకుఁ దొడిగెను. అప్పుడు భరతుఁడు రామునిఁ గాంచి సవినయముగా ని ట్లనియె: "ఓ రాజేంద్రా! నాకడ నిల్లడగా నుంచిన యీ రాజ్యమును గాపాడి నీ యధీనము గావించితిని. ఓ రాఘవా! కృతార్థుఁడవై యయోధ్యకు మఱలివచ్చిన నిన్ను నేఁ జూడఁ గలిగితిని గనుక ఇప్పుడు నా జన్మము సఫల మయ్యెను. నా కోరిక యీడేరెను. నీ పరాక్రమము నా దరువున నేను బొక్కసమును, ధాన్యపుఁ గొట్టులను, పురమును, సైన్యమును బదింతలు వృద్ధిచేసితిని. ఇఁక నీవు నీరాజ్యము చూచుకొమ్ము." అని భరతుఁడు రామునితోఁ జెప్పెను. అట్లు భ్రాతృవాత్సల్యముతోఁ బలుకుచున్న భరతుని పలుకులు విని, వానరులును, రాక్షసేంద్రుఁ డగు విభీషణుఁడును భరతుని భ్రాతృ వాత్సల్యమునకై కడు నుప్పొంగి యానందబాష్పములు విడిచిరి. తర్వాత రాముఁడు వేడ్కతో భరతునిఁ దొడమీఁదఁ గూర్చుండఁ బెట్టుకొని, సేనలతోడఁ బుష్పకవిమానము నెక్కి భరతాశ్రమమున కేఁగి, యచ్చట సేనలతోడ డిగ్గి, పుడమిని నిలిచి, "యో విమానమా! నీవు కుబేరునికడ కేఁగి, యతనిని మోచుచుండుము" అని యాన తియ్యఁగా నవ్విమానము త్తరదిక్కు వైపు దిరిగి, కుబేరుని యాలయము నకుఁ బోయి చేరెను.

తర్వాత దేవేంద్రుండు బృహస్పతిపాదములకుఁ బోలె రాముఁడు దన గురు వగు వసిష్ఠుని పాదముల కెఱఁగి, యతఁడును దానును వేఱు వేఱ గు నాసనములందుఁ గూర్చుండిరి.

131-వ సర్గము

శ్రీ రామ పట్టాభిషేకము

ఇట్లు పుష్పకమును కుబేరునికడ కంపి, వసిష్ఠునిఁ బలుకరించికొని, భరతుని యానతిలేక పురమునఁ బ్రవేశింపఁ గూడ దను తలంపుతో రాముఁడు నందిగ్రామముననే నిలువఁగా, పురజనులు దాపున నుండఁగా, తల్లులు చేరువ నిలిచియుండఁగా, నప్పటి సూక్ష్మాభిప్రాయము నెఱిఁగిన భరతుఁడు తన యభిప్రాయమును సత్యపరాక్రముఁ డగు తన యన్నయైన రామున కెఱిఁగింపఁ గోరినవాఁడై, యి ట్లనియె: "ఓ రాఘవా! రాజ్యము విడిచి వనవాసము చేయుటచే నా తల్లిని గారవించితివి. నీవు నాకుఁ జిత్రకూట పర్వతమున రాజ్యము నిల్లడగా నుంచితివి. నీ వెట్లు నా కీ రాజ్యము నిచ్చితివో యట్లె యీరాజ్యము నీ కొసఁగెదను గైకొనుము. ఒక వృషభము తా నొక్కటే మోయఁజాలిన బరువు నొక్క చిన్నలేఁగపై నుంచిన, నా లేఁగ మోయఁజాలనట్లు, అసహాయశూరుఁడ వయిన నీవు వహింపఁజాలిన యీ రాజ్యమును నేను వహింపఁజాలను. గొప్ప ప్రవాహవేగముచేఁ దెగిన చెరువు కట్ట గండినుండి నీరుపాఱుచుండ నా నీటిప్రవాహంపువడి నాపఁగల గడ్డిమోపులు, కొమ్మలు మొదలగునవి లేక కట్టగట్ట వీలుకానియట్లు, పెక్కు గండ్లుపడిన రాజ్యమును మంత్రరక్షణము మున్నగు రాజగుణముల కప్పు లేక పాలింప వీలుగాదు. ఖరము గుఱ్ఱముయొక్క వేగమును, కాకి రాయంచయొక్క నడతను నేర్వఁజాలనట్లు, ఓ శత్రుసంహారీ! నీరక్షణచాతుర్యమును నేను బూనఁజాలను. ఇంటిలోపల, బెంచఁబడిన యొక్క గొప్ప చెట్టు గొప్పబోదెయుఁ గొమ్మలుం గల్గి యొరులచే నెక్క వీలుగానియట్లు పెరిగినదై పుష్పములు పూచి, కాయలు గాయక నశించినచో, నే యుద్దేశముతో నెవ్వఁడు చెట్టు పెట్టినవాఁడో, వాఁడు, చెట్టుయొక్క ఫలమునుబొందక వగచును. అట్లె దశరథుఁడు నిన్నుఁ గని పెంచి పెద్దచేసినప్పుడు, రాజ్యపాలనము చేయవలసిన సకలగుణసంపన్నుఁడ వగు నీవు రాజ్యభారము వహించి, లోకరక్షణమును బూనవేని, నీమూలమున లోకమునకుఁ బ్రయోజనము లేదు. ఓ రాఘవా! నీవు పట్టాభిషిక్తుఁడవై మధ్యా

హ్నమునందలి సూర్యునిమాడ్కి వెలుఁగుచుండఁగా నీ పురజను లందఱు చూతురు. రాఘవా! ఇఁకమీఁదఁ బరిజనులు గావించు వాద్యముల ధ్వనులను, నటులు నర్తనము చేయునప్పుడు గలుగు నందెల మ్రోఁతలను, నింపగు గాన ధ్వనులను విని నీవు మేల్కాంతువుగాక! సూర్యచంద్రాది జ్యోతిశ్చక్ర మెంతవఱకుఁ దిరుగుచుండునో, పుడమి యెంతదనుక నుండునో, యంతపర్యంతము నీ వీ యంతటికిని రాజువు గమ్ము" అని భరతుఁడు రామునితోఁ జెప్పఁగా, శత్రుపురముల గెల్చిన రాముఁడును నట్లు యని యియ్యకొని యుత్తమాసనమునఁ గూర్చుండెను. అంతట శత్రుఘ్ను నానతివడసి మీసములఁ గత్తరించువారు సుఖముగాఁ బని చేయ నేర్పుగలవారు కడువడిగా నా రామ లక్ష్మణ భరతులకు శ్మశ్రు చ్ఛేదమును గావించిరి. మొదట భరతుఁడును లక్ష్మణుఁడును, వారికిఁ బిదప వానరేంద్ర రాక్షసేంద్రు లగు సుగ్రీవ విభీషణులును స్నానము చేసిన తర్వాత, రాముఁడు జటలు దీసి వైచి మంగళస్నానమొనర్చి, విచిత్రము లయిన పుష్పమాల్యములను ధరించి, నెత్తావిగల గంధ మలఁది కొని, మేలిమిబట్టలనుగట్టి రాజలక్ష్మితో వెలుఁగుచుండెను. అంతట శూరుఁ డగు శత్రుఘ్నుఁడు రామునకును లక్ష్మణునకును సకలవిధాలంకారములను ధరింపించెను. సంతుష్టు లగు రాజకాంత లందఱు సీతాదేవికిఁ దామే మనోహరముగ నలంకారము చేసిరి. పుత్రవాత్సల్యము గల కౌసల్య యా వానర కాంతలకుఁ దానే యలంకారములు చేసెను.

తర్వాత శత్రుఘ్నుఁ డానతియ్యఁగా, సుమంత్రుఁ డను సారథి యన్నివైపులఁ జక్కఁగా సింగారింపఁబడిన రథమును దేరఁగా, పరాక్రమము వీడనివాఁ డగు రాముఁడు సూర్యమండలముమాడ్కి విరాజిల్లుచున్న యా రథము నెక్కెను. మహేంద్రునిఁబోలు ప్రతాపముగల సుగ్రీవ విభీషణులు మేలిబట్టలను దాల్చి యాతని వెంబడిఁ గూర్చుండిరి. తర్వాత సకలభూషణముల నలంకరించుకొనిన సీతాదేవియు సుగ్రీవుని కాంతలతోడ నయోధ్యానగరము జూచు వేడుకతో రథము నెక్కెను. అయోధ్యయందు శోక విజయ సుమంత్ర లనెడి మంత్రులు ముగ్గురుఁ గలిసి పురోహితుని వసిష్ఠుని మున్నిడుకొని మన యభివృద్ధి నిమిత్తమును బట్టణజనుల యభివృద్ధి నిమిత్తమును

నాలోచించి, జయశీలుఁ డగు రాముని పట్టాభిషేకము నిమిత్తమై చేయ వలసిన మంగళకృత్యము లెల్లఁ జేయ వసిష్ఠ మునీంద్రుని కానతిచ్చి, రామునిఁ జూడఁగోరికతోను, నతనిఁ దోడ్తెరను నెదుర్కొనిరి. వేయి కన్నుల తేఁ డగు వేల్పుఱేనిచందమునఁ దేజరిల్లు రాముఁ డరదమునెక్కి పురములోనికిఁ బయన మయ్యెను. భరతుఁడు తేరిగుఱ్ఱపుఁ బగ్గములను బట్టెను; శత్రుఘ్నుఁడు గొడుగు పట్టెను. లక్ష్మణుఁడు విసనకఱ్ఱను గైకొని యా రాముని శిరమునకు సరిగా వీచెను. మఱియును దెల్లని వింజామర మునుగొని యెదుట నిలువఁబడెను. రాక్షసశ్రేష్ఠుఁ డగు విభీషణుఁడును జంద్రునిమాడ్కిఁ దెల్లనై వెలుఁగు మఱియొక్క వింజామరముఁ గైకొనియెను. అప్పుడు దేవర్షులందఱు గుంపులుగూడి యాకాసమునను నిలిచి, జనులందఱు వినునట్లుగా రాముని నింపు గులుకునట్లుగాఁ గొనియాడు చుండిరి. వానరేంద్రుం డగు సుగ్రీవుఁడు పర్వతముం బోలు శత్రుం జయ మను నేనుఁగు నెక్కి తఱలెను. తక్కిన వానరులందఱును మానవ రూపము దాల్చి, యన్ని తెఱుఁగులైన తొడవులను దాల్చినవా రయి, తొమ్మిదివేల యేనుఁగులనెక్కి ప్రయాణమైరి. అంతటఁ బురుషశ్రేష్ఠుఁ డగు రాముఁడు పరిజనులు శంఖభేరీ దుందుభివాద్యములు వాయించుచు ముందుగఁ బోవుచుండఁగా, గొప్ప మేడల వరుసలతో విరాజిల్లుచున్న యయోధ్యాపురము బ్రవేశించెను. కాంతియుక్త మగు మేనుగల రథమునఁ గూర్చుండి వచ్చునట్టి రామునిఁ గాంచి, జను లతనిని జయ దీవనలచే దీవించి, యతఁడు బదులుగా హెచ్చరికలు చేయుచుండఁగా నవి గైకొని, భ్రాతలతోడ వచ్చుచుండు రామునిఁ దామును వెంబడించిరి. మంత్రి విప్ర పౌరజనులు వెన్నంటి చనుచుండఁగా, నారాముఁడు నక్షత్రగణపరివృతుఁడైన చంద్రునిమాడ్కిఁ బ్రకాశించెను. అట్లు సేవకులు మంగళములు పాడుచు తాళములు వేయుచు, వాద్యములవాయించుచుఁ బోవుచుండఁగా, రాముఁడు పురము సొచ్చెను. పసుపక్షుతల పళ్లెరములఁ దాల్చినవారును, గోవులఁ దోడ్కొని పోవు గొల్లలును, కన్యలును, బ్రాహ్మణులును, భక్ష్యవిశేషములఁ దాల్చిన మానవులును రామునికి ముందుగా నడచిరి. అట్లు పోవుచుండు సమయమున, రాముఁడు సుగ్రీవునితోడి చెలిమిని, హనుమంతుని

యద్భుతకార్యమును, వానరు లొనర్చిన యా గొప్ప కార్యమును, అపారమైన యా వానరుల సేనలను, విభీషణునితోడ మైత్రి గలిగిన విధమును మంత్రులకుఁ జెప్పెను. అప్పుడు రాముఁడు సెప్పిన మాటలను విని యయోధ్యాపురవాసు లందఱును సంతసించిరి. కాంతి మంతుఁ డగు రాముఁ డిట్లు పలికి, వానరవీరులంగూడి సంతసముచే నొడలు పెరిఁగిన జనులచే నిండిన యయోధ్యాపురిం బ్రవేశించె. పురజను లంద ఱింటింటను రాముఁడు వచ్చునప్పుడు టెక్కెములను లేవనెత్తిరి. తర్వాత రాముఁడు కాకుత్స్థవంశమువా రుండునట్టి తండ్రినగరు చేరెను.

తర్వాత రాముఁడు ధర్మవేత్తలలో మేటియైన భరతునిఁ గాంచి, "భరతా! నాయనా! సుగ్రీవునిఁ దోడ్కొని నీవు తండ్రిగారి యింటికి వెళ్లి, కౌసల్యా సుమిత్రా కైకేయీలకు వందనము సేసి రవలు వైడూర్యములు ముత్యాలుచెక్కిన మేటి నగరును, దానికిఁ జేరువనున్న యశోకవనమును సుగ్రీవునికిఁ విడిదిగాఁ జూపుము" అని యానతిచ్చెను. భరతుఁడును సుగ్రీవునిచేయి పట్టుకొని యా రాముని గృహమును బ్రవేశించెను. శత్రుఘ్ను నానతి గైకొని, పరిచారకులు తైలదీపములను, మంచములను, పఱుపులను, ఆసనము లను గైకొని యా రాముని గృహమును బ్రవేశించిరి. తర్వాత భరతుఁడు సుగ్రీవునిఁ గాంచి, "సుగ్రీవా! రాముని యభిషేకము నిమిత్తము తీర్థము దేక దూతల కానతిమ్ము" అని చెప్పఁగా సుగ్రీవుఁడు నలువురు వానరవీరులం బిలిచి నవరత్నములు చెక్కిన నాలుగు బంగారు ఘటముల నొసఁగి, సూర్యోదయ మగునప్పటికి నాలుగు సముద్రము లందలి యుదకమును వీని నిండుగఁగొని రావలసినదని పనిచెను. జాంబ వంతుఁడు, హనుమంతుఁడు, వేగదర్శి, ఋషభుఁడు నను నలువురు వానర వీరులును వేఁకువలేచి, గరుడునిఁబోలు వేగముఁబూనినవా రయి, యేనూఱు పుణ్యనదులనుండి జలములను దెచ్చిరి. బలవంతుఁ డగు సుషే ణుఁడు తూర్పుసముద్రమునుండి జలపూరిత మయిన సర్వరత్నవిభూషిత మగుకలశమును దెచ్చెను. ఋషభుఁడు దక్షిణసముద్రమునుండి జలమును ముంచిన కలశమును రక్తచందనపుఁ గొమ్మలతోఁ గప్పుకొని దెచ్చెను. వాయువిక్రముఁ డగు గవయుఁడు పశ్చిమసముద్రమునుండి రత్నకుంభ

ముతోఁ జల్లని యుదకముఁ దెచ్చెను. గరుడవాయువిక్రమముగల వాఁడును, సకల సుగుణములు గలవాఁడును, ధర్మపరుఁడునైన నలుఁడు త్తరసముద్రమునుండి జలముఁ దెచ్చెను. తర్వాత శత్రుఘ్నుఁడు మంత్రులును రాముని యభిషేకము నిమిత్తము తెచ్చిన యా జలమును తమ పురోహితుఁ డగు వసిష్ఠునికిని, దమసుహృదుల కందఱకును జూపిరి.

శ్రీరామ పట్టాభిషేకఘట్టము

తర్వాతఁ బరిశుద్ధుఁ డగు వసిష్ఠుఁడు సకల బ్రాహ్మణుల సమక్షమున రాముని సీతాదేవితోడ రత్నమయపీఠమునఁ గూర్చుండఁబెట్టెను. తర్వాత వసుదేవతలు వేఁగన్నులవేలు పగు దేవేంద్రు నభిషేకించిన తెఱఁగున వసిష్ఠ వామదేవ శల్య జాబాలి కాశ్యప కాత్యాయన సుయజ్ఞ గౌతమ విజయు లను మునీంద్రులు నరపతిశ్రేష్ఠుఁడగు రాముని నెత్తావిగల నిర్మలతీర్థముతో నభిషేకించిరి. అట్లు వసిష్ఠాదులు ఋత్విక్కులు, విప్రులు, మంత్రులు, కన్యలు, యోధులు, పురజనులు చూచుచుండఁగా వేల్పులందఱు దిక్పాలురు నలువురును నాకసమున నిలిచి చూచుచుండఁగా దివ్యౌషధులరసముతోఁగూడిన తీర్థోదకములచే నా రాముని నభిషేకించిరి. మన్వాదిరాజు లందఱిని గూర్చుండఁబెట్టి యభిషేకము కావించిన యా వసిష్ఠుఁడు నానావిధరత్నఖచితమైన బ్రహ్మనిర్మితం బగు సభయందు సర్వరత్నవిభూషితమైన సింహాసనమున రామునిఁ గూర్చుండఁజేసి, యథావిధిగా నతనికిఁ దీర్థోదకములతో నభిషేకించి నవరత్నకిరీటమును శిరమున నునిచి సకలాభరణములతో నలంకరించెను. శత్రుఘ్నుఁడు శ్వేతచ్ఛత్రము పట్టెను. సుగ్రీవుఁడు తెల్లని వింజామరముతో నతనిని వీచెను. విభీషణుఁడును చంద్రునివలె ధవళవర్ణమైన మఱియొక్క చామరమును గైకొని వీచెను. ఇంద్రుని పురికోలువలన వాయువు నూఱు కమలములు చెక్కిన దగదగ వెలుఁగు బంగారు తామరళమును, సకల రత్నవిభూషితమైన ముత్యాలహారమును నొసఁగెను. శ్రీరాఘవుని యభిషేకము జరుగఁగా, దేవగంధర్వులు గానములు చేసిరి. అచ్చరలు నాట్యమాడిరి. భూమి చక్కఁగాఁ బంటలుపండెను. వృక్షములు ఫలించెను. పువ్వులు నెత్తావులు గుబాళించుచుండెను. అంతట రాజశ్రేష్ఠుఁడు లక్షగోవులను, లక్షవృషభములను, లక్షగుఱ్ఱ

ములను బ్రాహ్మణులకు దాన మొసఁగెను. మఱియు ద్విజోత్తములకు మూఁడుకోట్ల బంగారమును, నానావిధాభరణములను, విలువగల బట్టలను నొసఁగెను. తర్వాత సూర్యునిమాడ్కి వెలిఁగెడి రత్నములు చెక్కిన దివ్యస్వర్ణమాలికను సుగ్రీవునికి నొసఁగెను. అంగదునికి పచ్చలు రవలుమజెక్కిన భుజకీర్తుల నొసఁగెను. మేటిరత్నములు చెక్కిన చంద్ర ప్రభం బగు ముక్తాహారమును సీత కిచ్చెను. దివ్యములైన దోవతులను, మేటియాభరణములను సీత వాయుపుత్రుఁ డగు హనుమంతున కొసఁ గెను. తర్వాత సీతాదేవి తన కంఠమునుండి చంద్రహారమును దీసి చేతఁ బట్టికొని, వానరుల నందఱను జూచి, తర్వాత భర్త యభిప్రాయముఁ దెలియఁగోరి, భర్తను మాటిమాటికిఁ జూచెను. రాముఁడును సీతాదేవి యభిప్రాయము గనుఁగొన్నవాఁడై "ఓ భాగ్యశాలినీ! నీ వెవనియెడ మిక్కిలి సంతుష్టురాల వైతివో, ఎవనియం దొక్కనియందె పరాక్ర మము, ఉత్సాహము, బుద్ధి యనునివి యన్నియు నున్నవో, వాని కీ కంఠ హారము నిమ్ము అని యానతియ్యఁగా, నా సీతాదేవి యా హనుమం తుని కా కంఠహారము నొసఁగెను. చంద్రకిరణములంబోలు నా చంద్ర హారమును బాల్చిన యా హనుమ తెల్లని మేఘముగ్రమ్మిన పర్వతము చందమున విరాజిల్లెను. తర్వాత రాముఁడు మైంద ద్వివిద నీలులను తక్కిన వానరవీరుల నందఱను వారివారి యోగ్యతానుసారముగా వస్త్రాభరణాదులచే సమ్మానించెను. అంతట విభీషణుఁడును, సుగ్రీవహను మజ్జాంబవదాదివానరముఖ్యు లందఱును రామునిచే దగినట్లు రత్న భూషణాంబరాదులచే సమ్మానితులయి, యెక్కువ తనివినొంది తమ తమ తావులకుఁ జనిరి. వానరవీరులందఱు మహాత్ముఁ డగు శ్రీరాముని మ్రొక్కి, యాతని వీడ్కొని కిష్కింధాపురమునకుఁ జనిరి. సుగ్రీవుఁ డును శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవముగాంచి రామునిచే మర్యాద వడసి, కిష్కింధాపురమునకుఁ బోయెను. విభీషణుఁడును దనకుల ధన మగు లంకారాజ్యమును మున్నే పడసినవాఁడైనందున, దాని నిప్పుడు మఱల స్మృతినొందింపఁబడినవాఁడై శ్రీరాముని వీడ్కొని లంకా పురమున కేఁగెను. రాముఁడును శత్రువులను సంహరించి కీర్తి వడసిన

VARDHAMAN MAHAVIR JAIN VIDYALAYA LIBRARY Acc. No.

వాఁడై యెక్కువ యౌదార్యముగలిగి, వేడ్కతోఁ బుడమిని బాలించెను. అట్లు పాలింపఁబూనిన ధర్మవత్సలుఁ డగు శ్రీరాముఁడు ధర్మము నెఱిఁగిన లక్ష్మణుం గాంచి, "ధర్మజ్ఞా! పూర్వపురాజులు బలిమితో నేలిన యీ పుడమిని నాకుఁ దోడయియుండి పాలింపుము. నీవు యువరాజ పదవిని గైకొనుము" అని లక్ష్మణు నెన్నివిధముల నిర్బంధించినను, నాతఁడు తనకంటెఁ బెద్దయగు భరతుఁ డుండఁగా దాను యువరాజపట్టము నొంద నియ్యకొనమిచే భరతుని యువరాజునుగాఁ జేసి, యావలఁ బౌండరీకాశ్వమేధవాజపేయ యాగములను బలుమాఱు లొనరించెను. ఆజానుబాహువును, గొప్పమూపులవాఁడును, ప్రతాపశాలియునైన రాముఁడు రాజ్యము వడసి, బంధుమిత్రాదులు పరివేష్టించియుండఁ బెక్కుయాగము లొనరించి, యివ్విధముగాఁ బదివేలయేండ్లు రాజ్యము బాలించెను.

శ్రీరాముఁడు రాజ్యము చేయునప్పుడు స్త్రీలు వైధవ్యదుఃఖము లేకుండిరి. సర్పభయమొండె, క్రూరమృగముల బాధయొండె, వ్యాధి బాధయొండె లేకుండెను; చోరభయము దొలఁగెను. చేటన్నమాట యొక్కరును నెఱుఁగరైరి. పిన్నలు నీల్గఁగా పెద్దలు త్తరక్రియలు సేయరైరి. పట్టణమెల్ల సంతోషమయమై యుండెను. జను లందఱు న్యాయతత్పరులై యుండిరి. జనులందఱు శ్రీరామునే యనుసరించి, యొండొరులు కయ్యమును మాని, పుత్రపౌత్రసమృద్ధిగలిగి శోకమును భయమును లేక పెక్కేండ్లు జీవించియుండిరి. శ్రీరాముఁడు రాజ్యమును బాలించుచుండఁగా బ్రజలు రామరామ యని సదా కీర్తించుచుండిరి. లోకమెల్ల రామమయమై యుండెను. తరువులు గొప్పబోదెలు శాఖలు గలిగి పుష్పఫలభరితములై యుండెను. మేఘములు సకాలమునకు వర్షించుచుండెను. గాలి చల్లగా వీచుచుండెను. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు తమతమ కులధర్మములను నడపుచుఁ దమ పనులందే ప్రవర్తించుచుండిరి. రాముఁడు రాజ్యమును బాలించునప్పుడు జనులందఱు ధర్మమునందే యెక్కువ పూనికి గలిగి శుభలక్షణాన్వితులై యసత్యమును బాసి, సత్యమునే ముఖ్యముగాఁ గొనియుండిరి. శ్రీమంతుఁడగు రాముఁడు పదివేల నూఱేండ్లు రాజ్యమును బాలించెను.

శ్రీమద్రామాయణపఠనశ్రవణ ఫలము

సంపదను గీర్తిని దీర్ఘాయువును గలిగించునదియు, రాజులకు గెల్పు నొసఁగునదియు, వేదమే యాధారముగాఁ గలదియు నై, యందఱు కవులకంటెఁ దొరవాఁడయిన శ్రీవాల్మీకి మహామునిచే రచియింపఁబడిన యీ యాదికావ్యమగు శ్రీరామచరిత్రమును లోకమున నే మానవుఁడు చదువుచున్నాఁడో, లేక వినుచున్నాఁడో, వాఁడు సకలపాపములనుండి విడుదల నొందుచున్నాఁడు. పుత్రులఁ గోరువాఁడు పుత్రులను, ధనముఁ గోరువాఁడును ధనమును బొందుచున్నాఁడు. క్షత్రియుఁడు శత్రువులను గెల్చి, రాజ్యము నొందుచున్నాఁడు. కౌసల్యా సుమిత్రా కైకేయులు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులను గన్నయట్లు స్త్రీలు రామాదులవంటి పుత్రులఁ గలిగి, భాగ్యవతులై యుందురు. ఈ రామాయణమును బూర్తిగాను ముఖ్యముగా రాముని పట్టాభిషేకమును మాత్రమైనను విన్నవాఁడు దీర్ఘాయువు నొందుచున్నాఁడు. ఈ వాల్మీకి రచించిన రామాయణమును శ్రద్ధాభక్తులు గలిగి చదువువాఁ డెట్టి కష్టమునుండి యైనను దప్పించుకొనుచున్నాఁడు. రాఘవుఁడు మొదటఁ గష్టపడి కడపట సుఖములను బొందినట్లు మానవుఁడు దేశాంతరవాసము మున్నగు నిడుమలను మొదటఁ బొందినను కడపట బంధువులతోఁ గలిసి, యా రాముని యనుగ్రహమువలనఁ గోరిన కోర్కెలనెల్లఁ బొందుచున్నాఁడు. శ్రద్ధతో నీ రామాయణము విన్నవారికి దేవతలు ప్రీతులయి సకలాభీష్టముల నొసఁగుదురు. విఘ్నకారులగు గ్రహభూతము లన్నియు శాంతి నొందుచున్నవి. రాజు రాజ్యమును బొందును. దేశాంతరమునకుఁ బోయినవాఁడు క్షేమముతో మఱలఁ దన యిల్లుచేరును. ఋతుస్నాత లగు స్త్రీలు మేటిపుత్రులం బడయుదురు. ఈపురాతనేతిహాసమును బూజించి చదివిన మానవుఁడు సకలపాపములనుండి విడుదల నొందును. క్షత్రియాదులగు వారీ యాదికావ్యమును బ్రాహ్మణోత్తమునివలన వినవలయును. ఈ రామాయణము చదివినను, విన్నను, ఆదిదేవుఁడు, నారాయణుఁడు, మహాబాహువు, సర్వేశ్వరుఁడు, విష్ణుమూర్తియును నైన రాముఁడు ప్రీతుఁడై యైశ్వర్యమును, పుత్రపౌత్రసంపదను నొసఁగుచున్నాఁడు. రాముఁడే విష్ణుఁడు, లక్ష్మణుఁడే యాదిశేషుఁడు నని చెప్పఁబడుదురు.

మహావిపులార్థముగల యీ మహాకావ్యమును విన్నవారు కుటుంబవృద్ధిని, ధనధాన్యసమృద్ధిని, చక్కనిస్త్రీలను, ఉత్తమసుఖమును, లోకమున సకల కార్యసిద్ధిని బొందుచున్నారు; ఆయురారోగ్యకీర్తి ప్రదమును, సోదర వృద్ధికరమును, బుద్ధిని సుఖమును ఓజస్సును గలిగించునట్టిదియునైన యీ యాదికావ్యమగు శ్రీమద్రామాయణమును గలిమిగోరువారు నియమముతోఁ బఠింపవలయును. ఈ యితిహాసము మీకు మంగళకర మగుఁగాక! మీరు విశ్వాసముతో దీనిం జదువుదురుగాక! విష్ణువుయొక్క శక్తి యంతట వ్యాపించునుగాక! శ్రీరామాయణపఠనశ్రవణముల వలన దేవత లందఱును పితరులును తనివి నొందుచున్నారు! వాల్మీకి మహర్షిచే విరచితమైన యీ రామచరిత్రమును వ్రాయించినవారికిని వ్రాసినవారికిని సదా స్వర్గలోకవాసము సంభవించుచున్నది.

ఓం తత్ సత్

శ్రీ రా మా ర్ప ణ మ స్తు

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1962.

వచనగ్రంథములు

	ప్రతి 1-కి రూ.	న.పై.
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు,ఒకటే సంపుటము	10	50
,, 1-వ సంపుటము ...	3	50
,, 2-వ సంపుటము ...	3	50
,, 3-వ సంపుటము ...	5	50
ఆంధ్రవచనభారతము, ఆదిసభాపర్వములు ...	6	00
,, ఆరణ్యపర్వము ...	6	00
,, విరాటోద్యోగపర్వములు ...	6	50
,, భీష్మద్రోణపర్వములు ...	8	00
,, కర్ణశల్యసౌప్తికస్త్రీపర్వములు ...	6	00
,, శాంతిపర్వము ...	5	00
,, ఆనుశాసనిక మొదలు స్వర్గారోహణపర్వమువరకు	8	00
ఆంధ్రవచనవాల్మీకిరామాయణము		
బాలకాండము ...	2	50
అయోధ్యాకాండము ...	5	00
ఆరణ్యకాండము ...	2	50
కిష్కింధాకాండము ...	2	50
సుందరకాండము ...	3	00
యుద్ధకాండము ...	9	00
ఉత్తరకాండము ...	3	50
అనంతసాగరము, బుక్కరాయసముద్రచరిత్రము ...	0	75
అయిదుగురుదొంగలకథలు ...	0	50
ఆంధ్రవాఙ్మయచరిత్రసంగ్రహము ...	4	00
ఆంధ్రకవిజీవితములు, శ్రీగురుజాడ శ్రీరామమూర్తిగారిది	6	00
ఋషులచరిత్ర ...	1	00
కథాసరిత్సాగరము, వచనము ...	12	50
చార్ దర్వేషుకథలు ...	1	00
చిత్రరత్నాకరము, గుర్జాడ శ్రీరామమూర్తి ...	1	50

		ప్రతి 1-తి రూ.	న.పై.
జగత్కథ, H. G. Well's History of the world, కొ. శతకోపాచార్యులు	...	6	00
జీవితరహస్యములు, చిత్రమైనకథలు	...	1	50
తాతాచార్యులకథలు	...	0	75
తిలకుగారిసెక్యూరిటీకేసు, ఉపన్యాసములు	...	1	00
తులసీదాసురామాయణము, వచనము	...	15	00
త్రిలింగకథలు	...	1	00
తెనాలిరామలింగనికథలు, జీవితము	...	0	50
,, A. S. P. అయ్యరుగారిది	...	0	50
దక్కనుపూర్వకథలు	...	3	00
దశకుమారచరిత్రము, సంజీవరాయశాస్త్రి	...	3	00
ద్వాదశోపనిషత్తులు, తెనుగువచనము	...	5	00
నలుగురుమంత్రులకథలు	...	0	50
నామహారాష్ట్రయాత్ర	...	4	00
నీతిరత్నాకరము	...	1	50
నీతిచంద్రిక, శ్రీచిన్నయసూరిగారిది	...	1	00
,, టీకతో	...	1	50
పరమానందశిష్యులకథలు	...	0	25
పంజాబుఅల్లరి	...	0	50
పంచతంత్రము, వచనము సులభశైలి	...	0	75
పురాణగాథలు I	...	1	25
,, II	...	1	25
బాజీరాయని చరిత్ర	...	1	50
భారతరమణీమణులు, ప్రథమభాగము	...	1	25
,, మూఁడవభాగము	...	0	50
భోజునికథలు	...	1	00

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

పోస్టుబాక్సు 1372. 292, ఎస్ప్లనేడ్, చెన్నపురి-1.

459

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B123
పుస్తకం పేరు	శ్రీమదాంధ్ర వచనరామాయణము యుద్ధకాండము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	469
పిడ్డ సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	C.I & BCT
లేని పేజీలు	No
తయారు చేసినది	P.Jayamma
పేజీలు విడదీసినది	P Jayamma
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	anusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	